వాఙ్మయ వ్యాసమంజరి

వేంకటరమణాయ్య,

యమ్. ఏ. పిహెచ్. డి.



సారస్వత పరిషత్తు

రోడ్డు—హైద్రాబాదు—1

C 1

వాఙ్మయ వ్యాపమంజరి

For Favour of Review

సంపాదకులు
ఆంధ్రజ్యోతి
హైదరాబాదు
తా. 25-7-1968.

Andhra Saraswatha Parishath
Tilak Road, Hyderabad-1.

డా. నేలటూరి వేంకటరమణయ్య,

యమ్. ఏ. పిహెచ్. డి.

V.R NARLA MEMORIAL LIBRARY
D.P.R.I.
Acc. No. 10830

B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10830

ఆంధ్రసారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు—హైద్రాబాద—1

1.

ప్రతులు
2000

894.8
VEM

ప్రథమ ముద్రణ
1967

GOVERNMENT OF ANDHRA PRADESH

వెల : 8-00 రూపాయలు

గోలుకొండ ప్రింటింగ్ ప్రెస్ 1 మొదలు 204 పేజీలు
టి యన్ ఆర్ ప్రెస్ 205 మొదలు 364 పేజీలు

AOUA1022B101

నివేదనము

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఉద్దేశించిన "పండిత సారస్వతము" క్రింద ఈ "వాఙ్మయ వ్యాసమంజరి" ప్రచురింపబడినది. పరిషత్తుసాధారణముగా పండితులచే వివిధ విషయములపై ఉపన్యాసము లిప్పించి వానిని గ్రంథ రూపమున ప్రకటించు చున్నది. సాహిత్య చారిత్రక విషయములపై పరిశోధన పండితులు వ్రాసిన వివిధ వ్యాసములను గ్రంథరూపమున ప్రకటించుటలో నిది రెండవది.

సుప్రసిద్ధ పరిశోధకులు, ప్రామాణికులు అయిన డా. నేలటూరి వేంకట రమణయ్యగారు ఆయా సందర్భములలో ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచిక భారతి మొదలైన పత్రికలలో ప్రచురించిన వాఙ్మయ విమర్శనాత్మక వ్యాసములలో కొన్నిటిని ప్రచురించుచున్నాము. ఇందు రెండు భాగములున్నవి. మొదటి భాగమున కొందరు ఆంధ్ర కవుల స్థల కాల చర్చలును, రెండవ భాగమున కొన్ని ఆంధ్ర కావ్యవిషయిక విమర్శలును కలవు. ఇంతవరకు విడివడని కవి-కావ్య విషయిక గ్రంథు లెన్నియో ఇందు హృదయంగమముగా చర్చించబడి విడదీయ బడియున్నవి. ఆంధ్ర భారతికి అర్పించబడిన ఈ మంజరి ఆంధ్రావళి మోదము నందగలదని ఆశించు చున్నాము.

ఈ వాఙ్మయ వ్యాస మంజరిని సిద్ధముచేసి ప్రకటించుటకు అనుమతించిన డా. నేలటూరి వేంకట రమణయ్యగారికి కృతజ్ఞతలను తెలిపికొనుచున్నాను.

బుధ విధేయుడు.

పవంగ
ఆషాఢము

గడియారం రామకృష్ణ శర్మ

కార్యదర్శి.

విషయానుక్రమణిక

ప్రథమ భాగము

(1)	శ్రీపతి పండితుఁడు	పుట	3
(2)	గణప నారాధ్యుఁడు		19
(3)	గౌరన		24
(4)	కవి సార్వ భౌముఁడు– కనకాభిషేకము		33
(5)	చంద్రభూషణ క్రియాశక్తి		49
(6)	జక్కన		68
(7)	హరిభట్టు		60
(8)	అచ్యుత దేవరాయల విజయములు– భాషాసేవ		85
(9)	తెనాలి రామకృష్ణ కవి		94
(10)	తెనాలి రామకృష్ణుఁడు		103
(11)	పైచరాజు వేంకట నాథుఁడు		157
(12)	కంకటి పాపరాజు		169
(13)	కదిరీపతి– శుకసప్తతి		201

ద్వితీయ భాగము

(1)	కుమార సంభవములోని కొన్ని అపపాఠములు	215
(2)	భాస్కర రామాయణ సమస్య	222
(3)	పద్యకథా వాఙ్మయము	238
(4)	విష్ణుమాయా విలాస నాటకము	272
(5)	రామకృష్ణుని పాండురంగ కృతి	290
(6)	యక్షగానము– తంజావూరు	298
(7)	17 వ శతాబ్ది నాటి ఆంధ్ర వాఙ్మయ విశేషాలు	340
(8)	జానుఁదెనుఁగు	358

క్రీ.శ. 18 వ శతాబ్దము వాఁడైన పోచిరాజు తన మనువంశపురాణమున శ్రీపండితుఁడు బెజవాడ తెలిక కులమువారికే కాక అప్పుడాక్రాంత దేశమును పాలించుచుండిన చాళుక్య విష్ణువర్ధన మహారాజ దేవ భల్లాన వీర పెరు పెరుమాళ్ ప్రతాప చోళునకును గురువనియు, వారిపురు శకాబ్దము 1109 వ సంవత్సరమున నుండరనియు వ్రాసియున్నాఁడు.[4] తరువాత కీర్తికాయులైన శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుగారి పూర్వికులలో నైదవ తరమువారైన కాశీనాథుని పీరనారాధ్యుఁడు తన ధర్మగుప్తాభ్యుదయములో మల్లికార్జునపండితారాధ్యాదులు చెప్పిన కథనే పెంచి వ్రాసియున్నాఁడు. సంగమముగ నతఁడు చెప్పు వృత్తాంతమిది: శివాద్వయ పారగుఁడగు శ్రీపతి పండితుఁడు విజయవాటియందు శైవాగమ నైగమ బోధాయోగమునఁ జరింపుచుండెను. శివుఁడే దైవమనియు, శివభక్తులె సత్కులీన సిద్ధాంతపరులనియుఁ జెప్పుచు ననంతపాల మహీధవాది శిష్యతతి గొలువ విజయవాటి పురంబున విజయధ్వజం బెత్తియుండెను. అతఁడొకప్పుడు శైవుఁడగు గొడగరియింట భుజించెను. పరవాదు లది కనిపెట్టి యతని ననంతపాలుని సభకుఁ గొనిపోయి యావిషయ మతని కెఱుకపఱిచి మాదిగవాని యింటఁ గుడిచినవాఁడు మీకెట్లు గురువు కాఁగలఁడని యడిగిరి. శ్రీపతి పండితుఁడు దనకార్యము నెంత చక్కఁగ సమర్థించుకొన్నను వినక పొయలాతని బహిష్కరించి పచనాదుల కగ్ని నొసఁగరైరి. దానికిఁగినిసి శ్రీపతి పండితుఁడు మల్లికార్జున దేవాలయమున కాగ్నేయ భాగమునందుండు జమ్మివృక్షము చెంత కేఁగి యగ్ని నాకర్షించి తనపైపచ్చడమును బెట్టుకొమ్మకుఁ గట్టి పట్టణమున నెవ్వరింటను వెలుఁగరాదని యాజ్ఞాపించెను తత్క్షణమున బెజవాడ యందు నగ్నికణవయ్యెను. పురజనులెల్లరువచ్చి శరణార్థులైరి. అంతట నతఁడగ్నిని విడిచిపుచ్చెను."[5]

శ్రీపతి పండితుని కాలమును బేర్కొనిన యాధారము లైదింటి మూలమున నిర్ణయింపవలసియున్నది. క్రీ.శ.1150-1160ల

---

4. Madras Govt, MSS. Libray, Tel.Des. catl.No.160
5. ప్రభాకర శాస్త్రులవారి బస. పు. పీఠిక. పుటలు ఁ-ఱఁ.

ప్రాంతమున వర్ధిల్లిన మల్లికార్జునపండితారాధ్య లితనిని బేర్కొని యుండుటవలన నితఁడతనికిఁ బూర్వుఁడనుట నిశ్చయము అతని కెంత కాలము ముందుండెనో నిశ్చయించుటకుఁ బాల్కురికి సోమనాథుఁడును నతఁడు చెప్పినకథనే సేంపందించిఁ ర్ణించినపి రనారాధ్యుఁడును, దోడ్పడుచున్నారు. శ్రీపతి పండితుఁ డనఁతపాలుని సభాస్థానమున నుండెనని యొకరును, ననంతపాలుని గురువని మఱియొకరును దెల్పు చున్నారు.ఈయనంతపాలుఁ డెవ్వఁడన నది విచారింపఁదగినయంశము. ఇతఁడు క్రీ. శ. 1076 మొదలు 1126 వఱకును, కల్యాణ కటకము రాజధానిగఁ బఱ్ఱిమ చాళుక్య సామ్రాజ్యమును మహావైభవముతోఁ బాలించిన త్రిభువనమల్ల బిరుదాంకితుఁడైన యాఱవవిక్రమాదిత్యుని సేనాధిపతి-క్రీ. శ. 1118 వ సంవత్సర మందు మొదటి కలోత్తుంగ చోళచక్రవర్తి దివంగతుఁడైన పిమ్మట ననంతపాల దండనాయకుఁడు దన ప్రభువుయొక్క ఆజ్ఞబడి వేంగి దేశమును సమస్తమును జయించి స్వాధీన పఱచుకొనెను. క్రీ. శ. 1120-1130 మధ్య ని ఁడు నెల కొల్పిన శాసనములు పెక్కులు తీరాంధ్రదేశమునఁ బలుతావులఁ గాన వచ్చుచున్నవి. కావున పాల్కుర్కి సోమనాథాదులు వచించునట్లు శ్రీపతి పండితుఁ డనంతపాలుని సభాస్థానమందుండినది వాస్తవమేని యతఁడు క్రీ. శ 1120-1130 సం॥ ల ప్రాంతమువాఁడు కావల యును; కాని పైసిద్ధాంతమునకుఁ గొన్ని ప్రతిబంధకములు గలవు. ప్రథమమునఁ బేర్కొనఁదగినది పోచిరాజు వీరన్నగారి భ్రాత.ఆతఁడు శ్రీపతి పండితుఁడు బెజవాడ తెలిక వారికిని చాళుక్య విష్ణువర్ధన మహారాజ దేవ భల్లాన వీర పెరుమాళ్ ప్రతాపచోళనికిని గురువని యును, నతఁడును నతని శిష్యుఁడైన చాళుక్యవిష్ణువర్ధన ఇత్యాది బిరు దాంకితుఁడైన రాజును శకాబ్దము 1109 (క్రీ శ. 1187-8) సంవత్స రమున మనియుండి రనియుఁ జెప్పియున్నాడు. వీరన్న భ్రాత చరి త్రకు విరుద్ధమైనది. శకాబ్దము 1109 ప్రాంతమునం డింకను చోళ సామ్రాజ్యమును చాళుక్యచోళ వంశజుఁడైన ముమ్మడికులోత్తుంగ చక్రవర్తి పాలించుచుండెను. నెల్లూరున కుత్తరమున నుండు త్రీరాంధ్రదేశమును వెలనాటి చోళరాజులు పాలించుచుండిరి.

ఈ వంశములలోఁగాని దక్షిణదేశమందలి మఱి యే వంశమునఁగాని పైఁ బేర్కొనిన రాజొకఁడు కానరాఁడు. కావున నతఁడు చరిత్ర కతీతుఁడైన కల్పిత పురుషుఁడు, అట్టి కల్పితపురుషుఁడు శ్రీపతి పండితునకు శిష్యుఁడగుట యసంభవము. కాఁబట్టి యతని భ్రాతనుబట్టి శ్రీపతి పండితుని కాలము నిర్ణయము సేయఁగడఁగుట వ్యర్థము.

శ్రీ సి. హయవదనరావుగారు శ్రీపతి పండితుఁడు క్రీ. శ. 1400 ప్రాంతమువాఁడని నిర్ధారించినారు. వీరి కాలనిర్ణయము శ్రీకర భాష్యమందలి మధ్వాద్వైత సిద్ధాంత ఖండనమునపై నాధారపడి యున్నది. హయవదనరావుగారును వారివలె మఱికొందఱును శ్రీకర భాష్యము శ్రీపతి పండితకృత మని యభిప్రాయపడుచున్నారు. ఇది విచారణీయము. పేరునుబట్టి చూడఁగా నది శ్రీకరవిరచిత మగునేమో యను సంశయమున కెడము గల్గుచున్నది. శ్రీపతియే శ్రీకరుఁడు కాఁగూడదా యను ప్రశ్న యొకటి బయలువెడలవచ్చును. కావచ్చునేము. అగు నని దృఢముగఁ బల్కుటకుఁ దగినసాక్ష్యముండి నఁగదా. వాదమునకై యొకవేళ శ్రీకరుడే శ్రీపతియని యొప్పు కొన్నను భాష్యకారుఁడే పండితత్రయములోని శ్రీపతి యని నిశ్చయించుట కాధార మెద్ది? కి. శే. కళాప్రపూర్ణ శ్రీ చిలుకూరి నారాయణరా. గారు శ్రీకర భాష్యమునందు మాధ్వాద్వైత మతఖండము లేనేలేవని వాదించుచున్నను, భాష్యమును బఠించినవారికి నారాయణ రావుగారి వాదము సత్యాత్మకముగాదని తెల్లముగాఁ గలదు. శ్రీకరుడు మాధ్వాద్వైతమును ఖండించినదేమో వాస్తవమే. అతఁడే శ్రీపతి యగుట నిక్కువమేని యతఁడు పండితత్రయములోని శ్రీపతి పండితుఁడు కాఁజాలఁడు; అన్యుఁడు కావలయును అట్టివాఁడును కలఁడా? కలఁడనియే శాసనములు సాక్ష్యము పల్కుచున్నవి. కృష్ణ రాయలనాఁటి యొకానొక శాసనమున,

"ద్రవిడ దేశదల్లి మహాగ్రహారవప్ప పొదటూరు గ్రామాధిపం వేద శాస్త్రపారంగతం బ్రహ్మచర్య వానప్రస్థ గృహస్థయతాశ్రమ ప్రతిష్ఠం ఆశ్వలాయన సూత్రోన్నతం భారద్వాజగోత్రోద్భవం

ఋక్కాకాధ్యాపకం ఉదయగిరి కన్నడిగకులతిలకం విప్రాగ్రగణ్యాం సత్కుల ప్రసూతం శ్రీపత్యాచార్యర్." అనియున్నది.[7] శ్రీపత్యాచార్యులు కృష్ణదేవరాయల సుప్రసిద్ధ సేనాపతులలో నొక్కడైన రాయసం కొండమరసయ్యగారి పితామహుఁడు. కొండమరసయ్య నరసానాయకుని కాలమునసే సేనాధిపత్యము వహించి యుండుటచే నతని పితామహుఁడగు శ్రీపత్యాచార్యుఁడు క్రీ. శ. 15వ శతాబ్ది పూర్వార్ధమున జీవించియుండె నని మనము నిశ్చయముగఁ జెప్ప వచ్చును. మాధ్వాద్వైతమును ఖండించిన శ్రీపతి యితఁడు కావచ్చును; కాని పండితత్రయములోని శ్రీపతి మాత్రము కాఁజాలఁడు.

శ్రీపతి పండితుఁడు క్రీ శ. 10వ శతాబ్దమున యుద్ధమల్లుని కాలమున క్రీ. శ. (929-35) బెజవాడయందుండె ననియు నారాజు మల్లేశ్వరాలయమున నెలకొల్పిన శిలాశాసనగ్రంథ మాతనిచే రచి యింపఁబడె ననియు శ్రీ నిడదవోలు వేంకటరావుగారు వక్కాణించి యున్నారు.[8] మొదట వేంకటరావుగారు చెప్పినట్లు శ్రీపతిపండితుఁడు క్రీ. శ. 10వ శతాబ్దమున యుద్ధమల్లుని కాలమున నుండెనేమొ కనుఁగొందము. వేంకటరావుగారి సిద్ధాంతమును నిల్పుటకుఁ దగిన సాక్ష్య మెఁదును గానరాదు. (1) మల్లికార్జున పండితారాధ్యుఁడు శ్రీపతి పండితుని బేర్కొని ప్రశంసించినాఁడనియందమును నొప్పుకొను విషయమే. మల్లికార్జున పండితారాధ్యుఁ డెప్పటివాఁడు? క్రీ. శ. 1150 ప్రాంతమువాఁడని యొకచోటను, నంతకంకెఁ గచ్చితముగ క్రీ. శ. 1100–1170 ల మధ్య మనియె నని మఱియొకచోటను వ్రాసియున్నాడు,[9] ఇంతవఱకుపలబ్ధమైన సాధన సామగ్రినిబట్టి మల్లికార్జున పండితారాధ్యుఁడు క్రీ. శ. 12వ శతాబ్ది మధ్యమున వర్ధిల్లె నని స్థూలముగఁ జెప్పుటకే సాధ్యపడును గాని క్రీ. శ. 1100 మొదలు 1170 పఱకును జీవించి యుండుననుటకు వలనుపడదు. మల్లి

---

7. SII, IX. part ii. No. 507. AR No. 87. of 1912
8. Lives of Telugu poets. pp. 68-82.
9. Ibid pp 69, 73

కార్జున పండితారాధ్యుఁడు శివతత్త్వసార మను గ్రంథమును రచి
యించియున్నను, నందుమూలమున నతనికాలమును నిర్ణయించిచెప్పు
టకు వీలుగాదు. కీ. శే. శ్రీకొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగారన్నట్లు
మల్లికార్జున పండితారాధ్యుని కాలమును, పాల్కురికి సోమనాథ
కృత పండితారాధ్య చరిత్రయందుఁ బేర్కొనఁబడిన యాతని సమ
కాలికుల కాలమునుబట్టి నిర్ణయింపవలయును. కల్యాణమందలి బస
వేశ్వరుఁడును, చందవోలులోని వెలనాటి చోడుఁడును, పానుగంటి
యందలి యుదయాదిత్య నీశుఁడును ముఖ్యులు. బసవేశ్వరుఁడు కల్యాణ
రాజ్యము నాక్రమించి క్రీ. శ. 1160 మొదలు 1167 వఱకును బ్రజా
పాలనమొనర్చిన కాలచుర్య బిజ్జలరాజునకు ముఖ్యమంత్రి. క్రీ.శ.1167వ
సంవత్సరమున బసవని శిష్యులు బిజ్జలుని దెగటార్చిరి. మఱుసటివర్ష
మున బిజ్జలుని పుత్రుఁడు బసవని వధించెను. వెలనాఁటి రాజులు చంద
వోలు రాజధానిగఁ దీరాంధ్రదేశమందు విశేషభాగమును బాలించిరి.
వీరు చాళుక్య చోళ చక్రవర్తుల కరిగాపులై వారి నామములనే
ధరించుటచేత వీరికి వెలనాటి చోళులను పేరువచ్చినది. వెలనాటి
రాజులలో చోడ నామధారులిరువురు గలరు. మొదటి వెలనాటిచోడ
రాజు క్రీ. శ. 1115 నుండి 1136 పర్యంతము పాలించినట్లు తెలియ
వచ్చుచున్నది.ఇతని మనమఁడు రెండవ వెలనాటి చోడరాజు.అతఁడు
క్రీ. శ. 1163 మొదలు 1180 వఱకును రాజ్యమును బాలించెను.
ఈయిరువురిలో మల్లికార్జున పండితారాధ్యుని సమకాలికుఁడు రెండవ
వాఁడని తోఁచుచున్నది. ఏల యనఁగా నీ రెండవ వెలనాటి చోడ
రాజే బసవనికిని బిజ్జలునికిని సమకాలికుఁడు. ఇట్లనుటకు మఱియొక
కారణము గూడఁ గలదు. పండితారాధ్యుఁడే కుపితుఁడై వెలనాటి
చోడుని శపించె ననియుఁ దత్కారణమున ప్రణబాధితుఁడై మృతి
నందఁగా రాజ్యమునం దంతఃకలహములు పెచ్చుపెరిగె ననియు,

'అంత రాజ్యార్థమై యనిఁ బోరి యతని
సంతాన మెల్ల నిస్సంతాన మయ్యెఁ
బా డయ్యెఁ దద్భూమి పండితవిభుని
యూడితశాప మహిష్ఠతఁ జేసి,'

యనియుఁ బాల్కు-ర్కి సోమనాథుఁడు దెల్పుచున్నాఁడు.[1] పెల నాటి చోళుల రాజ్యము ఖిలపడిపోయినది రెండవ చోడని యనంత రమేకాని మొఁటి చోడని తరువాతఁగాదు; కావున పాల్కు-రికి సోమనాథుఁడు చెప్పినట్టి యైతిహ్యము సత్యాత్మక మేని మల్లికార్జున పండితారాధ్యుఁడు క్రీ. శ. 1180 తరువాతఁ గూడ జీవించియుండ వలయును. పానుగంటి యుదయాదిత్యుఁడు శకాబ్దము 1084 (క్రీ. శ. 1162) వ సంవత్సరమున రాజ్యము సేయుచుండినట్లు జడచర్ల శాసనమువలనఁ దెలియుచున్నది.[11] ఆసంవత్సరమునే వ్రాయించిన కాకతీయ రుద్రదేవుని యనుమకొండ శాసనమున నీ యుదయ రాజును జయించి యతని రాజధానియైన కందూరును దగులఁబెట్టితి నని చెప్పుకొనియున్నాఁడు.[12] కావున మల్లికార్జున పండితారా ధ్యుని సమకాలికు లెల్లరును క్రీ. శ. 12 వ శతాబ్దపుటుత్తరార్ధమున నుండినట్లు తెలియవచ్చుచుండుటవలన నతఁడును నప్పుడె వర్ధిల్లియుం డవలయును. క్రీ. శ. 1140 నుండి 1200 వఱకును నతని జీవితకాల మని మన మూహ సేయవచ్చును. మల్లికార్జున పండితారాధ్యునిచేఁ బొగడ్తనందిన శ్రీపతిపండితుఁడు తత్పూర్వుఁడనుట నిస్సంశయము; కాని యెంతపూర్వుఁడో నిశ్చయించి చెప్పుటకు వలనుపడదు.

శ్రీ నిడదవోలు వేంకట్రావుగారు శ్రీపతి పండితుని కాలమును కచ్చితముగ నిర్ధారించుటకు నడుముకట్టి నూతన మార్గమును ద్రొక్కి యున్నారు. బెజవాడ మల్లేశ్వరుని యాలయమున బల్లకేతఁడను మాండలికుఁడు నిల్పిన శిలాశాసనముపై నూఁతగొని శ్రీపతి పండి తుని క్రీ. శ. 10 వ శతాబ్దములోనికి నూకివేయ సమకట్టినారు. అందు.

---

10. పండితా మహిమ (ఆం. గ్రం. మా. ప్రచురణ) పుటలు 88-99
11. తెలిం. శాస. ఇతర నెం. 6 రు.
12. తెలిం. శాస. కాక. నెం. 5 రు.

"తతః శ్రీపండితారాధ్య నామ్నా భక్తోత్తమేన చ
శివభక్తా ఏవ మానం దేవర్షి భ్యోధికా ఇతి
చీనాంబరేగ్నిం సంస్థాప్య శమీకోమలశాఖయా
బద్ధే మల్లేశ్వరః ప్రీతః ప్రత్యక్ష స్సమజాయత."[13]

యని పండితారాధ్యుఁడు పచ్చడమునం దగ్నిని ముడిచినకథ ప్రస్తా వింపఁబడినది. ఈశాసనమునఁ బేర్కొనఁబడినపండితారాధ్యుఁ డెవ్వఁడు? పండితారాధ్యనామముపాజ్మయమున మల్లికార్జునునకొక్కనికే చెల్లు చున్నది. అజ్ఞానముచే శాసన గ్రంథకర్త శ్రీపతి పండితుని యుదంత మును మల్లికార్జునున కంటఁగట్టినాఁడా? లేక పండితారాధ్య నామము బండితత్రయమువారికెల్ల సామాన్యమా? ఇందలి వాస్తవ మెట్లుండి నను, శాసనమెప్పటిదో చెప్పుటకు వీలుగాదు; కాని శ్రీ వేంకటరావు గారు ఇట్లు పలుకుచున్నారు. "ముందు నే నుదాహరించిన బెజవాడ మల్లేశ్వరాలయమునందలి పల్లికేతని శాసనమున కాలము తెలుపఁబడి యుండలేదు గాని యది 11వ శతాబ్దమునాఁటిదని శాసన పరిశోధ కులు దెలుపుచున్నారు. కాఁబట్టి యీతఁడు (శ్రీపతి) యంతకు (11వ శతాబ్దమునకు) ముందటివాఁడగుట నిశ్చయమే" యని దృఢముగఁ దీర్మానించినారు.[14] పల్లకేతని శాసనము (క్రీ. శ. 11వ శతాబ్దము నాఁటిదని శాసన పరిశోధకులు దెలుపుచున్నారనుట వట్టి యపో హ్యము. శాసనపరిశోధకులట్లు చెప్పలేదు. వారది క్రీ. శ. 13వ శతాబ్దమునం దాంధ్ర దేశమును పాలించిన కాకతీయ గణపతిదేవ రుద్రాంబల కాలము నాఁటిది కావచ్చు ననిరి. చూడుఁడు.

---

13 Sll. X No. 12.
14. Lives of Telugu poets. pp. 73.

"These were Palla K eta-bhupala and Siddhayadeva Maharaja to whom belong Nos. 536, 606 (saka 1153) and 609 (saka 1199). The two latter (Nos. 606 and 609) recording grants for the merit of the Kakatiya king Ganapati and his daughter, Rudramamba show that these Pallava chiefs were subordinates of the Kakatiyas No. 536 (that is the inscription of Palla Keta at Malleswaraswami temple at Bezwada cited above) the date of which is lost may have to be referred to the same period, though the chief mentioned therein belonged to a different branch of the family, whose members were worshippers of the feet of Malleswara of Bezwada and not the devotees of Kamakotyambika of Kanchi."[15]

కావున పల్లకేతని శాసనము భగ్నమైన యూఁతకోలయైనది. శాసనమున కాలము దెలుపలేదు. శాసనపరిశోధకు లది క్రీ. శ. 11వ శతాబ్దమునాఁటి దని చెప్పలేదు. ఇఁక దాని నాధారపఱచుకొని శ్రీపతి పండితుని 10వ శతాబ్దములోనికి నెట్టుట కెట్లు సాధ్యపడునో శ్రీ వేంకటరావుగారే సెల వియ్యవలయును.

లేని ప్రాచీనతను శ్రీపతి పండితునకుఁ గల్పింప గడఁగుటచే శ్రీ వేంకటరావుగారికి పాల్కురికి సోమనాథుని సాక్ష్యము కంటక ప్రాయమైనది. కావున నతఁడు చరిత్రజ్ఞానము లేక ప్రాసెననియుఁ దత్కారణమున నతఁడు చెప్పు వాక్యములు సత్యము కావనియు నిరసించినారు. చూడుఁడు.

---

15. ARE. 1910, part ii, para 8.

"సోమనాథుఁడు ప్రసిద్ధచరిత్రమేయైన నది వింతతీరులు గలది. ఆతఁడు ప్రవాసిన వన్నియు సత్యమైన చరిత్రఁబట్టి పరిగణింప రాదు. ఉదాహరణముగ బసవపురాణమున కల్యాణకటకమును బాలించిన బిజ్జలుని వంశమువారు కాలచుర్యులు. వారిని సోమనాథుఁడు చాళుక్యులని చెప్పినాఁడు. ఇది చరిత్ర నిరుద్ధముగదా!"యని యబ్బుర పడిరి. మఱియు ననంతపాల దండనాయకుని శాసనములలో శ్రీపతి పండితుని ప్రస్తావన లేదనియుఁ దత్కారణమున వా రేక కాలమువారు కాఁజాలరనియు, శ్రీపతి పండితుఁ డనంతపాలుని కాలమునకు ముందు వాఁడనియే చెప్పనగుననియు శాసించినారు.[16] సోమనాథుఁడు బిజ్జలునికిఁగాని యతని యనంతరము రాజ్యమేలిన కాలచుర్యవంశ జులకుఁగాని సమకాలికుఁడుగాఁడు. పదునాల్గవశతాబ్ది ప్రారంభమున వెలిసినవాఁడు. ఇప్పటివలె నప్పుడు చరిత్ర గ్రంథములు ప్రాయుట యాచారముగాదు. అప్పటివారి చరిత్రజ్ఞానమంతయు దరములఁబడి పరంపరగవచ్చు నైతిహ్యముల రూపమున నుండెడిది. బిజ్జలుఁడు చాళుక్యుఁడను నమ్మకము సోమనాథుని కాలమున జనసామాన్య మందు వాడుకయం దుండియుండ వలయును. దానినే యతఁడు గ్రంథస్థము గావించెను. చాళుక్యవంశజులైన యారె వీటిరాజు ల్ కారణమునసే బిజ్జలుని దమ పూర్వీకులలో నొక్కనిగఁ బరిగణించిరి. సోమనాథుఁడు బిజ్జలుని చాళుక్యుఁడనుటకు మఱియొక కారణము గూడఁ జెప్పవచ్చును. కల్యాణకటకము చాళుక్యులది. చాళుక్యసింహా సనము నాక్రమించి యధిష్ఠించుటచే నతఁడు చాళుక్య సామ్రాజ్యాధి పతి యాయెను. ఈకారణమున సోమనాథుఁడతని చాళుక్యునిగఁ బరిగణించి యుండవచ్చును. ఇందు వింత యేమియులేదు. పూర్వ చాళుక్యవంశజుఁడైన రాజేంద్రుఁడు చోళసింహాసనము నాక్రమించు కొనిన పిమ్మట దాను చోళుఁడ నని చెప్పుకొనలేదా? క్రీ. శ. 16, 17 శతాబ్దములలో తంజాపుర మధుర రాజ్యములఁ బాలించిన యాంధ్ర

16. Lives of Telugu poets. pp. 78–79.

నాయకులును మహారాష్ట్రప్రభువులును దాము చోళపాండ్య భూపాలుర మని చెప్పుకొనలేదా? వారి సమకాలిక గ్రంథకర్తలును వారిని నట్లే పేర్కొనలేదా? కావున సోమనాథుఁడు బిజ్జలుని చాళుక్యుఁడని చెప్పినదొక దొడ్డతప్పుగ గ్రహించి తత్కారణమున నాతఁడుచెప్పిన దంతయు సత్యాత్మకము గాదని త్రోసిపుచ్చుట పాడియా?

అనంతపాలుని శాసనములలో శ్రీపతిపండితుని ప్రస్తావన లేక పోవుట వాస్తవమే. లేకపోయినంతమాత్రమున నతని యాస్థానమున లేఁడని వాదించుట సరియా? సమకాలికుల నెల్ల ననంతపాలుఁడు శాసనములందుఁ బేర్కొనియున్నాఁడా? అట్లు పేర్కొని శ్రీపతిపండితుని బేర్కొనకపోయినఁగదా యతఁడనంతపాలుని యాస్థానమున లేఁడని యనుకొనఁదగును. బిజ్జలుని శాసనములలో బసవని యడపొడ గానరాదే. బిజ్జలుని ముఖ్యప్రధానిగదా బసవఁడు. శ్రీవేంకటరావుగారి మార్గము నవలంబించిన బసవఁడు బిజ్జలుని కాలమువాఁడు గాఁడని కదా చెప్పవలయును. సమకాలిక శాసనములం దెచ్చటను మల్లికార్జున పండితారాధ్యులు పేర్కొనఁబడియుండలేదే. తత్కారణమున మల్లికార్జున పండితారాధ్యు లప్పటివారు కారని చెప్పవలయును. శాసనములు చరిత్రలుగావు; రాజకీయ మత సాంఘికార్థిక విషయములను వర్ణించుట వాని యుద్దేశముగాదు. రాజులుగాని వారి యధికారులుగాని ధర్మపోషణార్థము దేవబ్రాహ్మణాదుల కొసఁగిన భూదానాదికములను బ్రకటించుటకొఱకే యవి పుట్టినవి. శాసనోక్త దానాది ధర్మకార్యములతో సంబంధము గలవారే యందుఁ బేర్కొనఁబడుదురు. అన్యుల కందు తావులేదు. కావున శ్రీపతి పండితుని ప్రస్తావన యనంతపాలుని శాసనములలో లేనంతమాత్రమున వారు సమకాలికులు గారని యెంచుట సరికాదు. పాల్కురికి సోమనాథుని కాలమునుండియు శైవగ్రంథములు శ్రీపతి పండితుఁడనంతపాలుని యొక్క గురువని చాటుచున్నవి. శ్రీ వేంకటరావుగారు చూపిన యాధారములకంటెఁ బ్రబలమైనవి వెలువడునందాక శైవగ్రంథ

ములలోఁ జెప్పియుండునట్లు శ్రీపతి యనంతపాలుని గురువనియు వా రిరువురును క్రీ. శ 1120–1130 ప్రాంతమున మనియుండిరనియుఁ దలంచుట సమంజసము.

ఇంతవఱకు శ్రీపతిపండితుని కాలమునుగూర్చి విచారించితిమి. ఉపలబ్ధమైన సాక్ష్యమును బరిశీలించిచూడఁగా నతఁడు శ్రీహాయవదన రావుగారు చెప్పినట్లు క్రీ. శ. 1400 ల ప్రాంతమువాఁడుగాని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు వచించునట్లు క్రీ. శ. 9౫0 ప్రాంతమువాఁడు గాని కాఁజాలఁడని తెల్లమైనది. పండితారాధ్య పాల్కురికి సోమనాథుల కాలమునుండియు శైవవాఙ్మయమునఁ బరంపరగ వచ్చు గాథలనుబట్టి చూడ నతఁడు క్రీ. శ. 12వ-శతాబ్ది రంభకాలమున వర్ధిల్లి యుండునని తోఁచుచున్నది.

ఇఁక శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు వక్కాణించినట్లు శ్రీపతిపండితుఁడు కవియై యుద్ధమల్లుని బెజవాడ మల్లేశ్వరాలయ శిలా శాసన గ్రంథమును విరచించెనేమొ కనుఁగొందము. శ్రీపతి పండితుఁడు కవి యనుట కాధారమెద్ది?

'శ్రీపతి పండితుల్ శివుఁడ మీకవులు
నా పండితయ్యగా రనుఁగు పండితులు'

అను సోమనాథుని ద్విపద.[17] 'కవులు' అనునది శ్రీ ప్రభాకర శాస్త్రుల వారి సవరణ యని తోఁచుచున్నది. నేను బరిశీలించిన తాళపత్ర ప్రతులలోఁ "గావ్యుఁ'డని యున్నది. కావ్యుఁడను మాటకు "శుక్రుఁడను" వర్థమొక్కటియే నిఘంటువులయందుఁ గానవచ్చుచున్నది. కావ్యుఁడను పాఠమునకు సందర్భశుద్ధి లేకపోవుటయే పై సవరణకుఁ గారణమై యుండనోపు. కాని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు "ఇచ్చట కవికిఁ గావ్యశబ్దము వాడఁబడినది 'కావ్యుఁడు' అనునది కవి

17. బస. పురా. పుట. 48.

పరముగా వాడుటకలదు. చిత్రకవి పెద్దన అప్పనకవి దీనిని ప్రయో గించినారు"[18] అని చెప్పుచున్నారు. విచారణీయము. "గాథలు వెక్కాడువాడె కావ్యుడు సుమతీ" యని సుమతీ శతక ప్రయో గమును జూపినారు. ఇది సందేహాస్పదము. ఏలయనఁగా నాయొద్ద నుండు సుమతీశతక ప్రతియందు "గాథలు పెక్కాడువాఁడె కథకుఁడు సుమతీ" యని యున్నది.

సోమనాథుఁడు శ్రీపతిని కవి యని చెప్పె ననియే గ్రహిం తము. చెప్పినంత నేమాయె? సోమనాథుని వాక్యములకు లేనిపోని ప్రాధాన్యమును గల్పించి శ్రీపతి కవి యని చంక లెగురవై చినంత నేమిలాభము? మహారాజులు మున్నగువారి కొలువునందువలె శివుని కొలువునందును నియోగములుండినటు వర్ణింపఁదల పెట్టినాఁడు సోమ నాథుఁడు. ఒక్కొక్కభక్తుని కొక్క నియోగమును దగులఁగట్టినాఁడు; శ్రీపతికి కవితఁ జెప్పసుద్యోగమును గల్పించినాఁడు; కావున సోమనా థుని మాటల నాధారపఱచుకొని వానిపై నూహాసౌధ నిర్మాణము సేయుట సమంజసము గాదు. శ్రీపతి కవిత్వముఁ జెప్ప నేర్చినవాఁడె యని యొప్పుకొందము. ఆతఁడు సంస్కృతమున నేల కవిత్వమును జెప్పియుండరాదు? తెనుఁగునందెయని నిశ్చయించి చెప్పుట యెట్లు? ఒక్క కవియైన నితఁడు కవియని చెప్పియుండ లేదే.

ఇఁక యుద్ధమల్లుని శాసనమునకు శ్రీపతి పండితుఁడు గర్త యగునేమొ విచారింతము; శాసనమునం దెచ్చటను దత్ప్రచయిత ప్రస్తావము గానరాదు. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు ప్రతిపా దించిన మఱియొక సిద్ధాంతము ననుసరించి శాసనమును నెలకొల్పిన యుద్ధమల్లుఁడే. శాసన గ్రంథమును రచియించినాఁడని చెప్పవలసి యుండఁగా నతని వదలి పెట్టి శ్రీపతిని బట్టుకొనిరి. ఏలయనఁగా

18. Lives of Telugu poets pp. 79 No. 1.

"1. ఈ శాసనము బెజవాడయందు నెలకొల్పఁ బడుట, శ్రీపతి పండితుఁడు బెజవాడ వాస్తవ్యుఁడగుట.

2. ఇది మల్లేశ్వరస్వామి యాలయమున నెలకొల్పఁ బడుట, శ్రీపతి పండితుఁడు శైవమత ప్రాశస్త్యము నిరూపించుటకుఁ గొంగున నిప్పులు మూటఁగట్టి శివభక్తి మహిమను ప్రదర్శించుట మల్లేశ్వరుని యాలయమున జరుగుటవలన.

ఈ యంశమున మల్లికార్జున పండితారాధ్య లిట్లు చెప్పి యున్నారు.

" ..... ముడిచె నిప్పులు చీరన్
ప్రక్కక శ్రీపతి పండితుఁ
డక్కజముగ విజయవాడ నలజమ్మి శివా"[19]

ఇందు మల్లేశ్వరాలయము మాటలేదు. పాల్కురికి సోమనా థుఁడు రెండు పర్యాయము లీవిషయమును ప్రస్తావించియున్నాఁడు.

(1) బసవ పురాణమున,

"అనుచు ననంతపాలుని సభాస్థలిని
నెక్కొనఁగాఁ జంద్ర నిప్పులుగాదె
చక్కనఁ బొత్తిపచ్చడమున ముడిచె"

(2) "పండితారాధ్య చరిత్రమున,

వెండియు శ్రీపతి పండితుల్ ....
తొరఁగి పైపొత్తి పచ్చడమున నిప్పు
లడరంగ ముడిచిన నదియేమి చేసె"

సోమనాథుఁడు మల్లేశ్వరుని యాలయమునుగాని జమ్మిచెట్టును గాని పేర్కొనలేదు. మీఁదుమిక్కిలి యనంతపాలువి సభాస్థలమున నిప్పులు కొంగున ముడిచినట్లు చెప్పినాఁడు. అర్వాచీనుఁడైన కాశీ

19. శివతత్త్వ సారము 106.

నాథుని వీరనాధ్యుఁ డొక్కఁడే యీ సందర్భమున "విజయవాటి కాపుర మలికార్జునాగ్నేయ భాగంబున నున్న శమీశాఖ సమీపమున కరిగి"యని వచించినాఁడు. ఇతఁడైనను శ్రీపతి పండితుని మాహాత్మ్య ప్రదర్శనము మల్లేశ్వరాలయమున నడచినట్లు చెప్పలేదు; దానికాగ్నేయమునం దున్న జమ్మికడ నడచినట్లు వక్కాణించినాఁడు; కావున నీప్రదర్శన శ్రీవేంకటరావుగారన్నట్లు మల్లేశ్వరాలయమున జరుగలేదు.

(3) ఈ శాసనమున గొరగలను గూర్చిన ప్రశంస యుండుటచే వీరశైవమతమునకు సంబంధించినది యగుట.[20] శ్రీపతి పండితుఁడు తెనుఁగుదేశపు పండితత్రయములో మొదటివాఁడగ నుండుట.

(4) ఇందులోనున్న మధ్యాక్కరలు మాత్రాచ్ఛందస్సునుండి యేర్పడిన దేశివృత్తము లగుట. ఈ రచన తెలుఁగుకవితా పరిణామ ప్రారంభదశను సూచించుట శివకవులు దేశీయచ్ఛందస్సులో మత వ్యాపనకు కవితా రచన నుపయోగించుట.[21]

---

20. గొరగలనుగూర్చి ప్రశంస యుండినంతమాత్రమున వీరశైవులకు సంబంధించిన దనుటకు వలనువడదు. "గొరగ" సంస్కృత గురుశబ్దభవము, గొరగలు వీరశైవము పుట్టుటకు ముందె శాసనాదులందు పేర్కొనఁబడియున్నారు, మఱియు యుద్ధమల్లుఁడు గట్టించినది కార్తికేయుని యాలయము. దానికి సంబంధించిన మఠముననె గొరగలుఁ బేర్కొనఁబడినది. వీరశైవమున కార్తికేయునికిఁ బ్రాధాన్యములేదు; కావున నివివీరశైవనిర్మాణములనుట తగదు. కార్తికేయుఁడు చాళుక్యులకు కులదైవము; యుద్ధమల్లుఁడాదేవునికి గుడికట్టించుట సహజమే. మఱియు క్రీ. శ. 6. 10వ శతాబ్దుల మధ్య ఆంధ్ర కర్ణాటక దేశములోఁ బెక్కుతావులఁ గార్తికేయస్థానములుండినవి. బళ్ళారిమండలములోని కుడతని యందలి కార్తికేయ తపోవనము ముఖ్యమైనది. అందలి స్థానపతులు కాలాముఖులుగాని వీరశైవులుగారు.

21. వైష్ణవులు కూడ వాడినారు. అక్కరలను వాడిన శివకవియొక్కఁడేనియు లేకపోవుట వింత.

(5) శ్రీపతి కవిగాఁ మన కెఱుకపడుట.

వేఁకట్రాపుగారు వచించినవన్నియు నిజమని యొప్పుకొన్నను నవి శ్రీపతి పండితుఁడు యుద్ధమల్లుని శాసనగ్రంథమును రచించెనని నిర్ధారించుటకెట్లు సాధనములు కాఁగలవో తెలియకున్నది.

శ్రీపతి పండితుఁడే యుద్ధమల్లుని శాసనగ్రంథమునకుఁ గర్త యని నిరూపించుటకు శ్రీ వేంకట్రాపుగారు మఱియొక ప్రబల కారణమును జెప్పియున్నారు. "కీర్తిశేషులు ఆంధ్రగ్రంథాలయో ద్యమ పితామహులు నిడదవోలు సుందరం పఁడితుల వారిట్లు వ్రాసి యున్నారు. శివకవులలో"

"అతులిత శివభక్తునితోఁ
బ్రతిసేయఁగ రారు కోటిబ్రాహ్మణు లని శ్రీ
పతి పండితయ్య నిప్పులఁ
గుతుకమతి న్మాటగట్టెఁ గొంగునను శివా.
అల యుద్ధమల్లుఁ బనుపునఁ
దెలుఁగున మధ్యాక్కరలను దెలిపెను దొలిఁదా
నిల శ్రీపతి పండిత కవి
లలితగతి న్విజయనగర రామయలింగా.
అక్కరలఁజెప్పె ఱాఁదెలుఁ
గక్కరములఁ యుద్ధమల్లుఁ డవి చెక్కించెన్
నిక్కమతఁ డొక్కశివకవి
రక్కొన నుతియింతు విజయరామయలింగా. 22

పై పద్యములను జదువఁగనే,

---

22. ఈ పద్యములను గూర్చి వేంకటరావుగారిట్లు వ్రాసినారు:
"పండితత్రియము" అను నా వ్యాసమున నిప్పటికి 21 యేండ్ల నాఁడు శ్రీపతి పండితునిగూర్చి వ్రాసినప్పుడు దీనిని విద్వల్లోకమునకుఁ దెలిపితిని. (చూ. భారతి సం. 3. సంచిక 3. క్రోధన ఫాల్గున) (మార్చి 1926) 23–33 పుటలు." కాని వేంకటార్యులుగారు భ్రమపడినట్లున్నది. ఈవ్యాసమును రచియించినవారు శ్రీ నిడదవోలు వెంకట్రమణగారు కాని వెంకటార్యులు గారు కాదు. ఈ పొరపాటును వారు సవరించుకొనుట యుక్తము.

"...నిలిపి రంధ్రవిషయమున, జనసత్యాశ్రయుని దొట్టి చాళుక్య నృపుల్" అనుకుమార సంభవపద్యము లేలనో స్మరణకు వచ్చినవి. పై కందపద్యములను రచించిన శ్రీ నిడదవోలు సుందరం పండితుల వారు ఈ శతాబ్దారంభ దశకములం దుండిరని మద్రాసు ప్రాచ్య లిఖితపుస్తకభాండాగా రాంధ్రగ్రంథముల క్యాటలాగులను దిలకించు వారికెల్ల విదితమే. వారు మన వేంకట్రావుగారి జనకులుగాని యన్యులగారు. తమకు వెయ్యేండ్లకుముందున్న శ్రీపతి పండితుని విషయమున వారు వ్రాసినవ్రాత కాధార మెద్దియో తెలుపరైరి. నిప్పును గొంగునఁ గట్టిన కథ పండితారాధ్యులకడ సంగ్రహించినది. యుద్ధమల్లుని శాసన గ్రంథ రచనను గూర్చినది నిరాధారమైన వ్రాత. కేవలకల్పనాకథ. పితృవాక్య పరిపాలకులైన శ్రీవేంకట్రావు గారికి దమయయ్య మాటలయం దెంత నమ్మకము గల్గినను నిష్పా క్షికముగ నరయువారి కవి విశ్వాసపాత్రములు గాఁజాలవు. వీరి మాటలసత్యమును రుజువుసేయఁగల ప్రాచీన శాసన గ్రంథాదార్శ ధారము లభించునందాక నవి యంగీకార్యములు గావని డవిణగొట్టి పల్కవచ్చును.

వాఙ్మయ వ్యాసమంజరి

గణపనారాధ్యుఁడు

ఈకవి ఆంధ్రుల కపరిచితుఁడు. ఇతఁడు స్వరశాస్త్రమును చిన్న ద్విపద కావ్యమును రచించెను.

ఇటీవల నేను హంపీయాత్రకుఁ బోయినపుడు, అచట ఆంధ్ర గ్రంథము లేవేనియు దొరుకునా యని పలువుర నడిగితిని. కాని యెచ్చటను లభింపవయ్యెను. అట్లే యానెగొందియందును విచారింపఁగా రెండు మూడు సంవత్సరములకుపూర్వము అచ్చటనున్న తాళపత్ర గ్రంథముల నన్నిటిని తుంగభద్రలో వైచితిమని యచ్చటివారు చెప్పగావిని చింతించితిని. అయినను నాతోడవచ్చిన మిత్రులు శ్రీటి.వి. రంగాచార్యులుగారు నావలె హతాశులుగాక కంటికగపడిన వారినం దటిని తాళపత్ర గ్రంథము లేవేని తమకడఁగలవాయని విచారించు చుండిరి. ఒకనాఁటి యుదయము మేము ఆనెగొండిలో నొకభాగమగు చింతామణిని వీక్షింపంబోయినపుడు అచటనున్న యొక శైవమఠ మును జొచ్చితిమి. ఆ మఠాధిపతియగు శ్రీ సుందరానంద స్వాముల వారు మాకామఠమును జూపునపుడు, మిత్రులు రంగాచార్యులు యథావిధి "తమకడతాళ పత్ర గ్రంథము లేవియేనియుఁ గలవా?" యని యడిగిరి. వారు తమ దగ్గర రెండు గ్రంథములు గలవని వాని

దెచ్చి మా ముందు వై చిరి. అందొకటి గ్రంథాతరముల భగవద్గీత. రెండవది స్వర శాస్త్రము. స్వర శాస్త్రము మిక్కిలి పురాతన గ్రంథ మగుటచేతను, అపరిచితమగుట చేతను దానిని మా కిండని స్వాముల వారిని వేడితిమి. వారు వెంటనే మా కా గ్రంథమునొసఁగిరి. వారియెడ కృతజ్ఞుఁడను.

ఈగ్రంథకర్త కౌండిన్యసగోత్రజుఁడు. ఇతని తండ్రి గణ్యయా మాత్యుఁడు; తల్లి దేవమాంబ; అన్న రామరాజు; చెల్లెలు అన్నమాంబ; ఉనికిపట్టు ఓరుగల్లో, తత్పార్శ్వంత దేశమో. తన వంశాదికములను కవి యిట్లు వర్ణించుకొని యున్నాఁడు:

ఆదిమ బ్రహ్మకునాత్మ సంభవుఁడు
ఆతనికిఁ గౌండిను డతని గోత్రమున
గణ్యయామాత్యుఁ డగణ్య విక్రముఁడు
సత్య సదాచార సన్మార్గవర్తి
చంద్రశేఖర పాద సద్భక్తిపరుఁడు
భూమండలమున జంబూద్వీపమందు
భారత వర్షమున భరతఖండమున
హిమసేతుపర్యంత మెల్లను వెలసె
ఆ దేశముల కెల్ల నధిపతియైన
విరప్రతాపుఁడై వెలయు రుద్రుండు
ఆ రుద్ర భూపతి కాలయంబైన
సొంపారు నర్ధీశ్వర యోరుగంటి
మంత్రి శేఖరవృత్తి మహిమీద వెలసి
దేవమాంబిక తోడ తెరగొప్ప గూడి
కులమందు చంద్రుల కొడుకుల గాంచి
కొడుకులలో పెద్ద గుణవంతుఁడైన

• యతి భంగము.

రామరాజన భూమి రమణతో వెలసి
రాజవిక్రమ వృత్తి రాజపూజితుఁడు
పరసతీసోదరీభావంబు బిరుదు
బ్రహ్మణ్య పరమూర్తి పరమార్థవేది
ఆగమ వేద సదాచార యుతుఁడు
బంధుచింతామణి పరవుపకారి (?)
సురరాజభోగ భాసుర రతుకుండు
దాన ధర్మైక తాత్పర్య చిత్తుండు

మహనీయ వృత్తిని మహిమీద నడపి
ఏక పత్నీవ్రతం బింపార నడపి
కొడుకుల గూతుల గొమరొప్ప గాంచి
సుఖలీల విభవంబు సొంపార నుండి
కాకతి రాజ్యంబు కడచన్న మీఁద
నొగి సుర్రాణుని యుద్దండ రాజ్య
మహిమతోఁ జెన్నారు మన్నన మీఁద
నిజ భుజ విక్రమ నీతినిపుణుండు
శ్రీలొసఁగ పురాణ శ్రీకాంతుఁడగుచు

అశ్వ సామంతుల నాందోళములును
వీణాది వాద్యముల వేదఘోషముల
మంగళ పాఠక మహితకీర్తనల
మండలేశ్వరు లీల మాన్యగా నేలె

• • • • •

మంత్రి శేఖరుఁడైన మంత్రి కనుజుండు
మానితగుణ యన్న మాంబ కగ్రజుఁడు
సంసార మధ్వస్త సాధకోత్తముఁడు
గణప నారాధ్యుఁడు కమనీయ మూర్తి."

ఈ గణపనారాధ్యుఁడు యోగశాస్త్రవేత్త కావున యోగశాస్త్ర ములనన్నిటిని బరిశోధించి యీ స్వరశాస్త్రమును విరచించెను.

"సంసార జితులకు సహజయోగమున
స్వరశాస్త్ర యోగంబు సరిగాగ దలచి
హరి మత శాస్త్రంబు హరశాస్త్ర మతము
హఠయోగ శాస్త్రంబు నధ్యాత్మ మతము
వాసిష్ఠ మతమును వల్క్య యోగంబు
నానా మతైకంబు నవనాథమతము
మహితమై యెసపెడు మార్తాండ మతము
కొమరొప్పుచున్నట్టి గోరఱు మతము
కడునొప్పుచున్నట్టి కామాఖి మతము
మొదలుగా మహిమీద ముఖ్యమైయున్న
యోగ శాస్త్రములెల్ల యోచించి చూచి
జీవహితంబుగా జీవునిబట్టి
తెర గొప్ప జనులెల్ల దెలియునట్లుగను
స్వర శాస్త్రమంజరి వర్ణింతు బ్రీతి."

గణపనారాధ్యుని కాలమును నిర్ణయించుటసులభము.

కవి కాలము: ఏలన అతని తండ్రి 'గణ్యాయసూత్యుఁడు ఓరుగంటి ప్రతాపరుద్ర మహారాజునకు మంత్రి. అన్నయగు రామరాజు కాకతి రాజ్యము గతించినపిమ్మట సురత్రాణునిచే మన్ననలను బొంది మండలేశ్వరు లీల మాన్యుఁడై యేలినవాఁడు. వీరప్రతాపరుద్రనరపతి కాకతీయ రాజులలో కడపటివాఁడు. ఇతఁడు క్రీ. శ. 1296 మొదలు 1323 వరకును రాజ్యపాలనము జేసెను. గణ్యాయసూత్యుఁడు గూడ అప్పటివాఁడే యగును. ఇఁక రామరాజును మన్నించిన సురత్రాణుఁడు డిల్లీ ప్రభువగు మహమ్మదు తుఘలాక్ షా. ఇతడు క్రీ. శ. 1323 నఁదోరుగంటిపై దండయాత్ర జేసి ప్రతాపరుద్రుని బందినిజేసి, కాకతి

రాజ్యమును విధ్వంస మొనర్చి, మహ్మదీయ సామ్రాజ్యము నాంధ్ర దేశమునందు నెలకొల్పెను. ఈతని యధికార మాంధ్రదేశమున క్రీ.శ. 1345 వఱకు సాగెను. ఆ సంవత్సరమున ముసునూరి కాపయ నాయకుఁడు ఆంధ్ర స్వాతంత్ర్య స్థాపనార్థము నడుముకట్టుకొని, మహమ్మదీయులను తెలింగాణమునుండి వెడల నడచెను. కావున సురక్షాణునిచే మన్నన వడసిన రామరాజు క్రీ. శ. 1323, 1345 ల మధ్యకాలమున వెలసి నాఁడనుట స్పష్టము. గణపనారాధ్యుఁడు తన గ్రంథమును అప్పుడే రచియించి యుండవలయును.

వాఙ్మయ వ్యాసమంజరి

గౌరన

(1)

ఆంధ్ర ద్విపద కావ్యములలో గౌరనా మాత్యుని కృతులు ప్రసిద్ధికెక్కినవి. హరిశ్చంద్రద్విపద నెఱుఁగనివా రరుదు. నవనాథ చరిత్రయంత ప్రఖ్యాతము గాకున్నను, సర్వవిధముల దీనికి తుల్యమైనదే. పాల్కురికి సోమన, రంగనాథుఁడు, తాళ్లపాక తిరువెంగళనాథుఁడు దప్ప ఇంత సొంపుగ ద్విపద చెప్పఁజాలిన కవి మఱి యొకఁడు గానరాఁడు. ద్విపద వాఙ్మయమున నితని స్థాన మత్యున్నతము. ఈ వాఙ్మయపరిణామమున నితని కృషియనల్పము దాని యుత్కృష్టత చారిత్రక దృష్టితో నవలోకించినఁగాని తెల్లముగాదు పూర్వాపరద్విపద కావ్యవిమర్శనవలనఁగాని యిది తేలదు. గౌరన కాలము నిశ్చయముగఁ దెలియకున్న పూర్వాపర గ్రంథము లెవ్వియో కనుఁగొనుటకు సాధ్యపడదు. కావున గౌరనకాలమును నిర్ణయించుటయే ప్రస్తుత వ్యాసముయొక్క ప్రధానోద్దేశము.

గౌరన కాలమునుగూర్చి పరిశోధన చాల జరిగియున్నది. కాలనిర్ణయమున కావశ్యకమైన చరిత్రాంశము లన్నియు లభ్యమై యున్నను, సిద్ధాంత మింకను తేలకున్నది.

హరిశ్చంద్ర ద్విపదలో గౌరన తన వంశము నిట్లు వర్ణించుకొనియున్నాఁడు:

"సింగన మాధవక్షితిపాలమణికి
మంగళమూర్తికి మంత్రియై జగతి
పొగడొందు పెద్దన పోతరాజునకుఁ
దగిన తమ్ముఁడు యశోధనుఁడయ్య మంత్రి *

చెట్టపట్టంగ నోఁచిన భాగ్యవతికి
చుట్టాలసురభికి సుందరీమణికి
ఘనుఁడు వల్లభమంత్రి గంగాంబఁ గోరి
కనిన పోచాంబకుఁ గారాబుసుతుఁడ

ధరణి నమాత్యరత్నం బనఁ బరఁగు
ధరణిమంత్రికిఁ గూర్మితమ్ముఁడ ఘనుఁడ
భూతనాయకపాదపూజాభిరతుఁడ
గౌతమ గోత్రుండ గౌరనాహ్వాయుఁడ."

నవనాథచరిత్రయందును వైవిషయములే సంగ్రహముగ వర్ణింపఁబడి యున్నవి:

"సింగయమాధవక్షితిపాలమంత్రి
పుంగవుం డై యొప్పు పోతరాజునకు
అనుజాతుఁడగు నయ్యమామాత్య కూర్మి
తనయుఁడుత్తముఁడు గౌతమగోత్రజుండు
భ్రమరాంబికావరప్రాప్త విచిత్ర
విమలసాహిత్యప్రవీణాధికుండు
నఘచిత్తుఁడు గౌరనాహ్వాయఖ్యాతు."

మఱియు గౌరన తాను నవనాథచరిత్రను రచించుటకుఁ గారణము నిట్లు చెప్పియున్నాఁడు:

---

* "ఎల్లమంత్రి" యని ముద్రితగ్రంథపాఠము.

"ఘనముక్తి శాంతభిక్షా రాయ బిరుదుఁ
డనుపంమ్బై న మహో వై భవంబు
దనర విచిత్రవితానరమ్యమును
కనదుదంచిత హేమకలశభాసురము

* * *

భాసిల్లు నిజసభాభవనంబునందు
శ్రీసముజ్జ్వలరత్న సింహాసనమున

* * *

గొలువుండి బహుకథాగోష్ఠి విశేష
ములు.....
నవిరళ యోగవిద్యాధికుఁ తై న
నవనాథవరుల పుణ్యప్రవర్తనలు
పరఁగ శ్రీగిరికవి పద్యబంధముల
విరచించినాఁ డది ద్వీపదకావ్యమునఁ

జెప్పింపవలయుఁ బ్రసిద్ధి పెంపలర
నిప్పుడు గల సుకవీంద్రులలోన

* * *

ననఘచిత్తుని గౌరనాహ్వాయఖ్యాతుఁ
దన సముఖమునకుఁ దగఁబిలిపించి

* * *

మన్నించి మా కొక్క మధురమై వెలయు
కావ్యంబుగాఁ జెప్పి కమలజవిష్ణు
సేవ్యమాను నకును శ్రీశై లపతికి
శంకరునకు బాలశశిశేఖరునకు
నంకితం బొనరింపు మనుచు కర్పూర
పూరితంబై వ తాంబూలంబు లొసఁగె"

వై నుదాహరింపఁబడిన ద్వీపదలవల్ల గౌరన సింగనమాధవుఁ
డను రాజునకు మంత్రియైన పెద్దన పోతరాజునకుఁ దమ్ముఁ డైన

యయ్యమామాత్యుని పుత్రుఁడనియు, ముక్తిశాంతభిక్షారాయఁడను శైవమతాధిపతి ప్రోత్సాహముచేత శ్రీగిరియను కవి యంతకు ముందు పద్యప్రబంధముగఁ జేసిన నవనాథచరిత్రమును ద్విపద కావ్యముగఁ జేసి శ్రీశైల మల్లికార్జునస్వామి కంకితమిచ్చెననియుఁ దెలియుచున్నది.

(2)

మొదట ఈశ్రీగిరికవినిగూర్చి యొకమాట. ఇతఁడెవ్వరో నిర్ణయించుటకుఁ దగినయాధారములు లేవు. ఇతని గ్రంథము నామమాత్రావశిష్టమైనది. మఱియు దాని నే లక్షణగ్రంథకర్తయుఁ బేర్కొనలేదు. సంకలన గ్రంథములలో నొక శ్రీగిరన్న శ్రీరంగ మాహాత్మ్యములోని పద్యములు గానవచ్చుచున్నవి. శ్రీరంగ మాహాత్మ్యము వైష్ణవగ్రంథ మగుటచే నితఁడు పద్యననవనాథ చరిత్రకర్తకాఁడని కొందఱనుచున్నారు. ఇది యంతగఁ బరిగణింపఁ దగిన యంశముకాదు. కాని శ్రీగిరన్న యెప్పటివాఁడో తెలియదు. కావున గౌరనకాలము శ్రీగిఁన్న మూలమున నిర్ణయించుటకు వీలు కాదు. కృష్ణామండలాంతర్గతమగు మోగల్లు గ్రామభీమేశ్వరాలయ ములోని శిలాశాసనములం దొక శ్రీగిరికవి పేర్కొనఁబడియున్నాఁడు.1 ఇందొకటి శా.శ. 1237 వ సంవత్సరమునాఁటిది. రెండవదానిలోఁ గాలము చెప్పియుండలేదు. మొదటిదానిలో నత్తిలి పోతిరెడ్డియను నతఁడు ప్రమథకవి సిరిగిరి అయ్యంగారి కిచ్చిన భూదానము వర్ణింపఁ బడియున్నది. రెండవదానియం దనవేమారెడ్డిగారు ప్రమథకవి సిరిగిరి దేవయ్యంగారికిఁ జేసిన భూదానము వివరింపఁబడియున్నది. ఈ భూ దాన మొసఁగిన వదాన్యుఁడు క్రీ.శ. 1330 మొదలుకొని 1354 వఱకును అద్దంకి కొండవీటిపురములు నిజరాజధానులుగా తూర్పు సముద్రతీరాంధ్రదేశము నేలిన ప్రోలయ వేమారెడ్డిగాని యన్యుఁడు గాఁడు. కావున నీ సిరిగిరి కవి కాకతీయరెడ్డియుగద్వ్యయసంధియం దుండె ననుట తెల్లము. ప్రమథ కవియను బిరుదునుబట్టిచూడ నీతఁ

1. Madras Ep Coll, 753, 754 of 1920.

డేదో ప్రఖ్యాత శైవప్రబంధమును రచించినట్లు తోచుచున్నది. ఇతఁడే పద్యనవనాథ చరిత్రకర్త యైయుండవచ్చును. ఈయూహ సరియైన పక్షమున గౌరన క్రీ. శ. 1315 నకుఁ దరువాతివాఁడని నిశ్చయించి చెప్పవచ్చును.

తరువాత ముక్తిశాంత భిక్షారాయని గూర్చి యించుక చెప్ప వలసియున్నది. ఇతని యానవాలు పట్టుట సులభసాధ్యముగాదు. "ముక్తి శాంత భిక్షారాయఁ" డనునది యొక ప్రత్యేక వ్యక్తిసూచక నామధేయముగాదు; శ్రీశైల భిక్షావృత్తి మఠాచార్యుల బిరుదము. బ్ర.శ్రీ. కోరాడ రామకృష్ణయ్య గారు తమచేఁ బోషకరింపఁబడి మద్రాసు విశ్వవిద్యాలయమువారిచేఁ బ్రకటింపఁబడిన నవనాథ చరిత్రపీఠికలో నితని నిట్లు గుర్తించియున్నారుఃఁ

"మఱియు శ్రీనాథునిచే శివరాత్రిమాహాత్మ్యమును దన భృత్యుఁడగు ముమ్మడిశాంతయ్యకుఁ గృతియిప్పించిన శ్రీశైల జంగమ మఠాధీశ్వరుఁడగుశాంత భిక్షావృత్తిరాయఁడే గౌరనచే నవనాథచరిత్రమును మల్లికార్జును పేరఁ గృతిగాఁ జెప్పించుటచేత నీ గౌరనయు శ్రీనాథుని కాలమువాఁడే యని విస్పష్టంబగు చున్నది."*

గౌరనయు, శ్రీనాథు డును సమకాలికులు గావచ్చును. కాని "ముక్తి శాంత భిక్షారాయ" బిరుదమూలమున పీరి సమకాలికతను స్థాపించి దాని నాధారపఱచుకొని గౌరనయొక్క కాలమును నిర్ణయించుట సాధ్యముగాదు. శివరాత్రిమాహాత్మ్య నవనాథచరిత్ర లందు పేర్కొనఁబడిన ముక్తిశాంత భిక్షారాయ లొక్కరుగాక భిన్న వ్యక్తులు గావచ్చును, వీరొక్కరే యని రుజువుపఱచలేకపోయినచో శ్రీనాథ గౌరనల సమకాలికతను, దన్మూలమున గౌరనకాలమును నిర్ణయించుటకు సాధ్యముగాదు.

---

* మదారీసు విశ్వవిద్యాలయమువారి నవనాథచరిత్రపీఠి , పుట 6.

(3)

ఇక సింగనమాధవుఁ డెవ్వఁడో, అతని కాల మెద్ది యో కనుఁ గొనవలసియున్నది. గౌరనయే తన లక్షణదీపికలో నితని గుర్తించుట కొక మార్గమును జూపియున్నాఁడు:

"అస్తి ప్రశస్తావనిపాలమౌళి
రత్నావళీ రంజితపాదపీఠః,
రేచర్ల వంశాంబుధి పూర్ణచంద్రో
మహాబల స్సింగయమాధవేంద్రః"

అని సింగయమాధవుఁడు రేచర్ల వంశసంజాతుఁడని తెలియఁ బఱచినాఁడు. రేచర్లవారు పద్మనాయకులు. వీరు క్రీ. శ. 14 వ శతాబ్దోత్తరార్ధమునుండి యిప్పటి హైదరాబాదు రాజ్యములోని రాజుకొండ దేవరకొండ దుర్గములను రాజధానులుగఁ జేసికొని తెలింగాణమును కొంతకాలమేలిరి. రేచర వంశమున సిదఱు సింగయ మాధవేంద్రులు గానవచ్చు చుండుటచే (1. దాచయసింగన పుత్రుఁడగు మాధవుఁడు. 2. అనపోతయ సింగన పుత్రుఁడగు మాధవుఁడు.) వారిలో గౌరన పేర్కొనిన సింగనమాధవుఁ డెవ్వఁడో కనుఁగొనుట సులభమైన పనికాదు. కాని గౌరన చెప్పిన సింగనమాధవునికి పెద్దన పోతురాజు మంత్రియని తెలియుచుండుటచేత నీయిద్దఱిలో నెవ్వరి కొలువున పెద్దనపోతురాజుండెనో కనుఁగొనఁగలిగిన పక్షమున నతని నాసవాలుపట్టవచు ను. ఈ యంశమును నిర్ధారణ సేయుటయందు పెలుగోటివారి వంశచరిత్ర కొంత తోడుపడుచున్నది. ఈ వంశచరిత్ర కనుబంధముగ ముద్రితమైన శిలాశాసనముల యం దొకదానిలో సింగనమాధవుఁడును, నతని మంత్రియగు పెద్దన పోతురాజును బేర్కొనఁబడియున్నా రని వీరేశలింగం పంతులుగారు కనుఁగొనిరి.1 సదరు శాసనము శ్రీశైలోత్తరద్వారమైన ఉమామహేశ్వరములో

---

1 ఆం: వు చరిత్రము. ప్రథమభాగము. పుట 594.

దేవస్థాన సమీపమున నున్నది. ఇందు "దాచయసింగభూపతిసుతుం డైన....శ్రీమాధవేంద్రుఁడు....శ్రీపర్వతో త్తరద్వారమైన మహేశ్వర దేవరమంటపము మహచ్ఛిలా సమూహనను రమ్యముగా రచియిం పించె" నని చెప్పియున్నది. ఇతనికడనే పెద్దనపోతురాజు మంత్రియై నట్లు ఈశాసనమున కలదు.

"శ్రీమతో మాధవేంద్రస్య
రాజ్యాంగైక ధురంధరః,
మంత్రీ పోతన నామాసీ
త్సర్వశాస్త్ర విశారదః.

యస్యామాత్యశిఖామణేః కవివర
స్తోత్రైక పాత్రీకృతాం
మత్వా వాక్పతి రిద్ధనీతి సుభగాం
వాగ్వైఖరీం లజ్జతే,
సోయం పెద్దనమంత్రివర్యతనయః
శ్రీ పోతరాజో న్వహం
దేవస్యాస్య మహోపకార రచనాం
సమ్యఙ్ముదాచీకరత్" 2

ఈశాసనమున వర్ణింప బడిన "మాధవ క్షితిపాలుఁడు బేతాళ రెడ్డి కెనిమిదవతరము. వాఁడయిన రావుసింగయ మాధవనృపాలుఁ డని తేటపడుచున్నది" అని వీరేశలింగం పంతులుగారు సిద్ధాంతీక రించి, క్రీ. శ. 1427 లో నీరావ్రమాధవనృపాలుఁడు రామాయణ మునకు వ్యాఖ్యానము వ్రాసినట్లు క్రీ. శ. 1429 నాఁటి యొక శిలా శాసనమునఁ 3 జెప్పఁబడియుండుటచేత నతని మంత్రియు నప్పటి

---

2 వెలుగోటివారి వంశచరిత్రము (అనుబంధము), పుటలు 31-36.

3 వెలుగోటివారి వంశచరిత్రము (అనుబంధము), పుట 45.

వాఁడే యనియు, నా మంత్రియొక్క తమ్ముని కుమారుఁ డగు గౌరనకవి 1440-50 సంవత్సరముల ప్రాంతములం దుండి యుండ వలె ననియుఁ దీర్మానించిరి.4

ఇది పొరపాటు: హరిశ్చంద్రోపాఖ్యాన నవనాథ చరిత్రాది గ్రంథములయందుఁ బేర్కొనఁబడిన సింగనమాధవుఁడు రావు సింగయ మాధవుఁడు గాఁడు. సింగనమాధవుఁడు దాచయమనుమఁడు; రావు సింగయ మాధవుఁడు పైఁజెప్పిన దాచయమనుమఁడును, సింగన మాధవుని యన్నయు నగు ననపోతనాయని మనుమఁడు. మఱియు, పెద్దన పోతరాజు సింగనమాధవుని మంత్రియే కాని, రావు సింగయ భూపాలుని మంత్రి కాఁడు. ఉమామహేశ్వర నాగరశాసనము లీవిష యములను దెల్లము సేయుచున్నవి. సింగనమాధవుని కాలమును ఉమా మహేశ్వర శాసనము స్పష్టముగఁ దెలుపుచుండఁగా దానిని వదలి వీరేశలింగం పంతులుగారు నాగరశాసనమతో నితని నేల ముడి పెట్టిరో దుర్గ్రహ్యముగ నున్నది. సింగనమాధవుఁడును, నతని మంత్రియగు పెద్దన పోతరాజును శా. శ. 1298 వ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. 1376 లో నుండిరని యుమామహేశ్వర శాసనము నందలి-

"దంత్యంకార్క-శకాబ్దశాలిని శివే
వహ్నే నలే ఫాల్గునే
మాసే దాచయసింగభూపతిసుతః
శ్రీ మాధవో భూధవః,
శైలస్యోత్తరతోరణే భువి మహా
శస్యాలయం నూతనం
పాషాణై స్సుదృఢం సురాసురమతం
రమ్యం ముదాచీకరత్"

---

4 ఆంధ్రకవుల చరిత్రము, ప్రథమభాగము, పుట 595.

అను శ్లోకము విదితము చేయుచున్నది. మఱియు శాసనాం తమునఁబెద్దన పోతురాజు వ్రాలుగానవచ్చుచున్నవి: "ఈశాసనము వ్రాయింపవచ్చి వంగూరి తిప్పయభట్లు దేవతాస్తుతిగాను జెక్కిన శ్లోకాలు ఈరెండును. శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు కొడుకు పోతురాజువ్రాలు."

ఇఁక సింగన మాధవుఁడును, నతని మంత్రియగు పెద్దనపోతు రాజును క్రీ.శ. 1376 వ సంవత్సర ప్రాంతమున నుండి ఁదనుట నిస్సం శయము గదా; పోతరాజు తమ్ముఁడగు నయ్యమంత్రియు నప్పటివాఁ డనుట నిశ్చయముగదా. అయ్యమంత్రి కుమారుఁడును, హరిశ్చంద్రో పాఖ్యాన నవనాథచరిత్రలకర్త్తయు నగు గౌరన క్రీ. శ . 1390. 1400 ల ప్రాంతమున గ్రంథరచనకుఁ గడంగెనని యూహించ వచ్చును. అతఁడు క్రీ. శ. 14 వ శతాబ్దాంతమువాఁ డగునుగాని. వీరేశలింగం పంతులుగారు చెప్పినట్లు 15 వ శతాబ్ది మధ్యకాలము వాఁడు గాఁజాలఁడు.

వాఙ్మయ వ్యాసమంజరి

కవిసార్వభౌముఁడు—కనకాభిషేకము

సర్వజ్ఞ సింగభూపాలసందర్శనలాలసుఁడై తత్సభాంతరాళంబుఁ
జొర నుద్యోగించు కవిసార్వభౌముఁడు శారదాంబ నీ క్రింది
రీతిని స్తోత్రముజేసెనని వెలుగోటివారి వంశావళియందుఁ జెప్పఁబడి
యున్నది.

సీ. దీనారటంకాలఁ దీర్థమూడించితి దక్షిణాధీశు ముత్యాలశాలఁ
బగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్క
చంద్రభూషక్రియాశక్తి రాయలకడ బాదుకొల్పితి సార్వభౌమబిరుదు
పలుకుతోడై తాంధ్రభాషామహాకావ్యనైషధగ్రంథ సందర్భమునను

గీ. ఎటుల మెప్పించెదో నన్ను నింకమీఁద, రావుసి గమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు, సకలసద్గుణనికురంబశారదాఁబ

ఈపద్యము శ్రీనాథుని జీవితచరిత్రయందలి ముఖ్యఘట్టములను గొన్నింటిని సూచించుచున్నది. అవియెవ్వియన: 1. దక్షిణాధీశుని ముత్యాలశాలయందు కనకాభిషేకము. 2. గౌడడిండిమభట్టుతోడి వివాదము. 3. చంద్రభూషణ క్రియాశక్తి యొక్కయు, రాయల యొక్కయు సముఖమున సార్వభౌమబిరుదస్థాపన. 4. నైషధరచన. 5. సర్వజ్ఞసింగభూపతిదర్శనము. ఇందుఁబేర్కొనఁబడిన దక్షిణాధీశాదు లెవ్వరో, వారికి శ్రీనాథకవిసార్వభౌమునితోడి సంపర్కమెట్లు కలిగెనో విచారించవలసిన యవసరము కొంతకలదు.

1. దక్షిణాధీశుఁడు—తనయొక్క కనకాభిషేకమునుగూర్చి యితరత్ర శ్రీనాథుఁడిట్లు ప్రశంసించుకొనియున్నాఁడు. కాశీఖండమున, 'కర్ణాటక్షితిపాలమౌక్తికసభాగారాంతరాకల్పిత। స్వర్ణస్నాన జగత్ప్రసిద్ధకవిరాట్సంస్తుత్యచారిత్ర!'యని దక్షిణాధీశుఁడు కర్ణాటక్షితి పాలుఁడని నిరూపించినాఁడు. మఱియు, 'జననాథోత్తమదేవరాయ నృపతీ,' 'లక్షణోపేంద్ర ప్రౌఢరాయక్షితీంద్ర' యను చాటువులయం దా కర్ణాటక్షితిపాలుఁడే ప్రౌఢదేవరాయలని పేర్కొనియున్నాఁడు. కాని ఈ ప్రౌఢదేవరాయ లేప్రౌఢదేవరాయలో తెల్పలేదు. తెల్ప కున్న నేమి? ఆధునిక వాఙ్మయచరిత్రకారు లాతఁడు క్రీ. శ. 1422 మొదలు 1446 వఱకు విజయనగరమును పరిపాలించిన ఇమ్మడి ప్రౌఢదేవరాయలని నిశ్చయించిరి. ఈ సిద్ధాంత మంగీకార్యము కాదు. విజయనగరమును పాలించినరాజులలో ప్రౌఢదేవరాయలను పేరు నలుగురికి గలదు.

1. క్రీ. శ. 1406 మొదలు 1422 వఱకు ప్రభుత్వముసల్పిన మొదటి దేవరాయులు. కొన్ని శాసనము లీతనిఁ బ్రౌఢదేవరాయ లనియుఁ బేర్కొనుచున్నవి.

2. క్రీ. శ. 1422 మొదలు 1446 వఱకు రాజ్యముజేసిన ఇమ్మడిదేవరాయలు. ఇతనినే ఆధునికచరిత్రకారులందఱును సామాన్య ముగఁ బ్రౌఢదేవరాయలని చెప్పుదురు.

3. క్రీ. శ. 1448 మొదలు 1464 వఱకు నేలిన మల్లికార్జున రాయలు. ఇతఁడు తనకు ముమ్మడిప్రౌఢదేవరాయలను నామాంతర ముండినట్లు పెక్కుశాసనములఁ జెప్పుకొనియున్నాఁడు.

4. వీరుగాక ఇమ్మడి విరూపాక్షరాయల కుమారుఁడు ప్రౌఢ దేవరాయ లొకఁడు గలఁడు. ఇతఁడు క్రీ. శ. 1485 ప్రాంతముల విజయనగరమున కొంతకాలము దొరతనమొనర్చెను.

ఇట్లు ప్రౌఢదేవరాయనామాంకితులగు రాజులు నలుగురుండిరి. వీరిలోఁ గడపటి యిద్దరు శ్రీనాథునికిఁ దరువాతివారు. కాని మొదటి

వారిద్దరు సమకాలికులే. వీరిరువురియందు శ్రీనాథునికిఁ గనకాభిషేక మొనర్చిన ప్రౌఢదేవరాయ లెవ్వరో నిశ్చయించి చెప్పుటకుఁ దగు నాధారములు లేవు.

2. ఇఁక గౌడడిండిమభట్టుమూలమున శ్రీనాథునికిఁ గనకాభిషేక మొనర్చిన ప్రౌఢరాయలను గనుగొన వీలగునో చూతము. "డిండిమభట్టు" అనునది పేరుకాదు; అది యొక బిరుదు. ఈబిరుదుగల కవులనేకులు గలరు. వీరందఱును నొకకుటుంబమునకుఁ జెందిన వారే. విద్యానగరచక్రవర్తుల యాదరమునకు పాత్రులై, వారి యాస్థానమున కవీశ్వరులై కీర్తిని గడించిరి.

ఇందు ప్రథమమున డిండిమభట్ట బిరుదును వహించిన వాఁడు సోమవల్లీయోగానంచప్రహసనకర్త యగు నరుణగిరినాథునియొక్క మాతామహుఁడు. ఇతనిపిమ్మట పై బిరుదును అరుణగిరినాథుఁడు ధరించెను. అరుణగిరినాథుని యనంతరము ఆతనిసంతతివారు డిండిమ బిరుదాంకితులైరి. సాళువాభ్యుదయ రచయిత యగు రెండవ రాజనాథుఁడును, వీరభద్రవిజయకర్త యగు రెండవ యరుణగిరినాథుఁడును, అచ్యుతరాయాభ్యుదయకర్త యగు మూఁడవ రాజనాథుఁడును దామ డిండిమభట్టారకులనుని చెప్పుకొనిరి. వీరియందు మొఁటియిద్దరే శ్రీనాథుని కాలము వారనఁదగినవారు. మొదటి డిండిమప్రభువు వేదాంతదేశికుల ప్రత్యర్థియనియు, రెండవవాఁడగు మొదటియరుణగిరినాథుఁడే శ్రీనాథుని ప్రత్యర్థియనియు శ్రీప్రభాకరశాస్త్రులవారభిప్రాయపడుచున్నారు. ఈయభిప్రాయము శ్రీనాథునికిఁ గనకాభిషేక మొనర్చిన ప్రౌఢదేవరాయఁడు ఇమ్మడిప్రౌఢదేవరాయలే యను నూహపై యాధారపడియున్నది. కనకాభిషేక మొనర్చిన ప్రౌఢదేవరాయ లెవ్వరో నిశ్చయమైనఁగాని శ్రీనాథుని ప్రత్యర్థియగు డిండిమభట్టును గనుగొన సాధ్యముగాదు.

3. చంద్రభూపక్రియాశక్తి యొక్కయు రాయలయొక్కయు సముఖమున సార్వభౌమబిరుదును బాదుకొల్పితి ననెను గదా

శ్రీనాథుఁడు. ఈచంద్రభూష క్రియాశక్తియెవ్వరు? రాయలెవ్వరు? వీరిమూలమున శ్రీనాథునికిఁ గనకాభిషేకమొసర్చిన ప్రౌఢదేవరాయని పోలిక నెఱుఁగ వీలగునో చూతము. క్రియాశక్తులు శైవమత గురువులు. వీరు సంగమవంశీయులగు విద్యానగర చక్రవర్తులకు గురువులై యుండిరి. ఈ గురుపరంపరకు జెందినవారిలో చంద్రభూష క్రియాశక్తియొకఁడు. ఇతఁడు క్రీస్తుశకము 14 వ శతాబ్దియొక్క యుత్తరార్ధమున నుండెను.

ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమున మెకంజీగ్రంథ పరంపరలో*చంద్రభూషణ క్రియాశక్తియొడయలకు రాయదత్తభూదాన మును దెల్పు తామ్రపట్టికయొక్క ప్రతియొకటి కలదు. దానిమూలమున చంద్రభూషణాచార్యుల కాలమును శ్రీనాథడిండిముల వివాదకాలమును సువిదితము కాగలదు. ఆశాసనమునుగూర్చి మెకంజీ పుస్తకమున నిట్లుకలదు.

"ములికినాటిసీమలోకి అడుకువ అయివుండేటి పాపఘ్నితీరమందలి కొండూరాభిధాన గ్రామముకు దేవేశపురమనే నామనిర్దేశము చేసి చంద్రభూషణాచార్యులవారికి సహిరణ్యోదకదానధారాపూర్వకంగాను సర్వాగ్రహారంగా దత్తంచేసిన శాలివాహనశకం 1293 అగునేటి సాధారణనామసంవత్సర శ్రావణ బ॥ 14 సోమవారము తామ్రశాసనం నాగరలిపితో వ్రాయించి వరాహముద్రతో కూడా కూర్చియిచ్చినారు.

"గనుక ఆచంద్రభూషణాచార్యులవారు తమగురువు లయినట్టి క్రియాశక్తిఅయ్యవార్లకు ప్రీతిగాను కొండూరుప్రతినామమైన దేవేశపురానను యాబైరెండు వృత్తులు యేర్పరచి బ్రాహ్మణులకు నిష్కరుషచేసి ఆప్రకారము వృత్తిదార్లు గ్రామంలో నివేశనాలు యేర్పరచుకొని అగ్రహారం ప్రబలంచేసుక అనుభవిస్తూవుండిరి.

---

* Mac Mss. 15-3-56 pp. 44-55.

రాయదత్తంఅయిన తామ్రశాసనము హోలిస్థలములో హాజరు లేనందున అన్యస్థలమందు జాగ్రతచేసివున్న దనిన్ని చెప్పినందున అందుల నకలుగా అగ్రహారికులయిన రాయపెద్ది కృష్ణశాస్త్రులమొద లయినవారివద్ద కాగితముపైన లిఖించివున్న దానినకలు:

శ్రీసాంబశివాయ నమః.

నమస్తుంగశిరశ్చుంబిచంద్రచామరచారవే,
త్రైలోక్యనగ రారంభమూల స్తంభాయ శంభవే. 1

శుండోద్దండముఖేన ఖండపరశోః పిఙ్గజటామండితం
గంగాతుంగతరంగ మౌళివిహరచ్చంద్రాంశుజాలం జలం,
ఆసించ పరివారదేవనివహానానందభద్రాంజలీన్
హైరంబశ్శుభమాతనోతు భవతాం కౌమారకేళీపరః. 2

ఆనందయన్ సదాసన్నాన్ ద్విజాళీనే దానధారయా,
దంతావళముఖో దద్యాచ్ఛ్రియసాం వః పరంపరామ్. 3

మధ్యోల్లాసిత హైమశైలకలశం నీలోత్పలశ్యామలం
పర్యంతాంబుధివీచిపల్లవపటం ఫేనాళిముక్తాఫలం,
దంష్ట్రాదండముఖేన యః ప్రవితతం విశ్వంభరామండలం
చిత్రచ్ఛత్రమివాదధత్స భగవాన్ దృష్టశ్చిరం పాతు వః. 4

ధ్యానోన్మీళితఫాలలోచనమిళత్ పక్ష్మాంతరాళో ల్లస
జ్జ్యోతిర్జాతతటిత్పిశంగితపటత్వంగ ద్భుజంగ ప్రజః,
ఫుల్లద్దల్లకమల్లికాగుణసుహృద్గంగాతరంగావళీ
ఖేలచ్చంద్రకళా చిరం దదతు వః శ్రేయో జటా ధూర్జటేః. 5

మరీచిర్బ్రహ్మణః పూర్వం బ్రహ్మణః కస్యపోఽజని,
జగత్పితామహో యస్య సాక్షాదేవ పితామహాః. 6

యం నప్తారం ఋషిం దృష్ట్వా సృజంతం వివిధాః ప్రజాః,
విశ్రాన్తమానసో బ్రహ్మా బ్రహ్మర్షినపరో భవత్. 7

తదన్వయే సముత్పన్నా బ్రహ్మణ్యా బ్రహ్మవాదినః,
యజ్వాన స్సర్వయజుషాం దృష్టాన్తాదృష్టిపావనాః. 8

యేషామాచార్యవర్యాణాం మందిరేషు నిరంతరం,
అధ్యేష్ట స్థిరతాం లక్ష్మీరదర్పం చ సరస్వతీ. 9

సదాచారేషు సార్వజ్ఞ్యం దానేషు ధనసంపదః,
అదృశ్యంత పరం యేషాం దిగంతేషు చ కీర్తయః. 10

రేఖామత్స్యాంకచరణాః పంకజాంకితపాణయః,
యద్వంశ్యా శిశవో ద్వైవ సగౌరవమధీషికాః. 11

తేషాం మహోన్నతే వంశే సంజాతో రాజభూషణః,
సువృత్తో రుచిరః కశ్చి న్ముక్తామణిరివ ద్విజః. 12

సర్వజ్ఞతా మనితరాస్పద మీశ్వరత్వం లోకోత్తరం సుచరితం జితమన్మథత్వం
ఆశుప్రసాదమపి సత్ఫలదం విలోక్య యం చంద్రభూషణమితిప్రవదన్తిలోకాః.

దృష్ట్యా శ్రుత్యంతగామిన్యా స్ఫురన్నిర్మలతారయా
చైన్యపాశాభివిస్రంసం విధత్తే యశ్చిదాత్మకః. 14

యద్వైరిగంధగజసంఘదురాసదాయాం సామంతమౌళిపదనర్తితవేత్రయష్ట్యాం
ద్వీపాంతరోపనతభూరిత మోపదాయా దౌవారికీవ ఖలు రాజతి రాజలక్ష్మీః
ప్రదీయమానాని మహాంతి యేన దానాని సంఖ్యాతుమనావిధాతా.

యాన్యంతరిక్షే కతిని పృషంతి? విన్యస్తవాఁ పశ్యత తారకాస్తాః. 16
విశ్వం విస్మయతే యస్య గుణగ్రామే ప్రతిక్షణం,
స సర్వజ్ఞక్రియాశక్తి రాత్మా యస్య తపోమయః.
సకృద్దేవర్షిభి స్సాకమకరోద్ఋణినః పిత్ర్యాన్.
.... 18

పుత్రేష్వనేకేష్వపి పుత్రకీర్తిం పూతేన పుత్రేణ స తేన ధత్తే.
ఖనిర్వజేశాగ్రత? కాస్తుభేన రత్నాకరాఖ్యాం గమితః పయోధిః. 19

ప్రత్యక్షమాలంబనమాగమానాం విశ్వోపకారైకనిధానమూర్తిం,
బ్రహ్మేవ శంభుం యమవాప్యసోయం కృతార్థమాత్మానమమంస్త ధీరః20

తతో విచారవిరసాన్ విషయానప్యమానుషాన్,
విధూయ సగుణప్రాజ్యే తపోరాజ్యే స రాజతి. 21

యత్రశ్రీః పరిచారికా మదగజాః పార్శ్వేచరంతోమృగాః
పార్శ్వసాదోవ్యలజం? మనోరథఫలై రాతిథ్యసంభావనా,
తత్పుష్యతి చందర్భిభూషణమునిర్బర్హిష్మాకతానం తపో
వైరాగ్యం హి జగచ్ఛరణ్యవిహితం సౌభాగ్యమాలంబతే. 22

స్వస్తి సమస్తవస్తువిస్తీర్ణవసుమతీవలయవిరాజమానదక్షిణవా
రాణసీ స్వయంభూత్రియంబక శ్రీపాదపద్మారాధక సకలశిష్యభవ

పాశవిభేదకో నిఖలశై వాగమజ్ఞానశోధక శ్చతుర్విధముక్తి సాధకోష్ట విధభక్తి వేదకో వస్తుకవివి స్తీర్ణ కవికర్ణాభరణః సంస్కృతకవికాళి దాసః ప్రాకృతకవిప్రవరసేనః షడ్భాషాకవిచక్రవర్తి వాదీంద్రో వాది ప్రశమకమహోభై రవః కర్ణాటకకవికటకలుంటాకో వర్త మానకవిపితా మహః బల్లాణరాయమస్తకశూలో యాదవరాయప్రతిపాచార్య ఆచార్యవర్యసతతసంపాదిత విద్వజ్జనకార్యభంగరాహుత్త రాయః శ్రీ క్రియాశక్తి శిష్యప్రశిష్యః కాశ్యపగోత్రపవిత్రీకృతః--డాగావి (రి) కకులోద్భవః సకలలోక ప్రసిద్ధేత్యాది బిరుదపద్దె రుపగీయమానః తస్య శ్రీమచ్చంద్రభూషణాచార్యస్య చరణసరసిజరజఃపరమాణుగణనమా సామ్రాజ్య సంగమక్షితిపాలక్షీరపారావారచంద్రమాః రాజాధిరాజో మహారాజపరమేశ్వర శ్రీమన్మహామండలేశ్వర శ్రీవీరబుక్క భూపాలః సరత్నాకర మేఖలాం ప్రతిపాలయత్యుర్వీమంతఃపురవధూమివ. స కదాచిత్ దిగంతసామంతసీమంతినీసీమంతవిశ్రాంతసాంద్ర సింధూర సౌందర్యసంధాయినీభిర్నిజతురగవరముఖరఖురముఖదళిత ధరాతల రజోరాజిభిఃరాజభిః తేజోభిరుత్తరపణం ప్రతి సేవాసమయరత్నోపద ప్రదానయుత సమయైర్భక్తిమాసంబంధబంధుభిః సింధుభిః కృతసంధిభిః ।పచండ దండయాత్రాతో భి నివృత్య శిఖామణి మరీచి మంజరీ సమ ర్చిత చరణాయ చంద్రభూషణాచార్యాయ రిపుబలామ్యు(?)సమున్మూలన నిజభుజశమం విజయమహోత్సవం కరాంజలిచులికితేన పరరాజమకు టముద్రాఘటా నికరకాంతిసలిలేనసమర్పితవాన్॥ కించ। చంద్రభూష ణాచార్యపదపంకజయోఃతదా గ్రామం కొండూరునామానం బుక్క క్ష్మాపతిరర్పయత్। అథ నిజతపోరాజ్యే జగత్తేమంకరే జాగ్రతి తదా కలికాలేఽకసప్తత్యధిక ద్విశతాధికసహస్రాబ్దపరిమితే గతే సంవత్సరే పర్యాయస్య ద్వావింశత్యావర్తే సాధారణనామసంవత్సరే వర్తమానే శ్రావణమాసే కృష్ణపక్షే చతుర్దశ్యా మిందువాసరే యతీంద్రస్య క్రియాశక్తిగురోఃపర్వణే తస్యేదం ప్రీతయేశ్రీచంద్రభూషణాచార్యో ద్వీపంచాశద్భాగపరికల్పితం నిధినిక్షేపజలపాషాణ అక్షీణ్యాగామి సిద్ధసాధ్యరూపాష్టవిధభోగజుష్టం మురికినాడుమండలమధ్యవర్తి సంప్ర సాదిత చతుస్సీమానం కొండూరునామానం గ్రామం ద్వీపంచాశత్

బ్రాహ్మణేభ్యః ధారాపూర్వకం ప్రాదాత్. శ్రీక్రియాశక్తిగురోః ఏక దేవేశయితి నామైవ తస్యగ్రామస్య దేవేశపురమితి నామకృతవాన్.

* * * * *

శ్రీదేవరాయర వప్పం। శ్రీత్రియంబకహరిహరమహారాయర వప్పం। శ్రీవిరూపాక్ష। శ్రీబుక్కదేవరాయలవారి వరాహముద్ర.

ఈదానశాసనకాల మిట్లు చెప్పబడియున్నది.

అథ నిజతపోరాజ్యే జగత్తేమంకరే జాగ్రతి తదాకలికాలే సప్తత్యధికద్విశతాధిక సహస్రాబ్దపరిమితేగతే సంవత్సరే పర్యాయస్య ద్వావింశత్యావర్తే సాధారణనామసంవత్సరే వర్తమానే శ్రావణ మాసే కృష్ణపక్షే చతుర్దస్యా మిందువాసరే యతీంద్రస్య క్రియా శక్తిగురోః పర్వణే తస్యేదం ప్రితయే శ్రీచంద్రభూషణాచార్యైః.... ప్రాదాత్.

అనగా కలికాలమున 1271 సంవత్సరములు గతించినవెనుక చంద్రభూషణాచార్యులవారి తపోరాజ్యము జరుగుచుండగా క్రియా శక్తియతీంద్రగురునియొక్క 22 ది యగు పర్వదినమునకు సరియైన సాధారణసంవత్సర శ్రావణ బ॥ 14 సోమవారమునాడు ములికినాటి మధ్యస్థితమైన కొండూరుగ్రామము నగ్రహారీకరించి యాచార్యుల వారు బ్రాహ్మణుల కొసఁగిరని తెలియుచున్నది. ఇందు "కలికాలే" యనునది ప్రమాదజనితము. "శకకాలే" యని యుండవలయును. మఱియు శా. శ. 1271 వ సంవత్సరమునకు సరియైన ప్రభవాది వర్షము విరోధిగాని సాధారణకాదు. గుణించిచూచిన సాధారణ సంవత్సరమునకు సరియగు శకవర్షము 1292 అని తెలియవచ్చు చున్నది. కావున చంద్రభూషణాచార్యులు కొండూరు నగ్రహారీక రించి బ్రాహ్మణులకు దానముచేసినది శా. శ. 1292 నకు సరియైన సాధారణ సంవత్సర శ్రావణ బ॥ 14 సోమవారమునాఁడు (19 ఆగస్టు 1370.)

"కలికాలే....పరిమితేగతే పర్యాయస్య సంవత్సరే ద్వావింశత్యావర్తే సాధారణనామసంవత్సరే వర్తమానే యతీంద్రస్య క్రియాశక్తిగురోఃపర్వణే" యనుటవల్ల సాధారణశ్రావణ బ॥ 14 నాడు క్రియాశక్తిగురుని 22వ యబ్దికమని తెల్లమగుచున్నది. శా.శ.1271కి సరియైన విరోధిసంవత్సరమునకును, సాధారణసంవత్సరమునకును మధ్య 22 యేండ్ల యెడముండుటచేతను సాధారణసంవత్సరముతో దేవేశ క్రియాశక్తికి 22 పర్వములు గడచుటచేతను శాసనోక్తమైన శా.శ. 1271వ సంవత్సరము పైఁజెప్పిన క్రియాశక్తి గురువుయొక్క శివ సాయుజ్యసంప్రాప్తి కాలమని తోఁచుచున్నది. ఆసంవత్సరమునసే చంద్రభూషణాచార్యులవారును తపస్సామ్రాజ్యపట్టబద్ధులై యుండవలయును. ఈశాసనము "శ్రీవిరూపాక్ష" యను నరపతిచక్రవర్తుల శ్రీపాలతోను, వరాహలాంఛనముతోను గూడియుండుటచేత బుక్కరాయలవారు చంద్రభూషణాచార్యులవారికి దానముచేసినకాలమును దానోపలబ్ధమైన గ్రామము నగ్రహారీకరించి యాచార్యులవారు బ్రాహ్మణులకొసఁగినకాలమును నొక్కటియే యను నూహ పొడముచున్నది.

ఈశాసనముయొక్కచివర శ్రీవిరూపాక్ష యనుశ్రీపాలతోపాటు, "శ్రీదేవరాయర వప్పం," "శ్రీత్రియంబకవరిహరమహారాయరవప్పం"అను రెండువాక్యములు గానవచ్చుచున్నవి."వప్పం" (ఒప్పం) అనఁగా కన్నడమున సమ్మతియనిభావము. రాయలిచ్చిన దానశాసనమునకు వీరిసమ్మతి యేలనఁగా, దానోపలబ్ధగ్రామమును స్వయ మనుభవింపక చంద్రభూషణాచార్యులు బ్రాహ్మణులకు మరల దానముజేసెను. ఆచార్యులవారు మతవిషయములయందు రాజగురువైనను రాజకీయదృష్టియందు సామాన్యప్రజలయం దొక్కఁడు. కావున అతఁ డొనర్చు ఐహికకార్యములయందు రాజాజ్ఞకు లొంగి రాజశాసనమునకు బద్ధుఁడై ప్రవర్తించవలసి యుండెను. కావున నాతఁ డొనర్చినదాన మాకాలపు కట్టుదిట్టములననుసరించి రాష్ట్రపాలకులసమ్మతిలేక చెల్లుబడి నంద జాలదు;కావుననే యీవరాజ్యపట్ట

భద్రుఁడగు త్రియంబక హరిహరరాయలయొక్కయు, దానోద్దిష్టగ్రామమునకు సంబంధించిన రాష్ట్రమునకుఁ బైయధికారియు నుదయగిరి దుర్గాధ్యక్షుఁడును నగు దేవరాయలయొక్కయు, ననుమతిని బొంద వలసినయావశ్యకత కల్గెను.

ఈశాసనమువల్ల చంద్రభూషణక్రియాశక్తి గురువులు శా. శ. 1271 కి సరియైన క్రీ. శ. 1349 వ సంవత్సరము ఆచార్యపీఠమునధిష్ఠించి, క్రీ.శ. 1371 సంవత్సరమున బుక్కరాయలచే భూదానమునొనెనియు, మఱియు నతఁడారాయలపుత్రుఁడైన హరిహరరాయలకును, మనుమఁడైన దేవరాయలకును సమకాలికుఁడనియు స్థిరమగుచున్నది.

చంద్రభూషణక్రియాశక్తి గురువ్వలకాల మిట్లు సునిశ్చయముగఁ దెలియవచ్చినది. ఇంతవరకు మనకుపలబ్ధమైన చరిత్రాంశములన్నిటినిఁ బరిశీలించిచూడఁగా క్రియాశక్తి గురుపరంపరలో చంద్రభూష (చూడ, లేకశేఖర) నామాంకితుఁడైన యాచార్యుఁ డెవ్వఁడును అటుతరువాత గానరాఁడు. శ్రీనాథడిండిమువాదమునకు మధ్యవర్తియై తీర్పుచెప్పినది చంద్రభూషణక్రియాశక్తియే కావున నావివాదమీయాచార్యులవారి కాలమునసే జరిగియుండవలయును. మఱియు నీవివాదమున శ్రీనాథునకుఁగలిగిన జయమును బ్రకటించుటకై కర్ణాటాధీశ్వరుఁడగు ప్రౌఢదేవరాయ లాతనికిఁ గనకాభిషేకమొనర్చేఁగావున, నది యాదేవరాయలరాజ్యకాలమునసె జరిగెననుట నిస్సంశయము.

ఈ ప్రౌఢదేవరాయ లెవ్వరు? కర్ణాటకమునేలిన నలుగురు ప్రౌఢదేవరాయలలో కడపటియిరువురును శ్రీనాథుని సమకాలికులుగాకపోవుటచే వారిచ్చటననుకూలించరు. మిగిలిన ఇద్దఱిలోను క్రీ. శ. 1422 మొదలు 1446 వఱకును విజయనగరమును పాలించిన ఇమ్మడి ప్రౌఢదేవరాయఁడు శ్రీనాథునిసమకాలికుఁడయ్యును నీసందర్భమునఁ

దలపెట్టఁదగినవాఁడుగాడు. ఏలన, క్రీ. శ. 1349 వ సంవత్సరమున క్రియాశక్తిగురుపీఠము నధిష్ఠించి యనంతర మిరువదిరెండేండ్లకు, క్రీ. శ. 1371 లో బుక్కరాయలచే భూదానమును వడసిన క్రియాశక్తి చంద్రభూషణాచార్యులు, అటుపిమ్మట నేబదివర్షములకు రాజ్యాభిషేకమొనర్చుకొనిన ఇమ్మడి ప్రౌఢదేవరాయనిరాజ్యకాలమున సజీవుఁడై యుండెననుట నమ్మదగినమాటకాదు. కావున నిఁక మిగిలియుండు ప్రౌఢదేవరాయ లొక్కఁడే. అతఁడు క్రీస్తు 1406 లో గద్దెయెక్కెను. శ్రీనాథవిజయసూచకమగు కనకాభిషేక మాతఁడే యొనర్చియుండవలయును. ఈప్రౌఢదేవరాయరాజ్యాభిషేక మగునప్పటికి, చంద్రభూషణాచార్యులవారి తపోరాజ్యకాలమున (1406-1349 =) 57 వర్షములుగడచి యుండుటచేత నాతఁ డప్పటికిఁ గడువృద్ధుఁడై యుండవలయును. కావున శ్రీనాథడిండిమవాదము మొదటి ప్రౌఢదేవరాయలరాజ్యారంభకాలమున నడిచియుండునని తలఁచుటయెప్పును. ఈప్రౌఢరాయలు విద్యావ్యాసంగపారీణుఁడు. గీర్వాణాంధ్రకవుల కాశ్రయుఁడు. వేమభూపాలీయాదిగ్రంథములను రచియించిన వామనభట్టబాణుఁడు ఉదయగిరియం దీతనియాస్థాన మునగొంతకాలముండెను. మఱియు నుత్తరహరివంశకృతికర్తయగు నాచనసోమునికి ములికినాటిసీమలోని తుడుములదిన్నె యను గ్రామమును నగ్రహారముగ నొసఁగెను. మల్లినాథసూరినిదనయాస్థానమున ధర్మాసనాధికారిఁజేసెను. కావున నతఁడు శ్రీనాథుని విజయమునకు సంతసించి యాతనికిఁ గనకాభిషేక మొనర్చి గౌరవించుట సహజమే.

శ్రీనాథునికిఁ గనకాభిషేకమునొనర్చిన కర్ణాటాధీశుఁ డిమ్మడి ప్రౌఢదేవరాయఁడుగాకున్న, నతనితో వాదమునఁ బరాజితుఁడైన గౌడడిండిమభట్టును, (మొదటి) యరుణ గిరినాథుఁడు గాఁజాలఁడు. ఈయరుణగిరినాథుని మాతామహునికిఁ గూడ "డిండిమభట్ట" బిరుదమొసగలదని వ్రాసియున్నాను. మఱియు నాతఁడు కవియు మహాపండితుఁడునై వేదాంత దేశికులతో వాదమునల్పినట్లు పండితులు చెప్పుదురు. అరుణగిరినాథుఁ డిమ్మడిప్రౌఢదేవరాయులకు సమకా

లీనుఁ డగుటచేత నతని మాతామహుఁడగు ప్రథమడిండిమభట్టు మొదటిప్రౌఢదేవరాయలకాలమున నుండెననుటకు సందేహింపఁ బనిలేదు.

4. నైషధరచన:—"దీనారటుంకాల" యందు వర్ణింపఁబడిన క్రమము ననుసరించి శ్రీనాథుఁడు డిండిమభట్టు నోడించి, చంద్ర భూషణాచార్యులసముఖమునను రాయలసముఖమునను సార్వభౌమ బిరుదును నెలకొల్పిన పిమ్మట నైషధమును రచించినట్లున్నది. కాని నైషధరచన తత్పూర్వమే నడచియుండునని సంశయము కలుగు చున్నది. 1. నైషధమున శ్రీనాథునికి సార్వభౌమబిరుదమున్న ట్లెచ్చటను జెప్పియుండలేదు. 2. దీనికి వెనుకరచించిన హరవిలాస, కాశీఖండములలోఁ "గవితామహారాజ్య భద్రాసనారూఢు" "కవి సార్వభౌమ" యని సార్వభౌమబిరుదప్రస్తావము గానవచ్చుచున్నది. ఈబిరుదును బొందినపిమ్మటనే "దీనారటంకాల" లోఁ జెప్పినట్లు, శ్రీనాథుఁడు నైషధమును రచించియుండిన, నందెచ్చటనేనియు నైపై బిరుదును బేర్కొనియుండడా?

2. ఇంకొకవిషయము నిచ్చటస్మరణకుఁ దెచ్చుకొనవలసి యున్నది. శ్రీనాథడిండిముల వివాదమునుఁ గనకాభిషేకమును, సార్వభౌమబిరుదస్థాపనయును విద్యానగర ప్రభువగు ప్రథమప్రౌఢ దేవరాయలు గద్దెయెక్కిన తరువాత యచిరకాలమునకే జరిగెనని నైపైని దెల్పియున్నాను. ఇంతకుపూర్వమే రచింపఁబడిన హరవిలాస మున శ్రీనాథుఁడు నైషధమును రచించియుంటినని చెప్పి యున్నాఁడు. హరవిలాసరచనాకాలమునుగురించి పండితులు భిన్నాభిప్రాయములు దెలియఁజేసియున్నారు. కీ. శే. కొ. వెం. లక్ష్మణరావుపంతులుగారు "హరవిలాసము 1400 వ సంవత్సర ప్రాంత మున ప్రాయబడియె" ననిరి.[1] "క్రీ. శ, 1430 తర్వాత హరవిలాస

---

1 వ్యాసావళి పుట 23.

రచనము జరిగినట్లేర్పడును." అని ప్రభాకరశాస్త్రిలవారు తీర్మానించిరి.[2] కాని హరవిలాస కృత్యాదిని పరిశీలింపగా నాగ్రంథమును శ్రీనాథుఁడు క్రీ.శ. 1397, 1403 వ సంవత్సరములమధ్య రచియించియుండవలయునని తోఁచుచున్నది. ఇట్టియభిప్రాయముఁ గలుగుటకు గలకారణములను దెల్పుచున్నాను.

హరవిలాసకృతిపతియగు తిప్పయతండ్రియగు నవచిదేవయను గూర్చి యందిట్లున్నది.

క. శ్రీపర్వతసోపాన, స్థాపితుఁ డగు రెడ్డివేమ జగతీపతికిన్
బ్రాపైన యవచి ధీమణి, యాపావాణికి జనించె నభ్యుదయముతోన్. హర. 1. 18

శ్రీశైలసోపాననిర్మాపకుఁ డగురెడ్డివేమ జగతీపతి క్రీ.శ. 1330 మొదలు 1353 వఱకును రాజ్యపాలనమొనర్చెను. అవచిదేవయఁయు నప్పటివాఁడే.

కృతిపతితమ్ముఁడైన తిరుమలనాథసెట్టిని గూర్చి యిట్లు చెప్పియున్నది.

చ. హరిహరరాయ ఫేరొజసహాసురథాణగజాధిపాదిభూ
వరులు నిజప్రభావ మభివర్ణనసేయఁ గుమారగిర్యధీ
శ్వరుని వసంతవైభవము సర్వము నొక్కఁడె నిర్వహించు;మా
తిరుమలనాథసెట్టికిని ధీగుణభట్టికి నెవ్వఁ డీడగున్. 3

ఈపద్యములోఁ దృతీయపాదమునందలి "నిర్వహించు" అను క్రియాపదముపైఁ దృష్టిద్రిప్పిచూడుఁడు; అది వర్తమానకాలమును దెలియఁజేయుచున్నది కావున కృత్యాది రచనకాలమునందు తిరుమలనాథసెట్టి కుమారగిర్యధీశ్వరుని వసంతోత్సవవైభవమును సర్వము

---

2 హరవిలాసపీఠిక. పుట 4.

3 హర. 1. 24.

నడపుచుండెనని తెల్లమగుచున్నది. కుమారగిర్యధీశ్వరుఁడు గ్రంథ రచనాకాలమున సజీవుఁడై యుండెననుట స్పష్టము. కుమారగిర్య ధీశ్వరుఁడు క్రీ. శ. 1385 మొదలు 1403 వఱకును కొండవీట రాజ్యముజేసెను. హరిహరరాయలు క్రీ. శ. 1379 మొదలు 1404 వఱకు విద్యానగరమునను, ఫిరోజసహా క్రీ.శ. 1397 మొదలు 1422 వఱకును గలుబరిగెయందును బ్రభుత్వము సల్పిరి. ఈముగ్గురురాజులును క్రీ. శ. 1398, 1403 వ సంవత్సరము కాలమున రాజ్యము సల్పు చుండినందున, హరవిలాసరచనాకాల మదియే యని చెప్పవలసి యున్నది. క్రీ. శ. 1330-53 ల మధ్య రాజ్యముసల్పిన వేమారెడ్డికిఁ బాపైయుండిన యవచిదేవయకుమారుఁడు క్రీ.శ. 1400 ప్రాంతము లనుండుట సహజమే. ప్రభాకరశాస్త్రులవారు చెప్పినట్లతఁడు క్రీ. శ. 1430 సంవత్సరము వెనుకఁగూడ జీవించియుండి యప్పుడు హరవిలా సమునుఁ గృతినందెనని నేను నమ్మజాలకున్నాఁడను.

క్రీ. శ. 1398-1403 ల మధ్య విరచితమైన హరవిలాసమున నైషధముఁ బేర్కొనఁబడియుండుటచేత నైషధరచన యంతకుపూర్వ మున నడిచెననుట నిస్సందేహము. పెదకోమటి వేమారెడ్డి కొండవీటి రాజ్యమునకు వచ్చినతరువాత "శ్రీనాథుఁడు క్రీ. 1410, 1415 ప్రాంతముల శృంగారనైషధమును రచించెనని నేను నిశ్చయించు చున్నాడను." "శృంగారనైషధము పెద్దకోమటి వేమారెడ్డి రాజ్య మునకు రాకముందే కొమరగిరిరెడ్డి పరిపాలనకాలమునందే రచిత మయ్యెననియు నా వేమారెడ్డినిగూర్చియుఁ దన్మంత్రియగు మామిడి సింగనామాత్యునిఁ గూర్చియుఁ జేయఁబడినవర్ణన మతిశయోక్తి యనియు, వేమారెడ్డి కంతకుఁబూర్వమును గొంతరాజ్య ముండె ననియు నొకవాదమున్నది. దాని నేను విశ్వసింపఁజాలకున్నాఁడను," అని ప్రభాకరశాస్త్రులవారు వ్రాసియున్నారు. కాని యీవాదమున నిజము లేకపోలేదు. ప్రోలయ వేమారెడ్డియన్నయు, పెదకోమటి వేమారెడ్డియొక్క తాతయునగు మాచారెడ్డి ధనదపురమును

త్రిపాంతపట్టణములను నేలుచుండెనని వామనభట్టబాణుఁడు వేమ భూపాలీయమునఁ జెప్పియున్నాఁడు.

తేషాం అనుపమకీర్తిరాదిమో మహాభిమానితయా వాసమండ్డ పికాం వసుధాం ధనదపురప్రభృతీని శాఖానగరాణి కులగిరికూటాని ....భువనభారముద్వహత్.*

మఱియు (బ్రోలయవేముని 'కడగొట్టుతమ్ముఁడైన మల్లా రెడ్డియును నతనియనంతర మతనిసంతతివారును నెల్లూరుమండలాం తర్గతమైన కందుకూరుసీమ నేలుచుండినట్లు శాసనములమూలమున దెలియుచున్నది. ఇట్లే మాచారెడ్డిసంతతివారును నాతనివెనుక ధనద పుర ప్రాంతము నేలుచుండిరని తలంచుట యొప్పును. మఱియు నైషధమందెచ్చటను నద్దంకి కొండవీడుపట్టణముల మాట లేకపోవు టచే పెదకోమటి వేమారెడ్డి యప్పటికింకను రెడ్డిరాజ్యమున కధిపతి కాలేదని తలఁచుట యుక్తము. శృంగారనైషధమున వర్ణించినట్లు మామిడిసింగయ మంత్రిపదవినంది ప్రాభవముగాంచియుండినను, నది పెదకోమటి వేమారెడ్డి కొండవీటిగద్దె యెక్కుటకుపూర్వమే శ్రీనాథుఁ డాగ్రంథమును రచియించియుండునను వాదమునకు నిర్బంధము కాఁజాలదు.

ఈసందర్భమున జ్ఞప్తియందుంచుకొనదగినవిషయము లొండు రెండుగలవు.

1. పెదకోమటి వేమారెడ్డివి దానశాసనములు పెక్కు లబ్ధ మైనవి. ఇవియన్నియు నాతఁడు కొండవీటి రాజ్యమును పాలించు కాలమునఁ జేసినవి. వీనియం దెచ్చటను మామిడి సింగయప్రస్తావము గానరాదు.

2. మఱియు శృంగారనైషధషష్ఠాశ్వాసారంభమున మామిడి సింగయయొక్క గురువు పేర్కొనఁబడియున్నాఁడు.

---

* వేమభూపాలచరిత్ర సంగ్రహమ్ పుట. 28

క. శ్రీగురుశంకరమౌని ద,యాగౌరవనిత్యవర్ధి తాన్వయకరుణా
సాగరవిజయరమైకస, మాగమలీలానుషంగ మామిడిసింగా.

ఈశంకరమౌని యెట్టాప్రెగ్గడకుఁ గూడ గురువే.

ఉ. యామము లెన్మిదింట నియతాకృతిఁ బ్రత్యహమున్ శివార్చనా
రామతయొప్ప నిత్యశివరాత్రివ్రతంబుగఁ బూని భవ్యయో
గామృతతృప్తమైఁ ద్రిజగదర్చితలీలఁ దనర్చు శంకర
స్వామిమునీంద్రు భక్తజనవత్సలు మద్గురు నాశ్రయించెదన్.[1]

ఎట్టాప్రగ్గడ క్రీ. శ. 1350-60 ల మధ్య అనపోతారెడ్డిరాజ్య కాలమున సజీవుఁడైయుండెనని కొన్ని శాసనములవల్ల తెలియుచున్నది.అప్పటి కీతఁడు ముసలివాఁడై యుండవలయును. శంకరస్వామియు నంతవఱకు సజీవుఁడై యుండె ననుకొనినను నాతని రెండవ శిష్యుఁడైన మామిడి సింగయ క్రీ శ. 1400ల తరువాత పెదకోమటి వేమారెడ్డికి మంత్రియై రాజ్యకార్యనిర్వహణము జేయునట్టిస్థితియం దుండెనాయనుసంశయము కలుగుచున్నది. ఏవిషయములనన్నిఁటిని విచారించఁగా శృంగారనైషధరచనాకాలము క్రీ. శ. 1400 లకు పూర్వమై యుండనోపుననుతలంపు కలుగుచున్నది.

5. సర్వజ్ఞసింగభూపతిదర్శనము. శ్రీనాథుని కాలమున సింగ భూపతు లిద్దరుండిరి. ఇద్దఱును రేచర్లవంశజులే. 1. మొదటిసింగ భూపతి క్రీ.శ. 1390 వ సంవత్సరప్రాంతమున నోరుగల్లు రాజకొండ పట్టణములు రాజధానులుగ తెలింగాణము నేలెను. రెండవవాఁడీతని మనుమఁడు. అతఁడు 1425 మొదలు 1450 వఱకు రాజ్యముచేసినట్లు తెలియుచున్నది. ఇరువురకును "సర్వజ్ఞ" బిరుదుకలదు. మొదటి సర్వజ్ఞుఁడు విద్వాంసుఁడు,గ్రంథకర్త, కవిపండితకల్పవృక్షము. కావున శ్రీనాథుఁడు ఎటుల మెప్పించెదోయని సందేహముతో ప్రవేశించిన దతని కొలువు కూటమునే.

---

1 నృసిం. 1 : 11.

చంద్రభూషణ క్రియాశక్తి

'చంద్రభూషక్రియాశక్తి రాయలయొద్ద బాదుకొల్పితి సార్వభౌమ బిరుదు' అని శ్రీనాథుడు చెప్పుకొనియున్నాడు. చంద్రభూష క్రియాశక్తి యెవ్వరు? రాయలెవ్వరు? వారి కడ శ్రీనాథుడు సార్వ భౌమ బిరుదెప్పుడు నెలకొల్పెను? అట్లు పాదుకొల్పిన యవసరమెద్ది? అను విషయములు విచారణీయములు. శ్రీనాథుని చరిత్రను రచియిం చిన వారందఱును పై సీసపాదమునఁ బేర్కొనఁబడిన "రాయలు" క్రీ. శ. 1422 మొదలు 1446 వఱకు విద్యానగరమును పాలించిన ఇమ్మడి దేవరాయలనియు, నితని రాజ్యకాలమునఁనే శ్రీనాథుఁడు విద్యానగరమునకు బోయి యచట రాయలయాస్థానమున చంద్ర భూషణ క్రియాశక్తి సముఖమునఁ గవిసార్వభౌముఁడైన గౌడ డిండిమభట్టు నోడించి రాయలచేఁ గనకాభిషేకమునువడసి సార్వ భౌమ బిరుదు నందెననియు నభిప్రాయపడియున్నారు. సుప్రసిద్ధ వాఙ్మయ విమర్శకులును, నాంధ్రగీర్వాణ విద్యావిశారదులును నగు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు దమ శృంగార శ్రీనాథ మను గ్రంథమునందు ఇట్లు వ్రాసియున్నారు.

"అష్ట దిగ్విజయ పటాహీకృత బిరుద డిండిమాడంబరులు, గవి సార్వభౌములును నగు ద్వితీయ తృతీయ డిండిమభట్టారకులు కర్ణాటా ధీశ్వరుల యాస్థానకవీశ్వరులని కనుగొంటిమి. ద్వితీయ డిండిమ

భట్టారకుఁడు క్రీ. 1446 వఱకుఁగల్గు ప్రౌఢదేవరాయల యొద్దను, దృతీయ డిండిమ భట్టారకుఁడు క్రీ. 1490 ప్రాంతములఁ గల్గు సాళ్వగుండ నరసింహరాయలయొద్దను గలరని తెలిసికొంటిమి..... కర్ణాటాధీశ్వరుఁడగు ప్రౌఢదేవరాయని దర్శింపఁగా గొండవీటినుండి శ్రీనాథుఁడు విద్యానగరమున కరిగెను....తరువాత రాయలు సభ కూర్పించెను. రాయల సన్నిధిని శ్రీనాథునకును డిండిమ భట్టారకునకును వైరమువర్ధిల్లెను. కవితా విషయమున వారిరువురును విజిగీషువులై వివదించిరి....శ్రీనాథునకును డిండిమునకును జరిగినవివాదమునఁ జంద్రభూష క్రియాశక్తి రాయలనువారు మాధ్యస్థము జరిపినవారు కాఁబోలును. 'చంద్రభూషక్రియాశక్తి రాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమ బిరుదు' అన్న చరణమున కర్థము వైవిధముగా నుండునని నేననుకొనుచున్నాఁడను....చంద్రభూషక్రియాశక్తి ప్రసక్తి లోఁ గొండూరు శాసనము జదువవలసినది. ..... క్రియాశక్తి స్వామి శిష్యుఁడయిన చంద్రభూషణాచార్యునికిఁ గర్ణాటాధీశ్వరుఁడగు బుక్క రాయఁడు శిష్యుఁడని దాని వలన దెలియుచున్నది. ఆశాసనము క్రీ. 1349 లో నెలకొల్పఁబడినది. శ్రీనాథునికాలమునకు సరిపడునది కాదు. ఆకాలమునఁ గర్ణాటాధీశ్వరులకు గురుపులుగాఁ గాశీవిలాస క్రియాశక్తిప్రభృతులు క్రియాశక్తి పదలాంఛను లుండిరి. వారి పరంపరలోఁ బ్రౌఢరాయలకాలమునఁ గూడ నొక చంద్రభూషక్రియాశక్తికలఁడేమో!" "వివాదమున డిండిమభట్టారకుఁ డోడిపోయినట్లు మాధ్యస్థ్యము నెరపిన పండితుఁడు నిర్ణయించెను" ఇత్యాది.

శ్రీప్రభాకర శాస్త్రులవారి తీర్మానమంగీకరింపఁ దగిననదికాదు. శ్రీనాథుఁడు దర్శింపఁబోయినది 'ప్రౌఢదేవరాయల'ని నిశ్చయించి చెప్పుటకు ఆధారము లెవ్వి? "లక్షణోపేంద్ర ప్రౌఢరాయ క్షితీంద్ర" "ప్రౌఢ దేవేంద్ర రాయభూపాలవరుని సమ్ముఖంబున దయఁజూడు ముమ్మసుకవి" అను శ్రీనాథుని చాటూక్తులేయగునా? అగునేని యవి శ్రీనాథుఁడు దర్శించినది క్రీ. 1446 వఱకుఁగల్గు (ఇమ్మడి) ప్రౌఢ రాయలనని నిర్ధారించుటకు సాధకములు గాఁజాలవు. క్రీ. శ 15 వ

శతాబ్దమున ప్రౌఢదేవరాయ నామాంకితులు నలుగురు రాజులు విద్యానగరమున రాజ్యమొనర్చిరి. ప్రథమ ప్రౌఢదేవరాయలు క్రీ. శ. 1404 వఱకును రాజ్యపాలన మొనర్చిన రెండవ హరిహర రాయల కుమారుఁడు. సామాన్యముగ శాసనములయందితని పేరు దేవరాయ లనియే కానవచ్చుచున్నను ప్రౌఢదేవరాయలని ఇతనిఁబేర్కొను శాసన ములు లేకపోలేదు.[2] రెండవ ప్రౌఢదేవరాయలు మొదటి ప్రౌఢదేవ రాయల మనుమఁడు. విజయరాయుల పుత్రుఁడు. క్రీ.శ.1422 మొదలు 1446 వఱకు నితఁడురాజ్యముచేసెను. మూఁడవ ప్రౌఢదేవరాయలు రెండవ ప్రౌఢదేవరాయలకుమారుఁడు. ఇతని వాస్తవమైన పేరు మల్లికార్జున రాయలు; పెక్కుశాసనము లీతని మమ్మడి ప్రౌఢదేవ రాయనియే పేర్కొనుచున్నవి. క్రీ.శ 1448 మొదలు 1465 వఱకు నితఁడు ప్రభుత్వము సల్పెను. నాల్గవ ప్రౌఢ దేవరాయలు రెండవ విరూపాక్ష రాయల కుమారుఁడు; ఇతఁడు క్రీ.శ. 1485 ప్రాంతమున విద్యానగర సింహాసనము నధిష్ఠించెను. ఇతనినే సాళువగుండ నర సింహరాయల పక్షమున నరసానాయకుఁడు విద్యానగరమునుండి వెడలనడఁచి కర్ణాటక సామ్రాజ్యమును స్వాధీనము గావించుకొనినది.

పైఁ బేర్కొనఁబడిన ప్రౌఢదేవరాయలు నలుగురిలో శ్రీనాథుడు దర్శించినదే ప్రౌఢదేవరాయలనో కనుగొనవలసియున్నది. శ్రీనాథుఁడు కొండవీటిని పాలించిన యనవేమారెడ్డికాలమునుండియు రాజ మహేంద్రవరము నేలిన వేమ వీరభద్రారెడ్ల యవసాన కాలము వఱకును రెడ్డిరాజుల నాశ్రయించి యుండెనని యాతనిగ్రంథముల వల్ల దెలియుచున్నది. తరువాత గూడ కొంతకాలము జీవించి యుండెనని "కాశికా విశ్వేశుఁ గలసె వీరారెడ్డి" యను నతని చాటువువల్ల విదితమగుచున్నది. అన వేమారెడ్డి క్రీ. శ. 1371 ప్రాంత మున కొండవీటి గద్దెనెక్కెను; క్రీ. శ. 1437 తరువాత వేమ వీర భద్రారెడ్లు రాజ్యముచేసినట్లు నిదర్శనము లెవ్వియుఁ గానరావు.

---

2. ARE. 399 of 1926.

కావున క్రీ. శ. 1370 మొదలు 1450 పర్యంతము శ్రీనాథుఁడు జీవించియుండెనని మనము స్థూలముగ దీర్మానించవచ్చును.

ఇట్లు నిర్ణీతమైన యెనుబదియేండ్లకాలమున విద్యానగరమున పై బేర్కొనఁబడిన ప్రౌఢదేవరాయ నామాంకితులు నలుగురిలో ముగ్గురు ప్రభుత్వము సల్పుచుండిరి. ఈమువ్వురిలోఁ గడపటివాఁడగు మమ్మడి ప్రౌఢదేవరాయలు క్రీ.శ. 1448లో సింహాసనము నధిష్ఠించి యుండుటచేతను, అప్పటికి శ్రీనాథుడు ముసలివాఁడై దూరమున నుండిన విద్యానగరమునకు బయనము సేయు స్థితియందుండకపోవుట చేతను అతఁడు దర్శించిన రాయలు మమ్మడి ప్రౌఢదేవరాయలు గాఁడని మనము నిశ్చయించవచ్చును.ఇఁక మిగిలియుండు వారిరువురు. వీరిలో నెవ్వరనుట ప్రస్తుతము చర్చనీయము. ఇంతవఱకు లభ్యమైన గ్రంథసామగ్రిని బట్టి ఈయంశమును స్పష్టముగ గనుగొనుటకు వీలు గాదు. సర్వత్ర దేవరాయలనియో, ప్రౌఢదేవరాయలనియో కాన వచ్చుచున్నది. అతఁడిన్నవ దేవ,లేక ప్రౌఢదేవరాయలని యూనవాలు పట్టుటకుఁ దగు సాక్ష్య మెందును గానరాదు. కావున నీ విషయ మును వేరుమార్గమున సాధించవలసియున్నది. చంద్రభూష క్రియా శక్తి యెప్పటి వాఁడో కనుగొనఁగలిగితిమేని యందుమూలమున ఈవిషయమును నిశ్చయించవచ్చును. ఇతఁడు కొండూరు శాసనమునఁ బేర్కొనఁబడి యున్నాఁడనియు, నది క్రీ. శ. 1349 నాఁటిదియగుటచే నతఁడు శ్రీనాథునికాలమువాఁడు గాఁడనియు శ్రీప్రభాకరశాస్త్రులు గారు వ్రాసియున్నారు కదా. వారీ శాసనకాలమును జక్కఁగ బరీక్షించక పోవుటచే వారికీ యభిప్రాయము గల్గినది. అందు శాసన కాలమిట్లు చెప్పియున్నది:

"అథ నిజ తపోరాజ్యే జగత్తేమంకరే జాగ్రతి కలికాలే ఏక సప్తత్యధిక ద్విశతాధిక సహస్రాబ్దపరిమితే గతే సంవత్సరే పర్యాయస్య ద్వావింశత్యావర్తే సాధారణనామ సంవత్సరే వర్తమానే శ్రావణ మాసే కృష్ణ పక్షే చతుర్దస్యా మిందువాసరే యతీంద్రస్య క్రియా

శక్తి గురోః పర్వణే తస్యేదం ప్రీతయే శ్రీచంద్రభూషణాచార్యాః.... ప్రాదాత్."

ఈ శాసన కాలవిషయమును జర్చించుచు, బ్రహ్మశ్రీ వావిళ్ల వెంకటేశ్వర శాస్త్రులుగారి సమ్మాన సంపుటమున, 'కవిసార్వభౌముఁడు -కనకాభిషేకము' అను శీర్షికగల వ్యాసమున నిట్లువ్రాసియున్నాఁడను. "కలికాలమున 1271 సంవత్సరములు గతించిన వెనుక చంద్రభూషణా చార్యులవారి తపోరాజ్యము జరుగుచుండఁగా క్రియాశక్తి యతీంద్ర గురునియొక్క 22 వది యగు పర్వదినమునకు సరియైన సాధారణ సంవత్సర శ్రావణ బ. 14 సోమవారము నాఁడు ముందికి నాటిమధ్యస్థితమైన కొండూరు గ్రామము నగ్రహారీకరించి యాచార్యులవారు బ్రాహ్మణుల కొసంగిరని తెలియుచున్నది. ఇందు "కలికాలే" యనునది ప్రమాద జనితము. "శక కాలే" యని యుండవలయును. మఱియు శా.శ.1271వ వత్సరమునకు సరియైన ప్రభవాది వర్షము విరోధికాని సాధారణకాదు. గణించి చూచిన సాధారణ సంవత్సరమునకు సరియగు శకవర్షము 1292 అని తెలియవచ్చుచున్నది. కావున చంద్రభూషణాచార్యులు కొండూరు నగ్రహారీకరించి బ్రాహ్మణులకు దానిజేసినది శా. శ. 1292 నకు సరియైన సాధారణ సంవత్సర శ్రావణ బ॥ 14 సోమవారమునాఁడు (19 ఆగస్టు, క్రీ. శ. 1370).

"కలికాలే.....పరిమితే గతే సంవత్సరే పర్యాయస్య ద్వావింశ త్యావర్తే సాధారణనామ సంవత్సరే వర్తమానే..... యతీంద్రస్య క్రియాశక్తి గురోః పర్వణే." యనుటవల్ల సాధారణ శ్రావణ బ॥ 14 నాఁడు క్రియాశక్తిగురుని 22 వ యాబ్దికమని తెల్లమగుచున్నది. శా. శ. 1271 కి సరియైన విరోధి సంవత్సరమునకును సాధారణ సంవత్సరమునకును మధ్య 22 యేండ్ల యెడముండుటచేతను, సాధారణ సంవత్సరముతో క్రియాశక్తి యతీంద్రునికి 22 పర్వములు గడచుటచేతను శాసనోక్తమైన శా. శ. 1271 వ సంవత్స

రము పైఁజెప్పిన యా క్రియాశక్తి గురువుయొక్క శివసాయుజ్య సంప్రాప్త కాలమని తోఁచుచున్నది. ఆ సంవత్సరమునే చంద్ర భూషణాచార్యులవారును తపోసామ్రాజ్య పట్టబద్ధులై యుండ వలయును."

తరువాత కొంతకాలమునకు బ్రహ్మశ్రీ వేటూరు ప్రభాకర శాస్త్రులవారిని గలసుకొనినపుడు వారు నాచేఁ జేయఁబడిన కాలనిర్ణయము సరికాదని చెప్పిరి. ఇట్లే మిత్రులు శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మ గారును నేఁజేసినకాలనిర్ణయమంగీకరింప దగినది కాదనియు,నద్దానికిఁ బ్రబలముగు నాక్షేపము గలదనియునుడివిరి.ఇంతటి గొప్పవిమర్శకు లామోదించకపోయినను, కొండూరు తామ్రశాసనము గల్పితము గాకుండిన, నాచేఁ జేయఁబడిన కాలనిర్ణయమే సరియైనదను తలంపు నన్ను విడువదాయె. ఈతలంపు వ్యర్థమైనదికాదని చంద్రభూషణ క్రియాశక్తి యొక్క మఱియొక శాసనమువల్ల నిశ్చయమగుచున్నది. ఇది బెంగుళూరు జిల్లా హొసకోట తాలూకా వోగటగ్రామములోని శివాలయమునందు కలదు. శా. శ. 1300 సంవత్సరమున (అనగా క్రీ. శ. 1377-78) వ్రాయించినది. ఇందు దక్షిణ వారణాసిస్థిత స్వయంభూత్రియంబకదేవపాదారవింద సేవా సంసక్తుఁడును, కాశ్యప గోత్ర పవిత్రుడును.....మండలాచార్య సంసిద్ధచక్రవర్తియు ఆచార్య యభంగరాహుత్తరాయాది బిరుదాంకితుఁడును నగు చంద్రభూషణ దేవ ఒడయులవారు మరుదాడుగ్రామమునందలి కొంతభూమిని భాగీరథీ పురమున విజయము జేసియుండిన వరదరాజస్వామియాలయమునకు దానముగావించినట్లు చెప్పియున్నది. ఈశాసనగ్రంథమునుగూర్చి కీర్తికాయులు మహామహోపాధ్యాయ ఆర్. నరసింహాచార్యుల వారిట్లు వ్రాసియున్నారు. శాసనమున గొన్నిభాగములు మాసిపోవుట విచారకరము చంద్రభూషణదేవ ఒడయలకుఁ జెందు బిరుదావళి యాతఁడొక గొప్పయాచార్యుఁడని తెలుపుచున్నది. రెండవ హరిహరరాయల గురువని వెక్కు శాసనములందు బేర్కొనఁబడిన క్రియాశక్తియను సమకాలీనుఁడైన మఱియొక గొప్పగురువర్యు

నికిఁ గూడ స్వయంభూ త్రియంబక దేవపాదారవిందసేవాసంసక్తుఁ డను బిరుగు గలదు. వీరిద్దరును ఒక్కరని నేను తలఁచుచున్నాఁడను. మఱియు నీ దేవాలయము నందే కానవచ్చెడు క్రీ.శ. 1381 నాఁడు వేయించిన ఇంకొక శాసనమున స్థానికుఁడు క్రియాశక్తి దేవుడు బేరొక్కనఁబడియున్నాడు. ఇది నాచేఁ జేయఁబడిన వ్యక్తీకరణమును బటువు సేయుచున్నది."[3]

పైవోగటు తామ్ర శాసనమునందలి చంద్రభూషణ ఒడయలే కొండూరు తామ్రశాసనమునందలి చంద్రభూషణ క్రియాశక్తి. ఇద్దఱును కాశ్యపగోత్ర పవిత్రులే. ఇద్దఱును దక్షిణవారణాసీస్వయంభూత్రియంబక శ్రీపాదపద్మారాధకులే. ఇద్దఱును యాచార్యవర్య యంభంగరాహుత్తరాయాది బిరుదాంకితులే. మఱియు వారిపురును నొక్కకాలమువారే. కొండూరును శా. శ. 1292 సంవత్సరమున బ్రాహ్మణులకు చంద్రభూషణ క్రియాశక్తి దానముచేసెను; మఱి యెనిమిదేండ్లకు పిమ్మట శా.శ. 1300 సంవత్సరమున చంద్రభూషణ దేవ ఒడయులు భాగీరథీపుర వరదరాజస్వామికి మరుదాడు గ్రామ మున కొంతభూమి దానముజేసెను. కావున చంద్రభూషణదేవ ఒడ యులును, చంద్రభూషణ క్రియాశక్తియు నొక్కరే యగుదురుగాని భిన్నులుగారు.

మఱియు క్రియాశక్తి బుక్కరాయల సంతతివారికి గురువై నట్లు గ్రంథముల వల్లను శాసనములవల్లను దెలియవచ్చుచున్నది.

బుక్కరాయల కుమారుఁడగు కమారకంపణఒడయల దేవి యైన గంగాదేవి తన మధురావిజయమున—

"అసాధారణ సర్వజ్ఞం విలసత్సర్వ మంగలమ్,
క్రియాశక్తి గురుం వందే త్రిలోచన మివాపరమ్,"

---

3. మైసూర్ ఆర్కియలాజికల్ రిపోర్టు. 1919. పారా 87.

అని ప్రశంసించియున్నది. శా. శ. 1300 లకు సరియైన కాళయుక్తి యందు వ్రాయించిన యొక శాసనమున రెండవ హరిహరరాయలు "విరూపాక్ష సాక్షాత్కృల పరమదైవం కులగురు క్రియాశక్త్యాచార్య కలికలభ కంఠీరవ యశః" అని చెప్పుకొనియున్నాఁడు.4 మఱియు శా. శ. 1301 కి సరియైన సిద్ధార్థి (క్రీ. శ. 1379) నాఁటి దంబాలు తామ్ర పట్టికలలో నిజగురువైన క్రియాశక్తిమూర్తి యనుజ్ఞను బొంది గదగు కీర్తినారాయణస్వామి యాలయమునకు 66 గ్రామము లను దానము జేసినట్లున్నది.5 1312 కు సరియైన శుక్లనామ సంవత్స రమున వ్రాయించిన యొక శాసనమున—

"ప్రాతాపేమ్మడి బుక్క భూప
.....క్రియాశక్తి
ఖ్యాతస్య గురో గురోరివ
సతాం శక్రోభ్య దత్తక్రమాత్."6

అని యున్నది. ఇందువల్ల రెండవ హరిహరరాయల కుమారుఁడైన యిమ్మడి బుక్క భూపాలుఁడు సయితము క్రియాశక్తి కి శిష్యుఁడని తెలియుచున్నది. శా. శ. 1319, 1320 నాటి రెండు తామ్రపట్టిక లలో స్వయంభూత్రియంబక దేవ పాదపద్మారాధకుఁడును రాజరాజ గురు పితామహ క్రియాశక్తి దేవుఁడు పేర్కొనబడియున్నాఁడు.7 మఱియు శా. శ. 1325 కు సరియైన స్వభాను సంవత్సరమునాఁటి శాసనమున విఠప్ప ఒడయరను రాయసామంతు డొకఁడు దాను "శ్రీమత్క్రియాశక్తి గురుమునీశ్వర చరణ కమల మరాళత్రియం బక పూజా ధురంధరుఁడ" నని చెప్పుకొనియున్నాఁడు.7a శా. శ.

---

4 ఎపి. కర్ణా సం. 5 చెన్న 256.
5 మైసూరు ఆర్కియలాజికల్ రిపోర్టు 1918, పారా. 105:
6 ఎపి. కర్ణా సం. 10 ముల్. 11
7 మైసూరు ఆర్కియలాజికల్ రిపోర్టు 1912, పారా. 99
7a ఎపి. కర్ణా సం 8. తీర్థ 133.

1332 కు సరియైన విక్రమ యందు వ్రాయించిన శాసనమున ప్రథమ (ప్రౌఢ) దేవరాయలు

"శ్రీస్వయంభూత్రియంబక చరణారవిందారాధక శ్రీమద్రాయ రాజగురు మండలాచార్య ఆచార్యవర్య అభంగరాహుత్తరాయ తపోరాజ్యలక్ష్మీనిజనివాసకాయ శ్రీ క్రియాశక్తి గురువరచరణ పరిచరణ ప్రసాదాసాదిత మహిత సార్వజ్ఞ సామ్రాజ్యవైభవ శ్రీమద్రాజాధిరాజ పరమేశ్వర శ్రీవీరప్రతాప దేవరాజ మహారాజః"

అని ప్రకటించుకొని యున్నాడు.8

పైనుదాహరించిన శాసనములలో నొక యోగట శాసనమందు తప్ప మఱి దేనియందును చంద్రభూషణాచార్యుని పేరులేదు. "ఆకాలమున గర్ణాటాధీశ్వరులకు గురువులుగా గాశీవిలాస క్రియా శక్తిప్రభృతులు, క్రియాశక్తి పదలాంఛను లుండిరి." అని శ్రీప్రభాకర శాస్త్రులవారు చెప్పియున్నారు కదా. పై శాసనములందు పేర్కొనబడిన క్రియాశక్తి యతడేల కాగూడదు? అను ప్రశ్న మొకటి బయలు వెడలవచ్చును. "ప్రభృతుల" మాట యటుండనిండు. వారు నాకతీతులు. కాశీవిలాసనామధేయుడైన క్రియాశక్తిముని యొకడీకాలమున నుండెననుట వాస్తవము. బుక్కరాయల మంత్రులలో నొక్కడైన మాధవమంత్రి కితడు గురువని ఇతనిచే విరచితమైన సూత సంహిత వ్యాఖ్యయందు కలదు.

శ్రీమత్కాశీ విలాసాఖ్య క్రియాశక్తీశ సేవినా
శ్రీమత్త్ర్యంబక పాదాబ్జ సేవానిష్ణాత చేతసా."9

మఱియు శా. శ. 1290 కి సరియైన కీలక సంవత్సరమున వ్రాయించిన శాసనమున "యః సాక్షాద్గిరిశావతారవపుషః కాశీ

---

8. ఎపి. కర్ణా. సం. 11. దావణ. 23
9. సోర్సస్ ఆఫ్ విజయనగర హిస్టరీ. పుట. 51

విళాసేశితుః" అనియు, 'శ్రీ కాశీవిళాస క్రియాశక్తి శివద్వైశికా దిష్టేన' అనియు రెండు పర్యాయము లీతఁడు పేర్కొనఁబడి యున్నాఁడు.10 ఇంతకంటె బ్రస్తుతమితని గురించి మఱి యేమి యుఁదెలియదు. లభ్యమైన శాసనాది సామగ్రిని బరిశీలించి చూడఁగా నితఁడు కర్ణాటాధీశ్వరులకు గురువని తలఁచుటకు లేశమైన నవకాశము గాన్పించదు; పైనుదాహరింపబడిన శాసనములందు క్రియాశక్తికిఁగల బిరుదు లితనికిలేవు; చంద్రభూషణ క్రియాశక్తికిఁ గలవు; కావున వానియందుఁ బేర్కొనఁబడిన క్రియాశక్తియౌని కాశీవిలాసుఁ డనుట కంటెఁ జంద్రభూషణుఁడనుట యుక్తము. కాశీ విలాసుఁడు క్రియాశక్తి మఠమునకుఁ జెందిన సామాన్యశైవ సన్యాసిగాని కర్ణాటాధీశ్వరుల గురువు గాఁడు. అప్పటి కర్ణాటాధీశుల కులగురువు చంద్రభూషణుఁడేకాని యన్యుఁడు గాఁడు. ఈ పేరిటి క్రియాశక్తి యొకఁడు రెండవ ప్రౌఢదేవరాయల కాలమున నుండెనేమో యని ప్రభాకర శాస్త్రులవా రాశంకించిరి. దొరకినంతవఱకుఁగల చరిత్రసామగ్రిని గాలించి చూచినను రెండవ దేవరాయలకాలమునఁ జంద్రభూషణ క్రియాశక్తి యెందును గానరాఁడు. కావున రెండవదేవరాయలనే శ్రీనాథుఁడు దర్శించినదని మొట్టమొదటనొక నిరాధారపు సిద్ధాంతమునుజేసికొని దానిని నిజముసేయుటకై యాతనికాలమున నొక చంద్రభూషణాచార్యుఁ డుండియుండవలయునని వాదించుట కంటె చంద్రభూషణాచార్యులకు సమకాలికుఁడును శ్రీక్రియాశక్తి గురువర చరణ పరిచరణ ప్రసాదాసాదిత మహితసార్వజ్ఞ సామ్రాజ్యవైభవుఁడును నైన మొదటి దేవరాయలనే దర్శించెననుట సమంజసము.

కావున (1) కొండూరు వోగట శాసనములవలన మొదటి బుక్క, రెండవ హరిహరరాయల కాలములో చంద్రభూషణ క్రియాశక్తి యుండినట్లు తెలియవచ్చుట చేతను, (2) పెక్కుశాసనముల యందు చంద్రభూషణ క్రియాశక్తి యొక్క బిరుదులేగల క్రియాశక్తి గురుఁడొకఁడు విజయనగరరాజులకు కులగురువని చెప్పియుండుట

---

10. ఎపి. కర్ణా. సం. 8 పి కం 281

చేతను, (3) ప్రథమ దేవరాయలు చంద్రభూషణాచార్యుల బిరుదావళినే గలిగిన క్రియాశక్తి గురువరచరణ పరిచరణ ప్రసాదాసాదిత మహిత సార్వభౌమ సామ్రాజ్య వైభవుఁడనని చెప్పుకొని యుండుట చేతను, (4) శ్రీనాథుఁడు 'చంద్రభూష క్రియాశక్తి రాయలకడఁ బాదుకొల్పితి సార్వభౌమ బిరుదు' అని వచించి యుండుటచేతను, (5) రెండవ దేవరాయలకాలమున చంద్రభూష క్రియాశక్తియను పేరుగల వారెవ్వరును లేకపోవుటచేతను, శ్రీనాథుఁడు దర్శించిన దేవరాయలు మొదటి దేవరాయలేయనియు, నతని సన్నిధినే యతని గురువర్యుఁడగు చంద్రభూష క్రియాశక్తి యొడయుల యాధిపత్యము క్రింద నడచిన విద్వత్సభలో శ్రీనాథుఁడు డిండిమభట్టారకు నోడించి సార్వభౌమ పదమును, గనకాభిషేకమును బడసెననియు నమ్మ్మి చున్నాను.

జిక్కన

విక్రమార్క చరితమును రచించిన జక్కనకవియొక్క కాలమును నిర్ణయించు ప్రయత్నము కొందఱు సల్పియున్నారు. కాని, వారు నిర్ణయించినకాలము భిన్నముగ గాన్పించుచున్నది. కవుల చరిత్రకారులగు వీరేశలింగం పంతులుగారు "విక్రమార్క చరిత్రము 1410వ సంవత్సరమునకును 1420సంవత్సరమునకును మధ్యకాలమున రచింపఁబడినదని నిరాక్షేపముగా చెప్పవచ్చును" అని యాంధ్రకవుల చరిత్ర ప్రథమభాగమున వ్రాసియున్నారు. కాని, ఇదానీంతను లొక్కరు పంతులుగారు చేసినకాలనిర్ణయము సరిగాదని యభిప్రాయ పడుచు, 1425 వ సంవత్సరమునకు తరువాత విక్రమార్కచరిత్ర విరచింపబడినట్లు సూచించియున్నారు. అనఁగా, విక్రమార్క చరిత్ర రెండవ దేవరాయలకాలమున వ్రాయబడియెనని వీరి యభిప్రాయ మని తోచుచున్నది. జక్కనయొక్క కాలమును నిర్ణయించుటకు వలయు సామగ్రి నంతటిని జక్కనయే యొసఁగియున్నాడు. ఆసామ గ్రిని పరిశీలించిన నిజమేర్పడునేమొ కనుగొనవలసియున్నది జక్కన నిజవంశమును వర్ణించు సందర్భమున తన తాతగారగు పెద్దయ నెల్లూరి తిరుకాళత్తి రాజు నాస్థానమున కవియైయుండినట్లువ్రాసికొని యున్నాఁడు:

'అనుచు నెల్లూరి తిరుకాళమనుజ విభుని
సమ్ముఖమ్మున సాహిత్యసరణి మెఱసి
మహిమగాంచిన పెద్దయామాత్య సుకవి' అని.

మఱియు కృతిపతి వంశచరిత్రను దెల్పుపట్టున పెక్కురాజులను మంత్రులను బేర్కొనియున్నాడు. కృతిపతి వంశమునకు మూలపురుషుఁడగు సూరన సోమయాజి "యెద్దనపూడి రాజేంద్ర చోడక్షమారమణుచే నగ్రహారములు వడసె"ను. అతని మనుమఁడగు (మొదటి) సిద్ధన "నన్ననగంధవారణంబునకుఁ బ్రధానుఁడై నుతుల బొందెను." పై సిద్ధనయొక్క ద్వితీయపుత్రుడైన జన్నయ "దేవరాయ మహీ కరుణాకటాక్ష వీక్షణము" గాంచెను. ఇతని పుత్రుఁడగు (రెండవ) సిదన "దేవరాయ మహీరాయ ధీవిధేయ మంత్రి వల్లభ చామనామాత్యదత్తచామరచ్ఛత్ర శిబికాది సకలభాగ్య చిహ్నముల" నొప్పెను. (రెండవ) సిద్ధనకు "రెడ్డివేమ నరపాలకుచేత మహాగ్రహారముల్ గొన్న కవీంద్రకుంజరుఁ" డగు "వెన్నెలకంటి సూర్యుఁడు" "పెదతండ్రి." అనఁగా పెదతల్లి భర్త. విక్రమార్క చరిత్రలో నొసంగబడిన చరిత్రాంశము లివియే. వీని నాధారపఱచుకొని కవికాలమును నిర్ణయించవలసి యున్నది. కవికాలమును రెండువిధముల నిర్ణయించవచ్చును. 1. కవి స్వవంశవిషయమయి చెప్పిన యుదంతమును బట్టి; 2. కృతి వతి వంశచరిత్రనుబట్టి.

1. కవి తన పితామహుఁడగు పెద్దయ 'నెల్లూరి తిరుకాళ మనుజవిభుని సమ్ముఖంబున సాహిత్య సరణి మెఱసె'ననిగదా వ్రాసి యున్నాఁడు. ఈతిరుకాళ రాజెవ్వఁడో కనుగొంటిమేని తన్మూలమున పెద్దయ జక్కనలకాలమును స్థూలముగ నిర్ధారణ చేయవచ్చును. తిక్కనామాత్య విరచిత నిర్వచనోత్తరరామాయణ పీఠికనుఁ జదివిన వారందరికిని తత్కృతిపతియగు మనమసిద్ధియొక్క తండ్రిపేరు తిరుకాళత్తిదేవ లేక తిక్కరాజనుట తెల్లము. ఇతనికి గండగోపాలుఁడన్న

బిరుదుగలదు. ఇతఁడు క్రీ.శ.1208 మొదలు 1248 వఱకును నెల్లూరు నందును, కంచియందును రాజ్యముసల్పెను. పెద్దయకవికి ఆశ్రయ మొసఁగిన తిరుకాళ మనుజవిభుఁడీతడే యగునా? కావచ్చును. పెద్దయ కవి మనుమఁడగు జక్కన్న దేవరాయమహారాయలకు సమకాలికుఁడు. ఈ దేవరాయలు క్రీ. శ. 1378 మొదలు ఉదయగిరి దుర్గముపై ప్రభుత్వమొనర్చిన మొదటిదేవరాయలని తలఁచితిమేని అప్పుడు పెద్దయ కవికిని అతని మనుమఁడగు జక్కన్నకును 125 సంవత్సరములు ఎడ ముండును. తిరుకాళరాజు అంత్య దశయందు పసివాఁడుగను దేవరా యని ప్రభుత్వారంభకాలమున జక్కన మునలివాఁడుగను నుండిన పదుమున పైని 125 సంవత్సరములకాలమున ఒకవిధముగ సరిపెట్ట వచ్చును. కాని దీనికి ప్రబలమైన యాధేపముకలదు. కృతిపతియు నతని తండ్రియును నిద్దరును దేవరాయనికి మంత్రులుగ నుండిరి. కావున కృతిపతియగు సిద్ధన తన తండ్రియగు జన్నయ యనంతరము దేవరాయలకు మంత్రియాయెనని తలఁచుట యుచితము. అట్లగునేని విక్రమార్క చరిత్రము దేవరాయలు ప్రభుత్వమునకు వచ్చినపిదప గొంతకాలమునకు విరచింపఁబడినట్లు చెప్పవలసియున్నది. అందువల్ల పెద్దయకవి పైజెప్పిన తిక్కరాజునకు సమకాలికుఁడై యుండెననుట సమంజసముకాదు. కాఁబట్టి పెద్దయకవిని ఆస్థానమునందుంచుకున్న తిరుకాళరాజు వేరొకఁడుండవలయును. అట్టివాడెవ్వఁడేనియుకలఁడో చూతము. నెల్లూరుజిల్లా నెల్లూరు తాలూకాయందు పూర్వసముద్ర తీరమున నుండు కృష్ణాపట్టణమను గ్రామమునందు శా. శ. 1201 అనగా క్రీ. శ. 1279–80 నాటి యొక శాసనమున ఇమ్మడి తిరు కాళత్తి దేవుఁడనురాజు రాజ్యముసేయుచున్నట్లు చెప్పబడియున్నది. ఈరాజు క్రీ. శ. 1278 లో సింహాసనము నధిష్ఠించెను. ఇమ్మడి తిరుకాళత్తి దేవుఁడు మనుమసిద్ధియొక్క కుమారుఁడని రాజశ్రీ చిలు కూరి వీరభద్రరావు పంతులుగారు తమ యాంధ్రుల చరిత్రమధ్య యుగము 106-వ పుటయందు వ్రాసియున్నారు. ఈ విషయము శ. 1219 హేవళంబి సంవత్సరమునాటి మనుమగండ గోపాలుని

నర్సారావుపేట శాసనమువలన రుజువగుచున్నది.[1] ఇమ్మడి తిరుకాళ రాజు క్రీ. శ. 1278 సం. మున ప్రభుత్వము చేయ నారంభించెననుట నిశ్చయము. ఇతఁడు రేచర్ల ఎఱదాచానాయని సహాయమువలన సింహాసనము నధిష్ఠించెనని, వెలుగోటివారి వంశావళిలోని "నెల్లూరి వీరక్షేత్ర రణభారతీమల్ల," "తిరుకాళరాజు రాజ్యస్థాపనాచార్య" యన్న వాక్యములవల్ల దెలియుచున్నది.ఎఱదాచనాయఁడు తిరుకాళ రాజును రాజ్యమున పునఃప్రతిష్ఠు జేసినది క్రీ. శ. 1278 వ సంవత్స రమునందు. తరువాత యచిరకాలమునసే అతఁడు రాజ్యమును కోల్పోయినట్లున్నది. ఇతఁడు రెండేండ్లు రాజ్యమేలిన పిమ్మట మనుమగండ గోపాలుఁడు రాజ్యమునాక్రమించుకొనెను. ఈఇమ్మడి తిరుకాళత్తిదేవుని సభయందే పెద్దయకవి విరాజిల్లెను. పెద్దయ పదమూఁడవ శతాబ్దాంతమున నుండెనని చెప్పుట న్యాయవిరుద్ధము కాదు. ఒక్కొక్కతరమునకు 30 సంవత్సరముల చొప్పున లెక్కించి తిమేని జక్కనకవి క్రీ. శ. 1350 సంవత్సరము ప్రాతమువాఁడగును. క్రీ. శ. 1378 మొదలు ఉదయగిరి నేలిన దేవరాయల మంత్రియగు సిద్ధనకు విక్రమార్కచరిత్రము నతఁ డంకితమిచ్చుటయందు వింత యేమియులేదు.

2. ఇఁక కృతిపతి వంశచరిత్రనుబట్టి కవియెప్పటివాఁడగునో చూతము: కృతిపతి వంశమూలపురుషుఁడగు సూరనసోమయాజికి రాజేంద్ర చోడుఁడు అగ్రహారముల నొసఁగెనఁట. ఎవ్వరీ రాజేంద్ర చోడుఁడు? వీరేశలింగముగారీతని వెల్నాటిరాజేంద్ర చోడుఁడని తలఁచి కాలము సరిపడకపోవుటచేత తబ్బిబ్బునందిరి.

"రాజేంద్ర చోడుఁడు 1156 వ సంవత్సరము మొదలుకొని 1183 సంవత్సరమువఱకు రాజ్యముజేసెను. సిద్ధనమంత్రి కొడుకైన జన్నయ మంత్రి 1406 వ సంవత్సరము మొదలుకొని 1422 వఱకు రాజ్యపరిపాలనము చేసిన దేవరాయని కాలములోనుండెను. తాతకును

---

1. AR. No. 213 of 1892, S.I.I. VI No. 661.

మనుమనికిని ఇన్నూటయేబది సంవత్సరములు వ్యత్యాసముండుట సంభవింపనేరదు. గావున నిచ్చట మనుమఁడనగా సంతతివాఁడని యర్థము చెప్పవలెను. అందుచేత సిద్ధనమంత్రి సూరనసోమయాజికి మనుమఁడు గాక తద్వంశజుఁడయి యుండుట నిశ్చయము."

రాజేంద్ర చోడుఁడన్నంతటనే అతఁడు వెలనాటి నేలిన చోళ రాజని భ్రమచెందుటచే వీరేశలింగం పంతులుగారు పై సిద్ధాంతమును జేయవలసిన వారైరి. క్రీ. శ. 1245 మొదలు 1269-70 వఱకును కాంచీపురము నిజరాజధానిగా చోళదేశము నేలినరాజేంద్ర చోడుఁ డొకఁడు గలఁడు. అతనికి నెల్లూరి చోళరాజులు సామంతులుగనుండిరి. అతనియధికారము తెలుగుదేశమున నిప్పటి నెల్లూరు కడప చిత్తూరు మండలములపై వ్యాపించియుండెను. సూరన సోమయాజికి నగ్రహారము లొసఁగిన వాఁడీరాజేంద్ర చోడుఁడెలకారాదు.? సూరన సోమయాజి 1260- వ సంవత్సరమప్పుడు అగ్రహారములను బడసెనని తలఁచి యప్పటినుండి తరమునకు 30 సంవత్సరముల చొప్పున లెక్కవేసిచూసిన, విక్రమార్క చరిత్రకు గృతిపతియగు సిద్ధయతాత సిద్ధయ 1320-1350 సంవత్సరములమధ్యవాఁడగును. అతని కొమారుఁడగు జన్నయ 1350-1380 సంవత్సరములమధ్య వాఁడగును. కృతిపతియగు సిద్ధయ 1380 మొదలు 1410 వఱకును జీవించియుండును. కృతిపతి పెదతండ్రియగు వెన్నెలకంటి సూరన్నకు అగ్రహారముల నొసఁగి సత్కరించిన రెడ్డివేమ నరపాలుఁడు కవుల పాలిటి కల్పవృక్షమగు ననవేమారెడ్డి యగును. మొదటిదేవరాయలు 1378 మొదలు ఉదయగిరియందు ప్రభుత్వము సల్పుచుండుటను బట్టి జన్నయయు సిద్ధనయు నతనికి మంత్రులుగ నుండుట సహజమే. కావున సూరన సోమయాజికి అగ్రహారములనొసఁగినవాఁడు చోళ చక్రవర్తులలో కడపటివాఁడగు మూఁడవరాజేంద్రచోళుఁడుగా వచ్చును. కాని, సూరన సోమయాజికి నగ్రహారములొసఁగిన రాజు చోళచక్రవర్తియగు మూఁడవరాజేంద్ర చోడుఁడుకాఁడని ఎద్దన

పూఁడి రాజేంద్రచోడ ఋమారమణుచే నగ్రహారముల బడసె' నను సీసపాదమునందు జక్కనయే తెలిపియున్నాఁడు.

ఈ పంక్తిని విశేషలింగం పంతులుగా రనవసరముగా "నగ్రహా రముగ బడసె" అని దిద్దిరి. ఎద్దనపూఁడి రాజేంద్ర చోడుఁడెవ్వఁడో మన మెఱుఁగకపోయినంత మాత్రమున పద్యమును దిద్దుటపాడియా? అట్లు దిద్దినందువల్ల మనుమఁడన వంశస్థుఁడను సిద్ధాంతమును జేయ వలసివచ్చినది. కావున సూరన సోమయాజికి అగ్రహారములనిచ్చి యాదరించిన రాజేంద్రచోడుఁడు యెద్దనపూఁడి నేలుచుండిన మన్నె రాజని తలఁచుటయే సమంజసము. అతఁడెప్పుడుండెనో చెప్పుటకు దగిన సాధనము లిప్పటికింకను లభ్యపడలేదు. గుంటూరు జిల్లా నరసారావుపేట తాలూకాయందు ఎద్దనపూడియను గ్రామమొకటి కలదు. ఈగ్రామమే విక్రమార్క చరిత్రలోని రాజేంద్రచోడఋమా రమణుని రాజధానియై యుండునని తలఁచెదను. ఏలన సూరన సోమ యాజి వంశస్థులు గూడ నాప్రాంతములవారే. కృతిపతియగు జన్నయ సిద్ధయ బెల్లముకొండ భైరవుని కృపవల్ల సంపదలనుబడిసి నట్లు విక్రమార్కచరిత్ర ద్వితీయాశ్వాసాంతమున జెప్పబడియున్నది. ఈబెల్లముకొండ గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకాయందున్నది. కావున రాజేంద్రచోడుఁడును అతని యాశ్రితుఁడగు సూరన సోమ యాజియు గృష్ణాతీరము వారగుటయొప్పును.

సూరన సోమయాజి మనుమఁడగు (మొదటి) సిద్ధన "నధికుం డగు నన్నన గంధ వారణంబునకు బ్రధానుఁడై" యుండెను. నన్నన గంధవారణ యనునది యొకమనుష్యుని పేరుకాదు. అదియొక బిరుదు. అనేకరాజు లీ బిరుదును ధరించియుండిరి. సిద్ధన ప్రభువగు నన్నన గంధవారణముయొక్క నిజమైన పేరేదో తెలియదు. అట్లు తెలిసికొనుటకు వలయు సాధనములును గానరావు. నన్నయ గంధ వారణ యన్న బిరుదు "నీతి సారము" అన్న గ్రంథమును విరచిం చిన చోడ బద్దెరాజునకు గలదు. ఇతఁడే (మొదటి) సిద్ధనకొల్చిన

ప్రభువని విశేషలింగంపంతులుగారు సూచించిరి. క్రీ. శ. 1261 నాటి చోడబద్దె భూపాలుని శాసనము నొకదాని నుదాహరించుచు "యీ నన్నయ గంథవారణుఁడే బద్దె నృపతియేమో!" యని యచ్చెరు వందిరి. ఇంతేకాదు "వెలనాటి చోడుఁ" డనబడెడు రాజేంద్ర చోడు నిచే నగ్రహారాదికమును బడసిన సూరన సోమయాజికి మనుమఁడగు సిద్ధన మంత్రి 1240-50 సంవత్సర ప్రాంతములందుండి యుండ వలెనని తీర్మానించిరి. ఆంధ్ర కవుల చరిత్ర 245 వ పుటలో సిద్ధయ సూరన సోమయాజి యొక్కమనుమఁడు. 385-వ పుటలో "మను మఁడనగా సంతతివాఁడు." ఏగాలికి ఆచాప. అది యట్లుండనిండు. 1240-50 ప్రాంతములనున్న సిద్ధయకుమారుఁడగు జన్నయ యటు తరువాత 130-40 సంవత్సరములప్పుడు ప్రభుత్వము సేయనారం భించిన మొదటి దేవరాయలకు మంత్రియగుట ఎట్లుపొసఁగునో పంతులవారు తెలుపరైరి. ఇక క్రీ. శ. 1261 సంవత్సరమునాటి శాసనమును వేయించిన చోడ బద్దిగ దేవరాజును, "నీతిసారమును" రచించిన బద్దెనాఖ్యుఁడును నొక్కరగుదురేమో చూతము. పై శాస నమునందు బేరొక్కనబడిన బద్దెరాజునకు "వీర నారాయణుఁడ" ను బిరుదొక్కటి మాత్రముకలదు. ఈ బిరుదు "నీతిసార" కర్తకును గలదు; కాని, నీతిసారగ్రంథకర్తకుండు ఇతర బిరుదులు-అందున ముఖ్యముగ "నన్నయ గంథవారణ"అను బిరుదు-లేదు. ఈబిరుదులు కులక్రమాగతములు. మూలపురుషుఁడు సంపాదించిన బిరుదులను వంశమునందు కడపటివాఁడు సైతముధరించును. మఱియు బిరుదును బట్టి, ఒకే బిరుదును ధరించిన పురుషులందరును నేకవంశజులనుటయు పొసఁగదు. భిన్నవంశజులకొక్క బిరుదు సామాన్యముగ నుండినట్లు శాసనములు తెలియజేయుచున్నవి కావున శాసనమునందు జెప్పఁ బడిన బద్దెరాజే "నీతిసారము"ను రచించిన బద్దెనాఖ్యుఁడనుట కింకను బలవత్తరమైన సాత్యము గావలయును. ఇది యెట్లున్నను నీతిసార గ్రంథకర్త యే సూరన సోమయాజి మనుమఁడగు సిద్ధయకు ప్రభు వనుట యంగీకరింపదగని మాట.

పైని సిద్ధయకు మంత్రిభాస్కరుఁడు జన్నయలను కొమా ళ్ళిద్దఱు పుట్టిరి. వారియందు రెండవకుమారుఁడగు జన్నయ "దేవ రాయ మహారాయ కరుణాకటాక్ష వీక్షణము" గాంచెను. ఈదేవ రాయమహారాయ లెవ్వరు? మొదటి దేవరాయలా? లేక యతని మనుమఁడగు ఇమ్మడి దేవరాయలా? గ్రంథకర్తయగు జక్కనార్యుని తాతయగు పెద్దయ, నెల్లూరు తిరుకాళ మనుజవిభుని సభయందు వాసికెక్కెనని యును నీ తిరుకాళ రాజును రేచర్ల ఎఱదాచనాయఁడు సింహాసనమున క్రీ. శ. 1278 వ సంవత్సరమున పునఃప్రతిష్ఠితుని గావించెనని యు ఇంతకు పూర్వముప్రాసియున్నాను. 1278 ప్రాంత మున నుండిన పెద్దయ మనుమఁడగు జక్కన 1422 సంవత్సరము మొదలు 1447 వఱకు రాజ్యపాలనముజేసి ఇమ్మడి దేవరాయల కాలమున నుండెననుట పొసఁగదు. కావున కృతిపతియగు రెండవ సిద్ధనయు అతని తండ్రియగు జన్నయయు మొదటి దేవరాయని కడనేయుండిరనుట సమంజసము. క్రీ. శ. 1378 వ సంవత్సరమున రెండవ హరిహరరాయలు తన పుత్రుఁడగు మొదటి దేవరాయని రాయరాజ్యమున కంతటికిని ప్రథమ దుర్గమని పేరందిన యుదయ గిరికి పాలకునిగ నియమించెను. అతడు 1406వ సంవత్సరము వఱకు నచ్చటనే యుండి రాజ్యమును పాలించుచుండెను. ఉదయగిరికివచ్చినది మొదలు దేవరాయలు తన ప్రక్కనున్న రెడ్డిరాజ్యమును హరింప నుద్యుక్తుఁడై తరుణమువేచియుండెను; కాని 1382-వ సంవత్సర మున అనవేమారెడ్డి మృతినందు వఱకును అతఁడు తనయభిలాషను నెరవేర్చుకొనజాలక పోయెను.తరువాత కుమారగిరిరెడ్డి రాజ్యారంభ కాలమున అసఁగా 1382-85 సంవత్సరములకుమధ్య నతఁడు రెడ్డి రాజ్యపు పశ్చిమార్ధమును జయించెను. అప్పుడే జన్నయయు నతని పుత్రుఁడగు సిద్ధనయు కర్ణాటక ప్రభువుల కొలువునందు ప్రవేశించి యుండవలయును. అప్పటికి జక్కన పెద్దవాఁడై కవియని ప్రఖ్యాతి గాంచి యుండుటచేత నతనికడ విక్రమార్కచరిత్రను గృతినందెను. కావున విక్రమార్కచరిత్ర రచనాకాలము క్రీ.శ. 1485-90 సంవత్స రముల మధ్యననుట యొప్పును.

వెన్నెలకంటి సూరన్న: ఇతఁడు కృతిపతికి పెదతండ్రియఁట. మటియు నీతఁడు రెడ్డివేమ నరపాలకునిచేత నగ్రహారములు బడసెను. ఈ రెడ్డివేమ నరపాలుడెవ్వఁడు? కొండవీడు రాజమహేంద్రవర రాజ్యములునేలిన రెడ్డిరాజులయందనేకుల కీ పేరుగలదు: ప్రోలయ వేమారెడ్డి, అనవేమారెడ్డి, పెదకోమటి వేమారెడ్డి, రాచవేమారెడ్డి, కాటయ వేమారెడ్డి, అల్లయవేమారెడ్డి. వీరిలో రెడ్డివేమ నరపాలుఁడే వేమారెడ్డి కాఁగూడదు? కావుననే వీరేశలింగం పంతులు రెడ్డివేమ నరపాలుఁడు ప్రోలయ వేమారెడ్డియగుననఁగా, మఱొకరు రాచ వేమారెడ్డి యనిరి. అయితే నిశ్చయముగ నీ రెడ్డివేమ నరపాలు డెవ్వఁడు? ఈ విషయమును విష్ణుపురాణ గ్రంథకర్తయగు వెన్నెల గంటి సూరన్న సాయమువల్ల కనుఁగొనవచ్చును. తన పూర్వీకులను వర్ణించు సందర్భమున నతఁడిట్లు వ్రాసియున్నాఁడు.

ఈ నిఖలంబు మెచ్చ నమరేశ్వరదేవుఁడు చూడఁ గృష్ణవే
ణీనది సాఁకిగా ననికినిల్చిన రావుతుఁ గేస భూవిభు

గానకుఁ దోలి వెన్నడిచికాచిన వేమయ యన్నపోత భూ
జానకి సత్ప్రబంధము లొసంగిన వెన్నెలగంటి వారిలోఁ.

రెడ్డివేమ నరపాలకుచేత మహాగ్రహారముఁగొన్న వెన్నెలగంటి సూరనయు, నన్నపోత భూజానికి సత్ప్రబంధము లొసంగిన వెన్నెల గంటి కవియు నొక్కఁడేనని వీరేశలింగం పంతులుకారు చాలా కాలముక్రింద చక్కఁగా గుర్తించిరి. కావున సూరన, యనపోత యన వేమారెడ్లకాలము వాఁడగును. వారు ఒకరివెనుక నొకరు క్రీ. శ. 1354 వ సంవత్సరము మొదలు 1381 సంవత్సరము పర్యంతము ప్రభుత్వమొనర్చిరి. కావున వెన్నెలకంటి సూరనార్యుఁడును అప్పటి వాఁడే. ఇతని తమ్ముఁడును, విక్రమార్కచరిత్ర కృతిపతియొక్క తండ్రియునగు జన్నయ దేవరాయ మహారాయల కృపకు పాత్రుఁడాయెను. కృతిపతి యగు సిద్ధన దేవరాయలమంత్రియగు చామనామాత్యునిచే సత్కరింపబడెను. వీరెల్లరును క్రీ.శ. పదునాల్గవ శతాబ్దము చివరభాగమున నుండిరి. జక్కనయు నప్పటివాఁడే.

హరిభట్టు

హరిభట్టుకృతములగు పెక్కు కావ్యములు లభ్ధములై నను, ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు నారసింహపురాణమును బ్రకటించు నంతనఱకును నాతని కాలము నిర్ణయించుటకు దగిన యాధారములు దొరకవాయెను. ఏ తత్కారణముననే కందుకూరి వీరేశలింగం పంతులుగా రీతనికాలము నెఱుఁగఁజాలక త్రిప్పట్లుపడి, అప్ప కవికిఁ దరువాతివాఁడని తాత్కాలికముగ నిర్ణయించుకొనిరి. "అప్పకవి యీ గ్రంథములనుండి (అప్పటికి లభ్యమైన వరాహ, మత్స్యపురాణ ములనుండి) లక్ష్యములను చేకొనకపోవుటచేత నీ కవి యతనికిఁ దరు వాత నున్నాఁడేమో యని యూహ కలుగుచున్నది. కాఁబట్టి తగిన యాధారములు దొరకువఱకును మనమిప్పటి కీ కవికాలము క్రీస్తు శకము 1660-వ సంవత్సర ప్రాంతమని భావింతము. 1

---

1. ఆంధ్రకవుల చరిత్రము, తృతీయభాగము, పుట 859.

నారసింహపురాణ పీఠికయందు లభ్యమైన నూతనచరిత్రాంశములనుబట్టి వీరేశలింగముగారి యూహ సరియైనదికాదని నిశ్చయమగుచున్నది. ఈవిషయమును జర్చించి కీ. శే. ఓలేటి వెంకటరామశాస్త్రిగారు కవికాలము క్రీ.శ. 15-వ శతాబ్దోత్తరభాగమని సిద్ధాంతీకరించియున్నారు. "గనుగ....హరిభట్టు 15-వ శతాబ్దియం దుత్తరభాగమున నున్న వాఁడగుటకు సందేహములేదు. అట్లగుచో నీకవి శ్రీకృష్ణదేవరాయల రాజ్యారంభకాలమునకు ముందే యల్లసాని పెద్దనామాత్యునికంఱె గొంచెము పూర్వుఁడుగానో, సమకాలము వాఁడుగానో యుండి యాధునిక కవులకాదియందుఁ జేర్పఁబడుటకు బదులుగా మధ్యకవులకాదినో, పూర్వకవులకుఁ గడపటనో చేర్పఁదగిన వాఁడగును" 2

వెంకటరామశాస్త్రిగారి కాలనిర్ణయముగూడ నంగీకరింపఁదగినదిగాదు. నారసింహపురాణ పీఠికయందు వచింపఁబడిన యంశములు హరిభట్టు వెంకటరామశాస్త్రిగారిచే నిర్ణయింపఁబడిన కాలమునకంఱె దరువాతివాఁడని తెల్పుచున్నవి. పీఠికయందలి యంశములను మొదట సంగ్రహముగాఁ బొందుపఱచి తరువాత నవి హరిభట్టుకాలనిర్ణయమున కెట్లు సాధనములగునో తెల్పెదను.

హరిభట్టు భారద్వాజ గోత్రజుఁడగు రామవిద్వన్మణి కుమారుఁడు. హనుమత్కటాక్షలబ్ధ వరప్రసాద సహజసారస్వతచంద్ర నామాంకుఁడు. అష్టఘంటావధాన పరమేశ్వరుఁడు. ఇతఁడు భాగవత పురాణమందలి యేకాదశ ద్వాదశస్కంధములను దెనిఁగించెను. నారసింహపురాణోత్తరభాగము నాంధ్రీకరించెను. కాని యారెండవ గ్రంథము నెవ్వరికి నంకిత మీయకయే యాతఁడు మృతినందినట్లు తోఁచుచున్నది. ఏలన, కృతిపతియకు ప్రోలుగంటి రంగమంత్రి హరిభట్టు కుమారుఁడగు రాఘవమనీషిని దనకొలువునకుఁ బిలువనంపి మీ తండ్రియగు

---

2. నారసింహ పురాణము (ఆ.సా.ప. సంఖ్య 18): సంపాదకీయోపోద్ఘాతము, పుటలు 9-10.

"హరిభట్టు నిఖలవిద్యాచతురాస్యుండు
రాజమాన్యుఁడు కవిరాజనుతుఁడు

నారసింహపురాణ పౌరస్త్యభాగంబుఁ
బెదలువాడెట్టిన మొదలు సేయఁ
బ్రతిభ దళుకొత్త నుత్తరభాగ మిప్పు
డంధ్రభాషను వచినకావ్యం బొనర్చె
నాప్రబంధంబు నా పేర నంకితముగ
నీవు గావింపవలయుఁ గవీంద్రగణ్య!"


యని కోరెను. హరిభట్టే యపుడు సజీవుఁడై యుండినఁ దత్కృతగ్రంథమును నాతని కుమారునిఁ దన కంకితమిమ్మని రంగ మంత్రి యడిగియుండఁడు. అంకితమొనర్చుటకు గ్రంథకర్త యే యర్హుఁడు గాని యితరుఁడుగాఁడు. మఱియు గృహ్యాద్యవతారికను నితరుఁడు రచియింపవలసిన యవసరముండదు. కావున ప్రోలుగంటి రంగయ రాఘవమనీషిని గ్రంథమును దన కంకితమిమ్మని కోరుటకుఁ బూర్వమే హరిభట్టు మృతినందెనని తలఁచుట సమంజసముగ నున్నది.

రంగమంత్రి యభీష్టమును నెరవేర్చ రాఘవమనీషి యంగీకరించి పీఠికను రచియించి యాతని కంకితమొనర్చెను. స్వవిరచిత పీఠికయందు రాఘవమనీషి కృతిపతిపూర్వోత్తరము నిట్లు వర్ణించి యున్నాఁడు:

వసిష్ఠగోత్రమున ప్రోలుగంటి తిప్పన పుట్టెను. అతఁడు ప్రౌఢ రాయల దండాధీశుఁడు. భైరవాంబయం దాతనికి కొండన, నాగన లను నిరుపురు పుత్రు లుద్భవించిరి. వీరియందు పెద్దవాఁడగు కొండన మల్లమ నుద్వాహము చేసికొని యామెయందు నరసన తిమ్మలనను పుత్రులఁ బడసెను. నరసన తిరుమలాంబను వరించి

యామెయందు తిమ్మయ, వెంగళప్ప, ఓబయ, రంగయ, కొండ యలను నేపురు తనయులఁ గాంచెను. తిమ్మయ లక్ష్మమాంబను బెండ్లాడి సింగన, మాదనలను గనెను. వెంగళప్ప తిమ్మాంబను ధర్మ పత్నిగఁ గైకొనెను. వీరికి సూరసచివుఁడు పుట్టెను. ఓబయ గోప మాంబను వివాహమాడి యామెవల్లఁ చెన్నన, తిమ్మనలను కొడుకు లను బొందెను. రంగయ దండనాథుఁడు, ఇతఁడు నందెల చినయోభ నాథునిమంత్రి; నారసింహ పురాణ కృతిపతి.ఇతని భార్య హనుమమ. కొండయ రంగాంబను వరించెను. ఈ యిద్దుగురు సోదరుల పినతండ్రి యగు తిమ్మన హరిభక్తుఁడు. అతనికి అక్కమాంబయందు తిమ్మయ, అప్పయ, నరసయ. తిర్మలయలను నలువురు పుత్రులు జన్మించిరి. ఇంతవఱకును ప్రోలుగంటి కొండయవంశము వర్ణింపఁబడెను. ఇఁక సీతని యనుజుఁడగు నాగన సంతతినిగూర్చి చెప్పవలసియున్నది. ఇతఁడు దేవమను బెండ్లియాడెను. వీరి పుత్రుఁడు చెన్నయ. ఇతఁడొక దొడ్డకవి. పెక్కుగ్రంథములను రచించె. అందు నారసింహపురాణ మును ద్విపదగా రచియించి యహోబలపతి కంకితమిచ్చెను. భాల భారతము నాంధ్రభాషయందు వ్రాసెను. సౌభరిచరితమును జక్కుల కథగఁ జెప్పెను. మఱియుఁ బెక్కుకృతులను రచించి నరసింగ రాయలచే నగ్రహారములను, వివిధార్థములను గొనెను. ఇతని ధర్మ పత్ని కొండమ. వీరికి నరసన యను కుమారుఁడు గల్గెను.

ప్రోలుగంటివారి వంశవృక్షము.



నారసింహ పురాణ రచనాకాలనిర్ణయ సందర్భమున పైవంశస్తుల యందు పేర్కొనదగినవారు ముగ్గురే. ప్రథముఁడు వంశకర్తయగు తిప్పన. ఇతనిఁగూర్చి రాఘవమనీషి యిట్లు వ్రాసియున్నాఁడు:

"అమత్రీంద్రుఁడు ప్రౌఢరాయనృప దండాధీశసంపత్కళా
సామగ్రి న్వీలసిల్లి మల్లిసుమభాస్వత్కీర్తి విస్ఫూర్తిను
ద్దామసాధ్యమహోమహత్త్వమున సంధాయుక్తి దోశ్శక్తి వా
చామాధుర్యమునం బురావిభులతోఁ జర్చించు వర్చస్వి యై."

ఇందువల్ల ప్రోలుగంటి తిప్పన ప్రౌఢరాయని సమకాలీనుఁడనుట నిశ్చయము. ఈ ప్రౌఢరాయలే విజయనగరమును క్రీ. శ. 1422-వ సంవత్సరము మొదలుకొని 1447 వఱకును పాలించిన ఇమ్మడి ప్రౌఢదేవరాయలని వెంకటరామశాస్త్రులవారు వచించిరి.[1] కాని ఇది సంశయాస్పదము. ఏలనఁగా విజయనగరమును ప్రౌఢరాయనామాంకితులగు రాజులు నల్గురు రాజ్యముజేసినట్లు తెలియుచున్నది. వీరియందు మొదటివాఁడు ఇమ్మడి హరిహరరాయల పుత్రుఁడగు మొదటి దేవరాయలు. కొన్ని శాసనము లీతని ప్రౌఢదేవరాయలని పేర్కొనుచున్నవి.[2] ఇతఁడు క్రీ. శ. 1406 మొదలుకొని 1421 వఱకును రాజ్యమునల్పెను. రెండవ వాఁడు క్రీ. శ. 1422 మొదలు 1446 వఱకును నేలిన ఇమ్మడిదేవరాయలు. ఇతఁడు పెక్కు శాసనములలోఁ దనపేరు ప్రౌఢదేవరాయలనియును, ప్రౌఢప్రతాపదేవరాయలనియును జెప్పుకొని యున్నాఁడు. ఆధునిక చరిత్రకారులందఱు నితనినే ప్రౌఢదేవరాయలని యందురు. మూఁడవవాఁడు ఇమ్మడి దేవరాయని కుమారుఁడగు మల్లికార్జునదేవరాయలు. ఇతఁడు క్రీ. శ. 1448 మొదలుకొని 1466 వఱకు రాజ్యమొనర్చినట్లు తెలియుచున్నది. పెక్కు శాసనములయం దీతఁడు

---

1. నారసింహపురాణ సంపాదకీయోపోద్ఘాతము, పుట 9.
2. M. E. R. 399 of 1926

ఇమ్మడిప్రౌఢదేవరాయలనియును, గొన్నిటి యందు ముమ్మడి ప్రౌఢ దేవరాయలనియును బేర్కొనఁబడియున్నాఁడు. నాలవవాఁడు విజయ నగరమున క్రీ. శ. 1486 ప్రాంతమున నిమ్మడి విరూపాక్షరాయల యనంతరమును, సాళ్వగుండ నరసింహరాయలకుఁ బూర్వమును రాజ్యమును పాలించిన ప్రౌఢరాయలు. ప్రౌఢరాయనామధారులగు నీ నలుగురురాజులం దెవ్వరికి ప్రోలుగంటి తిప్పన సమకాలీనుఁడో నిర్ధారించి చెప్పుటకు దగిన యాధారములు నారసింహపురాణమునఁ గానరావు. కాని యాతఁడు క్రీ.శ.15 వ శతాబ్దము చివరనుండెనేమో యనునూహ పొడమఁజున్నది. ఇతనికి నాల్గవతరమువాఁడును, నార సింహపురాణ కృతిపతియునగు రంగమంత్రి క్రీ. శ. 1550 ప్రాంత మున నుండెననుటకు బలవత్తరమైన సాక్ష్యముగలదు. తరమునకు 25 సంవత్సరముల చొప్పున లెక్కవేసి పరిగణించిన నితనికాలము క్రీ. శ. 1450 మొదలు 1475 వఱకని తేలుచున్నది. కావున నితని సమకా లీనుఁడు ముమ్మడి ప్రౌఢదేవరాయాపరనామాంకితుఁడైన మల్లికా ర్జునదేవరాయ లగును.

ద్వితీయుఁడు ప్రోలుగంటి తిప్పనామాత్యుని పౌత్రుఁడు చెన్న కవీంద్రుఁడు. అతఁడు పెక్కుగ్రంథములను రచించి నరసింగరాయల మెప్పు వడసి యాతనివల్ల నగ్రహారములను, వివిధార్థములను గొని నట్లు నారసింహపురాణపీఠిక యందున్నది;కాని యా నరసింగరాయ లే నరసింగరాయలో? విజయనగరమున క్రీ. శ. 1485 మొదలు 1509 వఱకును నలువురు నరసింగరాయ నామధారులు రాజ్యము చేసిరి: (1) సాళ్వగుండ నరసింగరాయలు. ఇతఁడు క్రీ. శ. 1450 ప్రాంతమునఁ జంద్రగిరిగద్దె నెక్కెను. 1485 వ సంవత్సరమున విజయనగరమును పరిపాలించుచుండిన ప్రౌఢరాయని వెడలనడఁచి సింహాసనము నాక్రమించుకొని 1490-వ సంవత్సర పర్యంతమును సామ్రాజ్యము నేలెను. (2) తరువాత నితని కుమారుఁడగు నిమ్మడి నరసింగరాయఁడు సింహాసనము నధిష్ఠించి 1505 పర్యంతము ప్రభు త్వము సల్పెను. ఇతఁడు బాలుఁడు; రాజ్యాంగమును నడవుటకుఁ

దగినశక్తిలేనివాఁడు.కావున,(3)సర్వసేనాధిపతియగు నరసానాయకుఁ డితనికి ప్రతిగ రాజ్యము బరిపాలించుచుండెను. నరసానాయనికి నరసింహరాయఁ డన్న నామాంతరము గలదు. (4) ఇతఁడు క్రీ. శ. 1503లో శివలోకప్రాప్తుఁడు కాఁగా నితని పెద్దకుమారుఁడు ఇమ్మడి నరసానాయకుఁడు రాజ్యాధికారమును వహించి 1504-వ సంవత్సర మున ఇమ్మడి నరసింహరాయని వధించి, వీరనరసింహరాయఁడను నామమును వహించి పట్టాభిషిక్తుఁడై 1509-వ సంవత్సరమువఱకును రాజ్యపాలన మొనర్చి పరలోకగతుఁ డాయెను. ఇట్లు క్రీ. శ. 1485, 1509 సంవత్సరములమధ్య విజయనగరమున రాజ్యపాలన మొనర్చిన నలుగురు నరసింగరాయలలో నెవ్వరు చెన్నకవీంద్రున కగ్రహారాదిక ముల నొసంగిరో కనుఁగొనుట సులభసాధ్యముగాదు. కాని పైనఁ జెప్పినట్లు ప్రోలుగంటి తిప్పన క్రీ.శ. 1450-75 సంవత్సరముల మధ్య నుండెనను విషయ మంగీకృతమేని యాతని మనుమఁడగు చెన్నకవి క్రీ.శ. 1500-1525 సంవత్సరముల మధ్య వెలసె ననుట యసమంజ సము కాఁజాలదు.[1]

తృతీయుఁడు నారసింహపురాణ కృతిపతియగు రంగయ. ఇతఁడు నందెల చినయాబళరాజునకు మంత్రి. ఈ యాబళరాజు నారసింహపురాణ పీఠికయందు ఇట్లు ప్రశంసింపఁ బడియున్నాఁడు:

---

1. నందిమల్లయం ఘంటసింగయలచే విరచింపఁబడిన వరాహపురాణ పీఠికయందొక నరసింహవిజయపురాణమునకు నరసానాయకుఁడు గృతిపతి యైనట్లు తెల్పియున్నారు:

క. "వాణీకరవీణాని, క్వణరతికి వినయమతికి వరలక్ష్మీక
ల్యాణ నరసింహవిజయపు, రాణ కథారమణతానురాగస్థితికిఁ"

(వరా; 1. 46)

కాని ప్రోలుగంటి చెన్నప్రధాని గ్రంథమునకుఁ గృతిపతి యహోబల పతి యగుటచే నివి రెండును వేర్వేరు గ్రంథములని తేలుచున్నది.

సీ. "తన మండలాగ్ర ముద్దండారిమండల
భూధరంబులకు దంభోళిగాఁగఁ

దన కృపారసము బాంధవసేవకాళితో
ద్యానసీమకు వసంతంబుగాఁగఁ

దన చక్కఁదనము కాంతామనశ్చంద్రకాం
తములకుఁ జంద్రికోదయముగాఁగఁ

దన నీతివర్తన ధారుణీజనచాత
కంబుల కభ్రాగమంబుగాఁగఁ

వెలసె నేరాజు సముద్రబలసమగ్ర
కమతశర్మదభుజపీఠగమితధరణి
యతఁడు నందెల నరసింగయాంతరంగ
తామరసహేళి చినయోబదానశాలి"

ఈ పద్యమువల్ల పోళిలుగంటి రంగమంత్రి నేలిన ప్రభువగు చినయోబభూపాలుఁడు నందెలనరసింగరాజు కొమారుఁడని తెలియు చున్నది. మఱియు,

"అతఁడు హోవళి చినయోభళావనీశ
బహుళ సామ్రాజ్యధౌరేయమహిమనిపుణ
విపుల బాహార్గళాటోపవిజితభుజగ
సార్వభౌముండు రంగయసచివఘనుఁడు."

—నారసిం. 1 : 51.

"హోవళి చిన్న యోభళవసుధావల్లభమం(తవ్య 203)
"హోవళిచిన్న యోభళ ధరాధిపశేఖరు నేన్యపాల" (3: 203

అను పద్యములు చిన్నయోబళభూపాలునకు హోవళిచినయో బళుఁడను నామాంతర ముండెనని తెలుపుచున్నవి. నందెలవంశము

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

ఆరవీటి బుక్కరాజు కొమారుఁడగు సింగరాజుతో నారంభమాయెను. సింగరాజువంశజులే నందెలవారైరి. రామరాజీయమున నిట్లు చెప్పియున్నది.

కే. "ఆ బుక్కరాజేంద్రుఁ డబ్బళదేవి బ
ళ్లాదేవి యను సతులను వరించి
యబ్బళదేవియం దాత్మజులను సింగ
విభుఁ డాదిగాఁగను వేడ్కఁ గాంచి
నందేల యెసఁగ నా నందను లాపురిఁ
దమకును నిజరాజధాని గాఁగ
నేలుచుఁ గులము నందేలపేర ధరిత్రిఁ
దనరఁగఁ బుత్రపౌత్రాభివృద్ధి
తే. నతిశయిల్లిరి....."[1]

కావున బుక్కరాజు సింగరాజునకుఁ బూర్వము నందెలవంశము లే దనుట తెల్లము. ఆరవీటి బుక్కరాజు సాళువ నరసింగరాయల సమకాలీనుఁడు.

"నర నాథమణి సాళ్వ నరసింహరాయ
వరసఖుం డయి బుక్క వసుధేశుఁ డలరె"

అని బాలభాగవతమందును,

"అతఁడు దను మన్నెపులియని యఖిలదిశలఁ
జెలఁగి పొగడ సాళువ నరసింగరాయ
రాజ్య సంస్థాపకుం డయ్యెఁ బ్రౌఢి నారె
వీటి బుక్కనరేంద్రుఁ డుద్ఘాటితారి."[2]

అని రామరాజీయమునందును నతఁడు సాళ్వ నరసింగరాయల చెలికాఁడనియును, రాజ్యప్రతిష్ఠాపకుఁడనియును జెప్పఁబడియున్నది.

---

1. రా. రా. 203.
2. రా. రా. 202.

సాళ్వనరసింగరాయలు క్రీ. శ. 1450 మొదలు 1490 వఱకును జంద్రగిరియందును, విజయనగరమునను దొరతనమొనర్చెనని పైనఁ జెప్పియున్నాఁడ. క్రీ. శ. 1462-వ సంవత్సరమున గజపతి కపిలేశ్వరుఁడు దక్షిణదేశముపై దిగ్విజయయాత్ర వెడలి చంద్రగిరి మొదలైన పెక్కు దుర్గములను స్వాధీనపఱచుకొనెను. కాని యచిరకాలముననే యొడ్డొనైన్యములను దరిమి దేశమును సాళ్వనరసింగరాయలు మరల స్వాధీనము జేసుకొనెను. ఆర్వీటి బుక్కరాజు నరసింగరాయల రాజ్యమును స్థాపించిన దీసందర్భమున నైయుండవలయును. కృష్ణరాయల రాజ్యాభిషేక మహోత్సవమును జూడవచ్చిన రాజులలో "చక్కర విల్కాని చక్కందనము గల్గు చొక్క మౌ నార్వీటి బుక్కరాజు" ఒక్కఁడని కుమారధూర్జటి తన కృష్ణరాయ విజయమున వ్రాసియున్నాఁడు. ఇది విశ్వసనీయముగాదు. ఏలనఁగా నార్వీటిబుక్కరాజు మనుమఁడగు రామరాజు తిమ్మరాజు వీరనరసింహరాయల సేనాధిపతి. నటీయొక మనుమఁడగు రామరాజు శ్రీరంగరాజు కుమారుఁడగు నళియరామరాజు క్రీ. శ. 1518-వ సంవత్సర ప్రాంతమునఁ గృష్ణరాయల పుత్రికయగు తిరుమలాంబ నుద్వాహము జేసుకొనెను. అప్పటి కాతఁడు యౌవన వంతుఁడు. తత్పూర్వమాతఁడు గోలకొండ కుతుబుశాహీరాజ్యస్థాపకుఁడగు సుల్తాను కుల్లీకుతుబుశాహు కొల్వునఁ గొంతకాలముండెను. ఇతని యధిపత్యమున నుండిన యొకానొక దుర్గమును గృష్ణరాయ లొడిచికొనఁగా కుతుబుశాహితనిపైఁ గలుషించి తన కొలువునుంచి వెడలనడఁచెను. అటుతర్వాత రామరాజు విజయనగరమునకు వచ్చి రాయలను మెప్పించి యాతని కూఁతును వివాహమాడెను. కావున, కుమారధూర్జటి వచనమును విశ్వసించినచో నార్వీటి బుక్కరాజును, నాతని మునిమనుమఁడగు అళియరామరాజును సమకాలికులుగా నుండిరని యొప్పుకొనవలసివచ్చును. బలవత్తరమైన సాక్ష్యము లభ్యమగు వఱకును వీరి సమకాలీనత్వము నంగీకరించుటకు వీలుకాదు. ప్రస్తుత మార్వీటిబుక్కరాజు క్రీ.శ. 1450-60 ప్రాంతములందు ప్రబలుఁడై యుండి, సాళువ

నరసింగరాయలకు రాచకార్యములందు బాసటయైయుండెనని తలఁ చుట సమంజసము. నందెలవంశమీతని నాఁడభ్యుదయమగుటచేత తద్వంశకర్తయు, నీతని పుత్రుఁడును నగు సింగరాజప్పటికే పెరిగి పెద్దవాఁడయి యుండినట్లు తోఁచెడిని. కావున నందెలవంశము క్రీ.శ. 1470 సంవత్సర ప్రాంతమున నంకురించెనను తలంపు వాస్తవమునకు దూరము గాఁజాలదు.

హోవళి చినయాభళరాజు నందెలవంశకర్తయైన సింగరాజున కైదవతరమువాఁడైనట్లు పింగళి సూరనార్యుని కళాపూర్ణోదయము వల్లఁ దెలియుచున్నది. అందలి వంశవృత్తమిది.[1]

సింగరయ్య = భా. బొబళ దేవి
|
నరసింగయ్య = భా. మాదల దేవి
|
నరసింగయ్య = భా. గౌరమాంబ
|
నారసింహరాజు = భా. రామాంబ
|
హోవళిచినయాబొబళరాజు

హోవళిచినయాబొబళరాజు సదాశివరాయల రాజ్యారంభదశ యందు సిరివొళ్ల, కోవెలకుంట్ల సీమలను బాలించుచుండెను. ఇతని దానములను దెల్పు శాసనములు పెక్కు కానవచ్చుచున్నవి.

ప్రక్క పుటలోని జాపితాయందు వానినిఁ బొందుపఱచియున్నాను.

---

1. కళా. 1; 24-40.

హోవళి చినయోబళరాజు గావించిన దానములను దెలుపు శాసనములు

ప్రస్తావన	స్థలము	కాలము	దాత
1. సానిక చరిత్రలు సం. 15 పుట 388	సిరువొళ్ళ గ్రామమునకు సంబధించిన దేవలాపురము హనుమంతరాయని యాలయమునందు.	శా.శ.1469 ప్లవంగ	నందెల సింగరాజు నరసింహరాజు చిన అవుబళరాజు
2. ,, ,, పుట 416	సిరువొళ్ళ ప్రాతకోటకు పూర్వభాగమునందుచెఱువు కట్టకు పశ్చిమమునందు నృసింహదేవాలయమున.	,,	,,
3. ,, ,, పుట 418	యల్లగుంట్లకోటలోని చెన్న కేశవస్వామి యాలయమునకు ఎదుట అరుగునం దారుతుకలుగ పగిలిన శాతిపలకమీద.	,,	,,
4. ,, ,, పుట 420	సిరువొళ్ళ తాలూకాయఱ గుడిదిన్నె గ్రామమున వేంకటేశ్వరుని దేవాలయమందు.	,,	,,
5. ,,సం. 16 పుట 421	సిరువొళ్ళ తాలూకా యాదాడి అగ్రహారము మధ్య ఉప్పునీళ్ళబావి యొద్ద.	,,	,,
6. ,, ,, పుట 458	కందనవోలు సీమలోసి గాడిదమళ్ళ అగ్రహారమున కేశవస్వామి యాలయము దగ్గర.	,,	,,
7. ,, ,, పుట 459	సిరువొళ్ళ సీమలోని వల్లంపాడు గోపాలస్వామి దేవాలయ సమీపమున.	,,	,,
8. ,, ,, పుట 458	సిరువొళ్ళ సీమయందలి పేరూరు విశ్వేశ్వరాలయ సమీపమున.	,,	,,
9. ,,సం. 15 పుట 433	మీది యహోబళమందు.	శా.శ.1470 కీలక	,,

ఈతొమ్మిది శాసనములవల్ల నందెల హోవళి చినయౌబళరాజు శా. శ. 1469-70 (= క్రీ. శ. 1547-8-1548-9) సంవత్సరములయందు ఇపటి కర్నూలు మండలాంతర్గతములగు సిరువొళ్ళకోయిల కుంట్లసీమలపై నధికారము సల్పుచుండెనని తెలియుచున్నది. తరువాత ఎంతకాలమువఱకితఁడు జీవించియుండెనో చెప్పుటకు వీలుకాదు;కాని యాతఁడు యుద్ధమున నిహతుఁ డాయెను.శ్రీశైల పరిసరదేశముపై దొరతనముజేయుచుండిన వెలుగోటి గనితిమ్మానాయనితో నీతనికి వైరముపొసఁగి యితఁడాతనిఁ గదనమున వధించెను.తండ్రి పగదీర్చుటకై తిమ్మానాయని పుత్రుఁడగు నాయనప్పదండెత్తి వచ్చి చినయౌబళరాజును బరిమార్చెను. వెలుగోటివారి వంశావళియం దీవిషయము జక్కఁగ వర్ణింపఁబడియున్నది:

> "అలవునఁ దాళజంఘులను హైహయులఁ ద్రుపదేంద్రుపుత్రునిఁ దొలి సగరుండు భార్గవుఁడు ద్రోణతనూజుఁడు ద్రుంచినట్లు వి హ్వలముగ సోమవంశజుని యావడి(శి)యౌబళరాజు నాజిలో నలిగి వధించేఁ దండ్రివగకై భళి! మావెలుగోటినాయఁడుఁ.
>
> ఆవడియౌబ నృపాలుని
> నావడినే నాయనయ్య యసిధార దెగఁ
> గా వడినె రంభగైకొనె
> యావడినేయంగ దివిజు లక్కడ బెదరఁ."[1]

---

1. వెలుగోటివారి వంశావళి, పుటలు 254-55.

నాచేఁబరిష్కృతమై మదరాసు విశ్వవిద్యాలయ చారిత్రకశాఖ నెం. 6 రు బుల్లెటిఁగఁ బ్రకటింపఁబడిన వెలుగోటివారివంశావళి, పీఠిక 49-వ పుటయందు హోవడి యౌబళరాజును వెలుగోటి నాయనయ్య క్రీ.శ.1546-వ సం. మందు వధించెనని వ్రాసియున్నాను. నా కప్పు డీవ్యాసమునం దుదాహృతములైన శాసనముల యునికి తెలియదు. కావున వైనుదాహృతమైన 'అలవు నఁదాళజంఘుల' ననుపద్యమునకు ముందటి 'అరయఁ దిమ్మాయ నాయనేం ద్రుఁడు' (253) అను పద్యమునందు చెప్పఁబడిన పరాభవ సంవత్సర భాద్రపద శుద్ధ 4 సోమవారమునాఁడు నాగార్జునునికొండయొద్ద జరిగినయుద్ధమునకే యావడియౌబళరాజు మడిసెనని తలఁచి యట్లువ్రాసితిని. క్రీ శ. 1547, 1548 సంవత్సరములనాఁటి యౌబళరాజుశాసనములు పై యూహ సరియైనది కాదని తెల్పుచున్నవి. కావున నాగార్జునునికొండ యుద్ధమునకును ఔబళరాజునకును సంబంధమున్నట్లు కానరాదు.

కాని ఈతని శాసనములు క్రీ. శ. 1548-వ సం. మునకుఁ దరువాతఁ గాన్పించుటలేదు. ఏతత్కారణమున నితఁ డటుపిమ్మట అచిరకాలమునకే నిహతుఁడై యుండునేమో యనుసందేహము పొడమచున్నది.

ఇంతవఱకును నారసింహపురాణ కృతిపతినేలిన హోవళియూబళ రాజు కాలమును జరిత్రమును జర్చించితిని. ఇఁక గృతిపతి కాలమును దెల్పు నితరాధారములను విచారించవలసి యున్నది. శా.శ.1465-వ సంవత్సరమునకు సరియైన శోభకృతు సంవత్సర మాఘ శుద్ధ 11 లు నాఁడు హోవళి చినయూబళ రాజుయొక్క పినతండ్రియైన యూబళయ్య మహారాజుగా రొసఁగిన వైష్ణవాగ్రహారధర్మశాసనమున నితఁడొక వృత్తిస్వామిగఁ బేర్కొనఁబడియున్నాఁడు. ఆశాసన మిదిః

"స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకంబులు 1465లు అగు నేటి శోభకృతునామ సంవత్సర మాఘ శుద్ధ 11 లు....శ్రీమద్రాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీ వీరసదాశివదేవ మహారాయలుగారు వజ్రసింహాసనారూఢులై పృథ్వీసామ్రాజ్యంచేస్తూవుండగా సోమవంశోద్భవులైన ఆత్రేయస గోత్రులయిన శ్రీమన్మహామండలేశ్వర నందెల సింగరయ్య దేవ మహారాజులుంగారి పుత్రులయిన అవుబళయ్యదేవ మహారాజులుంగారు శ్రీమారకాపుర చెన్నకేశవ పెరుమాళ్లకున్ను శ్రీవైష్ణవులకున్ను యిచ్చినధర్మశాసనక్రమమెట్లన్నను శ్రీసదాశివదేవ మహారాయలుంగారు మాకు నాయంకరానకు పాలించనవధరించిన కొచ్చర్లకోట సీమకుచేరిన తర్నుపాడున్ను అందులో పల్లెలు..... సహితమైన గ్రామాలకు చతుస్సీమకున్ను లోనైన తర్నుబాటిసీమకు ప్రతినామమైన రఘుపతి రాజపురం గణవృత్తి సంఖ్యలు 50 కి శ్రీ చెన్నరాయలకు అమృత

పళ్లకు వృత్తులు 20. నానాగోత్రసూత్ర నానాశాఖాధ్యయను లయిన శ్రీ వైష్ణవ చక్రవర్తులకు వృత్తులు..... ప్రోలుగంటి రంగయ్య వృత్తి 1....."[1]

కావున ఉత్తర నారసింహపురాణకృతిపతియగు ప్రోలుగంటి రంగయ్య క్రీ.శ.1543-వ సంవత్సరమున నందెలసింగరాజు కొమారుడును, హోవళి చినయౌబళరాజునకు పినతండ్రియును నగు యౌబళరాజొసగిన యగ్రహారమును గొనిన ప్రతిగ్రహీతలలో నొక్కడని తేలుచున్నది. మఱియు నీతడు క్రీ.శ. 1548-వ సంవత్సరమున సిరువొళ్ల,కోయిల్‌కుంట్లసీమల నేలిన చినయౌబళరాజున కమాత్యుడుగ నుండెడుగాన, నీతడంతవఱకు సజీవుడయ్యుండె ననుట నిశ్చయము. ఇతడు నారసింహపురాణమును రాఘవమనీషిచే క్రీ.శ.1543-1548 సంవత్సరముల మధ్య నంకితముగొనియుండెనని తలచవచ్చును. అప్పటికి హరిభట్టు కాలగతి నంది యుండుటచేత నాతడు విద్యానగర చక్రవర్తులగు కృష్ణరాయాచ్యుతరాయలకు సమకాలీనుడై యుండెనని నిస్సంశయముగా జెప్పవచ్చును.

---

1. స్థానిక చరిత్రలు, సం. 13 (మారకాపుర శాసనములు. నెం. 5 రు) పుటలు 226-229,

అచ్యుత దేవరాయుల విజయములు, భాషా సేవ

శ్రీకృష్ణదేవరాయలు క్రీ. శ. 1529 లో మృతినందెననియు నతని యనంతరము అచ్యుత దేవరాయలు సింహాసను నధిష్ఠించె ననియు చరిత్ర కారులు పల్కుచున్నారు. విజయనగర సామ్రాజ్య చరిత్రమును ప్రథమమున రచించిన సూయల్ గారు అచ్యుతరాయఁడు పందయనియు, శత్రువుల నెదుర్కొనుటకు దగిన బీరము లేనివాడనియు వ్రాసియున్నారు.

"(ఈ) క్రొత్తరాజు కృష్ణదేవునిచే (దన పిమ్మట సామ్రాజ్య పదమునందుటకు) నియమింపబడెనని నూనిజ్ చెప్పుచువ్నాఁడు. ఇది నిజమగునేని యీనియామకము అనర్థకరమైనది. ఏలన, అచ్యుతుఁడు పంద; అతని రాజ్యకాలమున హిందూ సామ్రాజ్యము విచ్ఛిన్నము గాఁజొచ్చినది."[1]

ఇట్టియభిప్రాయమే ఇతరచరిత్ర కారులనేకులకును గలదు. ఇట్టియభి ప్రాయములకు వ్యతిరేకముగ రాజనాథడిండిమ కవివర్యుని అచ్యుత రాయాభ్యుదయమునందు అచ్యుతరాయఁడు మహాశూరుఁడనియు

1. Forgotten Empire, P. 165.

దిగ్విజేత యనియును జెప్పబడియున్నది. అందు అచ్యుతరాయల దిగ్విజయ యాత్రలు సంపూర్ణముగ వర్ణింప బడియున్నవి. మొదట దక్షిణదేశము జయింపబడెను. చెల్లప్పయను సామంతరాజు చక్రవర్తిపై దిరుగబడి యతని దండనాథులచే పరాజితుఁడై చేరసీమఁజొచ్చి యా దేశపురాజు నాశ్రయించి పాండ్యరాజును తద్రాజ్యమునుండి వెడల గొట్టెను. పాండ్యుని రక్షించి యతని పాండ్యరాజ్యమునందు పున రుద్ధారణము సేయుటకు అచ్యుతరాయలు దండువెడలెను. అచిర కాలమున చంద్రగిరిఁజేరి యచట కొంతకాలమాఁగి, తిరుపతి వెంక టేశ్వరుని, కాళహస్తీశ్వరుని సేవించి, యచటినుండి బయలువెడలి సైన్యముతోగూడ కంచి తిరువణ్ణామలల మీఁదుగ శ్రీరంగమును జేరెను. అచట కొంతకాలముండి, శత్రువుపైఁబోవ నుద్యమించఁగా సలకరాజకుమారుఁడు చెల్లప్పవంటి యల్పసామంతునిపై మహారాజు దండు వెడల నవసరములేదనియు తన్నాకార్యమునకు నియోగించిన దానుకార్యమును సాధించెద ననియుఁబల్కెను. మహారా జందు కంగీక రింపగా సలకరాజకుమారుఁడు మధురాపురినిదాటి తామ్రపర్ణితీరమున విడిసి, చేరరాజగు దిరువడిపై కొక దండనాథు నంపెను. అతడు దిరు వడిని యుద్ధమున నిర్జించి యాతని చోళరాజుతోగూడ పట్టితెచ్చెను. పిమ్మట సలకరాజపుత్రుఁడు పాండ్యుని పిత్రార్జితమగు రాజ్యమున నిల్పి అనంతశయనము సేతువు మొదలగు స్థలములకు బోయి, కడపట శ్రీరంగమున విద్వత్సభవివర్యుల గోష్ఠిని కాలముగడుపుచున్న యచ్యుత దేవ మహారాయలను సందర్శించెను. అతడును అపరాధియగు చేర రాజును శిక్షింపను, పాండ్యుని పితృపై తామహంబగు రాజ్యమున ప్రభుత్వము సేయను ముదలయిడి యచటినుండి బయలువెడలి కావేరీ తీరమున బయనముసాగింపుచు కర్ణాటక దేశమందలి శ్రీరంగపట్టణ మును జేరెను. సామంతరాజులొసఁగిన కానుకలను గొనియచ్చోటు వాసి యుత్తరాభిముఖుఁడై బయనముసాగించి స్వరాష్ట్రపు హద్దు లను మీరి హయపతిరాజ్యముం జొచ్చి యాతనిసైన్యముచే రక్షితమైన

ముదుకల్లు దుర్గమును ముట్టడించెను. ముట్టడివార్త విన్నంతటనె ముదుకల్లు నందు తాణాయున్నదండుకు సాయముగ నదిల్ షా గొప్పసైన్యము నంపెను. అచ్యుతరాయల సైన్యములకును, బిజాపురమునుండి క్రొత్తగావచ్చిన సైన్యమునకును ముదుకల్లు సమీపమున యుద్ధముజరిగెను. అందు యవనులోడి పారిపోయిరి.అచ్యుతరాయలు యవనరాజు యొక్క గుఱ్ఱములను, ఏనుగులను గయికొని కృష్ణానదీ తీరమునకు బోయెను. అచ్చట సుల్తాను గొప్పసైన్యమును జేర్చికొని యుద్ధసన్నాహాములు సేయుచుండెను. అప్పుడు కృష్ణ కవ్వలిగట్టున తురకసైన్యమును, ఇవ్వలిగట్టున రాయలసైన్యమును యుద్ధప్రయత్నము సల్పుచు కొంతకాలముండినవి. అంతట సుల్తానొకనాఁడు గృష్ణనుదాటి రాయలశిబిరమునకువచ్చి అచ్యుతరాయనికి నమస్కరించెను. అట్లు శరణుజొచ్చిన సుల్తానున కభయమిచ్చి నిజరాజధానియగు విజయనగరమునకు రాయలు దరలెను.1

పైవిషయము లందఱకును చిరపరిచితములే. ఈవిషయములను ఆంధ్రమున విజయనగరచరిత్రమును వ్రాసినవారు తమగ్రంథములయందు జొన్పియున్నారు. కాని వీనిని చక్కగ సమన్వయపఱచి అచ్యుతరాయల చరిత్రమును విపులముగ వ్రాయరైరి. ఈ సందర్భమున నేనాపనికి బూనుకొనుటలేదు. ప్రస్తుతము గృష్ణరాయనిచే రాధామాధవ కవి యను బిరుదునుగొన్న చింతలపూడి యల్లయకవివర్యుని తారక బ్రహ్మరాజీయమున నేను గుర్తించిన యొండు రెండు నూతన విషయములను వర్ణించుచున్నాఁడను పై గ్రంథము యొక్క పీఠిక ముందీపద్యము గలదు:

చ. తిరుపతి గెల్చి పాండ్యనరదేవుని పట్టముగట్టి యుత్కళే
శ్వరుఁ గరుణించి మ్రొక్కిన సవాయికి దానభయంబొసంగి పెం
పరుదుగఁ గీర్తిఁజేకొనిన యచ్యుతరాయలమంత్రిరత్నమై
తిరముగ నున్న నంజవిభుతిమ్మరుసుందగు బ్రస్తుతింపఁగన్.

---

1. Sources of Vijayanagar History P. P. 158-169.

పై పద్యములోని తిరుపతియే యచ్యుతరాయాభ్యుదయములోని చేరరాజగు తిరువడి. అతని గెల్చియేకదా అచ్యుతరాయల సేనాని సలకరాజపుత్రుఁడు "పాండ్య నరదేవుని" కిఁ బట్టముకట్టినది. "ప్రొక్కిన సవాయి" బిజాపురసుల్తాను. ఇతఁడు అచ్యుతరాయలకు నమస్కరించి యాతని యనుగ్రహమునకు బాత్రుఁడయ్యెనని డిండిమకవి పల్కియేయున్నాఁడుగదా! కావున నీ రెండు విషయములయందు గ్రొత్తయేమియు గాన్పించదు.

మఱిక్రొత్తవిషయమేదియన, "ఉత్కళేశ్వరు గరుణించి"యనునదియే! ఈవిషయమెచ్చటను ఎవ్వరిచేతను చెప్పబడియుండలేదు. అచ్యుతరాయలు గరుణించిన యుత్కళేశ్వరుఁ డెవ్వఁడు? గజపతియనుట నిక్కము. అట్లైన ఏగజపతి? యనువిషయము నిర్ణయించవలసి యున్నది. కృష్ణరాయ నిర్యాణానంతరము గజపతికర్ణాటముపై దండువెడలెననియు. ఆల్లసానిపెద్దన యీక్రింది పద్యమును జెప్పి యాతని వెనుకకు మరల్చెననియు నొకయైతిహ్యముకలదు.

సీ. రాయరావుత మిండ రాచ యేనుఁగు
వచ్చియూరట్లకోట గోరాడునాఁడు
సంపెట నరపాల సార్వభౌముఁడు వచ్చి
సింహాద్రి జయశిల జేర్చు నాఁడు
సెలగోలు సింహంబు చేరి ధిక్కృతి గంచు
తలుపుల గరుల డీకొల్పునాఁడు.
ఘనతర నిర్భర గండపెండెర మిచ్చి
కూఁతు రాయలకొన గూర్చునాఁడు
ఒడలెఱుంగవొచచ్చితో యుర్వీలేవో
చేరఁజాలక తలచెడి జీర్ణమైతో
కన్నడం బెట్లు సొచ్చెదు గజపతీంద్ర
తెఱచి నిలు కుక్క సొచ్చిన తెఱఁగు దోప.

ఇట్లు కృష్ణరాయల మరణానంతరము కర్ణాటకముపై నెత్తివచ్చి నది ప్రతాపరుద్ర గజపతి కుమారుఁడని బ్ర. వే. వేటూరు ప్రభాకర శాస్త్రిగారు వ్రాసియున్నారు. "కాని కృష్ణరాయలతర్వాత ప్రతాప రుద్రగజపతి కుమారుఁడు గాబోలును మరల కన్నడము మీఁదికి రాఁగానో, రాఁబోవగానో, పెద్దనామాత్యుఁడీక్రింది (అనగా పైనుదాహరించిన) పద్యము జెప్పి యాతని సిగ్గిలజేసెనఁట!" 1

శ్రీ శాస్త్రిగారు పొరపడినారు. పద్యమును జాగ్రత్త గ జదివి యుండిన గృష్ణరాయ నిధనానంతరము గన్నడముపై నెత్తివచ్చినది ప్రతాపరుద్రగజపతియే యనియు అతనికుమారుఁడుగా డనియును దెల్లమై యుండెడిది. పైపద్యమున గృష్ణరాయల మరణానంతరము విజయనగరముపై వెడలిన "గజపతీంద్రుఁడు" "ఘనతర నిర్ఝరగండ పెండెరమిచ్చి కూఁతురాయల కొనగూర్చి"న వాఁడఁట. అట్లు కృష్ణ రాయలకు గూఁతునిచ్చినవాఁడు ప్రతాపరుద్రగజపతియేగాని యన్యుఁడుగాఁడని తెల్లమగుచున్నదిగదా. గజపతికన్నడముపై నెప్పు డెత్తివచ్చెను? కృష్ణరాయని మరణానంతరమునను, అచ్యుతరాయల సింహాసనారోహణమునకు పూర్వమున ననిపైపద్యముయొక్క కనిష్ఠ పాదమువల్ల దెలియుచున్నది. గజపతి దండయాత్రనాఁటి కర్ణాటకస్థితి యెట్టిదన, తలుపు దెఱచిన గృహాముపంటిది. తలుపు దెఱచియుంచిన యింటిలో ప్రవేశించు కుక్కకుఅడ్డమేమియులేనట్లు, కర్ణాటకమును జొచ్చు శత్రువునడ్డగించు నాథుఁడెవ్వఁడును లేకుండెను. అనగా పై జెప్పిన గజపతి దండయాత్ర జరిగినప్పుడు విజయనగర రాజ్యమరాజక స్థితియందుండెను. దేశమును గాపాడుప్రభువు కాన్పింపకుండెను. కావుననే కన్నడము తెఱచిన యింటివలెనుండెనని పెద్దనగారు హృదయవిదారణ మగునట్లు వాపోయిరి. అప్పటి రాజకీయ పరిస్థితు లను కె. వి. లక్ష్మణరావుగారు ఇట్లువర్ణించుచున్నారు:

---

1 విభవ సంవత్సరాది సంచిక. పుట. 174.

కృష్ణరాయలు పరమపదించగా "విజయనగర రాజ్యమును ఆక్రమించుకొనవలయునని అతనికుమారుఁడైనతిరుమలరాయఁడును, అల్లుఁడైన రామరాయలును, తమ్ముఁడైన అచ్యుతరాయలును ప్రయత్నించుచుండినట్లును ఎవరికి వీలయినప్పుడు వారుశాసనములు వేయించుట, కొళ్ళిచ్చుట మొదలైనపనులు చేయుచున్నట్లును ఈ కాలమునందు నెవరియధికారమును స్థిరపడనట్లును దోచుచున్నది."1 రాజ్యములో పేరందిన నాయకులొండొరులతో నిట్లు పోరాడుటచేత అరాజకత్వము మెండై, ఎల్లప్పుడును వేచియున్న శత్రువులకు గన్న డముపై నెత్తివచ్చుటకు అదనైనది. ఇట్టి కన్నడరాజ్య సంక్షోభము నకు సంతోషించి సపాదుఁడు తత్పూర్వము గృష్ణరాయల కాలమున గోల్పోయిన ముదుగల్లు రాయచూరు దుర్గములను మరల సాధిం చెను. ఈ విషయమును గూర్చి ఫెరిష్టా యిట్లు వ్రాయుచున్నాఁడుఃఈసుల్తాను (ఆదిల్ షా)....తనపై న్యాము తరల్చెను,ఉమ్మాద్ షా అమీర్ బరీదు లనువారు స్వపై న్యములతో నాతనివెంట జనిరి. హీమ్రాజు మరణానంతర మతని పుత్రుఁడగు రామ్రాజు అధికారము లోనికిరాగా అనేకరాజు లాతనిపై తిరుగుబాటు చేయుటచేత విజయ నగరరాజ్యమునందు బుట్టిన సంభ్రమమువల్ల అతనిదాడి నడ్డుపెట్టు వారులేరైరి. మూఁడునెలలు ముట్టడివేసి (అంతకు పూర్వము) పది హేడు సంవత్సరములుగ కాఫరులస్వాధీనము నందున్న రాయ్‌చోర్ ముద్కల్ దుర్గములను లొంగిపోయిన శత్రువులకడనుండి స్వాధీన పఱచుకొనెను."2

కృష్ణరాయలకుదనరాజ్యములోని విశేషభాగమును కూఁతుతో సమర్పించుకొన్న ప్రతాపరుద్రగజపతి కిదియేగదా మంచితరుణము పగదీర్చుకొనుటకు. అల్లెత్తివచ్చిన గజపతిని అచ్యుతదేవరాయ లోడించి

---

1. వ్యాసావాళి పుట 52
2. Sewell: Forgotten Empire. p. 166.

యుండవచ్చును. ఈవిషయమునే రాధామాధవకవి "ఉత్కళేశ్వరుఁ గరుణించి" యన్నమాటచే దెల్పినారు.

(3)

మఱియు నింకొకవిశేషము. నరసరాయలు అనే కాంధ్రకవు లను బోషించి వారిచే గ్రంథములవ్రాయించి యంకితము జేయించు కొనెను. ఆంధ్రభోజుఁడగు కృష్ణరాయల విషయము జెప్పవలసినదే లేదుగదా. అష్టదిగ్గజములేకాక యితరులగు సంస్కృతాంధ్ర ద్రావిడ కర్ణాటక కవులాతని యాస్థానమున నుండిరని యందఱెఱిఁగిన విషయమే. అచ్యుతరాయలపేర నొక గ్రంథమైనను తెన్గున రచింప బడినట్లు కాన్పించదు. కృష్ణరాయ నిర్యాణానంతరము అతని సభ నుండిన కవులలో పెక్కురు విద్యానగరమున నివసించుచుండినట్లు నిదర్శనము లున్నవి. 1 వారెవ్వరును అచ్యుతునికొక్క గ్రంథము నైనను నంకితము సేయకుండుటకు గారణమేమో! రాజానుగ్రహము చేదగుటవలనా? లేక రాజునకు భాషయందభిమానము లేకపోవుట వల్లనా? ఈరెండును కారణములుగావని యచ్యుతరాయాభ్యుదయములోని.

శ్లో. కణాద యుష్య స్యన్దిభిః కావ్యబన్ధైః
కాలక్షేపం కల్పయన్తం కవీంద్రైః ॥

అనుశ్లోక పాదములవల్ల తెలియుచున్నది. ఇట్లు కవీశ్వరుల గోష్ఠియందు కాలక్షేపము సేయగోరు ప్రభువు కవీశ్వరులను గ్రంథ ములను రచింపుఁడని ప్రోత్సాహముసేయకుండునా? ఈప్రశ్నకు దగు

---

1 కర్ణాటక దేశజులగు కవులుమాత్రమేకాదు. కళింగ దేశస్థులగు కవు లును పండితులును నాకాలమున విద్యానగరమున నుండినట్లు నిదర్శనములు గన్పించుచున్నవి. పంగీత సూర్యోదయ గ్రంథకర్త లక్ష్మీనారాయణుని తండ్రియగు విఠలామాత్యుఁడు లొల్ల లక్ష్మీధర పండితునివలె కటకమునుండి విద్యానగరమునకు వచ్చినట్లు తెలియుచున్నది. అతడొకగొప్ప విద్వాంసుఁడు.

సమాధానము నిచ్చుటకు రాధామాధవకవి గొంత దోడ్పడు చున్నాఁడు. తారకబ్రహ్మ రాజకీయములోని యీక్రింది వచనమును దిలకింపుడు.

వ॥ "అమ్మహీశ్వరుండు (నంజవిభుతిమ్మరుసు)

ఒక్కనాఁడు చతుస్సముద్ర ముద్రితమధ్య భూభువన సింహాసన నివాస భాసుర చంద్రశాలాప్రాఙ్గణ మణిమంటపంబున విజయనగర రాజధానింగల బంధువర్గబులును విద్వత్కవీంద్రులును వందిమాగధ వారకామినీ నికరంబును సముచిత ప్రకారంబున సేవింప సుఖగోష్ఠిం బ్రవర్తింపుచు నిజస్వామియగు నచ్యుతదేవరాయలు ప్రతిసంనత్స రంబు శ్రీ వెంకటేశ్వరునకు సత్కావ్యప్రబంధ పుష్పాంజలి సమ ర్పించుచు గీర్తి సుకృతంబుల నిర్వహింనుకొనుచున్న వాఁడు, తదను మతంబు నవ్విభునకు నాకు నభ్యుదయ పరంపరాభివృద్ధియుఁజతుర్విధ పురుషార్థసిద్ధియు నగునట్లుగా నాయిష్ట దైవంబగు శ్రీరామవిభునకు నంకితంబుగా నొకపుణ్యప్రబంధంబు చెప్పింపవలయునని."

ఇందువల్ల కృష్ణరాయలవలె నచ్యుతరాయలును కవిజనతోష కుడును పోషకుఁడునై యుండెనని తెలియవచ్చుచున్నది. ఈ మహా రాజు పదునాలుగేండ్లు రాజ్యము జేసెను. పదునాలుగు "సత్కావ్య

స్వపాండిత్యప్రకర్షముచేత కటకాధిపుఁడగు గజపతిని మెప్పించి కనకఘంటలు గొనెనఁట. ఈవిషయము లక్ష్మీనారాయణునికి భానుకవి యంకితమిచ్చిన పంచతంత్రి యం దిట్లు చెప్పబడియున్నది.

"గజపతి మెప్పించి కనకఘంటలుగొని విద్యాప్రవీణత వినుతికెక్కి".

ఇందువల్ల రెండు విషయములను మనమెఱుఁగుచున్నాము.

(1) లక్ష్మీనారాయణునితండ్రి గజపతినాశ్రయించి యుండిన విద్వాం సుఁడు. (2) లొల్ల లక్ష్మీధర, విశ్వలామాత్యాది పండిత బృందముచే నిరంత రము సేవితుఁడైన గజపతి "ప్రతాపరుద్రుడు" కృష్ణరాయలతో సముఁడగు విద్వత్ప్రభువు.

ప్రబంధ" ములను వ్రాయించెను. అందొక్కదానినైన దన కంకితము జేయించుకొనక పరమభక్తాగ్రేసరుఁడగుటచే నా యుద్గ్రంథంబులను దా గొల్చిన శ్రీ వెంకటేశ్వరునకు నంకితంబు జేయించి సత్కావ్య ప్రబంధ పుష్పాంజలి సమర్పించి తృప్తినందినాఁడు. వెంకటేశ్వరులకు సల్పినట్లె ఆంధ్రభాషామ తల్లికిని సేవలుసల్పినాఁడు. అట్టివాఁడాంధ్రులకు చిరస్మరణీయుఁడు గదా.!

తెనాలి రామకృష్ణకవి

ఈ కవియొక్క కాలమును దిగ్దంతులవంటి పండితులు సకారణముగ నిర్ణయించియున్నారు, వీరిలో ముఖ్యులు బ్ర.శ్రీ, మానవల్లి రామకృష్ణకవిగారు. వీరు 1914 వ సంవత్సర ఉగాది సంచికలో తెనాలి కవులను శీర్షికగల వ్యాసమున తెనాలి రామకృష్ణుని కాలమును చక్కగ జర్చించినారు:

"రామకృష్ణకవి కృష్ణరాయలసభలో నూత్నయౌవనము జెల్లించి తిరుమలరాయల రాజ్యకాలమునకు వృద్ధుడై ఘటికాచల మాహాత్మ్య కృతిలో జీవడకుచుండును" "కందర్పకేతు విలాసము చిట్టమంత్రి కంకితముగా రచింపబడినది. ఈ చిట్టమంత్రి నాదెండ్ల యప్పనగోపనలకు సన్నిహితజ్ఞాతియు, సమకాలికుడును అగు "చిట్టరసు" అనునతడే యైనయెడల నాకృతియు 1545 ప్రాంతమున రచింపబడి యుండవలయు." "పాండురంగకృతి రచనాకాలము 1564 అగుచున్నది."

కవిగారి సిద్ధాంతములకు బ్ర. శ్రీ. వే. ప్రభాకరశాస్త్రిగారు మెఱుఁగువెట్టిరి. ఉద్భటారాధ్య చరిత్రకు వీరు వ్రాసిన ఉపోద్ఘాతములో పై విషయమునే కడు నేర్పుతో పరిశీలించి మానవల్లి రామకృష్ణ కవిగారి సిద్ధాంతములను బలపరచినారు:

"తెనాలి రామలింగకవి యించుమించుగా క్రీ 1525 ఉద్భట చరిత్రమును, మఱి మువ్వదియేండ్లకు పాండురంగ మాహాత్మ్యమును రచించి

యుండునని చెప్ప నొప్పుచున్నది" "పాండురంగమాహాత్మ్య రచనా కాలము క్రీ. శ. 1565 ఇంచుమించుగా నగునని యేర్పడుచున్నది." 1

ఈ యిద్దరు పండితుల సిద్ధాంతము లివి:—

1. తెనాలి రామకృష్ణకవి కృష్ణరాయలసభలో నూత్న యౌవనము జెల్లించెను.
2. క్రీ. శ. 1525 లో ఉద్భటారాధ్య చరిత్రను రచించెను.
3. క్రీ. శ. 1545 ప్రాంతమున కందర్పకేతు విలాసమును రచించి యుండవచ్చును.
4. పాండురంగమాహాత్మ్యమును క్రీ. శ. 1564 - 65 ప్రాంతమున రచియించెను.
5. ఘటికాచల మాహాత్మ్యమును తిరుమలరాయల కాలమున వ్రాసెను.

పై సిద్ధాంతములను బలపఱచు నూతనాధారములు కొన్ని నాకు లభ్యమగుటచేత ఈ చిన్న వ్యాసమును వ్రాయనుద్యమించుచున్నాను.

కథలు:— వీటిని గూర్చి శ్రీ ప్రభాకర శాస్త్రిలవారు యిట్లు వ్రాయుచున్నారు:

"తెనాలి రామలింగని కథలని దక్షిణ హిందూదేశమెల్లఁ బ్రఖ్యాతికెక్కి పెక్కు కథలున్నవి. వానిగూర్చి మనమేమియు చెప్పజాలము. అతడు హాస్యచతురుఁడై యుండవచ్చును. నిజముగా కొన్ని కథ లాతనికి సంబంధించినవే కావచ్చును. లోకులు మఱియు ననేకావృతకథ లాతనితలకు దగిలించియుందురు. పెక్కు కథలు శ్రీ కృష్ణదేవరాయల గోష్ఠిలో జరిగినవిగా వినవచ్చును." 2

ఇచ్చట రెండు కథలను బేరొక్కనుచున్నాను:—

1 "రాయలవారు గుఱ్ఱపు పిల్లలను దూరదేశముల నుం[illegible] యింటికొక్కటి వంతున బంపి వానిమేతకు నెలకు మూడు

---

1 భారతి సం. 2, పుట 86.

2 భారతి సం. 2 పుట 88

నిచ్చుచు కొంతకాలమైన పిదప నొక్కనాడు గుట్టులను బరీక్షించుటకై నగరికి తెమ్మని ప్రజల నాజ్ఞాపించిరి. రాయలవారన్ని హాయములను గని సంతోషించి, "రామలింగని గుట్టుమేది?" అని యడగ చెంతనున్న రామలింగడు, ప్రభో! అందరు పెంచునట్టిది కాదు నా గుట్టుము. మిగుల మదించి నందున దాని నిచటకు దెచ్చుటకు నాకు సాధ్యము కాలేదు. సందియము కలదేని తమ యశ్వికులలో గడదీరిన మేటి నొక్కనింబంపి దెప్పించి చూడు" డన రాయలవారు దమ గుట్టుపు పటాలపు నాయకుడగు మహమ్మదీయునొకని నతని వెంట బంపిరి. రామలింగడు అందటి యట్లు తన గుట్టును జాగ్రత్తగ ఘాపాడక యొక యిరుకుగదియందు మూసియుంచి వేకింత కసవును నాగోడయందలి యొక రంధ్రమున బడవేయుచు నాదారినే జలమును బోయుచుండుటచే వా యశ్వము విశ్వము నెంతమాత్రము నెఱుంగక కేవలము క్షుద్బాధ ననుభవించుచుండెను. రామలింగడు దాడి సాయబును దీసికొనిపోయి యారంధ్రమును దెరచి లోపల త్రొంగిచూడు మనగా చీకటి గాఢమగుటచే సాయబు రంధ్రమున తల దూర్చినంతనే యాగర్భాతురపు తురగము సాయబుదాడి కసవని తలచి వెరికివైవ సాయబు, "అల్లారే! అల్లారే!" అని యేడ్చుచు మొఱపెట్టుకొనగా రాయలవారు తామే యచటికివచ్చి గుట్టుమును వెలుపలికి దెచ్చిచూడగా నది నిలువ జాలని యొక బక్కగుట్టుముగా నుంటగని కోపమున "రామలింగా! దీనినేల యిటుల జంపితి" వనగా నతడు, "ప్రభో! దీని నిటులనే యుంచునపుడే మనుజుల కాపదలు గలిగింప నిక జక్కగ బోషింతునేని యిది యెట్టులుండునో? దేవరవారే దెలిసికొందరు గాక"యని బలుక రాయలవారు రామలింగని యాగాత్యమునకు నవ్వుచు వెడలిరి." 1

కృష్ణరాయలు దన సామంత ప్రభువులకు, దొరలకు, సరదార్లకు గుట్టుములను బెంచుట కిచ్చువాడని పోర్చుగీసు ప్రయాణీకుడగు దురాతి బర్బోసా వ్రాయుచున్నాడు:

"రాయలకడ 20,000 కంటె నెక్కువ గుట్టుములు కలవు. అందొక్కొక్కటి 400 మొదలు 600 క్రూజదోల విలువగలది. స్వోపయోగార్థకొనువానిని 900 లేక 1000 క్రూజదోల నిచ్చి కొనుబోషించుటకై రాయలు తనకు లోనైన సామంత రాజు[illegible]డు. వారు నిరంతరము తమ యొద్దనున్న (గుట్టుము

---

1 కథలు: జయశంకర్ అండుకో. పుటలు 26-28

లకు సంబంధించిన) లెక్కలు చెప్పుచుండవలయును. (తన్ను గొలుచు) దొరలకు గూడ నిట్లే గుఱ్ఱముల నొప్పగించుచున్నాఁడు, పర్షి సర్దారునికి స్వారిచేయుటకై యొక గుఱ్ఱమును, (మాలీసు చేయుటకు) గుఱ్ఱపు వానిని, చాకిరి చేయుటకు బానిస స్త్రీని, నఫరుకు తగినట్లు నెలవెచ్చమునకుగాను నాలుగైదు పర్దావులను (పైకమును) ఇచ్చుచున్నాఁడు. ఇంతేకాక, పర్షిదిన మును ఏనుఁగులకును, గుఱ్ఱములకును దాణా తయారు చేయు వంటసాలల నుండి గుఱ్ఱమునకును, గుఱ్ఱపు వానికిని గావలయు నాహారపదార్థములను సరఫరా చేయించుచున్నాఁడు....ఎవ్వరి వశమునను న్న గుఱ్ఱమైనను ఖీణించు చున్న యెడల వానికడనుండి యాయశ్వమును దీసికొని, దానికంటె యధమమగు దానిని యిచ్చుచున్నాఁడు. 1

దురాతి బర్బోసా వర్ణించిన రాయల అశ్వసంరక్షణ విధాన మును, తెనాలి రామలింగఁడు బెంచిన గుఱ్ఱపుకథతో బోల్చిచూచిన కథలోని విషయ మవిశ్వసనీయముకాదని తోఁచకపోదు. అయినప్ప టికిని రామలింగఁడు రాయల సమకాలికుఁడని రుజువుసేయుటకు ఇది తగిన సాక్ష్యము కాదు. మరొక కథను దిలకింతము:—

"ఒకానొక దినమున రాయల యాస్థానమునకు శ్రీకాళహస్తి పురాణమును దెనిగించిన ధూర్జటికవి మిక్కిలి రసవంతమయిన యొక ఘక్కివాక్యి ఱేనికిజూపి బహుమతినంద విజయనగరమున కేతెంచి యాదిన మొక పాఱునింట భుజియించి విజయనగరమున గల విశేషములన్నియు కనుగొని యారేయిగడపి ఉషఃకాలముననే స్నానసంధ్యానుష్ఠానములను నిర్వర్తించుకొని భువనవిజయమున రాజాదులు కొలువుదీరియున్న సమయ మున పర్యంత ధూర్జటివలె సభకునేగి రాయనిచేత తగు మర్యాదలంది ఒక యర్ధాసనమున గూర్చుండి తారచియించిన పొత్తమును రాజుత్తర్వుచే సభ్యు లకు వినిపించి శ్రవణానందుల చేసెను. కాని వికటకవి మాత్రము సంతో షింపడయ్యె. అయ్యను చేయునదిలేక సమయము వేచియుండగా, రాయలు సభ్యులఁగాంచి.

చ. స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గెనీ
యతులితమాధురీ మహిమ:—

---

1 The Book of Durate Burbosa Vol. P. 210

అని సమస్యాపూరణము చేయుమనెను. దాని కొక్కరును సమర్థులు కాక పోయిరి. అంత రామకృష్ణుడు లేచి, "అయ్యా! పదుమూరోజులు నాకు నెల వొసంగితిరేని నా కారణమునూహించి విన్నవించెదను" అని నెలవుగైకొనెను. అనాడెల్లరు సభచాలించి వారివారి గృహముల కేగిరి. ధూర్జటిమాత్రము చెంతనున్న వారాంగనా గృహపరివేళ మొనరించి దానితో ముచ్చటించు చుండెను. వెంటనే మరుగుగా రామలింగముపోయి, "స్వామీ! నమస్కారము" అనెను. ధూర్జటి గుండె గభిల్లుమన "ఏమోయి రామలింగమా" యనెను, "అయ్యా! నేను సమయముగాకుండ వచ్చినందుకు నా తప్పు నైరింపు"డని వెడలిపోయి మరునాడు ఆస్థానములో ధూర్జటి మొదలయిన కవులును, రాయలాదిగా గల రాజులును ఉండగా వికటకవి "పుడమిఱేడా! మీరు మొన్న ప్రశ్నించిన సమస్య పూర్తిచేయుదు"నని యిట్లు చదివెను:

చ. స్తుతమతిమైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గెనీ
యతులితమాధురీమహిమ! హా! తెలిసెఁ భువనైక మోహనో
ద్ధత సుకుమార వారవనితాజనతాఘనతాపహారి సం
తతమధురాధరోదితసుధారసధారల గోరిలుటంజుమీ.

అనగానే ధూర్జటికవి సిగ్గుచేతలవంచుకొని భువనవిజయమును వీడిపోయెను.1

కాళహస్తిమాహాత్మ్య రచయితయగు ధూర్జటినిగూర్చి కృష్ణ దేవరాయలు పైసమస్యనిచ్చినది నిజమగుట కొక సాక్షిగలఁడు. అతఁడు ధూర్జటికి పౌత్రుఁడగు కుమారధూర్జటియే. కృష్ణరాయ విజయమున నతఁడు దన్నుగూర్చి తత్కృతిభర్తయగు యార్వేటి చినవెంకట్రాజు ఇట్లు చెప్పినట్లు వ్రాసుకొనియున్నాఁడు.

చ. స్తుతమతిమైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేలగల్గెనో
యతులితమాధురీమహిమ నాముసుమీపెద తాతచాల స
న్నుతిగనె కృష్ణరాయల మనోజ్ఞ సభన్...."

ఇందువల్ల సభలో కృష్ణరాయలు ధూర్జటికవిని గురించి సమస్యనిచ్చుట నిశ్చయమని తేలుచున్నదిగదా! అట్లు సమస్యనిచ్చిన

---

1 తెనాలిరామలింగని కథ : జయశంకర్ అంకుకో. పుటలు 52_55

రాయలసభలోని కవులందరు పూరింపకుండిరా? రాజిచ్చిన సమస్యకు పూరణము రాకపోవునా? చిరకాలమునుండియును ఈసమస్యను పూరించినది తెనాలిరామకృష్ణుఁడన్న ప్రతీతికలదు. మఱియెవ్వరును పై సమస్యను పూరించిన ట్లగపడదు. రామకృష్ణుఁడీసమస్యను పూరించుట నిజమగునేని అతఁడు రాయలకు సమకాలికుఁడు కాకపోవు చెట్లు? ఉద్భటారాధ్యచరిత్రను రామలింగఁడు నాదెండ్లగోపామాత్యుని కడ ప్రధానోద్యోగియగు యూరె దేచమంత్రి కంకితము నొసంగెను. ఈ గ్రంథమును రామలింగకవి క్రీ.శ. 1525 లో వాసియుండుననియు, రామలింగకవియే వైష్ణవము పుచ్చుకొన్న పిమ్మట రామకృష్ణనామమును ధరించెననియు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు సకారణముగ నిర్ణయముచేసియున్నారు. కావున రామకృష్ణుఁడు రాయలసమకాలికుఁడని పై రెండుకథలవల్ల తేలిన విషయము ఉద్భటారాధ్య చరిత్రమువల్ల సంరక్షితమగుచున్నది.

ఈ సందర్భమున శ్రీ మానప్ల రామకృష్ణకవిగారు చెప్పిన విషయ మొక్కటి గమనింపవలసియున్నది. కందర్పకేతువిలాసమను గ్రంథమును రామలింగకవి నాదెండ్ల యప్పనగోపనలకు సన్నిహితజ్ఞాతియు సమకాలికుఁడును నగు చిట్టరసు కంకితముచేసెననియు, తద్గ్రంథము 1545 ప్రాంతమున విరచింపబడినదనియు చెప్పియున్నారు. ఇందుకు ఆధారము లెవ్వియో!

కృష్ణరాయల సమకాలికుడగు చిట్టమర సొకఁడు కలఁడు. ఇతఁడు సాళువతిమ్మరసుయొక్క రాజ్యభార ధురంధరుఁడట. పెద్దకాకాణిలో అతని శాసనమొకటి శకం 1440 బహుధాన్య అనఁగా క్రీ.శ. 1518 నాఁటిది కలదు. 1 కవిగారు చెప్పిన చిట్టమరసు ఇతఁడే యగునా? అగునేని రెంటూరి వంశజుఁడగు నీ చిట్టమరసు నాదెండ్ల వారికి సన్నిహితజ్ఞాతి యగు పెట్లు? కందర్ప కేతువిలాసము క్రీ. శ. 1545 ప్రాంతమున ప్రాయబడెననుట కాధారము లెవ్వి?

---

1 L. R. 57. PP 222-27

పాండురంగమాహాత్మ్యము:- దీనిని క్రీ. శ. 1564 లో క్రొవ్వాసెనని రామకృష్ణకవిగారును, క్రీ. శ. 1565 లో నని ప్రభాకర శాస్త్రిలవారును జెప్పియున్నారు. ఈ గ్రంథము విరూరి వేదాద్రి మంత్రికి అంకిత మీయఁబడినది. ఇతడు మంగయగురువరాజు కుమారుఁడు పెద్దసంగరాజు కడ క్రొవ్వాయసకాఁడు. విరూరి వేదాద్రిమంత్రి కాలమును నిర్ణయించుటకు దగిన శాసనము లెవ్వియు గానరావు. అయినప్పటికిని మనకు మంగయగురువరాజు శాసనమొకటి లభించినది. ఇతఁడు చోళవంశజుఁడగు క్షత్రియుఁడు. ప్రస్తుతము కడపమండలములోని అనిమెల సంగమేశ్వరస్వామిభక్తుఁడు:-

శుభమస్తు.

"నమస్తుంగశిరశ్చుంబిచంద్రచామరచారవే
త్రైలోక్యనగరారంభమూల సంభాయ శంభవే."

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు 1465 అగునేటి శోభకృతునామ సంవత్సర భాద్రపద శుద్ధ 2 సోమవారం శ్రీమద్రాజాధిరాజ రాజవరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీ వీరసదాశివదేవ మహారాయలు విద్యానగరమందు వజ్రసింహాసనారూఢుండై పృథ్వీ సామ్రాజ్యంచేయు చున్నుండగాను కాశ్యప గోత్రం ఆపస్తంబసూత్రం యజుశ్శాఖాధ్యాయులైన సూర్యవంశోద్భవులైన శ్రీమన్మహామండలేశ్వర బొమ్మరాజుంగారి పౌత్రులయిన మంగరాజుగారి పుత్రులయిన గురువయ దేవచోడ మహారాజులుంగారు తుంగభద్రాతీరమందు శ్రీ విరూపాక్షదేవుని సన్నిధిని రంగరాజు రామరాజుగారి మూలాన శ్రీ సదాశివ దేవమహా రాయలచేత రెండు తామ్రశాసనాలు పుచ్చుకొని శ్రీమద్దేవాదిదేవ దేవతాసార్వభౌమ సచ్చిదానంద పరిపూర్ణ సప్తర్షి వరదుండైన అనిమెల సంగమేశ్వరదేవునికి, వోబుళంమయ తింమరంమయ అనే దేవుళ్లు యిద్దరున్ను, పెద్దసంగరాజు, పినసంగరాజు, తింమరాజు, రుద్రరాజు, బసవరాజు, పెద చిటిరాజు, చినచిటిరాజు, బొజ్జసంగరాజు, పాపసంగరాజు అనే తొంమ్మండ్రు కుమారులు సమీపస్థులయివుండగాను అపునాశిని పాపఘ్ని

సంగమస్థాన శివరాత్రి పుణ్యకాలమందు సహిరణ్యోదకదానధారాపూర్వకంగా ధారపోసియిచ్చిన గ్రామాలు." 1

ఇందువల్ల మంగయగురువరాజు శకం 1465 అనగా క్రీ. శ. 1543 లో అనిమెలప్రాంతమున ప్రభుత్వము సేయుచుండెననియు, అతనికి వోబళంమయ తింమంమయ యను నిరువురు భార్యలును, పెద్దసంగరాజు, చినసంగరాజు, తింమరాజు, రుద్రరాజు, బసవరాజు, పెదచిటిరాజు, చినచిటిరాజు, బొజ్జసంగరాజు, పాపసంగరాజు అను పుత్రులు తొమ్మండుగురు కలరనియు విశదమగుచున్నది. విరూరి వేదాద్రిమంత్రి కొలిచిన ప్రభువగు పెద్దసంగరాజు, మంగయగురువరాజు ప్రథమపుత్రుఁడనియు తెలియుచున్నది. క్రీ. శ. 1543 లో అనఁగా పైశాసనకాలమున మంగయగురువరాజు వృద్ధుఁడని అనిమెలకైఫియ్యతునందు వ్రాయబడియున్నది. కావున నతని ప్రథమపుత్రుఁడగు పెదసంగరాజప్పటికి ఇరువదేండ్ల ప్రాయమువాఁడైయుండవచ్చును. అట్లగునేని అతఁడు క్రీ.శ. 1523 ప్రాంతమున బుట్టియుండవచ్చును. పెదసంగరాజు వ్రాయసకాఁడగు విరూరి వేదాద్రిమంత్రియు క్రీ శ. 1543 ప్రాంతమువాఁడగును. అతఁడు గృతినందిన పాండురంగమాహాత్మ్యము 1543-1565 ల మధ్యకాలమున విరచింపబడియుండవచ్చు ననుటలో నసంగతమేమియు కానరాదు. కాని పాండురంగమాహాత్మ్యము 1570 కి పూర్వము రచింప బడలేదేమో యని సంశయించుటకు గొంత యవకాశము కలదు. పాండురంగమాహాత్మ్యము, చతుర్థాశ్వాసము 242 పద్యము ఈ సందర్భమున గమనింపదగినది:

క. గిరికానుషక్తబుద్ధి ను
పరిచరునిం బోలె నొక్క పన్నిగ మొకనా
డురువడినెచ్చట నుండియొ
మురమర్దను దివ్యభవనమున కేతెంచెఁ,

---

1 Mack. Mss. 15-3-6.

ఈ పద్యమున రామరాజభూషణకృతమగు వసుచరిత్రను పాండురంగకవి ప్రస్తావించినాఁడు. ఇందువల్ల రామకృష్ణునకు రామరాజభూషణుని కవిత్వముపై నుండు అభిమానము దెలియుట యట్లుండ పాండురంగమాహాత్మ్యము వసుచరిత్రకు బిమ్మట విరచింపబడెనని తెల్లమగుచున్నది. వసుచరిత్రరచనాకాలము క్రీ. శ. 1570 లో నని యీమధ్య నిర్ణయము సేయబడినది. క్రీ.శ. 1570లో విరచింపబడిన వసుచరిత్రను బేరొక్కను పాండురంగమాహాత్మ్యము తత్పూర్వమెట్లు వ్రాయబడియుండును? కావున పాండురంగ మాహాత్మ్య రచనాకాలము క్రీ. శ. 1570 కి తరువాతనే యని తలఁచుట సమంజసము.

వాఙ్మయ వ్యాసమంజరి

తెనాలి రామకృష్ణుఁడు

అతని సమకాలికులు

తెనాలి రామకృష్ణకవి యెప్పటివాఁడు? చిరకాలమునుండి వచ్చు నైతిహ్యములందు వచింపఁబడినట్లు శ్రీకృష్ణరాయలసభ నలంకరించిన యష్టదిగ్గజములలో నొక్కఁడా, లేక యాధునిక కవిచరిత్ర పరిశోధకులు కొందఱు తలంచునట్లు తరువాతి కాలము వాఁడా? ఈతనిగూర్చి చెప్పఁబడు కథలు వాస్తవములా, లేక కేవల కల్పనలా? ఈ ప్రశ్నలకు సమాధానముల నిచ్చుటకు దిగ్దంతులవంటి పండిత ప్రకాండులు యత్నముచేసి రామకృష్ణుని కాలమును స్థూలముగ నిర్ణయించియున్నారు. అట్లు మహాపండిత శిఖామణులచే నిర్ణయింపఁబడిన కాలమును దృఢపఱచి, రామకృష్ణుని జీవిత చరిత్రకు సంబంధించిన వివాదాస్పదములగు సమస్యలను గొన్నిటిని సాధ్యమైనంతవఱకు తృప్తికరముగఁ దీర్చుటయే ప్రస్తుత వ్యాసముయొక్క ముఖ్యోద్దేశము. ఈ యత్నము సఫలముకాక, శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రన్నట్లు "శృంగభంగమైనను విలాస సౌష్ఠవమే." 1

---

1. ఉగాది సంచిక (1914) పుట 100.

కాలనిర్ణయము

తెనాలి రామకృష్ణుని కాలమును నిర్ణయించుటకుఁ గడంగిన పండితులు, నాయెఱుకకు, నలుగురు కలరు. వీరియందు ప్రథమమునఁ బేర్కొనఁ దగినవారు శ్రీ గుఱుజాడ రామమూర్తి పంతులు గారు. వీరు "కవిజీవితము"లను గ్రంథమున రామకృష్ణుని చరిత్రను గూర్చి విపులముగా వ్రాసియున్నారు. ఇం దాతని కాలమును గూర్చిన చర్చ యత్యల్పము. స్థానిక చరిత్రములు 7-వ సంపుటమున సంగ్రహింపఁబడిన చింతకుంట తాలూకా కైఫియత్తులోని యనిమెల సంగమేశ్వరదేవాలయమందలి మంగయ గుర్వరాజు దానమునుదెల్పు శా. శ. 1485 శోభకృతు సంవత్సరమునాఁటి శాసనము నాధార పఱచుకొని, "కవియగు రామకృష్ణుని కాలము మన మించు మించుగా తీర్మానించవచ్చును" అని యొక్క వాక్యముతో ముగించిరి.[1] వీరిచే నిర్ణయింపఁబడిన కాలము సరియైనదే; కాని రామకృష్ణుని జీవితమునందలి వెక్కు విషయములను ఈకాలనిర్ణయమునను సరించి యెట్లు సమర్థించవీలగునో వీరు తెల్పరైరి. ఏతత్కారణమున నీశాసనసాక్ష్యము నిరసింపఁబడి యసంగతములైన యూహలనేకములు బయలువెడలుట కవకాశము కల్గెను.

రామకృష్ణుని చరిత్రకు సంబంధించిన యంశముల నన్నిటిని విపులముగఁ జర్చించి యాతని కాలమును నిర్ణయించుటకుఁ బ్రయత్నించినవారలలో నగ్రగణ్యులు శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు. రామకృష్ణుని కాలమునుగూర్చి వీరి వాస్తవాభిప్రాయమెద్దియో కనుఁగొనుట సుసాధ్యము గాదు. ఆంధ్రకవుల చరిత్రయందు మూఁడు తావుల మూఁడు విధములుగ కాలనిర్ణయము చేసియున్నారు. రామమూర్తిపంతులుగారు రాధారముగఁ గొన్న యనిమెలశాసనము విశ్వాసపాత్రము గాదని ప్రోసివై చిరి.

---

1. కవిజీవితములు పుట 198.

"కృతినాయకుఁడైన వేదాద్రికి ప్రభువగు సంగరాజుయొక్క తండ్రి గురువరాజు సదాశివరాయని రాజ్యకాలములోనుండి యాతనివలన శాలివాహనశకము 1465-వ సంవత్సరమునం దనఁగా హూణశకము 1543-వ సంవత్సరమునందు దేవుని నిమిత్తము నాలుగు గ్రామములను సంపాదించినట్లు మెంకజీదొరవారు సమకూర్చి చెన్నపురిలో ప్రాచ్యలిఖితపుస్తకనిలయమునం దుంచిన స్థానికచరిత్రమువలనఁ దెలియుచున్నది. మంగయకొడుకైన గురువరాజును మంగయతమ్మునిగాఁ జెప్పిన యాచరిత్రమెంత నమ్మవచ్చునో యాలోచనీయముగా నున్నది. ఈ కాలమునుబట్టి చూచినను గురువరాజుకొడుకైన సంగభూపాలుఁడు పదునాఱవ శతాబ్దమునెయొక్క కడపట రాజ్యముచేసినట్టే యూహింపఁ దగియున్నది. ఆతనియాశ్రితుఁ డగుటచేత రామకృష్ణ కవియు 1560-70 సంవత్సర ప్రాంతమునుండి కవియై యుండవచ్చును[1]. సంశయాస్పదమని తమచే ఖండింపఁబడిన యనిమెలశాసనముపై నాధారపడియున్న యీకాలనిర్ణయము పంతులుగారి సంపూర్ణాంగీకారమును బడసిన దని తలఁచుటకు వీలుకాదు. ఏలన, రామకృష్ణ తాతాచార్యాప్పయదీక్షి తాప్పళాచార్యుల సమకాలీనతను సూచించు గాథల నాధారము చేసుకొని వారు రామకృష్ణుని కాలమునన్యథా తీర్మానించియున్నారు. "రామకృష్ణకవి యప్పయదీక్షితుల వారితోను, తిరుమల తాతాచార్యులవారితోను సమకాలికుఁ డయి చంద్రగిరిరాజగు వెంకటపతిరాయల ప్రభుత్వకాలములో నుండిన వాఁ డయినట్లు కొన్ని నిదర్శనములు కనఁబడుచున్నవి." వెంకటపతి రాయలు క్రీస్తుశకము 1585-వ సంవత్సరమునుండి 1614-వ సంవత్సరము వఱకును రాజ్యము సల్పెను. తాతాచార్యులును, అప్పయదీక్షితులును వెంకటపతిరాయల కాలమున నుండిరి. కావున రామకృష్ణకవియు నాకాలమువాఁ డై యుండవలయును. కృష్ణ

---

1. ఆంధ్రకవుల చరిత్రము, పుటలు 269-70.

రాయని కాలమువాఁడు కాఁజాలఁడు1. మటియొక సందర్భమున నీకవికాలము క్రీస్తుశకము 18-వ శతాబ్దమని సూచించియున్నారు. అయ్యలు భాస్కరు లను కవులు రెట్టమతశాస్త్ర మను గ్రంథము నాంధ్రీకరించి మంగయగురువరాజు దౌహిత్రుఁడగు కొండ్రాజు వెంకటరాజున కంకితమిచ్చిరి. గ్రంథాంతమందలి సీసపద్య మొకటి తద్రచనాకాలము కలియుగ ప్రథమభాగము 4871-వ సంవత్సరము నకు సరియైన శాలివాహనశకము 1692 వికృతిసంవత్సర మని తెల్పుచున్నది. దీనినిబట్టియే తద్గ్రంథకర్త లిరువురును క్రీస్తుశకము 1769-వ సంవత్సరమున రెట్టమతశాస్త్రము నాంధ్రీకరించినట్లు విదిత మగుచున్నది. ఈ కృతినాయకుని మేనమామయగు మంగయగురువ రాజు పెదసంగరాజుయొక్క మంత్రియగు విరూరి వేదాద్రిమంత్రికే రామకృష్ణకవి తన పాండురంగమాహాత్మ్యము నంకిత మొనర్చెఁ గావున "రామకృష్ణుని కాలమును కనుఁగొనుటకు సహితము కొంత యాధారము గానవచ్చుచున్నది" అని వ్రాసిరి.[2] ఇట్లు వీరేశలింగము పంతులుగారు పరస్పర విరుద్ధములగు కాలనిర్ణయములను మూఁడు తెఱఁగులఁ గావించియున్నారు.

వీరేశలింగము పంతులుగారి కాలనిర్ణయమును ఖండించుచు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు ఆంధ్రపత్రిక యైదవ సంవత్సరాది సంచికయందు "తెనాలి కవులు" అను శీర్షికక్రింద నొక చక్కని వ్యాసమును ప్రకటించిరి. వీరి ముఖ్యాధారములు నాలుగు: (1) పాండురంగమాహాత్మ్యము, (2) ఇందుమతీకల్యాణము, (3) కామందకము, (4) అహోబలశాసనము.

"పాండురంగమాహాత్మ్యము విరూరి వేదాద్రిమంత్రి కంకిత మయ్యె". ఇతఁడు "మంగయ గురువరాజు కుమారుఁడగు పెదసంగ

---

1. ఆంధ్రకవుల చరిత్రము, పుటలు 266-268.
2. ఆంధ్రకవుల చరిత్రము, పుట 450.

భూపాలునకు ప్రాయసకాఁడు”.“ రెట్టమత మను గ్రంథము కొండ్రాజు తిమ్మరాజు కుమారుఁడగు వెంకటాద్రికి నంకితమీఁబడి యున్నది. ఆ వేంకటరాజు మంగయగురువరాజు కుమారెయగు పాప మాంబకుఁ బుత్రుఁడు; అనఁగా విరూరి వేల్రాది యజమానియగు పెదసంగభూపాలునకుఁ జెల్లెలికొడుకు”. రెట్టమతము కడపట తద్రచనాకాలమును దెల్పు సీసపద్యము పరిగణింపఁ దగినది కాదు. “ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమునన్నున్న నాల్గు ప్రతులలో నొక దానిలో మాత్రము కలదు.” అన్యత్ర లభ్యమైన ప్రతులయందును కానరాదు. మఱియు, రెట్టమత కృతినాయకుఁడగు కొండ్రాజు “వెంకటాద్రికిఁ గామందక మను రాజనీతిగ్రంథ మొకటి యంకితముగా రచింపఁబడియున్నది.” తర్కర్తలగు రామకృష్ణకవులు తామాపుస్తకమును శాలివాహనశకము 1506 స్వభాన్వబ్దంబున రచించినట్లు గ్రంథాంతమునందొక పద్యమున నుడివి యున్నారు. కొండ్రాజు వెంకటరాజు వెలసినకాలము వాస్తవముగ నిదియే యని రుజువుపఱచు బలవత్తరమైన సాక్ష్యము వేఱొకటి యున్నది. శాలివాహనశకవర్షంబులు 1506 సంవత్సరమునకు సరిపైన తారణాబ్దమున శ్రీరంగరాయదేవమహారాయలు పెనుగొండయందు పృథ్వీ సామ్రాజ్యముఁ జేయుచున్న కాలమున శ్రీమదహోబల శఠకోప జియ్యంగారి కార్యకర్తలు రాచప్పగారు పై కొండ్రాజు వెంకట రాజుగారికి అహోబలస్థలమును పాడుగావించిన తురకలను వెడల నడచినందుకై కొన్ని మర్యాదల నొసఁగి గౌరవించిరి. ఈ శాసన కాలము సహితము శా. శ. 1506-వ సంవత్సరమే. కావున రెట్ట మత కామందకకృతినాయకుఁడగు కొండ్రాజు వెంకటరాజు శా. శ. 1506-అనఁగా క్రీ. శ. 1584-వ సంవత్సరప్రాంతమున నుండెనని నిశ్చయమగుచున్నది. ఇతని “మేనమామయగు పెద్దసంగభూపతి 20 ఏండ్లపూర్వమున్నను పాండురంగకృతి రచనాకాలము 1564 అగుచున్నది.”

ఇతరములగు నాధారములనుబట్టి చూచినను పైనిజేసిన కాల నిర్ణయమే సరియైన దని తోఁచుచున్నది. రామకృష్ణుని తమ్ముని మనుమఁడగు రామభద్రకవి తన ఇందుమతీకల్యాణాంతర్గత స్వవంశ కథనమునందు రామకృష్ణునికి సుదక్షిణాపరిణయకృతికర్త యగు నన్నయ్యయు, శ్రీశైలమాహాత్మ్యప్రణేతయగు శ్రీగిరియును ననుజు లనియును, శ్రీగిరికుమారుఁ డిమ్మడి రామకృష్ణుఁ డని యును, నతని పుత్రులు వీరరాఘవ రామభద్రకవు లనియును దెల్పు చున్నాఁడు. రామకృష్ణకవి సోదరుఁడైన అన్నయ్య దన సుదక్షిణా పరిణయమును కోనేటి తిమ్మరాజు రామరాజుకడఁ బ్రధానిగ నుండిన పులిజాల సోమామాత్యునకు అంకితమిచ్చెను. "రామరాయలకు మనుమనివరుసయగు కోనేటి రామరాజు బుక్కయరామరాజునకుఁ బెద్దకుమారుని సంతతిలోఁ జేరినందున, 1560 లకే యళియ రామ రాయలకు మనుమలు కలిగినందున వీరును నాకాలమువా రనుటకు సందేహింపఁబనిలేదు. కావున సుదక్షిణాపరిణయ రచనాకాలము కూడ 1565 అగుచున్నది." "పై సందర్భములన్నియుఁగూర్చి యూహింపఁగా రామకృష్ణకవి కృష్ణరాయల సభలో నూత్నయౌవ నముఁ జెల్లించి, తిరుమలరాయలరాజ్యకాలమునకు వృద్ధుఁడై ఘటికాచలమాహాత్మ్యకృతిలోఁ జేయివడఁకుచుండును." 1

రామలింగఁడే రామకృష్ణుఁడు

ఇట్లు మానవల్లి రామకృష్ణకవిగారిచే నిర్ణయింపఁబడినకాలమే సరియైనదని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిలవారు సిద్ధాంతీకరించి యూహాజన్యములగు వారి యనుమానములకుఁ గొన్నింటికి స్థిర మైన పునాదిని వేసిరి. ప్రభాకరశాస్త్రులవారు నూతనముగ తమకు లభ్యపడిన యుద్భటారాధ్యచరిత్రయందలి యజ్ఞాతాంశములను బయలుపెట్టి తెనాలిరామకృష్ణుఁ డాంధ్రభోజుని యాదరమునుగన్న

---

1. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, 1914 పుటలు 99-103.

అష్టదిగ్గజములయందొక్కఁడని నిరుత్తరముగ నిర్ధరించినారు. ఉద్భటారాధ్యచరిత్రము రచించిన కవిపేరు రామలింగకవి. అతఁడు కౌండిన్యగోత్రజుఁడు. శుక్లయజుర్వేది. తండ్రిరామయ. తల్లి లక్ష్మమ. తెనాలిరామకృష్ణుఁడును కౌండిన్యగోత్రజుఁడే. ఇతఁడును శుక్ల యజుర్వేదియే. రామలింగని తల్లిదండ్రులవలె నితని తలి దండ్రులును లక్ష్మమ రామయనామధారులే. కావున రామలింగఁడే రామకృష్ణుఁడనుట సంగతమగును. "ఇన్ని సరిపడియున్నను నుద్భటచరిత్రమున రామలింగయ యని గ్రంథకర్తపేరును, పాలగుమియేలేశ్వరుఁడని గురునిపేరును, పాండురంగమాహాత్మ్యమున రామకృష్ణుఁడని గ్రంథకర్తపేరును, భట్టరుచిక్కాచార్యులని గురునిపేరును గానవచ్చుటయు, గద్యముల రీతులు భిన్నములుగా నుండుటయు రెండు నొక్కనిపేళ్లే యను సిద్ధాంతమునకుఁ గొంత బాధకములుగాఁ గానవచ్చును. ఈ భేదములు మతముమాఱుటచే నేర్పడినవే." కాని భిన్నవ్యక్తిత్వమువలన నేర్పడినవి కావు. రామకృష్ణునే రామలింగకవియని యర్వాచీనులగు కవులును, లక్షణ గ్రంథకారులును బేర్కొనియున్నారు. మొదట నాతఁడు శైవుఁడనియు నప్పటి పేరు రామలింగఁడనియు, ననంతరము వైష్ణవముపుచ్చుకొని రామకృష్ణుఁడని పేరును మార్చుకొనెననియుఁ బ్రతీతి కలదు. దీని కనుగుణముగ తెనాలిరామపండితుని పుత్రుఁడును, సహజశైవాచారసంపన్నుఁడును, సుదక్షిణాపరిణయకర్తయు నగు అన్నయ్య దనకు పినతాత యనియు, బెదతాతయు పాండురంగాది సత్కృతులు చేసిన రామకృష్ణకవియొక్క యనుజుఁడనియుఁ దెనాలిరామభద్రకవి తన ఇందుమతీకల్యాణమునఁ దెల్పియున్నాఁడు. మఱియు రామలింగనివలె అన్నయ్యయుఁ బాలగుమివారి శిష్యుఁడని సుదక్షిణాపరిణయముపల్లఁ దెలియవచ్చుచున్నది.

"మనుమఁడగు రామభద్రకవి చెప్పుటచేతను, తండ్రిపేరు మొదలగునవి సరిపోవుటచేతను రామకృష్ణుఁడును, నన్నయ్యయు

నన్నదమ్ములని స్పష్టపడినది. ఉద్భటచరిత్రమందుఁ గానవచ్చు రామ లింగేశ్వరస్వామియనుగ్రహము, పాలగుమివారి శిష్యత్వము, శైవాచారము మొదలగునవి సరిపోవుటచేతను, లోకమందుఁ బారంపర్యముగా వచ్చుచున్న ప్రతీతికిఁగూడ నిర్వాహ మేర్పడుట చేతను నుద్భటారాధ్యచరిత్రక ర్తయగు రామలింగయ్యయే, వైష్ణవముపుచ్చుకొని రామకృష్ణుఁడై పాండురంగమాహాత్మ్యమును రచియించినాఁడని, వారు వేఱుపురుషులు గారని నిర్ణయించుట ప్రమాణదూరము కాదు."

రామలింగకవియే రామకృష్ణకవి యూహ ననుటకు బల వత్ప్రమాణ మింకొకటి కలదు. "శైవవైష్ణవ పురాణావళీనానార్థ రచనాపటిష్ఠైకరమ్యమతిని" అను పాండురంగమాహాత్మ్యములోని సీసపాదము రామకృష్ణుఁ డేవో శైవపురాణకథలను రచించినట్లు సూచించుచున్నది. అది ఈ యుద్భటారాధ్యచరిత్రము కానోపు. మఱియుఁ "దొలుతఁ దానుశైవుఁడై యున్నప్పుడు రచియించిన యుద్భటారాధ్యచరితములోని పద్యములే మార్చిమార్చకుండఁ దర్వాత వైష్ణవుఁడై రచించిన ఘటికాచలమాహాత్మ్యమున నాతఁడు చేర్చుకొన్నాఁడు." (చూ: ఉద్భ. ఆ. 1: 54, 55, 56, 57; ఆ. 2: 87- ఘటి. ఆ. 1: 13, 11, 9, 8, 25). "మఱియు రామలింగనికాలము రామకృష్ణునికాలముతో సరిపోవుచున్నది. ఉద్భటారాధ్యచరిత్ర కొండవీటిదుర్గాధ్యక్షుఁడయిన నాదెండ్లగోప మంత్రికడ కార్యనిర్వాహకుఁడై యుండిన యూరె దేచమంత్రి కంకిత మియఁబడెను. నాదిండ్లగోపయ్య శ్రీకృష్ణరాయల సర్వశిరఃప్రధానియైన సాళువతిమ్మరసునకు మేనల్లుఁడు. కృష్ణరాయలు క్రీ. శ. 1515-వ సంవత్సరమునఁ గొండవీటిని జయించెను. అది మొదలు క్రీ. శ, 1525 వఱకు నాదిండ్లగోపమంత్రి కొండవీట దుర్గాధిపత్యము గావించెను. క్రీ. శ. 1517-వ సంవత్సరమున నాతఁడు దేచమంత్రి కొక యగ్రహారము నిచ్చెను. ఱంచుమించుగా

క్రీ. శ. 1525-వ సంవత్సరమున నుద్భటచరిత్రను కృతినంది యుండును. పాండురంగమాహాత్మ్యము దరువాత రచింపఁబడెను. కృతినాయకుఁడగు విరూరి వేదాద్రిమంత్రి కందాళఅప్పళాచార్యుల శిష్యుఁడు. మంగయగురువయ పెదసంగభూపాలునికడ వ్రాయస కాఁడు. "చిత్రభారత కృతిపతి తండ్రి పెదతండ్రులును, వై జయంతీ విలాసకర్తయగు సారంగుతమ్మకవియు నీ యప్ప ళా చా ర్యు ల శిష్యులు. క్రీ. శ. 1542 పరాభవసంవత్సరమున గండికోట ప్రభువు కందాళఅప్పలాచార్యులకు భూదానమొసఁగిన శాసనము కలదట. దీనినిబట్టి పాండురంగమాహాత్మ్య రచనాకాల మించు మించుగా క్రీ. శ. 1550, 1560 అగునని తలంపవచ్చును."

మంగయగురువయ పెదసంగరాజుగూడ నాకాలమువాఁడే. ఆతని చెల్లెలికొమారుఁడగు కొండ్రాజు వెంకటరాజు శా. శ, 1506 అనఁగా క్రీ. శ. 1584 నందు వెంకటరామకృష్ణు లను కవులచేత కామందకకృతిఁ గొనెను. "వీనినిబట్టి చూడఁగాఁ బాండురంగ మాహాత్మ్యరచనాకాలము క్రీ. శ. 1565 ఇంచుమించుగా నని యేర్పడుచున్నది. అనఁగా తెనాలిరామలింగకవి ఇంచుమించుగా క్రీ. శ. 1525 లో ఉద్భటచరిత్రమును, మఱి ముప్పదేండ్లకుఁ బాండురంగమాహాత్మ్యమును రచించియుండు నని చెప్పనొప్పు చున్నది." 1

2

ఇంతవఱకును తెనాలి రామకృష్ణకవియొక్క కాలమును నిర్ణయింపఁగడంగిన వాఙ్మయచరిత్రపరిశోధక పండితుల యభి ప్రాయములను సంగ్రహముగఁ దెలిపితిని. వీరియందు విశేషలింగము గారి పరిశోధన యడవిని గాచిన వెన్నెల యాయెను. జలాశయ

---

1. ఉద్భటారాధ్యచరిత్ర పీఠిక, పుటలు 1-13.

మును విడిచి యొండమావుల నీ రరసినట్లు చరిత్రాంశములను ఱదోసి పుచ్చి గాథల నాధారపఱచుకొని వారు రామకృష్ణునికాలమును గనుఁగొనఁ గడఁగిరి. ఈగాథ లంధకారమందలి కొఱవిదయ్యముల వలె మూలమూలకుఁ ద్రిప్పితుద క థ్వా న్న పు ం బ ట్టు న మా య మా యెను. రామమూ ర్తిపంతులుగారు వా స్తవార్థముపైఁ జేయి డియు నది మిథ్య యని వాదించువారి మాటలను దోసిపుచ్చనేరక మౌనము వహించిరి. రామకృష్ణకవిగారు పీఠేశలింగముపంతులుగారి వలయందుఁ జిక్కు-కొనక తప్పించుకొని యథార్థముఁగనుఁగొను మార్గమును గనిపెట్టి యించుమించుగా వా స్తవమిట్టిదని గ్రహిం చిరి. ప్రభాకరశాస్త్రులవారు రామకృష్ణకవిగారు సూచించిన మార్గమునఁ జని, యథార్థముఁ గని, తత్స్వరూపమిట్లుండు నని తెలి పిరి. వీరి పరిశోధనల మూలమున తెనాలి రామకృష్ణుఁడు కృష్ణ రాయలయుగమువాఁడని తేటతెల్లమైనది. కాని యతని కాలమును ఇంతకంటె స్పష్టముగ నెఱుంగ సాధ్యమగునని నేను తలఁచెదను. ఈ తలంపే చర్వితచర్వణ మగు నీ విషయమును మరల తడవఁ బురి కొల్పినది. నాతలఁపు కేవలము ఱభమజన్యమగునో, లేక సత్య మో పరిశీలించి కనుఁగొనుటయే యీ వ్యాసము యొక్క ముఖ్యోద్దేశము.

గార్ల పాటివారు తెనాలివారెప్పుడైరి?

తెనాలి రామకృష్ణుని కాలము నెఱుఁగుటకు మూలా ధారము లాతని గ్రంథములే. ఇందు ముఖ్యముగ నిచ్చట పేరొక్కనఁదగినవి రెండు: (1) ఉద్భటారాధ్యచరిత్రము, (2) పాండు రంగమాహాత్మ్యము. ఇవిగాక, వీని కుపాంగములుగ నెన్నఁదగి నవి సమకాలిక గ్రంథములు. వీనియందు ప్రధానమైనవి: (1) రెట్టమతశాస్త్రము, (2) కామందకము, (3) సుదక్షిణాపరి ణయము. వీనికి వెనుక నెన్నఁదగినవి యర్వాచీనగ్రంథములు. ఇందుమతీకల్యాణ మొక్కటియే యీతరగతికిఁ జేరినది. దేవాముని కు

ప్రాణమువలె నీ యాధారముల కన్నిటికిని చైతన్య మొసంగునవి శాసనములు. ఈ పరికరముల సాహాయ్యముతో (తెనాలి) రామకృష్ణకవి కాలమును నిర్ధరించుటకుఁ గడంగెదను.

ముఖ్యాధారములలో ప్రథమమున నెన్నదగినది ఉద్భటారాధ్యచరిత్రము. దీనిని రచియించిన కవి తెనాలి రామలింగయ. ఈ రామలింగయయే పాండురంగ కృతికర్తయగు రామకృష్ణకవి యని ప్రభాకర శాస్త్రిలవారు నిరూపించియుండుటచే మరల నా విషయ మిచ్చట ప్రస్తావించవలసిన యవసరము గాన్పించదు. ఉద్భటారాధ్యచరిత్ర కృతిపతియగు దేచమంత్రి క్రీ. శ. 1515 వ సంవత్సరమునుండి 1525 వరకును గొండపీట దుర్గాధిపత్య మొనర్చిన నాదిండ్ల గోపప్రధానికిఁ గార్యనిర్వాహకు డైయుండెఁ గాన నాతఁడీమధ్య కాలముననే యుద్భటారాధ్య చరిత్ర కృతి నందియుండు ననుట నిర్వివాదాంశము. కాని రామలింగ (కృష్ణు) ని గురించి యుద్భటారాధ్య చరిత్రనుండి తెలియవచ్చు వృత్తాంత మింతియే యైనను, ఈ పట్టున విచారించ దగిన విషయ మొక్కటికలదు. తెనాలి యగ్రహార పూర్వోత్తరము నించుక దడపుట యావశ్యకము. రామకృష్ణుని కాలమున నిది యగ్రహారముగ నుండెను. దీనికిఁ జాండు రంగమాహాత్మ్యము సాక్షి. కాని తెనాలి యెప్పుఁడగ్రహార మాయెను, దాతయెవ్వఁడు, ప్రతిగృహీత యెవ్వఁడు అనునవి విచారణీయములు. ప్రభాకర శాస్త్రులవారిచే నుదాహరింపఁబడిన రామలింగేశ్వరాలయ శాసనమున "శ్రీ తెనాలి నగరే వ్యరాజయ ద్గార్ల పాటిపురి రామపండితః" అని యుండుటచేత ఉద్భటారాధ్య చరిత్ర కృతిసమర్పణమునకుఁ బదియేండ్లముందు తెనాలి యగ్రహారము కాదనియు, రామపండితుని యింటిపేరు తెనాలివారు కాదనియు స్పష్టమగుచున్నది. మఱియు నుద్భటారాధ్య చరిత్రమున రామలింగఁడు స్వగృహనామమును దెల్పలేదు. కాని క్రీ శ. 1550 ప్రాంతమున రామలింగని తమ్ముఁడగు నన్నయ్య విరచించిన సునఖీణాపరిణయమునఁ దాను తెనాలి రామపండితుని పుత్రుఁడనని చెప్పుకొని

యున్నాఁడు. గార్లపాటి రామపండితుఁడే తెనాలి రామపండితుఁ డగుట నిశ్చయమేని క్రీ శ. 1510 - 1550 సంవత్సరముల మధ్య గార్లపాటివారు తెనాలివారై రని తేలుచున్నది. ఈమధ్యకాలమునఁ గలిగిన ఈ మార్పునకుఁ గారణ మేమి? "తెనాలిలో నండుటచేతనే తెనాలివా రని యిఁటిపే రేర్పడిన" దని ప్రభాకరశాస్త్రిగా రను చున్నారు.1 తెనాలిని అగ్రహారముగఁ బడయుటచేతనే యింటిపేరు మారిన దని నేను తలఁ చెదను. క్రీ. శ. 1510-వ సంవత్సరము నాఁటి రామపండితుని శాసనమున తెనాలి యగ్రహారమని లేకపోవు టయు, విరూరి వేదాద్రిమంత్రి కంకిత మొసఁగిన పాండురంగ మాహాత్మ్యమున రామకృష్ణుఁడు తాను "తెనాల్యగ్రహార నిర్ణేత"2 నని తెల్పుటయుఁ జూడ రామకృష్ణుఁడే తెనాలి యగ్రహారము గ మారుటకుఁ గారకుఁ డాయెనన్న యనుమానము కలుగుచున్నది. ఉద్భటారాధ్యచరిత్ర కృతిపతి యగు దేచమంత్రి రామకృష్ణునికిఁ దెనాలినగ్రహారముగ నొసఁగి బహూకరించియుండును. ఇట్లు తెనాలి నగ్రహారముగ గొనుటచేతనే కవి యింటిపేరు తెనాలివా రని మారియుండును.

ఉద్భటారాధ్యకృతి సమర్పణ కాలము

ప్రభాకరశాస్త్రులవారు తలఁచినట్లు ఉద్భటారాధ్యకృతి సమర్పణ "మించుమించుగా" క్రీ. శ. 1525-వ సంవత్సరమున జరిగె నన్న యూహ నిరాధకము కాదేమో యను సంశయము కలుగు చున్నది. కృష్ణరాయల సర్వశిరఃప్రధానియగు సాళువ తిమ్మరసు యొక్క మేనల్లుఁడగు నాదిండ్లగోపన క్రీ. శ. 1515-వ సం. నుండి 1525-వ సం. వఱకు కొండపీట దుర్గాధిపత్య మొనర్చె నని యింతకు పూర్వము తెలియఁజేసి యున్నాను. తన కుమారుఁ

---

1. ఉద్భ. పీఠిక-పుట, 6.
2. పాండు. ఆ. 1-28.

డగు తిరుమలదేవమహారాయలను విషము పెట్టి తిమ్మరుసు కుమారుఁడు తిమ్మదండనాధుఁడు చంపించె నని కలుషించి కృష్ణరాయల వారు తిమ్మరుసును, నతని బంధుగులను, నాశ్రితులను స్థానభ్రష్టులను గావించి వారి సర్వస్వమును నగరఁ గలుపుకొని వారి నందరిని కారాగారనిబద్ధులఁ గావించెను. గోపమంత్రియుఁ దనవారిం బోలి స్థానభ్రష్టత్వము నందెను. ఈ యడావడియందు గోపమంత్రి యొక్క కార్యనిర్వాహకుఁడు శాంతచిత్తుఁడై సుఖ మనుభవించుచు నుద్భటారాధ్యచరిత్ర కృతిఁగొనెనని యొంచుట యుక్తముగఁ గానించదు. కావున రామలింగయ కృతిసమర్పణము తత్పూర్వమే యొనర్చె ననుట యొప్పిదము కాకపోదు. ఈతలం పసంభావితము కాదేని ఉద్భటారాధ్యచరిత్రను క్రీ. శ. 1515-1525 సం॥లకు మధ్యనెప్పుడో యొకప్పుడు, ప్రాయశః 1520-వ సం॥ ప్రాంతమున దేచయ యంకితము గొనెనని యొంచవచ్చును. ఉద్భటారాధ్య కృతిసమర్పణకాలమున రామలింగఁడు తరుణవయస్కుఁడై యుండిన ట్లాగ్రంథమునందే కొంత యాధారము గలదు. "కుమారభారతి" యను రామలింగని బిరుదును ఈ సందర్భమున స్మరణకుఁ దెచ్చుకొనవలయును. శాసనసాహిత్యముగూడ దీని కూఁత యిచ్చుచున్నది. ఉద్భటారాధ్యచరిత్ర పీఠికయందు ప్రభాకర శాస్త్రిలవారు రామలింగని యింటిపేరు మొదట గార్లపాటివారనియుఁ, దెనాలివాసమువల్ల తరువాత తెనాలివా రని మాఁదె సనియు తెల్పుచు, దీనిని రుజువు పరచుటకుఁ దెనాలి రామలింగేశ్వరుని యాలయమందలి యొక యుత్సవ విగ్రహపీఠముపైని,

"శ్రీతెనాలినగరే వ్యరాజయ
ద్గార్ల పాటిపుర రామపండితః,
శుక్లమాఘసితపంచమీగురౌ
రామలింగముమ యోత్సవాకృతిమ్."

అను శ్లోకము నుదాహరించినారు. శాస్త్రిలవారు వచించునట్లు ఖందు బేరొక్కనఁబడిన గార్లపాటి రామపండితుఁడును, రామలింగని

తండ్రి యగు రామధీమణియు నొక్కరే యగుదురేని రామలింగని తండ్రి శా. శ. 1432 నకు సరియైన శుక్ల వర్షమున, అనగా క్రీ. శ. 1511-వ సంవత్సరమున సజీవుడై యుండెనని నిశ్చయ మగుచున్నది. క్రీ. శ. 1511 సంవత్సరమువఱకును రామపండితుడు జీవితుడై యుండుటయు, క్రీ. శ. 1525 కు పూర్వము "కుమార భారతి" బిరుదు మారకుండుటయును రామకృష్ణుడప్పటికి పసి వాడై యుండినట్లు సూచించుచున్నవి. ఉద్భటారాధ్య చరిత్రనుండి తత్కర్తయగు రామ (లింగ) కృష్ణుని కాలమును గురించి తెలిసి కొనగల దింతియే.

కాని రామకృష్ణుని యితర కావ్యము లెప్పుడు రచియింప బడెనో తెలిసికొనుటకు ఉద్భటారాధ్యచరిత్ర మేవిధమునను ఉపక రించదు. ఘటికాచలమాహాత్మ్యమును సంపూర్ణము గావించి కృతి నెవ్వరికేనియు నిచ్చుటకు పూర్వమే యతడు కాలధర్మము నందుటవల్ల నది యతనికి కడపటి గ్రంథమని తోచుచున్నది. దానిని రామకృష్ణుని మనుమడు ఖండోజీయను మహారాష్ట్రుని కొసగగా నాతడు వెంకటగిరియను కవీంద్రునిచే గృత్యాదికములు వ్రాయించుకొని తన కంకితము గావించుకొనెను.

పాండురంగ కృతిసమర్పణ కాలము

ఇక పాండురంగమాహాత్మ్య రచనా కాలమును దెలియ వలసియున్నది. దీనిని రామకృష్ణుడెప్పుడు రచించెను? ఉద్భటా రాధ్యచరిత్రకు బూర్వమా, యనంతరమా యను విషయము విచా ర్యము. పాండురంగమాహాత్మ్యమున దద్రచనాకాలమును సూచించెడి యంశము లెవ్వియు గానరావు. కాని, కృతినాయక వర్ణనసందర్భమున నుక్తములైన విషయములఁ గొన్నిటి నాధార పఱచుకొని పాండురంగకృతిసమర్పణకాలము నొకరీతిగా నిర్ణ యించవచ్చును. దీని కృతినాయకుడు మంగయగురువరాజు

కుమారుఁడు పెదసంగరాజుకడ ప్రాయసకాఁడగు విరూరి వేదాద్రి మంత్రి. ఈ పెదసంగరాజెచ్చటివాఁడో, అతనికాల మెద్దియో తెల్పఁదగు సాధనము లెవ్వియు పాండురంగమాహాత్మ్యమునఁ గాన రావు. కాని యయ్యలు భాస్కరకవులచే విరచింపఁబడిన రెట్టమత శాస్త్రమువలన నాతని వృత్తాంత మొకకొంత తెలియవచ్చుచున్నది. రెట్టమతకృతిపతి యగు కొండ్రాజు వెంకట్రా జీతనికి మేనల్లుఁడు. తత్కారణమున రెట్టమతపీఠికయం దాతని పూర్వోత్తరము వర్ణింపఁబడెను. దాని నిచ్చటఁ బొందుపఱచుచున్నాను.

మ. "విదళించెఁ గరిరాండ్రరిద్రతను భూ
విఖ్యాతమై మించు న
భ్యుదయం బంది యళంబుఁ గాంచె మహిలో
నుద్దండ విద్వేషులఁ
గదనక్షోణులఁ దోలి గెల్పుసిరులం
గైపట్టెఁ గొండ్రాజు శే
పెదతిమ్మక్షితిపాలమౌళి కెనయే
పృథ్వీపతుల్ దక్కొరుల్.

తే-గీ. అట్టి పెదతిమ్మరాజు ధైర్యాద్రిరాజు
మంగవిభుగుర్వశౌరియనుంగుఁగూఁతు
సంగనాశిరోమణిఁ జాపసంగమాఖ్యఁ
బ్రేమ వరియించె విభవాభిరామముఁ డగుచు.

క. గుణనిధి యగు తత్కన్యా
మణిజనకుఁ బోధజనకు మంజులభాషా
ఫణివరు రణవిజయార్జునుఁ
బ్రణుతింపఁ దరంబె గురువపార్థివవర్యఁ.

సీ. పృథులవిక్రమశాలి పెదసంగనృపతియు
సత్యసంధుఁడు చిన్నసంగరాజు
ధీరగుణాఢ్యుండు తిమ్మభూపాలుండు
రుచిరకీర్తిధనుండు రుద్రఘనుఁడు

ప్రథనాంగణకిరీటి బసవనకేంద్రుడు
స్థిరభాగ్యనిధి పెద్దచిట్టఘనుఁడు
సింధుగాంభీర్యుండు చినచిట్టధన్యుండు
సత్తగణ్యుఁడు పొట్టిసంగశౌరి

తే-గీ. కలితేజుండు పాపసంగప్రభుండు
ననఁగఁ బరఁగిన తొమ్మండ్రు తనయవరులఁ
గాంచి దిగ్జయశాలి యై మించె నౌర
మంగరాజన్యగురువసమ్రాడ్వరుండు.

క. ఆ గురవరాజవరునకుఁ
బ్యాగసముద్రునకుఁ నల్లఁ డయి వెలసె ధరా
భాగధురంధరతను నా
భాగుఁడు పెదతిమ్మరాజు ప్రజలు నుతింపఁ.

తే-గీ. ధీరశేఖరుఁ డా పెద్దతిమ్మరాజు
లలితగుణముల నుభయకులప్రసిద్ధ
యైన యల పాపసంగమాహ్వాయపవిత్ర
శాళిరోమణియందు ముదంబుతోడ.

చ. పరపురభంజనోగ్రుఁ డయి
భాసిలు దాసరిరాజశేఖరున్
దిరుపతిధారుణీశుఁ గుల
దీపకు వెంకటపార్థివోత్తమున్
గురుయశుఁ గృష్ణయప్రభుని
గొండలధీరుని బాహుశౌర్యసు
స్థిర రఘునాథశౌరిఁ జిన
తిమ్మ నృపాలుని గాంచె ధన్యుఁడై."

ఈకొండరాజు పెద్దతిమ్మనృపాలునకు మంగయగుర్వారాజ పుత్రికయగు పాపసంగమయం దుద్భవించిన కుమారులలోఁ ద్వితీయుఁడగు వెంకటరాజే రెట్టమత శాస్త్రకృతిపతి. ఏతద్గ్రంథరచన

కాని ఈ పద్యము గ్రంథకర్తలు వ్రాసినట్లు తోఁచదు. ఇదియొక్క వ్రాఁతప్రతియందుఁ దప్ప మఱి యెచ్చటను గానరా దని మానవల్లి రామకృష్ణకవిగారు చెప్పియున్నారు కదా.

మఱియు నీ రాజు కృతిఁగొన్న వేంకటరామకృష్ణ విరచిత కామందక కావ్యము క్రీ. శ. 1584-వ సంవత్సరమునఁ బూర్తిసేయఁబడెనని యందలి.

మ. "రమణీయంబుగ శాలివాహశక వ
ర్షంబుల్ గతంబై సహ
స్రము నేనూఱును నాఱు నై వెలయఁగా
బ్రౌఢిం దెనిగించి రా
ర మహిం దిమ్మయవెంకటాద్రి విభుపే
రన్ వేడ్కఁ గామందకీ
యము శ్రీవేంకటరామకృష్ణులు స్వభా
స్వద్బంబునన్ రూఢిగాన్."।

---

1. తంజావూరు సరస్వతిమహాలు పుస్తకభాండాగారము వారిచేఁ బ్రకటితమై **A Descriptive Catalogue of Telugu Manuscripts** అను పుస్తకము, పుట, 309 లో నీ పద్యమిట్లచ్చయియున్నది.

మ. రమణీయంబగు శాలివాహనశకవర్షంబు వెయ్యైనే
నూరును నారునై వెలయఁగా బ్రౌఢిం దెనింగించి రా
ర మహిం దిమ్మయవెంకటాద్రి విభు పేరన్ వేడ్క గామందకీ
యము శ్రీవెంకటరామకృష్ణులు స్వభావంబొంద నారూఢిగా.

ఈ కాటలాగును తయారుచేసినవా రన్నవిధముగా "పద్యము లక్షణయుక్తముకాదు." దినిని మానవల్లి రామకృష్ణకవిగారుపై నున్నరీతిగా సంస్కరించినారు.

అను పద్యమువల్ల తెలియుచున్నది. కొండ్రాజు వెంకటరాజు యొక్క సరియైనకాల మిదియే యని యాతని యహోబలశాసన ములు రుజువుచేయుచున్నవి. ఇందొకటి శా. శ. 1506 నకు సరి యైన తారణ సంవత్సరమునందు శ్రీరంగదేవరాయలు పెనుగొండ దుర్గమునుండి పృథ్వీసామ్రాజ్యము నేలుచుండిన కాలమున దేశముపై నెత్తివచ్చి యహోబలస్థలమును పాడుగావించిన తురకలను వెడల నడచినందుకు సంతసించి, శతకోపజీయ్యంగారు కొండ్రాజు వెంక ట్రాజుగారికి అహోబలనాథుని యాలయమున గొన్నిమర్యాదలు జరుగున ట్లేర్పాటు చేసిరని తెల్పుచున్నది. మఱియొకటి శా. శ. 1507 నకు సరియైన పార్థివ సంవత్సరమున వెంకటపతిదేవ మహారాయలు పెనుగొండయందు పృథ్వీసామ్రాజ్యము సల్పుచున్న కాలమున కొండ్రాజు వెంకట్రాజుగారు అహోబలనాథునికి సాలుకు 80 వరహాల ఆదాయము వచ్చు కావలిపన్నును దానముచేసిరని తెలియఁజేయుచున్నది.[1] ఈ శాసనములవల్ల కొండ్రాజు వెంక ట్రాజు క్రీ. శ. 1584-వ సంవత్సర ప్రాంతమున నుండెనని నిశ్చయ మగుచున్నది. ఇతని మేనమామయగు గురువరాజు సంగరాజు ఇతనికంచె కొంచెము పూర్వమున నుండవచ్చును కదా! అట్లుండె ననుటకు నిదర్శనములు లేకపోలేదు. కడపజిల్లా కామలాపురం తాలూకా యనిమెలగ్రామమందు సంగమేశ్వరస్వామియాలయమున శా. శ. 1515-వ సం॥కు సరియైన నందసంవత్సర అధికాషాఢ శుద్ధ 15 లు సోమోపరాగసమయమున, అనఁగా క్రీ. శ. 1592-వ సం॥ జూన్ నెల 14 తేది బుధవారమునాడు గురువరాజు బసవరాజు కొమారుఁడగు గంగాధరదేవ చోడమహారాజు అనిమెలసంగమేశ్వర

---

1. Mac. Mss. 15-3-5. p 95. తారణాబ్దమునకు సరియైన గత శకాబ్దము 1507 గాని 1506 కాదు. అట్లే పార్థివకు సరియైన శకాబ్దము 1508.

స్వామికిఁ జేసిన భూదానముఁ బ్రకటించు శాసన మొకటి కలదు.[1] గంగాధర దేవచోడుని తండ్రియైన బసవరాజు మంగయగురువరాజు పుత్రులలో మధ్యముఁడు. అతనికంటె పెద్దవారు నల్వురును, చిన్న వారునల్వురును నుండినట్లు రెట్టమతమువల్ల తెలియుచున్నది.[2] గురువరాజుకుమారులందఱియందును జ్యేష్ఠుఁడైన పెదసంగరాజు క్రీ. శ. 1550-వ సం॥ ప్రాంతమున నుండెనను నూహాయం దేవై పరీత్యమును లేదుకదా. ఊహాయేల? తత్పూర్వమే యుండెనని యే శాసనములు సాక్ష్యము పల్కుచున్నవి. సదాశివదేవమహారాయలు విద్యానగర వజ్రసింహాసనమునై ఁ గూర్చుండి పృథ్వీసామ్రాజ్యము సే యు కా ల ము న, "స్వస్తిశ్రీవిజయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు 1465 అగు నేటి శోభకృతునామసంవత్సర భాద్ర పదశుద్ధ 2 సోమవారమునాడు కాశ్యపసగోత్రం ఆపస్తంబసూత్రం యజుశ్శాఖాధ్యాయులైన సూర్యవంశోద్భవులైన శ్రీమన్మహా మండలేశ్వర బొమ్మరాజులుంగారి పౌత్రులైన మంగరాజుగారి పుత్రులైన గురువయదేవచోడమహారాజులుంగారు తుంగభద్రా తీరమందు శ్రీవిరూపాక్ష దేవుని సన్నిధిని రంగరాజురామరాజుగారి మూలాన శ్రీ సదాశివదేవమహారాయలచేత రెండు తామ్రశాసనాలు పుచ్చుకొని....అనిమెలసంగమేశ్వరదేవునికి ఓబుళంమయ తింమంమయ అనే దేవుళ్లు యిద్దరున్ను, పెద్దసంగరాజు, పింనసంగరాజు, తింమరాజు, రుద్రరాజు, బసవరాజు, పెదచిటిరాజు, చినచిటిరాజు, బొజ్జసంగరాజు, పాపసంగరాజు అనే తొమండ్రు కుమారులు సమీపస్థులయివుండగాను ఆఘనాళిని పాపఘ్ని సంగమస్థాన శివ

---

1. Mac. 15-3-6 p 276.

2. రెట్టమతశాస్త్రము అ. 1: 27.

రాత్రిపుణ్యకాలమందు సహిరణ్యోదక దానధారాపూర్వకంగా ధార పోసి యిచ్చిన గ్రామాలు.1

ఈశాసనమువలన మంగయగురువరాజును, నాతని తొమ్మండు గురు పుత్రులును క్రీ. శ. 1543-44 సంవత్సరమున నుండిరని తేట తెల్లముగాఁ దెలియుచున్నది. ఇంతేకాదు. మంగయగురువరాజు ద్వితీయ పుత్రుఁడగు పినసంగరా జప్పటికే పెద్దవాఁడై నిర్వాహకుఁడై స్వయము పొత్తపినాట రాజ్యపాలన సేయుచుండెను. కడపజిల్లా రాజంపేటతాలూకా పొత్తపిగ్రామములోని గోపాల స్వామిదేవాలయమున కెదుటనున్న శిలాశాసనమున శా. శ. 1468 పరాభవ సం।। ఆషాఢ బ॥ 1 నాడు "పొత్తపిగ్రామమును శ్రీమన్మహామండలేశ్వరగురువరాజు చినసంగదేవ మహారాజులగారికి పాలింపుచుండగా సదాశివరాయలవారి ఆనతిని రాయలవారి ఆజ్ఞా పాలనము చేస్తూవున్నటువంటి రామరాజయ్యగారి ముదలను పొత్తపిమంగలవారు ఆచ్చేపన్ను నగరకానికెకట్టం అన్ని సర్వ మాన్యం చేసియిచ్చినారు" అని వ్రాసియున్నది.2 ఈ చినసంగరాజు కృష్ణరాయల కాలమునఁగూడ నుండెనని మఱియొక శాసనమువల్ల తెలియుచున్నది. ఈ శాసనము జమ్మలమడుగుతాలూకా మాచు

---

1. Mac. Mss. 15-3-6 P. ఈ శాసనపు సారాంశమునే స్థానిక చరిత్రల 7-వ సంపుటమునఁ గని దీనియాధారమున రామ కృష్ణుఁడు కృష్ణరాయలకాలమున నుండె నని రామమూర్తి పంతులు గారు వ్రాయఁగా, వీరేశలింగంపంతులుగారు మంగయ కొమారుఁ డగు గుర్వరాజును మంగయ తమ్ముఁడని చెప్పునట్టి యీశాసనము విశ్వాసపాత్రము కాదని గర్హించి త్రోసిపుచ్చిరి. పంతులుగారు మెకంజీపు స్తకములనే చూచియుండిన వెడతోవలు దొక్కి యుండరు.

2. Mac. Mss. 15-3-45 pp. 26-27.

పల్లెమజరా బుక్కాయపల్లె సమీపమున నొక జొన్న చేనియం దున్నది. ఇందు శకవర్ష ము లేదు. "ప్రమాదిసంవత్సర ఆషాఢ శుద్ధ 11 లు శ్రీమన్మహామండలేశ్వర గుముడూరు అపుబళదేవమహా రాజులుంగారు కడప శ్రీపతి కొండసానికి యిచ్చిన ధర్మశాసనక్రమ మెట్లన్నను, మాకు గురువరాజు చినసంగరాజుగారు పాలించిన సిద్ధ వటము సీమలోని మాచుపల్లి గ్రామాన కడప తిరువెంగళనాథుని సేవకు దానివై న నిమి త్తము నీకు నేము మాన్యము పెట్టిన చేను-బంళంమ్మ కుంట స్థలానకు వు త్తరం గంగులపుల్లయ గుడి స్థళంచేను శి ముత్తము. చేనున్నయి స్తిమి"1 ప్రమాదినామ సంవత్సరమునకు సరియైన శకవత్సరము 1441, అనగా క్రీ. శ. 1519-వ సంగన మంగయగురువరాజుయొక్క రెండవకుమారుడగు చినసంగరాజు సిద్ధవటసీమయందు మాచుపల్లె మొదలై న గ్రామములను పాలించు చుండెనని విశదమగుచున్నది. పెదసంగరాజు శాసనమేదియు నింత వఱకు లభింపకున్నను నతడు తన తమ్ముడగు చిన సంగరాజువలెనే కడపమండలమున నెచ్చటనో క్రీ. శ. 1519-వ సంవత్సరము నుండియు రాజ్యపాలనము సేయుచుండెననుట నిశ్చయము. కావున నాతని ప్రాయసకాడై న విరూరివేదాద్రిమంత్రి కంకితమీయబడిన పాండురంగమాహాత్మ్యము కృష్ణరాయలవారి రాజ్యకాలము తుదనో, తరువాత అచిరకాలమునకో విరచితమయ్యె నని యూహించుచున్నాను. పైజెప్పిన శాసనముల నన్నిటిని సమ కూర్చి చింతించిన నీయూహ సత్యమునకు దూరము కాజాలదని తలచెదను.

3

తెనాలి రామకృష్ణుడు, అతని సమకాలికులు.

రామకృష్ణునిగూర్చి లోకమునఁ ప్రఖ్యాతిలోనున్న యైతి హ్యాములనుబట్టి చూడ నాతనికి కృష్ణరాయలకాలమందుండిన

---

1. Mac. Mss. 15-4-28 p. 28.

పెక్కుమంది కవులతోడను, విద్వాంసులతోడను సంపర్కము గలదని తెలియుచున్నది. ఇచ్చట వారిలోని ముఖ్యులను బేరొక్కని, వారితో నాతనికిఁ గల సంబంధము వా స్తవమో, లేక యర్వాచీను లచేఁ గల్పితమో విచారించెదను.

తా తా చా ర్యు లు

రామకృష్ణుని సమకాలికులలోఁ దాతాచార్యులవా రగ్రగణ్యులు. వీరిరువురినిగూర్చిన కథలు పెక్కు నేఁటికిని ఆంధ్రలోక మునఁ బ్రచారములో నున్నవి. కథలలో వచ్చు తాతాచార్యులు శ్రీకృష్ణరాయల మతగురువు. రాయలు వైష్ణవుఁ డని యందలి నంగీకరించినను, తాతాచార్యులవా రామహారాజుకాలమున లేరని వాదించువా రనేకులు కలరు. ఇట్టివారిలో నాంధ్రకవులచరిత్ర కారులు మొదట నెన్నఁదగినవారు. వీరు తమ యభిప్రాయము నిట్లు విశదముచేసియున్నారు: రామకృష్ణునికి తాతాచార్యుల వారితో సంబంధించిన కథ లనేకములు చెప్పుచున్నారు.... ఈ తాతాచార్యులు మొట్టమొదట రామరాజుయొక్క రాజ్యాంత్య దశలోఁ దలయెత్తి, వైష్ణవమతమునం దత్యంతాభినివేశము గలవాఁ డయి తన శిష్యులయిన రాజులచేత బలవంతముగా జనులను బట్టి చక్రాంకనాదులు చేయుచువచ్చెను." "రామకృష్ణకవి యప్పయ దీక్షితులవారితోను, తిరుమలతాతాచార్యులవారితోను సమకాలికుఁ డయి చంద్రగిరిరాజగు వెంకటపతిరాయల ప్రభుత్వకాలములో నుండినవాఁ డయినట్లు కొన్ని నిదర్శనములున్నవి. ఈవెంకటపతి రాయలు వసుచరిత్రమును కృతినందిన తిరుమలదేవరాయల యనం తరము తన రాజధానిని విజయనగరమునుండి చంద్రగిరికి మార్చు కొని క్రీ. శ. 1585-వ సంవత్సరము మొదలుకొని 1614-వ సంవ త్సరమువఱకు రాజ్యముచేసినవాఁడు."[1]

---

1. ఆంధ్రకవుల చరిత్ర, పుటలు 266-68.

కవిచరిత్రకారులు తాతాచార్యు లను పే రొక్కవ్యక్తికే చెల్లు ననియు, నాతఁడే రామరాజుకాలమునను అటుపిమ్మటను బ్రఖ్యాతివడసె ననియు భ్రమజెందిన ట్లున్నది. అట్టి యభిప్రాయ మునకు వారికాలమున నెడమున్నను, ఇప్పటి వాఙ్మయచరిత్ర పరిశోధకుల కెల్లరకును నది బిరుదనామ మనుట కరతలామలక మే. ఎందఱనేని తాతాచార్యులఁ బేరొక్కనవచ్చును; కాని యది పని లేనిపని: కథలయందుఁ జెప్పునట్లు కృష్ణరాయల కాలమున నెవ్వ రేనియు తాతాచార్యనామధారులుగలరేమో విచారించవలసినదే ప్రస్తుతకర్తవ్యము. తాతాచార్యుల నన్వేషించుచు సుదూరము పోనక్కఱలేదు. కృష్ణదేవాచ్యుతదేవరాయల కాలమున వారి యాస్థానమున నుండిన లీలావతిగ్రంథకర్త వల్లభాచార్య కవి మహేంద్రుఁడిట్లు పల్కియున్నాఁడు:

ఉ. "శ్రీనరసింహానందను న
రిందమవిక్రముఁ గృష్ణరాయభూ
జానిని వెండియుఁ దదను
జన్ముని నచ్యుత దేవరాయనిఁ
దా నధికాప్తుఁడై కొలిచి
తద్దయు మన్ననఁగాంచి మించు వి
ద్యానిధి బొమ్మలాటవిరు
పాధిపుకాళని ప్రార్థనంబునఁ.

క. అని పొగడ గణకు లౌనౌ
నన సంస్కృతభాష భాస్కరాచార్యులు చె
ప్పినపాటిగ లీలావతి
యొనర్తుఁ దెనుఁగున.....

సీ. నరనన రేంద్రనందనుఁడై న యచ్యుత
దేవరాయల కృపాదృష్టిఁ జేసి
ఆందోళికారూఢుఁడగు....బొమ్మ
లాటకాళఁడు వేట్క నర్థరాశి

లో నాత్మగురునాథుఁడైన కుమారతా
తాచార్యవర్యున కర్ధ మిచ్చె
ద్వితీయమున శేషతృతీయము లొండిడి
శేషపాదము కవిశ్రేణి కొసఁగె.

గీ. స్నేహమునఁ దన చెలులకు శేషనవమ
భాగపంచక మంతయుఁ బంచి పెట్టెఁ
గవిమహేంద్రున కర్పించె మివిలినట్టి
వేయునూటపదా ఱెంత విత్తరాళి."[1]

కావున నచ్యుతదేవరాయని కాలమున కుమారతాతాచార్యులను వైష్ణవగురు వుండెనని నిశ్చయ మౌ చున్నదికదా, నిజశిష్యుఁడగు బొమ్మలాట కాళనివలె నాతఁడును కృష్ణరాయని కాలమున సహితము నుండెననుటకు సందేహింపఁబనిలేదు. వైష్ణవ శిఖామణులైన యారాజసహోదరులకుఁ తాతాచార్యుఁడు గురువై యుండినను నుండవచ్చును.

అప్పయ్యదీక్షితులు

తాతాచార్యులతోఁ గూడఁ బేర్కొనఁబడు నప్పయదీక్షితుల వారును రామకృష్ణుని సమకాలీను లని కొన్ని కథలు సూచించు చున్నవి. వైష్ణవులు తాతాచార్యునిఁ గీర్తించుచు రాయనికడ కేఁగి యాచార్యులవారిని దీక్షితులకు పూర్వమే యర్చించవలయు నని కోరుచు

"అప్పయ్యదీక్షితా త్పూర్వం
తాతః పూజ్యో న సంశయః"

అని పల్కఁగా, రామకృష్ణుఁడు,

"ముఖప్రక్షాళనా త్పూర్వం
గురుప్రక్షాళనం యథా"

---

1. Sources Vijayanagar History, P 157.

అని వారిని పరిహాసించెనని యొకగాథ కలదు. ఇది యసం భవము. అప్పయ్యదీక్షితుల ప్రత్యర్థియగు శాతాచార్యుడు వేఱు. అతడు కోటికన్యాదానం లక్ష్మీకుమార శాతాచార్యుడు; అరవీటి రాజుల కులగురువు. రామకృష్ణుని సమకాలీనుడు అచ్యుత రాయల కాలమున నుండిన కుమారశాతాచార్యుడని పైన తెల్పి యున్నాను. ఈకథ శాతాచార్యభేదము నెఱుంగని యర్వాచీనుల వలన గల్పిత మైనట్లు తోచెడిని. ఇంతకంటె విశ్వసనీయమైన సాక్ష్యము లభ్యపడువఱకును అప్పయ్యదీక్షితులు రామకృష్ణుని సమకాలీనుడని తలచుట యుక్తము కాదు.

అప్పకాచార్యులు

ఈ యాచార్యులవారు మహాపండితుడు; మహాప్రాజ్ఞుడు. శిష్యులు వీరి పాండిత్యప్రకర్షమును వెల్లడిసేయుచు,

"అపశబ్దభయం నాస్తి
అప్పకాచార్యసన్నిధౌ"

అని పల్కఁ, దానిని సహించక రామకృష్ణుడు,

"అనాచారభయం నాస్తి
తిష్ఠన్మాత్రస్య సన్నిధౌ"

అని వారిని తిరస్కరించె నని యొకకథను పెద్దలు చెప్పుదురు. ఈకథయం దెంతసత్య మున్నదో నిర్ధారించుటకు వీలులేదు. కాని యప్పకాచార్యులు రామకృష్ణుని సమకాలీనుడనుట యథార్థము. పాండురంగ కృతిపతియగు విరూరి వేదాద్రిమంత్రి కీయాచార్యులవారు మతగురువు. ఈవిషయ మీక్రింది పద్యములవలన దెలియు చున్నది:

సీ వేదమార్గప్రతిష్ఠాద్వైతజ్యేష్ఠుఁ
డథ్వస్థషడ్దర్శనార్థరాశి
....
....

వాధూలమునిచంద్రవంశవర్ధనమూర్తి
సకలదేశాచార్యనికరగురువు
తే. పట్టమేసుంగు శ్రీరంగపతికి నణ్ణ
గారిగర్భాంబురాశినిహారరశ్మి
సారసాహిత్యసర్వస్వశయ్య నేటి
యాళవందారుకందాళయప్పగారు.

శా. తత్తాదృగ్విభవప్రభావనిధిఁ గం
దాళప్పగారిఁ దయా
యత్తస్వాంతు నితాంతశాంతియుతు లో
కాచార్యవర్యున్ సుధీ
చిత్తాంభోరుహభానుఁ గొల్చుచుఁ దదా
శీర్వాదలబ్ధోన్నతిన్
హత్తెన్ దాను విరూరి మంత్రిమణి వే
దాద్రీశుఁ డుద్యద్రుచిన్."[1]

కందాళ అప్పళాచార్యులవారు సారంగుతమ్మ కవికిఁగూడ గురువని తద్రచితవై జయంతీవిలాసమునఁ జెప్పియున్నాఁడుఃక. "వందారుదాసజనశా
మందారు న్వేదశాస్త్రమహితప్రజ్ఞా
బృందారకగురు మద్గురుఁ
గందాళాప్పలగురున్ జగద్ధితుఁ గొలుతున్."

తమ్మకవి గోలకొండ సులతానగు మహమ్మదుషాహికి సమకాలీనుఁడు.

చ. "ఖినసమతేజులౌ నృపుల
నెల్ల మహమ్మదుషాహి యేలు నీ
యెనుబదినాల్గు దుర్గముల
నేలిన యేలిక గోలకొండత

---

1. పాండు 1-77,78.

ధ్వ ననగరస్థలిం గరిణి
కం బొనరించుచు దవ్మామంత్రి యా
జనపతి రమ్మ్మ పొ మ్మ్మనఁ బ్ర
జ్జయవెట్ట గ్మహస్థు లా సనన్"1

మహమ్మదుశాహి క్రీ. శ. 1581-వ సం॥ మొదలుకొని 1611-వ సం॥ వఱకును ప్రజాపాలన మొనరించెను. కావున తమ్మ కవియు, నాతని గురువు కందాళాప్పళాచార్యులును, దత్సమకాలీనులగు విరూరి వేదాద్రి తెనాలి రామకృష్ణకవులును మహమ్మదుశాహి రాజ్యకాలమున నుండిరని కందుకూరి వీరేశలింగంపంతులుగారనియున్నారు.2

మఱియు గందాళయప్పళాచార్ములవారే యేకశిలానగర ప్రభువగు చిత్తాంబుధానునియొద్ద నమాత్యుడుగ నండిన యెను ముల పెద్దామాత్యుని తండ్రికిని పెదతండ్రికిని సహితము గురువు లని చరిగొండ ధర్మన్న తన చిత్రభారతమునఁ దెల్పియున్నాఁడు:

శా. "వఁదారుప్రజదోష మేఘపవనున్
వా శిగంభీరు నా
నందాత్మున్ హరిపాదభక్తు నిఖిలా
మ్నాయజ్ఞు విశ్వంభరా
మందారక్షితిజాతమున్ నిగమ
న్మార్గ ప్రతిష్ఠాపరున్
గందాళప్పగురున్ వివేకనిధి లో
కఖ్యాతు వర్ణించుచున్.

క. ఆదేశికపదకమలము
లాదరమున హృదయవీథి ననవరతంబున్

NARLA MEMORIAL LIBRARY V.R. V.R.NARLA D.P.R.I. Acc. No.

---

1. వైజ ఆ. 1.
2. ఆంధ్రకవులచరిత్ర, పుట 269.

మొదమున నిల్పి శ్రీలల
నాధవునిఁ గొలుతురు నారసయు మాదనయున్."[1]

వీరేశలింగంపంతులుగారు చరిగొండ ధర్మన్న కాలము నిట్లు నిశ్చయించియున్నారు:

"ఎనిమిదవ యాశ్వాసాదియందలి యీక్రింది కృతిపతిసంబో ధనపద్యమువలన నతఁడు (చిత్తాంబుభానుఁడు) శ్రీరంగరాయని రాజ్యకాలములోని యొక మండలేశ్వరుఁ డని యూహింపఁదగి యున్నది.

క. శ్రీరంగరాజసేవా
పారంగతహృదయ! కమలభవవంశపయఃపారావారసుధాకర!
మారసమానావతార మాదయసెట్టా!

మొదటి శ్రీరంగరాజు విజయనగరసంస్థానమును 1574-వ సం॥ మొదలుకొని 1585-వ సం॥ వఱకును పాలించెను. రెండవ శ్రీరంగ రాజు 1614-వ సం॥కు తరువాత రాజ్యమునకు వచ్చెను. ఈకవి యీ యిరువురు రాజులలో నొకరికాలమం దుండినందున పసునారవ శతాబ్దమునొక్క యంతమునందో, పదునేడవ శతాబ్దమునొక్క యాదియందో యుండియుండె ననుటకు సందేహము లేదు. ఇదిగాక కవియొక్క కాలమును నిర్ణయించుటకు గ్రంథమునందే యింకొక యాధారము కనఁబడుచున్నది. కృతినాయకుని వంశమును వర్ణించుచు కందాళాప్పళాచార్యులు కృతిపతియొక్క తండ్రికిని పెద తండ్రికిని గురువై నట్లు.... చెప్పియున్నాఁడు.

....

....ఈ చిత్రభారతకృతిపతియు పాండురంగమాహాత్మ్య కృతిపతికాలములోనివాఁడయిన శ్లోకగురుశిష్యత్వమువలనఁ దేటపడు

---

1. చిత్ర. 1: 26-37.

చున్నందున ఈ ధర్మకవి యిచుమించుగా తెనాలిరామకృష్ణుని కాలపువాడే "1

వీరేశలింగంపంతులుగారిచే నిట్లు నిర్ణీతమైన చరిగొండ ధర్మన్న కాలము నెల్లరంగీకరించిరి. మానవల్లి రామకృష్ణకవిగారు తమచే నిర్ణయింపబడిన తెనాలిరామకృష్ణుని కాలమునకు పై సిద్ధాంతము విరోధించుటచేత పరస్పర విరుద్ధములైన కాలనిర్ణయసిద్ధాంతముల నిట్లు సమన్వయించుటకు బ్రయత్నము సల్పిరి.

"మఱియు, క్రీ. శ. 1542 పరాభవ సంవత్సరమున గండికోటప్రభువు కందాళయప్పళాచార్యునకు భూదాన మిచ్చినట్లు భూదానశాసనము గలదు. వైష్ణవాచార్యులయొద్ద ముద్రాధారణమును గైకొనువారెల్లరువారలకు శిష్యులే. ఈ వ్యాసమునఁ జూపిన శిష్యులెల్లరు ముద్రాంకనశిష్యులు కాని విద్యాశిష్యులు కారు. కావున బాలగురువులయొద్ద వృద్ధశిష్యులుండవచ్చును."2

అప్పళాచార్య నామధారియగు వైష్ణవ గురువొక డేయని తలఁచి కవిచరిత్రకారులు తెనాలిరామకృష్ణుఁడు, సారంగుతమ్మయ, చరిగొండధర్మన్న మొదలగువారి నెల్లరను సమకాలికులని వాదించిరి. వీరియభిప్రాయమే సరియైన దని యందఱు నంగీకరించిరి. కాని, అప్పళాచార్యనామ మన్నినామములలెనే యొక్కరి కాణాచి కాదు. భిన్నకాలములం దప్పళాఖ్యులగు భిన్నపురుషులుండియుండవచ్చును. వారుమతగురువులు కావచ్చును. ఈయూహ నిరాధారముకాదు. దీనిని నిరూపించుటకుఁ బూర్వము చిత్రభారత కృతిపతి పెద్దామాత్యుని కాలమును నిర్ధారించుట యావశ్యకము. ఇతఁడును, నీతని నేలిన దొర చిత్తాంబుధానుఁడును క్రీ. శ. 16-వ శతాబ్దాంతముననో, లేక పదునేడవ శతాబ్దారంభముననో యుండిరను సిద్ధాంత మంగీకరింపఁదగినది కాదు. "శ్రీరంగరాజసేవా

---

1. ఆంధ్రకవుల చరిత్రము, పుట 280.
2. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక (1914) పుట 102.

పారంగతహృదయ" అను పద్యమునఁ బేర్కొనఁబడిన శ్రీరంగరాజు విజయనగరరా జనియు, చిత్తాంబుధానుఁ డాతనిక్రింది మాండలీకుఁడనియు వీరేశలింగంపంతులుగారు నుడివిరి. ఇది యొప్పుకొనదగినది కాదు. చిత్తాంబుధానుని రాజధాని యేకశిలాపుర ఎను నోరుగల్లు. ఇది యిప్పటి నైజామురాష్ట్రమున నున్నది. విజయనగరరాజుల యధికార మీప్రాంతముల నెప్పుడును చెల్లియుండలేదు. కావున నేక శిలాపురప్రభువగు చిత్తాంబుధానుఁడు శ్రీరంగరాయలకు లొంగి యుండిన మండలేశ్వరుఁ డనుట తప్పు. మఱియు "శ్రీరంగరాజ సేవా పారంగతహృదయుఁ"డు కృతిపతి యగు పెద్దామాత్యుఁడు గాని యతని నేలిన రాజగు చిత్తాంబుధానుఁడు గాఁడు. మఱియుఁ జిత్రభారమునఁ బెక్కాశ్వాసాదులయందు విష్ణుదేవుఁడు చేర్కొనఁ బడియున్నాఁడు. అట్లే అష్టమాశ్వాసారంభపద్యములోని శ్రీరంగ రాజును దేవుఁ డనియే తలఁచెదను. కావున చరిగొండధర్మనకాల మును నిర్ణయించుటకుఁ బంతులవా రవలంబించిన మార్గము సరియైన ది కాదు.

శా. శ. 1426 నకు సరియైన క్రీ. శ. 1504-వ సం॥ నాఁటి శాసనము ఓరంగల్లుకోటయం దొకటి కలదు.1 ఇందు చిత్తాప, లేక సిత్తాపభానుఁ డనునొక రాజుయొక్క వంశమును, దిగ్విజయము లును వర్ణింపఁబడినవి. మఱియుఁ గృష్ణదేవరాయలవారు కొండ వీడు కొండపల్లిదుర్గముల నాక్రమించి, తెలంగాణమార్గమునఁ గళిం గముపై నెత్తిపోవునపుడు మార్గమధ్యమున చిత్తాపభానుఁడు సైన్య సమేతుఁడై పచ్చి కనుమల నరికట్టఁగా రాయ లాతని నిర్జించి పాఱఁదోలె నని రాయవాచకమునం దున్నది.2 ఈ చిత్తాప భానుఁడు కంబంమెట్టయోరుగల్లు మొదలగు పట్టణముల కధిపతి యనియు, కళింగగజపతులకు మిత్రుఁ డనియు, నాతని క్రీ. శ.

---

1. Hyderabad Archaeological Series No. 9.
2. రాయవాచకము ఆం. ప. ప్రకటన పుట 94.

1524-వ సం॥ ప్రాంతమున గోలకొండతురక రాజ్య స్థాపకుడగు కుల్లీకుతుబు షాదుషా పరాభూతుఁ గావించి పై పట్టణముల నొడిచి కొనె ననియు మహమ్మదీయ చరిత్రకారులు వ్రాయుచున్నారు.[1] కావున క్రీ. శ. 16-వ శతాబ్దప్రథమపాదమునం దొరుగల్లునందొక చిత్తాపభానుఁడు రాజ్యము సేయుచుండె నని నిశ్చయమగుచున్నది

ఇఁక ఈచిత్తాపభానుఁడే చిత్రభారతకృతిపతి నేలిన ప్రభువగు చిత్తాంబుభానుఁ డగునేమో విచారించవలసియున్నది. ఈ విషయము ఓరుగంటి శాసనముకంటను, చిత్రభారతమునందును జెప్పఁబడిన చిత్తాప-చిత్తాంబుభానుల వృత్తాంతములను బోల్చిచూచిన తేలఁగలదు.

	ఓరుగంటి శాసనము	చిత్రభారతము
1.	వంశము భోగివంశము.	భోగివంశము
2.	రాజధాని ఏకోపల, లేక ఏకశిలాపురి.	ఏకశిలాపురి
3.	తండ్రిపేరు మానయ, లేక మాననృపతి.	మానపాభూలుఁడు
4	పేరు చిత్తాపభాన, సిత్తాపభాన.	చిత్తాంబుభానుఁడు
5.	ఇష్టదైవము పాంచాలరాయ స్వామిని పున రుద్ధారణము గావించెను.	పాంచాలివిభుఁడు (విష్ణువు)సంతసమున నేకశిలాపురమున వెలయుచుండెను. చిత్తాంబుభానుఁడు ఆ జగన్నాథునికృపచే లబ్ధమైన మధ్యదేశము పై రాజ్యము సల్పుచుండెను.

1. బ్రిగ్స్-హిస్టరీ, సం. 3, పుట 360-364.

చిత్తాపభానుని పలెనే చిత్తాంబుభానుఁడును భోగిపంకజుఁడు; మానస్పపతనూజుఁడు; ఏకశిలాపురాధినాథుఁడు. పాంచాలరాయ స్వామియండలి భక్తి ఇద్దఱికిని సమానమే. కావున చితాప, లేక సిత్తాపభానుఁడే చిత్తాంబుభానుఁడనట సంగతమగును. పైనిదొ గంటిశాసనము క్రీ. శ. 1504 నాఁటిది కావున చిత్తాంబుభానుని యసూత్యుఁడగు యెనుములపల్లి పెద్దనయు నప్పటివాఁడే కావల యును. ఈ పెద్దనయొక్క తండ్రికిని, పెదతండ్రికిని గురువైన కందాళ అప్పళాచార్యులవా రంతకుపూర్వమున, ననఁగా క్రీ. శ. 15-వ శతాబ్దాంతిమవర్ష ములయం దుండె నని దృఢముగఁ జెప్ప వచ్చును.

పైఁజెప్పిన విషయముల నన్నిటిని సమకూర్చి యోచిం చఁగాఁ గందాళ అప్పళాచార్య లను పేరు గల వైష్ణవగురువు క్రీ. శ. 15 వ శతాబ్దాంతమున ఎనుములపల్లి నారనమాదనలకును, దరువాత 16-వ శతాబ్దపూర్వార్ధమున విరూపివేదాద్రిమంత్రికిని, కడపటఁ దచ్ఛతాబ్దాంతమున గోలకొండకరణము సారంగుతమ్మ యకును రామానుజమతతత్త్వమును బోధించుచుండె నని తేలు చున్నది. భిన్నదేశజులును, భిన్నకాలికులును నగు వీరంచటికిని వైష్ణవమతమును బోధించుచుండిన యప్పళాచార్యుఁ డేక వ్యక్తియా, కాక ఏకనామధారులగు భిన్నపురుషులా అను విషయ ములు విచారణీయములు. దాదాపు నూఱేండ్లకు మించిన కాల మున ననిమెలయందును, నోరుగల్లు గోలకొండలలోను మతప్రచా రము గావించుచుండిన యప్పలగురు వేక పురుషుఁ డని నమ్ముటకు సాధ్యముగాకయున్నది. క్రీ. శ. 15-వ శతాబ్దాంతమున నుండిన యప్పళాచార్యుఁ డొకఁడు; 16-వ శతాబ్దపూర్వార్ధమున నుండిన వాఁడు మఱియొకఁడు; తచ్ఛతాబ్దాంతిమవర్ష ంబుల నున్న యొ తఁ డింకొకఁడు. ఇట్లు అప్పళాచార్యనామాంకితులు ముగ్గురు గురువు లుండియుందు రని తోఁచుచున్నది. ఈతలఁపు కేవలము నిరా ధారము కాదు. దీనిని స్థిరపఱచుటకు శాసనరూపమైన సాక్ష్యము

కొంత కలదు. శా. శ. 1416 ఆనందనామసంవత్సరమునకు సరి
యైన క్రీ. శ. 1494-వ సం. నం దిరుమలదేవాలయంస్థానంవారు
పంక యచ్చెల్లి-తిరునందన వనమునకు నధికారియగు కేట్వీ రామా
నుజజియ్యరువారి పేరం జెక్కించిన శాసనమున సదనుజియ్యరువారి
ఆ చా ర్య ల వా రు క ం చా డై అ ప్ప ళ గా రు పేర్కొనబడి
యున్నాడు.1

ఈ శాసనమూలమున క్రీ. శ. 15-వ శతాబ్దాంతమున, ననంగా నెనుములపల్లి పెద్దామాత్యునియొక్క తండ్రి పెదతండ్రుల కాలమున కందాళాప్పళాచార్యులను ఆచార్యపురుషు లుండి రని నిశ్చయ మగుచున్నది. ఈ అప్పళాచార్యులవారే పెద్దామాత్యుని తండ్రి పెదతండ్రుల గురువైనను కావచ్చును.

మఱియు మానవల్లి రామకృష్ణకవిగారు గండికోట ప్రభువు లలో నెవ్వరో యొకరొక కందాళాప్పళాచార్యులకు క్రీ.శ.1542-వ సం।।న నేదో దానము చేసినట్లు వ్రాసియున్నట్లు ఇంతకు పూర్వము తెల్పియున్నను. ఈశాసన మెచ్చటిదో వారు చెప్పలేదు; కాని యాకాలమునంగూడ అప్పళాచార్యులసగురు వొకరుండిరాయను సందేహమున కెడములేదు. పై జెప్పిన తిరుమల దేవస్థానశాసనము లందే శా. శ. 1438 ధాతునామ సంవత్సరమునకు సరియైన క్రీ.శ. 1516 సం॥ నాఁడు తిరుమల స్థానమువారు తిరువేంకటనాథుని పూలతోట కధికారియగు కేట్వీతిరువెంకటనాథ టీయరు పేర గోవిందరాజస్వామిగుడియందుఁ జెక్కించిన శిలాశాసనమున నొక కందాడై అప్ప పేర్కొనబడి యున్నాఁడు.2 ఇంతకంటె ముఖ్యమైన శాసనము మటియొకటి తిరుమల దేవసానం మూఁడవ ప్రాకారపు పడమటిప్రక్కగోడమీఁద చెక్కఁబడియున్నది. ఇది శా. శ. 1461 విరోధినామ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. 1539-వ సం న అప్పాగారిశిష్యుఁడును, మఱియనియన్నాఁప్రధానోట్ట్వై

---

1. తిరు. దే. శా. సం. 2, పుట 273.
2. తిరు. దే శా. సం 3, పుట 224.

నధికారియు నగు తిరువెంకటయ్య వేర దిరుమలదేవస్థాన ధర్మకర్తల చేత తిరమలదేవాలయపు మూడవప్రాకారపు పడమటిగోడమీద జెక్కఁబడినది. ఇందు "మీయాచార్యులవారైన కందాడై అప్పా అయ్యగారి జన్మనక్షత్రమగు ఆవణిమాసమందలి భరణినక్షత్రమున పెద్దపెరుమాళ్లకు 2 వరుప్పువియలులను 1 మనోహరపడిని నివేదన సేయుటకును...." అనువాక్య మీసందర్భమున గమనించదగినది.1 ఇదిగాక గోవిందరాజస్వామియాలయములోని శా. శ. 1466 క్రోధి నామసంవత్సరమునకు సరియైన క్రీ.శ. 1544-వ సం॥ నాటియొక శాసనమున, ప్రసాదగ్రహీతలయందు కందాడై అప్పయ్యంగారొక్క డైనట్లు చెప్పియున్నది.2 ఇందువల్ల క్రీ. శ, 1544-వసం॥న నొక అప్పాచార్య లుండిరనుట నిశ్చయము. ఈకందాడై అప్పయే వేరూరివేదాద్రిమంత్రియొక్క గురు వని శ్రీ సాధుసుబ్రహ్మణ్య శాస్త్రులుగా రనుచున్నారు. కావచ్చును. ఈ యాచార్యులే గురువ రాజు పెదసంగరాజుయొక్క కడగొట్టుమేనల్లుడైన కొండాద్రిజు చినతిమ్మరాజునకు గురువు. శా. శ. 1468 పరాభవనామ సంవ త్సరమునకు సరియైన క్రీ. శ 1546-వ సంవత్సరమున నీతిమ్మరాజు తన గురువుగారికి చెన్నూరుసీమలోనికి యణకువయైన తూగుట్ల పల్లెను దానముజేసినట్లు కడపజిల్లా జమ్మలమడుగుతాలూకా దేవి గుడిగ్రామములోని తల్లకంచేశ్వరీ దేవియాలయమున కెదుటనున్న యొక శిలాశాసనమునందుఁ జెప్పియున్నది.3 శా.శ. 1469ప్లవంగ నామసంవత్సరమునకు సరియైన క్రీ.శ. 1547 వ సం. నాఁటిశాసన మునం దొక దానియందు వాధూలగోత్రజుఁడును, యజుశ్శాఖా ధ్యాయియు, నాపస్తంబసూత్రుఁడును నగు కందాడై అప్పణ్ణగారి పుత్రుఁడైన యప్పగారు శ్రీవేంకటేశ్వరుల అమ్మతపడికి నగరసీమ లోని పుణ్యంగ్రామమున నర్ధభాగమును దానముచేసినట్లు చెప్పి

---

1. తిరు. దే. శా. సం. 4, పుట 245-6.
2. తిరు. దే. శాసననివేదిక, పుట 308.
3. Mac. Mss. 15-3-60

యున్నది.1 ఈశాసనము, కంచాళ అప్పళాచార్యనామధారులు ఆచార్యపురుషు లిద్ద రుండిరనియు, వారు పితాపుత్రు లనియు స్పష్టముచేయుచున్నది. వీరియందు తండ్రి యెనుములపల్లి నారయ మాదయలకును, కుమారుఁడు విరూపాక్షదేవాగ్రహారమునకు గురువుగా యుండు రని తలఁచుచున్నాను. ఇక సారంగుతమ్మయ్యగారి గురువగు కంచాళఅప్పళాచార్యు లొకరు మిగిలియున్నారు. వీ రెవ్వరో కనుఁ గొనుటకుఁ దగిన సాధనము లింకను దొరకలేదు; కాని వారు పైఁజెప్పఁబడిన ఇద్దఱు అప్పళాచార్యులకంటె భిన్నులని నా అభి ప్రాయము. భావిపరిశోధనవల్లఁగాని నిజము తేటఁబడదు.

భట్టరు చిక్కాచార్యులు

ఈయాచార్యులవారు రామకృష్ణునికి వైష్ణవమతమును ప్రసాదించిన గురువు. తన గురుమూర్తియైన యీ యాచార్యుల వారిని రామకృష్ణుఁడిట్లు కొనియాడియున్నాఁడు:

క. "వాక్కాంతాక్రీయభట్టరు
చిక్కాచార్యుల మహోత్మ శ్రీ గురుమూర్తిన్
నిక్కపుభక్తి భజించెద
నిక్కావ్యకళాకలాప మిడేసుటకున్."2

రెట్టమతకామందకములఁ గృతిగొన్న కొండ్రాజు వెంక ట్రాజును చిక్కాచార్యుల శిష్యుఁడే.

క. "శ్రీ చంచద్భట్టరుచి
క్కాచార్యవర్యశిష్య యతులితశౌర్య
ప్రాచుర్యవర్ణగుణర
త్నాచల జయలలితధైర్య నయతత్త్వనిధీ."3

---

1. తిరు. దే. శాసననివేదిక, పుట 295.
2. పాండు. 1-17.
3. కామందకము, కృతిపతిసంబోధనము.

తెనాలి రామకృష్ణు డును గొండ్రాజు వెంకట్రాజును నొక్క చిక్కాచార్యుల శిష్యు లగుదురాయను విషయము విచారణీయము. భట్టపరాశరుని వంశమున చిక్కాచార్యనామధేయు లిరుపురు గలరు. "తంజాపురీ నాథుఁడగు విజయరాఘవుని సభలో నుండిన శేషము తిమ్మకవి తన యంబరీషచరిత్రమున భట్టపరాశరుని పుత్రుఁడు చిక్క భట్టనియు, నతని పుత్రుఁడు రంగనాథదేశికుఁ డనియు, నతని కుమారుఁడు చిక్కభట్టనియు, మరల నతని పుత్రుఁడు రంగనాథుఁడు తనగురు వనియు వ్రాసికొనియె"1 అని తమ "తెనాలికవుల"ను వ్యాసమున రామకృష్ణకవిగారు వ్రాసియున్నారు. తంజావూరు సరస్వతీ పుస్తకభాండాగారమువారిచే ప్రకటింపఁబడిన "తెలుగుపుస్తకముల డిస్క్రిప్టివ్ క్యాటలాగు"నం దీ యంబరీషోపాఖ్యాన పీఠికలోఁ బాల భాగము ముద్రితమైయున్నది. అందు శేషము తిమ్మకవి తంజావూరి విజయరాఘవుని యాస్థానమున నుండెనను కేయూహారమును గానరాదు. మఱియు రామకృష్ణకవిగారిచే నుటంకితమైన భట్టపరాశరుని వంశవర్ణనయుఁ గన్పట్టదు. శేషము తిమ్మన యొకచోట "పరాశరభట్టరాఖ్యఘనకులచ్ఛాత్రుఁడ" ననియు, నింకొకచోట "పరాశరకుల భట్టజలధిరాకాశశాంక చిక్కయాచార్యనందన రఘునాథదేశిక పాదారవిందేందిరాయమానసుఁ"డ ననియుఁ దెల్పియున్నాఁడు. రామకృష్ణకవిగారు పీఠికను సంపూర్ణముగఁ దిలకించి వైయుంకమున నందుండి సంగ్రహించియుండవచ్చును. వారిచ్చిన వంశావళిలోనే చిక్కాచార్యులకుఁ దెనాలి రామకృష్ణుఁడును, కొండ్రాజు వెంకట్రాజును శిష్యులయ్యుందురేమో కనుఁగొనవలసియున్నది ఇందుకొక సాధన మగపడుచున్నది. చరిగొండధర్మన్న 16-వ శతాబ్దారంభమున నుండిన చిత్తాపథానునిసమకాలికుఁ డని తెల్పియున్నాను. ఇతఁడు తాను "శ్రీ రంగధామసదృశ భట్టపరాశరప్రభురంగగురు పాదసేవాసంభరనిర్మలాత్ముఁ"డ నని చెప్పుకొని

---

1. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక (1914), పుట 100.

యున్నాడు.1 ఈ రంగగురువు రామకృష్ణకవిగా రిచ్చిన వంశవృక్షములోని ప్రథమ చిక్కార్యుల పుత్రుడును, ద్వితీయ చిక్కాచార్యుల తండ్రియునై యుండవలయును. చిత్తాపభానుని యోరుగంటిశాసనమును, చరిగొండధర్మన చిత్రభారతమును నీరంగగురువు క్రీ. శ. 1504-వ సం. ప్రాంతమున నుండెనని రుజువుచేయుచున్నవి. ఇతని పుత్రుడు ద్వితీయ చిక్కాచార్యులు క్రీ. శ. 1530-40 ల ప్రాంతమున నుండెనని నిస్సంశయముగా జెప్పవచ్చును. కామందక కృతిపతియగు కొండరాజు వెంకటాద్రిరా జీచిక్కాచార్యునకే శిష్యుడగుట నిక్కమేని యయ్యాచార్యుడు చిరకాలము జీవించియుండెనని యూహించవలసి యున్నది.

4

ఇంతవఱకును రామకృష్ణుని సమకాలికులగు మతగురుపుల కాలము నించుక చర్చించితిని. అప్పయ్యదీక్షితులవారు రామకృష్ణుని కాలపువారనుటకుఁ దగిన యాధారములు లేవని తెల్పితిని. తక్కిన ముప్ఫ్గురును క్రీ. శ. 1530, 1540 ప్రాంతమున వెలసిరని నిరూపించితిని. కృష్ణదేవరాయలు క్రీ. శ. 1530-వ సం. పర్యంతము రాజ్యముచేసియుండుటచేత వారా రాయలకాలమున నుండిరనుట వాస్తవమునకు దూరము గాఁజాలదనియు, వారితో రామకృష్ణుని సమకాలికత యారాయఁతోడి యాతని సమకాలికతకు విరుద్ధము కాదనియుఁ దెలియపఱచితిని. ఇక రామకృష్ణుని బంధువులును, సహచరులును, ప్రత్యర్థులును నగు కవీంద్రులు కొందఱి విషయమై చర్చించవలసియున్నది.

తెనాలి అన్నయ్య

ఇందు మొదటివాఁడు తెనాలి అన్నయ్య. ఇతఁడు రామకృష్ణుని కడపటితమ్ముఁడు. స్వవిరచిత కావ్యములలో నీయన్న దమ్ములు దమ బంధుత్వమును జెప్పుకొనకపోయినను, దీనిని నిర్ధారణ

---

1. చిత్ర. 1-17.

సేయుటకుఁ దగిన సాధ్యము కొంత వానియుదే కానవచ్చుచున్నది. మఱియు పీరితోఁబుట్టువైన శ్రీగిరికవియొక్క మనుమఁడగు తెనాలిరామభద్రకవి తన ఇందుమతీపరిణయమున నీవిషయమును విశదపఱచియున్నాఁడు. తెనాలికవుల పరస్పరబాంధవ్యమును దెల్పు అంశముల నన్నిటినిఁ గ్రోడీకరించి మానవల్లి రామకృష్ణకవి గారును, పేటూరి ప్రభాకరశాస్త్రి గారును జక్కఁగఁజర్చించి యున్నారు. ఆచర్చ నివటమరల సాగించుట యనవసరము; కాని అన్నయకాలమునుగూర్చి ఇంకను గొంత విచారణ కవకాశము కలదు.

అన్నయ తాను రచించిన సుదతీపరిణయ మనుకావ్యమును ఆనవీటికోనేటితిమ్మరాజుకొడుకగు రామరాజునకు మంత్రియైన పులిజాలరామవిభుసోమామాత్యున కంకితమిచ్చెను. కృత్యాద్యవతారికయందు వర్ణింపఁబడిన యారవీటివంశావళి ననుసరించి కందుకూరి విశేషలింగంపంతులుగారు రిట్లు వ్రాసియున్నారు:

"ఆర్వీటిబుక్కరాజుకొడుకు రామరా జయినట్టును, రామరాజుకొడుకు తిమ్మరా జయినట్టును, తిమ్మరాజుకొడుకు చినకొండరా జయినట్టును, చినకొండరాజుకొడుకు కోనేటి తిమ్మరా జయినట్టును చెప్పఁబడెను. ఈకోనేటి తిమ్మరాజుకొడుకైన రామరాజువద్దనే కృతిపతియైన సోమనామాత్యుఁడు మంత్రిగా నుండెను. వైని జెప్పిన వంశావళినిబట్టి విచారించఁగాఁ గృష్ణదేవరాయల యల్లుఁడైన రామరాజున కీరామరాజు పెదతండ్రికొడుకునకు మనుమఁడైనట్లుస్పష్టమగుచున్నది. అళియరామరాజు 1564-వ సంవత్సరమువఱకు జీవించి యాకాలమునకే మనుమలనెత్తినవాఁడగుటచేత నాతని పెదతండ్రికొడుకునునప్పటికే యెదిగిన మనుమలు గలవాఁడయి యుండవచ్చును. కాఁబట్టి విమర్శించిచూడఁగా సుదతీపరిణయకృతీశ్వరుని ప్రభువగు పదిసంవత్సరముల కీవలావలగా

1581-వ సంవత్సరప్రాంతమున నుండెనని తేలుచున్నది. ఇదియే కవికాలము.1

పంతులుగారు కవులచరిత్రము వ్రాయునప్పుడు వలయు సాధనములు లభ్యపడకుండుటచే నీ డొంకతిరుగుపద్ధతి నవలంబించిరి. ఇప్పుడు ఆరవీటిరాజులశాసనము లనేకములు బయలబడినవి. వాని మూలమున సుదక్షిణాపరిణయకృతిపతియొక్క కాలమును, తన్మూలమున కవియొక్క కాలమును కనుగొనుట కవకాశము కలిగినది. కృతిపతినేలిన ప్రభువుయొక్క తండ్రియగు గోసేటితిమ్మరాజు క్రీస్తుశకము 16-వ శతాబ్దమధ్యకాలమున నుండెనని శాసనములవల్ల తెలియవచ్చుచున్నది. శా. శ. 1488 క్రోధిసంవత్సరమునాటి శాసనమొకటి హంపివిరూపాక్షాలయమునఁ గానవచ్చుచున్నది 2 మఱియొకటి శా.శ. 1471-వ సంవత్సరమునకు సరియైననలసంవత్సరము నాఁటిది నెల్లూరుజిల్లా యందలి యాత్మకూరునందుఁ గాన్పించుచున్నది.3 వీనిమూలమునఁ గోసేటి తిమ్మరాజు సదాశివరాయల రాజ్యారంభకాలమున నుండెనని నిశ్చయమగుచున్నది. అతని కుమారుఁడు రామరాజుగూడ క్రీ. శ. 1550 ప్రాంతమున నుండియుండు నను నూహ పొడముచున్నది.

ఈ సందర్భమునఁ జింతింపఁదగినయంశ మింకొక్కటి కలదు. అన్నయ్య తన విద్యాగురువు కందాళభావనాచార్యుల కుమారుఁడగు శ్రీరంగాచార్యులవారని చెప్పుకొనియున్నాఁడు. ఈ శ్రీరంగాచార్యులవారే నారసింహపురాణకృతిపతియగు ప్రోళ్లుగంటి రంగనకు నైతము గురువు. ఈ విషయము నారసింహపురాణకృత్యాది యందలి యీక్రిందిపద్యమువలన విశదమగుచున్నది:

---

1. ఆంధ్రకవులచరిత్ర, పుట 322.
2. ARE. No. 12 of 1904.
1 Nellore Inscriptions. I. A. 16.

సీ. "గురుతరవాధూలగోతాగ్న్యాయాంభోధి
పూర్ణిమాచంద్రుఁడై పొడుపుపుమిఱె
జైనచార్వాకాది సకలదుర్మదఘోర
గహనధూమాంకుఁడై కణఁకమించె
శిష్యకదంబక చిరతరసంపత్తి
వితరణఖ్యాతియై వృద్ధిఁబొందె
శ్రీవేంకటాచలశిఖరమందిర దేవ
తా పరమూర్తియై యవతరించె
జగతిఁ గంచాళ భావనాచార్యవర్య
తనయుఁ డయ్యె గురుస్వామి ఘనత కెక్కె
నట్టి శ్రీరంగగురునాథుఁ డాత్మగురుఁడు
గాఁగ సన్నుతిఁ బడసె రంగప్రభుండు."1

ఈప్రోలుగంటి రంగన క్రీ. శ. 1540-1550 ల ప్రాంతము వాఁడగుటచేత2 అతనిగురువైన రంగాచార్యులవారును నప్పటి వాఁడై యుండవలయును. ఈయూహసరియైనదని తిరుమలదేవ స్థానమునందలి శా. శ. 1467 విశ్వావసునామ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. 1545-వ సం॥ నాటి శిలాశాసనము తెల్పుచున్నది. ఇందు కంచాడై అప్పావణ్ణనుయొక్కయు, వారి కుమారుఁడగు అప్పన్ యొక్కయు జన్మనక్షత్రములయందు శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి నైవేద్యము నొసఁగుటకుఁగాను వీరి జ్ఞాతులైన కంచాడై భావనాచార్యులపుత్రులగు శ్రీరంగాచార్యులవా రొసర్చిన యేర్పాటులు ప్రకటింపఁబడియున్నవి. ఈశాసనమువల్ల తెనాలి యస్మయకు గురువైన కంచాళ శ్రీ రంగాచార్యులవాసు క్రీ. శ. 1545 ప్రాంతములనుండెనని స్థిరమగుచున్నది. అన్నయ్యంయు నప్పటివాఁడని నిశ్చయముగఁ బల్కవచ్చును. అన్నయయె 1545-వసం॥ ప్రాంతము వాఁడైన నాతని పెద్దన్నయగు రామకృష్ణుడప్పటికి ప్రఖ్యాతకవియై

1. నార. 1-59.
2. భారతి సం. 18, పుటలు 17-24.

తన పాండురంగ మాహాత్మ్యమును క్రీ. శ. 1543-వ సం॥ ప్రాంతమున నుండిన మంగయగురువరాజు తొమ్మండుగురు పుత్రులలో జ్యేష్ఠుడగు పెదసంగభూపాలుని ప్రాయసకాడైన విరూరివేదాద్రి కంకితమొసగె ననుట యసంగతము గాజాలదు.

రాఘవమనీషి

రెండవవాడు రాఘవమనీషి. ఇతడు హరిభట్టకుమారుడు. తండ్రిచే విరచితమైన నారసింహపురాణమును అతని మరణానంతరము నందెల నరసింహరాజుపుత్రుడగు హోవళిచినయాబళరాజు యొక్క మంత్రియైన రంగమంత్రి కంకితమొసగెను. పోలుగంటి రంగన క్రీ. శ. 1540, 1550 సం॥ల మధ్యకాలమున పై హోవళి యాబళరాజుకడ మంత్రిగ నుండెనని స్థలాంతరమున నిశ్చయించి యున్నాను.1 రాఘవమనీషి రచించిన నారసింహపురాణ కృత్యాద్యవతారికయందు రంగమంత్రి కీర్తిని వర్ణించు నీక్రింపపద్యము గానపచ్చుచున్నది:

"ఉ. రంగనివాసనిర్మలధ
రం గని పంకజనాభపుత్రుదా
రం గని యభ్రివాహినితె
రం గని సాందభ్రిలసత్సుధాసుధా
రం గని సత్ప్రభాసురుచి
రం బగు శ్వేతవరాహమూర్తికో
రం గని పోలుగంటిపురి
రంగనికీర్తి భాసించు నిమ్మహిన్."

దీని గాంచినవెంటనే తెనాలిరామలింగని దని ప్రఖ్యాతివడసిన యీక్రిందిచాటు పెల్లరకును స్మరణకు రాగలదు.

"ఉ. లింగనిషిద్ధుఁ గల్వలచె
లిం గని మేచకకంధరుం దిశూ

---

1. భారతి సం. 18. సం. 2. పుట 24.

లిం గని సంగతాళి లవ
లిం గని కర్దమదూషిత న్మృణా
లిం గని కృష్ణచేలుని హ
లిం గని నీలకచన్ విధాతృనా
లిం గని రామలింగకవి
లింగనికీ ర్తి హసించు దిక్కులన్."

ఈపద్యములయం దొకదానిని మేలుబంతిగాఁగొని మఱియొక దానిని రచించిన ట్లున్నది. ఇందుమేలుబంతి యెద్ది, యనుకరణ మెద్ది యను విషయము విచారణీయము. రాఘవమునీషి నారసింహపురాణ పీఠికఁదప్ప యన్యగ్రంథములను రచించిన ట్లగపడదు. ఇతఁడు గ్రంథ కర్త యన్న ప్రతీతియు లేదు. కావున రామకృష్ణుని చాటువును చూచి యటువంటి పద్యమునే రచించి స్వవిరచిత నారసింహపురాణ పీఠికయందు గూర్చుకొనె ననుసూహ పొడముచున్నది. మఱియు నారసింహపురాణమునకును, పాండురంగమాహాత్మ్యమునకును కొన్ని యెడల పోలిక లగపడుచున్నవి. పాండురంగమాహాత్మ్యము చతుర్థాశ్వాసమున వర్షారంభమును వర్ణించు నొక సీసపద్యము గలదుఃసీ. "ధళుధళుక్కున నింగిఁ దాటించెఁ బలుమారు
నీరాళ్ల గొంది కన్నియమెఱుంగు
పొల స్యపవనసంపాతజాతపీ్తి
నివిరిన్రమ్రాఁకుల కెలమి వచ్చెఁ
బ్రీథమోదబిందుసంభారంబు మందునూ
నియ యయ్యెఁ బగిలిన నేలమేని
కుఱుము మంతురసానియును బోలెఁ గనుపించెఁ
దోరంపుమణుల విదూరభూమి"1

ఈ పద్యమును వర్షోదయమునే తెల్పు నీకీ్ంది నారసింహ పురాణపద్యములతోఁ బోల్చి చూడుఁడుఃఁ

---

1. పాండు. 4-21.

సీ. "పొగ్గుపై చిన పద్మరాగఖండంబులి
గతి నింద్రగోపసంఘములు దనరె
గరుడపచ్చలడాలు గన్నుగీటుగజాలు
జేతపచ్చిక పిసాళించి మించె
నీశానుదిగ్వ్యాయుకోశంబు లొకకొన్ని
భంజళిగతుల విభ్రమము చూపె
పృథమోదబిందుసంపర్కంబు పుడమిపై
బొక్కలాపగ దైబపూరమయ్యె
ధళుధళుక్కున నింగి దాటించె బలుమూఁక
లలితవిద్యున్నటీలాస్యకేళి
ఘుమఘుమ నుటీమె దిక్కులు పిక్కటిల్లంగ
భూధరస్థలుల నంభోధరములు
జలజల తలలెత్తి చాలేరుపడియె వి
దూరభూస్థలుల వైదూర్యశిలలు
నకనకలిచ్చు మానసభేదదశ డించి
పురివిచ్చి యాడె నంయ్యురగభోజి."[1]

ఇందు "ధళుధళుక్కున", "పృథమోదబిందు", "పాలస్త్య పవన", "ఈశానదిగ్వ్యాయు" అనుపాదములను తిలకింపుడు. ఈవర్షారంభవర్ణన లొండొంటికి గల సన్నిహితబాంధవ్యము తెల్లముగాగలదు. రామకృష్ణుని గ్రంథమును జూచి హరిభట్టో, లేక హరిభట్టుగాంచి రామకృష్ణుడో గ్రాసియుండె నని స్పష్టమగును. వీరిరువురును సమకాలమువారు. ఎవరెవ్వరి ననుకరించిరో కనుగొనుట సాధ్యము కాకున్నను, పాండురంగమాహాత్మ్యములోని పద్యము నారసింహపురాణమునందు రెండగుటఁ జూడఁగా ననుకరించినవాఁడు హరిభట్టేమో యనుసంశయమున కవకాశము కల్గుచున్నది. ఇందలి సత్యాసత్యము లెట్లున్నను క్రీ. శ. 1543-1550 సంల మధ్య రాఘవమనీషి నిజజనకృత నారసింహపురాణమునకుఁ

---

1. ఉత్త. నార. 4:3

గృహ్యాదికము రచియించి పోలిగంటి రంగమాంబ కంకితమొసఁగు నాఁటికిఁ దెనాలిరామకృష్ణుఁడు ప్రఖ్యాతకవియై బాలకవుల కాదర్శ పాత్రుఁడై యుండె ననుట నిశ్చయము.

రామరాజభూషణుఁడు

పాండురంగమాహాత్మ్యరచనా కాలనిర్ణయ సందర్భమునఁ బేర్కొనవలసినవాఁడు మఱియొక కవికలఁడు. అతఁడు రామరాజ భూషణుఁడు. ఇది యతని బిరుదు. వాస్తవమైన పేరెద్దియో యాతఁడు తెల్పకున్నను, కడు ప్రాచీన కాలమునుండియు పరంపరగవచ్చు గాథవల్ల నతని పేరు మూర్తి యని తెలియుచున్నది.1

---

1. తెనాలి రామకృష్ణుఁ డొకచాటువునం దీతనిని మూర్తియని పేర్కొనియున్నాఁడు- "అతిశ్లేషశబ్ద వాగాడంబరం బొప్పఁ బస ఘటించెను మూర్తి వసుచరిత్ర"; "కవికిఁ దరువాత నల్పకాలములోనే వసుచరిత్ర మునకు వ్యాఖ్యానము చేసినవారు కొందఱు బట్టుమూర్తి కాను రచియించిన నానారసభాసురమగు పరిబంధమునందలి వివిధాలంకారములుగ నుందునట్లు నరసభూపాలీయ మను నలంకారగ్రంథమును రచియించె నని వ్రాసియున్నా" రని విశేషలింగం పంతులుగారు చెప్పియున్నారు (ఆంధ్ర కవుల చరిత్రము. పుటలు 56-57). కాని వ్యాఖ్యాతలు చెప్పినట్లు నరస భూపాలీయ కర్తయే వసుచరిత్రను రచియించె నని యంగీకరించుటకు వీలు కాదు. వసుచరిత్రను రచించిన మూర్తి వేఱు, నరసభూపాలీయ కర్త వేఱు. ఆకాలమున "మూర్తి" సర్వసామాన్యమైన నామధేయమగ వాడఁబడుచుండెను ఒక కుటుంబముననే యేకకాలమున నిద్దరు "మూర్తు" లుండి రనుట కుదాహరణములు లేకపోలేదు. కావున వసు చరిత్రకారుని వాస్తవ నామధేయము "మూర్తి" యనుటయం దేవైపరీత్య మును లేదు. ఇట్లు పరిబంధాంకమువారింట సమకాలికు లగు మూర్తు లిరువురు గ్రంథక రలుండుటచేతనే తరువాతి కాలమువారు పురుషద్వయి భేదము నెఱుఁగక యొక్కమూర్తియే వసుచరిత్ర, నరసభూపాలీయ ములను రచించెనని వ్రాసియుండురు.

దీనిని విశ్వసించకపోవుటకుఁ దగు కారణము కానరాదు. "అతిశ్లేష శబ్ద వాగాడంబర" మని వసుచరిత్రను పరామర్శించినను రామకృష్ణున కా కావ్యమం దాదరము లేకపోలేదు. పాండురంగమాహాత్మ్యమున,

"క. గిరికానుష క్తబుద్ధి ను
పరిచరునింబోలె నొక్క పన్నగ మొకనాఁ
డురవడి నెచ్చటినుండియొ
మురమర్దను దివ్యభవనమున కేతెంచెన్."1

అనుపద్యమున రామకృష్ణుఁడు వసుచరిత్రను బేరొక్కనుటయే యిందుకుఁ దార్కాణ. ఇందువల్ల రామరాజభూషణుని కవిత్వముపై రామకృష్ణునకుఁ గల యభిమానము తెలియుట యటుండ, వసుచరిత్ర పాండురంగమాహాత్మ్యమునకుఁ బూర్వము రచియింపఁ బడెనని విశద మగుచున్నది.

వసుచరిత్ర రచనాకాలము క్రీ. శ. 1570-వ సంవత్సర మని ఇంతకుపూర్వ మొకచోట వ్రాసియున్నాను.2 దీని కృతిపతియగు రామరాజు-శ్రీరంగరాజు-తిరుమలరాజు. క్రీ.శ. 1565-వ సంవత్స రమున రక్కసి తంగడి యుద్ధముస నీతని జ్యేష్ఠ భ్రాతయగు అళియ రామరాజు గతించిన పిమ్మట ఇతఁడు సదాశివరాయలకడ కార్య దక్షుఁడై నిలిచి జీర్ణమైన కర్ణాటక రాజ్యపునరుద్ధారణము గావించి స్వయము రాజ్యాభిషేకము గావించుకొని 1570-వ సంవత్సరమున గద్దెయెక్కెను. వసుచరిత్ర పీఠికయందు కర్ణాటక రాజ్యపునరుద్ధా రణమును, తిరుమలరాజ రాజ్యాభిషేకమును వర్ణింపఁబడియుండుట చేతను, మఱియు నతఁడు రాజ్యపాలన 11 మాసములే చేసియుండుట చేతను, 1570-వ సంవత్సరమునసే వసుచరిత్ర రచియింపఁబడె నని తలఁచి యట్లు వ్రాసితిని. కాని 1570-వ సంవత్సరము వసుచరిత్ర

---

1. పాండు. 4-242.
2. భారతి సం. 7, పుటలు 828-831.

రచనాకాలమనుటకంటె తత్కృతిసమర్పణకాలమని చెప్పుటయే యుచితముగఁ దోఁచుచున్నది. అట్టి నవరసభాసురంబగు శ్లేషకావ్యమును అల్పకాలమున రచించుటకు సాధ్యముగాదు. ప్రతిపద్యమును దిద్ది తీర్చి చిరకాలము శ్రమపడి రచించినది గాని యాశువుగాఁ జెప్పినదికాదు. పదమల కూర్పును, పద్య పద్యమునను దేహమును నీడవలె ననుసరించు శ్లేషయుఁ, ద్రవ్వితండములుగ వెల్లివిరియు నలంకారములును జూడ వసుచరిత్రి పెక్కేండ్లు యోచించి యోచించి, వ్రాసిన పద్యములను చికిలిలుచేసి మెఱయునట్లుగాఁ దిరుగ వ్రాయుచుఁ గ్రమక్రమముగా రచించిన కావ్యముగనే కన్పట్టుచున్నది. అట్లనుట రామరాజభూషణుని శిల్పమునకు న్యూనతనారోపించుట కాదు. గొప్ప శిల్పులందఱకును నిది యనుభవైకవేద్యమే.

పైయభిప్రాయము కేవల మూహాకల్పితముకాదు. వసుచరిత్రి తిరుమలరాయల కంకిత మిచ్చుటకుఁ బూర్వమే ప్రకటిత మైయుండె ననుటకుఁ గొంత యాధారము కలదు. పరిశ్చంద్రి నలోపాఖ్యానమున రామరాజభూషణుఁడు తన్నిట్లు ప్రశంసించుకొని యున్నాఁడు:

"సీ. వనధిలంఘనకృపావార్ధితోదయకవి
తా కళారత్న రత్నాకరుండ
సకల కర్ణాటరక్షాధురంధరరామ
విభుదత్త శుభచిహ్నవిభవయుతుఁడ
వసుచరితాది కావ్యప్రీతబహునృప
ప్రాపితానేకరత్నపవుండ
శాశ్వతశ్రీవెంకటేశ్వరానుగ్రీవా
నిరుపాధికైశ్వర్యనిత్యయశుఁడ."

ఈ పద్యము రచించినప్పటికి రామరాజు సజీవుఁడై యుండెనని తోఁచుచున్నది. సకల కర్ణాటక రక్షాధురంధరుఁడను బిరుదు

రామరాజునకు రక్షసితంగడిసంగరమునకుఁ బూర్వమే చెల్లును. తుర
కలచే రామరా జాయుద్ధమున నిహతుఁడగుటయే కాక కర్ణాటకక్షితి
యవనజలనిధియందు మునిఁగెను. వరాహమూర్తి పుడమినిబోలి తిరు
మలరాయఁడు దాని నుద్ధరించెను. అయినను పైపద్యముయొక్క
మూఁడవపాదమున వసుచరిత్రమును బేరొక్కనియుఁ దత్కృతినాథుఁ
డగు తిరుమలరాయనిఁ జెప్పకుండుటను జూడఁగా నప్పటికి రామరా
జింకను సజీవుఁడై కర్ణాటకమును సంరక్షించుచుండెననియు, వసు
చరిత్ర నింకఁ దిరుమలరాయల కిచ్చియుండలే దనియు స్పష్టమగు
చున్నది. వసుచరిత్ర కృతిసమర్పణ మప్పటికి జరిగియే యుండిన,
రామరాజువలె సకల కర్ణాటసామ్రాజ్యరక్షకుఁడేకాక, చావనున్న
యాసామ్రాజ్యమును పునరుజ్జీవితమును గావించి పట్టబద్ధుఁడును,
చరిత్రవర్తియు నగు కృతిపతినిఁ బేరొక్కనకపోవుట యసంభవము.
కావున వసుచరిత్ర సంపూర్ణముగ రచింపఁబడినను నెవ్వరికిని నంకిత
మియ్యక రామరాజభూషణుఁ డట్లే యుంచె నని తెలియ వచ్చు
చున్నది. తత్కారణమునఁనే క్రీ.శ. 1536-40 సంల ప్రాంతమున
రచించిన పాండురంగమాహాత్మ్యమున గిటికా ఉపరిచరవసువుల
వృత్తాంతమును రామకృష్ణుఁడు ప్రస్తావించఁగల్గెను.

5

తెనాలిరామకృష్ణుని కథలును, జాటువులును బెక్కు నేఁటికిని
ప్రచారమున నున్నవి. ఇవి సత్యములని కొందఱును, కల్పనలని
యాధునికవాఙ్మయచరిత్రకారులును నభిప్రాయపడుచున్నారు. ఈ
కథలనుగూర్చి శ్రీవేటూరిప్రభాకరశాస్త్రి గారిట్లు వ్రాసియున్నారు:

"తెనాలిరామలింగని కథలని దక్షిణహిందూదేశ మెల్లఁ
బ్రఖ్యాతి కెక్కి పెక్కుకథలున్నవి. వానిఁగూర్చి మన మేమియు
చెప్పఁజాలము. అతఁడు హాస్యచతురుఁడై యుండవచ్చును. నిజ
ముగా కొన్ని కథ లాతనికి సంబంధించినవే కావచ్చును. లోకులు

మటియు ననేకాద్భుతకథ లాతనితలకుఁ దగిలించియుండురు. పెక్కు కథలు శ్రీకృష్ణరాయలగోష్ఠిలో జరిగినవిగా వినవచ్చును."1

ఈ యభిప్రాయము కడుసమంజసము. ఈకథలన్నియు కేవల కల్పనలు కావనియు, అన్నియుఁగాకపోయిననుఁ కొన్నియైనను చరిత్రాంశములపై నాధారపడియున్నవనియుఁ జెప్పి తార్కాణగ గుట్టపుపిల్ల, నల్లకుక్క, ధూర్జటికథలను గొని యవి చరిత్రాత్మకము లని నేను నిరూపించియున్నాను.2 ఇచ్చట మఱి రెండు కథలను పరామర్శించుచున్నాను. ఇవి రామకృష్ణుఁ డిద్దఱువ్యక్తులను బరిహసించినట్లు తెలియఁజేయుచున్నవి. వాస్తవముగ నీకవులు రామకృష్ణునకు సమకాలికు లగుదురో, లేక పరువాతికాలమువారు రామకృష్ణునకు వారితో లంకెవై చిరో కనుగొనవలసియున్నది.

1. పాతివ్రత్య దర్పనీ తిరస్కారము:—ఈ పేరిటి గ్రంథమును రచించి యొకకవి కృష్ణరాయలసభకుఁ దెచ్చి యందలి "పతికి మాఱాడక పలుమఱునేడ్వక యలయక మిగుల గయ్యాళిగాక" యను పద్యమును చదువఁగా రామకృష్ణు డు దానికి విపరీతార్థమును గల్పించి యాతనిఁ బరిహసించెనఁట. "పాతివత్యదర్పనీ" యను పేరిటి గ్రంథ ముండెనో లేదో కాని పై పద్యము తాళ్లపాక తిరుమలాచార్య విరచిత నీతిశతకమునందుఁ గాన్పించుచున్నది.

"సీ. పతికి మాఱాడక పలుమాఱు నేడ్వక
యలుగక మిగుల గయ్యాళిగాక
తనుఁ దిట్టికొనక కాంతాళించి గొణగక
ముచ్చిలింపక పాపమునకుఁ జొరక
పారుగింటి కేఁగక పరు నాత్మఁ దలఁపక
కుపిత గాక పరానుకూల గాక

---

1. భారతి సం. 2, పుట 88.
2. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక (1931)

ఎదువదాపక మర్మ మవ్వలఁ జెప్పక
బొంకక నిద్దురపోతుగాక
కాపురముసేయు కామిని గలిగెనేనిఁ
బలుకు లేటికి పురుషుని భాగ్యమహిమ
కలిత లక్ష్మీశ సర్వజగన్ని వేశ
విమలరవికోటిసంకాశ వెంకటేశ."

తాళ్లపాకవానినిగూర్చి రామకృష్ణుఁడు చెప్పిన చాటువొకటి కలదు.

"క. చిన్నన్న ద్విపద కెరఁగును
బన్నుగ బెదతిరుమలయ్య పదమునకెరఁగున్
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబు పద్యగద్యశ్రేణిన్."

నరసింగన్నయు, పెదతిరుమలయ్యయు సోదరులు. తాళ్లపాక అన్నమయ్యంగారి పుత్రులు. చిన్నన్న పెదతిరుమలయ్యకుమారుఁడు. వీరందఱును కవులు. తాళ్లపాక యన్నమయ్యంగారు క్రీ. శ. 1503-వ సంఱున మృతినందెను. చిన్నయ్యయనఁబడు తాళ్లపాక తిరువెంగళనాథకవి యచ్యుతరాయలవల్లను, సదాశివరాయలవల్లను, పెక్కుగ్రహారములను బడసినట్లు శాసనములు తెల్పుచున్నవి. కావున నరసింగన్నయుఁ బెదతిరుమలయ్యయుఁ గృష్ణరాయల కాలమువారనియు, వీరందఱును రామకృష్ణుని సమకాలికు లనియు నిశ్చయమగుచున్నది. రామకృష్ణుని విపరీతవ్యాఖ్యకు గురియైనదని చెప్పఁబడు "పతికిమూఁఢాడక" యను పద్యము పెదతిరుమలయ్య నీతిశతకమునఁ గానవచ్చుచుండుటచేత ఈకథ సత్యమైనచో, రామకృష్ణునిచేఁ బరిహసింపఁబడినవాఁ డాపెదతిరుమలయ్యయే కావలయును. హాస్యప్రియుఁడగు రామకృష్ణుఁడు పైకథయందుఁ జెప్పినరీతిని పరిహసించినను బరిహసించియుండవచ్చును. ఇందసంగత మేమియుఁ గానరాదు.

2. బైచరాజు వెంకట నాథుఁడు:—ఇతఁడొక డొడ్డకవి క్షత్రియుఁడు. ఆంధ్రవాఙ్మయమున రసవత్తమ కావ్యములయం దొకటి యగు పంచతంత్రమును రచియించెను. ఇతనిఁ గూర్చి యీ కథను చెప్పుదురు. పంచతంత్రము సంపూర్తియైనవెంటనే రాయలచే ననుజ్ఞాతుఁడై సభయందు గ్రంథపఠనాతూర్వ్యము దానియం దెవ్వ రేని తప్పుఁ జూపినఁ దన నాలుకఁ గోసికొనెద ననియు, లేనితప్పు లున్న శ్లేష్యవైనఁ జెప్పిన పౌరి నాలుకఁ గోతు ననియుఁ బ్రతిజ్ఞఁ జేసెనట. రామకృష్ణుఁ డది విని "ఈ రాచకవిత్వ బాధ పడరాదు కదా యెట్టువంటివానికిన్" అని సభనుండి లేచిపోఁగాఁ దక్కిన పండితులును వెంటనే పోయిరట. రాయలంతట సభ చాలించెనట. ఈకథయందెంత సత్యమున్నదో తెలియదు. కాని పంచతంత్ర పీఠికం జదివిన వెంకటనాథునికిఁ దన కాలపు కవిపండితులయెడఁ గొంత యసంతృప్తి యుండినట్లు తోఁచును.

సీ. "ఒకఁ డలంకారంబునకు వేడుక వహించు
నొకఁడు వార్తాసమృద్ధికిఁ జెలంగు
నొకఁడు శబ్దస్ఫూర్తులకు మాయురే యను
నొకఁ డర్థసృష్టికి నుత్సహించు
నొకఁడు రసాభోగతకు మస్తముఁ గదల్చు
నొక డుపమానచర్చకకు నలరు
నొకఁడు రసపోషిమకు నిచ్ఛలో మెచ్చు
నొకఁడు జాతిశ్లాఘ కుబ్బుచుండుఁ

తే. గామిచందానఁ దలవడికరణి బధిరు
వలె దరిద్రునిగతి వాదిపగిదిఁ గనక
కారుచాడ్పునఁ బంగువై ఖరిఁ గుజాతి
జాడ నిందటి ముదలింపఁ జాలుఁ జెల్లు.

క. ఒప్పులఁగల కృతిలో నొక
తప్పున్నను గడమ గాదు చానికిఁ గళలం
జొప్పడు శశికిఁ గళంకము

కప్పేర్పడి యేమినింద గావించెనొకో."
మటీయు, రాజుల నిట్లు దూటీనాఁడు:

ఆ. "అతికుటుంబరక్షణాపేక్ష బాల్మాలి
కృతులు మూఢభూమిపతుల కిచ్చి
చచ్చి నిరయమునకుఁ జనుకంటె హరిహా
ర్పణముఁ జేసి సుగతిఁ బడయరాదె.1

కడపటి పద్యము అల్లసానిపెద్దన్నగారి "భరమై తోఁచు కుటుంబరక్షణకు గాఁ బాల్మాలి" యను కుకవినిందకు జవాబనియు, "అతికుటుంబరక్షణాపేక్ష బాల్మాలి" యని కొంచెమించుమించుగా పెద్దనగారి మాటలనే యిందు వాడుట దీనిఁ దెల్పుచున్నదనియు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవా రెచ్చటనో వ్రాసినట్లు స్మరణయం దున్నది. ఇదిదొ సత్యమేని వెంకటనాథునకు రాయలసభలోఁ దగు మన్నన కలుగలేదనియుఁ, దత్కారణమ ననే కాఁబోలు "అతికుటుంబరక్షణాపేక్ష" యన్న పద్యమున మూఢనరపతులఁ దూలనాడెననియుఁ దలఁచవలసియున్నది.

కాని, వెంకటనాథుఁడు కృష్ణరాయల కాలమున నుండినఁ గదా నివి యన్నియును సమకూడును. కవిచరిత్రకారులకు వేంకటనాథునికాలమును నిర్ణయించుటకుఁ దగిన యాధారము లేవియు దొరకకపోవుటచే తాత్కాలికముగ బ్రౌన్‌దొరగారి సిద్ధాంతమునంగీకరించి యతఁడు క్రీ. శ. 1500 ప్రాంతములనుండెనని వ్రాసియున్నారు. మటీయును శ్రీనాథుని కవిస్తుతియందు పేర్కొనుటచే నాతఁడు క్రీ. శ. 1450 సం॥కు పూర్వుఁడు కాఁడనియు, జ్యేష్ఠపితృవ్యుఁడగు "లింగభూపాలుండు యవనసైంధవకాననానలుం" డనుటచే నాతఁడు "మహమ్మదీయులకును, హిందువులకును దక్షిణ హిందూస్థానములో యుద్ధములు జరుగుచున్న కాలమున

---

1. పంచ. 1-14. 15, 27.

నుండియుండవలె" ననియు వ్రాసియున్నారు.1 దీనిఁబట్టి చూడ వెంకటనాథుఁడు క్రీ. శ. 1450-1500 ల మధ్యకాలమున నుండెనని వీరి యభిప్రాయ మని తోఁచుచున్నది. వీరు పలుమా రుదాహరించుచు వచ్చిన స్థానిక చరిత్రలఁ జక్కగాఁ బరిశోధించి చూచి యుండిన వెంకటనాథుని కాలము వీరి కెటుకపడి యుండెడిది.

స్వవిరచిత పంచతంత్ర పీఠికయందు వెంకటనాథుఁడు తన వంశము నిట్లు వర్ణించియున్నాఁడు: చంద్రవంశమున సాళ్వభైచరాజుద్భవించెను అతని కుమారుఁడు తిరుమలరాజు; ఇతనికిఁ దిప్పాంబిక యందు వీరభద్రుఁ డను పుత్రుఁడు కలిగెను. అతఁడు తుంకుట్ల శ్రీపతిరాజుసుమా త్తై యగు లింగమక్కను బెండ్లియాడెను. వీరికిఁ గుమారలింగరాజు, పర్వతరాజు నను నిర్వురు కుమారులు పుట్టిరి. పర్వతరాజు పోలెపల్లి తిమ్మరాజు కూఁతురగు అన్న మాంబికను వరించెను. ఈ దంపతులకు వెంకటనాథుఁడు, రంగరాజు, శేషాద్రి రాజు లను పుత్రులు మువ్వురు పుట్టిరి. వెంకటనాథుఁ "డసహాయ సరసకవితారసికుఁడు." ఇతఁడే పంచతంత్రకర్త.

వెంకటనాథుని ముత్తాతయగు భైచరాజు తిరుమలరాజు క్రీ. శ. 15-వ శతాబ్దాంతమున నుండెను. ఇతఁడు శా. శ. 1413 విరోధికృతు నామసంవత్సర మిథునమాస బహుళ 7 సోమవారము నాఁడు ఉత్తరాభాద్రనక్షత్రమున తిరువెంగళనాథుని దేవాలయము నకుఁ జేసిన దాన మొకటి తిరుమల దేవస్థానము రెండవ ప్రాకారము దక్షిణపు గోడమీఁద జెక్కబడియున్నది 2 మఱియు నీ తిరుమల రాజుదే శా. శ. 1414 పరీధావినామసంవత్సర ధనుర్మాస శు॥ 2ఱు శుక్రవారము శ్రవణనక్షత్రమునఁ జేసిన దానమును దెల్పు శాసన మింకొకటి దిగువ తిరుపతి గోవిందరాజస్వామియాలయమున

---

1. ఆంధ్రకవుల చరిత్ర, పుట 334.

2. తిరుపతి దేవస్థానశాసనములు సం. 2, నెం 94, పుటలు 189-193.

ప్రథమ ప్రాకారము తూర్పుగోడ లోపలిప్రక్క జెక్కబడి యున్నది.1 మటియు వెంకటనాథుని మాతామహుడైన పోలెపల్లి తిమ్మరాజు అచ్యుత దేవరాయల రాజ్యకాలమునందు శ్రీశైల పార్శ్వంత మండలమున కందుకూరు సీమకు జెలుచుండిన చింత కొమ్మదిన్నె, ఆయలూరను రెండు గ్రామములను రాయలవారిచే నాయంకరముగ బడసి యేలుచుండెను. ఇతనివి శా. శ. 1455, 1467 సంవత్సరములనాటివి రెండుశాసనము లీగ్రామములయం దున్నవి. 2 పై శాసనము లీ తిమ్మరాజు పోలెపల్లి బుక్కరాజు కుమారుడని తెల్పుచున్నవి. సదరు బుక్కరాజు క్రీ. శ. 15-వ శతాబ్దాంతమున కడపజిల్లా జమ్మలమడుగు ప్రాంతమున రాజ్యము సేయుచుండెనని, శా. శ. 1404 శుభకృతునామసంవత్సర శార్వణ బ|| 5 ఆదివారమునాడు అతని పాలనకు లోబడిన చినకొమ్మెర్ల గ్రామమైతు లాతనికి పుణ్యము కలుగుటకై ప్రత్వించిన బావియొద్ది శాసనమువలన దెలియుచున్నది.3 ఇందుపల్లి పోలెపల్లి బుక్కరాజు క్రీ.శ.1482-వ సం॥ మునను, నతని కుమారుడు తిమ్మరాజు క్రీ.శ. 1513-35 సంవత్సరములయందును దొరతనమును సల్పుచుండిరని విశదమగుచున్నది. ఇట్లు పితాపుత్రుల రాజ్యకాలమునకు 51 సంవత్సరముల యెడ మగపడుచుండుటచేత క్రీ. శ. 1535-వ సంవత్సరమునాటికి పోలెపల్లి తిమ్మరాజు గతవయస్కుడై యుండెనని తోచుచున్నది. ఒకవేళ అతని మనుమడైన వెంకటనాథుడప్పటికే పెద్దవాడై కవియై యుండిన నుండవచ్చును; కాని కృష్ణ రాయని సభయం దాతడు స్వవిరచిత పంచతంత్రము జదువ నుద్యమించె నని చిరకాలమునుండి పరంపరాగతముగవచ్చుగాథ తెల్పుచున్నను, దీనినమ్మటకు దగిన సాధ్యము కానరాదు. కథయందు

---

1. పై సం. నెం. 100, పుటలు 206-209.
2. స్థానికచరిత్రలు, సం. 1, పుటలు 444-446.
3. మదాసు యెపిగ్రఫీ రిపోర్టు 1932-33, No. 356 of 1932-33.

వచించినట్లు పంచతంత్రమును రాయలసభయందుఁ జదువుట నిక్క మేని, అది అచ్యుతరాయల కాలమునఁనో, స దా శి వ రా య ల రాజ్యారంభదశయందో నడచియుండును. అచ్యుతరాయలును, సదాశివరాయల సర్వకార్యదక్షుఁడై న యళియరామరాజునుఁ గృష్ణ రాయనివలె కవితాకేళీలోలురే కావునను, రామకృష్ణుఁ డారాయల సభనలంకరించిన కవిరత్నములయం దొక్కఁడగుట చేత ను పైగాథయం దుక్తమైన కవితాగోష్ఠి యారాయలసభయందు నడచియుండినను నుండును. దీనియందలి సత్యాసత్యము లెట్లు న్నను రామకృష్ణుఁడును, వెంకటనాథుఁడును సమకాలమువా రని నిశ్చయించి చెప్పనచ్చును.

బైచరాజు వేంకటనాథుఁడు

బైచరాజు వేంకటనాథుఁడు.

గత జ్యేష్ఠమాస భారతియందు[1] మిత్రులు డాక్టరు చిలుకూరు నారాయణరావు పంతులుగారు "పంచతంత్రము, వేంకట నాథ నారాయణకవుల అనువాదాలు" అను శీర్షికక్రింద నొక విమర్శాత్మక వ్యాసమును వ్రాసి ప్రకటించి యున్నారు. అందలి సారాంశమిది:- పురాణముల మీఁదను, శృంగార ప్రబంధముల మీఁదను ఆంధ్రులకెక్కుడు ప్రీతియుండుటచేత పంచతంత్రము తెలుఁగులోనికివచ్చుట ఆలస్యమాయెను. క్రీ. శ. 15 వశతాబ్దాంతమున నుండిన దూబగుంట నారాయణకవియు, 16 వ శతాబ్దమధ్యమున నుండిన బైచరాజు వేంకటనాథుఁడును దీనిని మొదట తెనుఁగుఁజేసి కనువాదము శిల్పరీతిని ఇంచుమించుగా సమకాలీనులు! వేంకటనాథుని కవిత్వము నారాయణకవి కవిత్వముతోఁ దులమూఁగఁజాలదు. అనౌచిత్యాదిదోషములు అనేకములతని పంచతంత్రమునఁ గానవచ్చుచున్నవి. చీపురు పాపర పుల్లలఁ జేపల బుట్టల్లినట్లు జెప్పెడి యాతని కాపుకవిత్వపు మాటలు ఆకాలపుఁ బామర కవివరుల చెవులకుఁ బ్రమదమిడలేదు. కావున వారు వేంకటనాథుని కవనమును నిరసించి నారాయణకవిని గొని

1. చూ. భారతి, సం. 18. పుటలు. 827-32.

యూడిరి. అంద కాగ్రహించి వేంకటనాథుఁడు తన పంచతంత్ర పీఠిక యందు నోరు నారాయణకవిని దూషించెను. పంచతంత్రమును బద్యకావ్యముగ గ్రాయుట ఇద్దఱు కవులకును సామాన్యమైన తప్పే; కాని యాకాలమున బద్యరచనయే గణుతికెక్కియుండి నఁదున వీరిద్దఱును ఱుంతవ్యలే. వెంకటనాథుని గ్రంథమున నసౌ చిత్యదోషము బహుళముగాఁ గానవచ్చుచున్న ది. సంస్కృత పాండిత్యప్రకటన పరాయణుఁడై మొనటి యాశ్వాసమున నిరర్థక సమాసములను, మఱియు నిట్టి యన్యదోషములను దొరలించెను. మొత్తముమీఁద నారాయణకవి కవనమే మేలు. మఱియు వ్యాస విషయమునకు విశేషసంబంధములేని వేంకటనాథుని జన్మదేశపర్యాలో చన కొంతకలదు. "వెంకటనాథుఁడు నెల్లూరివాఁడు కాఁడు. అతఁడు కృతియిచ్చిన హరిహరనాథుఁడు నాచనసోమన కృతియిచ్చిన హరి హరనాథుని వలెనే తిక్కనకృతియిచ్చిన నెల్లూరి హరిహరనాథ స్వామి కాఁడు."

మొదట వెంకటనాథుని జన్మదేశమునుగూర్చి కొంతచెప్పె దను. గ్రంథముయొక్కపీఠికలో నిట్లు వెంకటనాథుఁడు వ్రాసి యున్నాఁడు:

క. "ఏచనవు గల్గడు హరిహర
సాచివ్యము నొంద నన్యజనులకు మది నా
లోచింపఁ దిక్కయజ్వకు
నాచన సోమునకు మఱియు నాకుం ధక్కన్."

ఈ పద్యమును నారాయణరావుగారు చక్కఁగ నన్వయము చేసికొనక వెంకటనాథ నాచనసోము లంకిత మొసఁగిన హరిహర నాథుఁడు దిక్కన యంకితమిచ్చిన నెల్లూరులోని హరిహరనాథుఁడు కాఁడని చెప్పినట్లు తోఁచుచున్నది. ఈపద్యమున ఏ హరిహరనాథునికిఁ దిక్కన నాచనసోమన లంకిత మొసఁగిరో యాహరిహరనాథునికే వెంకటనాథుఁడును తాను అంకిత మిచ్చితినని చెప్పుచున్నాఁడు. తిక్కన నాచనసోమన లంకితమిచ్చిన హరిహరనాథులు వెంకట

నాథుని హరిహరనాథునికంటె భిన్నదైవములయినచో నతఁడు వారి నీ సందర్భమునఁ దనతోఁ జోడించి పేర్కొనుటకుఁ గారణమగ పడదు. నారాయణరావుగారీవిషయమై యభిప్రాయభేదముగలదని చెప్పియున్నారు. అట్టి అభిప్రాయభేదమున కెంతమాత్రమును ఎడములేదని నేననుచున్నాను. తిక్కన నాపనసోమన లాంఛితమిచ్చిన హరిహరనాథునికే తానును లాంఛితము జేసితినని వేంకటనాథుఁడు దెలియఁ జేయుచుండగా నారాయణరావుగారి యభిప్రాయభేదమున కవకాశమేది? ఆంధ్రదేశమున నెల్లూరునందు తప్ప మఱియెచ్చటను హరిహరనాథుఁ డుండినట్లు సాక్ష్యములేదు. కావున వేంకటనాథుఁ డంకితమిచ్చినది నెల్లూరి హరిహరనాథునికనియే చెప్పవలసియున్నది. మఱియు వేంకటనాథునికి నెల్లూరితో సంబంధముండెనని గ్రంథాంతర్గత సాక్ష్యమువల్ల విశదపడుచున్నది. మిత్రభేదమునందు నక్కభేరిల కథను వేంకటనాథుఁ డిట్లారంభము సేయుచున్నాఁడుఁ:

క. "దమనకుఁ డిట్లను పరవి
క్రమ విక్రమసింహపుర నికట వటకాంతా
రమున నొకనాఁడు గాఢ
క్రమమున నేనరిగి తిరుగఁగాఁ గట్టెదుకన్."
(1-186)

విక్రమసింహపురప్రస్తావన సంస్కృత పంచతంత్రమునఁ గానరాదు. నారాయణకవి "కలహాభూమిని" జేర్కొనియెనేకాని విక్రమసింహపురము పేరెత్తలేదు (1-148). భానయయు "ఒక్కభగ్న వాహినీ సమీపస్థలంబునఁ గ్రుమ్మరుచు నొక్కహాతాహత భేరి నినాదం బాకర్ణించి" యని కథనారంభము చేసెనేకాని విక్రమసింహపురమును దలపెట్టలేదు. ఇందువల్ల వేంకటనాథుఁడు విక్రమసింహపురమును ప్రయత్నపూర్వకముగ నీకథలోనికి జొప్పించెనని తెల్లమగుచున్నది. ఆంధ్రదేశమున ప్రఖ్యాతనగరము లెన్నియో యుండ నన్నిటిని వదలి విక్రమసింహపురమువై[illegible] జూపిన యీపత

పాతమునకుఁ గారణమేవి ? నారాయణరావుగా రేమందురో కాని నాకుఁజూడ నాపట్టణము వెంకటనాథుని జన్మదేశమైనను గాకున్నను దానితో నతనికి గాఢమైన సంబంధమెద్దియో యుండె నని తోఁచు చున్నది. రాయిగుద్దినట్లు వెంకటనాథుఁడు నెల్లూరివాఁడు కాఁడని చెప్పుటకు నాకు సాహసము చాలకున్నది.

ఇక వెంకటనాథుని గ్రంథవిషయమై నారాయణరావుగారి విమర్శను పరామర్శించవలసియున్నది. వీరి విమర్శ సక్రమమైనదని నాబుద్ధికిఁ దోఁచలేదు. కావున నీవిమర్శనమున వీరు ప్రచురపఱచిన యభిప్రాయములఁ నించుక పరిశీలించవలసివచ్చినది.

1. పంచతంత్రి మాంధ్రభాషలోనికి వచ్చుటకు నారాయణ రావుగా రనుకొనినంత యాలస్యము గాలేదు. మొదటి యాంధ్రీకరణము కాకతీయయుగ చరమదశయందు నడచె ననుటకుఁ గొంత యాధారము గలదు. క్రీ. శ. 14 వ శతాబ్ద్యుత్తరార్ధమున వర్ధిల్లిన మడికిసింగన యను ప్రాచీనకవి సకలనీతిసమ్మతమను నొక రాజనీతి గ్రంథమును విరచించెను. ఇదియొకసంకలన గ్రంథము. తత్పూర్వ విరచిత ప్రాచీనతరాంధ్ర గ్రంథములు బెక్కు నిందుదాహృతములై యున్నవి. వానియందు పంచతంత్రమొకటి. యత్కృతమో చెప్పు టకు వీలులేదు సకలనీతిసమ్మతమును బరిష్కరించి ప్రకటించిన శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రీపంచతంత్రమునుగూర్చి యిట్లభి ప్రాయపడుచున్నారుఃఁ "సకలనీతిసమ్మతమున బంచతంత్రి వేర నుడి వినగ్రంథము లభింపదయ్యె. కర్తపేరు నెఱుంగ సాధ్యము గాదు. ఈ కవి లభించుచున్న పంచతంత్రముల కర్తలకంటెఁ బ్రౌఢుఁడని వెంకటనాథాదుల వద్యములఁ బోల్చిచూచిన నెఱుంగవచ్చును." కవి గారి యభిప్రాయము కర మంగీకార్యము.

ఇతనికిఁ దరువాతఁ బంచతంత్రమును దెనుఁగుసేయఁ గడఁగిన వాఁడు దూబగుంట నారాయణకవి. శ్రీ నారాయణరావుగా రితని చరిత్రను వలయునంత విపులముగ దడవియుండుటచేత దానినిచ్చట మరల వర్ణించ నవసరములేదు. అటు తరువాతి యాంధ్రీకరణకర్త

భానయ. అతడు శ్రీకృష్ణదేవరాయల సమకాలీనుడు. విజయ నగర వాస్తవ్యుడు. స్వవిరచిత పంచతంత్రమును సంగీత సూర్యోదయ గ్రంథకర్తయు, రాయల నగరికరణములలో నొక్కడును నైన భండారు లక్ష్మీనారాణున కంకిత మొనర్చెను. కవిత్వాతిశయమున నితడు నారాయణకవికి దీసిపోవువాడు కాడు. ఇతని గ్రంథ మిటీపల మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారాధికారులచే ముద్రింపబడినది.

భానయకు నరువాతి యాంధ్రాని వాదకుడు వెంకటనాథుడు. ఇందువల్ల వెంకటనాథునికి పూర్వము పంచతంత్రమును దెనిగించినవారు నారాయణకవిగాక మఱి యిరువురు గలరని తెల్లమగుచున్నది గదా. వెంకటనాథుడు దన పంచతంత్రపీఠికయిందు దూలనాడినది యాధిక్షేపకృత పంచతంత్రకర్తను నతనిని స్తోత్రముచేసిన యన్యకవులనే యని వాదమునకై యొప్పుకొనినను, ఆపంచతంత్రకర్త నారాయణకవియే యని చెప్పుట కెట్లు వీలగును? నారాయణకవియు, వెంకటనాథుడును ఇంచుమించుగా సమకాలీనులగుటచేత వెంకటనాథుడు దూలనాడినది నారాయణకవినే యని నారాయణకవిగారి వాదము. పదునేనవ శతాబ్దియంతమున నుండిన నారాయణకవియు పదునారవ శతాబ్దిమధ్యమున వెలసిన వెంకటనాథుడును ఇంచుమించుగా సమకాలికు లగుట యెట్లు? ఇంచుమించన పూర్వికుడని యర్థమా? అగునేని పూర్వికుడు సమకాలికుడగుట యెట్లు? నారాయణకవికి దర్వాతివాడు పదునాఱవ శతాబ్ద పూర్వార్ధమున నుండిన భానయ వెంకటనాథునికి నారాయణ కవికంటె సన్నిహితుడు గదా. అతడును నారాయణకవిని బోలి భావన కవియేకదా, నారాయణరావుగారు ఊహించినట్లు వెంకటనాథుడు దూషించినది పంచతంత్రకర్తనే యనుట నిశ్చయమేని, అట్లు దూషింపబడినవాడు భానయకవి యేల కారాదు?

కావున, నారాయణరావుగారి యూహనిరాధారమగుటచే గార్హ్యముకాదు. వెంకటనాథుని పంచతంత్రిపీఠికలోని "ఒక డలంకారంబునకి" మొదలైన పద్యములు ఒకరినుద్దేశించి వ్రాయఁబడెనని తలఁచుట పొరపాటు. ఈకవి దూషణ దీనికిఁ బూర్వ ముండు "రసవిస్ఫూర్తి గొఅంత" యను పద్యముతో సమాపినంది నది. ఇందుఁ గావ్యరసాస్వాదన పరాయణుల యభిరుచులు భిన్న ములని తెల్పఁబడినది. తరువాతి పద్యములో ఒప్పులుగల కృతిలో నొక తప్పున్నను లోపముగా బరిగణింపరాదని నిజ్ఞాపన. అటు వెనుక నాలుగు పద్యములయందు మరల కుకవి నింద. ఒకవేళ నారాయణరావుగారు వాడించునట్లువియన్నియు కుకవి నిందాత్మ కము లై నను గావచ్చును. కుకవివర్గమునందు వెంకటనాథుఁడు తన పరితిస్పర్ధులను జేర్చియుండిన నుండవచ్చును. ఇంకు విశేషమేమియు లేదు. ఆంధ్రకవులందఱును పాటించిన మర్యాద ఇట్టిదే. వెంకట నాథుఁడు మాత్రము దన యస్థిపంజరమునువిడిచి వెలుపలికి లంఘించఁ గలఁడా? అట్లు లంఘించలేపని యతని దూఱుట దేశకాలస్థితులను విస్మరించి పటయుగపరిశేషము చేయఁజూలకపోయెనని తప్పుపట్టుట యగును. ఇట్టిమహిమ వాఙ్మయ యోగీందుల్రిలకుఁ గలిగినఁ గలుగ వచ్చుఁగాని కవినూతుల్రి కసాధ్యము. కుకవినిందను విస్తరించి చేసినంతమాత్రమునసే అది నారాయణకవి నుద్దేశించి చేసినదనికాని, కుకవులు సామాన్యముగ వెదకు తప్పులన్నియు వెంకటనాథుఁడు దన గ్రంథమున నుండినట్లొప్పుకొనె నని చెప్పుటకాని తగదు.

2. పంచతంత్రమును పద్యకావ్యముగ వ్రాయుట తప్పని శ్రీ నారాయణరావుగారు దమ యభిప్రాయమును వెలిఁబుచ్చి యున్నారు. నారాయణ వెంకటనాథులు పద్యకావ్యముగ వ్రాసి తప్పొనర్చిరని వారినిద్దటిని నిష్పక్షపాతబుద్ధితో ఖండించిరి; వారి కాలపు గ్రంథకర్తలను బోలి పద్యకావ్యమే ప్రశస్తమని తలఁచి వారును దము పంచతంత్రములను పద్యకావ్యములుగనే రచించిరని పెద్దమనస్సుచేసి క్షమించి విడిచిపెట్టిరి. వీరికి పెత్తపువేర్రిటులు తప్పి

నందుకు సంతోషమే! కాని పంచతంత్రాంధ్రీకరణ విధాన మిట్లుండ వలెనని నారాయణరావుగారు చేసిన దిగ్దోపన్యాసము అంగీకార్యమని నాకుఁ దోఁచలేదు. పద్యకావ్యముగ రచించుటవలన కష్టమేమో నాకు బోధపడలేదు. నీతిశాస్త్రగ్రంథము లెన్ని పద్యాత్మకములు సంస్కృతమున లేవు? పద్యాత్మకమునైనంతనే యందలి నీతులు పిలుపను గోలుపోయి దుర్నీతులై పరిణామమును బొందునా? కవులు వారికాలమున చెలామణి యందుండిన వాఙ్మయాభిరుచుల ననుసరించియు, సమకాలీన పాఠకాదరణమును గోరియు గ్రంథ రచనకుఁ గడఁగుట సహజము. చచ్చినచాఁడని, బుట్టినివారిని వారు సరకుగొనరు గ్రంథకర్త ప్రతిభావంతుడేని పద్యాత్మకముగాని, గద్యాత్మకముగాని స్వవిరచిత గ్రంథమును రసవంతముగను, రంజకముగను జేయఁగలఁడు. ప్రతిభాశూన్యుఁడేని యేపద్ధతి నవలంబించినను దాను వ్రాయఁగడఁగిన పుస్తకమును మృత్తికా ప్రాయము సేయఁగలఁడు. కావున పంచతంత్రకర్తలకే కాదు గ్రంథ రచయితల కందఱికిని బ్రతిభానము ప్రతిభ. అది లేనివారు పద్యము వ్రాసినను గద్యము వ్రాసినను నొక్కటియే.

8. వెంకటనాథుని యనౌచిత్యములను గొన్నిటిని వేర్కొని యున్నారు నారాయణరావుగారు. అందు మొదటిది యష్టాదశ వర్ణన. ఉదాహరణ: గ్రంథారంభమందలి పాటలీపుత్రముమీఁద సీస పద్యమును, అగడ్తకు సీసపద్యము. "కోటగోడలు, సౌధాలు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, వేశ్యలు, పుష్పలావికలు, మదపుటేనుఁగులు, గుఱ్ఱములు, రథములు; ఒక్కొక దానికి రెండేసి, మూడేసి పద్యాలుగా పెరిగినవి." "ఇట్లీ రాజును వర్ణించు సీసపద్యము లైదు, ఒక శార్దూలము, ఒక మత్తేభవిక్రీడితము. ఇన్ని పద్యాలు వ్రాయఁడమెందుకు? అనంగా అనంగా నొక పట్టణం; ఆ పట్టణంలో నొకరాజని చెప్పిన నెంత ముచ్చటగా నుండెడిది" అని నారాయణరావుగారి విమర్శ.

అష్టాదశవర్ణనలు గ్రంథములయందుఁ జేయుట తప్పా? తప్పందుఁకేని యెట్లు? ఇట్టి వర్ణనలు సేయని తెలుఁగు కవులకుదు. స్వభావసిద్ధముగ నీవర్ణనలఁ జేసిన నవి గ్రంథము విలువను హెచ్చింప గలవు; కాని తెనుఁగువారికి అతిశయోక్తులు ప్రియతములు. అతిశయోక్తి బహిష్కార పాత్రమేని తెనుఁగు కవుల గ్రంథములి యం దతిశయ సంఖ్య బహిష్కారార్హములే. మొదట బహిష్క రింపఁదగినది శ్రీకృష్ణరాయవిరచితమగు నాముక్తమాల్యద. తెనుఁగు కావ్యములను విమర్శింపఁగడఁగి యతిశయోక్తిని బహిష్కరింప బూనుట కఁబళియందు భుజించుచు వెండ్రుకలఁ జీఱుట యగును.

ఒక్కొక్క విషయమును వర్ణించుట కిన్నిపద్యము లాయని మటియొక యూహాపణ. ఈ సందర్భమున ముఖ్యముగ జ్ఞాప్తియం దుంచుకొనవలసిన యంశ మొకటి కలదు. పూర్వకవుల పోకడలు మన భావకవులకు గిట్టవు: వీరి పద్ధతి రాబోవు తరమువారికి రుచించు నేమో చెప్పుటకు వీలుకాదు. వర్ణనాసంగ్రహ వైపుల్యములు కవుల మనస్తత్వముల ననుసరించి యుండును. కొందటి కీషన్మాత్రము సూచనచేసి విడిచిన సంతసము కలుగును. అనేకులకు విపులముగ వర్ణింపకుండినఁ దృప్తియుండదు. కాని యతియశ విపులీకరణము వాచకులకు విసుగు పుట్టించును. దోషమే యగును. అయినప్పటికిని గ్రంథవిమర్శనకుఁ గడఁగువారు ఇట్టి యల్పదోషముల నెన్నుట యందు నిమగ్నులై గ్రంథోత్కృష్టతను మఱచి రంధ్రాన్వేషణకుఁ దొడఁగిన కవియెడ నక్రమ ప్రవర్తనకుఁ గడఁగుటయేకాక వాచ కులనుగూడ వంచించినవా రగుచున్నారు. వెంకటనాథుని పంచ తంత్రము పీఠికతోడను, పురవర్ణనతోడను సమాప్తమందుట లేదు. కాని నారాయణరావుగారి తీక్షవిమర్శకుగురియైన వివియే. గ్రంథ మునంతటిని పరిశోధించి, దేశకాలానుసారముగ మాఱుచుండు విష యములపై ననవసరమగు నూతనిడక గుణావగుణములను పరికించి విమర్శించుట సమంజసము.

మఱియు సంస్కృత పాండిత్యము వెంకటనాథుని యవగుణములు యందొక్కటిగ నారాయణరావుగారు పరిగణించుచున్నారు. "సంస్కృత పాండిత్యము, అనర్థక నిరర్థక సమాస ఘటన, ఇంకా ఏవేవి దోషములుగా తానుద్ఘాటించుకొన్నాడో అవన్నీ దొరలినవి." సంస్కృత పాండిత్యమును వెంకటనాథుడు దోషముగ నుద్ఘాటించు కొనియున్నాడా? ఇది నమ్మదగిన విషయముగాదు. ఒక్క వెంకటనాథుడేకాడు, మఱి యేప్రాచీనాంధ్రకవియు సంస్కృత పాండిత్యమును దోషముగ బరిగణించి యుండజాలడు ఆకాలమున సంస్కృతము నెఱుగని పండితుడుగాని, కవిగానిలేడు. వారికి సంస్కృతాంధ్రములు కరతలామలకములు. మన దుర్దశ వారికి పట్టలేదు. ఆంగ్లవిద్యాభ్యాసము పెంపునను, గిడుగువారి ప్రసాదము సొంపునను నిప్పటి తెనుగువారికి సంస్కృతాంధ్ర భాషాజ్ఞానము అపరిచితమాయెను. నేటి తెనుగు కవులకు సంస్కృతాంధ్రభాషాజ్ఞానము అనవసరమని తలంపుకలిగినది. ఉత్తమ గ్రంథరచన సన్నగిల్లి గ్రామ్యభాషాగ్రంథములు దేశమునందంతటను ప్రాకినవి. ఈ రోగము ప్రాచీనులను పీడించలేదు. కావున వారి నోట సంస్కృతపాండిత్య స్ఫోరకమగు కవనము సహజముగనే వచ్చుచుండెను. సంస్కృతపాండిత్యము కవులయందుగాని యన్యుల యందుగాని దోషముగాదు. మన యజ్ఞాన కారణమున దోషమని మన బుద్ధి దోచుచున్నది. నారాయణరావుగారివంటి సంస్కృతాంధ్ర భాషాభిజ్ఞులకే సుగమములగు వేంకటనాథుని సమాసములు దుర్గ్రాహ్యములని తోచినపు డన్యులమాట చెప్పవలయునా?

వేంకటనాథుని యనౌచిత్యము: దీనికి కార్కాణ. కోతి దూలములోని చీలను ఉడదీసి అండములునలిగి చచ్చినకథ. "ఊసు పోక, మూలములో లేనికథను కల్పించడంవల్ల కావ్యకలకు ముప్పు తెచ్చినాడు" అని నారాయణరావుగారి విమర్శ. "మూలములో లేనికథ" అని నారాయణరావుగారనుచున్నాడు. కథయొక్క బీజము మూలమునందు కలదు. నారాయణకవియు నీకథను జెప్పి

యున్నాఁడు. దాని సారాంశమిది. ఒక పట్టణము సమీపమున జీర్ణమైన దేవాలయమొకటి యుండెను. వైశ్యుఁడొకఁడు దానిని బాగు చేయుటకు నిశ్చయించి దాని నిర్వహణకు వలసిన ధనమును శిల్పకారులకొసఁగెను. వారు దేవాలయనిర్మాణమున కారంభించి యొక చేవదూలమును దెప్పించి దానిని పలుకలుగాఁ గోయుచు రంపపు కోతచే నేర్పడిన సందున మేకులుగొట్టి భోజనార్థమింటికిపోయిరి. తరవాత కోతి యొకటివచ్చి అమాంతమైఁ గూర్చుండి మేకును పెకలించెను. అంత ఆమ్రూని వ్రయ్యయందు దానియండములు దగులుకొని చితికిపోయెను. కోతియు మృతినందెను. కావున నారాయణరావుగారు చెప్పినట్లు వేంకటనాథుఁడు లేనికథను తెచ్చిపెట్టలేదు. ఉన్నకథను చూర్చి యొక్కఁడు హృదయంగమముగాఁ జెప్పినాఁడు. కథను మార్చుట కితఁడు ప్రథముఁడుగాఁడు. హితోపదేశకారుఁడు చూపినమార్గము ననుసరించి యట్లే తానను నొక క్రొత్తదారిని త్రొక్కినఁడు. బౌద్ధుడొకఁడు బుద్ధాలయమును నిర్మింపదలకొనెనని చెప్పినాఁడు హితోపదేశకారుఁడు. ఇక వెంకటనాథుఁడు ఒక పట్టణమునుచోట యుజ్జయిని యనియు జీర్ణాలయము లేక బుద్ధాలయమనుటకు బదులు శివాలయమనియు, వర్తకుఁడు లేక బౌద్ధుఁడనుటకుమాఱు భోగినీ స్త్రీయనియు మార్చినాఁడు. ఈ మార్పులు కావ్యకల కెట్లుముప్పుతెచ్చునో తెలియదు. వాస్తవముగ నారాయణరావుగారి కోపమునకుఁ గారణము వేఱని తోఁచుచున్నది. నారాయణకవివలె ఏవర్తకునితోడనో తృప్తినందియుండక వెంకటనాథుఁడు కావ్యములోనికి లేనిపోని భోగనుపిల్ల నెక్కడిసుండియో తెచ్చి చొప్పించెను. ఎంతటియపరాధము! అంతటితోఁదృప్తిపడక దానిసౌందర్యాతిశయమును, ఆటనేర్పును, పాటమాధుర్యమును కన్నులముందు పొడకట్టునట్లును చెవులఁ బడునట్లును వర్ణించినాఁడు. దానికై తిరిగెడు విటకాండ్ర పోకడలను జెప్పినాఁడు; దానిని పామువే గఱపించి యాసాకునఁ దనకుఁ దెలిసిన విషవైద్యపద్ధతులన్నిటిని నేకరువు పెట్టినాఁడు. ఇట్టి యనౌచిత్యమునకుఁ బాల్పడిన కవి ఉంతఘ్యుఁడా?

భోగిని స్త్రీల పేరుచెప్పిన చెవులు మూసికొనెడు "ఆంటి నాచ్" సంస్కర్తలు కావ్యవిమర్శ సేయునపుడు దమయభిప్రాయ ములకు విరుద్ధవిషయములను వర్ణించు కావ్యముల నగ్రామముగ ఖండింపఁగడగుట సద్విమర్శనాపద్ధతికాదు. వెంకటనాథుఁడు పదు నాఱవ శతాబ్దమువాఁడు. ఆకాలమున భోగకాంతల యెడనెవ్వరికిని అసూయలేదు. పేరుగలిగిన వాఁడ్రెల్లను భోగకాంతలను దాత్కా లికముగ నుద్వాహము జేసుకొనుచుండిరి. ఇట్టి వివాహమునకు గళతీర్పికరణమనిపేరు. కావున భోగినీస్త్రీని దనకావ్యమునుండి వెలి వేయలేకపోయెనని వెంకటనాథునిపై గన్నులెఱ్ఱజేయుట పాడి గాదు. ఈపట్టున మనస్సునందుంచుకొనదగిన విషయములొకటి రెండు కలవు. క్రీ. శ. 16 వ శతాబ్దారంభమునుండియు నాంధ్ర వాఙ్మయ చరిత్రయందు శృంగారయుగ మారంభమాయెను. ఏమాత్ర మవకాశము చిక్కినను కవులు శృంగారవర్ణనలను దమ గ్రంథముల యందు జేర్చుచుండిరి. కావున వెంకటనాథుఁడు భోగస్త్రీని ఈకథయందు ప్రవేశపెట్టుటయందు వింతలేదు. ఇంకొక విషయము: వెంకటనాథుఁడొక గొప్పకథకుఁడు. ఆంధ్రకథావాఙ్మ యమున నతనిస్థానమున్నతమైనది. కేతన, సూరన, గోపరాజాది ప్రాచీనకథకులకును, కదిరీపతి, నారాయణాది అర్వాచీనకథకులకును నితఁడు మధ్యకాలమువాఁడు. పురాతనకథకుల మార్గములను, నర్వా చీన కథకుల పోకడలును నితని గ్రంథమునఁ గానవచ్చుచున్నవి. మఱియు నితఁడు కవిత్వమునకు నవీనగుణసనాథుడైన నాచన సోమ నాథుని మేలుబంతిగఁ గొని యతఁడాంధ్రకవిత్వమున నూతనముగ ప్రవేశపెట్టిన పద్ధతి నవలంబించెను. ఏవస్తువునుగాని వర్ణించపలసి వచ్చినపు డావస్తువునకు సహజములగు నంగములను జాఱవిడువక యది వాచకుల చక్షువులకుఁ బొడకట్టునట్టు వర్ణించుట నాచన సోమని కవనమందలి నవీనగుణములలో నొక్కటి. దీనిని "వాస్తవిక పద్ధతి" యనవచ్చును. వెంకటనాథుఁ డీపద్ధతి నవలంబించెను. శృంగారయుగము వాఁడగుటచే స్వయుగధర్మము ననుసరించి తన

కబ్బమున శృంగారమునకుఁ బ్రాధాన్యము నొసఁగి సంస్కృత పంచ తంత్రమునలేని భోగినీస్త్రీని బ్రస్తుత కథకు కథానాయికఁగ జేసెను. కథకుఁడగుటచే గథయందు నూతనాంశములను జేర్చి పెంచెను; వాస్తవిక కవియగుటచే దనకాలమునందలి భోగినుల ప్రవర్తనలను, విషచికిత్సామార్గములను వాస్తవముచొప్పున వర్ణించెను. ఇందౌచిత్య భంగమేమియుఁ గానరాదు. దేవాలయము నెవ్వరు కట్టించినను కోతియండములు చిదుగుటకుఁ గారణమగు వ్రయ్య సేయబడిన దూల మును మఱువలేదు. భోగినీస్త్రీ దూలమును దెప్పించెననుట యనౌ చిత్యమా? లేక నీతికథలలో శృంగారము పనికిరాదనియా? అట్టి కథలు పంచతంత్రమున లేకపోలేదే? ఎట్లు చూచినను ఈ పట్టున ననౌచిత్యము గాన్పించనులేదు, కావ్యకలకు మువ్వురానులేదు.

శ్రీ కంకంటి పాపరాజు

ఆంధ్రమున విష్ణుమాయావిలాసము అను పేరుగల గ్రంథములు నాలుగు కలవు. ఇందు రాధామాధవ బిరుదాంకిత చింతలపూడి ఎల్లయార్యకృత విష్ణుమాయావిలాస నాటకము ప్రాచీనతమము, కృష్ణరాయల యుగమునకుఁ జెందినది. ఆవాఁడు విరచితమైన రసవత్తరాంధ్ర పద్యకావ్యములలో నిది యొకటి. 1933-వ సంవత్సరమున నిది మదరాసు విశ్వవిద్యాలయమువారిచే ప్రకటింపఁబడెను. తరువాత క్రీ. శ 17-వ శతాబ్దాంతమున రోసనూరి[1] వెంకటపతి యనుకవి "విష్ణుమాయావిలాస" మను మూఁడాశ్వాసముల పద్యకావ్యము నొకదానిని రచించి వెంకటగిరిప్రభువైన బంగారు యాచమనాయని కంకిత మొసఁగెను. ఇది వెంకటగిరి మహారాజు వెలుగోటి రాజగోపాలకృష్ణ యాచేంద్రులవారిచే 1900-వ సంవత్సరమున ముద్రింపబడెను.

పై రెండు గ్రంథములుగాక ఉత్తర రామాయణ కృతికర్తయగు కంకంటి పాపరాజు దా నొక విష్ణుమాయా విలాస యను

---

1 నెల్లూరి జిల్లా వెంకటగిరి సంస్థానమునకుఁ జెందిన సగటూరి సీమయం దీగ్రామము గలదు. వెంకటపతియో, యాతని పూర్వికులో సరుగ్రామవాస్తవ్యులై యుండవలెను

గానము రచించికట్లు ఉత్తర రామాయణ పీఠిక యందును, ఆశ్వా సాంత గద్యాలందును జెప్పికొనియున్నాఁడు.

"శ్రీవెలయ మున్ను విష్ణుమాయా విలాస
యక్షగానంబు మాకె సమర్పణముగఁ
జేసి తదియాదిగా మేము నీ సుధాను
సారి వాక్కులఁ జొక్కియున్నారమనఘ" (1-22)

"విష్ణుమావిలాసాభిధాన యక్షగాన నిర్మాణ ప్రవీణతా నిధాన పాపరాజ ప్రధాన ప్రణీతంబైన శ్రీమదుత్తర రామాయణం బను మహాకావ్యంబునందు" ఇత్యాది.

ఇది యముద్రితము.1 "ఈకవియొక్క విష్ణుమాయావిలాసము నేడు విష్ణుమాయావిలాసమునకే ఆకరమైనది" అని మిత్రులు బ్రీ. శ్రీ. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రులవారు తాము పరిష్కరించిన యుత్తర రామాయణ పీఠికలో వగచిరి. కాని శాస్త్రులవారు తలఁచినట్లు ఈ యక్షగానము నష్టము గాలేదు. తంజావూరు సరస్వతీమహాలు పుస్తక భాండాగారమున నొక ప్రతికలదు. (చూ: డిస్క్రిప్టివ్ క్యాటలాగు-ఆంధ్రవిశ్వవిద్యాలయ ప్రచురణలు, సంఖ్య 11, పుట 193) ఈ క్యాటలాగును తయారు చేసినవా రీగ్రంథమును గూర్చి యిట్లు చెప్పియున్నారు:

"విష్ణుమాయావిలాసము-ఇందు కృష్ణభగవానుని మాయలు వర్ణింపఁబడియె. సంపూర్ణము. ప్రాఁత మంచిది. గ్రంథ పాతము లేదు. శైథిల్యము గానరాదు. తప్పులు గలవు." (పుట 193)

ఇందువలన పాపరాజకృత విష్ణుమాయావిలాస యక్షగానము నశించిపోలేదని తెలియుచున్నది. నేటికిని లభ్యపడు ప్రాచీన యక్ష గానముల యందిది యొకటి. కవి దొడ్డవాఁడు; నాటకము రస వంతమై యుండు నను తలంపు సహజమే.

---

1. ఇది యిటీవల మద్రాసు వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే ప్రకటింపఁబడినది.

విష్ణుమా యావిలాసమును పాపరాజు యుక్తగానముగ రచిం పగా దానినే కంకంటి నారసింహకవి యా పేరిటి ద్విపద కావ్యము నొకదాని వాసెను. నారసింహకవికృత ద్విపద విష్ణుమాయావిలా సము క్రీ. శ 1865 లో మదరాసునందలి విద్వన్మనోరంజనీ ముద్రా ణశాలయందు బ్ర శ్రీ పాలపర్తి నాగేశ్వరశాస్త్రులుగారిచే లేఖక ప్రమాదాది జనిత దోషంబులు లేకుండునటులు పరిష్కరింపబడి ముద్రితమై ప్రచురింపబడెను. ఈ గ్రంథముగాని, తదగ్రచయితగాని యాంధ్రకవుల చరిత్రకారులగు వీరేశలింగం పంతులుగారి దృష్టి కెక్కకపోయినను అనాటి పండితుల కిది కేవల మపరిచితము గాదు. శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులవారు ద్విపద విష్ణు మాయావిలాసమును జక్కగ నెఱుగుదురు. శబ్దరత్నాకరమునం దీగ్రంథము నుదహరించుటయేకాక తన్నిఘంటు పీఠికయందు కంకంటి నారసింహకవిని బేర్కొని యున్నారు. అముద్రిత గ్రంథ చింతామణ్యధిపతులగు పూండ్లరామకృష్ణయ్యగారును నెఱుగు దురు. వా రీగ్రంథము నొకానొక సందర్భమున నుదాహరించి యున్నారు.

2

ఇంతవఱకు ఆంధ్ర విష్ణుమాయావిలాసముల విచారము. ఇక మీద ద్విపద విష్ణుమాయావిలాసమునకు సంబంధించిన చర్చ. మొదట ఏ తద్గ్రంథకర్త చరిత్రను కనుగొనవలసియున్నది. స్వవిర చిత ద్విపదప్రబంధమున కంకంటి నారసింహకవి యిట్లు చెప్పుకొని యున్నాడు:

"ఆర్వేల వంశాబ్ధి హరిణలాంఛనుడు
గర్వితరిపుమంత్రి గర్వభంజనుడు
గురుతర శ్రీవత్సగోత్రపావనుడు,
పరిలబ్ధమదన గోపాలభావనుడు
ప్రసితామహుని వల్లభప్రభుబోలి
యెపుడు బంధులబ్రోచుహిత కీర్తిశాలి

యగణితమతీధాతయై తమఙాత,
యఁగు నయ్యఘనుఁబోలు నఖిలైకదాత
కంకంటి యప్పయాగ్రణి కుపూరుండు,
పంకజాప్త సమ ప్రభావిహారుండు
మాయన్న నరసమాంబా గర్భశుక్తి
జాయత మౌక్తికంబగు శుభవ్యక్తి
నరవర్య వేంకట నరసింహు గన్న,
సరసుండు పాపరాజ ప్రధానుండు.

పైద్విపదలవల్ల ద్విపద విష్ణుమాయావిలాస గ్రంథకర్తయగు నారసింహకవి విష్ణుమాయావిలాస యజ్ఞగానోత్తరరామాయణములు రచయితయగు కంకంటి పాపరాజునకుఁ దమ్ముఁడని తెలియవచ్చుచున్నది.

నారసింహకవి చెప్పిన స్వవంశచరిత్ర సరియైనదని కంకంటి పాపరాజకృత గ్రంథములు రుజువుసేయుచున్నవి. పాపరాజు విష్ణుమాయావిలాస యజ్ఞగానమున స్వవంశము నిట్లు ప్రశంసించియున్నాఁడు:

వరుస మీముత్తాత వల్లభామాత్యుండు
గృతకృత్యుఁడై మించెఁ గృష్ణుఁగొలిచి
ఘనుఁడు మీతాత అయ్యనమంత్రి మదన గో
పాలమంత్రోపాస్తి ప్రతిభ జెందెఁ
గరుణాబ్ధి మీతండ్రి కంకంటి యప్పయ్య
ప్రభుఁడు తా ద్భశకీర్తి భాగుమిఱె
శ్రీవత్సగోత్రవారిధి కౌస్తుభము రీతి
వారికంజెను నీవు మిటినావు

నరసమాగర్భజలధి రత్నంబు నీదు
తమ్ముఁడగు నారసింహు చిత్తంబు నిదియె

భక్తిగృహి యిమ్ముమదనగోపాలునకును
సద్గుణ నిధాన పాపరాజప్రధాన!"[1]

ఈ విషయమునే యుత్తరరామాయణ గ్రంథావతారిక యందిట్లు చెప్పియున్నాఁడు:


విమతగర్వాపహారు లాశ్వేలవారు,
అట్టి యాశ్వేలవారిలో నలఘుకీర్తి
వెలయు శ్రీవత్సగోత్రారవిందహేళి
మహితగుణశాలి వల్లభామాత్యమౌళి.
శ్రీవల్లభుఁడు లక్ష్మీ
దేవిని మునుపెండ్లియైన తెఱఁగునఁ దనకున్
దేవేరిగ లక్ష్మాంబిక,
నావల్లభమంత్రి పెండ్లియాడెన్ వేడ్కన్.
అల్లమ్మామాంబయందా
వల్లభనామ ప్రధానవర్యుఁడు గనియెన్
పల్లవపాణాకారున్
హాల్లకహిత కీర్తిహారు నయ్యనధీరున్.
అయ్యనవద్య గుణావని
యయ్యనమంత్రిమణి నరసమాంబవివాహం
బయ్యె నహార్యకుమారిని,
నెయ్యంబునఁ బెండ్లియైన నెలతాల్పురహిన్.
ఆ నరసమాంబ గర్భం
భోనిధి నమృతాంశు చందమున దానయశో

---

1 తంజావూరు సరస్వతీమహలు లైబ్రరీలోని తెలుగువాఙ్మయ పుస్తకములపట్టీ (ఆంధ్రవిశ్వవిద్యాలయ ప్రచురణములు సంఖ్య 14 పుట 193.).

నూన విభావిభవైకని
ధానంబగు నప్పయప్రధానుఁడు వొడమెన్.
జననుతుఁ డయ్యప్పన ఘనుఁ,
డనఘుఁడు బిదురూరి నరసయకుఁ దిమ్మమకున్
దనుజామణియై గుణములఁ
బెనుపొందెడి నరసమాంబ బెండిలి యయ్యెన్.
అన్నరసమాంబయందు, స
మున్నతగుణుఁడప్పనార్యముఖ్యుఁడు గనియెన్
సన్నుతుని బాపరాజా
ఖ్యున్నరసింహాభిధానుఁ గులము వెలయఁగన్."
(1 = 27—40)

పైనుదాహరించిన గ్రంథమలయందు వర్ణింపబడిన కంకంటి వారి వంశ పరంపర ఇది:-



V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

3

కవియొక్క సమకాలికులు

నారసింహకవి దనసమకాలికులగు ఆంధ్రకవుల నిద్దరిని పేర్కొనియున్నాఁడు. వీరియందు మొదటివాఁడు ఇతని యన్న యగు పాపరాజు. రెండవవాఁడు పుష్పగిరి తిమ్మన.

"అనఘుని పుష్పగిర్యప్పన్నతనయు,
ఘను సంస్కృతాంధ్రైక కవనాతిదక్షు
మా యన్న సఖుని తిమ్మకవిఁ గృతిస
హాయుని బిలిపించి యమ్మేటితోడ."

పుష్పగిరి తిమ్మకవి సహాయుండఁట. అనగా ద్విపద విష్ణు మాయావిలాసరచన యందతఁడు కంకంటి నారసింహరాజునకుఁ దోడ్పడెనని దీనిభావము. ఇతడు పాపరాజునకుగూడ నుత్తరరామాయణరచనయందు దోడ్పడినట్లు ఉత్తరరామాయణములోని "అనిఁ గిరిటికిశారి తోడైన యటులు" (1—26) అను పద్యమువల్లఁ దెల్లమగుచున్నది. విష్ణుమాయావిలాస యక్షగానరచనయందుగూడ నతనికి గొంత సంబంధ ముండినట్లు తలఁచుట కవకాశము కలదు. దీని కాధారము విష్ణుమాయావిలాస యక్షగానములోని యీ క్రింది వచనము:

"విష్ణుమాయావిలాసంబను యక్షగానంబు రచియింప నికృతికి నేవేల్పునధిపతిఁ జేయుదు నని తలంచుచున్న మదీయ హితకార్య ఘటనాభిముఖులైన కవి తిమ్మనార్య ప్రముఖుల నేమని నుతింపుచున్నాఁడు."[1]

ఈ వచనమునఁ బేర్కొనఁబడిన కవి తిమ్మనార్యుఁడు పుష్ప గిరి తిమ్మనార్యుఁడేకాని యన్యుఁడుగాఁడు. ఇతఁడు కంకంటి సోద

---

1. తంజావూరు సరస్వతీమహాలు లైబ్రరీ యాంధ్రాగ్రంథముద్రిత గ్రంథముల పట్టిక, పుట 198.

రుల కిరువురకును గ్రంథరచనకుఁ దోడ్పడుట చిత్రము. ఈ తోడ్పాటు విష్ణుమాయావిలాస యక్షగానముతో ప్రారంభ మాయెను. ఉత్తరరామాయణ రచనయందు క్షీరనీరన్యాయమున పాపరాజు కవనముతోఁ గలసి దానికి వన్నెదెచ్చినది. పాపరాజు మరణానంతరము గ్రంథరచనకుఁ గడఁగిన యతని తమ్ముని కవితకు రూపొసఁగినది. నారసింహరాజు ద్విపద విష్ణుమాయావిలాసమును దప్ప అన్యగ్రంథములను రచించినట్లు చెప్పుకొనలేదు, మఱియు దనయన్న జీవదశయందుండగా నీతఁడు గ్రంథరచనఁ దలపెట్టలేదు. తారచించిన ద్విపదకావ్యము నెవ్వని కంకితము సేయుదునా యని చింతించుచుండగా పాపరాజు స్వప్నమున సాక్షాత్కరించి శ్రీరామచంద్రుని కంకితము సేయుమని చెప్పెనఁట.

"అతులమౌ విష్ణుమాయా నాటకంబు,
వితతవాగ్వైఖరి ద్విపదగావించి
యీ విశ్వహితకృతి కేవేల్పు నధిపుఁ,
గావింతు నవి యాత్మ గణియించునపుడు
దురిత సరోరుహ తుహిన భానుండు,
సరసుండు పాపరాజ ప్రధానుండు
నాకలలో నొక్కనాఁడు గాన్పించి
యేకతంబునఁ గూర్మి యెసఁగ నిట్లనియె
నాకూర్మిసోదర నరసింహ నీవు,
చేకొని ద్విపదగాఁ జేసిన యట్టి
అనుపమ విష్ణుమాయా నాటకమున,
కనురూపవిభుఁ డెవ్వఁ డని తలంచెదవు
దానికి విభుఁడు సీతామనోహరుఁడె
కాని తదన్యుండుగలఁ డెలోకమున."

కావున కంకంటి నారసింహకవి ద్విపద విష్ణుమాయావిలా సము రచించునప్పటికి అతని యన్నయగు పాపరాజు స్వర్గస్థుఁడాయె

ననుట నిశ్చయము. పుష్పగిరి తిమ్మనార్యుఁడు దన సహాధ్యాయుఁడగు పాపరాజుయొక్క మరణానంతరముగూడ నాతనియందలి వాత్సల్యముచేతనో, మఱి యేకారణముచేతనో అతని తమ్ముఁడు గ్రంథ రచనకు గడఁగఁగా నతనికిఁ గృతి సహాయుఁడై తోడ్పడెను ఈ సందర్భమున గమనింప దగిన యంశ మొకటి కలదు.

"పుష్పగిరి తిమ్మనార్యుఁడు కంకంటి పాపరాజు ప్రాసినట్టు ఉత్తరరామాయణ మొకటియు, కంకంటి నారసింహరాజు ప్రాసినట్టు విష్ణుమాయావిలాస ద్విపద కావ్యమొకటియు రచించినా"డను నైతిహ్యము కలదని బహుజనపల్లి సీతారామాచార్యులవారు తెలిపి యున్నారు.[1] ఉత్తరరామాయణ కర్తృత్వమునుగూర్చి యభిప్రాయ భేదములుగలవు. కావ్యరచనయందుఁ బుష్పగిరి తిమ్మన కంకంటి పాపరాజునకుఁ గొంత తోడ్పడి యుండినను, వీరిరువురి కవిత్వమునకును భేదమున్నందున, ఈలోకప్రవాదము సరియైనదిగా నుండదని విశేషలింగంపంతులుగారు నుడివిరి.[2] "తిమ్మకవి సమీరకుమారవిజయ శైలినిని దినిశైలినిని, పదప్రయోగాదులకును పాశ్చాత్యమునకు యంతరము కల"దని పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రులవారు వక్కాణించిరి.[3] ఈ విషయమై కొంత పరిశోధన గావించిన మద్దులపల్లి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పై వారితో నేకీభవించక "కవితా శైలినిబట్టిచూడ నుత్తరరామాయణనందు ఆదిశ్రీకారమునుండి యంత్యాక్షరమువఱకును బదగుంఫనమునను నేమి, సమాసజాటిల్యమున నేమి, నేర్పుకూర్పులవలననేమి, యూహాపోహాలనేమి పద్యముల యెత్తుగడలనేమి యతిప్రాసప్రయోగములనేమి పుష్పగిరి

---

1. శబ్దరత్నాకరము, పీఠిక, పుట 16.
2. ఆంధ్రకవుల చరిత్రము, పుట 149.
3. ఆనంద ముద్రాక్షరశాలవారి యుత్తరరామాయణ పీఠిక, పుట 2.

తిమ్మన్నయే సమీరకుమారవిజయము వ్రాసిన తరువాత వ్రాసినట్లుగా దోచకపోదు." "రెండు గ్రంథములను సవిమర్శముగా సాంతము చూచినచో నొక్కముఖముగ వెలువడిన వాక్కుగనే కన్పట్టకపోదు. అతిదీర్ఘసమాసములును, వచనంబులును, అచ్చతెలుగుకూర్పులును, లోకోక్తులును, అర్ధాంతరన్యాసముక్తపదగ్రస్తాదులును రెండింటను గలవు. మొత్తముపైని సమీరకుమారవిజయముకంటె నుత్తరరామాయణములో మెఱుగుపెట్టబడినదని చెప్పక తప్పదు. పైని గనపఱచిన యేకదేశసామ్యమునుబట్టియేకాదు సాంగముగా ఠీలకించినచో దిమ్మకవియే సమీరకుమారవిజయమును రచించిన తరువాతఁ గంకంటి పాపరాజుకు సాహాయ్యమొనరించు పేరిటనేమి, ఋణమీఁగుటకొఱకేమి, యుత్తరరామాయణమును రచించెనని చెప్పుట కనువుగనున్న"దని చెప్పిరి.[1] ఇట్లు విమర్శకపండితులు ఉత్తరరామాయణ కర్తృత్వమునుగూర్చి రెండుతెగలై చీలుటచేత నిశ్చయమును నిర్ణయించి చెప్పుట సులభసాధ్యము గాదు.

ఇఁక ద్విపద విష్ణుమాయావిలాస నాటకముగూడ పుష్పగిరి తిమ్మనయే కంకంటి నారసింహరాజు పేరిట రచించెనేమో విచారించవలసియున్నది. ఈ సందర్భమునఁ జింతనీయములైన యంశములు మూఁడు గలవు: (1) నారసింహరాజు దనయన్న మరణానంతరము గ్రంథరచనకుఁ గడంగుట, (2) ఇతఁడు దనయన్న పాపరాజును బోలి "చతుర్విధానవద్య కవిత్వ విద్యావధానాధునాతన భోజరాజు", "విష్ణుమాయావిలాసాభిధాన యక్షగాన నిర్మాణప్రవీ"ణై తాదృశ బిరుదావళివల్ల స్వకవితానైపుణ్యమును దెలుపుకొనక, కేవలము "సరస విద్వత్కవిజనశరణ్యుండ"నని చెప్పుకొనుట, (3) పుష్పగిరి తిమ్మన కృతిసహాయుఁడగుట. ఈ విషయముల నన్నిటిని సమాలోచనముచేసి చూడ పుష్పగిరి తిమ్మనకు విష్ణుమాయావిలాస రచన

---

1. వావిళ్ల వారి సమీరకుమార విజయము, పుటలు 10, 15.

యందుఁ గూడ కొంతయేని సంబంధము గలదని తోఁచుచున్నది. భావిపరిశోధకుల పరిశ్రమవల్ల దీని యందలి నిజము వెలువడవలసి యున్నది.

4

కవికాలము

నారసింహరాజు కంకంటి పాపరాజు తమ్ముఁడనియుఁ, బుష్ప గిరి తిమ్మనార్యునికి సమకాలికుఁడనియు పైన వ్రాసిన దానివల్ల వ్యక్తపడుచున్నది. కాని వీరేకాలము వారై సదియుఁ దెలిసికొను టకుఁ దగిన యాధారములెవ్వియు వీరిగ్రంథములలోఁ గానరావు. కవిత్వశయ్యయు, శబ్దజాలమును జూడ వీరు 17-వ శతాబ్దమువారు కావచ్చు నను నూహపొడమచున్నది. వీరికాలమును నిర్ణయించఁ దగు నాధారములు లేకున్నను ఆంధ్రకవుల చరిత్రకారులు వీరు 18-వ శతాబ్దారంభమున నుండిరని వ్రాసియున్నారు. "కంకంటి పాపరాజు ప్రళయకావేరిపట్టణములో నమీనుగా లౌక్యాధికారము నం దుండిన వాఁడు. ఆకాలమునందే పుష్పగిరి తిమ్మన్న కొంత ఋణముచేసి యాయప్ప తీర్చలేక యాపుస్తకము (ఉత్తరరామా యణము)ను దానికిందఁజేసి యియ్యఁగా 1790-వ సంవత్సర ప్రాంతమున నుత్తరరామాయణమును పాపరాజు తనపేరితోఁ బ్రచురించెనని చెప్పుచున్నారు. కవి యిప్పటికి (ఆంధ్రకవుల చరిత్ర తృతీయభాగ రచనాకాలమునాఁటికి) నూఱు సంవత్సరములక్రిందట నుండినవాఁడు." "కంకంటివారి యుత్తరరామాయణమువలెనే (ధరణి దేవుల రామమంత్రికృత) దశావతార చరిత్రమును పుష్పగిరి తిమ్మన్నచే రచియింపబడిన దని కొందఱు చెప్పుచున్నారు గాని కవు లిద్దఱు నేక కాలములో నొక్కదేశములో నుండుట దక్క వారి మాట కాధార లేశమును గానరాదు."[1] ఇందువల్ల కంకంటి పాప రాజుకు పుష్పగిరి తిమ్మనార్యుఁడును, ధరణిదేవులరామమంత్రియు

---

1. ఆంధ్రకవుల చరిత్ర, పుటలు-459, 80, 84.

సమకాలికులనియును, వీరందఱు క్రీ. శ. 1790-వ సంవత్సర ప్రాంతమువారనియు నాంధ్రకవుల చరిత్రకారుల యభిప్రాయమని తెల్లమగుచున్నది కాని ధరణిదేవులరామమంత్రి కంకంటి పాపరాజునకును, బుష్పగిరి తిమ్మన్నకును సమకాలీనుఁడని రుజువు సేయఁగల సాధ్యమెందును గానరాదు. ఒకవేళ సమకాలీనుఁడని తార్కాలికముగ సంగీకరించినను ధరణిదేవులరామమంత్రి 18-వ శతాబ్దాంతము వాఁడుగాఁడు. అతఁడు క్రీ.శ. 17 వ శతాబ్దోత్తరార్ధమున నుండెననుటకుఁ బ్రబలమైన సాధ్యమతని గ్రంథమునఁనే కానవచ్చుచున్నది. దశావతారచరిత్ర కృతిపతియగు మగదల కృష్ణామాత్యుని ముగ్గురు పెదతండ్రులలో జ్యేష్ఠుఁడగు తిమ్మన "వీరవేంకటపతిరాయ విభువతంసభావితోభయ చామర భద్రదంతిదంత పల్యంకికాది సన్మానఘనుఁ" డని తెలియవచ్చుచున్నది.1 ఈ వీరవేంకటపతిరాయలు క్రీ. శ. 1630 మొదలు 1642 వఱకును వేలూరు నిజరాజధానిగ కర్ణాటక సామ్రాజ్యమును పాలించెను. ఇతఁడు తన పూర్వికులగు విజయనగర చక్రవర్తులవలె నాంధ్రభాషాభిమానియై యాంధ్రకవులఁ బోషించెను. వెంకటపతిరాయ దండకమున కీతఁడే నాయకుఁడు. చంపూరామాయణ కృతికర్తయగు ఋగ్వేదవెంకటాచలపతి కవియొక్క తండ్రియగు తిరువెంగళార్యకవిని "గొలకులాయపుఁ దేజి బలురా"తని సత్కరించెను.2 పెరియన్నయను కవి వర్యునిచే మీనకేతనాభ్యుదయమను నొక యాంధ్రప్రబంధమును గృహీనందెను. ఇట్టి భాషా పోషకునిచే మన్నన వడసిన మగదల తిమ్మన యతని సమకాలికుఁడని చెప్పకతప్పదు. మఱియు నీ తిమ్మనార్యుని కడగొట్టుతమ్ముఁడును, మగదల కృష్ణుని పినతండ్రియగు నారణపుత్రుఁడైన ఆదినారాయణుఁడు నవాబు సాహెబు వితీర్ణ

---

1. వావిళ్ల వారి దశావతార చరిత్ర. 1:35.

2. ఆంధ్రవాఙ్మయపరిషత్తువారి చంపూరామాయణము, 1:31.

సువర్ణ జాంబూనదాంబరాసనగ్రామ బహుమాన ధాసమాన నవ్య విభుఁ"డఁట.[1]

ఇందుబేర్కొనబడిన నవాబుసాహెబు సయ్యద్ మహమ్మదు మీర్ జుమ్లా. ఇతడు మొదట క్రీ. శ. 1689-వ సంవత్సరములో కర్ణాటకముపై నెత్తివచ్చిపులికాటు అనఁబడు ప్రళయకావేరి పట్టణమును ముట్టడించెను. కాని వెనుదిరిగిపోవలసివచ్చెను. క్రీ. శ. 1649 లో రెండవ పర్యాయము దాడివెట్టి తూర్పుసముద్రతీర భూముల నాక్రమించుకొని ప్రళయకావేరికధిపతులైన యొలందా వారి నదిమి కప్పముగొనెను. కావున మగదల కృష్ణుఁడును, ధరణి దేవులరామమంత్రియు క్రీ. శ. 1650-వ సంవత్సరపర్యంతము వారనుట నిశ్చయము.

ధరణిదేవుల రామమంత్రి క్రీ. శ. 17-వ శతాబ్దమధ్యమున నుండెనని పైనుదాహరించిన యాధారముల మూలమున స్పష్టపడి నది. కంకంటి పాపరాజును, పుష్పగిరి తిమ్మనార్యుఁడును రామ మంత్రికి సమకాలము వారగుట నిశ్చయమేని, వారును నప్పటివా రనియే చెప్పవలయును. పాపరాజు తమ్ముఁడును, గ్రంథరచనయందు పుష్పగిరి తిమ్మనార్యుని సాయమునఁడిన కఁకంటి నారసింహ రాజును వీరివలెనే క్రీ. శ. 17-వ శతాబ్దమధ్యమున వర్ధిల్లె ననుటకు సంశయింపఁబనిలేదు కదా.

విష్ణుమాయావిలాసముల యన్యోన్యసంబంధము.

ఈ వ్యాసారంభమునఁ బేర్కొనఁబడిన విష్ణుమాయావిలాస ముల కన్యోన్య సంబంధ మెద్దియేని కలదేమో విచారించవలసి యున్నది. వీనికన్నిటికిని నామమొక్కటియే సామాన్యమా, లేక ఇతివృత్తమునందుఁగూడ సంబంధముగలదా యను విషయములు

---

1. వావిళ్ల వారి దశావతారచరిత్ర, 1—58

విమర్శనీయములు. కాని ఈ కార్యమును సాగించుట కిప్పుడు సామగ్రి చాలదు. పై నాలుగు విష్ణుమాయావిలాసములలోను మూఁడు ముద్రితములైనను రోసనూరి వెంకటపతి కృత గ్రంథమిప్పుడెచ్చటను లభ్యము గాకయున్నది. పాపరాజు విరచిత యక్ష గాన మింకను నముద్రితము. కాని విష్ణుమాయావిలాసముల కన్నిటి కిని నామసామాన్యతయే కాక ఇతివృత్త సాదృశ్యమును గల దను టకుఁ గొంత యవకాశమున్నది. రోసనూరి వెంకటపతి విష్ణు మాయావిలాసమునుండి వీరేశలింగంపంతులుగారి యాంధ్రకవులచరి త్రలో నిక్రిందిపద్య ముదాహరింపబడియున్నది.[1]

"ఇటువలెనేమి యాపయన మిప్పుడు మీ రఱలేళ మాయలన్
బటువగు విష్ణుఁడం చనెడు పల్కులు సిద్ధము సుందరీక్రియా
కుటిల శిరోజయైన హరి గొబ్బునఁ జూచితిరేని మీకు నొ
క్కటఁ జపలత్వమైన తటి గౌరవ మెట్లగునో తలంపుడీ."

ఇది శివగర్వభంగకథ యందలిది. దీనిని యెల్ల నార్యుని విష్ణుమాయావిలాస నాటకములోని ఈ క్రింది పద్యములతోఁ బోల్చి చూడుడు.

"దేవరవు మిక్కిలియు గాం
తా వివశాత్ముఁడవు మనసు ధైర్యము చలనం
బై వచ్చెనేని మఱతువు,
భావింపఁగ సర్వభూప్రపంచము నెల్లన్."
"జగములు మూఁడునాతనివశంబుననున్నవి మాయఁజిక్కియూ
జగతి ప్రధానదైత్య సురసంయములుం గవలాసనుండు నా
దిగఁ గలవారలెల్ల వికృతిం బడుచుండ్రు తదీయలీలనే
మగునొ సుమీ మహోత్మ జలజాతునిచేత భవత్ప్రతాపముల్."[2]

---

1. ఆంధ్రకవుల చరిత్రము, పుట 375.
2. విష్ణుమాయావిలాసనాటకము, 4: 85—6.

ఈ యంశమును గంకంటి నారసింహారావు పట్టు వర్ణించి యున్నాడు:

"మరుఁడును బగవాఁడు మటుమాయలాఁడు
హరి మీర లాతని యాఁడు రూపంబు
చవ్వ సేయఁగన్న జగములలోన
నవ్వగు దవ్వగు నాడెమో పెంపు
జగములన్నియుఁ దద్వశమున వర్తిలెడు
జగతి ప్రధానులౌ సంయములున్నారులు
కమలాసనాదు లా ఘనుని మాయలను
భ్రమగొని యున్నారు ప్రాజ్ఞతలుడిగి."

దీనిఁ జూడగా రోసనూరి వెంకటపతి యెల్ల నార్యుఁడు చెప్పిన కథలనే తన గ్రంథమునందు వర్ణించెనేమో యను శంక కలుగు చున్నది.

విష్ణుమాయావిలాస యక్షగానమునందలి యితివృత్తమేమో తెలియదు. ఎల్ల నార్యుని బోలి పాపరాజును దనగ్రంథమును మదన గోపాలున కంకిత మొసంగి యుండుటచేత నితఁడెల్ల నార్యుని గ్రంథమునే యక్షగానముగ మార్చియుండవచ్చును. కాని పాపరాజవిరచిత యక్షగాన ప్రబంధము వెలువడువఱకును వాస్తవస్థితి యిట్టిదని చెప్పుటకు వీలులేదు.

ఇది యెట్లున్నను నారసింహకవి కృత ద్విపదప్రబంధమునెడ ఇట్టి సంశయమున కవకాశములేదు ఇది యెల్ల నార్యుని గ్రంథమునకుఁ బ్రతిచ్ఛాయ. ద్విపద విష్ణుమాయావిలాసను పూర్వోత్తరము లను ద్విభాగములుగ విభజింపబడియున్నను బద్యకావ్యమువలె నిదియు నై దాశ్వాసముల గ్రంథమే. పద్యకావ్యమున దువలె నిందును కథాప్రణాళిక శుకయోగివాగ్ధురినుండియే వెలువడు చున్నది. రెంటను ఉపకథకుఁడు గోవిందశర్మయే; కథాసుక్రమణి కయు నొక్కటియే; కథలును అవియే. పద్యద్విపద విష్ణుమాయా

విలాసనాటకముల యన్యోన్యసాదృశ్య మింతటితో ముగియలేదు. నారసింహకవి సాధ్యమైనంతవఱకు యెల్ల నార్యుని మాటలను, వర్ణనలను, లోకోక్తులను దన ద్విపదల యం దిమిడ్చెను. పద్యవిష్ణు మాయావిలాస నాటక పరిష్కర్త లీ ద్విపదకావ్యమును జదివి ముద్రిత గ్రంథములో దొరలియుండు నపపాఠములను సులభముగ దిద్దుకొని యుండవచ్చును.1 పద్యద్విపదకావ్యముల యన్యోన్య సన్నిహిత సంబంధమును దెల్పుటకై రెండు మూడు ఉదాహరణములనిచ్చి ఈ వ్యాసమును జాలించెదను.

లక్ష్మీగర్వభంగకథలోని కొలనివర్ణన—పద్యకావ్యము:
(2:23-24)

"కనుగొనియె నగ్రవీథిన్,
వనజాలయయొక్క దివ్యవనజాకరమున్
దనుపు సెడి వాడఁబాఱిన.
పనరుహకల్హార కైరవంబుతోడన్.
నిండారఁ జిగిరించి నిగనిగల్ చాలక
వాడిన నవపల్లవములతోడఁ
గలయంగఁ బూఁచి తేనెలు చిందునెత్తావిఁ
బొరయకఁ గందిన విరులతోడఁ

---

1. కార్కాణకై యొక్క అపపాఠము నిచట ఁజూపుచున్నాను. సముద్రమథనమువలన బుట్టిన విశేషములను వర్ణించు సందర్భమున— "కల్పపాదపపిఁఛకము నప్సరస్త్రీలు కామధేనువును జింతామణియును" అని సీసపాదమున గలదు. "పింఛక" శబ్దముకలదేమో విచారణీయము. కలిగినను సందర్భోచితముగాదు. ద్విపద యందిటున్నది:

"మఱియు దేవాసురుల్ మసలకయ్యుదధిఁ దరవగాఁ గల్పక
తరుపంచకంబు". "పింఛకము" అపపాఠము. "పంచకమే" సరియైన పాఠము, "వఁచైతే దేవతరవః" అని వామలింగానుశాసనము,

బరిపాకమునఁ బండి సరసమాధురిలేక
పదనింకిపోయిన పండ్లతోడఁ
మలయుటల్మాని! కొమ్మల విన్నయై యున్న
యలిపోతశుకపికా వలులతోడఁ
చిన్నవోయిన వనము వీఁకించి లక్ష్మి
యనుఁగు జెలులకుఁ జూపుచు నరిదిపడుచు
నెన్నఁడును జూడ మిటువంటి హేమవనము
శూన్యమై యున్నదిది యేమిచోద్యమొక్కొ."

ద్విపద కావ్యము (పుట 34):

"వనజాకరముఁ జూచె వాడు కల్హార,
వనరుహాకైరవావళిగలదాని
నిండారఁ జిగురించి నిగనిగల్లనక,
దండిమానినవాడుతలిరులతోడఁ
గలయబూఁచి మరందగంధముల్లేక.
తెలివిగైకొనకఁ గందినపూలతోడఁ
బరిపాకమునఁ బండి పదనింకి తీపు,
నెఱయక స్రుక్కియుండెడి పండ్లతోడఁ
మలయుటల్మాని కొమ్మల విన్నయైన,
యలికులశుకకోకిలాదులతోడఁ
జిన్నవోయిన వనిఁ జెంతనీఁకించి,
యన్నన బోఁడిలో నాశ్చర్యమంది

---

1. ముద్రితప్రతి, "మెలకువల్మాని" అని. దీనికి వాఙ్మయపత్రికుల లోని పాఠాంతరము. "మలయు....కొమ్మలవిన్నయైయున్న" అని యధోజ్ఞాపికయందు చెల్పఁబడియున్నది. ద్విపద విష్ణుమాయానాటకమున "మలయుటల్మాని" అని యున్నది "మలయుటల్మాని" అనఁగా, "సంచారము డిగి" యని యర్థము.

నన బోఁడులార నెన్నఁడు నిట్టిపోమ,
వనము గన్గొన మింతవన్నె యెందియును
నేల వాడినదొకో యీతోఁట యనుచు,
నాళి జనాళితో ననుచు నద్దివ్య
కమనీయ వనమెల్ల గలయ దర్శించి....."

బ్రహ్మగర్వభంగకథ యందలి మాయాసరస్వతి మదనవికార వర్ణన :

పద్యకావ్యము : (3·301)

"వెండియుఁదనకుందానే సంకల్ప దశావిశేషంబున.

కన్నీరునించు తొంగలి రెప్పలల్లాడ,
నొకమాటు ప్రియుఁడు రాకునికిజేసి
కంపించు నొకమాఱు కౌఁదిఁగె చెమరింప,
భర్తకౌఁగిట జేర్పఁ బట్టెనను చు
నవ్వులదేలు నాననమొప్పు నొకమాఱు,
పతితోడ భావించు భావరతికిఁ
బులకించు నొకమాఱు వలపుచన్నులక్రేవ,
లదర వల్లభులీల లాత్మ గోరి
యంగజుఁడు వెల్లిగొల్పంగ నంగకముల
నెల్లకళజాఱు[1] ధైర్యంబు పల్లటిల్ల
బ్రహ్మదేవునిపైఁ బ్రేమ భాఱవిడిచి,
వీణియను మీటిపాడుచు విద్రుమోష్ఠి.

దిప్పదకావ్యము (పుట 80):

వెండియు నొకకొన్ని వెడమాయలూని,
నిండువేడుకల నన్నీ రేజగంధి

---

1. "కళలూర" అను ద్విపదకావ్యపాఠమే యుత్తమమని తలఁచెదను.

కన్నీరునించు తొంగలి రెప్పలార్చు
మన్నించు పతిరాకమసలె నేఁడనుచుఁ
గంపించు నొకమాటు కోఁదీఁగె చెమ్మ
రింప గౌఁగిటను-జేరిచె నాథుఁ డనుచు
నవ్వులదేల్చునానన మొక్క మాటు
మవ్వంపు ముచ్చటల్మగఁ డాడె ననుచుఁ
బులకించు నొకమాటు భూరిమోహమునఁ
జెలువుని చెలువంబుఁ జింతించు కొనుచుఁ
గళలూర ధైర్యవై ఖరి కడతేరఁ
గలఁగు నొక్కకమాటు కాయజుండెంచ
నీరితి వీణవాయించుచు బ్రహ్మఁ
బ్రేరేచుకొఅకు నబ్బిత్తరియున్న."

నారసింహారా జిట్లు పద్య విష్ణుమాయావిలాసనాటకమును
మేలు బంతిగఁ గొన్నను దత్కర్తయగు నెల్ల నార్య నెచ్చటను
జేర్కొనకపోవుట చిత్రము.1

పాపరాజు - రోసనూరి వెంకటపతి

మీఁది వ్యాసమునందు రోసపూరు వెంకటపతి యను కవి యొకఁడు విష్ణుమాయావిలాస మను పద్యప్రబంధమును రచియించి వెంకటగిరి ప్రభువైన బంగారుయాచమనాయని కంకితము జేసెనని చెప్పియున్నాను ఈ కవిని గూర్చియు నాతని నాదరించి యాశ్రయమొసఁగిన ప్రభువునుగూర్చియు వీరేశలింగము పంతుల వారిట్లు వ్రాసియున్నారు.

---

1. చిత్రభాను సంవత్సర ఆషాఢ భారతియం దీవ్యాసము మొదట ప్రకటింపఁబడినది.

శ్రీకంకంటి పాపరాజవంశం

"కృతినాయకుఁడైన బంగరుయాచమనాచమపకుఁడైన బ
ఢిల్లీ చక్రవర్తిగా 1895 సంవత్సరమునందునంద 1895 సం
నెల్లూరి నవాబగు జుల్ఫ్‌గారిచేఁ జంపఁబడినండినా జుల్ఫ్‌గారిచేఁ
1890 ప్రాంతములందు రచియింపబడినదని చెప్పములక్ష్యము రచియియిం

వీరేశలింగంపంతులుగారు చేసిన కవికాలనిర్ణయము సరైన
నది కాదు. రోసనూరు వెంకటపతి విష్ణుమాయావిలాసము నంకిం
మిచ్చినది జుల్ఫకర్ ఖాన నిచేఁ జంపబడిన బంగరు యాచనునాయు
గ్గాదు. అతనిమనుమఁడైన బంగరు యాచమనాయనికి ఈవిషయఁ
వెంకటపతికృత విష్ణుమాయావిలాస పద్యప్రబంధపీఠికలోని,

ఏ బంగరేచ భూమీశ్వరపతి వీర
మాత సుపౌత్రుఁ డీమహినుతింప
నే కుమారేచభూమీంద్రుని పట్టంపుఁ
గోమలి కమ్మక్కకును సుపుత్రుఁ
డే బంగరేచ మహీమండలాధ్యక్షుఁ
డభినవవిష్ణుమాయావిలాస
సత్కృతికి నాథుఁడాతని సన్నుతింపఁ
దగిన నాదైనభాగ్య మెంతని వచింతు
ననుచు మదిలోన సంతోష మగ్గలింప
నెఱసి మటియును దృఢబుద్ధి నివ్వటిలగ.

ఈ పద్యమున వివరింపబడిన కృతిపతియొక్క వంశానుక్రమ
ణిక నిట్లు వ్రాయనగును:

బంగరేచభూమిపతి = భార్య, వీరమాత

కుమారేచభూమీశుఁడు = భార్య, అమ్మక్క

బంగరేచ మహీమండలాధ్యక్షుఁడు
అభినవ విష్ణుమాయావిలాసమున

సదరు విష్ణుమాయావిలాస కృతిపతియగు బంగరేచమనాయ కుఁడు శా. శ. 1644 ప్లవంగ (క్రీ. శ. 1722) సంవత్సరమున జనన మందెను; శా. శ. 1677 భావ (క్రీ. శ. 1755) సంవత్సరములోఁ బట్టాభిషిక్తుఁడాయెను; శా. శ. 1699. (క్రీ. శ. 1777) సంవత్సర మున మృతినందెను.1 ఇతనికి విష్ణుమాయావిలాస మంకితమొసఁగిన రోసనూరి వెంకటపతియు నప్పటివాఁడే యని నిస్సంశయముగ జెప్పవచ్చును. ఇచట స్మరింపదగిన విషయ మింకొకటి కలదు.

ఈరోసనూరి వేంకటపతి తన్ను గృతిపతి తండ్రియైన కుమా రేచమనాయకుఁడు "తిక్కయజ్వయసుచున్ జాలంగఁ బేరిచ్చి ప్రోచె"నని చెప్పుకొనియున్నాఁడు. అనఁగా నితఁ డాకుమారేచమ నాయని యాస్థానమందెకవియై వర్ధిల్లి యశనిచే సత్కరింపఁబడె ననుట తెల్లము. ఈ కుమారేచమనాయకుఁడు శా. శ. 1612 (క్రీ. శ. 1690)లో జన్మించి శా. శ. 1617 (క్రీ. శ. 1695) లో పట్టాభిషిక్తుఁడై, శా. శ. 1670 (క్రీ. శ. 1748) లోఁ బరమపదము నందెను. కావున రోసనూరి వేంకటపతి క్రీ. శ. 1700—1760 ల మధ్య జీవించియుండె నని చెప్పుట యొప్పగును.

ఇంతదూర మిచట నీరోసనూరి వెంకటపతిని గూర్చి యేల ప్రస్తావించవలసి వచ్చినదనఁగా నతఁడు కంకంటి పాపరాజకృత విష్ణు మాయావిలాస యక్షగానమును పద్యప్రబంధముగామార్చి బంగరు యాచమనాయకుని కంకితము గావించెను. ఇతివృత్తమును గథా సన్నివేశములును రెంటియందును నొక్కతీరుగనే యున్నవి; కాని తత్కారణమున పాపరాజకృత యక్షగానమునే వెంకటపతి పద్య కావ్యముగ విరచించెననుట సరికాదు; పాపరాజు యెల్లనార్యకృత విష్ణుమాయావిలాసనాటకములోని మోహిని కథను ఇంచుక యు మార్పక కైకొనియున్నాఁడు. వెంకటపతియున్నట్లె యెల్ల

---

1 శెట్టివారి పంచచరిత్ర

నార్యకృత గ్రంథమునె యనుసరించి యుండవచ్చును. పాపరాజ కృత యజ్ఞ గానమునకును వెంకటపతి విరచిత పద్యప్రబంధమునకును నితివృత్తమందును గథాసన్నివేశమునందును గానవచ్చు పోలిక లాకారణమున గల్గియుండవచ్చును. కాని ఇతివృత్త కథాసన్నివేశముల పోలికలుమాత్రమే కావు ఈ పట్టున వితర్కింపదగినవి. పాపరాజకృత గేయములను గొంచెపాటిమార్పులతో వెంకటపతి పద్యములు జేసియున్నాడు. ఈ క్రింది యుదాహరణము లీ విషయమును దెల్లము సేయఁగలవు.

పాపరాజు:—

కినుక రదనములు గిటగిట గీటువారు
మొగమెఱ్ఱజాఱ బొమ ముడివెట్టువారు
శివుని నిందింప వచ్చితె యనెడివారు
ఎటుల నీశ్వరు మహిమ లెఱుఁగు ననువారు
ఇచట నితని ప్రతిష్ఠ లేమనెడివారు.

వెంకటపతి:—

గిటగిట పండ్లుగీటుచును గ్రిక్కిరియున్ మునుచుట్టుముట్టియున్
బెటబెటలైన పల్కులను భీషణభంగులఁ బ్రేలియుగ్రునిన్.
దటవట లాడెనే యెదురు తన్ను నెఱుంగక పోవనీకుఁ డె
ప్పటిపలె వేగమేగదిసి పట్టుడు బాసకటారి బాపనిన్.
హానినిన్ నింద యొనర్పవచ్చితివె నీయాఖ్యాతమ ల్మాన కీ
శ్వరు మాహాత్మ్య మెఱుంగ నేర వితనిల్వన్ వద్దు లే లెమ్మయి
త్తరి నీవట్టిప్రతిష్ఠలన్ నిలుపు చా త్తబ్బిబ్బులం చిట్టు లం
దఱుగుంపుల్ గొనియాసురర్షి బహుబాధల్ పెట్టగాఁదొట్టినన్.

పాపరాజు:—

అలఁతినవ్వి మొగంబునను జెలువారగాము శంభుఁడు
పలికెఁ బరిహాసములు దాల్చిన ప్రభువుతోడన్

పంకజోదర నీవు స్త్రీరూపంబుదాల్చి మోహము
లంకురింపఁగఁ జేసితఁట దేవాసురులకు.
తెమల కావిధమెల్ల సురముని తెల్పినాఁడు మాచి
త్తమున కచ్చెరుపాటు సంతసము ఘటిల్లన్
సొలపుగల నీయాఁడురూపము చూడఁగోరివచ్చికి
సొలవ కప్పటిరూపు గ్రమ్మరఁ జూపుమిపుడు.
నన్ను ధిక్కరించినాఁడు నారదుండు నాతిరితి
సున్న నిన్ను గన్నభ్రమసి నన్ను నిన్ను మఱతు ననుచు
నావిర క్తి వై భవంబు నీవిశేషమాయ జగము
లీ విడించి ముఖులు దెలియ నింతి వగుము వింతయేల?
మరుని సంహరించి మి త్తి మద మణంచియున్న నన్ను
మరులుపరుప వశమె నీకు మాయదారి వగుచు రమ్ము.

వెంకటపతి:—

శంకరుఁ డభిముఖుఁడై యా,
పంకజనేత్రునకుమృదుల పద్ధతినను ని
శ్శంకుఁడయినారదుఁడు నను,
గొంకక నిందించె నిండు కొలువున నిన్నన్.
దానవకోట్లభ్రమింపగ
మానినివై నట్టి నీదు మతకరిమాయల్
నేను గనినంత మరులను
బూనుచుఁ బ్రాకృతిని లీలబుద్ధి చలింపన్
నావై రాగ్యంబతనికి
నీవిశ్వంబునకు దెలుప నెంచిన మతితో
నేపచ్చితి నిటకు న్ని
స్త్రీవిధమరయంగ నిపుడు సిద్ధముగాగన్.
మరుని జయించి మృత్యువు ప్రమ త్తవిధం బుడిగించి లోకభీ
కర గరళంబుమ్రింగి మురహు స్మర నీవెరుగన్ బసిద్ధినే

బరగిన ననొ్నకండనుట పాడియె కామినిగమ్మ్మవేగమే
గురుకొని తళుక్క నీకులుకు గుబ్బలునిక్కగఁ జూచిమెచ్చెదన్.

పాపరాజు:—

శైవుడొక్కఁడు బాఱఁజూచి మోహిని యనుచుఁ
గావరంబున నొకనిఁ గౌఁగిటను జేర్చెన్
జడలువీడఁగ మహేశ్వరు సేపకుం డొకఁడు
ఎడతెగక శివమెత్తి శివమూడఁ దొడఁగెన్
ప్రమథుఁడొక్కఁడు తమకపడిలేచి చెలియనుచు
భ్రమసి కంబము పైడిప్రతిమ ముద్దాడెన్
ఒకవీరమాహేశుఁడొద్ది శిష్యునిఁ జేరి
సకియేమొ యని వాని జడలు పట్టీడ్చెన్
ప్రమదమున నొక రుద్రభటుఁడు తనకుంచె యని
గమనించి యొకని గడ్డముపట్టి తీసెన్.

మెకటసతి:—

ప్రమథుఁడొక్కండొక్క ప్రమథుఁ దదాభమఁగాఁ
భావించి గడ్డంబు పట్టి తివియు
భ్రమగొని యొక రుద్రభటుఁడొక్క శివభూతఁ
గాంతగాఁ గనుఁగొని కౌఁగలించు
మఱియొక్క శైవుఁ డుమాహేశ్వరు సేప
కుని బడంతిగ నెంచి పెనఁగఁ బోవు
భవు భృత్యుడొక్కండు పసిడికంబపు బొమ్మఁ
గొమ్మని ముద్దాడుఁ గోర్కి మెఱయ.

ఇట్టివి యింకను పెక్కులు కలవు. గ్రంథవిస్తరభీతిచే నిచ్చట నుదాహరింపలేదు. పైనియుదాహరణములలోఁ గడపటి దానియందు

గమనింపదగిన విశేషమొకటి గలదు. అందు వర్ణింపబడిన ప్రమథుల చేష్టలు యెల్లనార్య నారసింహరాజుల విష్ణుమాయావిలాసము లలో బీజప్రాయముగ గన్పట్టుచున్నవి.

"ప్రమథు లన్యోన్య పరిరంభబద్ధులై రి,
వికలితేంద్రియులై వెడవిల్తుచేత" ని యెల్లనార్యుడును,
"పాయక యన్యోన్య పరిరంభణములు
సేయుచు ప్రమథులు చీకాకుపడిరి"

అని నారసింహరాజును సంగ్రహముగ జెప్పివిడచినారు. పాపరాజు దానిని విపులీకరించి సనోహరముగ వర్ణించినాడు. వెంకటపతి పాపరాజువర్ణన నల్లెకబళించినాడు. అంటితో దృప్తి నందక పాపరాజుయొక్క యత్నగానమందలి పద్యములను గొన్నిటి నలతిమార్పులతోను గొన్నింటిని యథాతథముగను దన పద్యకావ్యములో జేర్చుకొన్నాడు.

పాపరాజు:—

ఇటువలెఁ బెక్కురీతులు రహింగని యవ్వని జాఱుపైటతోఁ
జిటిపొటి చెమ్మటల్ దొలఁకు చెక్కులతో నెలదేటిరంతుతో
నటునిటు నోరమోమిడు నొయారముతో నొకపొన్నగున్నచెం
గట మయిసేదదీర్చుకొను కాంతగనుంగొనిశంభుఁడుబ్బుచున్.

ఈ పద్యము ఇంచుకమార్పుతో వెంకటపతి విష్ణుమాయా విలాసము మూఁడవ యాశ్వాసమునఁ గానవచ్చుచున్నది

అటువలెఁ బెక్కురీతు లలరారఁగ నవ్వని జాఱుపైటతోఁ
జిటిపొటి చెమ్మటల్ దొలఁకు చెక్కులతో నెలదేటిరంతు చే
నటునిబు నోరమోమిడు వయారముతో నొకపొన్నగున్నచెం
గట మయిసేదదీర్చుకొనుకాంత గనుంగొనిశంభుఁడుబ్బుచున్.

మఱియుఁ బైయాశ్వాసమునఁనె పాపరాజు పద్యములు మఱి కొన్ని గన్పట్టుచున్నవి.

హేరాళంబుగ బాళితాళుఁగొనలే కేనెంతో చింతింపఁగా
జేరంబిల్వపు గారఁింపపు దయం జేపట్టవింతే నటే
నేరంబెంచి మరుండు ననొ్దవఁగా నీకెంత సంతోషమో
యీరారాపులుమాని యేలుకొనవే యేమే జగన్మోహినీ.

ఇది యథాతథముగ వెంకటపతిచే గ్రహింపబడెను.

సోలుచు సరోజములఁ బాలుచు పరాగముల
రాలుచు రథాంగివలె గ్రావాలుచునుహోళిన్
గోలుచు మరందముల బోలుచు మిళిందముల
వ్రేలుచు దరీలతల దూలుచును గేళిన్
దేలుచు జలేభమున గూలుచు మృడాళములఁ
జీలుచు మరాళములఁ దోలుచును బాళిన్
బాలుచు ఖగార్భటిని నేలుచు కొలంకుదయ
మూలుచు తొగన్మెలఁగఁ బోలుచుఁ జెలంగెన్.

ఈలయాగ్రహిని వెంకటపతి యీక్రిందివిధమున తారుమారు చేసి తనకావ్యమునఁ జేర్చుకొన్నాఁడు

సోలుచు సరోజముల బాలుచు పరాగముల
రాలుచు రథాంగివలె గ్రావాలుచును గేళిన్
దేలుచు మృణాళములఁ జీలుచు మరాళములఁ
దోలుచు దరిన్ లతల వ్రేలుచును బాళిన్
గ్రేలుచు ఖగార్భటులఁ బాలుచు మిళిందముల
దోలుచు మరందముల గ్రోలుచును హోళిన్
గ్రాలుచు కొలంకుఁ బొరిమాలుచు జలేభమనఁ
జాలుచు సుధారుచుల నేలుచుఁ జెలంగెన్.

మటీయు

అనుచులేచుచు బొదలుచువో! యటంచు
నట్టె బయలాలకింపుచు....
యని బ్రమసి బయలు కొంగిట నాసుకొనుచు
నువిదలేకున్న నడలొందు చుండెనపుడు

ద్వితీయ పాచమున గ్రంథపాతముగల పాపరాజుగారి గీతపద్యము, వెంకటపతి ప్రబంధమునందు గుంచుకంత భేదముతో సంపూర్ణముగ గలదు.

అనుచు లేచుచుఁ బొదలుచువో! యటంచు
నట్టె బయలాలకింపుచు నదిగొ కాంత
యనుచు భ్రమగొని కొంగిట నదిమికొనుచు
నువిదలేకున్న నడలుచు నుండెనపుడు.

మటీయు,

అడుగులు దొ్రలంగనిటులంగన కొంగిట నుంచుకొన్నయ
ప్పుడె తనువెల్ల జెమ్మరిలబోయిన జాటి శుక్ల మేఘులై
మడుగులుకాల్వలై ధరణిమండలి సోనచోటు లెల్లఁబు
త్తడియును వెడిదై తగ నతండును గాంచెను పారవశ్యమున్.

అను పాపరాజు పద్యముయొక్క ప్రథమపాదమును మార్చి తక్కిన మూఁడుపాదములు నట్లె సంగ్రహించినాఁడు వెంకటపతి

కడువడి నంగనన్ చిగువు కొంగిట బిగ్గుగ జేర్చుకొన్నయ
ప్పుడె తనువెల్ల ఝుమ్మురన బోరనబాటిన శుక్ల మేఘులై
మడుగులు కాల్వలై ధరణిమండలి సోకినచోటు లెల్ల బు
త్తడియును పెండిరై తగె నతండును గాంచెను పారవశ్యమున్.

ఇందు ద్వితీయపాదమందలి "ఝుమ్మురు" అనునది ధ్వన్యనుకరణశబ్దము. ఒకవేళ పరమేశ్వరుని శుక్ల మేఘులై పాటినప్పుడిట్టి ధ్వనిపుట్టెనని యనుకొందమన్నను, "తనువెల్ల" యనుమాట కన్వ

యము గుదురదు. శుక్లము పరమేశ్వరుని దేహామంతటను బాఱి యుండదుకదా. శుక్లము పాఱినపుడు దేహమున స్వేదము పుట్టుట సహజము. "తనువెల్ల జెమ్మరిల" అని పాపరాజు చెప్పినది సరి సందర్భశుద్ధిని గమనింపక వెంకటపతి "చెమ్మగిల" యను దానిని "ఝమ్మురన" అని మార్చినాడు.

తిక్కయజ్వయని పొగడ్తనందిన పౌఢకవి వెంకటపతి పాప రాజు పద్యములనేల సంగ్రహించుకొనవలసివచ్చెనో! కాని యా విత ర్కమున కిది తరుణము కాదు; పాపరాజుపద ములను సంగ్రహించు కొనుటవలన యతడు దనకంటె బూర్వుడని రుజువుచేసినాడు వెంకటపతి. వాఙ్మయచరిత్రకారు లందుకై యుతనికి గృతజ్ఞత చూపవలసియున్నది.

వేంకటపతి కీ శ. 1700—1760 ల మధ్య వర్ధిలెనని ముందు చెప్పియున్నాడను; అతడు చూఱగొన్న విష్ణుమాయా విలాస యక్షగాన కర్తయగు పాపరాజు అంతకంటె బూర్వుడై యుండవలెను ఎంత పూర్వుడో? కనుగొనుటకు సాధ్యపడునేమో చూతము. ఇటీవల శ్రీ యస్. వి. జోగారావుగారు పాపరాజు యొక్క కాలనిర్ణయము సేయఁబూనుకొని రెండు ముఖ్యాంశము లను దెల్పినారు. ద్విపద భాగవతకర్తయైన తేకుమళ్ల రంగశాయి తన కావ్యగ్రంథ రచన యందు పుష్పగిరితిమ్మన సహాయుఁడనిచెప్పినాఁడు. ఈపుష్పగిరితిమ్మన కంకంటిపాపరాజునకును, నతని తమ్ముడైన నార సింహరాజునకుగూడ గ్రంథరచనా సహాయ్యుఁడని యీ వ్యాసముయొక్క పూర్వభాగమున జెప్పియున్నాఁడను. కావున వీరందఱును సమకాలికులనుట తెల్లము. మఱియు ముందు పేర్కొ నిన తేకుమళ్ల రంగశాయి,

"రామాయణంబు భారతమును ద్విపదలై
మీఱంగజేసిన యారంగనాథు
ధీరు బట్టేపాటి తిరుమలభట్టుగారి
పౌఢోక్తులు గలుగ స్మరించి"

యని రంగనాథుని బట్టేపాటి తిరుమలభట్టును స్మరించి యున్నాఁడు. ఈ బట్టేపాటి తిరుమలభట్టే ద్విపద భారత రచయి తలలోఁ బ్రముఖుఁడైన తిమ్మకవి. అతఁడు దనచేరచింపఁబడిన విరాట పర్వమును జంగాలమున్మయ కంకిత మొసఁగెను; మున్మయ యల్లుఁడైన పాలచూరికృష్ణభూపతికి దెనాలిరామకృష్ణుని మనుమఁ డైన రామభద్రికవి స్వవిరచిత ఇందుమతీపరిణయము నంకితమిచ్చెను. రామభద్రికవి దనకావ్యమును క్రీ. శ. 1575 ప్రాంతమున రచి యించియుండును; కాన దత్కృతికర్తయైన పాలచూరి కృష్ణవిభుఁ డును, నతని మామగారైన జంగాల మున్మయయు నతనికి విరాట పర్వము నంకితము జేసిన తిమ్మ (బట్టేపాటి తిరుమలభట్ట) కవియు నప్పటివారలే కావలెను. ఆ బట్టేపాటితిమ్మకవిని బేరొక్కనిన రంగ శాయికవియు నతనికి సమకాలికుఁడో యర్వాచీనుఁడో కావల యును. అర్వాచీనుఁడన్నను తగనులేదు; కాని సమకాలికుఁడనుటయే సమంజసమేమో యని పించుచున్న ది. కారణము రంగశాయి ఆపేరొక్కనుటలో "గా" దను శబ్దము ప్రయోగించుట. సమకాలి కుల యెడనే అట్టి మర్యాదను పాటించుట వరిపాటి. అదియును రంగశాయియు బట్టేపాటి తిమ్మకవియునిద్దరును నెల్లూరుమండలము వారు. రంగశాయి సమకాలికులని రూఢియైన ప్రసన్నగిరి తిమ్మ కవియు, కంకంటి పాపరాజుకూడ నెల్లూరుమండల కవులే. సలుగు రొకరిగురించి యొక జాటీగియేయుందురు." కావున కంకంటిపాప రాజు క్రీ. శ. 1575 ప్రాంతమువాఁడు కావలయును.1

ఈవాదము సత్తలేనిది. రంగశాయి బట్టేపాటి తిరుమలభట్టును బేరొక్కనప్పుడు "గా" రని చెప్పినంతమాత్రమున వారిరువురును సమకాలికులనుట సరికాదు. పూర్వికులయెడను నాశబ్దము వాడ

---

1. ఆంధ్రపత్రిక సారస్వతానుబంధము, ఆదివారము ఆగస్టు 7వ తేది 1955. పుట-ల.

వచ్చును. అట్లువాడినవారును గలరు. బట్టేపాటితిమ్మన, తేకుమళ్ల రంగశాయి, పుష్పగిరి తిమ్మన, కంకంటి పాపరాజు ఈ నలుగురును నెల్లూరు మండల కవులగుట తథ్యమే. తత్కారణమున వారేక కాలమువారని చెప్పుట సమంజసము కాదు.

శ్రీ జోగారావుగారు తెల్పిన రెండవ యంశము బలవత్తర మైనది. అది యిది: "మదరాసు ప్రాచ్యలిఖితపుస్తక భాండాగార మున కంకంటి పాపరాజు నుత్తరరామాయణప్రతులు చాలగలవు. అందు డి నం. 9. తాళపత్రప్రతి యఖిలితమై ప్రాచీనముగ గన్పట్టును. దానిచివర పరిధావిత్పత్తినామ సంవత్సర పుష్యబహుళ ఏకాదశీలు శనివారమువఱకు మునగాల తిరువెంగలయ్య వ్రాసిన ఉత్తరరామాయణము సంపూర్ణము" అని కలదు. ఇది శ్రీ స్వామి కణ్ణుపిళ్లైగారి ఇండియన్ ఎఫిమెరిస్ ప్రకారం క్రీ శ. 1832-వ సంవత్సరం జనవరి యేడవ తేదీకి సరిపోయినది. శకసంవత్సర సంఖ్య చెప్పబడినప్పుడుకూడా క్రీ. శకపు తేది నిర్ణయించుటకు సంవత్సర మాసపక్షతిథులతోపాటు విధిగా వారమైన చెప్పబడిననే అది పాసగును. మన సంవత్సర షష్టిచక్రము మరల మరల నావృతమగుచునే యుండును. ఆమాసము లాపక్షము లాతిథులే యథాపూర్వము సంభవించును. వానితోపాటు వారనిర్దేశమైనచో అవియన్నియు గుదిరిన తేది మరల మరల సంభవించుట కాదాచిత్కము. కాని కేవల మసంభవమని తలపరాదు! ఒక్కొక్కప్పుడు మూడు నాలుగావృతులకే యది సంభవింపవచ్చును. కాని ప్రస్తుత సందర్భమున క్రీ. శ. 1832 తరువాత నేటివరకు మరల నట్టిది తటస్థింపలేదు.

1. శా. శ. 1782 ప్రజోత్పత్తి పుష్యబహుళ ఏకాదశీలు, సోమవారము ఘటికలు 32 పలములు 12 = (క్రీ. శ. 1871 మార్చి 5-వ తేదీ శుక్రవారము.)

2. శా. శ. 1733 పరిధావిత్పత్తి పుష్యబహుళ ఏకాదశీలు, శుక్రవారము 31 ఘటికలు 37 పలములు = (1811 ఫిబ్రవరి, 10-వ తేదీ శుక్రవారము.)

3. శా. శ. 1674 ప్రజోత్పత్తి పుష్యబహుళ ఏకాదశీలు, మంగళవారము = (క్రీ. శ. 1753 జనవరి 30-వ తేదీ మంగళవారము.)

4. శా శ. 1613 పరీజోత్పత్తి పుష్యబహుళ ఏకాదశీలు, సోమవారము (క్రీ. శ. 1692 జనవరి 4-వ తేదీ సోమవారము.)

5. శా. శ. 1553 పరీజోత్పత్తి పుష్యబహుళ ఏకాదశీలు, మంద(శని)వారము = (క్రీ. శ. 1632 జనవరి 6-వ తేదీ శనివారము.)

కావున (శ్రీ) జోగారావుగారు చెప్పినట్లు ఆ దీన మా తాళ పత్రప్రతిని మునగాల తిరువెంగలయ్య ప్రాసిముగించిన దినమని చెప్పవచ్చును. ఇందువల్ల కంకంటి పాపరాజు క్రీ శ. 1632 కు ముందు వర్ధిల్లెనని యు నుత్తరరామాయణ మప్పటికి వాసికెక్కి జనాదరమును బడసియుండె ననియుఁ దేలుచున్నది. అంతకు ముం దెప్పుడాతఁడు వర్ధిలెనో నిశ్చయించి చెప్పుటకు సాధ్యపడదు. కాని, కవితా ఫక్కికను, శబ్దజాలమును బట్టిచూడ కంకంటి పాపరాజుగారి యు త్తరరామాయణము క్రీ. శ. 16-వ శతాబ్దపు టు త్తరార్ధమున అనఁగా క్రీ. శ. 1550-1600 మధ్య రచియి. పబడి యుండునని తోఁచుచున్నది.

కదిరీపతి - శుకసప్తతి

ఆంధ్రపద్యకథావాఙ్మయమున శుకసప్తతి స్థానము మహోన్నతమైనది. నేఁడు మనకు లభ్యమగు పద్యకథాగ్రంథ ములయందు శుకసప్తతిని మించినదికాని, సమానమైనది కాని కానరాదు. ఈ గ్రంథమును పరామర్శించుటకుముందు దాని రచయిత కదిరీపతినిగూర్చియు నతని కాలమునుగూర్చియుఁ గొంత చెప్పవలసియున్నది. ఇతఁ డెప్పటివాఁడో, మన్న దేశ మెద్దియో ఇంకను చక్కఁగఁ దెలియదు. దీనికి ప్రధాన కారణ మీతని గ్రంథముయొక్క కృత్యాద్యవతారిక చిరకాలమువఱకు లభ్యపడక పోవుటయే. కృత్యాద్యవతారిక దొరికిన పిమ్మటఁ గూడ అందుఁ బేర్కొనఁబడిన చరిత్రాంశములు సుబోధములు గాకపోవుట మఱి యొక కారణము.1


---

1 ప్రథమముగ కందుకూరి వీరేశలింగంపంతులుగారును (సం. కా. చ. పుటలు 58-61); దదనంతర కొచ్చర్లకోట రామచంద్రనేంకటకృష్ణ రావుప తులుగారుమ (శుకసప్తతి ప్రథమముద్రణ పీఠిక) కవిత్వశైలిని బట్టియు, నాఖ్యానాంతగద్యమునబట్టియు కవిదేశకాలములను నిర్ణయిం చిరి. ఈ కృత్యాద్యవతారిక లభ్యమైనపిమ్మట క్రొత్తపల్లి సూర్యారావు గారు ఇటీవల వాపోవారిచే వ్రాయఁబడిన శుకసప్తతి ద్వితీయముద్రణ పీఠికయందు మరల నీవిషయమును జర్చించిరి. అటుపైను నిడదవోలు వెంకటరావుగారు అవతారికలోఁ జెప్పఁబడిన చరిత్రాంశముల నాధార మఁచుకొని కవికాలమును జక్కఁగ నిర్ణయించిరి (చూ. ఆంధ్ర. సం 3, పుటలు 89-93).

కదిరీపతి తనది క్షత్రియకులమనియుఁ, జంద్రవంశాంతర్గత మైన యాదవాన్వయ మనియుఁ జెప్పుకొనియున్నాఁడు.1 యాదవాన్వయములోఁ శాలవేకరికులమను నొక యంతశ్శాఖ పొడమెను. ఈశాఖవారిది యచ్యుతగోత్రము. ఈవంశమువారిలోఁ బెదయౌబళుఁ డను నతఁడు తాడిగోళ్ల పురమున నివసించుచుండెను; ఇతఁడు రాయలచే నశ్వావారణరత్ననవరత్నహారాంబరములను సమ్మానముగాఁ బడసెను; అళిరామ రాజేంద్రబలవద్రిపుల ద్రుంచు కలని కితఁడు కర్తయాయెను; కదిరాకమునతెర్క మొదలగు బహురాజ్యము నేలెను; మఱియు రాయలొసఁగిన హనుమన్నాగారి చిహ్నములఁ బొందెను. శాద్రినృసింహస్వామికి క్రోడుగలు మొద లైన గ్రామములను దానముజేసెను; ఇతని పుత్రుఁడు నారశౌరి; అతనికిఁ దొమ్మండ్రుకొడుకులు; వారిలో నౌబళనాయకుఁడు ప్రఖ్యాతుఁడు; ఔబళనాయకుని పట్టపుదేవి బాలమ; ఈదంపతుల పుత్రుఁడు కరియమాణిక్యరాజు; ఇతఁడు రామదేవరాయల సరిగద్దియ నొడ్డోలగమునఁ గూర్చుండెను; రామరాయ లితనికి శాళి చౌకళికాళాంజిచామర ద్వయమౌక్తికతురావాహనమును, బిరు దాంకవారమును నిచ్చి గౌరవించెను. ఇతనికి వసంతాధీశుఁడు, రామాధిపుఁడు, నారప్రభుఁడు, కదుగోర్వీపాలుఁడు ననుపుత్రులు నలుగురు కలిగిరి. రెండవ కుమారుఁడగు రామరాజు శ్రీరంగ రాయదత్తమత్స్యకరధ్వజాధ్యుఁడై మధురధర్మభరణత రహిం చెను; రామరాజునకు రఘునాథరాజను కుమారుఁడు కలిగెను; రామరాజుయొక్క కడగొట్టుతమ్ముఁడు కదురరాజు; ఇతఁడు కదురమయంచు కదిరీపతి వేంకటరాజు లను కుమారుల నిరువురిఁ బడ సెను.2 ఈకదిరీపతియే శుకసప్తతి రచయిత. పైవర్ణింపఁబడిన వంశ క్రమము నిట్లు తెలుపవచ్చును:

---

1. శుక. 1: 15-18.
1. శుక. 1: 18-76.



వంశకర్తయగు పెదయౌబళరాజు కృష్ణదేవరాయల యల్లుఁడగు నళియరామరాజునకు సమకాలీనుఁడు. అళియరామరాజు సదాశివదేవరాయలను విద్యానగరసింహాసనము నెక్కించి యతనికి బతిగ క్రీ. శ. 1542 మొదలు 1565 వఱకును గర్ణాటసామ్రాజ్యమును గడు దర్పముతో పాలించెను కావున నతని బలవద్విపుల ద్రుంచు కలనికిఁ గర్తయైన పెదయౌబళరాజును నప్పటివాఁడు కావలయును. అశ్వావారణరత్న నవరత్నహారాంబరంబు లీయౌబళ రాజునకిచ్చి సత్కరించిన రాయలు సదాశివరాయలై యుండవల యును. సదాశివరాయల కాలమున నచ్యుతగోత్రు లుండినట్లు కొన్ని శాసనములవల్ల తెలియవచ్చుచున్నది. శాలివాహనశకము 1488 (క్రీ. శ. 1566) నాఁటి యొక కన్నడశాసనమున "అచ్యుత గోత్రోద్భవరాద మహానాయకాచార్యరాద రాళకోశె తిరవింద

నాయకర....నాగెనాయకరు" వేరొక్కనఁబడియున్నాఁడు.1 గోత్ర మును. బిరుదమును సామాన్యమే యైనను ఇంటిపేరులు భిన్నమగు టచే వీరికిని, తాడిగోళ్లవారిని జ్ఞాతిసంబంధము లేదని చెప్పవలసి యున్నది. తాడిగోళ్ల పెదయాబళరాజుప్రస్తాప మప్పటి శాసన ములయం దెందును కానరాదు ఇతని కొమారుఁడగు నారరాజును, మనుమఁడగు నాబళరాజును నంటి ప్రముఖులు గారు. వారిని గురించి తెలియవచ్చు చరిత్రాంశము లెవ్వియు లేవు.

రెండవ యాబళరాజుకుమారుఁడు కరియమాణిక్యరాజు. ఇతఁడు రామదేవరాయల సరిగద్దివై గూర్చొని యొడ్డోలగముండె నట. రామదేవరాయలు క్రీ శ. 1618 మొదలు 1630 వఱకుఁ గర్ణాటకసామ్రాజ్యమును పాలించియుండుటచేత నితఁడుగూడ నప్పుడే వెలసెనసుట నిశ్చయము. కరియమాణిక్యరాజు పెద్దకుమా రునిగూర్చి విశేషాంశము లెవ్వియుఁ దెలియవు; కాని యొకానొక కోలారుమండలశాసనమున తాడిగోళ్ల వసంతనాయఁడును, నతని కుమారుఁడు తిమల నాయఁడును పేర్కొనఁబడియున్నారు.

"శ్రీరామ [॥*] తారణసంవత్సర మాఘ శు॥ 5 లు శ్రీమన్మహానాయంకాచార్యులయిన తాడిగోళ వసంతనాయని తిరు మలపనాయనిగారు యనుములయఅమరడి కొమారుణ్డు తిమ్మరడికి యీ కొరికపల్లి స్థాన తాము కట్టించిన చెఱువుకింద...."2.

ఈ శాసనమున శకాబ్దము లేకపోవుటచేల్ల దీనికాలమును నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. శాసనపరిష్కర్తలయిన లూయీ రైసుగారు క్రీ. శ. 1704 నాఁటిదని యూహించియున్నారు. శాసనము వ్రాయించి నిలిపినాతఁడు తిరుమలపనాయఁడగుటచే నతని తండ్రియగు వసంతనాయఁడు తత్పూర్వము 17 వశతాబ్దమున

---

1. Mys. Arch. Rep. 1924 No. 89.
2. EC. X. sp 98.

వెలసియుండునని చెప్పవలసియున్నది. ఈ శాసనకాలమును నిర్ణయించు సందర్భమున గమనించదగిన యంశమొకటి కలదు. తాడిగోళ్ల నాయకుల శాసనములు పెక్కు గలవు వారి వంశావళి వానిమూలమున గొంత తెలియవచ్చుచున్నది. ఈ వంశావళిలో వసంతనాయడెవ్వడును గానరాడు: తాడిగోళ్ల కరియ మాణిక్యనాయనికి పుత్రుడు వసంతనాయ డొకడుండినట్లు శుకసప్తతి కృత్యవతారికలో జెప్పియుండుటచేతను, నీ వంశమున నెవటను వేరొక వసంతనాయడు కానరాకపోవుటచేతను పై నుదాహరింపబడిన కోలారు మండలపు శాసనములోని వసంతనాయడు కరియ మాణిక్యనాయని జ్యేష్ఠపుత్రుడగు వసంతనాయడే కాని యన్యుడు కాడని తలచెదను. అగునేని పై శాసనము వ్రాయించిన తారణాబ్దము క్రీ. శ. 1704 నాటి తారణాబ్దము కాక దాని కఱువదియేండ్లకు ముందు గతించిన క్రీ. శ. 1644 నాటి తారణాబ్దమై యుండవలయును.

కరియమాణిక్యరాజు రెండవ కుమారుడగు రామరాజు తన వంశము వారిలో బేరెక్కినవాడు. ఇతడు 'శ్రీరంగరాయదత్తమత్స్యమకరధ్వజాధ్యుడై మధుర ధర్మ భరణతరహించు'నని శుకసప్తతి తెలుపుచున్నది. మత్స్యమకరధ్వజములు మధురనాయకులవి. ఈ సీసపాదమువల్ల మధురనాయకులతో శ్రీరంగరాయలకు పొసగిన యుద్ధమున రామరాజు సహాయమొనర్చి జయము జేకూర్చగా రాయ లతనికి మధురనాయకరాజ చిహ్నములనొసగి గౌరవించెనని తోచుచున్నది. ఇది యెంతవఱకు సత్యమో కనుగొనవలసియున్నది. ఈ శ్రీరంగరాయలు కర్ణాటసామ్రాజ్యపాలకులలో గడపటివాడగు మున్మడి శ్రీరంగరాయలు. వేలూరుచంద్రగిరులు రాజధానిగ క్రీ. శ. 1612 మొదలు 1649 వఱకును ప్రజాపాలన మొనరించెను. దేశద్రోహులైన మధురతిరుమల నాయకుడును, చెంజి వరదప్పనాయకుడు నతనిపై దిరుగబడి కప్పము కట్టక పరాకరించిరి. మున్మడి శ్రీరంగరాయలు సింహాసనము నధిష్ఠించినవెంటనే దక్షిణదేశపు నాయకులపై దండువెడలెను. అతని నెదిరించుటకై తిరుమలనాయడు చెంజివరదప్పలోడను, తంజావూరి విజయరాఘవ గలసి బయలువెడలెను. విజయరాఘవుడు మిత్రద్రోహమో లతో జేరెను.

"శ్రీరంగరాయలఁ జేసట్టి నిలిపి
యారాయకార్యంబు లొఁగాదటంచు
దుండగించిన పాండ్య తుండీరపతుల
ఖండించి వాకిలి గావఁజేసితివి."

అని విజయరాఘవుఁడు దన రఘునాథాభ్యుదయ నాటకమునఁ జెప్పు కొనియుండుటచేత, నితఁడు శ్రీరంగరాయలఁ గూడి మధురచెంజినాయకులతో యుద్ధముజేసి వారి నోడించినట్లు తోఁచుచున్నది. తాడిగోళ్ల రామరాజునకు భుక సప్రతిలో జెప్పినట్లు రాయలు మత్స్యకుకరధ్వజముల నొసఁగి గౌరవించిన దీసమయమునందే యని తోఁచుచున్నది. ఇట్లు మొదట జయముకలిగినను, మధురచెంజినాయకులు శ్రీరంగరాయలతోఁ బ్రతిఘటించి హిందూజాతికి సహజ వికోధులను హిందూస్వాతంత్ర్య నిర్మూలనమునకుఁ గంకణము కట్టుకొని యుండిన దక్కను మహమ్మదీయసుల్తానులకు లంచమిచ్చి దేశములోనికి రప్పించిరి. ఈ సందర్భమున నడచిన యుద్ధములలో రామరాజు శ్రీరంగ రాయలపక్షమున పోరిన ట్లప్పటి డచ్చివారి వాణిజ్యాగార దినసరి పుస్తకము లందు చెప్పియున్నది.

క్రీ. శ. 1615 డిసెంబరులో బిజాపుర సర్దారుఁడు ఖానెఖానుఁడును, గోలకొండ నుండి మీర్‌జుమ్లాయు నెత్తివచ్చుచున్నారని విని, హిందూరాజ్య మును దేవాలయములను బ్రాహ్మణులను ధర్మమును మహమ్మదీయులు ధ్వంసము సేయనుద్యమించియున్నారనియు వారి నెదుర్కొని పాఱఁదోలుట కందఱు నేకీభవించవలసినదనియుఁ గోరెను. అప్పుడే బిజాపురసైన్యాధ్యక్షుఁడగు ముస్త ఫాతో సంధిప్రయత్నములు గావించెను. తన దళవాయియగు రామరాజును ఖానెఖానును నెదిరించుటకై తిరుపతిదిక్కున కంపెను. శ్రీరంగరాయల దళవాయి రామరాజు కడుసమర్థుఁడు.[1]

---

[1] ...దుపల్ల రామరాజు క్రీ. శ. 1642 - 45 ల మధ్య శ్రీరంగరాయల ...డెనని నిశ్చయపడుచున్నది. ఈ విషయ మీతని కాసనముల

Compagnie als zeemsgerdheid in Azie of Macleod
English Analysis by Prof. K. A. N. Sastri.

వల్ల దృఢమగుచున్నది. మొదట పేరొక్కనఁదగినది సీగలపాల్యపు శిలా శాసనము,

1. యీశ్వరసంవత్సరఆషాఢ బ ఏ
2. శ్రీమన్ మహానా[య]ంకాచాయ్యఁ...
3. తాడిగోళ్ల రామప్పనాయఁడు.....
4. సీగలపాలెంచెఱువులొంమగా.....
5. నవీరముస్థిరాచంనగారికు కరి
6. యమాణిఖ్యనాయనికిపుణ్య...
7. గాధారబోనిచ్చి గ్రామం
8. ఇదుయవరుతప్పిన
9. నకఁప్రాప్తిఅవును.1

ఇందు తాడిగోళ్ల రామప్పనాయనికిని, మాణిక్యనాయనికిని గల సంబంధ మెట్టిదో చెప్పలేదు: కాని తాడిగోళ్లవంశమునం దంతటను, రామరాజుతండ్రి యొక్కఁడే కరియమాణిక్యనామధారి కానవచ్చుచుండుటచే సీగలపాల్యపు శాసన మునఁ బేరొక్కనఁబడిన కరియమాణిక్యనాయఁడును, నతఁడును నొక్కఁడే యనియు రామప్పనాయఁడే యతని కుమారుఁడగు రామరాజనియుఁ దోఁచు చున్నది. శాసనమున శకాబ్దము లేకున్నను నందుదాహరింపఁబడియుండు ఈశ్వరసంవత్సరమునుబట్టి దాని కాలము క్రీ. శ. 1637 అని తేలుచున్నది.

ఇంతకంటె ముఖ్యమైనది సోమయాజులపలి తామ్రశాసనము. ఇది యుంగరాల నారాయణప్పయను బ్రాహ్మణునికి రామరాజు, లేక రామప్ప యొసఁగిన భూదానమును దెలుపుచున్నది.

1. స్వస్తి విజయాభ్యుదయశాలివాహనశకవర్షంబులు 1587 అగు
2. ననేయటివిళ్వావసునామసంవత్సర చయిత్రశుఁలు శ్రీమద్రాజాధి రాజ పరమేశ్వర శ్రీవీరప్రతాప శ్రీవీరశ్రీరంగ

---

1. E. C. X. Ci. 148.

3. రాయదేవమహారాయఅయ్యవార్లు ఘనగిరి దుర్గమందు ప్రథ్వీ సామ్రాజ్యంచేయుచుండగాను

4. అచ్యుతగోత్రపవిత్రులైన శ్రీమన్మహానాయకాచార్యులైనతాడిగోళ్ల ఓబళిరా

5. యనివారిపౌత్రులై నకరియమాణిక్యనాయని వారిపుత్రులయిన రామప్ప గారనేమేము

6. భారద్వాజగోత్రంకాత్యాయనసూత్రం ఋక్ల యజుశ్శాఖాధ్యాయులయిన వ్రంగరాల

7. లక్క-య్యపౌత్రులయిన హరియప్ప పుత్రులయిన నారాయణప్ప అనే మీకువ్రాయించి ఇ

8. చ్చిన భూదానధర్మశాసనం...[1]

ఈ దానశాసనము వ్రాయించిన శా. శ. 1587. విశ్వావసు. చైత్ర. శు. ౯. క్రీ. శ. 1685. మార్చి. తే 15 దికి సరిపోవుచున్నది. ఋకసప్తతి కృత్యాదియందు వర్ణించియుండు కదిరీపతి వంశమును. ఇందుపేర్కొనియుండు వంశమును ఒక్కటియే. దానశాసనమున వ్రాయించిన రామప్పయే కదిరీపతి యొక్క పెదతండ్రియగు రామరాజు. అచ్యుతగోత్రమును, తాడిగోళ్ళ గృహనామమును ఓబళరాయ కరియమాణిక్య నాయక యను తాతతండ్రులపేర్లును వారి వ్యక్తిత్వమును స్థిరపఱచుచున్నవి. ఉదాహృతశాసనాదిసాక్ష్యము ననుసరించి రామరాజు, లేక రామప్ప క్రీ. శ. 1637 మొదలు 1665 వఱకు నుండెనని నిస్సందేహముగ జెప్పవచ్చును.

ఈ రామరాజునకు రఘునాథుడు అనుకుమారుడొకడుండినట్లు ఋకసప్తతియందు చెప్పియున్నది కిదా. ఇతని ప్రశంసగూడ శాసనములందుగలదు. క్రీ. శ. 1648 నాటి యొక శాసనమున నొక మహానాయకాచార్య రఘుపతినాయడు పేర్కొనబడియున్నాడు.[2] కాని ఇతడు తాడిగోళ్ళకుటుంబమునకు జెందినవాడో కాడోనిశ్చయించిచెప్పుటకుదగిన యాధార మీశాసన

1. Mys. Arch. Rep. 1924 No. 105.
2. Mys. Arch. Rep. 1924. No. 88.

మునం దేమియుఁ గానరాదు. క్రీ. శ. 1722 నాఁటి యొక శాసనమున నితని ప్రస్తావన కానవచ్చుచున్నది. ఇతని మునిమనుమఁడగు రాయపనాయకుఁడు దన వంశక్రమము నిట్లు చెప్పుకొనియున్నాఁడు: "అచ్యుతగోత్రోద్భవులైన శ్రీమన్మహానాయకాచార్యులయిన తాటిగోళ్ళ రఘుపతినాయకుల ప్రపౌత్రులయిన కదిరీపతిరాయనాయకులు ఇచ్చిన శాసనము."[1] ఇందు రఘునాథ, రామప్ప, కదిరీపతి, రాయనాయకులను నాలుగుతరముల తాడిగోళ్ళ నాయకుల పేర్లు గానవచ్చుచున్నవి. తరమునకు ఇరువదియైదేండ్ల చొప్పున గణించి చూచినచో రఘునాథనాయకుఁడు క్రీ. శ. 1647 ప్రాంతమున నుంటినట్లు తేలుచున్నది.

తాడిగోళ్ళనాయకుల శాసనములు పెక్కు గానవచ్చుచున్నను, కదిరీపతి విషయమైకాని, యతని తండ్రియగు కదురభూపాలుని విషయమైకాని వాని మూలమున నేమియుఁ దెలియరాకపోవుట శోచనీయమే; కాని యతని పెద తండ్రులగు వసంతరాజు రామరాజుల కాలము దెలియవచ్చుచుండుటచేత నతని తండ్రి కదుర భూపాలుని కాలము స్థూలముగ నిర్ణయించవచ్చును. వసంత రాజు క్రీ. శ. 1644 ప్రాంతమునను, రామరాజు క్రీ. శ. 1637–65 ల మధ్యను సభ్యుదయ మందియుండుటచే వారి తమ్ముఁడగు కదురభూపతియు నప్పటి వాఁడే యని చెప్పుట యొప్పును. వసంతరాజు కుమారుఁడగు తిరుమలప్ప క్రీ. శ. 1641 నను, రామరాజుకుమారుఁడగు రఘునాథుఁడు క్రీ. శ. 1647 నను ఉండిరని తెలియవచ్చుటచేత వారి పినతండ్రి కదుర రాజపుత్రుఁడగు కదిరీపతి క్రీ. శ. 1660 ప్రాంతమున నుండెనని యెంచవచ్చును. శుకసప్తతి క్రీస్తుశకము 17–వ శతాబ్దపుఁ ద్వితీయపాదమున విరచింపఁబడెనని గట్టిగఁ జెప్పవచ్చును.

కదిరీపతికులము:— కదిరీపతికుల మెద్ది? ఈ ప్రశ్నకుఁ గవియే ఈ క్రిందిపద్యములయందు సమాధానము జెప్పియున్నాఁడు:[2].

---

1. Do. No. 84.
2. శుక. 1 : 16–19.

"ఆ యమృతాంశుఁడు త్రిజగ
ద్ధేయుండగు రౌహిణేయుఁ గిల్బిషహరణో
పాయున్ సంశ్రితనికరవి
ధేయు న్బుధనామధేయు ధీయుతుఁ గాంచెన్.

అతనికిఁ గలె పురూరవుఁ
డతఁడాయువుగాంచె నహుషుఁ డాపణ్యునకున్
సుతుఁ డతఁడు కనియెఁ దనయుం
దతవిభవోన్నతి యయాతిఁ దద్వంశమునన్.

భువనాహరవిహారియైన హరియా పుణ్యాత్ము నామంబుచే
భువి భాసిల్లు కులంబునఁ హరిహరాం భోజాసను ల్మెచ్చ సం
భవుఁడై ధాత్రి నరాతిజాతిభయ కంపంబెల్ల వారించి సం
స్తవనీయుం డననొప్పె నాతఁడు యదు క్ష్మాభర్త పొల్చుఁ మహిఁ.

ఆరసికావతంసకుల మాత్మసముద్భవహేతుభూతమై
ధీరతఁ బాలవెల్లి జగతిఁ దగెఁ దన్మహిమం బపార గం
భీరఘనాఘసంభరణ భీమబలప్రతిభాప్తిఁ గాంతు నం
చారయఁ బాలవేకరి కులాఖ్య వహించె నుదంచితోన్నతిన్"

ఇట్లు కదిరీపతి తాను చంద్రవంశాంతర్గతయాద వాన్వయుఁడగు క్షత్రి
యుఁడనని స్పష్టముగఁ జెప్పుకొనియున్నాఁడు; కాని ఇది సంశయాస్పదము.
క్షత్రియవంశజు లెచ్చటను తాము నాయకులమని చెప్పుకొనలేదు. శుకస ప్తతి
యాఖ్యానాంతగద్యల యందు "కదిరీపతినాయకప్రణీతంబైన" యని యున్నది.
మఱియు దీని కనుగుణముగా శాసనములం దన్నిటను తాడిగోళ్లవారు నాయ
ళ్లని వ్రాసియున్నది. "తాడిగోళ్ల వసంతప్పనాయని తిరుమలప్పనాయనిగారు".[1]
"తాడిగోళ్ల రామప్పనాయుఁడు", "కరియమాణిక్యనాయనికి"[2] "తాడిగోళ్ల
ఓబళరాయనివారి పౌత్రులైన కరియమాణిక్యనాయనివారి పుత్రులైన".[3] "తాడి

X: Sp. 98
i. 148
ch. Rep. 1924, No. 105

గోళ్ళ రఘుపతినాయకుల ప్రపౌత్రులయిన రామప్పనాయకుల పౌత్రులయిన కదిరీపతిరాయనాయకులు"[1] "తాడిగుడ్ల రఘునాథనాయనివారి...రామప్పగారి పుత్రులయిన రఘునాథనాయనిగారు",[2] "అచ్యుతగోత్ర పవిత్రులయిన రఘు నాథనాయనివారి పవుత్రులయిన రామప్పనాయని పుత్రులయిన నరసింహనాయని వారనే మేము",[3] "శ్రీ తాడిగోళ్ల కరియనారాయని రామప్పనాయనిగారు తన తండ్రి అక్కపనాయని ..[4] ఇత్యాది. "ఓబళిరాయని" యను పట్టునం దప్ప తక్కినయెడల నెల్లను "నాయని" శబ్దమే వాడబడియున్నది. "నాయని" శబ్దము 'రాయని'గ మారుట కలదు. పానుగంటి రామా నాయనింగారు రామారాయనింగారైనట్లు ఈ యోబళిరాయడు మొదట నోబళి నాయడైయుండవచ్చును. ఇది యెట్లున్నను, క్రీ. శ. 15, 16, 17 శతాబ్ద ములలో 'నాయడు' అను కులసూచకబిరుదు 'కమ్మ వెలమ బలిజ' కులముల వారికే చెల్లుచుండెను. ఎంతటి యల్పులైనను క్షత్రియులు మహామండలేశ్వ రుల మనియు, 'రాజు' లేక 'మహారాజుల'మనియు శాసనాదులయందు వ్రాయించు కొనెడివారు, కావున కదిరీపతి క్షత్రియుడైయుండిన శూద్రజాతి సూచకమైన 'నాయక' పదమును దన పేరుతో జోడించుకొనియుండునా యని సంశయము. దీనికి దోడు శాసనములం దీతని వంశమున రందఱును క్షత్రియోచితమైన 'మహామండలేశ్వర' బిరుదును వహింపక, దాము మహానాయకాచార్యులమని చెప్పుకొనియున్నారు. ఈ బిరుదు విజయనగరరాయలకాలముననే వాడుకలోనికి వచ్చినట్లున్నది. సర్వసామాన్యముగ నిది విజయనగరసామ్రాజ్యమున దేశ కావలిగాండ్రైన పాళెగాండ్రకే యుండినట్లు శాసనములవల్లను, గ్రామకవిలె వల్లను తెలియవచ్చుచున్నది. దేశకావలిగాండ్రగు నీనాయకులందఱును బోయ బలిజ కమ్మ ముత్తరాసికులములకు జెందినవారగుటచేతను, క్షత్రియుల కెవ్వరికి నీబిరుదు లేకుండుటచేతను, తాడిగోళ్ల వంశజులు మహానాయకాచార్య లని శాసనములం దుండుటచేతను కదిరీపతి క్షత్రియుడు కాడేమో యను సందేహమున కెడముగల్గుచున్నది.

---

1. ,, ,, No. 84
2. ,, ,, No. 107
3. ,, ,, No. 106
4. ,, ,, No. 110

ఇట్టి సంశయ మొక తాటిగోళ్లవంశమునారి యెడనే కాదు. ఆ కాలమున ప్రాముఖ్యము వహించిన మఱికొన్ని కుటుంబములయెడలనుగలదు. ఇంచుమించు కదిరీపతికిసమకాలీనుఁ డనఁదగు సవరము చిననారాయణ నాయకుఁడు దనది సూర్యవంశ మనియుఁ, గాశ్యపగోత్రమనియుఁ బ్రకటించికొనియున్నాఁడు.[1] సూర్యవంశ కాశ్యపగోత్రము లితఁడు తెలుఁగుచోళవంశజుఁడని తెల్పుచున్నవి. కాని చోళులు రాజాంతనామధేయులుగాని చిననారాయణనాయకునివలె నాయకాంతనామధేయులు గారు. మఱియుఁ దిరుమలదేవరాయల కాలమునను, మొదటి శ్రీరంగరాయదేవమహారాయల కాలమునను పెనుగొండదుర్గాధ్యక్షుఁడై యుండిన సవరము చన్నప్పనాయనింగారు "తిరుమలదేవ మహారాయలయ్యవారి వూడిగం చిప్పగిరిసింగమనాయని పౌత్రులయిన చెంనపనాయని పుత్రులైన చవరం చెంనప్పనాయనివారు"అని చెప్పుకొనియుండుటచేత సవరమువారి క్షత్రియత్వమునకు న్యూనత కలుగుచున్నది. క్షత్రియు లెచ్చటను ఊఁకిగెము జేసినట్లు కానరాదు.

ఈ యంశమునన్నిటిని పరామర్శించిచూడఁగాఁ గదిరీపతి క్షత్రియుఁడు గాఁడనియు, క్షత్రియత్వము నాకాంక్షించు శూద్రకుటుంబమునకుఁ జెందిన వాఁడనియుఁదోఁచుచున్నది. కాని యీ యనుమానమే సత్యమని దృఢముగఁ జెప్పుటకు వీలులేదు. నాయక, మహానాయకాచార్యబిరుదులు శూద్రులయందే కాక క్షత్రియులయందుఁ గూడ నాకాలమున వాడుకలోనుండి యుండవచ్చును. కావున కదిరీపతి తనది క్షత్రియకుల మని స్పష్టముగఁ జెప్పినమాటలను ద్రోసిపుచ్చి కేవల మనుమానములను నమ్మక తాత్కాలికముగ నతఁడు క్షత్రియుఁడని యొప్పుకొనుట యుక్తము.

ఇంటిపేరు;—యాదవవంశము పాలవెల్లివలె జగతిఁ దగుటచే బాల వేకరికులాఖ్య వహించెననియుఁ, దాను పాలవేకరికులకలశాంభోనిధిసుధాకరుఁడ ననియుఁ దెల్పియున్నాఁడు. శాసనములం దితని వంశమువారందఱును తాడి [illegible] పేర్కొనఁబడియున్నారు. దీనికి సమన్వయ మెట్లు? అను ప్రశ్న [illegible]; ఈ ప్రశ్నకు సమాధానము ముకస ప్రతియవతారికయందు కాన

---

[1] [illegible]శ్వ చరిత్రము. 1 : 16, 20.

2. SII. VII. Nos. 1563, 564 569. 'సవరము'అను ఇంటి పేరు శంచినచన్నప్పవల్ల కలిగినట్లున్నది. మొదట వీరిఇంటిపేరు చిప్పగిరివారు: 569లో చిప్పగిరి సింగమనాయని పౌత్రుఁడు చవరం చిన్నప్పయని యున్నది: 564 లో సవరము చన్నప్పకు బదులు 'కుంచ చిన్నప్ప' యని యున్నది. రాయలకు కుంచె వేయుటచే నితనికి 'కుంచె', లేక 'సవరము' చన్నప్పయను పేరు రూఢియాయెను. ఇతని వంశమువారు 'సవరము' వారైరి.

"ఆమహితావ్యవాయ వసుధాధిపు లచ్యుతగోత్రపాత్రు లు
ద్దామభుజాపరాక్రమవిదారిత ఘోరమదారివీరులై
భూమి భరించి రాన్నపుడు భూతిమహోన్నతి నేలె భోగసు
త్రాముఁడు తాడిగోళ్ల పుర ధాముఁడు శ్రీపెదయౌబళుండిలన్.[1]

మొదట వీరియింటిపేరు పాలవేకరివారు: తాడిగోళ్లయందు స్థిరనివాస మేర్పఱచుకొని యచట నెలకొనుటవలన తాడిగోళ్ళ యను ఇంటిపేరు గలిగి నది. ఇట్టి మార్పు పెక్కుకుటుంబములయందుఁ గానవచ్చుచున్నది. పాల వేకరివారుగాక యచ్యుతగోత్రులు రాళకోటవారు గలరని పైఁజెప్పియున్నాను: అట్లే చిప్పగిరివారు సవరమువారైరి. ఆరెపీటిబుక్కరాజు సంతతికొ నొక శాఖవా రాగృహనామముతోడనే యుండఁగా, నితరులు నంద్యాలవారనియు, నొకువారనియు, నిజనివాసస్థానములనే గృహనామములుగ గ్రహించిరి. రేచర్ల వారు రావువారనియు, వెఱగోటి వారనియు, సురభివారనియు, ఇంటిపేర్లను మార్చుకొనిరి. కావున కదిరీపతి పాలవేకరివాఁడని చెప్పుకొనఁగా నతని పెద తండ్రులును, వారి సంతతివారును తాడిగోళ్ళవారమని ప్రకటించుకొనుటయందు పైపరీత్యమేమియుఁ గానరాదు.

కదిరీపతిజన్మదేశమునుగూర్చి కొంత యభిప్రాయభేదము గానవచ్చు చున్నది. రావుబహాదూరు వీరేశలింగంపంతులుగా రితఁడు నెల్లూరుమండలము వాఁడనిరి;[2] కొచ్చర్లకోట రామచంద్రవెంకటకృష్ణరావు పంతులుగారు దీని నంగీరింపక నతఁడు కడపమండలములోని కదిరిరాజ్యమును పాలించిన ప్రభు

---

1. శుక. 1 ; 20.
2. ఆం. క. చ. పుట 531.

వని నుడివిరి;[1] క్రొత్తపల్లి సూర్యారావుగారు పాలవేకరివారికి 'రాజధాని తాడిగోళ్ళపురము' అని చెప్పి శాసనములలో తాడిగొట్లయని కనబడునదియే తాడిగోళ్ల కావచ్చునని యూహించిరి;[2] కాని యేశాసనములలో నీ తాడిగొట్ల కనబడుచున్నదియో, యెచ్చట నది కలదో తెలుపరైరి.

తాడిగోళ్ల తాడిగొట్ల కాదు; అది మొరసు రాజ్యమునందు. అనగా నిప్పటి కోలారుమండలమునందలి శ్రీనివాసపూరతాలూకాయందు గానవచ్చుచున్నది. విజయనగరరాయల కాలమున నీ గ్రామము పెనుగొండ రాజ్యమున కణకువయై యుండెను. సోమయాజులపల్లి తామ్రశాసనమున "పెనుగొండ రాజ్యం ముకొ్క్ట్యాస్థలం గుండ్లూరసీమ...మానాయకానకు చెల్లే తాడిగోళ్ల"అని చెప్పియున్నది;[3] మఱియొక శాసనమున "పెనుగొండ్ల గుండ్లవారి సీమకు చెల్లే మానాయకానకు చెల్లే తాడిగోళ్ల యెట్టాలవసీమలోపల" యని యున్నది. పెనుగొండ్లగుండ్లవారిసీమ పెనుగొండ్ల గుండ్లూరిసీమకు భ్రష్టరూపము. మఱియు నింతవఱకు లభ్యమైన తాడిగోళ్ల వంశీకుల శాసనము లన్నియు నీకోలారుమండలము నందలి శ్రీనివాసపురతాలూకాయందును దత్పరిసరస్థలములందే కానవచ్చుచున్నవి. తాడిగోళ్లపురధాముడైన పెదయోబళరాజు "గడెరాకమున తెర్క మొదలుగల్గు బహురాజ్య" మేలినట్లు కృత్యవతారికయందు గలదుగదా. 'కడెరాక' మెద్దియో తెలియకపోయినను 'దెర్క' యనునది బెంగుళూరు మండలములోని 'తెర్కణాంబి' యనుదానికి సంగ్రహరూప మనుటకు సంశయింపబనిలేదు. కావున గదిరీపతిజన్మదేశము ప్రస్తుత మైసూరుసంస్థానాంతర్గతాంధ్రదేశములోని కోలారుమండలమని దృఢముగ జెప్పవచ్చును.

---

1. ఋకసప్తతి ప్రథమముద్రణపీఠిక.

2. ఋకసప్తతి ద్వితీయ ముద్రణపీఠిక.

3. .1924 p. 92.

వాఙ్మయ వ్యాస మంజరి

ద్వితీయ భాగము

కుమార సంభవములోని కొన్ని అప పాఠములు

❖❖❖❖❖❖❖

కుమార సంభవమున గొన్నియెడల నపపాఠములు గానవచ్చెడిని. ఇందు కొన్నింటికి ముద్రాపకులు కారకులు. మఱికొన్నింటికి వ్రాత ప్రతి వ్రాయసగాండ్లు కారకులు. అపపాఠము లే కారణమున గ్రంథమునకు భ్రాకినను, వానిమూలమున గ్రంథము పెక్కుతావులయందు దుర్బలగాహమగుచున్నది. ఈయపపాఠములను దిద్దుకొన్ననేకాని పెక్కుపద్యములకు అన్వయము కుదురదు. కవి భావము తెల్లముగాదు. ఈక్రింద నట్టియపపాఠములను గొన్నిటి నుదాహరించుచున్నాను. వీటిని దిద్దునప్పుడు సాధ్యమైనంతమట్టుకు వ్రాతప్రతిపాఠమును ద్రోసిపుచ్చక దానినే సరియైనపాఠముగ నంగీకరించి తన్మూలమున పద్యము యొక్క వాస్తవార్థమును గ్రహింప ప్రయత్నము సల్పితిని. [1]

1. దక్షాధ్వరధ్వంసమున రుద్రగణముల కోడిపోతిన యష్టదిక్పాలుర పాటును వర్ణించుచు నన్నెచోడుడు వరుణునిగూర్చి ఇట్లు వ్రాసియున్నాడు.

గీ. ఉరుతరాబ్ధీశుడయ్యును నోడిపోఁ బె
వరుణుఁ డలుగుచు నుడికె దేవాంగువోలె

---

1. ఈయపపాఠములను దిద్దుసందర్భమున కుమారసంభవపరిష్కర్తలగు శ్రీ మా. రామకృష్ణకవిగారి సాయమును బడిసితిని. కొన్నిపట్ల వారు సూచించిన దిద్దుపాట్ల నంగీకరించితిని. ఓపికతో చర్చించి పలుమారు నాసందేహములను బాపినందుకు వారియెడ గృతజ్ఞుడను.

గణము లెడరైన నేమియు నిఱవ వనుట
దగుభయాతురుఁడై నోరఁ దడియులేక.

—కుమా, 2-207

ఇది ముద్రితపాఠము. ఇందు పద్యము రెండవ పాదమును జూడుడు. వరుణుడు అలుగుచు దేవాంగు వోలె నుడికెను. 'దేవాం' గనగా ఉడుము అని కవిగారు అర్థమువ్రాసి యున్నారు. వరుణుడు అలుగుచు ఉడుమువలె నుడికెను. అలుగుచు నుడికె ననుటచేత 'ఉడుకు' శబ్దమునకు 'తాపముఁజెందు' అని యర్థము చేసికొనవలసి యున్నది. అయితే, "ఉడుము" తో వరుణుని నుపమించుటకు కారణమగ పడదు. 'ఉడుము' లకు గోపముతో నేడ్చుట స్వభావమా? ఉడుము శాస్త్రవేత్త లీ విషయమును నిర్ణయించ వలసియున్నది. వ్రాతప్రతియందు 'దేవాంగు' అన్నమాట లేదు.

'వరుణుం డలంగుచు నుడికె వాంగువోలె'

అని యందున్నది. ఇచ్చటిమాట "వాంగు" (వాఁగు) కాని 'దేవాంగు' కాదు. 'వాఁగు' అనగా 'సెలయేరు'. మొదటిపాదమును దిలకించిన 'వాఁగు' శబ్ద ప్రయోగమునకు కారణము బోధపడగలదు. వరుణుడు ఉరుతరాబ్ధీశుడు. అబ్ధులు 'పాఱు'. అనగా ప్రవహించు స్వభావముగలవి కావు. పాఱెడుస్వభావము లేని యబ్ధులకు నాథుడయ్యును వరుణుడు ఆర్తధ్వని సేయుచు (ఘోషించుచు) వాఁగువలె పాఱెను (ప్రవహించెను). కావున నీ పద్యద్వితీయపాద మిట్లుండి యుండును.

'వరుణుఁ డలఁగుచు నుటికెడువాఁగువోలె".

2. ఈశ్వరుడు పెండ్లికి తరలి యోషధీప్రస్థపురమునకు బోగా హిమవంతు డొనర్చిన మహోత్సవమును వర్ణించుపట్టు నీ క్రిందిపద్య మిట్లు ముద్రిత గ్రంథమున గానవచ్చుచున్నది.

గీ. అప్పురమును వణిగ్జను లాపణములఁ
గలయఁ బచరించియున్న నిర్మలినరత్న
రాసులొప్పె నుమావరురాక కర్థి
వెలయ నెత్తిన వలపుదీవియలు వోలె.

—కుమా, 8-14.

ఇందు చతుర్థపాదమున 'వలపుదీవియలు' యౌ చిత్యము విచారణీయము. 'వలపు' అనుమాటకు వాసన, కోరిక, కామము అనుమూడు అర్థములు శబ్దరత్నాకరమున గానబడుచున్నవి. వీనియం దేయర్థమును నిచ్చట సరిపోదు, 'వలపు దీవియ' లను పాఠము తప్పు. రత్నరాసులను బచరించి దీవియ లెత్తినట్లొనర్చిన వారు వణిగ్జనులు. వణిగ్జనులన పురుషులనియే యర్థముచేసికొ 'నవలయును. వారికి శివునిపై భక్తి గలుగవచ్చును. వలపునకు నెడములేదు. మఱి వ్రాత ప్రతి పాఠము భిన్నము. అందు 'రాగదీవియ' లున్నవి. 'రాగ' మన వర్ణము. రత్నములు తొమ్మిదితెగలవి. ఒక్కొక్క తెగకు వన్నె పేరు. రాగదీవియ లనుటచే రంగుల దీపములని కవిహృదయము. ఉత్సవావసరములయండు వన్నెవన్నె దీపముల నెత్తుట సామాన్యముగదా. కావున 'రాగదీవియలు' అనుపాఠమే సరియైనది.

3. హరువీర్యభారమును మోయజాలక డిగ్గజాతిన వియద్గంగను వర్ణించుపద్యము ముద్రితప్రతియం దిట్లు గానవచ్చుచున్నది.

క హరువిర్య్యము దాల్వ(గ(గడు
భరమై వడి నడుమ డిగ్గ(బడి కడ లళ్ళం
బరముదెస నిల్చి పొల్చెను
సురవాహిని బాల(డున్న జోలెల(వోలెన్.

—కుమా. 10_378.

"కడలళ్ళు" = తరంగ సమూహములు" అని రామకృష్ణకవిగారు అర్థమును వ్రాసిరి. శబ్దవిచ్ఛిత్తి కడలు + అళ్ళు: 'అడి' శబ్దమునకు బహువచనము 'అళ్ళు, అడులు, ఆటలు, అళ్ళు' అని.

ఇచ్చట సురవాహిని నడుమ డిగ్గబడుటకును, కడలళ్ళు అంబరముదెస విల్చి పొల్చుటకును సంబంధమేమి? అట్లుండుటవలన సురవాహిని బాలుడున్న జోలెవలె నెట్లాయెను? 'కడలళ్ళు' అనుపాఠము కవి భావమును మరుగుపఱచుచున్నది. వ్రాతప్రతియందు 'కడలళ్ళు' అనుమాట లేదు. అందు 'కడపళ్ళు' అని యున్నది. "కడపళ్లు" "కడపల"కు బహువచనము. కడపల అనగా

కొన, లేక తుదిభాగము, అంత్యము. ఈమాటను తిక్కనసోమయాజిగారు ప్రయోగించియున్నారు.

చ. ఎడఁ బొలివోని వేడుకల యేడ్తెర సొంపున నంతకంత కె
క్కుడగుమదంబు పేర్మి రతి కోర్కులు కొమ్మలివోవ నప్పుడ
ప్పుడ నలఁ జేరినట్టుల విభుండును వారిజపత్రనేత్రయుం
గడపలలేని కేలితమకంబున నుల్లము లుల్లసిల్లఁగాన్.

—నిర్వ. ఉత్త. 8–23.

పై కుమారసంభవ పద్యమున "గడపళ్లు" అనునదియే సరియైన చక్కని పాఠము. "కడలళ్ళ"ని మార్చవలసిన యవసరములేదు.

హరవీర్య భారముచే వియద్గంగా ప్రవాహము మధ్యమున డిగ్గబడినది; అనగా క్రిందివైపునకు గ్రుంగినది. కొనలు రెండును అంబరమున నిలిచినవి. అమర గంగావాహినియొక్క కొనలు. అనగా నాద్యంతములు ఆకాశమున నంటు కొనియుండగా మధ్యభాగము హరువీర్య భారముచే నధోముఖముగ జాఱినది. ఱాలురక్తి కట్టుజోలె రెండుకొనలు దూలమునకో లేక చెట్టుకొమ్మకో కట్టబడి యుండ మధ్యభాగము క్రిందికి వ్రేలఁజుండును. కావుననే హరువీర్య భారముచే నడుమ డిగ్గబడిన సురవాహిని ఱాలుడున్న జోలెతో బోల్చబడినది. "కడల" ళ్ళను "కడప"ళ్ళని దిద్ది చదువుకొన్న పద్యమునకు అన్వయము చక్కగా కుదురును.

4. తారకుడు దేవదూతను శిక్షింపదలకొన శుక్రుడతని వారించుచునిట్లు పల్కెను.

క. వీం డేమి సేయఁబంచిన
వాండుండఁగ నిక్కమునకు వధ్యుఁడుగా నా
ఖండలుఁడు గాక యేలిన
వాం డుం డఁగ నేమి సేయు పరికర మనిలోన్.

—కుమా, 10–520

వ్రాతప్రతియందు తృతీయ చతుర్థ పాదములిట్లులేవు—

ఆ ఖండలుఁడుగాక యేసిన
వాండుండగ నేమిసేయు వరకర మనిలోన్.

"వరకరము" అనునది "నరశరము" అనియుండవలయును, 'ఏయు' క్రియ శరప్రయోగమును సూచించుచున్నది; కావున,

"యేసిన వా డుండఁగ నేమి సేయు వరశరమనిలోన్" అనుట యొప్పగును. విలుకాడు బాణమును శత్రులపై, నేసినట్లు, ఇంద్రుడు, దూతను తారకాసురునికడ కంపెను. దూత బాణమువంటివాడు. తనంతట వచ్చినవాడుగాడు, వానిని శిక్షించుట పైదగిలిన బాణమును విఱుచుటనువోలె నిష్ప్రయోజనమైన పని. కావున, వానిని పదలి వానినంపిన ఇంద్రుని శిక్షించుట తగవు అని తాత్పర్యము.

4. మఱియు కుమారుని వీటియందలి వీరుల బిరుదు వాక్యములను వర్ణించుపట్టున నీ క్రిందికందమగపడుచున్నది.

క....చుఁ జాగియు

నే ననియు తలంచు లోభి యెప్పుడు ననికిన్
జా ననియె తలఁచు వీరుఁడుఁ
జా ననియ తలంచుఁ బంద సరియెట్లగునో.

—కుమా, 11-61

ఈ పద్యమున నష్టభాగమును ఉద్ధరించి పద్యమును పూర్తిచేయవచ్చును. ఇందు చాగి, లోభి, వీరుడు, పంద వీరి నలుగురి తలపులు సమానములు. అవి యెట్లు సమానమగును? అని కవి ప్రశ్నించుచున్నాడు. మఱియు వీరుడును పందయు "జానని తలంచెదరు" అని వారి తలంపులను కవి యెఱుకపఱుచుచున్నాడు తక్కిన ఇద్దఱి తలంపులను నట్టివిగానే యుండవలయును. ఇంతే కాదు; ద్వితీయ తృతీయ చతుర్థ పాదములకు "ననియ తలచు" అనుపదము సామాన్యము. ప్రథమ పాదమందలి క్రియాపదమునకు గడపటి యక్షరము

"చు" అని నష్టశేషమైన పాదభాగమువల్ల దెలియుచున్నది. కావున ప్రథమ పాదమందలి క్రియాపదము సైతము "తలచు" అనుట నిశ్చయము. క్రింది మూడు పాదములయందును "ననియ (యె) తల(ం)చు" అని యుండుటచేత ఇచ్చటను "ననియ తలచు" అని యుండుననుట యొప్పగును. పై జెప్పిన నలగురి తలంపును సామాన్యమగుటచే వారు నలగురును "చాననియ" తలతు రని యనుకొనుట యసమంజసముగాదు. కావున పద్యమిట్లుండవలయును.

క. చాననియ తల(చు(జాగియు(
జా ననియె తలంచు లోభి; చనునపు డనికిన్
జా ననియె తల(చు వీరు(డు(
జా ననియ తలంచు పంద సరియెట్లగునో.

6. దేవదానవయుద్ధమున శరహతి దెగినశిరములు భువిపై ద్రొల్లిన రీతిని చోడు డీ క్రిందిపద్యమున వర్ణించుచున్నాడు:

క. ఎగయు శిరంబులు నభమున
కొగి(గ్రమ్మెడు ర క్తజలము లొలుకుచు భువిపై
మగుడ(బడు(జూడ(గడురం
గుగ నోలినరాటనమున గుంద్రలుపోలెన్.

—కుమా. 11-737

ఈ పద్యములోని "రాటనము" "గుంద్రలు" అను మాటలకు రామకృష్ణకవిగారు "రసముతీయు యంత్రము", "త్రిప్పెడు పైగుండు" అని టీక వ్రాసియున్నారు. కాని, తిరుగుడుగుండుతో గూడిన రసముతీయు యంత్రమువకును శరహతి బుడమని వ్రాలు శిరంబులకును నెట్టిపోలికగలదో తెల్పలేరి. వ్రాతప్రతియందు చతుర్థపాద మిట్లున్నది.

రం గ్గుగ నోలిన లాటనమున గుండలువోలెన్.

'లాటనము" తప్పు; రాటన మనియే సవరించవలయను. సవరణచేసి చతుర్థపాదము నిట్లు పఠించవలయును.

రం గుగ నోలిన రాటనమున(గుండలువోలెన్.

రాటనము = నూతినుండి నీటిని తోడెడుచక్రము. కుండలు త్రాటికి గట్టిచక్రము తిరుగగా కుండలు వరుసగా నూతినీటిలో మునిగి, జలభరిత ములై క్రమముగ పైకి, చక్రోపరిభాగమునకు వచ్చినపుడు నీటిని బయట గుమ్మరించును. అట్లే శరహతి ద్రైస్రినశిరములు వరుసగా మొదట పైకెగసి, రాటనబద్ధములైన కుండలు జలమును గుమ్మరించినరీతిని రక్తమును కార్చుచు క్రిందబడును.

భాస్కర రామాయణ సమస్య

కర్తృత్వ విభేదపరిశీలన

తెనుగు రామాయణములన్నింటను భాస్కర రామాయణము ప్రాచీనతమము. ఆంధ్ర మహాభారతమువలె నదియు బహుకర్తృకము. ఈ గ్రంథోత్పత్తిని దెలుపు నైతిహ్యమొకటిగలదు. దానినిచ్చట సంగ్రహముగా వివరించెదను.

పూర్వమొక రాజుకలడు. ఒకప్పుడతడు నిజబంధుడగు రంగనాథుడను కవిని రప్పించి రామాయణమును ద్విపద కావ్యముగా రచింపుమని యాజ్ఞాపించెను. దీనినెరిగి మత్సరగ్రస్తుడగు తదాస్థానకవియగు భాస్కరుడు రాజు కడకు జని దానొక రామాయణమును పద్యకావ్యముగా ఏలినవారి కంకితమొసగు తలంపుతో విరచించుచుంటి ననియు, దానిని బరిగ్రహింపవలె ననియు వేడుకొనెను. రాజందుల కంగీకరించి, తాను రంగనాథున కొసగిన యాజ్ఞను జ్ఞప్తి పరచి, రంగనాథ భాస్కరులలో నెవరు గ్రంథమును ముందు రచించి తెచ్చిన వారి గ్రంథమును గొనెదననిచెప్పెను. రంగనాథునికంటే పూర్వమే గ్రంథమును వ్రాసిముగించి రాజున కంకిత మొసగవలయునని తలచి భాస్కరుడు తన పుత్రుడగు మల్లికార్జునభట్టును, శిష్యుడగు కుమారరుద్రదేవుని, మిత్రుడగు వయ్యాలార్యుని సహాయులనుగా నేర్పరచుకొని గ్రంథము నచిరకాలముననే సంపూర్తి యొనరించి రాజసభకు గొనిపోయెను. కాని యప్పటికే రంగనాథుడు స్వవిరచిత ద్విపద రామాయణమును రాజునకర్పింప గొనివచ్చెను. రాజు వారును నేకకాలమున వారిగ్రంథములను స్వసన్నిధానమునకు గొనివచ్చుట రంగనాథునియెడ నించుక పక్షపాతము జూపి యాతని గ్రంథమును [illegible]. భాస్కరుని గ్రంథమునుగొన వెడమచేతిని జాచెను. ఆసూక్ష్మ భాస్కరుడు కోపించి స్వవిరచిత గ్రంథమును రాజునకియ్య

నంగీకరింపక. రాజు సేవయందున్న గుజ్జుపువాడగు మాదున కంకిత మొసర్చెను. తత్కారణమునను సాహిణిమారుడు కృత్యాద్యంతములయందు సంబోధింప బడెను.

ఈ కథయందెంత సత్యమున్నదో తెలియదు. తెనుగున రంగనాథ రామాయణమను నొక ద్విపదరామాయణము కలదు. తద్రచయిత రంగనాథుడు కాడు. కోనబుద్ధరాజను క్షత్రియు డాగ్రంథమును రచియించినట్లు అందు చెప్ప బడియున్నది మరియును గవిత్వరీతిని, గ్రంథాంతర్గత శబ్దజాలమును బట్టిచూడ రంగనాథ రామాయణము భాస్కరరామాయణముకంటె అర్వాచీనమైన గ్రంథ మని తోచుచున్నది. పైకథయందలి ఇతర విషయముల నిజానిజముల నరయ దగిన వెరవెద్దియును గానరాదు

ఇక భాస్కరరామాయణ సాక్ష్యమువల్ల తద్గ్రంథోత్పత్తి తెరగెరుంగ వీలగునేమో చూతము. ముద్రితప్రతియందు గ్రంథకర్తలను గూర్చి ఈ క్రింది విషయములు తెలియుచున్నవి.

ఆరంభకాండయగు బాలకాండయందు కృత్యాద్యవతారికలేదు. సామాన్యముగ నన్ని యాంధ్రగ్రంథములవలె గ్రంథారంభమున నుండు మంగళశ్లోక మేనియులేదు. ఈకొరత మాన్పుటకు, పాపము వావిళ్ళవా రెచ్చటనుండియో యొక పద్యమును దెచ్చి యతుకుపెట్టినారు. అది కాండాంతపద్యములబోలిశివుని సంబోధించక వాల్మీకిని స్తోత్రము చేయుచున్నది. మల్లికార్జునుని గ్రంథమును వ్రాతప్రతులబడి ముద్రించక ఈయసంగతపు టతుకు నేలపెట్టిరో తెలియదు. *'రాముని శుభచరితంబును' అను కందపద్యముతోడనే గ్రంథమారంభమగు చున్నది. తెనుగున భాస్కరరామాయణ మొకటిదప్ప కృత్యాదిని మంగళశ్లోకా దులులేని కావ్యమెచ్చటను గానరాదు ఇది విచారణీయము. కాండాంతపద్య

---

* మఱియు 1930-వ సంవత్సరమున ముద్రించిన ప్రతియందు సంగ్రహరామాయణమను నొక చిన్నగ్రంథమును జేర్చియున్నారు. ఇది యత్కృతమో తెలియదు. భాస్కరరామాయణమును యథామాత్యకముగా ముద్రించక నూతనగ్రంథముల నందేల చొప్పించిరో?

మలనుబట్టిచూడ బాలకాండ శివున కంకితము సేయబడినట్లు తెలియుచున్నది. గద్యయందు అష్టభాషాకవి మిత్రుడును, భాస్కర సత్కవి పుత్రుడును నగు మల్లికార్జునభట్టు విరచించినట్లు చెప్పియున్నది. ఇట్లే కిష్కింధకాండ శివాంకిత ముగ పై మల్లికార్జునభట్టు చేతనే వ్రాయబడినది. కాని కాండాంత పద్యముల యందొకటి సాహిణిమారుని, మరియొకటి పరమేశ్వరుడగు శివుని సంబోధించు చున్నవి. సుందరకాండయు పై రెండు కాండలవలె మల్లికార్జునభట్టు చేతనే రచింపబడినను కాండారంభమున సాహిణిమారుడును, కాండాంతమున ఈశ్వరుడును సంబోధింపబడియున్నారు. అయోధ్యకాండను రచించిన కవి శారదాముఖ ముకురాయమాణుడును, సారస్వత భట్టబాణుడును, వీరమారయ కుమారుడునునగు కుమారరుద్రదేవుడని కాండాంతగద్యము తెలుపుచున్నది. కాండాద్యంతపద్యములు బుద్ధయకును, కాంచమాంబకును పుత్రుడగు సాహిణిమారుని సంబోధించుచున్నవి. ఇతర కాండలవలెగాక అరణ్యకాండ రెండాశ్వాసములుగ విభజింపబడియున్నది. ప్రథమాశ్వాసమునందలి మొదటిపద్యము సాహిణిమారుని సంబోధించుచున్నది; ఆశ్వాసాంతపద్యములు తక్కిన కాండలయందలి పద్యములవలె గృతిపతిని సంబోధింపక ప్రథమావిభక్త్యంతములగు వాక్యములచే నతని గుణములను వర్ణించుచున్నవి. కవి భాస్కరుడని ఆశ్వాసాంతము నందలి గద్యతెలుపుచున్నది. ద్వితీయాశ్వాసారంభ పద్యము కృతిపతిని సంబోధించక హరిభక్తుడును, సాహిణీతిలకమునునగు మారయధరణీరమణుని ప్రథమాంత వాక్యములచేత ప్రశంసించుచున్నది. ఆశ్వాసాంత పద్యములు మూడును ద్వితీయావిభక్త్యంతములు. రెండాశ్వాసములయందును ఆశ్వాసారంభ పద్యములు కృతిపతిని బేర్కొనుచున్నను ఆశ్వాసాంతములవల్ల నతడెవ్వడో కనుగొనుటకు సాధ్యముకాదు. రెండవయాశ్వాసమును రచించిన కవియు భాస్కరుడే. యుద్ధకాండయందలి మొదటిపద్యమున సాహిణిమారుడు సంబోధింపబడియున్నాడు. ఆశ్వాసాంతపద్యములయందు శివుడు సంబోధింపబడియున్నాడు. ఇతరకాండలవలెగాక యుద్ధకాండను రచించిన కవులిరువురు. మొదట కొంతభాగమును హొళక్క భాస్కరమహాకవి రచించెనట. తరువాతి భాగమును నయ్యలార్యుడు సంపూర్తి యొనర్చెనట. ఇట్లు భాస్కరరామాయణమునుఅయిదుగురు వ్రాసినట్లు తెలియుచున్నది.

మల్లికార్జునభట్టు బాలకిష్కింధ సుందరకాండలను, కుమారరుద్రదేవుడు అయోధ్యకాండను, భాస్కరుడు అరణ్యకాండను, హొళక్క భాస్కర అయ్య

లాయ్యలు యుద్ధకాండను వ్రాసిరని ముద్రిత భాస్కరరామాయణ ప్రతివలన దెలియుచున్నది. ఇది పైనుదాహృతమైన భాస్కరరామాయణ రచనా విధానమును దెల్పి నైతిహ్యమునకు గొంచెమించుమించుగా సరిపోవుచున్నను ఈ కవులందరును సమకాలికులోకారో, మరియు వారియందొండొరులకెద్దియేని సంబంధము కలదోలేదో విచారించవలసియున్నది. భాస్కరరామాయణమును రచించిన కవులందరియందును నయ్యలార్యుడొక్కడే స్వవిషయమును కొంత తెలిపియున్నాడు. తాను కాకల్యమల్లకవి పౌత్రుడననియు, వీర (లేక, రామ) నరసింహుని తమ్ముడగు అప్పలార్యుని పుత్రుడననియు యుద్ధకాండాంతగద్య యందు తన తాతతండ్రులను బేర్కొనియున్నాడు. కాకల్యమల్లకవి కాకతీయ ప్రతాపరుద్రుని యాస్థానమున నుండెనని సోమదేవరాజీయమునందును, నప్ప కవీయమునందును వ్రాయబడియున్నది. ఈకాకల్యమల్లుడు గొప్పకవి; సంస్కృతమునం దుదారరాఘవాది కావ్యములను పెక్కింటిని రచించెను. ఇతడు విజయనగర చక్రవర్తియగు హరిహరరాయల కాలమున నుండెనని ప్రసంగరత్నావళియందుదాహృతమైన యొక శ్లోకమువలన దెలియుచున్నది.

విజయనగర చక్రవర్తులయందు హరిహరనామాంకితు లిరువురకలరు. అందొక్కడు సంగమరాయలపుత్రుడు. ఇతని కాలముననే విద్యారణ్యయతీంద్రుడు విద్యానగరమును నిర్మించెను. ఇతడు క్రీ. శ. 1336 మొదలు 1355 వరకును రాజ్యపరిపాలనమునొనర్చెను. రెండవ హరిహరరాయలు క్రీ.శ. 1378 మొదలు 1404 వరకును ప్రభుత్వమునలర్చెను. కాకల్యమల్లుడు ఓరుగంటి ప్రతాపురుద్రుని యాస్థానమున నుండెననుట నిక్కమేని యాతడు మొదటి హరిహరరాయల కాలమువాడే కావలయును. ఈ యూహ సరియైనదనుటకొక నిదర్శనముగలదు. యుద్ధకాండప్రతులలో కొన్నిటియందు "ఉ ఇంక బలీముఖుల్ బలిసి రెక్కడి రావణుడేటిలంక" యను పద్యమునకు దరువాత ఈక్రింది వాక్యము గనుపించుచున్నవి: "ఇందాకా భాస్కరుడు చెప్పిన రామాయణం. ఇటు మీద వేదగిరి నాయనింగారు అయ్యలభట్లచేత చెప్పించిన రామాయణము యుద్ధకాండశేషము." [1] మరికొన్నింటియందు "యింతపర్యంతం భాస్కరుని సన్మార్గఘటన. ఇకమీందికథ వేదగిరి నాయనింగారు కాకల్యమల్లనార్యుని మను

.1 Madras Govt. Ori. Mss. Library 10-1-12 leaf 229 b.

మదు అయ్యలభట్లచే రచనచేయించిన యుద్ధకాండశేషము." 2 ఒకానొక ప్రతియందు మాత్రము "యిందాకా భాస్కరుడు చెప్పినకవిత్వం. యిటమీద శాకల్యమల్లభట్టు చెప్పిన కవిత్వం" అనియున్నది. 3 ఈ వాక్యములయందు బేర్కొన్న వేదగిరి నాయనింగారు దేవరకొండ నేలిన వెలమప్రభువు రసార్ణవ సుధాకర గ్రంథకర్తయగు రావు సింగమనేనికి పినతండ్రియగు మాదానేని పుత్రుడు. ఇతడు తండ్రి యనంతరము సింహాసనము నధిష్ఠించి క్రీ శ 15 వ శతాబ్దారంభమున చేవరకొండయందు రాజ్యమొనర్చెను. ఇతని యనుచరుల శాసనములు క్రీ.శ. 1405, 1407 సంవత్సరములనాటివి సింహాచలమునందును, శ్రీకూర్మమునందును గాన్పించుచున్నవి. 4కావున వేదగిరినాయుడు క్రీ.శ. 1400, 1410 ల మధ్య రాజ్యము సల్పుచుండెనని నిశ్చయమగుచున్నది. ఈ రాజాజ్ఞచే యుద్ధకాండను సంపూర్తి యొనర్చిన అయ్యలార్యుడును నప్పటివాడే కావలయును. అయ్యలార్యుని తాతయగు శాకల్యమల్లభట్టు క్రీ.శ. 1404 లో మృతినందిన రెండవ హరిహరరాయల కాలమువా డనుటకన్న క్రీ.శ. 1336, 1355 ల మధ్య రాజ్యమొనర్చిన మొదటి హరిహరరాయలకు సమకాలీనుడనుట సమంజసము. ఇతని మనుమడగు అయ్యలార్యుడు క్రీ శ. 15 వ శతాబ్దారంభమున నుండెననుట యథార్థమునకు విరోధము కాజాలదు.5

---

2. Madras University Mss. Collection T/416 leaf 119 a.
3. Madras Govt. Ori. Mss. Library 10-18-2 (D 138) leaf 199 a.
4. S.I.I V 1242, VI 1100.
5. కందుకూరి వీరేశలింగం పంతులుగారు అయ్యలార్యుడును, హాళక్కి భాస్కరుడును నేకకాలమువా రను తమవాదమును నిర్వహించుకొనుటకై వేదగిరినాయనితో నయ్యలార్యునికిగల సంబంధము కల్పితమని నిరసించిరి. ఈ విషయమై తమ కవుల చరిత్రమున పంతులుగారు ఇట్లు వ్రాసియున్నారు. "అయ్యలార్యుడెట్లయినను భాస్కరకవికి సమకాలీనుడే ప్రతాపరుద్రుని యాస్థానములో శాకల్యమల్లభట్టు పండితుడుగాను, భాస్కరుడు కవిగాను ఉండినందున శాకల్యమల్లకవి తమ్మునికొడుకైన యయ్యలార్యుడు మల్లికార్జునకుమార రుద్రదేవులతోడి యాడువాడై యుండును. కవి చెప్పినదానికి ప్రత్యక్ష విరోధముగా నెవ్వడో లేఖకు డెప్పుడో వేద

గిరినాయనింగారు చెప్పించిరని వ్రాసినమాట పాటింపదగినది గాదు." (కవుల చరిత్రము, ప్రథమభాగము, పుట 319) పంతులు గారివాదములో రెండు విషయములు పరామర్శింపదగియున్నవి. మొదటిది; అయ్యలార్యుడు శాకల్యమల్లుని పుత్రుడనుట. ఇదితప్పు. వ్రాతప్రతులన్నిటియందును "శాకల్యమల్లుకవివర రామ (వీర) నరసింహావర జాప్పలార్యనందన...అయ్యలార్య విరచితంబైన" అనియేయున్నది. దీనికి పంతులుగారు శాకల్యమల్లునియొక్కయు రామన్యసింహునియొక్కయు తమ్ముడైన యప్పలార్యునిపుత్రుడని వివరణము వ్రాసిరి. కాని "శాకల్యమల్లకవివర రామ (వీర) నరసింహ" యను వాక్యమునకు శాకల్యమల్లుని పుత్రుడైన రామ (వీర)నరసింహుడని యర్థము చేసికొనుట సమంజసము. కొమ్మయ తిక్కడు, ప్రోలయ వేముడు, గుండయనారసింహుడు, నరసింహ కృష్ణ రాయడు ఇందుకు తార్కాణ. కావున అయ్యలార్యుని వంశ వృక్షము ఈ క్రింది రీతిగ నుండవలయును.

శాకల్యమల్లుభట్టు (?1315–1350?)

రామ (వీర) నరసింహుడు	అప్పలార్యుడు
	అప్పలార్యుడు (1400–1410)

రెండవది: అయ్యలార్యుడు హుళక్కి భాస్కరునికి సమకాలీనుడు కాడు. ఆట్లని యాతడెచ్చటను జెప్పియుండలేదు. వేదగిరినాయనిం గారు చెప్పించిరని లేఖకుడు వ్రాసినది "కవిచెప్పినదానికి ప్రత్యక్ష విరోధము" కాదు. "చ. అమరహుళక్కి భాస్కర మహాకవి చెప్పగనున్న యుద్ధకాండము తరువాయి" అను పద్యపాదము పంతులుగా రభిప్రాయపడినట్లు అయ్యలార్య హుళక్కి భాస్కరుల సమకాలీనతను నిరూపింపజాలదు. హుళక్కి భాస్కరుడు యుద్ధకాండము కొంతవరకు జెప్పెను. అసమగ్రముగా నిలిచియున్న భాగమును

అయ్యలార్యుడు రచించెనని మాత్రము తెలియుచున్నది. భాస్కరుడే అప్పటికి సజీవుడై యుండిన అయ్యలార్యుడు దానిని సంపూర్తి చేయవలసిన అవసరముండదు. కావున హళక్కి భాస్కరుడే కారణముచేతనో యుద్ధకాండను అసంపూర్తిగా విడిచియుండగా తరువాత దానిని అయ్యలార్యుడు సంపూర్తి యొనర్చె ననుట యొప్పును.

ఇందువల్ల హళక్కి భాస్కరుడు అయ్యలార్యుని సమకాలీనుడు కాడనియు. పూర్వకవియనియు దేలుచున్నది. ఇక నీ భాస్కరుడెప్పటివాడో తెలిసికొందము. సోమదేవరాజీయమున గాకతీయ ప్రతాపరుద్రదేవుని యాస్థానమున నితడున్నట్లు చెప్పియున్నది. కాని ఇదియెంత నిశ్చయమో తెలియదు. అయ్యలార్య దీతడు యుద్ధకాండయందు మొదటినుండి కొంత గ్రంథమును రచించెనని చెప్పియున్నాడుగదా. ఆ యుద్ధకాండ సాహిణిమారున కంకితమిచ్చినట్లు అందలి మొదటిపద్యమువల్ల దెలియుచున్నది. సాహిణిమారుని కాలమును గను గొనగలితిమేని భాస్కరుని కాలమును దెలియవచ్చును. సాహిణిమారునిగూర్చి కవులచరిత్రయందు వీరేశలింగం పంతులుగారు రిట్లు వ్రాసియున్నారు: "సాహిణిమారన్న ద్వితీయ ప్రతాపరుద్రుని కాలములో నాతని యశ్వసేనాధ్యక్షుడుగా నుండి, తద్రాజ్యము తురుష్కాక్రాంతమైన యనంతరమున స్వతంత్రుడై యొక దేశ పాలకుడయ్యెను. భాస్కర రామాయణ మాకాలమునందే రచియింపబడి 1330-వ సంవత్సరప్రాంతమునందే సాహిణిమారుని కంకిత మొనర్పబడియుండును." (కవులచరిత్ర, ప్రథమభాగము. పుట 304) ప్రతాపరుద్రుని కాలమున నాతని కొలువునం దొకమారయ సాహిణి యుండెనని శాసనములవల్ల దెలియుచున్నది. అతడశ్వసేనాధ్యక్షుడుగా నుండెననుట సంశయాస్పదము. అతడశ్వసాహిణియో, గజసాహిణియో, లేక రాయపట్టసాహిణియో నిర్ధారించి చెప్పుటకు దగిన సాక్ష్యమేమియుగానరాదు. మఱియునాతడు ప్రతాపరుద్రునిరాజ్యము తురుష్కాక్రాంతమైన పిమ్మట స్వతంత్రుడై, యొక దేశపాలకుడై, హళక్కి భాస్కరునిచేత రామాయణము గృతిగొనెననుట నిరాధారమైనవ్రాత; పంతులుగారిచే కల్పితము. హళక్కి భాస్కరునిచే సాహిణిమారుడు కృతిని గొన్నది వాస్తవమగునేని యది ప్రతాపరుద్రుని కాలముననే. అనగా క్రీ.శ. 1323 నకు పూర్వమే జరిగియుండవలయును. కాని హళక్కి భాస్కరునికిని అరణ్య

కాండను రచియించిన భాస్కరునికిని గల పరస్పర సంబంధమెట్టిదో తెలిసికొనినగాని ఈ విషయమును నిర్ధారించి చెప్పుటకు సాధ్యముగాదు.

హళక్కి-భాస్కరుడే యరణ్యకాండరచయిత యని వాఙ్మయ చరిత్రకారులందరును అభిప్రాయపడుచున్నారు. వీరి ననుసరించి చరిత్రజ్ఞానములేని యాంధ్ర పండితులు వారికంటె దృఢముగా అరణ్యయుద్ధకాండలను రచించిన భాస్కరుడొక్కడేయని వాదించుచున్నారు. కాని వాస్తవమును విచారించగా నిది సంశయగ్రస్తముగ గన్పట్టుచున్నది.

కృత్యాద్యంతములు ఆంధ్రకావ్యములయందు రెండుతెరగులుగానవచ్చుచున్నవి; (1) కృత్యాద్యంతములందు కృతిపతినిసంబోధించు పద్యములుగలవి (2) అట్లు సంబోధనలుగాక ప్రథమద్వితీయాది విభక్త్యంతములగు పదములచేగాని, వాక్యములచేగాని కృతిపతిని గీర్తించుపద్యములుగలవి. భాస్కరరామాయణము ముద్రితప్రతిబడి అరణ్యకాండముదప్ప తక్కిన కాండలన్నియు మొదటి తరగతికి జేరినవి. వీరేశలింగముగారన్నట్లు అరణ్యకాండము నందలి ప్రథమ ద్వితీయాశ్వాసాంతపద్యములు కృతిపతినిగూర్చి సంబోధనలుగాక వరుసగా ప్రథమ ద్వితీయాంతములుగా నున్నను నది పైజెప్పిన రెండుతెగల కావ్యములలో దేనియందునుజేరదు. ఏలనగా, విభక్త్యంతములచే గృతిపతులను గీర్తించిన కవులు పాటించిన నియమమందు పాటించలేదు.

ఆంధ్రగ్రంథములలో విభక్త్యంతముల నాశ్వాసాద్యంతముల బ్రయోగించినకవులు ముగ్గురు. నన్నెచోడుడు, తిక్కన, కేతన. వీరు పాటించిన నియమములను శ్రీ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రులవా రిట్లు వివరించి యున్నారు: "మంగళశ్లోకములతోగూడిన కృత్యాదిని విడిచి ద్వితీయాది ప్రత్యాశ్వాసాదియందును మొట్టమొదటి పద మేవిభక్తితో నుండునో యావిభక్తి జేర్చిన పదములతో దదాశ్వాసాదియందును, దత్పూర్వాశ్వాసాంతమునను గల కృతిపతిస్తుతి పద్యములను రచించిరి. కొన్నియెడల నాశ్వాసాంతపద్యము ననుసరించి తదాశ్వాసాంతమునందును, దరువాతి యాశ్వాసారంభముననుగల కృతిపతిస్తుతి పద్యములను వ్రాసిరి. మఱియు నాశ్వాసాది పదము ననుసరించక యాశ్వాసాది

---

1. కుమారసంభవ విమర్శనము, పుటలు 136–7.

పద్యమునగాని. గద్యమునగాని గల యీశ్వరవాచకము ననుసరించి కృతిపతి స్తుతిని రచించుటయు గలదు. కొన్నిపట్ల వాక్యమధ్యమున నాశ్వాసము ముగిసినపుడు తరువాతి యాశ్వాసారంభమునందలి మొదటిపదము ననుసరించుటయు గలదు."

అరణ్య కాండాదియందలి సాహిణిమారుని సంబోధించు కృతిపతిస్తుతి పై నియమములకు వ్యతిరేకముగ గానవచ్చుచున్నది. మరియు నీ పద్యమునకే పాఠాంతరము కొన్ని వ్రాతప్రతులయందు గానవచ్చుచున్నది.[1] ఇంకను ద్వితీయాశ్వాసారంభమునందలి కృతిపతిస్తుతి యచ్చుపుస్తకమున ప్రథమాంతముగ నున్నను కొన్నివ్రాతప్రతులలో కించిద్భేదముతో సంబోధనతో గూడియున్నది.

అచ్చు :

"క. శ్రీరామాకుచ యుగళీ
హారిద్రోల్లసితవత్స హరిచరణసరో
జారాధ్యుడు మారయధర
ణీరమణోత్తముడు సాహిణీ తిలకమిలన్"

వ్రాత :

"క. శ్రీరామా కుచయుగళీ
హారిద్రోల్లసితవక్ష హరిచరణసరో
జారాధ్యబుద్ధ విభుసుత
సారసహితతేజ ధీర సాహిణిమారా."

ఈ పద్యమును వావిళ్ళవారు బాలకాండమున రామాయణ కథానుక్రమణిక కును నయోధ్యాపుర వర్ణనకును మధ్య జొప్పించిరి. గ్రంథమధ్యమున గృతిపతిని సంబోధించు పద్యము నేల నిరికించిరో తెలియదు. వీరి పరిష్కారపద్ధతి కొన్నియెడల దుర్గ్రాహ్యముగ నున్నది.[2]

---

1. Madras University Mss. Colleetion. T 40.
2. వావిళ్ళ ముద్రిత భాస్కరరామాయణము. 1930 సం. ప్రతి, పుట 4,

మరియు కొన్ని వ్రాతప్రతులయందు అరణ్యకాండకు రెండారంభములు గలవు.[1] ఇంతేకాదు; రెండరణ్యకాండలును గలవు. వావిళ్ళవారు తమ ముద్రితప్రతియందంగీకరించిన పాఠమొకటి. ఈ పాఠముగల ప్రతులు అరుదు. నాచే బరిశోధితమైన 15 తాళపత్ర ప్రతులలోను ఈపాఠమెందును గానరాలేదు. అధోజ్ఞాపికగ వారంగీకరించిన పాఠము రెండవది. ఈ యధోజ్ఞాపిక పెక్కు ప్రతులయందు గలయధికపాఠముల సంకలనమని పాఠకులు భ్రమపడవచ్చును. పరిష్కర్తలట్టి తలపున కెడమిచ్చియున్నారు. ఏకాండముగ తాళపత్ర ప్రతులయందు పెక్కింట సామాన్యముగ గానవచ్చెడి పాఠము. ఏయే వ్రాతప్రతులనుండి యేయే భాగమును గొనిరో శాస్త్రీయపరిష్కార పద్ధతి ననుసరించి సూచించి యుండిరేని పాఠకులకేగాక వాఙ్మయ పరిశోధకులకు శ్రేయము వీరిప్రతి యుపకరించి యుండెడిది. ఈ విషయముల నన్నిటిని ఆలోచనసేయగా భాస్కరుడు రచియించిన అరణ్యకాండను ప్రాచీనులెవ్వరో తారుమారుచేసినట్లు తోచుచున్నది. అట్లుమార్చితిరుగ వ్రాసినవారెవ్వరని పరిశోధింపగా వారిలో కుమారరుద్రదేవు డొక్కడనితెలియుచున్నది.

ముద్రితప్రతియందును, కొన్ని వ్రాతప్రతులందును అయోధ్యాకాండమును కుమారరుద్రదేవుడు రచియించినట్లు చెప్పియున్నది. కాని పెక్కు తాళపత్ర ప్రతులవల్ల భాస్కరుడే తద్రచయిత యని తెలియుచున్నది. ఈ ప్రతులయం దయోధ్యాకాండతుదను భాస్కరునిగద్య యుండుటయేగాక అరణ్యకాండయందు వలె విభక్త్యంతములతో గూడిన యాశ్వాసాంతపద్యములు గలవు. ఆ పద్యము లపరిచితములగుటచే వానినిచ్చట నుదాహరించుచున్నాను.

శా. మందారద్రుమ సామ్యదానఘ (ఖ?)ని యున్మాదాంధవిద్వేషిరాట్
సందోహ ప్రకటోగ్ర శౌర్య హరణోత్సాహస్ఫురద్బాహు డా
నందాపాదిత భూసురప్రకరనా (నా?) స్తోత్రిపాతుర్హిండు కుం
దేందుప్రఖ్యముఖారవిందుడు గుణాతీతుండు ధీరుం డిలన్.

---

4. Madras University Mss. Collection, T 119.

క. బాలాలాలితనవపాం
చాలుడు సుకవిజన నికరసంస్తుత మృదువా
చాలుడు సుఖ సంభరితయ.
శోలలితుడు వైరిహృదయ భూచుడు పేర్మిన్.

మాలిని:

భువనభరిత కీర్తిస్ఫూర్తిధాకోరు (శ్రీ)త్రుం
డవిహితసుమ శౌర్యాదస్ఫురచ్ఛత్రుచైత్రుం
డు వితరణరణోగ్రాటోపసప్తాశ్వపుత్రిం
డు విబుధజనరక్షాధ్యుండు సన్మిత్రుడుర్విన్.

ఇంకొక కారణముగూడగలదు. భాస్కరుడు రచించిన రామాయణమున బ్రితికాండాంతమునను ఫలశ్రుతిని దెల్పి సీసపద్యమొండు గానవచ్చెడిని. అరణ్యకాండాంతమందలి పద్యము వావిళ్ళవారు 1930 వ సంవత్సరమున ముద్రించిన ప్రతియందు 226 వ పుటక్రింది యధోజ్ఞాపికయందు ముద్రించి యున్నారు. ఈ పద్యమనేక తాళపత్రప్రతులయందు గానవచ్చుచున్నది. ఇట్టి పద్యమే యయోధ్యాకాండ తుదనుగలదు. చూడుడు:

* అంత నక్కడ రాముడచటికి భరతుండు
గ్రమ్మరవచ్చి సామ్రాజ్యమునకు
దన్ను రమ్మనుచు బ్రార్థనసేయునో యని
చింతించి యప్పుడు చిత్రకూట
మున గల్గు మునిజనంబుల వీడుకొని మార్గ
తరువీక్షణంబుల గరము వేడ్క-
మిగులగా సీతాసుమిత్రాత్మజయుతుడై
లలి దండకావనస్థలికి నరిగె

---

* Madras University Mss. Collection T 519, Madras Govt. Ori, Mss. Library 10-18-3 (D 139)

ననగ మహి నయోధ్యాకాండ మభినుతముగ (?)
వినిన జదివిన వ్రాసిన విస్తరించి
చెప్పినను వారలకు సుఖసిద్ధి యొసఁగు
సంపదాయురారోగ్యముల్ సంభవించు.

ఆశ్వాసాంతములవల్లను, ఫలశ్రుతి సీసములవల్లను అయోధ్యారణ్య కాండలు భాస్కరుడు రచియించినట్లు తెలియవచ్చుచున్నది. ఫలశ్రుతిని తెల్పు పద్యములు బాలకిష్కింధాకాండల యంతమందొండురెండు తాళపత్రప్రతుల యందు గానవచ్చెడిని. వీనినిబట్టి చూడగా భాస్కరుడు రచించిన రామాయణ మున జాలభాగము ఖిలమైపోగా ఖిలమైన భాగములను కుమారరుద్రదేవాదులు పూర్తిచేసి, యట్లుతాము పూర్తిచేసిన కాండలను దమపేర్ల ప్రకటించుకొనిరని తోచుచున్నది. అచ్చుప్రతియందలి యయోధ్యాకాండాంత గద్యమునుబట్టి కుమార రుద్రదేవుని తండ్రి మారయయని తెలియుచున్నది. ఈ మారయయే భాస్కర రామాయణమును గృతిగొన్న సాహిణిమారుడని వీరేశలింగముగారనియున్నారు కావచ్చును. అగునేని సాహిణిమారుని కాలమునకే భాస్కరుని రామాయణము శిథిలమైనట్లు చెప్పవలసివచ్చును. ఇదియే నిశ్చయమగునేని అరణ్యాయోధ్యా కాండలను రచించిన భాస్కరుడు సాహిణిమారుని సమకాలీనుడు గాజాలడు; పూర్వికుడు గావలయును. ఆతడు సాహిణిమారుని కెంతపూర్వముండెనో కను గొనుటకు సాధనములెవ్వియును గానరావు.

ఇక హుళక్కిభాస్కరుడే యయోధ్యారణ్యకాండల రచయిత యగు నేమో విచారింతము. అతడు శాకల్యమల్లునితోపాటు కాకతిప్రతాపరుద్రుని యా స్థానమున నుండెనని సోమదేవరాజీయమువల్ల తెలియుచున్నది. మారయ సాహిణియను నొకదొర ప్రతాపరుద్రుని కొలువున నుండెనని శాసనములవల దెలియుచున్నది. కావున హుళక్కిభాస్కరుడు ప్రతాపరుద్రుని యాస్థానకవి యగుట నిక్కమైనచో నాతడు మారయసాహిణికి సమకాలీనుడగుట నిస్సంశ యము. ఈ సిద్ధాంతము అంగీకృతమేని హుళక్కిభాస్కరుడు అయోధ్యారణ్య కాండల రచయితయగు భాస్కరుడు కాజాలడు: అన్యుడగును. పై చర్చవలన దేలిన సారాంశమేమనగా, రామాయణ రచయితలగు భాస్కరు లిరువురని.

ఒకడు అయోధ్యారణ్యకాండలను రచించిన భాస్కరుడు; రెండవవాడు యుద్ధ కాండమున కొంత భాగమును వ్రాసిన హుళక్కి భాస్కరుడు.

ఈ సిద్ధాంతమునకు ప్రతికూలముగ గన్పట్టు విషయము నొకదానినిచ్చట బేర్కొనవలసియున్నది. అరణ్యకాండము సాహిణీమారుని కంకితమొనర్చి నట్లు అందలి యాశ్వాసాదిపద్యములు దెల్పుచున్నవి. తద్రచయితయగు భాస్కరుడు సాహిణీమారుని సమకాలీనుడు గానిచో నాతని కంకితమిచ్చుట యెట్లు పొసగును? ఈ యాక్షేపము పై సిద్ధాంతమునకు ప్రతిబంధముకాదు. ఆశ్వాసాంతపద్యములయందు సాహిణీమారుని బేర్కొనున వేవియు గానరావు. మొత్తము తొమ్మిది పద్యములుగలవు. అయోధ్యాకాండయందు మూడు; అరణ్యకాండయందారు. వీనియందెచ్చటను గృతిపతి పేరునుగాని, జననీజనకులనుగాని, యతని వంశమునుగాని తెలిపియుండలేదు. అతడెవరో శత్రుమర్దనుడగుటా జనిమాత్రము సూచింపబడియున్నది. ఆశ్వాసాది పద్యములు భాస్కరునిచే రచింపబడినవిగావు. మొదటియాశ్వాసారంభ పద్యమునకు పాఠాంతరములు మూడు గానవచ్చుచున్నవి.

అచ్చుప్రతియందు—

క. శ్రీహిత నయవిలసిత వా
ణీహిత మృదువచన ధారుణీహిత సం
దోహ త్రివిక్రమ విక్రమ
సాహస నగధైర్యసార సాహిణీమారా.

ఇదిగాక వ్రాతప్రతులయందు ఇక రెండగుపడుచున్నవి.

క. శ్రీరమణీరమణ కృపా
ధార సముద్యత్కటాక్ష దరహాస ముఖాం
భోరుహ వితరణకర వి
ణా రద బుద్ధయకుమార సాహిణీమారా.

క. శ్రీరమ్య స్థితివదన ప
యోరుహ కుండాల గండ యుగళిత విగళ
ద్ధారాళ దానధారా
సారప్లుత భవనహార సాహిణీమారా.

ఈమూటియందెద్దియు భాస్కర కృతముకాదు. ఏలన, విభక్త్యంతము లతో ఆశ్వాసాద్యంతములను రచించిన భాస్కరుడు తన్నియమము ననుసరించి అరణ్యకాండారంభమునందలి కృతిపతిస్తుతి పద్యమును ప్రథమాంతములతో రచింపవలసియుండెను. ఆ నియమమును దిగవిడచి సాహిణిమారుని సంబోధించు నీ పద్యములను రచించియుండడు. ఇతరులెవ్వరో భాస్కరుని పద్యమును మార్చియో, లేక ప్రతిపద్యము నల్లియోయిందు కూర్చిరని తోచుచున్నది. ద్వితీయాశ్వాసారంభ పద్యమునకు పాఠాంతరముగలదు. ఇది ఈ వ్యాసమున నింతకుపూర్వ ముదాహరింపబడినది. ఇందచ్చుప్రతియందలి పద్యము విభక్త్యంతములతో గూర్పబడినది. దీని పాఠాంతరము సంబోధనలతో గానవచ్చుచున్నది. కావున నీ యాశ్వాసాది పద్యములు పెక్కుమార్పుల నందిన వనుట తెల్లము. ఇవి భాస్కరవిరచితములుగావు. కుమారరుద్రదేవుడుగాని, లేక హుళక్కిభాస్కరుడు గాని రచించి భాస్కరుని పద్యములకు మారు వినినిచొప్పించిరని తలచెదను. మల్లికార్జునభట్ట కృతమగు మూడు కాండలును వీరే యరణ్యాదికాండాది పద్యముల రచయితలని సూచించుచున్నవి.

మల్లికార్జునభట్టు స్వవిరచిత రామాయణ త్రికాండములను శివున కంకితమొనర్చినట్లు తత్కాండాద్యంత పద్యములు ఘంటారవముగ చాటుచున్నను తద్విరోధముగ సాహిణిమారుని ప్రస్తావన యందు చేయబడియున్నది. కిష్కింధాకాండాంతమున 'లాటీచందన' యను శార్దూలవిక్రీడితమును, సుందరకాండ ప్రారంభమున "శ్రీరమణీ హృదయేశ్వర" యను కందపద్యమును సాహిణిమారుని సంబోధించుచున్నవి. ఈ పద్యములు రెండును మల్లికార్జునభట్టువికావు. ఏలన, బాల కిష్కింధా సుందరకాండలు మూడును శివాంకితములు. మరియు 'లాటీచందన' యన్న పద్యము ఎచ్చటనో ఒకటి రెంటియందే తప్ప వ్రాత ప్రతులయందు సామాన్యముగా గాన్పించదు. ఇంతేకాదు మల్లికార్జున భట్టొనర్చిన యాశ్వాసాంతపద్య రచనా విధానమున కది ప్రతిఘటించుచున్నది. ఇతర కాండలందువలెగాక పైకాండలయందు మూటియందును నాశ్వాసాంతమున రెండు పద్యములే గానవచ్చుచున్నవి. బాలకాండాంతమున నొక కందమును, మాలినియుగలవు. అట్లే సుందరకాండాంతమునను కందమును, మాలినియు గానవచ్చుచున్నవి. కిష్కింధాకాండాంతమున మాత్రము యథావిధి మాలినియున్నను కందపద్యమునకు బదులు "లాటీచందన" యను సాహిణిమారుని సంబో

ధించు కార్దూలవిక్రీడితము గానపచుచున్నది. దీని తరువాతి మాలిని శివుని సంబోధించుచున్నది. అట్లే కాండాదియందును శివసంబోధనకలదు. కాబట్టి మల్లికార్జునభట్టు తాననుసరించిన మార్గము చొప్పున నిచ్చటను శివుని నొక కంద పద్యమునసే సంబోధించియుండెననుట నిశ్చయము. మరి "లాటీ చందన"ను కిష్కింధాకాండాంతమున మల్లికార్జున భట్టు విరచిత కందమును దొలగించి తత్ స్థానమున గూర్చినవారెవ్వరు? సాహిణిమారుని కుమారుడగు కుమార రుద్రదేవుడైనను గావలయును; కాదేని తదాశ్రితుడగు హుళక్కి భాస్కరుడేనియు గావలయును: లేక సాహిణిమారునికి భాస్కరుడు స్వవిరచిత రామాయణము సంకితమిచ్చెనన్నగాథ యుత్పత్తియైన పిమ్మట తదనుసారము బుద్ధిమంతులగు వ్రాయసకాండ్రేనియు వ్రాసి చేర్చియుండవలయును. ఇట్లు వ్రాయసకాండ్రచే చేర్చబడిన యన్యకవికృతములగు పద్యము లీభాస్కర రామాయణమునన్నెన్నియోగలవు. వ్రాతప్రతులనన్నిటిని ముందువైచుకొని వానినన్నిటిని బరిశోధించి పరిష్కరించనోపికగల పండిత ప్రకాండులును, వారికి గ్రాసవాసంబులపైజింత కలుగనీయక తదేకదృష్టితో బరిష్కరింపించు వాఙ్మయాభిమానులగు లక్ష్మీపుత్రులును గలిగిరేని యవియన్నియు వ్యక్తములు కాగలవు. కిష్కింధాకాండాద్యంతములను మార్చినవారే తక్షిన యయోధ్యాది కాండాద్యంతములను మార్చియుందురు.

ఈ చర్చవలన దేలిన విషయము లేవి యనగా——

1. వ్యాసారంభమున నుదాహృతమైన రామాయణ రచనా విధానమును దెల్పు కథయందు జెప్పినట్లు తద్రచయితలంద రేకకాలమువారుగారు.

2. అయ్యలార్యుడు దేవరకొండప్రభువగు పెదవేదగిరి నాయనిగారి యాస్థానకవి. ఇతడు క్రీ.శ. 15 వ శతాబ్దారంభమున నుండెను.

3. హుళక్కి భాస్కరుడు అయ్యలార్యుని సమకాలీనుడుకాడు. అతడయ్యలార్యుని తాతయగు కాకల్యమల్లునికిని, భాస్కరరామాయణమున గొన్ని కాండలకు గృతిపతియు గాకతిప్రతాపరుద్రుని సేనాధ్యక్షులయం దొక్కడునగు మారయసాహిణికి సమకాలీనుడు గావచ్చును.

4. అరణ్యకాండను రచించిన భాస్కరుడు హుళక్కి భాస్కరుడుగాడు. అతడు ప్రాచీనుడు. అతడే యయోధ్యాకాండ రచించెను. అతడే బాల కిష్కింధా కాండలనుగూడ రచియించె నని తలంపునకెడముగలదు. అతడు రచించిన రామాయణము శిథిలమగుడు, అందలి నష్టభాగములను సంపూర్తి యొనర్చి కుమారరుద్రదేవాదులు ఆయాకాండలను దమ నామముల బ్రకటించుకొనిరి.

5. వీరే కాండాద్యంతములను మార్చి సాహిణిమారాంకితములుగ జేసిరి.

పద్యకథా వాఙ్మయము

ఆంధ్రవాఙ్మయచరిత్రలో గథావాఙ్మయముక్రొత్తదని పలువురి యభిప్రాయము. మనకథావాఙ్మయము రెండువిధములైనది. పద్యకథావాఙ్మయము. గద్య లేక వచన కథావాఙ్మయము అని. ఈ నవీనత్వము రెండవ తరగతి కథావాఙ్మయమునకు చెల్లును. కాని మొదటివానికి చెల్లదు. కథలు చెప్పడము ఆధునికులు నూతనముగ కల్పించినవిద్యకాదు; వినడం గాని చదివి యానందించడంగాని ఆంధ్రులకు నేడు నూతనముగ సంప్రాప్తమైన గుణం కాదు. ఈ రెండును ఆంధ్రజాతితోకూడా పుట్టినవి. ఈ యంశమునే ఎట్టాప్రెగ్గడగారు 'గాసటబీసటే చదివి గాధలు త్రవ్వు తెనుంగువారికిఁ, అనుమాటలతో వ్యక్త పఱచియున్నారు.

పద్య కథల యుత్పత్తికి గారణము

కథలు ప్రజావాఙ్మయమునకు జెందినవి. విద్యావంతులకంటే పామరజనులనిమిత్తమే యవి బయలుదేరినవని నా యభిప్రాయము. కథకు లెల్లయెడలను జనసామాన్యమునకు సుబోధము వాడుక భాషయందు పొడిమాటలతో గథలాజెప్పుట సహజముగాని యవి లిఖితరూపముగా బరివర్తనమందినపుడు వ్యాకరణ విరుద్ధముగాని సలక్షణ భాషయందు వ్రాయబడుచువచ్చినవి. ఇట్టివచనకథలు మన ప్రాచీనవాఙ్మయమున గానరావు. అన్యభాషలయందు గలవు. దీనికి గారణము లేకపోలేదు. ఛందోబద్ధముగాని వ్రాత వ్రాతకాదని మన పూర్వికులు దలచిరి. కావున పదునాఱవ శతాబ్దమువరకును మన వాఙ్మయమున వచన రచన పొడచూపలేదు. ఏ విషయమునుగూర్చి

గ్రంథము రచింపబడినను నది పద్యరూపమున బయలువెడలెడిది. ఒక కథలే కాదు. వ్యాకరణములు నిఘంటువులు వైద్య గ్రంథములు ఇవి అవి అననేల అన్నియు బద్య గ్రంథములే. గణితము వ్రాయువారుగూడ ఈ మార్గమునే యవలంబించి బాలురువేయుటకై యిచ్చెడి లెక్కలాసైతము 'ఖర్జూరఫలములు గణికుండు కొనితెచ్చి సగబాలు మోహంపు సతికి నిచ్చె. యని పద్యరూపమున వ్రాసిరి. ఇందుమూలమున వచన రచనకు ఆదరము లేకపోయినది.

మన పద్యకథా వాఙ్మయమును మూడు భాగములుగ విభజించవచ్చును. (1) భాషాంతరీకరణములు. (2) అనుకరణములు. (3) స్వతంత్ర రచనలు.

(1) ఈ తరగతికి జెందినవి రెండు లభ్యమైనవి. ఇందొకటి కేతనకృత దశకుమార చరిత్రము. దండ్యాచార్యుని సంస్కృతగద్య దశకుమార చరిత్రమునకు ఆంధ్రీకరణము. ఇందువల్లనే యితనికి 'అభినవదండి' యను పేరు గలిగినది. ఇతడు తన కవిత్వమువలన తిక్కనను మెప్పించెనట. దశకుమార చరిత్ర తిక్కనకే యంకితమీయబడినది. కవిత్వముచక్కనిదే. కాని యంత ప్రశస్తమైనదికాదు. "కేతన రసోచితముగ బద్యములు వ్రాయుటలో మిగులనేర్పుగలవాడు. శృంగారరసమున నీ కవి మిగుల మెలకువ జూపును. స్త్రీ వర్ణనమున నీ కవి కచకుచాదివర్ణనముల కెడ మీయడు. సంభోగశృంగారముగూడ గొన్నితావుల మనోహరముగ సభ్యముగ వ్రాసియున్నాడు. కేతన స్త్రీ వర్ణనము మనోజ్ఞముగనుండును. పోకడయు జవిగొలుపుచు గ్రొత్త తీరుతీయములతో బింకముగ నుండును." అని యొకానొకరు వ్రాసియున్నారు. దీనినిబట్టి చూడగా కేతన మహామడిగట్టు కొనియుండిన కవి యనియు గచకుచాదులను ఒల్లనివాడనియు, సంభోగాది వర్ణనలను ముక్కుబట్టుకొని నియమనిష్ఠలతో చేయువాడనియు దోచవచ్చును. ఇది విచారణీయము. కేతనకు ఈ విమర్శకుచిచ్చిన యోగ్యతాపత్రములో నెక్కువభాగము దండికి చెందవలసియున్నది. అచ్చటచ్చట మార్పులల్పములు గానవచ్చుచున్నను దండి గ్రంథమునకిది యాంధ్రీకరణమనుట మరువరాని విషయము. కథకునికి ముఖ్యముగ నుండవలసిన గుణములు రెండు కల్పనా కౌశల్యము, కథనునడపునేర్పు. కేతనయం దీగుణములెంతమట్టుకు కలవో

కనుగొనుటకు సాధ్యముగాదు. ఆంధ్రీకృత దశకుమార చరిత్రమూలమున వీనిగనుటకు వీలుగాదు; అందువ్యక్తమగు గుణములు దండ్యాచార్యునికి జెల్లును గాని కేతనకు జెల్లవు.

ఈ తరగతికి చేరిన గ్రంథము మరియొకటి కలదు; ఇది కొఱవి గోపరాజకృత సింహాసన ద్వాత్రింశిక. దీని మాతృక యెద్దియో తెలియదు. కాని యిది స్వతంత్ర గ్రంథముగాదనియు సంస్కృతమున కాంధ్రీకృతమనియు కవియే చెప్పియున్నాడు—.

ఈ సరసోక్తి కావ్యమొక డిమ్మల సంస్కృత భాష నచ్చుగా
జేసిన నట్ల వీడు మఱి చేయుటయేటిది యంచు జెప్పగా
జేసి యనాదరం బురక చేయకుడీ విలకాడు తూటుగా
నేసిన నందెపాఱు మఱి యేసినవానిద సూటిగావునన్...

కావున మాతృక యత్కృతమో తెలియరాకున్నను సింహాసన ద్వాత్రింశిక యాపేరుగల యొక సంస్కృత గ్రంథమున కాంధ్రీకరణమని విశ్చయమగుచున్నది.

కొఱవి గోపరాజు, క్రీ. శ. 15 వ శతాబ్దారంభమున నుండెను. శ్రీధునాని సమకాలికుడు. ఇతని పెదతాతయగు అబ్బయ పుత్రులగు బాచయ సింగయలు రాచకొండ ప్రభువైన యనపోత కుమారసింగయకు మంత్రులు. ఈ సింగయయే రసార్ణవసుధాకర కర్తయైన సర్వజ్ఞ సింగ నృపతి. ఇతడు క్రీ. శ. 1385 నకు దరువాతరాజ్యాభిషిక్తుడాయెను. ఇతనిమంత్రులగు బాచయ సింగన లప్పటివారే కావలయును. వారిపినతాత గోపయ మనుమడు గోపరాజు, క్రీ. శ. 15 వ శతాబ్దారంభమున నుండెననుట యెప్పును.[2]

---

[2] బ్రహ్మశ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు సింహాసన ద్వాత్రింశిక పీఠిక, - ఆం. సా. ప. ముద్రణపుటలు 47 - క్రీ. శ. 1420. 1480 మధ్య గోపరాజుండెనని వ్రాసినారు. పీఠికాల నిర్ణయమున కాధారము సింహాసన ద్వాత్రింశికలోని యాంధ్రకవి స్తోత్రము.

ఆ భారత పర్వత్రయ, మీ భారత పర్వమెల్ల నెఱుఁగదెనుఁగునన్
శ్రీ భారతిగతి జెప్పిన, నా భావుకు మును దలంతు నన్నయభట్టున్
లేములవాడక ఋచియై, లేములవాడంజరించు లేములవాడం.
దా మెఱసిన భీముని సుత, భీముని బలభీము విమత భీముని దలఁతున్.
అనఘు హాళక్కి భాస్కరు, మహామతి బిల్లలమట్టి వీరరా
జును, ఘను నాగరాజు, గవిసోమని, దిక్కనసోమయాజికే
తనకవి, రంగనాథు, నుచితజ్ఞుని నెఱిగిన, నాచిరాజు సో
మన, నమరేశ్వరుం, దలఁతు మత్కులచంద్రుల సత్కవీంద్రులన్—

ఈ కడపటి పద్యమున బేర్కొనబడిన పిల్లలమట్టి వీరరాజే జైమిని భారతాది బహుకావ్యకర్తయైన పిల్లలమర్తి పినవీరభద్రుడని భ్రమించి శ్రీశాస్త్రిలవారితడు పినవీరభద్రుని సమకాలికుడనియు 1480 వరకును జీవించియుండెననియు వ్రాసినట్లు దోచుచున్నది. ఇచట బేర్కొనబడిన పిల్లలమట్టి వీరరాజు పినవీరభద్రుడు కాడు. ఇతడు పెదవీరరాజు. శ్రీనాథునికి గురువు. ప్రోలయవేమారెడ్డి సమకాలికుడు. క్రీ. శ. 14 వ శతాబ్దమున నుండెను. శ్రీనాథుడు దన హరవిలాస పీఠికలో దన 'బాలసఖు' డగు నవచిదేవయ త్రిపురాంతకుని బ్రశంసించుచు—

పిన్నటనాడు సత్కరుణ పిల్లలమట్టి మహా ప్రధాని పె
ద్దన్న గురూత్తముండు తగ నక్షరశిక్షయు శైవమార్గసం
పన్నతయున్ వివేక పరిపాటియునుం గృపజేసెనర్థి నే
యన్నకు నట్టిసెట్టి త్రిపురాంతకునిం దగు బ్రస్తుతింపఁగన్...

అని వ్రాసియున్నాడు. కావున గోపరాజుచే బేర్కొనబడిన పిల్లలమట్టి వీరరా జీపిల్లలమట్టి పెద్దన్నయగును గాని క్రీ. శ. 15 వ శతాబ్దాంతమున సాళువ నరసింహరాయల యాస్థానమందుండిన పినవీరభద్రుడు కాజాలడు. కందుకూరి వీరేశలింగంపంతులుగారు పిల్లలమట్టి పినవీరన్నకు పెదవీరన్న యను యన్నయొకడుండెనని వ్రాసిరి. తాతయు దండ్రియు నగ్రభ్రాత యునుం దాను భువన భాసురకృతి నిర్మాతలు, అను జైమినీభారత పద్యము వల్ల నీతనికి గవియైన యన్నయొక్కడుండెనని నిశ్చయమగుచున్నది.

ఆతనిపేరు పెదవీరభద్రుడనుట కేయాధారమునుగానరాదు. తాత పేరు మనుమనికిపెట్టు నాచారమునుబట్టి చూడగా నితని తాతపేరు వీరభద్రుడనియు నతడే హరవిలాసమున బేర్కొనబడియుండు పిల్లలమఱ్ఱి మహా ప్రధాని పెద్దన్న యనియు నూహించుట కవకాశముగలదు.

సంస్కృత సింహాసన ద్వాత్రింశతి తత్పూర్వము విరచింపబడియుండవలయును. కాకతీయ యుగమున రుద్రదేవుని యనంతరము రచింపబడియుండెనని తలచుటకు గ్రంథాంతర్గత మైనసాక్ష్యము కొంతవఱకు కానవచ్చుచున్నది. ఇరువదియొకటవ కథయందు గ్రహలునియుదంతమున నతడు—

"..... యేగె వేడ్కతో
గాకితమూలశక్తి కవిగా నొనరించిన పైడిచట్టు నా
నేకశిలాభిధానమున నెన్నికకెక్కి ధరిత్రిలోన నే
పోకల బోనియట్టి సిరిపుట్టినయింటికి నోరుగంటికిన్.
చందనగంధులు న్వీటులు జాణలు దానవినోదులుఁ బ్రభా
సుందరమూర్తులుఁ గవులు శూరులు బెద్దలు నుల్లసిల్ల సం
క్రందన వైభవాఢ్యుఁడగు కాకతి భూపతి రాజ్యలక్ష్మి బెం
పొందెడు నప్పురంబున మహోత్సవలీలలనుండె నేర్పునన్.

అని కాకతి భూపతి రాజ్యలక్ష్మి బెంపొందెడు నేకశిలాభిధానమున నెన్నికగన్నయోరు గల్లు పేర్కొనబడియున్నది. ఓరుగల్లు కాకతీయులకు గణపతిదేవుని కాలమున ననగా క్రీ. శ. 1200 ప్రాంతమున రాజధానియాయెను. క్రీ. శ. 1323 లో ప్రతాపరుద్రదేవుని పతనముతో గాకతీయులయేలుబడి సమాప్తినందెను. కావున సంస్కృత సింహాసన ద్వాత్రింశిక కాకతీయయుగమున, క్రీ. శ. 1200_1323. ల, మధ్య రచియింపబడెనని నిశ్చయమగుచున్నది. ఇంతదూరము ఈ కాలనిర్ణయచర్చ కిచట నావశ్యకతయేమియును ప్రశ్న యొకటి బయలుదేరవచ్చును. మొదట దీనిమూలమున కాకతీయ యుగమున నాంధ్రదేశమున విద్వజ్జనులకు గద్యవాఙ్మయముపై నభిరుచి హెచ్చినదని రుజువగుచున్నది. మఱియు ద్రిభమాంధ్ర పద్యకథానికాయ మనబడు కేతన కృతాంధ్రీకృత దశకుమారచరిత్రయును సంస్కృత సింహాసన ద్వాత్రింశతియు

గొంచమించుమించుగ నేకకాలమున విరచింపబడిన వగుటచేత, సంస్కృత కథాగ్రంథముల నెన్నిటినోచూచి సంస్కృత మెఱుగని యాంధ్ర ప్రజకొఱకు కేతనదశకుమార చరిత్రను తెనుగుజేసెనను తలపున కెడము గలగు చున్నది.

పై విషయముల సత్యాసత్యములెట్లున్నను గోపరాజకృతసింహాసన ద్వాత్రింశిక మన పద్యకథావాఙ్మయమున నత్యున్నత స్థానమున కర్హమైనది. అనర్గళమైన కవిత్వధార, కథారచన కనువైనశైలి, మధురమైనభాష వర్ణనల పొందిక ఈ గ్రంథమున సర్వత్రగాన వచ్చెడు గుణములు. కథాసరణిని యవిచ్ఛిన్నముగ నడుపుటయందుగాని గోపరాజు నేర్పిట్టిదియని నిశ్చయించి చెప్పుటకు వీలుగాదు. ఇందలి కథాసరణి నిరాఘాటముగ సాగునడియైనను అందందు అడ్డంకులు లేకపోలేదు. ఒక యుదాహరణము. 9వ, కథయందు కమలాకరుని దేశాటన వర్ణన వ్యాజమున కవి యాంధ్ర ఛందస్సునుగూర్చి 22 పద్యముల ఉపన్యాసమును కథయందు చొప్పించియున్నాడు. ఇట్టి వింకను గలవు. కాని దశకుమార చరిత్రవలెనే సింహాసన ద్వాత్రింశికము సంస్కృత గ్రంథమున కాంధ్రీకరణము. కావున యందలి గుణలోపములు మాతృకారచి యితలకు జెందును. కాని తర్జుమాలకు జెందవు. కాని యీయమూల్య కథా గ్రంథము నాంధ్రీకరించి యాంధ్రలోకమునకు బ్రసాదించిన గోపరాజు మిక్కి-లియు బ్రణంసాపాత్రుడు. కళాభిమాని యొక్కని యాదరమునకే పాత్రముకాదు గోపరాజు సింహాసన ద్వాత్రింశిక-చరిత్రకారుడతనితోడి భాగస్వామి-అట్లనుటచే సింహాసనద్వాత్రింశిక యొక చరిత్ర గ్రంథమని యెంచరాదు. కాకతిరాజుల చరిత్రకాని, వారి రాజ్యాంగ వర్ణనకాని, దండయాత్రలుకాని యందులేవు; కానియప్పటి యాంధ్రుల జాతీయజీవనమందు ప్రతిబింబితమైనది. అందలి కథలన్నియు ననాదినుండి పరంపరగ ప్రచారమున నుండినవే. కాని యందలి పాత్రలన్నియు కాకతీయులనాటి యాంధ్రులరూపు ధరించినవి; వేష భాషలును నాచార వ్యవహారములును అప్పటివే. ఒక యుదాహరణము. తృతీయాశ్వాసమున ఆరవ బొమ్మకథయందు వసంతోత్సవ సందర్భమున విక్రమార్కుడు జలక్రీడయొనర్చిన తర్వాత యతనియంతఃపురకాంతలు వస్త్ర ములు ధరించిరని తెలుపుచు నలువదియెనిమిది పేళ్ళుగల చీరెలను బేరొక్క-

న్నాడు. ఈ పట్టిక వలన నప్పటి యాంధ్రస్త్రీలెట్టి చీరల గట్టుకొనువారో తెలియ వచ్చుచున్నది. ఇందు కామవరంబులును సూరవరంబులును ముఖ్యముగా గమ నింపదగినవి. ఇవి రెండును వేంగిమండలములోని రెండు గ్రామముల పేర్లు. ఈ గ్రామములు రెండును నాకాలమున చీరలనేతయందు ప్రఖ్యాతికెక్కియుండె నని తెల్లమగుచున్నది. కావున గోపరాజకృత సింహాసన ద్వాత్రింశిక కాకతీయ యుగచరిత్ర రచన కమూల్యమగు నాధారమగుచున్నది.

ఈ తరగతికి జేరినవే యాంధ్రీకృత పంచతంత్ర గ్రంథములు. మనకు దెలియవచ్చినవి తెనుగు పంచతంత్రములు నాలుగు గలవు. ఇందు ప్రాచీన తమమైనది నష్టమైపోయినది; మడికి సింగనకృతమైన సకలనీతి సమ్మతము నందు పేర్కొనబడినది. రచయిత యెవ్వరో తెలియదు. ఉదాహృతములైన పద్యములనుబట్టి చూడగా రచయిత కవిత్వము జక్కగ జెప్పగలవాడని తోచుచున్నది. ఈ కవి లభించుచున్న పంచతంత్రముల కర్తలకంటె బ్రౌఢుడని వెంకట నాథాదుల పద్యముల పోల్చిచూచిన నెఱుంగవచ్చును; అని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రనుచున్నారు. అందందు గానవచ్చు పద్యములు నాధారపఱచుకొని కవిత్వ గుణవిశేషములను నిర్ణయింప దలపెట్టుట సమంజ సముగాదు; కావున రామకృష్ణకవిగారి యభిప్రాయముతో నేకీభవించుటకు మన సొప్పకున్నది. ఇదిగాక యిప్పుడు మనకు లభ్యములైన పంచతంత్ర గ్రంథ ములు మఱి మూడు గలవు. అందు మొదట పేర్కొనదగినది నారాయణ కవి కృతము; ఇతడు కపిలేశ్వర పురుషోత్తమ గజపతుల కాలమువాడు; కవిత్వము రసవంతమైనదే. ఇతని కవిత్వము సలక్షణమైనదయి చక్కని తెలుగు పదము లతోగూడి యున్నది అని వీరేశలింగముగారి యభిప్రాయము; [3]రెండవ పంచతంత్రరచయిత భావయ; ఇతడు కృష్ణరాయల సమకాలికుడు ఇతని గ్రంథమిప్పుడే ముద్రితమైనది ఇంకను ప్రకటితముగాలేదు. కవిత్వాతిశయ మున నితడు నారాయణకవికి దీసిపోవువాడుగాడు. మూడవవాడు భైచరాజు వెంకటనాథుడు. ఇతనిది నారాయణకవి గ్రంథముకంటె రసవంత మైనదని విమర్శకులయందనేకులభిప్రాయపడుచున్నారు; కాని

---

3. చూడు సకలనీతి సమ్మతము.—ఉపోద్ఘాతము. పుట. 4.
4. ఆంధ్ర కవుల చరిత్ర. పుట 333.

యభిప్రాయభేదమున కెడమున్నది. నారాయణకవి వర్ణనల నతిశయ ముగబెంపక కథయొక్క నడకను గుంటుపడనీయక గ్రంథరచనను సాగించి నాడు. భావయగూడ వితనిమార్గమునే పట్టినాడు; కాని వెంకటనాథుని పద్ధతి వేఱు; ఇతని గ్రంథమున వర్ణన లెక్కువ. ప్రబంధఫక్కీయం దెల్లయెడలను ప్రతిబింబించుచున్నది. ప్రబంధ ధోరణి నచ్చినవారికి అతని కవిత్వమే మెఱు గెక్కినదిగ దోచును. వర్ణనాడంబరములేని కవిత్వమనందభిమానముగల వారికి నారాయణకవికంటె నధికుడను యభిప్రాయముకలుగుట సహజమే. కథను నడపుటయందు ఒక్కొక్కొక్క దారిని పట్టినను అందఱును సమ ర్థులే. వెంకటనాథనారాయణ కవులనుగూర్చి కీ. శే. కళా ప్రపూర్ణ డాక్టరు చిలుకూరు నారాయణరావుగారు చెప్పినమాటలు స్మరింపదగినవి; కథా నిర్వ హణంగురించి ఆలోచిస్తేమాత్ర మొకరికొకరు తీసిపోరు. కొన్నిచోట్ల వెంకట నాథునిది పైచేయి అవుతుంది; కొన్నియెడల నారాయణకవిదే అవుతుంది. పంచతంత్రము నీత్యుపదేశానికి పుట్టినది గనుక ఆ నీతులుచెప్పడములో సంస్కృత శ్లోకాలకున్న పొంకము. బింకము తెనుగు పద్యాలలోని కెవరు యెక్కువగా తెచ్చినారో ఆలోచిస్తే ఇద్దరినిన్నీ మనము మెచ్చుకోవలసినదే. సంస్కృత పంచతంత్ర శ్లోకాలను కంఠస్థముచేసి ప్రాస్తావికముగా పఠించ వచ్చును. అట్లే పొంకముగా బింకముగా గుత్తముగా ఉన్న తెలుగు పద్యము లను అనేకములను ఇద్దరుకవుల గ్రంథాలనుంచినీన్ని ఉదాహరించవచ్చును." ఈ నారాయణరావుగారి వాక్యములన్నియు భావయకును అన్వయించును.

వెంకటనాథుని కవిత్వమున ఇతర పంచతంత్రకర్తలయందు గానరాని విశేషగుణము ఒకటి యగపడుచున్నది. తరువాతియుగ కథా వాఙ్మయమున దానికి ప్రాధాన్యత కలుగుటవలన దాని నిచ్చట ఇంచుక ప్రస్తావించుట యుక్త మని తోచెడిని. కథా వాఙ్మయమున నితడు వాస్తవిక పద్ధతికి దారిచూపెను. కవిత్వమునకు నవీన గుణసనాథుడైన నాచనసోమనాథుని మేలు బంతిగాగొని యాతడాంధ్రకవిత్వమున నూతనముగ ప్రవేశపెట్టిన పద్ధతి నవలంబించెను. ఏ వస్తువునుగాని వర్ణించవలసివచ్చినప్పుడు ఆ వస్తువునకు సహజములగు నంగములను జారవిడువక యది పాఠకుల చక్షువులకు బొడకట్టునట్లుగా

---

5. భారతి. 18. పుట. 632 (వృష. జ్యేష్ఠము)

వర్ణించుట. నాచనిసోమనాథుని కవనమందలి నవీనగుణములలో నొక్కటి. దీనిని వాస్తవికపద్ధతి యనవచ్చును. వేంకటనాథుడు దన గ్రంథమునందు పెక్కుతావుల నీపద్ధతి నవలంబించినాడు. ఈ పద్ధతి మనపద్య కథానికయంచెట్టి మార్పునకు గారణభూతమాయెనో మున్ముందు వివరింపబడును. వెంకట నాథుని కవిత్వమున గానవచ్చు మరియొక విశేషము కల్పనా చాతుర్యము. నారాయణకవియు భావయయు సంస్కృత పంచతంత్రములోని కథలను మార్పక యథారీతిని చెప్పుటతో దృప్తినందిరి. వెంకటనాథుడట్లుగాదు; బంగా రమునకు వెలిగారమట్లు సంస్కృతమున లేని కథాంశములనుచేర్చి హృద యాహ్లాదముగ కథానిర్మాణముగావించెను. ఒక యుదాహరణము జాలును. మేకుబెజికి మడిసిన కోతికథకు సంస్కృతమునలేని యుపోద్ఘాతమును దగిల్చి శృంగారయుగమువాడగుటచే స్వయుగధర్మము ననుసరించి తన కబ్బమున శృంగారమునకు ప్రాధాన్యమొసగి భోగినీ స్త్రీని ప్రస్తుత కథకు కథానాయిక గావించెను. కథకుడగుటచే గథయందు నూతనాంశములజేర్చి. పెంపొందించెను. వాస్తవిక కవియగుటచే దన కాలమందలి భోగినుల పరివర్తనలను, విష చికిత్సా పద్ధతులను వాస్తవము చొప్పున వివరించెను. కాని ఈ వర్ణనలు కొన్ని తావులందు కథ నడకను సాగనీయక నడ్డ పడుచున్నవి; కథా శిల్పదృష్టిని చూచిన నిది దోషమగునుగాని గుణము గాజాలదు.

అనుకరణములు

అనుకరణములనగా పాతకథలను గ్రహించి నూతన మార్గమున రచించుట. ఇట్టివి పెక్కుగలవు. వానియందు ముఖ్యమైనవానిని ఇచట పేర్కొను చున్నాడను. (1) వెన్నెలకంటి యన్నయ్య విరచిత షోడశకుమారచరిత్ర. (2) జక్కన విక్రమార్క చరిత్ర. (3) అనంతుని భోజరాజీయము. (4) ఎఱ్ఱన కృత సకలనీతి కథానికము.

(1) వెన్నెలకంటి యన్నయ్యకాలమిది యని నిశ్చయించి చెప్పుటకు దగు సాధనములు లేవు. ఇతని షోడశ కుమార చరిత్ర సంపూర్ణ గ్రంథము లభ్యముగాలేదు. కృత్యాది లేకపోవుటచే గ్రంథకర్త చరిత్రను నిర్ణయించుటకు దగు సాధనములు లేకపోయినవి. ఆశ్వాసాద్యంతములనుబట్టి చూడగా నితడు

వెన్నెలకంటి యన్నయ్య మనుమడనియు మారామాత్యుని పుత్రుడనియు దెలియవచ్చుచున్నది. ఇతని కాలమును నిర్ణయించుటకు సప్తమాశ్వాసాంత మందలి పద్యమొకటి తోడుపడుచున్నది.

సరసానందన సత్కళాగమ పరీక్షా కృష్ణ కందార భా
స్వర నానారస భావనిర్మథన భోజక్ష్మాస విద్యానిరం
తర గోష్ఠీ జగదేకమల్ల బహు శాస్త్రగ్రంథ సిద్ధాంత వి
స్తర విజ్ఞాన కవిత్వ తత్త్వకలనా సర్వజ్ఞ సోమేశ్వరా"

ఇందు పేర్కొనబడిన నలుగురియందును కృష్ణకందార నామధారులిరువురు గలరు. ఒకడు రాష్ట్రికూట వంశజుడగు ముమ్మడి కృష్ణభూపతి. ఇతడు క్రీ.శ. 938 మొదలు 968 వరకును మాన్యఖేటపురము రాజధానిగ దక్షిణాపథము నేలెను. రెండవవాడు దేవగిరి యాదవ వంశజుడు. సింఘణుని మనుమడును జైతుగి పుత్రిడును నగు కృష్ణుడు. ఇతడు క్రీ. శ. 1247 మొదలు 1260 వరకును రాజ్యమునేలెను. ఈ పద్యమునందు జెప్పబడిన కృష్ణకందారుడు రాష్ట్రికూట ముమ్మడి కృష్ణుడేకాని యాదవ కృష్ణుడుకాడని నాయభిప్రాయము. ఏలనగా నితనితోగూడ పేర్కొనిన భోజుని (క్రీ. శ. 1020–1050). జగదేక మల్లుని (1038–1042). సర్వజ్ఞ సోమేశ్వరుని (1126–1139) కాలక్రమము దప్పక చెప్పియున్నాడు. మఱియు కృష్ణకందారుడు సత్కళాగమ పరీక్షయందు నిపుణుడని పై పద్యమున చెప్పియున్నది. రాష్ట్రికూట కృష్ణకందారుడు కవిజన పోషకుడు. పొన్నకవి భువనైక రామాభ్యుదయ గత ప్రత్యాగతములను జెప్పియతని మెప్పునకు పాత్రుడై యతనిచే ఉభయకవి చక్రవర్తియను బిరుదు బడసెను. యాదవకృష్ణ కందారుడు కళాపోషకుడనుట కాధారము గానరాదు. కావున ఈ వరుసలో కృష్ణకందారుని యాద్యమున జెప్పియుండుట వల్లను నతడు సత్కళాగమ పరీక్షాసక్తుడనియు వచించుటవల్లను నతడు రాష్ట్రికూట కృష్ణుడే కావలయును. కడపటి వాడగు సర్వజ్ఞ సోమేశ్వరుడు క్రీ. శ. 12వ శతాబ్ది మధ్యనుండిన వాడగుటచేత వెన్నెలకంటి మారామాత్యుడును నితని పుత్రిడగు అన్నయయు తరువాతి వారగుదురు. మఱియు షష్ఠాశ్వాస ప్రారంభమున—

శ్రీ హర్షముఖ్య సుకవి స. మాహిత కావ్య పర్పంచ మాధుర్యసుధా
గాహన లీలారసిక. వ్యాహార విహార మంతర్ని యన్నయ సూరా.

యను పద్యమున శ్రీ హర్షుని కావ్యము బేర్కొన బడినది. కావ్యకర్త యగు శ్రీ హర్షుడు క్రీ శ. 12వ. శతాబ్దమధ్యమున కాశ్మీర పర్భువగు జయంతచంద్రుని యాస్థానమున నుండెను. ఇతనిచే రచింపబడిన నైషధము సంస్కృత పంచకావ్యములలో నొక్కటి. వెన్నెలకంటి సూరయకాలమున నీశ్రీహర్ష కావ్యము పర్ఖ్యాతమై యుండుటవలన నతడు క్రీ. శ. 13వ. శతాబ్దమున నుండెనని మన మనుకొన వచ్చును. ఇంకొక విషయముగూడ నీ సందర్భమున మనము విచారింపవలసియున్నది. అన్నయ పుస్తకనామము షోడశకుమార చరిత్ర. దశకుమార చరిత్రను స్మరణకు దెచ్చుచున్నది. దండ్యాచార్యుని దశకుమార చరిత్ర కాంధ్రీకరణ మగుటచేత కేతన దన గ్రంథమున కాపేయి పెట్టెను. షోడశకుమార చరిత్రయను గ్రంథమొకటి సంస్కృతమున గాని ప్రాకృతమునగాని యున్నట్లు తెలియదు. కేతన గ్రంథమునకు గల్గిన జనాదరణనుగని యట్టి గ్రంథమునే యన్నయ రచించి దానికి షోడశకుమార చరిత్రయని పేరుపెట్టినట్లు దోచుచున్నది. ఈయూహ సరియేని, కేతన, క్రీ. శ. 13వ. శతాబ్దపు టుత్తరార్ధమున నుండిన వాడగుటచేత అన్నయ యటు తరువాత వాడని చెప్పవలసియున్నది. జక్కన తన విక్రమార్క చరిత్ర పీఠికయందు కృతిపతియగు జన్నయసిద్ధుని పెదతండ్రియగు వెన్నెలకంటి సూర్యుడొకడు రెడ్డివేమ నరపాలకునిచే మహాగ్రహారములు వడసెనని చెప్పియున్నాడు. క్రీ. శ. 16వ శతాబ్దారంభమున నుండిన విష్ణు పురాణకర్త వెన్నెలకంటి సూరన వెన్నెలకంటి వారిలో పెక్కురు వేమయయన్న పోతభూజానికి సత్సబంధము లొసగిరనియు దన తాతయొక వెన్నెలకంటి సూర్యుడనియు జెప్పియున్నాడు. తాతయన వంశకర్తయని యర్థము జేసికొన్నచో విష్ణు పురాణకర్త రెడ్డి వేమ నరపాలకునిచే మహాగ్రహారములువడసిన వెన్నెలకంటి సూరన సంతతివాడు కావచ్చును. షోడశకుమార చరిత్రకర్తయగు వెన్నెలకంటి యన్నయయు నతని తండ్రియగు సూరనయు క్రీ. శ. 13వ శతాబ్దపు టుత్తరార్ధమున నుండిన కేతనకు దరువాతివారగుటచేతను, క్రీ శ. 1355 పర్యంతము పర్జాపాలనము జేసిన రెడ్డి వేమనరపాలకుని యాస్థానమున నొక వెన్నెలకంటి సూరన యుండుట చేతను, గొంచె మించుమించు వీ రేకకాలము

వారగుటచేతను వీరొక్కరేయని తలచెదను. అగునేని వేమయ భూజానికి పత్ర్పబంధములిచ్చిన వెన్నెలకంటివారిలో అన్నయ్య యొక్కడై యుండవచ్చును.

కాలనిర్ణయచర్చ చాలపెరిగినది. ఇది యనావశ్యకమైన పెంపకము గాదు. కాలాను కర్మణిక చరిత్రాత్మ కస్తిపంజరమువంటిది. దేశ చరిత్ర కెట్లో యట్లే వాఙ్మయచరిత్రకును నిది పునాది. అన్నయ్య కాలము నిశ్చయము గాకపోయిన షోడశకుమార చరిత్ర రచనవలన మన పద్య కథావాఙ్మయ మెట్లభివృద్ధి నందెనో యెట్టి పరిణామమును బొందెనో కనుగొనుట సులభ సాధ్యముగాదు. అన్నయ్యకు కేతన దశకుమార చరిత్ర యాదర్శ గ్రంథమని చెప్పితిని. ఇది కేవలము గ్రంథనామముల పోలికనుబట్టి చెప్పినమాటకాదు. కథానిర్మాణమునగూడ నీ పోలిక గానవచ్చుచున్నది. దశకుమార చరిత్ర యందు మగధరాజైన రాజహంసుని పుత్రిడగు రాజవాహనుని యొక్కయు, రాజహంసుని మంత్రిల పుత్రిలగు పద్మిమతి, మిత్రిగుప్త, మంత్రిగుప్త, ఉపహారవర్మ, యపహారవర్మ, పుష్పోద్భవ, అర్థపాల, సోమదత్తుల, యుత్పత్తియు, వారి సాహసకృత్యములను వర్ణింపబడియున్న షోడశకుమార చరిత్రయందు జనమేజయుని పుత్రిడగు కమలాకరుని యొక్కయు, మంత్రి తనూజులగు బుద్ధిసాహాయ, వివేకనిధి, కాంతిమంత, యశఃకేతు కరుణాకర, పద్మిాకర, చిత్రికర, నీతిమంతులయొక్కయు, భీమ, భట, దీర్ఘబాహు, దృఢముష్టి, విక్రమకేసరి యను దండనాయకుల తనయులయొక్కయు: మతిమంత, కళానిధి, వసంతులను పురోహిత పుత్రులయొక్కయు ధీర కృత్యములును వర్ణింపబడియున్నది. దశకుమార చరిత్రయందు దిగ్విజయార్థము బయలుదేరి రాజవాహనుడును నతని తోడి కుమారవర్గంబును వింధ్యాటవీమధ్యంబున బోవుచుండగా నొక బ్రాహ్మణుడు బోయరీతిని నున్నవాడు గాన్పించి తన పూర్వోత్తరమునుదెల్పి దండకారణ్య మందొక సెలయేటి యొడ్డున ప్రతిష్ఠించియుండు యొక స్ఫటిక లింగముచెంత నిక్షిప్తమైయుండిన సాధన తామ్రశాసనద్వయమునుగొని పాతాళాధిపత్యమువడయుట కతని సహాయమువేడెను. రాజవాహనుడు మిత్రులకు దెలుపక యతని వెంటజనెను. మిత్రులును అతనిగానక వెదుకుచు చెరియొక మార్గమునుపట్టి పోయిరి.

షోడశకుమార చరిత్రయందును కమలాకరునికిని అతని తోడికుమారులకును సీ తీరుననే యెడబాపుగలిగినది. ఇట్టి పోలికలు మఱిగొన్ని కలవు...

షోడశకుమార చరిత్రలోని కథలు కొంచె మించుగా నన్నియు గథా సరిత్సాగరమునుండి గ్రహింపబడినవే. మృగాంకదత్తుని కథ ముఖ్యమైనది. ఇది షోడశకుమార చరిత్రకు బునాదివంటిది. ఈ మూలబంధము మీదనే కావ్యనిర్మాణము సాగినది. కథాసరిత్సాగరమునుండి యన్నయ గ్రహించినది యొక మృగాంకదత్తుని కథ మాత్రముగాదు. బేతాళ పంచవింశతినిగూడ నాతడు యథేష్టముగ జూరగొనియున్నాడు - తృతీయ చతుర్థాశ్వాసములు నష్టమైపోవుటవలన నెన్ని కథలనుగొనెనో నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. పంచమాశ్వాస ప్రారంభమున భోజన శయ్యా వనితా చంగుల కథయు, జ్ఞాన, విజ్ఞాన శూరుల కథయు, చాకిత మదన మంజరి కథయు, దేవసేన చరిత్రయు, వైశ్యకన్య కథయు, ధర్మరాజు కథయు, గానవచ్చుచున్నవి. మచ్చునకివి చాలును. కథా సరిత్సాగరములో గానరాని కథలు నందుకొన్ని గలవు. అవియు సంస్కృత కథా వాఙ్మయమునుండి యేర్చి కైకొన్నవే ..

కథలు సంస్కృతవాఙ్మయమునుండి సంగ్రహించినవేయైనను అన్నయ కథలు జెప్పుటయందు దనకుగల యసామాన్య ప్రజ్ఞను వెల్లడిచేసినాడు. మాత్సర్య యెద్దియైనను కథకునిగొప్పతనము ఆతడు కథను జెప్పు నేర్పుపై నాధారపడియుండును. కథయెంతటి సామాన్యమైనదియైనను కథకుడు చతురుడయ్యేనేని శ్రోతలకు గర్ణపర్వము సేయగలడు. నేర్పరికాదేని యెట్టి యద్భుత మైన కథయైనను పాడుచేసి విసుగు పుట్టించగలడు. కథజెప్పు నేర్పు అభ్యాసమూలమున జేకురునదిగాదు. అది సహజము, దైవ వర ప్రసాదమున పుట్టునది. ఈ నేర్పు అన్నయయందు విశేషముగ గన్పట్టు చున్నది. తియ్యనిమాటలలో తేటతెల్లముగ హాసగూర్చిన విధమున అడ్డమాకలేక నిరాఘాట వాగ్ధాటిని కథజెప్పుశక్తియం దన్నయకు సమానులాకాలమున మఱి యెవ్వరులేరని నిస్సంశయముగ బలుకవచ్చును. శైలి కథనపుటకునైన చాలు, చెప్పి తనివితీరునదిగాదు. మాటల మాధుర్యము సంస్కృతపద బహుళము గాదు; గ్రుక్కతిరుగని దీర్ఘసమాసములు లేవు; శబ్దాలంకారములు సకృత్తు,

అర్థాలంకారములు పాఠకుల దృక్పథమునకు ద్రోసికొనిరాపు. వర్ణనాడంబర మెచటను బొడకట్టదు. కాని చవిగల కవిత్వము — ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికాకారకులు జెప్పినట్లు కవిత్వము నిర్దుష్టము. ఉభయ భాషాప్రౌఢి మెఱయుచున్నది. పద్యములు హృద్యములై ధారాశుద్ధి కలవిగానున్నవి. కాని శైలి మంచన కేయూరబాహు చరిత్రమును జక్కన విక్రమార్క చరిత్ర. కేతన దశకుమార చరిత్రను బోలుచుండును. అని వారు చెప్పువాక్యమును సంపూర్ణముగ నంగీకరించుటకు వీలులేదు – మంచన, అన్నయ్యల శైలి యొక్క తీరైనదే. కేతన శైలియు చాలవఱ కిట్టిదేయైనను మంచన అన్నయ్యల తేటదనమును, పొంకమును, సహజ సౌష్ఠవమును నందుగాన రాదు; జక్కనది ప్రబంధ శైలి.

విక్రమార్కుని కథలను — మనకెఱుక పడినంతవఱకు – ఆంధ్ర వాఙ్మయమున మొదట ప్రవేశ పెట్టినవాడు అన్నయ్య. సాహసాంకుని చరిత్ర యప్పటి యప్పటి కాంధ్ర లోకమున కత్యంత మాదరణీయమాయె. పెక్కాంధ్రాతని చరిత్రమును ఇతివృత్తముగ గ్రహించి గ్రంథములు రచింప గడగుటయె దీనికి విదర్శనము. కార్య ప్రదర్శన మప్పటివారికి నచ్చినది. రణము ప్రియతమము. ఉప్పెనవలె పొరలివచ్చి దేశమును ముంచుచున్న తురుష్కసేనాసాగరమును జెలియలి కట్టవలె నడ్డగించి హిందూ స్వాతంత్ర్య మత ధర్మములను ఆంధ్రులు సంరక్షించిన కాలమది; వారికి శౌర్యోద్రేకమును కలిగించి రణమునకు బురికొల్ప ననువైనసాధనము విక్రమార్కుని యుదంతము. కావున నప్పటి యాంధ్ర ప్రపంచమున నది గణ్యత నందెను—.

అప్పుడు బయలువెడలిన విక్రమార్క కథానిక గ్రంథములు మూడు మనకు లభించినవి. వానియందు బేతాళ పంచవింశతి యొకటి. ఇది యెవ్వరిచే నెప్పుడు రచింపబడెనో తెలియదు. గ్రంథము సంపూర్ణముగ దొరికినను కవి స్వవిషయమును జెప్పుకొను గ్రంథాద్యంతములు లేకపోవుటచే వివరమెవ్వడైనదియు కనుగొనుటకు సాధ్యపడకయున్నది. ఆంధ్ర సాహిత్య పరిషద్గ్రంథాలయమందలి సంకలన గ్రంథమున పోతరాజును నతడు

రచించిన బేతాళ పంచవింశతినుండి పద్యములు కొన్ని యుదాహరింపబడి యున్నవి. 6 అందొక్కటియు నీ బేతాళ పంచవింశతియందు కానరావు. మరియు నాంధ్రసాహిత్య పరిషద్గ్రంథమునం దుదాహరింపబడిన వన్నియు బురవర్ణనమునకు జెందినవి. కవిత్వమైలి మన బేతాళ పంచవింశతికంటె భిన్నమైనది - కావున దీనికర్త పోతరాజని తలచుటకు వీలులేదు. కాని కసూరిరంగ కవి విరచితమైన యానందరంగరాట్ఛందమున వికల్పయతి కుదాహరణముగ బేతాళ పంచవింశతి లోని దని.

చోరగ్రాహ్య గజాంకుశంబు వలినీ శుంభన్మదేభంబు ది
ఙ్నారీ మౌక్తిక దర్పణంబు రజనీకాంతా మనోహారి వి
స్తారాంభోధి తరంగకారి గిరిజా ప్రాణేశ భాస్వజ్జటా
శ్రీ రమ్యాభరణంబు చంద్రిఁడుదయించెన్ సుప్రభాభాసియై.

అనుపద్య ముదాహరింపబడియున్నది. ఈ బేతాళ పంచవింశతి యత్కృతమో యందు చెప్పియుండలేదు. కాని పై పద్యము ప్రస్తుతము చర్చయందున బేతాళ పంచవింశతిలోని పదునాఱవకథయగు జీమూతవాహనుని కథయందు గానవచ్చుచున్నది. ఇట్టి కవి లాక్షణికుడైనను ఆతని యడపొడ తెలియరాక పోవుట శోచనీయము.[7]

బేతాళ పంచవింశతి మూలాధారము సోమదేవుని కథాసరిత్సాగరము. అందలికథలే కొంచెమించుగా నాక్రమము ననుసరించియే ఇందును జెప్పబడినవి.

కాని బేతాళ పంచవింశతియందు సూత్రకథ యధికము — పరమేశ్వరుడు పార్వతీదేవికి రహస్యముగ జెప్పుచుండ గోడమీద పసిడి బల్లి

---

6. చూ. ప్రబంధరత్నావళి. పుటలు. 88–9.

7. మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము:- R. No. 594 పుట. 109.

యెయుండి షష్పదంతు డాకథలనెల్లను విని తన భార్యకు దెలప అది పార్వతీ దేవి కీకథలనే మరలజెప్పెనట. (7, a)

కవిత్వము చక్కనిదే; ధారయు నిరాటంకముగా ప్రవహించు నదియె; శైలియు గథలజెప్ప ననుకూలించు నదియె; కాని కల్పనాశక్తి తక్కువ. మాతృకననుసరించి పథము దప్పక కథను వ్రాయదలచుకొనుటయె దీనికి ప్రధానకారణము. కవియెందును స్వాతంత్ర్యమును జూపగడగలేదు. ఇందలి కథలన్నిటియందును పదునాఱవదగు జీమూతవాహనునికథ రసవత్తరమైనది. కవి యాకథాచనయందు దనశక్తినంతటిని వినియోగ పెట్టినట్లున్నది.

విక్రమార్కుని కథలను వివరించు కథానక కావ్యములలో మఱియొకటి కొఱవి గోపక్షిత సింహాసనద్వాత్రింశిక. ఇది భాషాంతరీకరణ కథానకములందు చేరినదగుటచే ఇంతకు పూర్వమే పరామర్శింపబడినది. కావున దాని విషయమున నిట మరల ప్రస్తావించక, నట్టిదియగు జక్కన విక్రమార్క చరిత్రమునగూర్చి విచారింతము. ఇతడు 15 వ. శతాబ్దమున ప్రథమ పాదమున వెలసెను. కొంచెమించుమించుగ కొఱవి గోపరాజునకు సమకాలికుడగును. గోపరాజువలెను. బేతాళపంచవింశతి రచయితవలెను, కథల నన్నిటిని సూత్రకథయందితడు గ్రుచ్చలేదు స్వయముగనె కథలనజెప్పెను. ఇతడు వచించిన విక్రమార్కుని జన్మరాజ్య ప్రాప్తులకథ క్రొత్తదారి ద్రొక్కినది; సింహసన ద్వాత్రింశికలోని కథ ఇది. అవంతిపురమును చంద్రగుప్తనికుమారుడు భర్తృహరి యేలచుండ నతని సవతితల్లికొడుకు విక్రమార్కుడు యువరాజుగను భట్టిమంత్రిగను ఆతనికి ప్రజాపాలనయందు

---

7. a. బేతాళ పంచవింశతియందు కొన్నికథలు కథాసరిత్సాగరములోని వరుసను దప్పి భిన్నముగగాన్పించుచున్నవి. భోజనచుంగ నారీచుంగ శయ్యాచుంగులకథ కథా సరిత్సాగరము వరుస ప్రకారము 8 వది; 4 వ. కథ; 10, వది. 7 వదిగ గాన్పించుచున్నవి. మొత్తము మీద కథలవరుస రెంటియందు నొక్కతీరుగనె యున్నది.

దోడ్పడుచుండిరి. ఆతనికి భార్యలు మున్నూర్గురు. ఆతడు జారయైన ప్రియకాంత కతమున సంసారముపైరోసి భార్యలనుత్యజించి రాజ్యమును తమ్ముడగు విక్రమార్కునికొసగి తపోవనమున కరిగెను. విక్రమార్క చరిత్రలో మధురానగరమునకు చంద్రగుప్తుని యాగమన వివాహ సంతాన ప్రాప్తులతో కథ ప్రారంభమగుచున్నది. అతడు బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రవర్ణములలో నొక్కొక్క జాతికి జెందిన యువతీమణి నొక్కొతె నుద్వాహముజేసికొనెను. బ్రాహ్మణస్త్రీయందు వరరుచిని క్షత్రియ యువతియందు విక్రమాదిత్యుని వైశ్యనారియందు భట్టిని శూద్రకాంతయందు భర్తృహరిని పుత్రులుగా బడసెను. చంద్రగుప్తుడు తపోవనమునకు బోవుచు వరరుచిని వంశకర్తగ నియమించెను. విక్రమార్కునికి రాజ్యము నొసగెను. భట్టికి నియోగితనమిచ్చెను. భర్తృహరికి ధనమంతయు నొప్ప జెప్పెను. విక్రమార్కుని జన్మాదికములందు వలెనే జక్కన కథలు జెప్పుట యందుగూడ భిన్నమార్గము నవలంబించెను. కథలయందు పైకిరువురివి సామాన్యములే; కాని వానిక్రమము వేఱు పద్ధతివేఱు. కవిత్వమందును వారిద్దరికిని జాల వ్యత్యాసముగలదు. గోపరాజుశైలి కథానకరచన కనుకూల మైనది. అష్టాదశవర్ణనలతోడను, శబ్దార్థాలంకారములతోడను ఒప్పిదమై హృదయంగమముగనున్నది. కాని ప్రతిభయందుగాని, వైదుష్యమందుగాని, చమత్కారమందుగాని గోపరాజు జక్కనకు సమానుడుగాడు. జక్కనది కావ్యఫక్కి, కథాఫక్కిగాదు. గోపరాజు వలెనే కథ జెప్పుటయే యతని యుద్దేశమైనను దానిని జెప్పుటయందు దన నేర్పంతయు వినియోగపఱచి రసికుల కబ్బురము గలిగింప వలయునని యాతని పూనిక.

చక్కన నీ వైదుష్యము,
జక్కన నీ కావ్యరచన, చాతుర్యంబుల్,
చక్కన నీ వాగ్వైఖరి,
జక్కన నీ వంశమహిమ, జక్కన సుకవీ...

అని జన్నయ సిద్ధమంత్రి తన్ను సంబోధించివట్లు జక్కన చెప్పుకొని యున్నాడు. ఇవి కేవల స్తోత్రాత్మక వాక్యములుగావు. విక్రమార్క చరిత్రవీని యాథార్థ్యమును రుజువు సేయుచున్నది. కవితాశిల్పమునందిట్లు

అసామాన్య నైపుణ్యము కలవాడైనను కథానిర్వహణమున నితడు గోపరాజుకు వెనుకటివాడే ఇందులకు గారణ మతని వర్ణనాలాలసతయు, చతురకావ్య రచనావిధానమును ముఖ్యకారణములు. అవకాశమున్నను లేకపోయినను దనయద్భుత వర్ణనాకౌశలమును బ్రదర్శింపగడగుటవలన కథ కొండదారులవలె దృగ్గోచరముగాక పోవుచున్నది. ఒక యుదాహరణము. ద్వితీయాశ్వాసము లోని పురందరుని కథచదువుడు - ఆరంభ దశయందతడు ధనసంపన్నుడైన వైశ్యుడు. దానములందును, విద్వత్సారితోషికములందును, కళా పోషణ యందును, భోగములందును, దన ధనమునంతటిని తోడి వైశ్యులు వలదని హితము జెప్పినను వారిమాట జెవినిడక వెచ్చ పెట్టెను. లేమిడి కడ కతని పీడింపగడగినది. తీర్థయాత్రవెడలి యతడు మధురకు బోయెను. అచట రాత్రియొక బ్రాహ్మణునియింట బసజేసియుండ నిశాసమయమున నప్పురోప కంఠంబునందు ఒక కాంతయార్త నాదము వినవచ్చెను. ఇంటివారి నడుగగా వారు ప్రతి నిశాసమయమందును నట్టియార్త నాదము వినవచ్చుననియు అందుకు గారణము దెలియదని జెప్పిరి. అచటినుండి యావైశ్యుడు గాశికి పోయెను. అచటినుండి గయా ప్రయాగలకును నచటినుండి ఏలేశ్వర నివృత్తిసంగమ, శ్రీ పర్వతాహూబిల సిద్ధపట్టణ, కాళహస్తి, వెంకటాచలాదులను వరుసతో సేవించి, యచటినుండి బయలువెడలి గాంచీపుర, శ్రీరంగ, కుంభఘోణ, సేతు, రామేశ్వరానంతశయన, విరూపాక్షాది తీర్థముల సందర్శించి తుదకు ఉజ్జయినికి దిరిగివచ్చి విక్రమార్క నరపాలునిగాంచి మధురాపురముచెంత రాత్రులందు నిశాసమయమున వినవచ్చు స్త్రీ యాక్రందన వృత్తాంతమును వినిపించెను. విక్రమార్కుడంతట నా వైశ్యునితోగూడ మధురా నగరమునకు జని యర్ధరాత్రి సమయమున నా స్త్రీ యేడ్పు వినవచ్చినంతటనే యచటికిబోయి కశఘాతలచే నొక నారీమణి నొవ్వజేయుచున్న రాక్షసులను సంహరించె. ఆమెయొక యచ్చర, శాపగ్రస్తురాలు; విక్రమాదిత్య భూపాలుని మూలమున శాపవిమోచనమగునని ఋషి శాసనము. శాపవిమోచనమైన పిమ్మట నామె కృతజ్ఞతా సూచకముగ నొక మణిని రాజునకు సమర్పించి స్వర్గసీమ జేర బోయెను. విక్రమాదిత్యుడంతట ఉజ్జయినికి మరలివచ్చి. వైశ్యుని వదాన్యతను బొగడి యచ్చరయొసగిన రత్న మునాతనికొసగెను.

జక్కన జెప్పబూనినది విక్రమార్కుని సాహసౌదార్యములకథ కాని వైశ్యకుమారుని తీర్థయాత్ర చరిత్రగాదు. నిశీథియందు వినవచ్చెడి స్త్రీ యాక్రందన ధ్వని విని దానిని విక్రమార్కునికి దెలుపుటయే వైశ్యుని కథ యందు ప్రవేశ పెట్టుటకు ముఖ్యకారణము. ఆతని తీర్థయాత్రయందు మొదటి సలమే మధురానగరము. నిశీథియం దాక్రందన స్వరమును విని నదియు నచటనే. తరువాత నతడేగిన తీర్థములను, వానివర్ణనలకును, గథయందు తావులేదు. కథ నడక కవి యనావశ్యకము. ఐనను జక్కన తీర్థముల వర్ణనకు గడిగినారు. మధుర, కాశి, గయా, ప్రయాగ నుండి వైశ్య యాత్రికుని దక్షిణ దేశమున కర్ణాట సామ్రాజ్యమునకు దోడ్కొని వచ్చినాడు. ఏలేశ్వర, శ్రీశైలాహూబిల, సిద్ధపట్టణ, కాళహస్తి, వేంకటాచలముల జూపి కాంచీపుర, కుంభఘోణ, శ్రీరంగ రామేశ్వరానంతశయనముల ద్రిప్పి, యచటినుండి వెనుదిరిగి హేమకూట సానువునందలి విరూపాక్షమునకు గొంపోయి యచటినుండి యుజ్జయినికి విక్రమార్కుని సభాస్థానమునకు మధురా నగర వృత్తాంతమును దెల్పుట కంపినాడు. మధురా నగరమునుండి యాతని నుజ్జయినికి మరల్చి యుండినను కథ నడక కభ్యంతరముండదు. కాని యన్ని పుణ్యస్థల వర్ణనల కవకాశము గల్గియుండదు. పుణ్య స్థలములయందును. కర్ణాట సామ్రాజ్యములోని — అందును ముఖ్యముగ పశ్చిమ, దక్షిణ, ఆంధ్ర భూములలోని క్షేత్రములు జక్కనకు సుపరిచయములు. కావున ఏలేశ్వరముతో ప్రారంభించి వెంకటాచలము వటకుగల స్థల మహాత్మ్యములను గొనియాడెను. నివృత్తి సంగము నొక పద్యముతో వీడ్కొనెను. శ్రీశైలమున కెనిమిది పద్యములు, అహూబిలమున కైదు, పెన్నకొక్కటి, సిద్ధపటమునకు మూడు, కాళహస్తి వేంకటాచలమునకును దక్కిన దాక్షిణ్య క్షేత్రములకన్నిటికిని జేర్చి యొక్క వచనము; హేమకూట విరూపాక్షములకేడు, అంచొక చిన్న వచన మును 'విరూపాక్షలిఙ్గమ్' అను మకుటముగల సంస్కృత శ్లోకములు మూడును గలవు. ఇట్లు కథాసరణి నవిచ్ఛిన్నముగ సాగనీయక నడ్డపడు వర్ణనలతో నిండియున్నను, విక్రమార్క చరిత్ర పాఠకులకు విసుగు బుట్టింపక హృదయా హ్లాదకరమై యొప్పుచున్నది. చదువ జదువ జవి హెచ్చుచుండును. జక్కన

యద్భుతకల్పనా ప్రతిభయు వాఙ్మాధుర్యమును రచనాచమత్కృతియు గంగా ప్రవాహమును బోలిన శైలియు దీనికి ముఖ్య కారణములు. —

జక్కన తరువాత పదునైదవ శతాబ్దమున మరియిద్దరు దొడ్డ కవులు కథానక గ్రంథములను రచియించిరి. ఇందు మొదటివాడు అనంతామాత్యుడు ఇతడు శకాబ్దము 1356. వరకు సరియైన క్రీ. శ. 1434 వ. సంవత్సరమున రసాభరణమను లక్షణ గ్రంథమును వ్రాసి ముగించి యుండుటచేత నతడు క్రీ. శ. 15వ శతాబ్దమున నుండెనని నిశ్చయముగ జెప్పవచ్చును. ఇతడు రచించిన కథానక గ్రంథము భోజరాజీయము. ఈతని కవిత్వము రసవంతమై నిర్దుష్టమై మృదుపదకలితమయి హృదయ రంజకముగ నున్నది...భోజరాజీయము వింతకథలను గలిగి చమత్కారముగానే యుండునని వీరేశలింగము పంతులుగారు మెచ్చుకొని యున్నారు.[8] ఈ యభిప్రాయమునే ఇంచుక విపులముగ భోజరాజీయ పీఠికయందు విశదపఱచి యున్నారు. ఈతని కవిత్వము మాత్రమేకాక భోజరాజీయమందలి కథలును ఇంపుగ నుండును. కవిత్రయము వారి ప్రయోగములకంటె భిన్నములైన ప్రయోగము లీ భోజరాజీయమునందు కొన్నికానవచ్చు చున్నను మొత్తముమీద నిందలి కవిత్వము నిర్దుష్టమయి శ్లాఘ్యముగా నున్నది...

అనంతామాత్యుడు ధైర్యసాహస పరాక్రమాది శూరగుణ ప్రతిపాదన కొఱకే కథానక గ్రంథమును రచియింపలేదు. అతడు వైష్ణవుడు. అహోబల నరసింహస్వామి భక్తుడు. ప్రజలకు నీతిని బోధించి వారికి ధర్మమార్గ ముపదేశించుట కీ గ్రంథము నతడు రచియించెను—

సూత్ర కథ భోజరాజ చ. రిత్రమనెడునట్టి ధర్మరీతులు నీతుల్
చిత్రకథలై తలిర్పగ, శ్రోత్ర సుఖముగా నొనర్ప సుఖమై యుండున్.

అదియును దత్తాత్రేయ మునీంద్రుడు వక్తయు మహాడను కాంభోజ మహీశుండు శ్రోతయుగా...భోజుండు పూర్వజన్మంబున బ్రాహ్మణుండైయుండి

---

8. భోజ, 1: 86–87

దారిద్ర్య భారంబు తోరంబగుట వలన...ప్రయాగయందు నిష్ట కామ్యసిద్ధి పొంది శరీరవిసర్జనంబుచేసి సజ్జన ప్రియుండై పుట్టి లాటదేశంబున ధారానగరంబున కధీశ్వరుండై రాజ్యంబుజేయుచు నొక్కనాడు మృగయావినోదార్థంబు వనంబునకుంజని యందు పర్వటీయను నొక్క సిద్ధ పుంగవుంగని దన పట్టణంబునకు దోడ్కొని వచ్చుటయు,...తదనంతరంబ భోజనిమిత్తంబున భోజ పర్వటులకు సంవాదవశంబున వివిధ పుణ్యకథా ప్రసంగంబులు పుట్టుటయునను వృత్తాంతంబులుగలిగి యిక్కావ్యంబు సకలజనాకర్ణనీయంబై భోజరాజీయం బను పేరబరగు...ఇందువలన ననంతా మాత్యుండు పూర్వకథానక రచయితల ననుసరింపక క్రొత్త దారిని త్రొక్కెను. సాహస పరాక్ర మౌదార్యాత్మక కథలను పాటింపక నీతి ప్రచారము కొఱ కీగ్రంథము రచించెను.

అనంతామాత్యుడు చెప్పినట్లు భోజరాజీయము సర్వజనాకర్ణనీయమే. కవి తను చెప్పిన కథలయం దనేకములు పాతవే. వానిని ప్రాచీన కథానక గ్రంథములలో గుర్తించవచ్చును. కాని దానికిది సమయముకాదు. కథలు పాతవైనను చెప్పుటయందు తన నేర్పంతటిని వినియోగించినాడు. శైలి మృదు మధుర పద బహుళమై, దీర్ఘ సంస్కృత సమాస భూయిష్ఠముగాక, సులభ గ్రాహ్యమై కథా ప్రవచనమునకు గడు ననుకూలమైవచ్చి యొప్పారుచున్నది. సందర్భోచితములుగాని వర్ణనలును వాచకుల దృక్పథమున కడ్డుపడు శబ్దార్థాలంకారములును గానరావు—ఐనను అనంతామాత్యుని కథాసరణి నిర్నిరోధమైనదిగాదు. కథయందు పిల్లకథలు బుట్టుటవలన దానినడక యవిచ్ఛిన్నముగ సాగదు. మార్గమున కడ్డుపడు దుర్లంఘ్యములగు కొండలవలె ఉపకథ లడ్డము వచ్చును. ఇది బృహత్కథ మున్నగు ప్రాచీన కథానక గ్రంథముల పద్ధతి—కథనడకను సూటిగ సాగనీయక పోవుటచే నిది యంతటి యుత్కృష్టమైన పద్ధతికాదు—

రెండవవాడు ఎఱ్ఱన. ఇతడు రచించిన గ్రంథములు మూడు. పురాణదురము, కొక్కోకము, సకలకథానిధానము— ఇందు మొదటిది లభ్యముగాతలేసాక్కనవి రెండును ముద్రితమైనవి. మూడవది కథానక గ్రంథము.

ఎట్టయ కథారచనా విశేషమును గూర్చి విచారించుటకు పూర్వ మతనికాల మెద్దియో నిర్ణయించుట యావశ్యకము. వీరేశలింగముగారు ఎట్టన, క్రీ. శ. 1560_70, సంవత్సర ప్రాంతముల యందుండెనని చెప్పుచున్నారు. 9. ఈ యభిప్రాయమున కాధారమగు రెండు కారణములు వారు చూపియున్నారు. ఒకటి కొక్కోక పీఠికయందు కృతిపతియైన కుంటముక్కల భైరవ మల్లనా మాత్యుని వర్ణించుచు జెప్పిన ఈ సీసపద్యము—

హరి పదధ్యాన తత్పరుడు చండల మహా
లక్ష్మీ పరిసాదైక లబ్ధపరుడు.
రహి గజపతి మహా రాయలిచ్చిన సమం
చిత మహాపాత్రి ప్రసిద్ధయశుడు.
నాజమాఖాన రాయని చేత నొడయడై
వినుకొండ దుర్గమేలిన ఘనుండు.
కృతివన నిక్షేప పృథు తటాకాలయ
తవయాది సప సంతాన ఘనుడు.
—
మని పరాశరగోత్రి సంజనితు డార్య
సేవ్య తిరువేంగళాచార్య శిష్యు డనఘు
మంత్రి పెరుమాళ్ళ కొమ్మయ మనుమ డోబి
మంత్రి తెలగయ భైరవ మల్ల మంత్రి...

రెండవది కవిస్తోత్రమందు, రావిపాటి తిప్పరాజాది ముఖ్య శృంగార కవుల బేర్కొనుట, ఈ రావిపాటి తిప్పరాజు—

సరిబే సైరిపుదేల భాస్కరులుభా
షానాథ పుత్రాఃఖసుం
ధరయం దొక్కడు మంత్రియయ్యె వినుకొం
డన్, రామయామాత్య భా

---

9. ఆంధ్రకవుల చరిత్ర. పుట. 327.

సక్కరుఁడా? యౌనతఁడే, సహస్రకర కా
ళ్లేవవే యున్నవే
తిరమై దానము చేయుచో రిపుల హే
తి స్రవ్వెయుచో వార్ధియుచో.

పై పద్యమును రామయామాత్య రావిపాటి తిప్పన భాస్కరునిమీద జెప్పిన ట్లప్పకవీయములో నుదాహరింపబడియున్నది. ఈ రామయభాస్కరు డచ్యుత దేవరాయని కాలములో నుండినట్లు కొండవీటిలోని గోపినాథస్వామి వారి దేవాలయద్వారశాఖ యందు వ్రాయబడియున్న శాసనములవలన దెలియు చున్నది.

పై రెండు కారణముల నాధారపరుచుకొని వీరేశలింగముగారొనర్చిన కాలనిర్ణయము సరియైనదిగాదు. కుంటముక్కల భైరవ మల్లునకు మహాపాత్ర బిరుదిచ్చిన గజపతి మహారాయలు పురుషోత్తముడు. కపిలేశ్వర గజపతి పుత్రుడు. క్రీ. శ. 1466లో తండ్రిచే రాజ్యాధిపత్యమునకు నియుక్తుడాయెను. 1470వ సంవత్సరమున కపిలేశ్వరము మరణానంతరము రాజకుటుంబమున గలిగిన కారణములవలన ఆంధ్రదేశమున గజపతుల యధికారము నాశ మాయెను. 1481 తర్వాత పురుషోత్తమ గజపతి మరల యాంధ్రదేశమును జయించెను. అతని పక్షమున కృష్ణానదికి దక్షిణమున నున్నసీమలను పాలించు చుండిన సామంతరాయ మహాపాత్రుడే అజముఖానుడు. ఇతడు. శ. 1406 క్రోధి. కార్తిక శుద్ధ 15 కు, సరియైన క్రీ. శ. 1484 వ సంవత్సరమున వినుకొండ సీమకు జెల్లుచుండిన మతుకుపల్లి గ్రామమున చేసిన భూదానమును దెలుపు శాసన మొకటి యచటగలదు. [10] కావున నాయజముఖానున కాశ్రితుడై కుంటముక్కల భైరవ మల్లనయు నతనికి గొక్కొకము నంకితము జేసిన ఎట్టనయు నప్పటివారే కావలయును.

ఇంక రావిపాటి తిప్పన విషయము విచారింతము. అతడు ఎట్టనకు జాలపూర్వుడు కాని సమకాలికుడుగాదు. అప్పకవియొక గ్రంథములోని పద్య

---

10. డిటో, పుటలు 3:6_7.

మును మరియొక దానిలోనిదిగను, ఒకరు రచించిన పద్యము మరియొకదిగను నుదాహరించుట సామాన్యము. కావున నీచాటువుపై ఆధారపడి తిప్పనయొక్క కాలము నిశ్చయించుట తగవుగాదు. ఇందలి సత్యమెట్లున్నను అప్పకవి పేర్కొను రామయామాత్య భాస్కరుడు అచ్యుతరాయలనాటి భాస్కరుడుకాడు. అతడేలినది వినుకొండ. ఇతడు పాలించినది కొండవీడు. ఇంతియకాక; క్రీ.శ. 1378 మొదలు 1404 వరకు విజయనగర సామ్రాజ్యమును పాలించిన ఇమ్మడి హరిహరరాయల పక్షమున వినుకొండను పాలించిన వల్లభరాయడు రావిపాటి త్రిపురాంతక దేవుండను కవీశ్వరుండొనరించిన ప్రేమాభిరామంబను నాటకము ననుసరించి కీర్తిడాభిరామంబను రూపకంబు తెనుంగుబాస రచియించిన వాడు అనిచెప్పి.

నన్నయభట్టు తిక్కకవి నాయకులన్న హుళక్కి భాస్కరుం
డన్నను జిమ్మపూడి యమరాధిపు డన్నను సత్కవీశ్వరుల్,
నెన్నుదుటన్ గరాంజలులు నింతురు జేయని రావిపాటితి
ప్పన్నయు నంతవాడ తగునా యిటు దోసపు మాడలాడగన్.

అని యాతని కవిత్వ మహత్వమును బొగడియున్నాడు. 11 కావున ఎట్టిన ఇందువలన క్రీ. శ. 1560–70 సంవత్సరముల ప్రాంతముల వాడుకాడని తేలదు. క్రీ. శ. 15వ శతాబ్ది ప్రారంభము గాక పూర్వమే !4వ శతాబ్దమునకో అంతకుముందో అతడువెలసెనని చెప్పవచ్చును. ఇట్లు వీరేశలింగముగారిచే జెప్పబడిన కారణములు రెండును పొరుజేసిన కాలనిర్ణయమును నిరూపింపదగిన సాధకములు గాజాలవు. కొక్కొక పీఠికయందత డుదాహరించిన చరిత్రాంశము లతడు క్రీ. శ. 15వ శతాబ్దాంతిమ దశయందుండెనని స్పష్టము సేయుచున్నవి.

సకల కథానిధానమున బెక్కు కథలుగలవు. ద్వాత్రింశత్సాలభంజికలు జెప్పు విక్రమాదిత్యుని సాహసకథలు, బేతాళ పంచవింశతి, పంచతంత్రకథలు

---

11. ARE 226. ef 1935-6.

మున్నగునవియందు జేరియున్నవి. ఇన్నికథల కాకర మగుటవలన ఎఱ్ఱనకు గథలను పెంచి తనకథా నిర్మాణకౌశలమును జూపుట కవకాశము చిక్కి-దాయె. కొన్నియెడల పది పండ్రెండు పద్యములతో కథను ముగించవలసి యుండెను. కావున నందలికథలన్నియు గడు చిన్నవై కథకుని చాతుర్యమును దగినట్లు పరిచురము సేయ ననుకూలింపవాయె. రసనంతమైన చక్కని కవిత్వము. అనర్గళమైనధార. మృదు మధుర వాక్యములు. తేట తెనుగు నుడికారము. కథా ప్రవచనమునకు సరియైన సులభమైన శైలి. చదువ జదువ జవులు బుట్టు చుండును.

ఎఱ్ఱనతో బదునైదవ శతాబ్దము సమాప్తము. పదునాఱవ శతాబ్దమాంధ్ర వాఙ్మయ చరిత్రయందు ఆమని వంటిది. వాఙ్మయము బహుళముగ నభివృద్ధి నందెను. కవులందరును ప్రబంధరచనా నిమగ్నులై యుండుటవలననేమో పదునైదవ శతాబ్దమునందువలె కేవల కథానక గ్రంథములు బయలువెడలలేదు. పాండురంగ మాహాత్మ్యము కళా పూర్ణోదయము మున్నగు గ్రంథములందు చక్కని కథలున్నను వానిని కథానక గ్రంథములుగ పరిగణించుట తగవుగాదు. కాని కథానకముల క్రిందరాగలవు. రెండును కృష్ణరాయలయుగమునకు జెందినవే. అందొకటి యయ్యలరాజు రామచంద్రుని సకలకథా సారసంగ్రహము. కృష్ణరాయల యాజ్ఞానుసారమితడీ గ్రంథమును రచియింపబూనెనట. గ్రంథము పూర్తికాకమునుపే రాయలవారి యవతారము సమాప్తమగుటవలన వారికింక తమునేయు భాగ్యము అతనికి లేకపోయెను. పురాణములయందు సుప్రసిద్ధులైనరాజుల, చక్రవర్తుల చరిత్రలు ఇందు వర్ణింపబడినవి. దీని సంస్కరించి శుద్ధ ప్రతినివార్చియించిన బ్రౌన్ దొరగారు దీని నిరసించిరి. కథా కల్పనయందుగాని రచనా విధానమునగాని కవి స్వాతంత్ర్యమును జూపక పూర్వులు జెప్పిన విషయము నంత రసవంతముగ జెప్పక పోవుటయే బ్రౌన్‌గారి యభిప్రాయమునకు గారణము; కవిత్వము రామాభ్యుదయమువంటిదే కాని యంత పరిపక్వమైనదికాదు. రెండవది చింతలపూడి యల్లనార్యకృత విష్ణుమాయానాటకము. ఇతడు దొడ్డకవి కృష్ణరాయలను రాధామాధవ మను కావ్యముజెప్పి మెప్పించి 'నానాధాత్మ ప్రతిమాన సత్కవులలోనన్ భూషణ

---

12. క్రీడాభిరామము, 34.37.

శ్రేణితో, రాధామాధవనామమందిన జగత్ప్రఖ్యాత చారిత్రి' డీతడు- కృష్ణ రాయల యనంతర మీతడచ్యుత రాయల యాస్థానమందుండి 'నిజస్వామియగు నచ్యుతరాయలు ప్రతిసంవత్సరంబు శ్రీ వేంకటేశ్వరునకు సమర్పించు సత్కావ్యపుష్పాంజలికి' గ్రంథ కుసుమములను గూర్చువాడు, అట్టి కుసుమము లలో నతడు రచించిన తారక బ్రహ్మరాజీయమును బోలి నిదియు నొక్కటియై యుండును.

ఎల్లనార్య డీ కథానక గ్రంథమును రచించినది విష్ణుమాయా ప్రభావ మును బ్రకటించుటకొఱకు. ఇందలి సూత్రకథ పురాణ పద్ధ్ధ ననుసరించి శుకయోగి పరీక్షి న్నరేంద్రుల సంవాదముతో ప్రారంభమగుచున్నది. పరీక్షిత్తు శుకయోగిని విష్ణు మాయా ప్రభావమును వివరింపగోరెను. అతడు పూర్వము వ్యాసుడు ధర్మరాజు కోరిక నీడేర్పుటకు విష్ణుమాయను వర్ణింప నారంభించె ననియు, నప్పుడు శ్రీ కృష్ణుని యాజ్ఞచే నతని నర్మసఖుడు గోవిందశర్మ ద్వారకనుండి నారదాది మునులతో నచటికి వచ్చి స్వవిరచితములైన కృష్ణుని విచిత్ర కేలి వర్తనముల కథలను జెప్పెననియు, నా కథలనే తాను జెప్పుదు ననియు ప్రారంభించెను. గోవిందశర్మ సత్యభామకు కోపోప శమనార్థమై విష్ణుని మాయావిలాస కథలను జెప్పదొడగెను. ఆతడు చెప్పిన కథలు నాలుగు. లక్ష్మీ గర్వభంగము, శివ గర్వభంగము, నారద గర్వభంగము, ఇవిగాక బ్రహ్మ గర్వభంగమందు పుండరీకుని కథయు, నారద గర్వభంగ మున చండదమనుని కథయు అను ఉప కథలు రెండుగలవు. మొత్తము మీద నిండుగల కథల సంఖ్య యాఱు. ఇట్లు కథల సంఖ్య యల్పమైనను విష్ణుమాయా నాటకము ఆంధ్ర వాఙ్మయములోని కథానక కావ్యములయం దగ్రశ్రేణికి జెందిన దని నిస్సంశయముగ జెప్పవచ్చును. కథా నిర్వహణము నందు రాధామాధవుని శక్తి యద్భుతమైనది. కథా ప్రసంగమునందు చక్కని సన్నివేశములను గల్పించి సహజమైన వర్ణనలతో శోభాయమానముగ కథను నడుపుటయందితని కీడు జోడైనవారు లేరు. కథలు పురాణములలోని వైనను అపూర్వ రచనా కౌశల్యమున నవీనత గల్గించి దానిని సొంతము

జేసికొని వానిపై దన స్వామ్యమును ప్రకటించు ముద్రయిడినాడు. ఈతని కథా ప్రసంగ సరణిని శ్రీ కోరాడ రామకృష్ణయ్యగా రిట్లు కొనియాడి యున్నారు.—14.

"ఈ కవి ధర్మనందన సభాసదుల చిత్తంబులువలెనే మన చిత్తంబుల నాశ్చర్య కౌతూహలంబులచే దహతహలాడు చుండునట్లు చేసెను.....గోవింద శర్మాగమన రూపమగు వనాంతగాధ నొక దానిని చదువరులకుగాఢమైన చిత్త విక్షేపమును (mental suzpenze) గల్పించినాడు. ఈ నూతనగాధ యాకథాసన్నివేశమునకు. వింతసొంపు నాపాదింపజేసినది. కథా కథనములో నిట్టి చిత్త విక్షేపమును గల్పించుటలో నీకవి కసాధారణ ప్రజ్ఞకలదు - లక్ష్మీ దేవి మాయాలక్ష్మి తపఃప్రకారమును జూచి వెఱగందు పట్టునను ఆకాశవాణి చండదమనుని కథ చెప్పునప్పుడుగూడ నిట్టి చిత్ర విక్షేపమును గల్పించి యద్భుత రీతిని మన కౌతూహలమును బురికొలుపుచున్నాడు. ఇట్టి కథల కద్భుతమైన నూతన సన్నివేశమును గల్పించుటచేతను వర్ణనాంశములను విశేషముగ బెంచి కథావేగమును కుంటువడునట్లు సేయక దాని కనువుగ సహజధారాళము మృదు మధురమునగు సరళశైలిలో నీగ్రంథమును రచించుట చేతను ఈ కవి యాకాలపు ప్రబంధ రచనాపద్ధతిలో నొక క్రొత్త త్రోవ దీసినాడని చెప్పవలయును. మఱియు ననవసర శబ్దాడంబరము పొంతబోక పాండిత్య ప్రకర్షను జాటు దీర్ఘసమాస గూఢాలంకార కల్పనాదులయందు దృష్టినిడక చమత్కార సన్నివేశములతో గూడిన కథాసందర్భములచే జదువరుల కుతూహలమును ననంతము బురికొల్పుచు సహజ గంభీరమగుశైలిని రచించుటలో నీతడు పింగళి సూరనార్యునికి దారి చూపినవాడన వచ్చును."...

రామకృష్ణయ్యగారి పొగడ్త ఒప్పిదమైనదే. ఎల్లనార్యుని ప్రతిభకిది యన్నివిధముల దగియున్నది. కాని నెప్ప వలసినయంశ మిందొక్కటి గలదు. ఎల్లనార్యునిది జీవవంతమైనకళ. ఇతని కథలయందు వచ్చు పాత్రలు చైతన్య రహితములుగావు. పాఠకుల మనోవీథిని బొడగట్టి కథాంశముల

---

14 విష్ణు మాయానాటకము (మదరాసు విశ్వవిద్యాల యాంధ్రశాఖ ప్రకటనలు. నెం. 3 రు.) ఉపోద్ఘాతము. పుటలు. X 1—XX 11....

నంతఃచక్షువులకు విస్పష్టమగునట్లు ప్రదర్శించును. మరియు మాటలకూర్చు నేర్పుచే చిత్ర నిర్మాణము సేయుటయం దితని ప్రజ్ఞ యద్భుతమైనది. మాయా లక్ష్మీ సరస్వతీ మోహినుల వర్ణన లిందుకు తార్కాణము. పురాణ కథల నింత సొంపుగను హృదయాహ్లాదకరముగను వ్రాసిన కవి మరియొకడు గానరాడు.—

స్వతంత్రకథానక, కావ్యములు

ఎల్లనార్యునితో పదునాఱవ శతాబ్దమందలి కథానక వాఙ్మయచరిత్రము సరి. తరువాత పదునేడవ శతాబ్దమధ్యము వఱకును కథానక గ్రంథముల నెవ్వరును రచియించినట్లు కానరాదు. కావున ఎల్లనార్యుని యనంతరము బేర్కొనదగినది కథకుడు పాలకాపేరి కదిరీపతి ఇతడు క్రీ. శ. 1650. ప్రాంతమున మైసూరు రాష్ట్రమందలి కోలారు సీమయందు వెలసెను. ఆంధ్ర పద్యకథానక వాఙ్మయమున నితడు నూతన మార్గము నవలంబించెను. అతనికి ముందు కథానక కావ్యకర్త లందఱును దాము చెప్పిన కథల ననిన్నటిని, సంస్కృత ప్రాకృత వాఙ్మయమునుండి సంగ్రహించిరి. కాదాచిత్కముగ కొందఱు తమ కథలోని పాత్రల నాంధ్ర దేశము తోడ్కొనివచ్చి యందలి భాషావిశేషములను, పుణ్యక్షేత్రములను కొనకు ఆచారవ్యవహారములను వారిచే వర్ణింపజేసినను వారాంధ్రులుగారు. ఆంధ్ర జాతీయ జీవనముతో వారికెట్టి సంబంధమును లేదు. పదునేడవ శతాబ్దమునం దీపద్ధతి మారిపోయినది. కదిరీపతి ఈ పద్ధతిని విసర్జించి కథా రంగము నాంధ్రభూమికి మార్చెను. ఈ శతాబ్దమున నెన్ని కథానక గ్రంథములు బయలువెడలెనో తెలియదు. మనకు లభించినది కదిరీపతి ఱుకసప్తతి యొకటియే. ఇదియైనను సమగ్రముకాదు. లభించిన గ్రంథ భాగము మొదటి మూడాశ్వాసములును నాల్గవ యాశ్వాస మున గొంత భాగము మాత్రమే. అందు అవాంతర కథలతో నిరువది కథలు సంపూర్ణముగను నిరువదియొకటవ కథయందు గొంతయు గలవు. ఇటస మగ్రమైనను కథానక వాఙ్మయమున ఱుకసప్తతి యత్యున్నతస్థానము నలంక రించుచున్నది. ఇతడు స్వతంత్రుడు. పూర్వకథకుల మార్గము ననుసరించి ఇందలి కథలను గౌరికి శంకరుడు రహస్యముగా జెప్పినట్లు ధర్మరాజునకు ధౌమ్య మహర్షి వచించిన ట్లొక సూత్రకథతో ప్రారంభించినను ఇందు పురాణ గాధ యొక్కటియైన గానరాదు. అన్నియు నాంధ్ర దేశపు గాధలే. అందు

వచ్చు వారందరును తెనుగువారే. రాజులును వారిదేవేరులునుగారు. రాయ సామ్రాజ్యమున కవి కాలమున వెలసిన పల్లెటూరి యాంధ్ర ప్రజలే. కథా శములన్నియు సామాన్య జన జీవనమునకు జెందినవే. కథా నాయికా నాయకులును సామాన్యులు. గ్రామ పురోహితులు. సెట్లు, రెడ్లు. మావటీంద్రు మున్నగు వారు వరింపబడిన విషయము వారి సామాన్యానుభవములే. మరియు కదరీపతి. వేంకటనాథుడు చూపిన మార్గము ననుసరించి తన రచనకు వాస్తవిక పద్ధతి జేకూర్చి కథా పాత్రల జాతి వృత్తౌచిత్యమాగ వర్ణించి వానిని పాఠకుల లోకానుభవమునకు సాదృశ్యమగు నట్లొనర్చినాడు కావున పూర్వ కథానక గ్రంథములందువలె గాక శుకసప్తతి యందు కదిరీపతినాటి యాంధ్ర ప్రజా సామాన్య జీవనము ప్రతిబింబించు చున్నది. ఇదియే దాని యుత్కృష్టత. ఇందలి కథలన్నియు శృంగారాత్మకములు. [15] నీచ శృంగారమన తమ యభిప్రాయ మేమో వీయి వివరించి యుండలేదు. నీచ జనుల. శృంగారమని వీరి భావముగాబోలు. మదనోద్రేకము జీవ జంతువుల కన్నిటికిని గలుగు సామాన్యానుభవము. జాతి వర్ణ విభేదముల వలన నది మారదు. కాని వ్యక్తీకరణమున వాని ననుసరించి కొంత వ్యత్యాసము పొడకట్టును. శాస్త్ర జ్ఞునిబోలె కవికిని వది పర్ణింప దగినదే. అతడు వర్ణనయం దౌచిత్యమును పాటించెనా లేదా యనునదియె వితర్కింప దగినది. ఔచిత్య స్వరూప నిర్ణయమందు ఏకీభావము కుదురదు. దేశ కాలాను గుణముగ నిదియును మారు చుండును. కదిరీపతి కాలమున వాడుక యందున్న యభిప్రాయముల ననుసరించి యతడు హద్దుమీరక శృంగారమును వర్ణించినాడని చెప్పవలసి యున్నది. కథాకల్పనయం దితడు చతురుడు. ఇతడు జెప్పిన కథలు పెక్కింటి కాధారము లెవ్వియు గానరాపు. ఇతడు నిజ ప్రజ్ఞాబలముచే నిర్మించెనేమో. కథాకల్పన యందువలె కథా నిర్వాహణము నందును నితని శక్తి యసాధారణమైనది. సూటిగా కథలు చెప్పుటయందు ఇతని సమాను లెవ్వరునులేరు. అందలి పాత్రలు నిర్జీవములు గావు. అట్టి స్త్రీ పురుష లాంధ్ర దేశ గ్రామములందు నేడును గానవచ్చెదరు. ఇతని ధార యనర్గళ మైనది. శైలి సులభము. తేట తెనుగు మాటలలో కవిత్వము వింతటి

---

15. శుకసప్తతి, ద్వితీయముద్రణ పీఠిక పుట. 14.

పొంకముగ జెప్పగలవారి సంఖ్య యల్పాల్పము. ఇతని కవితావైఖరిని గూర్చి సూర్యారావుగారు నుడివిన వాక్యములు చిరస్మరణీయములు...

స్వభావ వర్ణనల కీతడు పెట్టినదిపేరు. సామెతలగని. జాతీయములకు నిధి. అనగా ననగా నొకపురము, బిడ్డయొ పాపయొ, చిదిమి పెట్టినయట్లు, పుడకలు వరిచి – చింతాకు ముడుగుతరి – మూసిన ముత్తెము – మిట్టి మీనై యదల్చి – బడాపగల జూచి – ఎట్లు నోరాడెనో – నీ ధర్మ పత్రపు బ్రాహ్మ ణుడ – కడుపు చుమ్మలు జుట్టు – పంట పగ బట్టెన్ – ఇత్యాది. హిందూ స్థానీ పదములం బ్రయోగించెను. ఇంగ్లీసు, ముఖాములు, పరాసు లను, నితర భాషా పదములుగలవు. సంస్కృత వాక్యములు, స్వామిద్రోహ మిదం భారం, విపది ధైర్య మథాభ్యుదయే క్షమా, ఇట్టివి తెనుగు పద్యముల సందర్భోచితముగ నుపయోగించును. 16.

లోక జ్ఞానమున గదిరీపతి సహస్రాక్షుడని యొకరనిరి. ఈ కవికున్న ప్రపంచజ్ఞానము పలువురకు లేదన్న సూర్యారావుగారి వాక్యము పైదానియర్థమునే వివరించుచున్నది. సమకాలిక ప్రజా జీవనమున నీతని కంట బడకపోయిన యంశము లరుదు. సర్వమును ఇతని దృష్టి యాకర్షించి హృదయకవిలె కెక్కించినది. మేధ దాని నిప్పవలసిన యంశములను సందర్భానుసారము సంగ్ర హించి లేఖినీమూలముగ గ్రంథస్థము గావించినది. కావున ఇతని లోకాను భవము కవితకు భూషణ ప్రాయమై విలసిల్లినది...

ఆంధ్ర గ్రంథములందు తఱచుగా గానిరాని హాస్యము శుకసప్తతియందు పలుతావుల తల జూపుచున్నది. కొన్ని యెడల స్పష్టముగ దెలియవచ్చును. మరికొన్ని యెడల నిగూఢమై రసిక జనైక వేద్యముగ నున్నది. పాత్రల జాతి వృత్తులకు సహజమైన రీతిని తత్తదనుగుణ భాషా ప్రయోగాదుల మూలమున కొన్ని పట్టులయందు నవ్వు పుట్టును. మోహ పీడితుడైన పురో హితుడు తన ప్రియురాలి "వలుదలై పార్వణపు ముద్దలవంటి వలిచన్నులను. పుణ్యాహ పల్లవంబులబోలు కెమ్మోవిని. కొనలు గల్గిన దర్భకోటి నేలెడి

16. శుకసప్తతి. ద్వితీయముద్రణ పీఠిక పుటలు 13–14.

నెఱులను. పంచా మృతము గ్రిందుపఱచు వాక్సుధను స్మరించి అవునషే యని వందురి నవ్వుల పాలగుచున్నాడు. 17. నూలువడుకు రెడ్డి సానులు.

పోలిరెడ్డికి మగపోడిమి లేదుగా గాది కేలాగున కడుపు నిక్కె,
వదరకే మగవారు వచ్చెదరదె చక్కజెక్కుకో పయ్యెద చెఱగుకొండి.
యోసి లేవే మల్లి వేసాలా వేయకు మగవార లెఱుగని మర్మ మెద్ది.
నీ కేటి సిబ్బితి నెఱ రాగవై మించి యడగ డ్రొక్కినదాన వత్తగారి.
పెద్ది వినలేదె మనసుబ్బు పెరటిగోడ, దాటగా మామ గనెనట యేటి సుద్ది
యెసగి మగడొల్లకున్న నదేమి సేయు...

నని వ్యక్తా వ్యక్తముగ బూతులాడుచు నూరిలోని అంకు పురాణముల నేకరు విడుచు మందహాసమును గొల్పుచున్నారు. 18.

మఱియు పెఱికె గుఱ్ఱము దనగోడునెట్లు జెప్పుచున్నదో యాలకింపుడు— పెఱికియేచాలు నానడ్డి విఱుగజేయ, దానిపై దానునెక్కి నింతయును గాక, యకట వయ్యాళిగాగ బొమ్మనుచు గొట్టు, నతని జేతులలో జెంగలమ్మగొట్ట...

'గొఱపమాలేదు, నీరార్చు గొడవలేదు,
గడ్డివేయడు కవణంబు, గాని వావి
జంబుకాధీశ చూడు మీచాయనేను,
గుఱ్ఱమై పుట్టి యీగోడు, కుడువ వలసె...

అని తన యుత్తమ జన్మమునుస్మరించి, యప్పటి నీచదశకు వగచుచు— తిమ్మరి మాపటికై తన, యిమ్మున కేతేర దుక్కి యెనుబోతులు రెం డిమ్మల గొమ్మల జిమ్మ, గ్రమ్మిన నిర్దయత పసుల గాడింగట్టున్.

తొంటి జని వాని యుప్పటు
తింటి జుమా యింతపాటు దెచ్చుకొనుటకై

---

17. డిటో - (సరస్వతీ ముద్రాక్షరశాల ప్రతి) పుట. 45.
18. ,, పుట. 94.

కంటికి గూరుకు రా దా?
కంటికి దుది లేదు. చిక్కకయ యెట్లుండున్.

అని తనగొడవను వివరించు పెటిక గుఱ్ఱము యొక్క యుదంతమును విన్నవారెవ్వరు కడుపు చెక్కలగునట్లు నవ్వకుందురు?...

శుకసప్తతికి దరువాత వన్నెకెక్కిన కథానకగ్రంథ మయ్యలరాజు నారాయణకవి కృతమగు హంస వింశతి. నారాయణకవి క్రీ శ. 1800వ. సంవత్సరప్రాంతమందుండెనని కందుకూరి వీరేశలింగముగారు వ్రాసిరి. కాని ఈ కాలనిర్ణయమునకు వారు చూపిన కారణము లంగీకరింప దగినవికావు. నారాయణకవి యర్వాచీనుడే. కాని యతనికాలమును సూక్ష్మముగ నిర్ణయింపగల సాక్ష్యము లభించలేదు. ఇతడు కడిరీపతికి దరువాతివాడని తోచుచున్నది. శుకసప్తతి హంసవింశతుల రచనా ప్రణాళికలకు సన్నిహిత బాంధవ్యముగలదు. కథలకును పోలికలుగలవు. చాల పద్యములు రెంటియందును నొక్క విధముగనే యున్నవి. కావున నీ రెండు కథానక గ్రంథముల నొండొంటితో సరిపోల్చి చూచితిమేని ఇందొకదానిని జూచి రెండవదానిని వ్రాసినట్లున్నది. ఈ పోలికల మూలమున వీని పూర్వాపరములను నిశ్చయించుటకు వీలుకాదు. కాని వీనియందు వర్ణింపబడియుండు రాజకీయార్థికాంశములనుబట్టి చూడగా కడిరీపతి కంతకంటె నారాయణకవి యర్వాచీనుడని తెల్లముగాకపోదు.

నారాయణ కవియు దొడ్డ కథకుడే కవిత్వమున నిత డీకడిరీ పతికి తీసిపోడు. వీరేశలింగముగా రభిప్రాయపడినట్లు ఇతని కవిత్వము ప్రౌఢమయి రసవంతమయినదిగా నున్నది. తేటతెనుగుమాటలు, నిరాఘాటమైన కవిత్వధార, యింపైన వర్ణనలు, సూటిగ కథను నడిపించుటకు దగినశైలి, యసాధారణమైన లోకజ్ఞానము, ఇవియన్నియు నితడు కడిరీపతికి సరియుద్ధియని చాటు చున్నవి. కాని కథనడపుటయందు కడిరీపతికి ఇతడు దీటుగాడు. ఇదిశక్తి చాలమివలన గలిగిన లోపముగాదు. తన యపార లోకజ్ఞానమును ప్రకటించి కీర్తినందవలయుననన్న పూనికయే యితని కథాసరణిని, కుంటుపఱచినది. వీరేశలింగముగారన్నట్లు ఆయా జాతులవారిని వర్ణించవలసివచ్చి

నప్పుడు మిక్కిలి కష్టపడి వారివారి కుచితము లయిన యుపకరణాదుల నామ ములనన్నిటిని వివరించియున్నాడు.

ఒక యుదాహరణము. ఎనిమిదవకథయందు చిత్రఘనుడను రంగా జీవుని వర్ణించుచు, ఆతడువాడిన వర్ణమును, వానిని గూర్చిన చిప్పలను బేర్కొని యంతటితో దృప్తినందక గుళ్ళలో నతడు చిత్రించిన. సుర విద్యా ధర కిన్నర గరు డోరగ సిద్ధ సాధ్య గంధర్వ హరిద్వర యక్ష నలినజ. హరి హర మర్త్యర్షి వరులను, ఏబదికిమించిన జలస్థలవర్గమును, మూటికిమించిన పక్షుల నామధేయములుగల జాపితాను చొప్పించినాడు. ఇట్లే ప్రతి కథయందును విసుగు పుట్టించు దీర్ఘములుగ జాపితాలు ఒకటియో, రెండో కానవచ్చును. అప్పటి ఆర్థిక సాంఘికాచారములను దెలుపుట కీ జాపితాలు విలువగల సాధనము లైనను, కోశములను గూర్చు వారి కత్యం తోపయుక్తములైనను కథను సాగ నీయక అడ్డుపడుచున్నవి. కావున కథా ప్రసంగ విషయమున నారాయణకవి కదిరీపతికంటె గ్రిందివాడని చెప్పక తప్పదు.

దుర్నీతి బోధకమగుటచేత హంసవింశతి, నీతిపరులకు బఠనయోగ్యము కాదని వీరేశలింగముగారు ఖండించిరి. శుకసప్తతిగూడ ఈ తరగతికి జేరినదే. కాని దానిని పంతులవారేల ఖండించక విడిచిరో తెలియదు. బొద్దికూరపాటి వేంకటరంగంకవి ప్రభృతులివి దుర్నీతి బోధకములు గావనియు అంకు కథల మూలమున నీతినే బోధించుననియు వాదించిరి. కాని ఇవియెన్నడును నీతిబోధకములుగావు. నీతిదూరములని నిస్సంశయముగ జెప్ప వచ్చును. కాని ఇట్టి గ్రంథము లన్నివాజ్మయములందును గలవు. ధర్మోప దేశము వాని ప్రధానోద్దేశముగాదు. రసికజనుల కానందము కలుగజేయుట కొర కవి రచింపబడుచున్నవి. కావున నవి నీతి దూరములని త్రోసిపుచ్చుట సమంజసముగాదు.

హంస వింశతితో మనపద్యకథా వాజ్మయచరిత్ర ముగియుచున్నది. నారాయణకవి యనంతరము కేవల కథానక కావ్యములను రచించిన కవులెవ్వ రునులేరు. పురాణం పిచ్చయ్యగారి విజయాశ్వ చరిత్రమున హృద్యమైనకథలు

పెక్కుకలవు. కాని దీనిని కథానక కావ్యమనుటకంటె కథా పూర్ణోదయము వంటి ప్రబంధమనుటయెప్పు. కాలస్థితి ననుసరించి జనులయభిరుచులును మారి వవి. కథలను వ్రాయువారును జదువువారును నేడును ఆంధ్రదేశమునగలరు. కాని వారికి పద్యరచనయందును బఠనమందును అభిరుచిసన్నగిలినది. ఇప్పటి కథా వాఙ్మయము వచనమయము. కాల ప్రవాహమున కెవ్వరెదురీదగలరు.

విష్ణు మాయావిలాస నాటకములు

1

ఆంధ్రమున విష్ణుమాయావిలాసము అను పేరుగల గ్రంథములు నాలుగు గలవు. ఇందు రాధామాధవబిరుదాంకిత చింతలపూడి యల్లయార్య కృత విష్ణు మాయావిలాసనాటకము ప్రాచీనతమము. కృష్ణరాయల యుగమునకుఁ జెంది నది. ఆనాఁడు విరచితమైన రసవత్తరాంధ్రపద్యకావ్యములలో నిది యొకటి. 1933వ సంవత్సరమున నిది మదరాసు విశ్వవిద్యాలయము వారిచేఁ బ్రకటింపఁ బడెను. తరువాత క్రీ. శ. 17వ శతాబ్దాంతమున రోసనూరి *వెంకటపతి యను కవి 'విష్ణుమాయావిలాస' మను మూఁడాశ్వాసముల పద్యకావ్యము నొకదానిని రచించి వెంకటగిరి ప్రభువైన బంగారు యాచమనాయని కంకితమొసఁగెను. ఇది వెంకటగిరి మహారాజు వెలుగోటి రాజగోపాలకృష్ణ యాచేంద్రులవారిచే 1900వ సంవత్సరమున ముద్రింపఁబడెను.

పై రెండు గ్రంథములు గాక ఉత్తరరామాయణ కృతికర్తయగు కంకంటి పాపరాజు దానొక విష్ణుమాయా విలాస యక్షగానమును రచించినట్లు ఉత్తర రామాయణ పీఠికయందును, ఆశ్వాసాంతగద్యలందును జెప్పుకొని యున్నాఁడు:

---

*నెల్లూరు జిల్లా వెంకటగిరి సంస్థానమునకుఁ జెందిన సగుటూరు సీమయం దీగ్రామము గలదు. వెంకటపతియో, యాతని పూర్వికులో సదరు గ్రామవాస్తవ్యులై యుండవలయును.

"శ్రీవెలయ మున్ను విష్ణుమాయావిలాస
యక్షగానంబు మాకె సమర్పణముగ

జేసి తది యాదిగా మేము నీసుధాను
సారివాక్కులఁ జొక్కియున్నార మనఘ" (1–22)

"విష్ణుమాయా విలాసాభిధాన యక్షగాన నిర్మాణ ప్రవీణతానిధాన పాప రాజ ప్రధానప్రణీతంబైన శ్రీమదుత్తర రామాయణం బను మహాకావ్యంబు నందు" (1–334)

ఇది యముద్రితము. "ఈ కవియొక్క విష్ణుమాయావిలాసము నేఁడు విష్ణుమాయావిలాసమునకే ఆఁకరమైనది" అని మిత్రులు బ్ర. శ్రీ. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిలవారు తాము పరిష్కరించిన యుత్తర రామాయణ పీఠికలో వగచిరి. కాని శాస్త్రిలవారు తలఁచినట్లు ఈ యక్షగానము నష్టము గాలేదు, తంజావూరు సరస్వతీమహలు పుస్తకభాండాగారమున నొక ప్రతి కలదు. (చూ: డిస్క్రిప్టివ్ క్యాటలాగు–ఆంధ్రవిశ్వవిద్యాలయ ప్రచురణలు సంఖ్య 11. పుట 193). ఈ క్యాటలాగును తయారుచేసినవా రీగ్రంథమును గూర్చి యిట్లు చెప్పియున్నారు:

"విష్ణుమాయావిలాసము–ఇందు కృష్ణభగవానుని మాయలు వర్ణింపఁ బడియె. సంపూర్ణము. ప్రాఁత మంచిది. గ్రంథపాతములేదు. శైథిల్యము గాన రాదు. తప్పులు గలవు." (పుట 193)

ఇందువలన పాపరాజకృత విష్ణుమాయావిలాస యక్షగానము నశించి పోలేదని తెలియుచున్నది. నేఁటికిని లభ్యపడు ప్రాచీన యక్షగానములయం దిది యొకటి. కవి దొడ్డవాఁడు; నాటకము రసవంతమై యుండు ననుతలంపు నైజమే.

విష్ణుమాయావిలాసమును పాపరాజు యక్షగానముగ రచింపఁగా దానినే కంకంటి నారసింహకవి ద్విపదకావ్యముగఁజేసెను. నారసింహకవి కృతద్విపద విష్ణుమాయావిలాసము క్రీ. శ. 1865లో మదరాసునందలి విద్వన్మనోరంజనీ

ముద్రాక్షరశాలయందు బ్ర. శ్రీ. పాలప ర్తి నాగేశ్వరశాస్త్రులుగారిచే లేఖక ప్రమాదాదిజనిత దోషంబులు లేకుండునటులు పరిష్కరింపఁబడి ముద్రిత మై ప్రచురింపఁబడెను. ఈ గ్రంథముగాని, తద్రచయితగాని యాంధ్రికవుల చరిత్ర కారులగు వీరేశలింగంపంతులుగారి దృష్టి కెక్కకపోయినను ఆనాఁటి పండితుల కిది కేవల మపరిచితముగాదు. శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులవారు ద్విపద విష్ణుమాయావిలాసమును జక్కఁగ నెఱిఁగిరి. శబ్దరత్నాకరమునం దీగ్రంథము నుదాహరించుటయేకాక త న్నిఘంటుపీఠికయందు కంకంటి నార సింహకవిని బేర్కొనియున్నారు. అముద్రితగ్రంథ చింతామణ్యధిపతులగు పూండ్ల రామకృష్ణయ్యగారును నెఱిఁగిరి. వారీ గ్రంథము నొకా నొక సందర్భమున నుదాహరించి యున్నారు.

2

ఇంతవఱకు ఆంధ్ర విష్ణుమాయావిలాసముల విచారము. ఇఁకమీఁద ద్విపద విష్ణుమాయావిలాసమునకు సంబంధించిన చర్చ. మొదట ఏతద్గ్రంథ కర్త చరిత్రను కనుఁగొనవలసియున్నది. స్వవిరచిత ద్విపద ప్రబంధమునఁ గంకంటి నరసింహకవి యిట్లు చెప్పుకొని యున్నాఁడు:

"ఆర్వేల వంశాబ్ధిహరిణలాంఛనుఁడు
గర్వితరిపుమంత్రి గర్వభంజనుఁడు
గురుతర శ్రీ వత్సగోత్రపావనుఁడు
పరిలబ్ధ మదనగోపాలభావనుఁడు

x x x x

ప్రపితామహుని వల్లభప్రభుఁబోలి
యెపుడు బంధులఁబ్రోచు హితకీర్తిశాలి
యగణితమతిధాత యై తమతాత
యగు నయ్యఘనుఁ బోలు నఖిలైక దాత
కంకంటి యప్పయాగ్రణికుమారుండు
పంకజా ప్తసమప్రభావిహారుండు

మాయన్న నరసమాంబాగర్భశు క్తి
నాయతమౌ క్తికం బగు శుభవ్య క్తి
నరవర్ణ్య వేంకటనరసింహా(గన్న
నరసుండు పాపరాజ్ఞప్రధానుండు."

పై ద్విపదలవల్ల ద్విపదవిష్ణుమాయావిలాస గ్రంథక ర్తయగు నార సింహకవి విష్ణుమాయావిలాస యక్షగానో త్తర రామాయణ రచయితయగు కంకంటి పాపరాజునకు(దమ్ము(డని తెలియవచ్చుచున్నది. నారసింహకవి చెప్పిన స్వవంశచరిత్ర సరియైన దని కంకంటి పాపరాజకృత గ్రంథములు రుజువు సేయుచున్నవి. పాపరాజు విష్ణుమాయావిలాస యక్షగానమున స్వవంశమునిట్లు ప్రశంసించి యున్నా(డు:

"వరుస మీమ్ తాత వల్లభామాత్యుండు
గృతకృత్యు(డై మించె(గృష్ణు(గొలిచి
ఘను(డు మీతాత అయ్యనమంత్రి మదనగో
పాలమంత్రోపా స్తి ప్రతిభజెందె(

కరుణాబ్ధి మీతండ్రి కంకంటి అప్పయ్య
ప్రభు(డు తాదృశకీ ర్తి బాగుమీఱె

శ్రీవత్సగోత్రవారిధి కౌస్తుభమురీతి
వారికంచెను నీవు మీజీనావు

నరసమాగర్భజలధి రత్నంబు నీదు
తమ్ము(డగు నారసింహంబు చిదంబు (?) నిదియె
భ క్తి(గృతియిమ్ము మదనగోపాలునకును
సద్గుణనివాస పాపరాజ్ఞప్రధాన !"*

---

*తంజావూరి సరస్వతీమహలు లై బ్రరీలోని తెలు(గు వ్రా(తపు స్తక ములపట్టీ (ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణములు సంఖ్య 14. పుట 193.)

ఈ విషయమునే యుత్తరరామాయణ గ్రంథావతారికయం దిట్లు చెప్పి యున్నాఁడు:

"విమతగర్వాపహారు లార్వేలవారు
అట్టియార్వేలవారిలో నలఘుకీర్తి
వెలయు శ్రీవత్సగోత్రారవిందహేళి
మహితగుణశాలి వల్లభామాత్యమౌళి.

x x x x

శ్రీవల్లభుండు లక్ష్మీ
దేవిని మును పెండ్లియైన తెఱఁగునఁ దనకున్
దేవేరిగ లక్ష్మాంబిక
నావల్లభమంత్రి పెండ్లియాడెఁ వేడ్కన్.

x x x x

అల్లక్ష్మమాంబియం దా
వల్లభనామప్రధానవర్యుఁడు గనియెన్
పల్లవబాణాకారున్
హల్లకహితకీర్తిహారు నయ్యనధీరున్:

x x x x

అయ్యనవద్యగుణావని
యయ్యనమంత్రిమణి నరసమాంబ వివాహం
బయ్యె నహార్యకుమారిని
నెయ్యంబునఁ బెండ్లియైన నెలతాల్పరహిన్.

x x x x

ఆనరసమాంబగర్భం
భోనిధి నమృతాంశుచందమున దాసయళో

నూనవిభావిభవై కని
ధానంబగు నప్పయప్రధానుఁడు వొడమెన్.


x x x x

జననుతుఁ డయ్యప్పనఘనుఁ
డనఘుఁడు బిదురూరి నరసయకుఁ దిమ్మమకున్
దనుజామణియై గుణముల
బెనుపొందెడి నరసమాంబబెండిలి యయ్యెన్.

x x x x

అ న్నరసమాంబయందు స
మున్నతగుణుఁ డప్పనార్యముఖ్యుఁడు గనియెన్
సన్నుతుని పాపరాజా
ఖ్య న్నరసింహాభిధానుఁ గులము వెలయఁగన్." (1:2 7-40)

పై నుదాహరించిన గ్రంథములయందు వర్ణింపఁబడిన కంకంటివారి వంశపరంపర ఇది:



3

కవియొక్క సమకాలికులు

నారసింహకవి తన సమకాలికులగు ఆంధ్రకవుల నిద్దరిని బేర్కొనియున్నాఁడు. వీరియందు మొదటివాఁడు ఇతని యన్నయగు పాపరాజు. రెండవవాఁడు పుష్పగిరి తిమ్మన.

"అనఘుని పుష్పగిర్యప్పన్నతనయు
ఘను సంస్కృతాంధ్రైకకవనాతిదక్షు
మాయన్నసఖుని తిమ్మనకవిఁ గృతిస
హాయునిఁ బిలిపించి యమ్మేటితోడ."

పుష్పగిరి తిమ్మన కృతిసహాయుఁడుట. అనఁగా ద్విపద విష్ణుమాయా విలాసరచనయం దతఁడు కంకంటి నారసింహరాజునకుఁ దోడ్పడె నని దీని భావము. ఇతఁడు పాపరాజునకుఁగూడ నుత్తరరామాయణ రచనయందుఁ దోడ్పడినట్లు ఉత్తరరామాయణములోని "అనికిరీటికి శౌరి తోడైనయటులు" (1_29) అను పద్యము వల్లఁ దెల్లమగుచున్నది. విష్ణుమాయావిలాస యక్షగాన రచనయందుఁగూడఁగొంత సంబంధముండినట్లు తలఁచుట కవకాశము కలదు. దీని కాధారము విష్ణుమాయావిలాస యక్షగానములోని యీక్రింది వచనము :

"విష్ణుమాయావిలాసం బను యక్షగానంబు రచియింప యీకృతికి నేవేల్పు నధిపతిఁ జేయుదునని తలంచుచున్న మదీయకార్యఘటనాభిముఖులైన కవి తిమ్మనార్యప్రముఖు లేమని నుతింపుచున్నారు"*

ఈ వచనమునఁ బేర్కొనఁబడిన కవి తిమ్మనార్యుఁడు పుష్పగిరి తిమ్మనార్యుఁడేకాని యన్యుఁడుగాఁడు. ఇతఁడు కంకంటి సోదరుల కిరువురకును గ్రంథరచనకుఁ దోడ్పడుట చిత్రము. ఈ తోడ్పాటు విష్ణమాయావిలాస

---

* తంజావూరు సరస్వతీమహలు లైబ్రరీయాం ద్రాముద్రిత గ్రంథముల పట్టిక. పుట 193.

యక్షగానముతో ప్రారంభమాయెను. ఉత్తరరామాయణరచనయందు క్షీర నీరన్యాయమున పాపరాజుకవనముతో(గలసి దానికి వన్నె దెచ్చినది. పాపరాజు మరణానంతరము గ్రంథరచనకు(గడ(గిన యతని తమ్ముని కవితకు రూపొస(గినది. నారసింహరాజు ద్విపదవిష్ణుమాయావిలాసమును దప్ప నన్య గ్రంథములను రచించినట్లు చెప్పుకొనలేదు. మటియు పాపరాజు జీవదశయం దుండ(గా నీత(డు గ్రంథరచన(దలపెట్టలేదు. తా రచించిన ద్విపదకావ్యము నెవ్వని కంకితము సేతునా యని చింతించుచుండ(గా పాపరాజు స్వప్నమున సాక్షాత్కరించి శ్రీరామచంద్రుని కంకితము సేయుమని చెప్పెన(ట.

"అతులమౌ విష్ణు మాయానాటకంబు
వితతవాగ్వైఖరి ద్విపదగావించి
యీవిశ్వహితకృతి కేవేల్పు నధిపు
గావింతు నని యాత్మ గణియించునపుడు

x x x x

దురితసరోరుహతుహినభానుండు
సరసుండు పాపరాజప్రధానుండు
నాకలలో నొక్కనా(డు గావ్వించి
యేకతంబున(గూర్మియెస(గ విట్లనియె

నాకూర్మిసోదర నరసింహ నీవు
చేకొని ద్విపదగా(జేసినయట్టి
అనుపమవిష్ణు మాయానాటకమున
కనురూపవిభు(డెవ్వ(డని తలంచెదవు
దానికి విభు(డు సీతామనోహరు(డె
కాని తదన్యుండు గల(డె లోకమున"

కావున కంకంటి నారసింహకవి ద్విపదవిష్ణు మాయావిలాసము రచించు నప్పటికి అతని యన్నయగు పాపరాజు స్వర్గస్థు(డాయె ననుట నిశ్చయము. పుష్పగిరితిమ్మనార్యు(డు దన సహశ్రోతయగు పాపరాజుయొక్క మరణానం

తరముగూడ నాతనియందలి వాత్సల్యముచేతనో. మఱి యేకారణముచేతనో అతని తమ్ముఁడు గ్రంథరచనకుఁ గడఁగగా నతనికిఁ 'గృతి సహాయుఁడై' తోడ్పడెను. ఈసందర్భమున గమనించఁదగిన యంశమొకటి కలదు. పుష్ప గిరి తిమ్మనార్యుఁడు కంకంటి పాపరాజు వ్రాసినట్టు ఉత్తరరామాయణమొక టియు, కంకంటి నారసింహరాజు వ్రాసినట్టు విష్ణు మాయావిలాస ద్విపదకావ్య మొకటియు రచించినా[1]" డనునై తిహ్యము కలదని బహుజనపల్లి సీతారామా చార్యులవారు తెలిపియున్నారు. [1] ఉత్తర రామాయణ కర్తృత్వమునుగూర్చి యభిప్రాయభేదములు గలవు. కావ్యరచనయందుఁ బుష్పగిరి తిమ్మన కంకంటి పాపరాజునకుఁ గొంతతోడ్పడియుండినను, వీరిరువురి కవిత్వమునకును భేద మున్నందున, ఈలోక ప్రవాదము సరియైనదిగా నుండదని వీరేశలింగం పంతులుగారు నుడివిరి.[2] "తిమ్మకవి సమీరకుమార విజయశైలికిని దీని శైలికిని, పదప్రయోగాదులకును ప్రాక్పశ్చిమముల యంతరము కల"దని పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిలవారు వక్కాణించిరి.[3] ఈ విషయమై కొంత పరిశోధన సాగించిన మద్దులపల్లి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు పైవారితో నేకీభవించక "కవితాశైలినిబట్టి చూడ నుత్తరరామాయణమునందు ఆదిశ్రీకారమునుండి యంత్యాక్షరము వఱకును బదగుంఫనమునను నేమి, సమాజ జాటిల్యమునను నేమి, నేర్పుకూర్పువలనను నేమి, యతిప్రాసప్రయోగములనేమి పుష్పగిరి తిమ్మన్నయే సమీరకుమార విజయము వ్రాసినతరువాత వ్రాసి నట్లుగాఁ దోఁపకపోదు." "రెండు గ్రంథములను సవిమర్శముగా సాంతము చూచినచో నొక్క ముఖమునుండి వెలువడిన వాక్కుగనే కన్పట్టకపోదు. అతి ద్రాసిష్ఠంబులగు సమాసములును, వచనంబులును, అచ్చతెనుఁగు కూర్పులును, లోకోక్తులును, అర్థాంతరన్యాస ముక్తపదగ్రస్తాదులును రెండింటను గలవు. మొత్తముపైని సమీర కుమారవిజయముకంటె నుత్తర రామాయణములో మెఱుఁగు పెట్టఁబడిన దని చెప్పకతప్పదు. పైని గనపఱచిన యేకదేశ సామ్య మునుబట్టియే కాదు, సాంగముగాఁ దిలకించినచోఁ దిమ్మకవియే సమీరకుమార

---

1 శబ్దరత్నాకరము, పీఠిక, పుట 16.

2 ఆంధ్రకవుల చరిత్రము, పుట 459.

3 ఆనందముద్రాక్షరశాలవారి యుత్తరరామాయణ పీఠిక, పుట 2.

విజయమును రచియించిన తరువాత గంకంటి పాపరాజుకు సాహాయ్యమొనరించు పేరిటనేమి, ఋణమీఁగుట కొఱకేమి యుత్తరరామాయణమును రచించెనని చెప్పుట కనువుగనున్న"దని చెప్పిరి. * ఇట్లు విమర్శకపండితులు ఉత్తర రామాయణకర్తృత్వమునుగూర్చి రెండుతెగలై చీలుటచేత, నిశ్చయమును నిర్ణయించుట సులభ సాధ్యము గాదు.

ఇఁక ద్విపద విష్ణుమాయావిలాస నాటకముగూడ పుష్పగిరి తిమ్మనయే కంకంటి నారసింహరాజు పేరిట రచించెనేమో విచారించవలసియున్నది. ఈ సందర్భమునఁ జింతనీయములైన యంశములు మూఁడు గలవు: 1. నారసింహరాజు దన యన్న మరణానంతరము గ్రంథరచనకుఁ గడంగుట. 2. ఇతఁడు దన యన్న పాపరాజును బోలి 'చతుర్వి ధానవద్య కవిత్వ విద్యావధానాధునాతన భోజరాజ' 'విష్ణుమాయా విలాసాభిధాన యక్షిగాన నిర్మాణ ప్రవీణ'లైతాదృశ బిరుదావళివల్ల స్వకవితానైపుణ్యమును దెల్పుకొనక, కేవలము 'సరస విద్వత్కవిజనశరణ్యుండ' నని చెప్పుకొనుట 3 పుష్పగిరి తిమ్మన కృతి సహాయుఁడగుట. ఈ విషయముల నన్నిటిని సమాలోచనముచేసి చూడ పుష్పగిరి తిమ్మనకు విష్ణుమాయావిలాస రచనయందుఁ గూడ కొంతయేని సంబంధము గలదని తోఁచుచున్నది. భావిపరిశోధకుల పరిశ్రమలవల్ల దీనియందలి నిజము వెలువడవలసియున్నది.

4

కవికాలము

నారసింహరాజు కంకంటి పాపరాజు తమ్ముఁడనియుఁ, బుష్పగిరి తిమ్మనార్యునికి సమకాలికుఁడనియు పైన వ్రాసినదానివల్ల వ్యక్తపడుచున్నది. కాని వీ రేకాలమునా రైనదియుఁ దెలిసికొనుటకుఁ దగిన యాధారము లెవ్వియు వీరి గ్రంథములలోఁ గానరావు. కవిత్వశయ్యయు, శబ్దజాలమును జూడ వీరు 17వ శతాబ్దమువారు కావచ్చు ననుఁ నూహ పొడముచున్నది. వీరి కాలమును

* వావిళ్ళవారి సమీరకుమారవిజయ పీఠిక, పుటలు 10, 15.

నిర్ణయించఁదగు నాధారములు లేకున్నను. ఆంధ్రకవుల చరిత్రకారులు వీరు 18వ శతాబ్దాంతమున నుండిరని వ్రాసియున్నారు. "కంకంటి పాపరాజు ప్రళయ కావేరిపట్టణములో నమీనుగా లౌక్యాధికారము నం దుండినవాఁడు. ఆ కాలము నందే పుష్పగిరి తిమ్మన్న కొంత ఋణముచేసి యాయప్పు తీర్పలేక యీ పుస్తకము (ఉత్తరరామాయణము)ను దానిక్రిందఁ జేసి యియ్యఁగా 1790వ సంవత్సరప్రాంతమున నుత్తర రామాయణమును పాపరాజు తన పేరితోఁ బ్రచురించెనని చెప్పుచున్నారు. కవి యిప్పటికి (ఆంధ్రకవుల చరిత్ర తృతీయ భాగ రచనాకాలము నాఁటికి) నూఱు సంవత్సరముల క్రిందట నుండినవాఁడు." "కంకంటివారి యుత్తర రామాయణమువలెనే (ధరణీదేవుల రామమంత్రికృత) దశావతార చరిత్రమును పుష్పగిరి తిమ్మన్నచే రచియింపఁబడిన దని కొందఱు చెప్పుచున్నారు గాని కవులిద్దఱు నేకకాలములో నొక్క దేశములో నుండుట దక్క వారి మాట కాధారలేశమును గానరాదు" 1 ఇందువల్ల కంకంటి పాప రాజును, పుష్పగిరి తిమ్మనార్యుఁడును, ధరణీదేవుల రామమంత్రియు సమ కాలికు లనియును, వీ రందఱు క్రీ. శ. 1790వ సంవత్సర ప్రాంతము వార నియు నాంధ్రకవుల చరిత్రకారుల యభిప్రాయమని తెల్లమగుచున్నది. కాని ధరణీదేవుల రామమంత్రి కంకంటి పాపరాజునకును, పుష్పగిరి తిమ్మన్నకును సమకాలీనుఁడని రుజువుసేయఁగల సాక్ష్యమెందును గానరాదు. ఒకవేళ సమ కాలీనుఁడని తాత్కాలికముగ నంగీకరించినను ధరణీదేవుల రామమంత్రి 18వ శతాబ్దాంతము వాఁడుగాఁడు. అతఁడు క్రీ. శ. 17వ శతాబ్ద్యుత్తరార్ధమున నుండె ననుటకుఁ బ్రబలమైన సాక్ష్యమతని గ్రంథముననే కానవచ్చుచున్నది. దశావ తార చరిత్రకృతిపతియగు మగదల కృష్ణామాత్యుని ముగ్గురు పెదతండ్రులలో జ్యేష్ఠుఁడగు తిమ్మన "వీరవేంకటపతి రాయవిభువతంస—భావితోభయ చామర భద్రదంతి—దంతపల్యంకికాది సన్మానఘనుఁ"డని తెలియవచ్చుచున్నది. * ఈ వీర వెంకటపతిరాయలు క్రీ. శ. 1630 మొదలు 1642 వఱకును వేలూరు నిజరాజధానిగ కర్ణాటక సామ్రాజ్యమును పాలించెను. ఇతఁడు తన పూర్వికు లగు విజయనగరచక్రవర్తులవలె నాంధ్రభాషాభిమానియై యాంధ్రకవులఁ బోషించెను. వెంకటపతిరాయదండకమున కితఁడే నాయకుఁడు. చంపూరామా

---

1 ఆంధ్రకవుల చరిత్ర, పుట 464.

* వావిళ్ళవారి దశావతార చరిత్ర, 1—35

యణ కృతికర్తయగు ఋగ్వేదివెంకటాచలపతికవియొక్క తండ్రియగు తిరువెంగళార్యకవిని 'గొలఁకులాయపుఁజేజిబలురౌ'తని సత్కరించెను.1 పెరియన్న యను కవివర్యునిచే నొక యాంధ్రప్రబంధమును గృతినందెను. ఇట్టి భాషాపోషకునిచే మన్ననవడసిన మగదల తిమ్మన యతని సమకాలికుఁడని చెప్పక తప్పదు. మఱియు నీతిమ్మనార్యుని కడగొట్టుతమ్ముఁడును, మగదలకృష్ణుని పినతండ్రియైన నారణపుత్రుఁడైన ఆదినారాయణుఁడు 'నవాబుసాహిబూ వితీర్ణ సువర్ణజాంబూనదాంబ రాసమగ్రామబహుమానభాసమాన నవ్యవిభుఁ'డఁట.2 ఇందుఁ బేర్కొనఁబడిన నవాబుసాహెబు సయ్యద్ మహమ్మదుమీర్ జుమ్లా. ఇతఁడు మొదట క్రీ. శ. 1639-వ సంవత్సరములో కర్ణాటకముపై నెత్తివచ్చి పులికాటు అనఁబడు ప్రళయకావేరిపట్టణమును ముట్టడించెను. కాని వెనుదిరిగి పోవలసివచ్చెను. క్రీ. శ. 1649 లో రెండవపర్యాయము దాడివెట్టి తూర్పు సముద్రతీరభూముల నాక్రమించుకొని ప్రళయకావేరి కధిపతులైన యొలందా వారి నదిమి కప్పముగొనెను. కావున మగదల కృష్ణుడుఁడును, ధరణీదేవుల రామమంత్రియు క్రీ. శ. 1650-వ సంవత్సరప్రాంతమువారనుట నిశ్చయము.

ధరణీదేవుల రామమంత్రి క్రీ. శ. 17-వ శతాబ్దమధ్యమున నుండెనని పైనుదాహరించిన యాధారముల మూలమున స్పష్టపడినది. కంకంటి పాపరాజును, పుష్పగిరి తిమ్మనార్యుఁడును రామమంత్రికి సమకాలమువారగుట నిశ్చయమేని వారును నప్పటివా రనియే చెప్పవలయును. పాపరాజుతమ్ముఁడును, గ్రంథరచనయందుఁ బుష్పగిరితిమ్మనార్యునిసాయమునందినకంకంటి నారసింహరాజును వీరివలెనే క్రీ. శ. 17-వ శతాబ్దమధ్యమున వర్ధిల్లె ననుటకు సంశయింపఁ బనిలేదుకదా.

5

విష్ణు మాయావిలాసముల యన్యోన్యసంబంధము

ఈ వ్యాసారంభమునఁ బేర్కొనఁబడిన విష్ణు మాయావిలాసముల కన్యోన్య సంబంధ మెద్దియేని కలదేమో విచారించవలసియున్నది. వీని కన్నిటి

1. ఆంధ్రవాఙ్మయపరిషత్తువారి చంపూరామాయణము
2. వావిళ్ల వారి దశావతారచరిత్ర, 1-5

కిని నామమొక్కటియే సామాన్యమా, లేక ఇతివృత్తము నందుఁగూడ సంబంధము గలదా యను విషయములు విమర్శనీయములు. కాని ఈ కార్యమును సాగించుట కిప్పుడు సామగ్రిచాలదు. పైనాలుగు విష్ణు మాయావిలాసములలోను మూఁడు ముద్రితములైనను రోసనూరి వెంకటసతికృత గ్రంథ మిప్పు డెచ్చటను లభ్యముగాకయున్నది. పాపరాజవిరచిత యక్షగాన మింకను నముద్రితము. కాని విష్ణు మాయావిలాసముల కన్నిటికిని నామసామాన్యతయే కాక ఇతివృత్త సాదృశ్యమునుగల దనుటకుఁ గొంత యవకాశ మున్నది. రోసనూరి వెంకట పతికృతవిష్ణు మాయావిలాసమునుండి వీరేశలింగం పంతులగారి యాంధ్రకవుల చరిత్రలో నీక్రిందిపద్యముదాహరింపఁబడి యున్నది[1]

"ఇటువలెనేమి యాపయన
మిప్పుడు మీ రఖిలేశ మాయలఁ
బటువగు విష్ణుఁ డంచెనెడు
పల్కులు సిద్ధము సుందరీక్రియా
కుటిలశిరోజియైన హ్రీ
గొబ్బునఁ జూచితిరేని మీకు నొ
క్కటఁ జపలత్వమైననతటి
గౌరవ మెట్లగునో తలంపుఁడీ."

ఇది శివగర్వభంగకథయందలిది. దీనిని యెల్లనార్యుని విష్ణుమాయా విలాసనాటకములోని ఈ క్రింది పద్యములతోఁ బోల్చి చూడుఁడు :

"దేవరవు మిక్కిలియుగాం
తావివశాత్ముఁడవు మనసుధైర్యముచలనం
బైవచ్చెనేని మఱితువు
భావింపఁగ సర్వభూప్రపంచమునెల్లఁ.

"జగములు మూఁడు నాతని వ
శంబున నున్నవి మాయఁజిక్కి యీ

---

[1]ఆంధ్రకవులచరిత్రము, పుట 375

జగతి ప్రధానదైత్యసుర
సంయములుం గమలాసనుండు నా
దిగఁ గలవారలెల్ల విక్ర
తిం బడుచుండ్రు తదీయలీల నే
మగునొసుమీ మహాత్మ జల
జాక్షునిచేత భవత్ప్రతాపముఁ" (4 : 85–6)

ఈయంశమును గంకంటి నారసింహరా జిట్లు వర్ణించియున్నాఁడు :

"మరుఁడును బగవాఁడు మటుమాయలాఁడు
హరి మీర లాతని యాఁడురూపంబు
చవ్వసేయకఁగన్నజగములలోన
నవ్వగు దవ్వగు నాడెమౌపెంపు
జగములన్నియుఁ దద్వశమునవర్తిలెడు
జగతిప్రధానులౌసంయము ల్సురులు
కమలాసనాదు లా ఘనుని మాయలను
భ్రమగొనియున్నారు ప్రాజ్ఞతలడిగి."

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

దీనిఁ జూడఁగా రోసనూరివెంకటపతి యల్లనార్యుఁడు చెప్పిన కథలనే తన గ్రంథమునందు వర్ణించెనేమో యను శంక గలుగుచున్నది.

విష్ణుమాయావిలాసయక్షగానమునందలి యితివృత్త మేమో తెలియదు. ఎల్లనార్యునిబోలి పాపరాజును దన గ్రంథమును మదనగోపాలున కంకిత మొసంగియుండుటచేత నితఁ డెల్లనార్యుని గ్రంథమునే యక్షగానముగ మార్చి యుండవచ్చును. కాని పాపరాజవిరచిత యక్షగానప్రబంధము వెలువడు వఱకును వాస్తవస్థితి యిట్టిదని నిశ్చయించిచెప్పుటకు వీలులేదు.

ఇది యెట్లున్నను నారసింహకవికృత ద్విపదప్రబంధమునెడ ఇట్టి సంశయమున కవకాశము లేదు. ఇది యెల్లనార్యుని గ్రంథమునఁకు ప్రతిచ్ఛాయ. ద్విపదవిష్ణుమాయావిలాసము పూర్వోత్తరము లను ద్విభాగములుగ విభజింపఁబడియున్నను భవ్యకావ్యమువలె నిదియు నైదాశ్వాసముల గ్రంథమే. పద్య

కావ్యమునందువలె నిందును కథాప్రణాళిక ఱుకయోగివాగ్ఘరినుండియే వెలువడు చున్నది. రెంటను ఉపకథకుఁడు గోవిందశర్మయే; కథానుక్రమణికయు నొక్కటియే; కథలును అవియే. పద్యద్విపద విష్ణుమాయావిలాసనాటకముల యన్యోన్యసాదృశ్య మింతటితో ముగియలేదు. నారసింహకవి సాధ్యమైనంత వఱకు యెల్లనార్యుని మాటలను, వర్ణనలను, లోకోక్తులను ఢన ద్విపదల యందిమిడ్చెను. పద్యవిష్ణుమాయావిలాసనాటక పరిష్కర్తలీద్విపదకావ్యమును జదివి ముద్రితగ్రంథములో దొరలియుండు నపపాఠములను సులభముగ దిద్దు కొనియుండవచ్చును.* పద్యద్విపదకావ్యముల యన్యోన్య సన్నిహిత సంబంధ మును దెల్పుటకై రెండుమూఁడు ఉదాహరణముల నిచ్చి ఈ వ్యాసమును జాలించెదను.

లక్ష్మీగర్వభంగకథలోని కొలనివర్ణన—పద్యకావ్యము :

"కనుగొనియె నగ్రవీథిఁ
వనజాలయ యొక్క దివ్యవనజాకరముఁ
దనువు సెడి వాడఁజారిన
వనరుహకల్హారకైరవంబులతోడఁ.
నిండారఁ జిగిరించి నిగనిగల్చాలక
వాడిన నవపల్లవములతోడఁ
గలయంగఁ బూచి తేనెలు చిందునెత్తావిఁ
బొరయకఁగంది విరులతోడఁ
బరిపాకమునఁ బండి సరసమాధురి లేక
పద నింకిపోయిన పండ్లతోడఁ
1మలయుటల్మాని కొమ్మలవిన్ననై యున్న
యలిపోతఱుకపికావలులతోడఁ

---

*తార్క్ష్యకై యొక్క అసపాఠము నిచటఁజూపుచున్నాను. సముద్ర మథనమువల్లఁ బుట్టిన విశేషములు వర్ణించుసందర్భమున—

1ముద్రితప్రతి 'మెలకువల్ మాని' అని. దీనికి వ్రాతప్రతులలోని పాఠాంతరము 'మలయు...కొమ్మల విన్ననై యున్న' అని అధోజ్ఞాపికయందుఁ దెల్పఁబడియున్నది. ద్విపదవిష్ణుమాయానాటకమున 'మలయుటల్మాని' అని యున్నది. 'మలయుటల్మాని' అనఁగా 'సంచార ముడిగి' యని యర్థము.

చిన్నవోయిన వనము వీక్షించి లక్ష్మి
యనుఁగుఁజెలులకుఁ జూపుచు నరిదిపడుచు
నెన్నఁడును జూడ మిటువంటిహేమవనము
శూన్యమైయున్నదిదియేమి చోద్య మొక్కొ” (2–23.24)

‘కల్పపాదప పించకము నప్సరస్త్రీలు
కామధేనువును జింతామణీయును’

అను సీసపాదము గలదు. ‘పించక’శబ్దము కలదేమో విచారణీయము. కలిగినను సందర్భోచితముగాదు. ద్వీపదయం ది ట్లున్నది :

“మఱియు దేవాసురుల్ మసల కయ్యుదధిఁ
దరవఁగాఁ గల్పకతరుపంచకంబు”

‘పించకము’ అపపాఠము. ‘పంచకమే’ సరియైన పాఠము. ‘పంచైతే దేవతరవః’ అని నామలింగాను శాసనము.

ద్వీపదకావ్యము (పుట 34):

“వనజాకరముఁ జూచె వాడు కల్హార
వనరుహకైరవావళిగలదాని
నిండారఁ జిగిరించి నిగనిగల్గనక
దండిమానిన వాడుతలిరులతోడఁ
గలయఁబూచి మరందగంధము ల్లేక
తెలివిగైకొనకఁ గందినపూలతోడఁ
బరిపాకమునఁ బండి పద నింకి తీపు
నెఱయక స్రుక్కియుండెడిపండ్లతోడ
మలయుటల్మాని కొమ్మల విన్నగాన
యలికులశుకకోకిలాదులతోడఁ
జిన్నవోయిన వనిఁ జెంత నీక్షించి
యన్ననబోఁడి లో నాశ్చర్యమంది

ననబో డులార నెన్న డు నిట్టిహేమ
వనము గన్గొన యింతవన్నె జెందియును
నేల వాడినదొకొ యీతో ట యనుచు
నాళిజనాళితో ననుచు నద్దివ్య
కమనీయవనమెల్ల గలయ దర్శించి
....."

బ్రహ్మగర్వభంగకథయందలి మాయాసరస్వతి వికారవర్ణన : పద్య కావ్యము.

"వెండియు దనకుందానే సంకల్పదశావిశేషంబున—

కన్నీరుసించి తొంగలిరెప్ప లల్లాడ
నొకమాటుప్రియుడు రాకునికిజేసి
కంపించు నొకమాఱు కౌదీగె సెమరింప
భర్త కౌగిట జేర్చ బట్టె ననుచు
నవ్వులాడేలు నానన మొప్పు నొకమాఱు
పతితోడ భావించు భావరతికి
బులకించు నొకమాఱు వలపుచన్నులక్రేవ
లదర వల్లభులీల నాత్మగోరి
యంగజుడు వెల్లిగొల్పంగ నంగకముల
నెల్లకళజాఱు*ధైర్యంబు పల్లటిల్లి
బ్రహ్మదేవునిపై బ్రేమ బాఱవిడిచి
పీఠియను మీటి పాడుచు విద్రుమోష్ఠి" (3:298-9)

ద్విపదకావ్యము (పుట 80):

"వెండియు నొకకొన్ని వెడమాయలూని
నిండువేడుకల నన్నీరేజగంధి
కన్నీరు నించు తొంగలిపెప్ప లార్చు
మన్నించు పతి రాక మసలె నేదనుచు

---

*'కళలూర' అను ద్విపదకావ్య పాఠమేయుత్తమ మని తలచెదను.

గంపించు నొకమాటు కౌఁదీఁగె చెమ్మ
రింపఁ గౌఁగిటను జేరిచె నాథుఁ డనును
నవ్వులఁ దేల్చు నానన మొక్కమాటు
మవ్వంపుముచ్చట ల్మగఁ డాడె ననుచుఁ
బులకించు నొకమాటు భూరిమోహమునఁ
జెలువునిచెలువంబుఁ జింతించుకొనుచుఁ
గళలూర ధైర్యవైఖరి కడతేరఁ
గలఁగు నొకొక్కమాటు కాయజుం డెంచ
నీరీతి వీణ వాయించుచు బ్రహ్మఁ
బేరేచుకొఱకు నబ్బిత్తరియున్న."

నారసింహరా జిట్లు పద్యవిష్ణుమాయావిలాసనాటకమును మేలుబంతిగఁ గొన్నను దత్కర్తయగు నెల్లనార్య నెచ్చటను బేరొక్కనకపోవుట చిత్రము.

రామకృష్ణుని 'పాండురంగ' కృతి

నాలుగైదు గంటములపోట్లతో మాటలకు జీవముపోసి
సచేతనమైన వ్యక్తిని దృగ్గోచరము చేయించు మహిమ
ఇతని కావ్యకళయందుఁ గానవచ్చుచున్నది

రామకృష్ణకవి విరచితములైన కావ్యములలో పాండురంగ కృతి సర్వ విధముల ప్రశంసనీయము. అది రసాస్వాదనపరాయణులగు విమర్శకుల యాద రమున కన్నియుగములందును గురియై, కావ్యప్రియులకుఁబోలె భక్తజనులకుఁ బఠనీయగ్రంథమైనది. "ఏ గతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరే కదా" యను చేమకూరవారి నిశ్వాసోక్తులీ కవికావ్యములకు—ముఖ్యముగాఁ పాండురంగ కృతి కన్వయింపవు. క్రీ.శ. 16—వ శతాబ్దోత్తరార్ధమున నుండిన కాకమానిమూర్తి, సగర్వముగ

"అల్లసానివాని యల్లిక జిగిబిగి
ముక్కుతిమ్మనార్య ముద్దుపలుకు
పాండురంగవిభుని పదగుంభనంబును
గాకమానిరాయ నీకెతగురఁ."

యని తన్ను బ్రశంసించుకొనియె. నాఁటినుండి నేఁటివఱకుఁ బండితులు, కవులు, విమర్శకులు నేకగ్రీవముగ నీకావ్యరత్నము నిగ్గున కబ్బుర మంది మెచ్చుకొనిరి. వీరేశలింగమువంటి మడిగట్టుకొనిన విమర్శకుఁడు సహితము రామకృష్ణుని శీలమును దెగనాడినను కవిత్వమును మెచ్చుకొనెను.

"ఇతఁడు రచియించిన పుస్తకము పాండురంగ మాహాత్మ్యమను స్థల పురాణము. ఇందు గొన్నివర్ణనలు విలక్షణముగానుండును. "పాండురంగవిభుని పదగుఁభనంబును" అన్న ట్లీతని కవిత్వము పదముల కూర్పుచేత మేలిమి గన్నది. అందునిరర్థకములైన పదములెక్కడనో కాని కానఁబడవు...మొత్తము మీఁద బదసందర్భ మితనికిఁ గుదిరినట్లు మఱియొక కవికిఁ గుదిరిన దని చెప్ప వలనుపడదు"1

పాండురంగమాహాత్మ్యమును వీరేశలింగముగారు స్థలపురాణమనిరి. నిక్కమే. కాని పాండురంగక్షేత్ర మాహాత్మ్యమును కొనియాడుచున్నను దీనిఁ గేవల స్థలపురాణముగఁ బరిగణింప వలనుపడదు. రామకృష్ణుఁడే తన కావ్య స్వభావము నిట్లు సూచించియున్నాఁడు.

ఉ. "స్కందపురాణనీరనిధి
కౌస్తుభమై ప్రభవించు దేవకీ
నందను సత్కథోద్యమము
నవ్యకవిత్వకళా కలాపమఁ
గుందనముఁ ఘటించి కడు
గ్రొత్తగు సొమ్మొనరించి విష్ణుసే
వం దిలకించు నప్పరమ వైష్ణవ
కోటి నలంకరింపుమా."2

అనఁగా, కథావస్తువును స్కందపురాణమునుండి కొని, దానికి నవ్యకళా కలాపముచేఁ గ్రొత్తరూపముఁగల్పించి, సర్వాలంకార యుక్తమైన నూతన కావ్య నిర్మాణమునకుఁ గడంగెనని విశదమగుచున్నది. ఇట్టి కావ్యమునే రామ రాజభూషణుఁడు మిశ్రకావ్యమని పేర్కొన్నాడు.

ఉ. "కేవల కల్పనాకథలు
కృత్రిమరత్నము లాద్యసత్కథన్

---

1. ఆంధ్రకవుల చరిత్రము, పుట 272.
2. పాండు. ఆ. 1 : 26.

వావిరిపుట్టుఁ తన్నము ల
వారితసత్కవికల్పనా విభూ
షావహ పూర్వవృత్తములు
సానలఁదీసిన జాతిరత్నముల్."

మిశ్రకావ్యరచన ప్రబంధ పరమేశ్వరుని దినములందు మొలకయెత్తి. యాంధ్రకవితాపితామహానికాలమునకు సంపూర్ణ పరిణామమునంది ప్రబంధమై మార్పుజెందెనని కాఫీ పిపాసకు లొక్కరు వాక్రుచ్చిరి.[1] ఇది నిరాధారమైన వ్రాఁత. రామరాజభూషణునిచే నిరూపింపఁబడిన స్వభావముగల మిశ్రకావ్యము కీ. శ. 16–వ శతాబ్దమునకుఁ బూర్వము రచింపఁబడినది యొక్కటి యేనియు నేఁటివఱకు బయల్పడలేదు. మఱి సాళువగుండ నరసింగరాయని కాలమునకు ముందు మిశ్రకావ్య మను పే రాంధ్రవాఙ్మయమున నెచ్చట గానరాదు. నాయెఱింగి నంతవఱకు మిశ్రకావ్యమును మొదట పేర్కొనినవాఁడు పినవీరభద్రుఁడు. కావ్యములు త్రివిధము లనియు, అందు మిశ్ర కావ్య మొకటియనియుఁ దెల్పి నాఁడు.

శా. "ప్రఖ్యాతంబన మిశ్రబంధమన ను
త్పాద్యం బనంగాఁ ద్రిధా
వ్యాఖ్యాతం బగు వస్తువందు మఱియ
ద్యాహారముం జేయఁగాఁ
బ్రఖ్యాతం బది వృత్తమైన కృతి చె
ప్పన్వక్తకు నోర్మితకుఁ
ఖ్యాతిం గలిగించుఁ బుణ్యమహిమ
న్విశ్వంభరామండలిఁ."

మఱియు నిట్టి కావ్యమునకు,

క. "శృంగారము ముఖ్యంబగు
నంగియు నంగములుఁదలఁప నష్టరసములు

1కవిత్వవేది : ఆంధ్రవాఙ్మయ సంగ్రహము, పుట 120.

న్సాంగమగు నేనిఁ డంకము
బంగారముతోడి యొర ప్రబంధము వొందుఁ."
అని నిర్వచించి.

గీ. "భారతప్రోక్తకథమూలకారణముగఁ
గాళిదాసుని నాటకక్రమము కొంత
తావకోక్తికి నభినవశ్రీవహింప".1

"మిశ్రబంధంబుగా శాకుంతలం బనుప్రబంధంబు బంధురప్రీతిం జెప్పఁ బూనితి" నని చెప్పియున్నాఁడు. కావున వాఙ్మయచరిత్రయందు మనకుఁ బ్రస్తుతమునఁ గల జ్ఞానము ననుసరించి పినవీరభద్రుఁడే మొదటి మిశ్ర ప్రబంధ కర్త యని తాత్కాలికముఁగ సిద్ధాంతీకరించవచ్చును. తత్పూర్వము పై త్రివిధ కావ్యవిభజనయు, మిశ్రబంధములును చిరపరిచితనులై యుండవచ్చును. కాని యిదమిత్థ మనుట కాధారము లెవ్వియుఁ గానరావు.

మిశ్రకావ్యస్వరూపము నిచ్చట నిర్వచించుటకుఁ గారణము లేకపోలేదు. కవి చెప్పినట్లు పాండురంగకృతి పరమభాగవతచరిత్రయే యైనను మిశ్రకావ్యపుఁ బోకడ లిందెన్నేనియుఁ గలవు. మిశ్రకావ్యములఁబోలి దీనికి శృంగారము ముఖ్యంబగు నంగి. ఇందలి పరమభాగవతులయం దెవ్వరు నినుపకిచ్చడా లగ్గట్టు కొనినవారుకారు. కావ్యముయొక్క సత్తా కనుఁగొనఁదలఁచువారికి కావ్యకర్త యే యాదర్శములను దృష్టియందుంచుకొని కావ్యరచనకుఁ గడంగెనో తెలిసి కొనుట ప్రథమ కర్తవ్యము. వాని నెఱుఁగక కావ్యవిమర్శనకుఁ బూనుకొనుట చుక్కానిని విడిచి యోడనడుపఁ బ్రయత్నించి నట్లగును. రామకృష్ణుఁడు రచించినది మిశ్ర కావ్యము. ఇందు కథాకల్పన ప్రధానముకాదు. బుద్ధిబలముచేఁ బేనఁబడిన కథలాకాలపు రసికుల యాదరమునకుఁ బాత్రములు కావయ్యెను. కథాపూర్ణోదయమువంటి కల్పనాకథలు 'కృత్రిమ రత్నము' లని నిరసింపఁ బడెను. అఖండ ప్రతిభాశాలియని నేఁటియాంగ్ల విద్యాపారీణులగు నాంధ్ర వాఙ్మయ విమర్శక మహాశయులచేఁ గొనియాడఁబడు పింగళిసూరన "ఊహించి తెలియఁ రాకుండ సూరపరాజు భ్రమఁ గథాపూర్ణోదయము రచించె"నని పరిహసింపఁబడెను. నాఁటికవుల ముఖ్యోద్దేశము గ్రహించిన ఇతివృత్తమును నానా

1 శకుంతలాపరిణయము, పుట 4.

విధాలంకారములతోడను, వర్ణనలతోడను గైసేయుటయే. వర్ణనలయందును శబ్దార్థాలంకారములయందును వారు యావచ్ఛక్తిని వినియోగించిరి. ఇతివృత్తములు వర్ణనాదులను దగిలించుట కనువులగు మేకులాయెను. వర్ణనాదులతో గూడ కథను సహితము కొందఱు పోషించిరి. వీరి సంఖ్య యల్పము. కావున పాండురంగ మాహాత్మ్యమునేకాక రాయల కాలమున వెలువడిన కావ్యముల గుణావగుణములను పరామర్శింపఁ బూనినపు డీవిషయమును దృక్పథమున నెల్లప్పు డుంచుకొనవలయును. ఆంగ్లేయ విద్యాకర్మాగారముల రూపొందిన సులోచనములను ధీచక్షువుల ధరించి యాంధ్రకవిత్వ తత్వవిచారముఁ జేయఁ గడంగినచో పూర్వకవుల యెడల నపచారము సేయుటయేకాక విమర్శకులు స్వయము పరిహాసమునకుఁ బాత్రి లగుదురు.

పదగుంభనమునకు రామకృష్ణుఁడు పేరెక్కిన కవియని పెద్దల సిద్ధాంతము. నిరర్థకపద ప్రయోగ మరుదు. సంస్కృత సమాసముల క్రొత్తపోయగమునను, వింత దనమునను, సీసములు తూగునందును, పద్యముల కూర్పు నేర్పునను ఇతఁడు పంచకావ్యకర్తలయుద్దికాఁడని యాధునికుల యాదేశము. నాలుగైదుగంటములపోట్లతోమాటలకు జీవముపోసి సచేతనమైన వ్యక్తిని దృగ్గోచరము జేయించు మహిమ ఇతనికావ్యకళయందుఁ గాన వచ్చెడిని. దీనికిఁ దార్కాణ యయుత నియుత చరిత్రయందలి చానున్న ముసలియావు వర్ణన యొకటిచాలును:

సీ. "ఉద్యదుత్థాన సముద్యోగమాత్రావ
శిష్టచేతస్సార దష్టదర్భ
క్షితికృదుగ్రధ్వాంక్ష తతినివారణవిధా
త్వరమాణవాలాగ్రదంశపిహిత

నాదృతాధశ్శయ నారంభ విస్రంభ
గళకంబళాభోగ కాతరాక్షి
నేకపార్శ్వస్థితి స్వీకారనిర్భగ్న
చర మోరుకరశల్య సాంద్రబాష్ప

తే. దుగ్ధసేవా సమయబోధ ముగ్ధవత్స
పీడితాపీన పర్యంతపృథులదామ
వేష్టితగ్రీవ నట చూచె విప్రుఁడొక్క-
యర్జుని నిజోటజప్రఘూణాంతరమున" —పాండు 5 : 232.

రూపము నొందిన యిట్టిమాటల చిత్తరువు వాఙ్మయమునఁ దఱుచుగఁ గానరాదు. పాండురంగకృతిని పఠించినవా రీయాపు నెన్నటికిని మరువఁజాలరు. ఆ హృదయమును నీరుసేయు ధేను వంతశ్చఱువున కెల్లపుడును బొడకట్టుచునే యుండును.

ఇతని వర్ణనలు విలక్షణములన్నారు వీరేశలింగం పంతులుగారు. స్వభావ సిద్ధములును, ననుభవైకవేద్యము లనుట యొప్పారును. తృతీయాశ్వా సమున జాతరకు బామరకాంతలుకై సేయుఁదెఱఁగు నెట్లు వర్ణించెనో చూడుఁడు.

సీ. "గోర్వెచ్చచము రంటుకొనిరి మస్తకముల
జలకమాడిరి నిశామిళితవారి
కట్టిరి చిరుతచౌకములక్రొంబుట్టముల్
కాటుకఁ దీర్చిరి కన్నుఁగవల
దిద్దిరి సిందూర తిలకంబు బటువుగా
నిక్కుగొప్పుల విరుల్ గ్రుక్కఁ రర్థి
నింబప్రవాళమాల్యంబులు వైచిరి
చిట్టిపొట్టి ధరించి రిట్టునట్టు

తే. తరుణ ధావనధగధగద్దశనమణుల
హత్తుకొలిపిరి లేత వీడ్యములడాలు
పర్వదినములఁ బామర ప్రమద లుదిత
నియమసంభావనారంభనిభృతబుద్ధి." —పాండు. 3:74

పంచమాశ్వాసములోని వేటకాని బారిఁదలఁగి పాఱు,

"మెడ మలఁగింపలేక తన
మేపొడ లొండును రెండు నేకమై
పొడమఁగ బీదకన్ను వడి
బూడిదపండును బోలె బూఁదుపా
రెడునొకదుప్పి..."ని గనుఁడు.

తే. "ఆచమూరువు యూథంబుఁ ద్రోచిబఱచె
వింటనమ్మోర్చి బోయ వెన్వెంటఁ దఱుమ
లోలజిహ్వాకరాళవిశాలముఖ త
మో విభీతేందు మృగశాబమోయనంగ."[5]

రామకృష్ణునియొక్క వర్ణనాస్వభావమును చతుర్థాశ్వాసములోని ఋతు వర్ణన చక్కఁగ వెల్లడిసేయుచున్నది. ఇందు ముఖ్యముగ 'ధఱధఱకుక్కన', 'పెరిగిసూచీముఖాభేద్యంబు', 'ఇంద్రచాపంబుగాదిది', 'కలకనీరెంతయు', 'కలుగకుండిననేమి', 'రక్షగట్టిరి' అను పద్యములు పాఠకుల హృదయములను చూఱగొనకమానవు. ఆ ముకమాల్యద నారసింహపురాణములవంటి యొండు రెండుగ్రంథములయందుఁ దక్కినట్టి సహజవర్ణన లెందును గానరావు. కాని యాముక్తకవికిఁ బ్రకృతినిరీక్షణయును, వస్తుస్వరూపానుకరణమును కరము ప్రియములు. నారసింహపురాణకర్తయం దివి యంతగఁ గన్పించవు. పాండు రంగకవి ప్రకృతినిరీక్షణోపలబ్ధాంశములను కవితారసముతో సమ్మేళనము గావించి స్వశిల్పాతిశయమును వెల్లడిజేసినాఁడు.

పాండురంగమాహాత్మ్యమున సహజసౌందర్యవిభ్రాజితములగు వర్ణన లెన్నియేనియుఁ గలవు. వాని నెన్నుట కిది యవసరముకాదు.

పాండురంగమాహాత్మ్యము పరమభాగవతచరిత్ర మని కవియే చెప్పి యున్నాఁడు. ఇందు హరవిలాస, శివలీలావిలాసాదులఁబోలి పెక్కుకథలుకలవు.

---

5. పాండు. 5:14–15 'తనూవిభీతేందు' అని యచ్చుపడితి. 'తనూవి భీత'కు అర్థము కుదురదు. కీ. శే. కళాప్రపూర్ణ వేదము వెంకటరాయశాస్త్రుల వారు పరిసంగవశమున నొకానొకప్పుడు పైరీతి సవరించి యందలి స్వారస్యమును వెల్లడించిరి.

ఈ కథలమూలమున జనుల హృదయమున భక్తిబీజమును బాదుకొల్పుటయే కవియొక్క ప్రధానోద్దేశము. కాలానుగుణముగ నితఁడు మిశ్రకావ్యపక్కి నవలంబించినను చింతితార్థమును మఱువలేదు. స్వయము కథకుఁడ ననియుఁ, గథను హృదయంగమముగ నడపుట స్వశిల్పధర్మమనియు నాతఁ డెఱిఁగి కథాకలాపము నీడేర్చెను. ఇతని కథానిర్మాణ కౌశలము నిగమశర్మోపాఖ్యాన ముచే సువ్యక్తమగుచున్నది.

యక్షగానము - తంజావూరు

1

యక్షగానము కడు ప్రాచీనమైన దృశ్యప్రబంధ విశేషము. ఇది దక్షిణదేశమున నుత్పత్తియై పెంపొందినది. తమిళాంధ్ర కర్ణాటక భాషల కిది సామాన్యమైనది. దీనిని దెనుగున వీథి భాగవతమనియు భాగవతమనియు జెప్పుదురు. భాగవతులను పేరు యక్షగాన ప్రదర్శకులకు రూఢియైనది. అనాదినుండియు నాంధ్రదేశమున యక్షగానము ప్రబలుచువచ్చినను దాని యుత్పత్త్యభ్యుదయములను గాని లక్షణములనుగాని వివరించు ప్రాచీనగ్రంథము లెవ్వియు లేవు. ఇది కేవల పామర జన వినోదార్థవిరచితమని యెంచి మన పూర్వికులు దాని నాదరింపకపోయిరి; అప్పకవి యొకడు దప్ప తక్కిన లక్షణ గ్రంథకర్త లెవ్వరును స్మరింపకపోయిరి. ఇటీవల యక్షగాన మంత రించుచుండునపుడు దానియందు మన వారి కభిరుచికలిగి దాని పూర్వచరిత్రను విచారింప నారంభించిరి. దాని యుత్పత్త్యభ్యుదయములనుగూర్చిన పరిశోధ నలు సాగుచున్నవి. యక్షగానచరిత్రను పరిశీలించిన పరిశోధకులలో కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రులవా రగ్రగణ్యులు. సుగ్రీవ విజయ పీఠికయందు యక్షగానోత్పత్తిక్రమమును వీరు ఇట్లు వివరించియున్నారు.

"తొలుత ద్రావిడ భాషలలో వెలసిన దృశ్యరచనములు కురవంజి లనబడునవి. ఆంధ్రకర్ణాట ద్రవిడదేశముల యరణ్యములలో నివసించు నాటవికులు, చెంచులు, కుఱవలు, (కోవ, కోయ) అనువారు. అందు కుఱవజాతివారి యంజె = అడుగు (నృత్య విశేషము) కురవంజె యనబడెను. చిందు, గంతు, గొండ్లి, అంజె, అంగ-ఇత్యాదులు నృత్యవిశేషములు. ఆంధ్రదేశమున బహుకాలముననుండి శివక్షేత్రములగు శ్రీశైలము, ఇంద్ర క్రీలనగము (బెజవాడ కొండ) మొదలగు పర్వతములమీదను, నృసింహ

క్షేత్రములగు వేదాద్రులు (పెక్కులున్నవి.....) మొదలగు పర్వతముల మీదను వర్షోత్సవములు (యాత్రలు, జాత్రలు, జాతరలు) జరుగునప్పు డక్కడికి నాగరక ప్రజలు చేరుచుండువారు. వారి వినోదమునకై యక్కడి యాటవికులు, రాత్రులందు నృత్యవిశేషములను నెఱపి ధనార్జనము చేయు చుండువారు. అక్కడక్కడి కొరవ జాతులవారు చేయు నృత్యములు కొరవంజు లనబడెను. కొరవంజె యనుపేరు తొలుత వారి నృత్యమునకును, పిదప నృత్యవిశిష్టమైన వారి చిన్న చిన్న గేయరచనలకును, నాపై కురప జాతివారికిని, గూడ బేరైనది. కురవజాతివారు తొలుత చేయు నృత్య విశేషము కాలక్రమమున నాయా పర్వతప్రదేశముల స్థలమాహాత్మ్య కథల తోను, శివ విష్ణు లీలా కథలతోను మిళితములై గేయ విశిష్టనాట్యరూపముల బడసెను...ఇట్లు వెలసిన యా గేయరచనములు తొలుత నత్యల్పముగా గేయభాగములును విశేషము నృత్యముగలవై యుండెను.....ఎంతో కాల మిట్లు కొండపట్టులందు సాగుచు బెంపొందిన గేయ నృత్య సందర్భములు నగరములకు గూడ క్రమముగా వ్యాపించినవి. చెంచులు కురవలు...ఆటవిక వస్తువులను నగరములకు గొనివచ్చి అమ్ముచు నప్పుడప్పుడు తమ గేయ నృత్యవిశేషములను నగరములందును, పల్లెలందును ప్రయోగించుటచే నవి నాగరిక దేశములందును వ్యాపించెను.

"ఇట్లు నగరములందు నభిరుచిగొల్పిన యా గేయ విశిష్ట నృత్య దృశ్యములు జక్కులవారు (యక్షులు, కళావంతులు) తర్వాత నగరములందును ప్రయోగింపజొచ్చిరి. వీరి ప్రయోగములందు దృశ్యమయిన నృత్యాభినయముతో పాటుగా నధికముగా గేయ వచనరూపమైన శ్రవ్యరచనముగూడ జేరెను... రాజసభలలో దేవోత్సవములలో. ఊరిజాత్రలలో, యక్షగంధర్వాది వేషముల ధరించి వేశ్యలు ప్రదర్శించునవి గావునను, నృత్యధర్మములకంటె గేయధర్మము లధికముగా గలవి గావునను నవి యక్షగానము లనబడెను." 1

ఇట్లు ప్రభాకర శాస్త్రులవారు యక్షగానోత్పత్తి విషయమై యలతి పునాదులపై తమ ప్రతిభాచాతుర్యమువలన నొక మహా సౌధమును నిర్మించి నారు; కాని కట్టడముయొక్క భారమును తాళగల శక్తి వానికి లేదు. ప్రభాకర

---

1. సుగ్రీవ విజయ, పీఠిక. పుటలు 5-7.

శాస్త్రులవారి వాదమునకు 'కురవంజె' మూలబంధము వంటిది; కాని యది చక్కగా పాదుకొనియుండలేదు. వాస్తవముగ శబ్ద స్వరూపము 'కురవంజి' కాని 'కురవంజె' కాదు—ఇది అరవమాట—'కురవంజి' యనగా కురవ జాతికిజెందిన స్త్రీ యని యర్థము. పదునేడవ శతాబ్దమునకు ముందు ఇది యాంధ్రభాషయం దుండె ననుట కాధారము లేదు. దీనికి సరియైన తెనుగు మాట ఎఱుకతె. ద్రావిడదేశమునుండి బయలువెడలిన యాంధ్రవాజ్మయ మూలమున నిది మనభాషలోనికి ప్రవేశించినది. తమవాదమున కొక పాదును గల్పించి, దానిని స్థిరముగ నెలకొల్పుటకొఱకు ప్రభాకర శాస్త్రులవారు 'అంజి' ని 'అంజె' గా మార్చినారు. ఈ మార్పు అంగీకరింపదగినది కాదు. కురవంజినుండి యక్షగాన ముత్పత్తియైనదని తలచుట కర్వాచీన యక్షగాన ములయందు ఎఱుకతెలకు గొంత ప్రాధాన్యము గల్గుటయు దన్మూలమున కుర వంజి లేక యెఱుకల కురవంజియను నొక తరగతి యక్షగానములు వివరింప బడుటయు ముఖ్యకారణములు. తంజావూరు యక్షగానకర్తలు హాస్యముకొరకు నీ కురవంజులను మొట్టమొదట దమ నాటకముల ప్రవేశపెట్టిరి. ఇది ప్రేక్ష కులకు మిక్కిలియు వినోదకరమగుటవలన తరువాత యక్షగాన రచయిత లందరును వారి మార్గము ననుసరించిరి. కేవలము కురవంజుల రచనకు నిదియే కారణము. ఆంధ్రవాజ్మయసూచికయందు ఆంధ్ర సాహిత్యపరిష త్పుస్తక భాండాగారపట్టికలో యక్షగానములను వివరించుచోట కొరవంజిని గూర్చి యిట్లు చెప్పియున్నది:— 'కొరవంజి అను పాత్ర ప్రవేశముగల యక్షగాన రచనకు కొరవంజి అనిపేరు.' [1] ఇదియే వాస్తవముగ కురవంజి రీతియని తోచుచున్నది. ఏలనగా, గిరిరాజకృతమైన రాజమోహన కొరవంజి యొక్క ఇతివృత్తము ఇట్లు వివరింపబడియున్నది.

"శ్రీ సుతతుల్యు డై చెలువొందునట్టి
భోసలకుల శాహభూపాలు మీద
చెన్నుగా మోహిత చిత్తయై రాజ
కన్నె కామణి సరికాంతలు గొలువ
గరిమతోడుత మును గదలివచ్చుటయు

---

1 ఆం. వాం. సూ. అముద్రిత గ్రంథముల పట్టిక. పుట 8.

విరహభరంబుచే వెతలుజెందుటయు
ఎఱుకతె వచ్చి తా నెఱుకజెప్పుటయు
గుఱుతుగా తా హేంద్రు గూడియుండుటయు
నవియెడి రాజమోహన కొరవంజి
పనివడి తాహేంద్రుపై నంకితముగ
ఘనతతో గిరిరాజకవి రచియించె
జనులెల్ల మేలని సంతసిల్లగను."3

ఇందువలన ఎఱుకతె పాత్రప్రవేశముగల యక్షగానములనే కురవంజి లని పేర్కొనుచుండిరని తెల్లమగుచున్నది. కావున కొరవంజినుండీ యక్ష గాన ముత్పత్తియాయెనని చెప్పుట సరికాదు.

మఱి యక్షగాన మెట్లుత్పత్తియై యుండునో విచారింతము. ఇది కేవలము ప్రజలను వినోదపెట్టుట కేర్పడినది కాదు. మత ప్రచారముకొఱకు మన పూర్వికు లవలంబించిన మార్గములలో మన పురాణేతిహాసాదులలోని గాథలను జనసామాన్యమునకు గన్నుల గట్టునట్లు ప్రత్యక్షముగ ప్రదర్శించి చూపువారు. బౌద్ధమత ప్రచారమునకు అశోకచక్రవర్తి యీ మార్గము ననుసరించినట్లు--

'కాని యిప్పుడు దేవానాం ప్రియ ప్రియదర్శి ధర్మాచరణమువల్ల, విమానములను చూపించుట, ఏనుగులు, అగ్నిస్కంధములు, ఇతర దివ్య విగ్రహములు, వీనిని ప్రదర్శించుట (ఆ సమయములందు) ధర్మఘోషము భేరీఘోషముమూలమున జేయబడుచున్నది.

అను నాతని నాగిర్నారువ శిలాశాసనములోని వాక్యములవలన విదిత మగుచున్నది4. మతప్రచారమునకు మిక్కిలియు ననుకూలమైన సమయములు యాత్రలు. యాత్ర లనగా దేవతాయతనములందు జరచెడి వర్షోత్సవాదులు. వీనిని జాత్రలనియు దిరునాళ్లనియు గూడ చెప్పుదురు. ఆ సమయమందటి

---

3 A Descriptive Catalogue of Telugu Manuscripts in T.M.S.S.M. Library. P. 205.

4. డా. చిలకూరి నారాయణరావుగారి యనువాదము చూ అశోకుని ధర్మశాసనములు. పుట 7.

గూడిన జనులను వినోదపెటుచు దన్మూలమున ధర్మబోధన జేయుటకై పై బెరొక్కన్న ప్రదర్శనము లేర్పడినవి. ఇవి యాద్యమున కొయ్యబొమ్మలమూల మునను దోలుబొమ్మల మూలమునను సాగెడివి. మన కొయ్యబొమ్మ లాటకును దోలుబొమ్మ లాటకును జన్మస్థాన మిదియె. శ్రీశైలమున శివరాత్రి మహోత్సవ సందర్భమున నిట్టి బొమ్మలాట లాడెడువారని పాల్కురికి సోమనాథుడు వచించి యున్నాడు.

"భారతాది కథలు చీర మఱుగుల
నారంగ బొమ్మల నాడించువారు
కడు నద్భుతంబుగ గంభ సూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు."[5]

ఇందు మొదటిది తోలుబొమ్మలాట; రెండవది కొయ్యబొమ్మలాట. వీని నుండియే మన యక్షగానము పరిణామ మందినది. ఆరంభదశయం దది కేవల మూక నాట్యముగ ప్రవృత్తినందినది. గేయరూపమైన గాథను గాయకులు పాడు చుండ తదనుగుణముగ నర్తకులు అభినయము సేయుచు నర్తించువారు. కేరళ దేశమున నేటికిని ప్రచారమందున్న కథకళి దీనికి తార్కాణ. కథకళి తమ సంస్కృతి విశిష్టతను సూచించు చిహ్నమని మలయాళ జనులు మురియు దురు. కావచ్చును; కాని యది పెక్కు నాగరకసంఘములందు నేటికిని ప్రబలి యుండు కొన్ని ప్రాచీన సాంఘిక మర్యాదలవలె పురోవృద్ధినందక ప్రథమ దశయందె యట్టె నిలిచిపోయిన పూర్వయుగ కళావశిష్ట మనుటకు సందియము లేదు. దక్షిణాపథమం దన్యప్రదేశములందు దేశీయసంస్కృతితోపా టదియు నభివృద్ధి నందినను, మలయాళదేశమందు మాత్రము చారిత్రకాది కారణముల వలన పిండెయై యుండగనె ముదురు పాటినది. అంతియె.

మూకనాట్యముతో నర్తకులు చిరకాలము తృప్తినందియుండలేదు. సూత్ర ధారుల యిచ్చచొప్పున నాడు దారు చర్మకృత ప్రతిమలవలె గాయకుల పాట ననుసరించి యభినయము సల్పుచు నటించుట వారికి నచ్చలేదు. పాటను తామే పాడుచు దానికి సరిగనాడుట మేలని వారికి దోచినది. కావున రెండు కార్య

---

5. పండితారాధ్యచరిత్రము. పర్వత ప్రకరణము.

ములను వారే నిర్వహింప గడఁగిరి. మూకనాట్య మంతట యక్షగానముగ మారినది.

యక్షగాన మన నేమి?

ఈ మాట శబ్దరత్నాకరమందు లేదు; కిట్టెలు దన కన్న డాంగ్లి నిఘంటువునందు 'యక్షగాన'అను మాటకు 'A kind of popular dramatic composition' అని యర్థము వ్రాసియున్నాడు.

ఆంధ్రదేశమున నేటికిని గానవచ్చు జక్కులు (యక్షులు) అను జాతివారీ తరగతి నాటకములను ప్రదర్శించి ప్రఖ్యాతికి దెచ్చుటవలన వీని కాపేరు వచ్చినదని కొందఱు చెప్పుదురు; కాని కీ. శే. వేటూరు ప్రభాకరశాస్త్రిలవారు చెప్పినట్లు యక్షగాన ప్రదర్శనమే జీవనోపాయముగ జేసికొని తన్మూలమున జీవయాత్ర గడపుటవలన కళావంతులలో నొక తెగవారికి జక్కులవారను నామము వచ్చినది. 6 అంతియ. యక్షగాన మన యక్షులు చేయుగాన మని యర్థము. యక్షు లెవ్వరు? యక్షులు దేవయోనులలో నొక రని నామలింగాను శాసనము దెలుపుచున్నది. వీరి రాజు కుబేరుడు; ఇతనికి వైశ్రవణు డనియు బేరు. అష్టదిక్పాలకులలో నితడొక్కడు. ఉత్తర దిక్కున కధిపతి. యక్షుల వృత్తాంతము మన పురాణేతిహాసములందును బౌద్ధమత గ్రంథములందును విస్తారముగ వర్ణింపబడియున్నది. ఆటపాటలయందు వారి కత్యంత ప్రీతి. కావున యక్షులకు యక్షగానముతో నెద్దియో సంబంధ ముండియుండవలయును. దేవయోనులలో బరిగణింపబడినను వారు కేవలము మిథ్యాప్రపంచమునకు జెందినవారు కారు. నాగరాక్షస పిశాచాదులవలె వారును మనుష్యజాతికి జెందిన వారై యుందురు. బౌద్ధయుగమున యక్షులు వ్యాప్తినందిరి. బుద్ధుని శిష్యకోటిలో యక్షులు గొంద రున్నట్లు బౌద్ధగ్రంథములందు కలదు. వారి గానమే మన యక్షగానమునకు బీజప్రాయమై యుండిన నుండవచ్చును. యక్షగానములు దేశినాటకము లని వాఙ్మయవిమర్శకులు చెప్పుదురు. దేశి యనగా దేశమునకు సంబంధించిన దని యర్థము. భాషకావచ్చును, కవిత్వము గావచ్చును. సంగీత నాట్యాదులం దెద్దియైనను గావచ్చును. యక్షగానము దేశినాటక మనగా నది సంస్కృత ప్రాకృతములకంటె భిన్నమైనదనియు దేశమున గ్రొత్తగ బ్రభ

6. చూ. సు. వి. పీఠిక. పుటలు 7–8.

వించిన రచనావిశేషమనియు నభిప్రాయము. కాని యక్షగాన మిట్టి కేవల దేశి రచన కాదని యనుకొనుటకు గొంత యవకాశము గలదు. ప్రాచీన యక్ష గానము లందు ప్రథానముగ గానవచ్చు ఛందస్సుద్విపద. ప్రారంభదశయం దిది సంపూర్ణముగ ద్విపదరచనయై యుండిన నుండవచ్చును. మనవారనుకొనునట్లు ద్విపద దేశి ఛందస్సుకాదు. అది ప్రాకృతమునుండి యెరవు తెచ్చుకొన్నది. ద్విపదయన రెండు పాదముల ఱుక్కనియు. ప్రాకృత పద్యభేదమనియు సంస్కృత నిఘంటువులలో గలదు మఱియు మహాకవి కాళిదాసుడు విక్ర మోర్వశి యందు చతుర్థాఙ్క ప్రారంభమున,

['తతః ప్రవిశతి సహజన్యా చిత్రలేఖా చ']
'చిత్రలేఖా:--(ప్రవేశానన్తరం ద్విపదికయా దిశో వ లోక్య)'

దీనిగూర్చి వ్యాఖ్యాత ఇట్లు వివరణము వ్రాయుచున్నాడు.

ద్విపకయా దిశోవలోక్యేతి । ద్విపదికాఖ్యగీతి విశేషేణ దిగవలోకనం విధా యాగ్రిమాం గాథాం పఠతీత్యర్థః । దిశోవలోక్య ద్విపదికాఖ్యగీత్యా వద తీత్యర్థేవా । ఇందువలన కాళిదాసుడు 'ద్విపదిక' యను గీతము నీ సందర్భ మున బేరొక్కనె ననుట తెల్లము. ఈ ద్విపదిక లక్షణమును వ్యాఖ్యాత ఇట్లు వివరించియున్నాడు.

తల్లక్షణం చాహ భగవాన్ భరతమునిః—
"ఋద్ధా ఖణ్డా చ మాత్రాచ సంపూర్ణేతి చతుర్విధా
ద్విపదీకరణాఖ్యేన తాలేన పరిగీయతే."
పాదే ఛః పఞ్చభాగోన్తే (?) న జౌషష్ఠ ద్వితీయకౌ
చతుర్భిరీదృశైః పాదైః ఋద్ధాద్విపదికోచ్యతే.
అర్ధాన్తే న్యేస్వరానాహుః ఖణ్డాస్యాచ్ఛుద్ధయార్యయా
షష్ఠేనైకేన గురుణా మాత్రాద్విపదికా మతా.
జ్ఞేయాఋద్ధైవ సంపూర్ణా గురుణాన్తే ధికేనతు.7

7విక్రమోర్వశి (బొంబాయి తుకారాం జీవాజీ ముద్రణ. 1836 శక వర్షం) పుటలు 85_86.

పై జెప్పిన ద్విపదికయే మన ద్విపదయైనది. మఱియు యక్షగాన మందలి నృత్యగీతములు భరతుని నాట్య శాస్త్రము ననుసరించు నవియకాని భిన్నములుగావు. సంస్కృత నాటకములను గూడ నాటపాటలతోడను, నభినయముతోడను ప్రదర్శించువారని భరతుని నాట్యశాస్త్రమువలన దెలియవచ్చుచున్నదనియు, నట్టి నాటకములకు కాళిదాసుని విక్రమోర్వశిలో చతుర్థాంకము శిలముగాక మనయదృష్టవశమున నిలచియుండు ఉదాహరణమనియు డాక్టరు. వి. రాఘవన్‌గారు తమ 'యక్షగానము' అను త్రివేణి త్రైమాసికలోని వ్యాసమందు వక్కాణించియున్నారు. ఈ విషయములన్నిటిని సమకూర్చి చూడగా యక్షగానము కేవలము దేశరచనకాదనియు నది సంస్కృత ప్రాకృతముల నుండి మనవారు గ్రహించి పెంపొందించిన దృశ్యప్రబంధ విశేషమనియు దోచుచున్నది.

2

యక్షగాన వాఙ్మయము

యక్షగాన వాఙ్మయము నాటకము రూపందుటకు పూర్వమే ప్రభవించి యుండవలయును. అశోకుని శాసనములందు వర్ణింపబడిన 'విమానదర్శనాచ హస్తిదసనాచ ఆగిఖంధానిచ ఆఞాని చదివ్యాని రూపాను'ల ప్రదర్శనములకు ఇతి వృత్తమావశ్యకత లేకపోయిన పోవచ్చును. ఇచటగూడా, ఇంచుకయైన గథాంశములేక పైప్రదర్శనముల తెఱగు ప్రేక్షకులకు బోధయగుట దుష్కరము. ఇది మాయాదేవిగర్భమును ప్రవేశించిన బుద్ధుని హస్తిస్వరూపము; ఇవి బాల బుద్ధుని దర్శింప నరుదెంచిన దేవతల విమానములు; ఇవి ఫలాని ఫలాని దేవతల ప్రతి బింబములు ఇత్యాది. కథా సంవిధానములేక బొమ్మల నాడించుట సుకరముగాదు; అట్టియాటలు సాధ్యమైనను చూపరులకు దుర్గ్రాహ్యములగుటచే నిరర్థకములగును. కేవల ప్రజల వినోదముకొఱకే కాక తన్మూలమున ధర్మోపదేశము సేయుటకొఱ కవి యేర్పడిన వగుటచేత నవి యట్టి కార్యమున కనుకూలములైన సుప్రసిద్ధగాథలపై నాధారపడి యుండెనని యెంచుట సరి; కావున ప్రదర్శకుల కాద్యమునుండియు గవుల తోడు గావలసివచ్చెను; కవుల యూగమనముతో ప్రారంభమైనది యక్షగాన వాఙ్మయము.

దక్షిణ భారతమున గడు ప్రాచీనకాలమునుండి యక్షగానము వర్ధిలుచు వచ్చినది. క్రీ. శ. 8వ శతాబ్దమందో ఇంచుక తరువాతనో విరచితమైన 'సిలప్పదికార'మను తమిళ కావ్యమున నాటక నాటక ప్రదర్శనముల ప్రస్తావన కలదు. యక్షగానములను బోలి నృత్తగీత ప్రధానములైన యాటలని ప్రాచీన వ్యాఖ్యాతలయభిప్రాయము. ద్రావిడవాఙ్మయములలో నెల్ల తమిళము ప్రాచీనతమమైనను అప్పటి నాటకములయం దొక్కటియైన మిగులక నష్టమై పోవుటవింత. ఆంధ్రదేశమున యక్షగానము గాకతీయ యుగమునందె జనాదరణకు పాత్రమాయెను. శ్రీశైలమందు శివరాత్రిమహోత్సవ సందర్భమున యక్షగాన ప్రదర్శనములు దేవోత్సవాదులలో సామాన్యముగ జరుగుచుండెడి వని పాల్కురికి సోమనాధుని పండితారాధ్యచరిత్రవలన దెలియవచ్చు చున్నది.

"ప్రమథపురాతన పటుచరిత్రముల
గ్రమమంద బహు నాటకము లాడువారు

x x x x

విధమున బచ్చన్న వేషము ల్దాల్చి
అధికోత్సవము దులకాడు నట్లాడు
శిరమున నురమున జెవులగంఠమున
గరమున గూకట గాళ్ళ జెల్వార
గవదండలును గనుగవ గరణికలు
సవరంబులును గలశంబు దండలును
భసితంపు బూతపై బరగు బచ్చెనలు
నసలారు చిరుగజ్జియలు నందియలును
సరిరత్న పంక్తుల జల పోసనములు
గరమొప్ప తొంగళ్ళు గల చల్లడములు
బొల్చుదంతావళుల్ పుష్పమాలికలు
దాల్చి యత్యద్భు తోత్సవలీల దనర
జనులు హర్షింప నాస్థానముల్ సొచ్చి
యనుకూల వివిధ వాద్యసమేళనమున

నార్భటంబిచ్చి యొయ్యన జవనికల
గర్భంబు వెడలి యక్కజము వట్టిల్ల
నాడకముందఱ నభినయంబొలయ
జూడకముందఱ జోద్యంబుదనర
నిక్కుచు ద్రిభంగి నిలచుచునట్ల
చొక్కుచు సభచూచి యొక్కింత నగుచు."8

ఈ ద్విపదలు నాటకములను బేర్కొనుటయేకాక వేషధారణకు వలసిన పరికరములను, జవనికను నాటక ప్రదర్శనము నీక్షింప సమకూడిన ప్రేక్షకుల సభను వర్ణింపుచున్నవి. మఱియు నప్పుడు మతసంబంధమైన నాటకములనేకాక సుప్రసిద్ధ మనుష్యుల చరిత్రలనుగూడ నాటకములుగ ప్రదర్శించి చూపువారు. కాకతీయ ప్రతాపరుద్ర మహారాజుయొక్క ఉంపుడుగత్తెకు మాచల్దేవికీ గౌరవము గలిగెనని వినుకొండవల్లభరాయకృత క్రీడాభిరామమున జెప్పియున్నది.

"లెస్సగాక కీరాట! యీలేమచరిత
మాడుదురు నాటకంబుగ నవనిలోన."9

వల్లభరాయడు క్రీ. శ. 1378-1404 మధ్య విజయనగర సామ్రాజ్యమును పాలించిన ఇమ్మడి హరిహరరాయలకు సమకాలికుడు. అతడు రావిపాటి త్రిపురాంతకుడు రచించిన ప్రేమాభిరామమును గ్రీడాభిరామమను పేర దెనుగు చేసెను. కావున నతడు జెప్పిన మాచల్దేవీనాటక ప్రదర్శనము ప్రతాపరుద్రుని కాలమున జరిగెననుట నిశ్చయము.

క్రీ. శ. 14వ శతాబ్దము తుదను 15వ శతాబ్ది పూర్వార్ధమునను వర్ధిల్లిన శ్రీనాథకవి యక్షగాన నాటకములను గొనియాడియున్నాడు. భీమేశ్వరపురాణము నందు వేశ్యయొక్కతె ఈతని వేషము ధరించి ద్రాక్షారామవీథులందు భిక్షాటన నాటక మాడినట్లు చెప్పియున్నాడు.

8పండి. పర్వ (ఆం. గ్రం. మా. 30) పుటలు 436-7
9క్రీ. రా (గ్రంటివారి ముద్రణ) పుట 56.

'సాని యాశానియై మహోత్సవమునందు
గేల నవ చంద్రకాంతంపు గిన్నెపూని
వీథి భిక్షాటన మొనర్చువేళ జేయు
మరులు నృత్యంబు జగముల మరులు గొలుపు'10

ఇచట వర్ణింపబడిన భిక్షాటననాటకము మూకనాటక మేమోయను సంది యము గలుగుచున్నది. ఇది మూకనాటకమైనను గాకపోయినను శ్రీనాథుని కాలమున దేశమునందు ప్రజల కెల్లయెడలను యక్షగానముపై నభిమానము హెచ్చెనయి. యక్షగాన ప్రదర్శకులు మేళముగగూడి దేశాటనము జేయుచు నాటకము లాడువా రనియు బురుషులు స్త్రీ వేషములను ధరించి నటించువార నియు నతడు భాగోతుల బుచ్చిగాని కొసగిన యోగ్యతాపత్రమువలన దెల్లమగు చున్నది. ఇంతవఱకు యక్షగాన ప్రదర్శనములను గూర్చియు బ్రదర్శకుల గూర్చిన ప్రస్తావనయేగాని యక్షగాన గ్రంథములమాట మన వాఙ్మయమునం దెచ్చటను గావరాదు. ఇట్లవి స్మరింపబడకపోవుటకు గారణము వాని యప్రా వము గాదు. విద్వాంసులకును గవులకును వానియెడ గలిగిన యౌదాసీన్య ముచే నవి రూపుమాసిపోయినవి. క్రీ. శ. 16వ శతాబ్దారంభంతో మన యక్షగాన చరిత్రయం దొక నూతనదశ యుపక్రమించినది. సుప్రసిద్ధులైన కవులు యక్ష గానముల రచనకు బూనికొనిరి; రాజులు వారల సత్కరించి ప్రోత్సహింప దొడగిరి. క్రీ. శ. 1506 మొదలు 1509 వఱకును విజయనగర సామ్రాజ్య మును బాలించిన వీరనరసింహరాయలు యక్షగాన రచయితలను బ్రదర్శకులను జాల గౌరవించువాడు. అష్టభాషా కవివర్యుడై పొగడ్తనొంది ద్విపద నార సింహ పురాణమును వచన భారతాది గ్రంథములను రచించిన ప్రోలుగంటి చెన్నకవి సౌభరిచరితను జక్కుల కథగ వ్రాసెను. జక్కులకథ యన యక్ష గానమే. వీరనరసింగరాయ లతని కొక యగ్రహార మొసగి సత్కరించెను.11 ఇందువలన వీరనరసింగరాయన కాలమునకె జక్కులవారు యక్షగాన ప్రదర్శ నములవలన బ్రఖ్యాతి గడించిరని తెల్లమగుచున్నది. యక్షగాన ప్రదర్శనముల మూలమున కీర్తిగడించినవా రొక జక్కులవారు మాత్రముగాదు. కూచిపూడి

10భీమే. ఆ 1: 105.

11నార. పురా. 1: 33.

బ్రాహ్మణులును భాగవతమేళమును తయారుచేసి వర్షవర్షమును రాయరాజ్యమున సంచరించుచు గ్రామములందును పట్టణములందును నాటకముల నాడువారు. వీరినిగూర్చిన యైతిహ్యమొకటి స్థానిక చరిత్రలందు నిక్షిప్తమై యున్నది.

"ఆలాగంటి దినములలో వినుకొండ బెల్లంకొండతటున కూంచిపూండి అనే గ్రామంనుంచి బ్రాహ్మణులు భాగవతుల వేషధారులు కీరన నిమిత్తమైన యూస్థళమునకు వచ్చివుండి సంబెటగురవరాజుయొక్క దారుణప్రభుత్వం చూచి యిక్కడనుంచి లేచిపోయి విద్యానగరమునకు పోయి అక్కడ వీరనర సింహరాయలు రాజ్యపాలనం చేస్తువుండగా భాగవతులు దర్శనంఅయి కేళిక అడుగగా శలవు యిచ్చినారు. కూచిపూడి మేళం వాండ్లు బహు విద్యావంతులని ప్రసిద్ధిగా వినుకడి వున్నందున రాయలవారు స్త్రీలు సహా చూడవలెనని నగర్లవద్ద దివాణములో కీర్తనకు శలవు ఇచ్చినారు. అక్కడ కీర్తన వినికిచేపేటప్పుడు సంబెట గురవరాజు వేషంవేసుకొని వొకడు, యిద్దరు బంట్రౌతులవేషం వేసుకొని, వొకడు స్త్రీవేషం వేసుకొని, సంబెట గురవరాజువలె ఆ వేషగాడు కూర్చుండి, రాయల సమక్షమందు ఆ స్త్రీయొక్క స్తనాలకు చిరుతలు పట్టించి సొమ్మ తహశ్శీలుచేసినట్లు వినికిచేపినారు.

'అప్పుడు రాయలవారు చూచి 'అదియేమ'ని అడుగగా ముఖస్తులైనవారు భాగవతులముఖతా ఆ వర్తమానమును తెలిసి 'శిద్ధవటంశీమలో సంబెట గురవ రాజు అనే ఆయన ప్రజలవద్దనుంచి ద్రవ్యాకర్షణ చేసేయెడల స్త్రీలను తీసుక పోయి యీ ప్రకారముగానే తహశ్శీలు చేస్తున్నారు; గనుగ యేలినవారికి తేట పడేటందుకై యీ ప్రకారం వేషములుకట్టి వినికిచేసినారు' అని విన్నపం శాయగా.....12"

కృష్ణరాయల కాలమునను ఇట్టి భాగవత మేళములు రాయ రాజ్యమున సంచరించుచు యక్షగానములను ప్రదర్శించుచుండినవి. కర్నూలుజిల్లా చెఱువు బెళగల్లు గ్రామమున క్రీ. శ. 1514 నాటియొక శిలాశాసనమునందు 'తాయికొండ నాటక' ప్రదర్శనమున పేరుపొందిన చేగయ్యపుత్రుడు నట్టున నాగయ్యకును 'పాత్రి'గ నటించిన పోతవరగ్రామవాస్తవ్యుడు నట్టువ తిమ్మయ్య కుమార్తెకును

12. లోక. రికా. సం 56, పుట 66 తరువాయి.

నాయూరికరణము తిరుపత్తూరు సోమరసుకుమారుడు బసవరసు కొంత భూమిని దానముజేసినట్లు చెప్పియున్నది.[13] తాయికొండయనునది కర్నూలు మండలములో నొక క్షేత్రమైయుండవలయును. అచటి దేవుని మాహాత్మ్యమును బ్రకటింపబడిన నాటకమునకు 'దాయికొండ నాటక'మని పేరు. ఈ నాటకమాడిన ప్రదర్శకులాప్రాంతములవారే; కాని వారు కూచిపూడి మేళములోజేరినవారు కారు. వారిది రాయలసీమకు జెందిన మఱియొక మేళమైయుండును.

పదునాఱవ శతాబ్దమున రాయసామ్రాజ్య ప్రజలకు నాటక ప్రదర్శనములం దభిరుచి హెచ్చెనని యప్పటి వాఙ్మయమువలన దెలియవచ్చుచున్నది. సుప్రసిద్ధులైన కవులు యక్షగానరచనకు గడగిరి. కందుకూరు రుద్రకవి సుగ్రీవ విజయమను చక్కని యక్షగాన ప్రబంధమును రచించి యాయూర నెలకొనియుండు జనార్దనదేవుని కంకిత మిచ్చెను. ఆదేవుని వసంతోత్సవ సమయమునం దా నాటకము బ్రథమమున బ్రదర్శింపబడియుండుటకు సందియములేదు. మఱియు నా శతాబ్ధోత్తరార్ధమున కర్నూలుమండలమందు వెలసిన పింగళి సూరన తన ప్రభావతీ ప్రద్యుమ్నమున గంగావతారమను నాటకము నొకదానిని బేర్కొనియున్నాడు. అది యప్పుడాప్రాంతమున వాస్తవముగ ప్రయోగమందుండిన నాటకమునకో పేరో లేక కవికల్పనయో నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. ఇది వాస్తవనాటమైనను మిథ్యయైనను దత్ప్రదర్శనమునుగూర్చి చెప్పిన యంశముల నన్నిటిని సూరన స్వానుభవమునుండి సంగ్రహించెనని తోచుచున్నది. నాటక ప్రదర్శకుల మేళమొకటి యందు పేర్కొనబడినది. అది పెక్కండ్రు మేళగాండ్ర కూటము. వారి సంఖ్య తెలియదు. వారిలో సూత్రధార విదూషక పారిపార్శ్వకులు ముఖ్యులు; వైణిక వైణవికమౌరజకమార్దంగిక తాళధార గాయకవార సీమంతినీ వ్రాతము వారికి దోడు. వీరు దేశసంచారము వెడలి గ్రామములందును పట్టణములందును విడిసి నాటకముల బ్రదర్శించువారు. యజ్ఞాది సమయములందు నాటకము లాడుటయు గలదు. మేళమునకు దల మనిసి—సూత్రధారుడు కావచ్చును—చూపరుల మున్నగువారిని పొగడి వారి నుండి వస్త్రాభరణాదులను బడయువాడు. ప్రదర్శకులు వేషమువేయునపుడు ధరించు సొమ్ములు వాలకములు. నాటకప్రదర్శన మిట్లు వర్ణింపబడినది: సూత్రధారుని ప్రవేశము. పూర్వరంగ ప్రస్తావన.

---

13. ARE, 558 of 1915.

"వ. అప్పుడు.

శా. గాంధార ప్రముఖస్వర శ్రుతికళా గంభీరవారాంగనా
గాంధర్వంబు ఘనస్వనంబు తతనిక్వాణంబు వంశాది సం
బంధిస్వాన పరంపరా మహిమయుక్త మద్దెళ్లదిందింధిమిం
ధింధోం ధిక్కిధిమిక్కి శబ్దభరముక్త దీపింప నా పూర్ణతన్.

"సరవి జంచత్పుట చాపపుటోద్ఘట్ట
షట్పితాపుత్త్రిక సంజ్ఞలమర
వెలయుచుండెడు సమవిషమతాళ
ప్రవృత్తులు నాల్గు ప్రస్తారకలనవలన
గలుగు నానాతాళములు యథోక్తస్ఫూర్తి
బరగు నేలాది ప్రబంధచయము
దత్తదర్హస్థాన దత్తపటాక్షర
బిరుదాదికాంగ విస్ఫురణ దనర
క్షితి జతుర్దశ ముద్రిక గీత భేద
ములు దురాసములంద్రు వర్తిలె నవియును
నఖిలకళలును గల రొక్కిణేయు శిక్ష
వలన దన్నాట్యకర్మప్రవర్తనమున."
"ఆ వనజాక్షనందనుడు నంతట నాంది దగంబఠించి యిం
పావహిలంబ్రరోచనయు నా ముఖముం దనరారనొప్ప బ్ర
స్తావనతో ముఖాదులగు సంధులు సాంగత బెంపుమీఱ గం
గావతరాది నాటకము లాడె న నేకము లద్భుతంబుగన్."

"ఆ నాటక ప్రయోగావసరముల
భగీరథా ద్యాకార ధారణయును
గంగాదినిమ్నగాగతియు గైలాసాది
నగ కల్పనమును నానావన ప్ర

పంచసంబును పశుపక్షి మృగాదిజం
తువిశేష రూపవృత్తులును మఱియు
నెచటి కెయ్యది యోగ్య మచట దత్తద్వస్తు
పృష్టి పన్నిదము వేసియును గృతక
మగుట నిశ్చయింపగ లేక యబ్రిపడుచు,
జూచి సామాజికులు దమ సొమ్ములెల్ల
నొసగులుగవై వ నడుపుచు నొప్పుమీఱె
రుక్మిణీ సుతుండు మాయానిరూఢి మెఱసి."

వ. ఇవ్విధంబున నాత్మీయ దివ్యమాయాప్రపంచము దంచిత నాట్యవంచి తులం గావించి నక్తంచరుల ధనసంచయంబు నూచముట్టుగా దోచుకొనుమం జూచు ఖేచరులకు వేడ్కఁబుట్టించె"14

ఈ వర్ణన 16 వ శతాబ్దమున నాటక ప్రదర్శనములందు వాడుకయుం దుండిన రంగస్థల రచనావిధానమును తదుచిత వస్తు సామగ్రియును ప్రదర్శన ప్రకారమును విదితము సేయుచున్నది. కాని సూత్రధార విదూషక పారిపార్శ్వ కాదులును పూర్వరంగ నాంది ప్రస్తావనలును సూరన వర్ణించినది సంస్కృత నాటక ప్రదర్శనముగాని యక్షగాన ప్రదర్శనముగాదని తెల్పుచున్నవి. కాని ఏలాది ప్రబంధచయమునకు సంస్కృత నాటకములందు తావులేదు; కావున నాటక ప్రదర్శనమును మఱియు నధికరముగా హృదయంగమము గావించుట కొఱకు సూత్రధారుడు యక్షగాన ప్రదర్శన పద్ధతుల గొన్నిటి నవలంబించెనని తోచుచున్నది.

క్రీ. శ. 17 వ శతాబ్దమున రాయలసామ్రాజ్యము విచ్ఛిన్నముగాజొచ్చి నది; కాని వాఙ్మయము మాత్రము దామరతంపరగ నభివృద్ధి నందినది. ఈ యభివృద్ధికి ప్రధాన కారణము సామంత విజృంభణ. రాయల యధికారము క్షీణించుకొలదియు సామంతుల యధికారము పెచ్చు పెరిగినది. పేరుగల దుర్గము లన్నియు సామంత రాజ్యములకు ప్రధానస్థలము లాయెను. సామంత విజృం

---

14. ప్రభా- ప్రద్యు. ఆ 4 : 97_102.

భణవలన రాజకీయరంగమున దేశమునకు జెప్పరాని కీడు వాటిల్లినది. ఐక్యత చెడినది; బహునాయకత్వమువలన అంతఃకలహములు చెలరేగినవి; తురకల ప్రవేశమున కవకాశము గలిగినది. కాని సారస్వతదృష్టి జూచిన నందుమూల మున జాల మేలు చేకూఁతెనని చెప్పక తప్పదు. ప్రతిసామంతుడును దానె రాయలని యెంచెను. రాయల యాస్థానమును మేలుబంతిగ గొని. సామంతు లెల్లదమ యాస్థానములదిద్ది తీర్చికొనిరి; రాయల నగరి మర్యాదలను స్వీకరించిరి; దెబ్బదిరెండు నిమోగములను గూర్చికొనిరి. కవి విద్వజ్జనపోషకులైరి. సామంతరాజు లందఱును — ముఖ్యముగ ద్రావిడదేశమును బాలించుచుండిన యాంధ్రనాయకరాజులు — రాయలను బోలి భాషాపోషణ యొనర్చుట దమ ముఖ్యకర్తవ్యమని తలచిరి. మైసూరు దొరలు కర్ణాటకులయ్యును దక్కిన రాయలసామంతులమార్గము ననుసరించి తెనుగుభాషకు బ్రాధాన్యతనిచ్చి పెంపొం దించిరి. మైసూరు చెంజీనాయకుల యాశ్రయమున వచనకావ్య మభివృద్ధి నందెను. దొడ్డదేవరాయల సేనాధిపతి కళివె వేరరాజు భారతమును. శైవభక్త చరిత్రను వచనముగ వ్రాసెను. చెంజి నాయకుల కొలువున సేనాధిపతియైన తుపాకుల కృష్ణప్పనాయని కుమారుడు అనంతభూపాలుడు పెక్కుపురాణములను వచనప్రబంధములుగ విరచించెను. మధుర ఆంధ్రనాయక రాజ్యమునకు బాలకు రాలై కళలను బెంపొందించి ధర్మమహారాజ్ఞియని కీర్తి గడించిన మంగమ్మ ఈ తుపాకులవారింటియాడబడుచే. గాంధర్వనాట్యవిద్యలయం దామెకుగల యభి మానము సారస్వతమున లేకపోవుటచే నామె కవులను గౌరవించి ప్రోత్సహింప లేదు. ఏ కారణమువలననో చినవెంగన్నయను కవికోపమున కామె గురియైనది. రెండు గ్రంథములకు నాయకురాలైనది. అందు మధుర మంగా పుంశ్చలీవిలాస మను వచనగ్రంథము ముఖ్యమైనది. చంద్రరేఖావిలాసాది బూతుకావ్యముల తరగతికి జెందినది. అది యప్పటి వ్యవహారికభాషయందు విరచింపబడెను. ఆంధ్రమునగల బూతుల వాఙ్మయములో నిది యగ్రస్థాన మలంకరింపదగిన గ్రంథము. కాని చరిత్రకారుని కిది యమూల్యమైన యుపకరణము. అప్పటి రాజకీయార్థిక సాంఘిక పరిస్థితులనుగూర్చి మఱి యెందును గానరాని విశేషము లిందుక్తమైయున్నవి. మంగమ్మ పేర చిన వెంగన్నయొక దండకమును గూడ చియించెను; యొకటి తాళపత్రప్రతి మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండా గారమునం దున్నను. చీమతల లంతటి యక్షగానములతో వ్రాయబడియుండుటచే

దాని బరిశోధించి చూచుటకు శక్యముగాక యున్నది. మంగమ్మ తరువాత మధురనాయకులు కొందఱు శృంగారకావ్యములను వ్రాయించి కృతిగొనిరి. ముద్దళగిరి స్వయముగ గ్రంథకర్త. తారాశశాంకమును జెప్పిన శేషము వేంకట పతియు నహల్యాసంక్రందనాది కావ్యములను జైమినిభారత వచనమును విరచించిన సముఖము వేంకటకృష్ణప్ప నాయకుడును, మధుర యాస్థానమున వెలసినవారే.

వాఙ్మయపోషణయందేమి గ్రంథరచనయందేమియొక దక్షిణాంధ్ర నాయకలరాజులనేకాక, ఆంధ్రదేశ విద్వత్ప్రభులనెల్ల నధఃకరించినవారు తంజాపురాంధ్ర నృపాలురు. వీరిలో రఘునాథ విజయరాఘవులు ముఖ్యులు. ఇద్దఱును విద్వాంసులు, కవులు. కవుల నాదరించినవారును గావ్య నాటకాదులను వ్రాయించుటయే గాక స్వయముగ నుత్తమ గ్రంథరచన గావించిరి. మఱియొక విశేష మేమన వీరిచే నాదరింపబడి గ్రంథరచన గావించినవారిలో స్త్రీలు పెక్కండ్రు గలరు. మధురవాణియు రామభద్రాంబయు రఘునాథుని యాస్థానము నలంకరించిరి; రంగాజియు గృష్ణాజియు విజయరాఘవుని సభకు భూషణ ప్రాయులై కీర్తి గడించిరి. వీరి కాలమునందు ద్రావిడదేశమునం దాంధ్రవాఙ్మయము బహువాహినులై వెల్లి విరిసినను, వీరియాదరణకు ముఖ్యముగపాత్రమైనది యక్షగాననము. అట్లని చెప్పుటవలన ఆంధ్ర యక్షగానరచన మఱి యెచటను సాగ లేదని యభిప్రాయము గాదు. చిక్క దేవరాయవిలాసము మైసూరున బయలువెడలెను; ఇది యెవ్వరు రచించిరో చెప్పుటకు వీలులేదు; కాని చిక్కదేవుని కాలమున నిది వ్రాయబడె ననుటకు సందియము లేదు. దక్షిణాంధ్రమున నెల్లూరు మండలమున గంకంటిపాపరాజు విష్ణుమాయావిలాస నాటకమును జెప్పెను. రాధామాధవ యెల్లనార్యుని విష్ణుమాయా విలాసనాటకములో మోహినికథను ఇతడు యక్షగానముగ జేసెను. రచనావిధానమును బట్టి చూడగా పాపరాజు విష్ణుమాయా విలాసమునకు రుద్రకవి సుగ్రీవ విజయమునకు జాల సమీప బాంధవ్యము గలదని చెప్పవలసి యున్నది. ఇదిగాక యహోబల ప్రాంతమందలి...గుళదూర్తి యగ్రహార వాస్తవ్యుడైన క్రొంజ వేంకటాద్రియను నతడు వాసంతికాపరిణయమను యక్షగానమును రచించెను. శిథిలావస్థయం దుండుటచే దీని యితివృత్తము జక్కగ దెలియ వచ్చుటలేదు. ఇది యహోబలక్షేత్రమునకు సంబంధించిన కథయైయుండునేమొ.

క్రీ. శ. 16వ శతాబ్దపు ఉత్తరార్ధమున నహోబలమఠాధిపతియగు శఠగోప జీయరను విద్వద్వతంసుడు వాసంతికా పరిణయమను సంస్కృత నాటకమును రచించెను. ఆ కథనే యహోబలప్రాంతమువాడైన వేంకటాద్రి యక్షగానము గావించెనేమొ. రెంటిని బోల్చి చూచినగాని నిజము తేలదు.

17వ శతాబ్దమున

ఆంధ్రదేశమున రచింపబడిన యక్షగానము లివి రెండేయని యెంచరాదు. అప్పటినుండి యిప్పటివరకును యక్షగాన వాఙ్మయము అవిచ్ఛిన్నముగ జరుగుచునే వచ్చినది. ఆంధ్ర సాహిత్యపరిషత్తు పుస్తకభాండాగారమునను చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునను సముద్రితమైన యక్షగానములు శతాధిక సంఖ్యాకములు గలవు. ముద్రితములు దాదాపు యెనుబది కలవు. కాని యక్షగానములను గూర్చి యాక్రోశించువారికి వాని పేరుకూడ తెలియదు. వాని చరిత్రను గూర్చిన పరిశోధన మేమియు జరుగలేదని వేఱుగ జెప్పవలసిన యావశ్యకత లేదు. అట్టి పరిశోధనయే లేనప్పుడు వాని స్థితిగూర్చి యేమి చెప్పుటకు సాధ్యపడును?

3

యక్షగాన రచన కర్ణాటాంధ్రములందు జరుగుచుండినను అది వెల్లివిరిసినది ద్రావిడదేశమందలి తంజనగరమందె. రఘునాథ నాయకుని కాలమున రచింపబడిన యక్షగాన మెద్దియు గానరాక పోయినను, దాక్షిణాత్యాంధ్ర ప్రపంచమున నది యప్పుడు ప్రాముఖ్యము నందియుండెనని తలచుట కవకాశము గలదు. రఘునాథుని మంత్రియు విద్యాగురువునైన గోవింద దీక్షితుడు యక్ష గానము ఒక గానశైలియని చెప్పినాడు; మఱియు నతనికి బూర్వికుడైన ఆంజ నేయుడు యక్షగానరీతిని వివరించెనట. పామరవాఙ్మయమని యాద్యము నుండియు నిరసింపబడుచువచ్చిన యక్షగానము శాస్త్రికర్తల దృష్టి కెక్కినది. కాని విజయరాఘువుడు తలయెత్తునంతవఱకు దాని కౌన్నత్యము గలుగలేదు. ద్విపద కావ్యములను పదములను బహుళముగ రచించితినని యతడు జెప్పుకొన్నను, నితడు జెప్పిన ఏబది కృతులలో బెక్కు యక్షగాననాటకములు.

ప్రహ్లాద చరిత్రయం దాత డొసఁగిన పట్టికలో రాజగోపాలవిలాస నాటకము. ఉషాపరిణయనాటకము, రఘునాథాభ్యుదయము, మోహినీ విలాసాఖ్య నాటకము. పూతనాహరణనాటకము, మంజరీ నాటకము, సముద్రమథన నాటకము, కృష్ణ విలాసనాటకము, జానకీకల్యాణ నాటకము, పుణ్యకవ్రత నాటకము లను పది మాత్రము నాటకములని పేర్కొనబడి యున్నను, కాళీయమర్దనము, ప్రహ్లాద చరిత్ర, విప్రనారాయణచరిత్ర, రుక్మిణీకల్యాణమును మఱి నాలుగు కృతులుకూడ యక్షగానములే 15. ఇట్లే ప్రహ్లాదచరిత్ర పట్టికయందు పేర్కొనబడిన మఱి కొన్ని గ్రంథములు గూడ యక్షగానములై యుండుననుటకు సంశయములేదు. వాస్తవముగ విజయరాఘవుడు యక్షగాన పితామహు డనుట యొప్పును. అతడు యక్షగానములను బహుళముగ రచించుటయె కాక తన యాశ్రితులను సత్కరించి వారిని యక్షగాన రచనకు బురికొల్పెను. విజయరాఘవుని ప్రోత్సాహము వలన యక్షగాన కృతులు జెప్పినవారిలో బురుషోత్తమ దీక్షితుడు, రంగాజమ్మ, కోనేటి దీక్షితుడు, కామరసు వెంకటపతి సోమయాజి, మన్నారుదేవుడు ప్రముఖులు. మఱియెంద రుండిరో చెప్పుటకు వీలులేదు. యక్షగానచరిత్ర యందు విజయరాఘవు డడందిన యున్నతస్థానము కేవలము అతడు రచించిన నాటకముల సంఖ్యమీదను, నాశ్రయ మిచ్చి నాటకరచనకు బురికొల్పిన కవుల మీదను ఆధారపడియుండలేదు. అతడు స్వతంత్రుడు. యక్షగాన రచన యందు పూర్వులమార్గ మతనికి నచ్చలేదు. కావున నందు కొన్ని క్రొత్తమార్పు లను జేసి తరువాతి యక్షగాన రచయితల కందఱికి మార్గదర్శకు డాయెను.

విజయరాఘవునితో తంజావూరి యాంధ్రనాయకరాజ్యము సమసి పోయినది. మొదట నది మధురనాయకులకు గైవసమాయెను; కాని యటుపిమ్మట స్వల్పకాలమునకే షాజీపుత్రుడు ఏకోజి వారిని జయించి మహారాష్ట్రప్రభు

---

15. చూ. డిస్క్రిప్టివ్ కేటలాగ్ ఆఫ్ తెల్గు మ్యాన్యుస్క్రిప్ట్స్, నెంబరులు, 500,541,617—మఱియు విజయరాఘవకృత రఘునాథనాయకాభ్యుదయముయొక్క ఆశ్వాసాంతములలో—.

"కమనీయ రుక్మిణీ కల్యాణముఖ్య
సమధిక నాటక సంవిధాయకుఁడు."

అనియు గలదు.

త్వమును నెలకొల్పెను. ఇట్లాంధ్రులను మహారాష్ట్రులు జయించి రాజ్యమును స్థాపించినను, నాంధ్రులచే వారును పరాజితులైరి. మహారాష్ట్రుల విజయము రాజకీయము; ఆంధ్రులది సాంస్కృతికము. తంజావూరాంధ్రనాయకుల ప్రభుత్వము ఫలరహితమైపోలేదు; వారి నాశ్రయించుకొనియుండిన తెనుగుప్రజయందె స్థిరముగ నిలచిపోయినది; వారి ముద్రలేక నాగరకతకు చెలామణి లేదు; వారి జీవితప్రకార మందఱకు మేలు బంతియైనది. విజ్ఞానమునకువారు పెట్టినదే భిక్షాకళాకౌశలమున వారిదే మీదిచేయి. ఆంధ్రభాషాపరిచయము రసికతకు ముఖ్యచిహ్నము; కవిత నొసటి మాణిక్యము. కావుననే మహారాష్ట్రరాజు లందఱును తెనుగు నభ్యసించిరి; సభయందు తెనుగున మాటలాడిరి. తెలుగు విద్వాంసులను గవులను గాంధర్వవిద్యా విశారదులను గాయన గాయనీ జనులను జేరదీసి నాయకరాజులవలె నాశ్రయమొసగిరి. మహారాష్ట్ర రాజులాంధ్రమున గవనమల్లు నేర్పుగలిగి కావ్యములను రచించిరి. యక్షగానమును వారివలె బెంపొందించినరాజులు పెక్కండ్రు కానరారు. ఆంధ్రకవులను భాషాపోషకులునునై మహారాష్ట్రరాజులు విఖ్యాతి నందిరి. వీరిలో మొదట నెన్నదగినవాడు శహాజి. ఇతడు తంజనగరమున మహారాష్ట్ర ప్రభుత్వమును బ్రతిష్ఠించిన ఏకోజి పుత్రుడు. క్రీ. శ. 1682వ సంవత్సరమునందనగా విజయరాఘవుని నిర్యాణమైన పదియేండ్లలోపల రాజ్యాభిషిక్తుడాయెను. విజయరాఘవుని భౌతిక శరీరము నశించిపోయినను, అతనికీర్తిమూర్తి ఇంకను ప్రజ్వరిల్లుచునే యుండినది. ప్రజ లాతని ధర్మపరిపాలనను విస్మరింపలేదు. ఆంధ్రు లాతని యౌదార్యాది సుగుణసంపదను మరువలేదు. తెనుగువారి సౌహార్దమును బొందక యానాడు చోళమండలమున ప్రభుత్వము చేయుట దుర్ఘటమైయుండెను; కావున శహాజీ విజయరాఘవునికంటె నధికముగ భాషాపోషణాదులను గావించి యతని మరపించి తెనుగువారిని వశంవదులను జేసెను. అతని యాంధ్ర భాషాపోషణ కేవల రాజకీయ కారణములయొక్క ఫలితము కాదు. జాతిచే మహారాష్ట్రుడైనను, శహాజి పుట్టి పెరిగినది పశ్చిమాంధ్రమునందు. ఆతని పితామహుడైన శహాజి విజాపురసుల్తాను ప్రసాదమున కోలారు అనంతపురమండలములలో జాగీరులను సంపాదించెను; తండ్రియైన యేకోజి తంజావూరమునకు రాకముం దచ్చటనె ప్రభుత్వముసల్పుచుండెను. కావున నాతనికిమాతృభాషయైనమహారాష్ట్రమువలె దేశభాషయైన తెనుగును సహజముగ

నలవడినది. అట్లుగానియెడల నతనికి తెనుగుభాషయం దంతటి యభిమాన మును దెనుగుకవిత్వమునం దంతటి నేర్పును గలిగియుండవు.

కారణ మెద్దియైనను నాంధ్ర భాషాపోషణయందును విద్వత్పక్షపాతము నను కవిజనసంరక్షణయందును కావ్యకల్పనాచాతుర్యమునను శా హా రా జు విజయరాఘవునికి దుల్యుడని చెప్పక తప్పదు.

ఇతనికి తిమ్మన్న మొదలై నవారురచించిన తెనుగు ద్విపద భారతముపై నభిమానము మెండు; కావున దానికొక ప్రతినిర్వాయించి తన పుస్తక భాండా గారమున నిక్షిప్తము జేసియుంచుకొనెను.

భోసలాన్వయ సుధాంభోధి చంద్రుండు
భాసురశౌర్యానుభావ సాంద్రుండు

x x x x

మనుజభావుండు రామామనోజుండు
అనఘ సన్నుతుడు శాహాపనీ విభుడు

x x x x

పంచమ వేదమై పరగు భారతము
సంచితపాపముల్ చెరజేయుగాన
నింబాజిగనుగొని నీవు వ్రాయింపు
మంబుజోదరులీల లన్నియు దాన
గనవచ్చునని చెప్ప గడు వేడ్కతోడ.

x x x x

విభవనిర్జిత దేవవిభుపేర శాహ
విభుపేర సకల ప్రవీణుని పేర
వ్రాయంగ బూనితి.....

—(ద్వి. భా. అశ్వమేధ పర్వము చివర).

ఇట్లు కావ్యాభిమానముగలవాడైనను కావ్యరచనకు బూనుకొనలేదు. విజయ రాఘవుని కవితవలె నితనిది పలుదెఱగుల బరిఢవిల్ల లేదు. ఇతని రచన లన్నియు నాటకములె. కిరాతవిజయము, కృష్ణవిలాసము, గంగా పార్వతీ సంవాదము, జలక్రీడలు, త్యాగరాజ వినోదచిత్రప్రబంధనాటకము, ద్రౌపదీ కల్యాణము, పంచరత్న ప్రబంధము, పార్వతీపరిణయము, రతీకల్యాణము, రామపట్టాభిషేకము, రుక్మిణీసత్యభామాసంవాదము, వల్లీ కల్యాణము, విఘ్నేశ్వర కల్యాణము, విష్ణుపల్లకి సేవాప్రబంధము, శంకరపల్లకి సేవాప్రబంధము, శచీపురందరము, శాంతాకల్యాణము, సీతా కల్యాణము, సతీపతిదానవిలాసము, సతీదానశూరము, మున్నగునాటకము లిరువది శాహరాజకృతులు గానవచ్చు చున్నవి. ఇవిగాక ఇతని యాశ్రితులు రచించినవి మఱికొన్ని నాటకములు గలవు. గిరిరాజు రాజకన్యాపరిణయమును, రాజమోహన కొఱవంజిని, లీలావతీ కల్యాణమును, వాచజయ నాటకమును, శాహేంద్ర విజయమును, సర్వాంగ సుందరీవిలాసమును జెప్పెను. బాలకవి పంచకన్యా పరిణయమును, బాలకవి సుబ్బన్న లీలావతీ శాహరాజీయమును, శేషాచలపతి శాహరాజ విలాసమును, సరస్వతీ కల్యాణమును, విరచించిరి. మొత్తముమీద శాహరాజు కాలమున ముప్పది యక్షగాన నాటకములు వెలువడినవి. ఈ కాలమున రచింపబడిన నాటకము మఱియొకటి కలదు. ఇది తిరుమల కవికృత చిత్రకూట మాహాత్మ్యము. ఇతడు మధురనాయకరాజగు విజయరంగ చొక్కనాథనాయకుని యాస్థానమున వెలసెను. ఇందువలన యక్షగానకర్తలకు తంజావూరు నందె కాక మధురయాస్థానమందు సైతమాశ్రయము గలిగినదని తెలియవచ్చుచున్నది. యక్షగానకర్తలైన మహారాష్ట్రరాజులలో రెండవవాడు శాహరాజానుజుడగు తుళజరాజు. ఇతడు శివకామసుందరీపరిణయము జెప్పెను. ఇతని యనంతరము రాజ్యాభిషిక్తుడై యల్పకాలము రాజ్యమును బాలించిన జయసింహుడు నెల్లూరు వీరరాఘవ కవిపుత్రుడైన శివరామకవిచే కామకళానిధియను కామశాస్త్రగ్రంథ మును గృతికొనెను. ఇతని తమ్ముడగు నేకోజీ రాజు గూడ తన తండ్రి పెద తండ్రులవలె యక్షగానకర్తయే. ఇతడు రచించినది విఘ్నేశ్వరకల్యాణము: సిద్ధిబుద్ధులను విఘ్నేశ్వరుడు పెండ్లాడిన కథ యిందు వర్ణింపబడినది. కేవల యక్షగానకృతితో దృప్తినందక ఏకోజీ కావ్యరచనకు బూనుకొని రామాయణ మాఱు కాండలను ద్విపదగ వ్రాసెను. ఏకోజీ కవిత్వమందు నేర్పరి. ఇతనిది

సరళమైన కవిత్వము. కట్టావారి రామాయణమునకిది సర్వవిధముల తుల్యమైనది.

గ్రంథకర్త గాకపోయినను ప్రతాపసింహుని ఇచట బేర్కొనుట యుక్తము. ఇతనికి యుంపుడుగత్తెయందు జననమందిన యమరసింహుడు—ఇతనికే రామస్వామి యని నామాంతరముకవుల కాశ్రయుడై మాతృభూత పారిజాతాపహరణ నాటకమును గృతిగొనెను. ప్రతాపసింహుని కాలమందె గానబ్రహ్మ త్యాగరాజు వర్ధిల్లెను. ఇతనికి రాజులతోడను సంస్థానములతోడను సంబంధము లేకపోయినను, భగవద్భక్తిపరాయణుడై పెక్కు కీర్తనలను రచియించుటయెగాక ప్రహ్లాదచరిత్ర నౌకాచరిత్రలను యక్షగానములు రెంటికి గర్తయయ్యెను; కావున నతని నిచట పేర్కొనక తప్పదు.

మహారాష్ట్ర రాజులలో గడపటి యక్షగానకర్త శివాజీరాజు. ఇతడు శరభోజి పుత్రుడు; తుళుజరాజ పౌత్రుడు; ప్రతాపసింహుని ప్రపౌత్రుడు. ఇతడు దన పూర్వికులను బోలి విద్వాంసుడు; కళాప్రియుడు; ముఖ్యముగ గంధర్వ విద్యావిశారదుడు; గానాది విద్యలలో జతురులగు మిత్రుల గోష్ఠియందు కాలము గడపువాడు.

'ఆర్తజనులను బ్రోచు నల కల్పకంబు,
కీర్తిగల్గిన యట్టి కృష్ణరాయండు

* * *

గాన విద్యలలోన ఘనుడైనవాడు,
సేనాధురంధర శ్రీ గల్గువాడు
వరయోగ శాలియౌ వరహేంద్రఘనుడు,
పరిపూర్ణ విద్యల ప్రబలినవాడు
ఇటువంటి మిత్రులు యిరువంక గొలువ,
పటువుగా విలసిల్లు భాగ్యముప్పొంగ
శ్రీ శివాజీంద్రుడు చెలగు సద్విభుడు,
ఆశాంతభూపుల ననువుగా బ్రోచి'

యని యతనియన్న పూర్ణాపరిణయ యక్షగానమునందు సూత్రధారు డితని బ్రశంసించియున్నాడు. ఇట్లితడు యక్షగానమును జెప్పుటయేకాక కవుల నాదరించి వారిచే గృతులు గొనెను, ఇతని బ్రసాదమునకు బాత్రుడైనవారిలో వేంకట కృష్ణాజెట్టి యొక్కడు. తాను 'శ్రీ రాజమాన్య రాజరాజరాజశ్రీ శివాజీ మహీపాలుని తెలుగుకవి వెంకటకృష్ణాజెట్టి'నని సగర్వముగ జెప్పుకొనెను. ఇతని శివపారిజాత మను యక్షగానము 'శ్రీ తంజపురీంద్రు శ్రీ శివాజీ మహీపాలుని కులదేవుడైన చంద్రమౌళీశ్వరుని కృపచే బ్రాసిన కవిత్వ' మట.

పై బేర్కొనిన యక్షగానరచయితలుగాక దేశకాలాదులు దెలియరాని మఱికొందఱి నాటకములు సరస్వతీమహాలు పుస్తకభాండాగారపట్టిక యందు వర్ణింపబడియున్నవి. అక్క బ్రధానుని పేర గృష్ణవిలాసము భీమసేన విజయ మను రెండు నాటకములు గలవు. ఈ రెండును వేంకటాచలపతి కంకితములు. తన్నుగూర్చి కవి యిట్లు చెప్పుకొనియున్నాడు.

'అంకితంబుగ వేంకటాధిపుపాద,
పంకజ యుగమదభ్రరాయమాన
.....
.....
మనసిజాకార తిమ్మయ దండనాథ,
తనుసంభవుం డక్క సత్ప్రిధాసుండు.'

అని కృష్ణవిలాసమునను—

'అంకితంబుగ వేంకటాధీశుపాద,
పంకజయుగమదభ్రమరాయమాన
.....
.....
మనసిజాకారతిమ్మయ దండనాథ,
తనయాక్క మంత్రి కృతంబై తనర్చు'

అని భీమసేన విజయమునను గలదు. ఇతడుగాక మఱియొక యక్క నామాత్యుడు సరబాద లింగోజీ కుమారుడు 'బాలకృష్ణలీలావిలాసము'ను బ్రాసెను

ఇదియు గవి 'యిష్టవేలుపు' వేంకటాధీశుని కంకితము కావింపబడినది. తన్ను గూర్చియు దన నాటకమును గూర్చియు నిట్లు వ్రాసికొనియున్నాడు :

'కులుడు భారద్వాజ గోత్రసంయుతుడు,
సరసవైఖరి మెఱయు సత్కీర్తియుతుడు
సరబాద లింగోజి సత్పుత్రు డక్క-
నామాత్య శేఖరుం డతి సంభ్రమమున
కామునిగన్న చక్కని బాలకృష్ణ
లీలావిలాసలాలితనాటకంబు
భూలోకమున శుభంబులు పొల్పుమీఱ
సలలిత భరతశాస్త్ర ప్రవీణతను
పరగగ కన్నుల పండువు గాగ
.....
ఆ చతుర్ముఖ నిర్మితావనియందు
నాచంద్రతారార్క-మై యొప్పుగాక.'

చెంగల్వరాయనిపేర గొల్లకథ యెఱుకలకథ యను రెండు నాటకములు గలవు. 'బాలెంతకథ' 'రాధకథ' యను మఱి రెండు గూడ నితని రచనలని పట్టికయందు చెప్పబడినది. కాని యది సంశయ గ్రస్తము.

"శ్రీరాయవుర మేలి చెలగు శ్రీహరికి
నారూఢి గణనాథునకు వాణికెలమి
నలువొందగా విజయనగర వంశజుడ
రసికత చెంగల్వరాయాహ్వాయుండు
అసమానమగు దేవతానుగ్రహమున
కరమర్థితో గొల్లకథ రచియించె."
అనియ___
"ఇల విజయనగర వంశో
జ్వలుడగు చెంగల్వరాయ జనవరు డెలమిన్

లలితోక్తుల యెఱుకుల కథ
దెలియగ జెప్పెను నృసింహదేవుని కరుణన్."

అనియు వివరించినాడు. గొల్లకథయందు బేర్కొనబడిన రాయపుర మెచ్చటిదో తెలియదు. చెన్నపట్టణ శాఖానగరమగునొక రాయపురము గలదు; మఱియు నీ చెంగల్వరాయలు విజయనగర వంశజుడ నని చెప్పుకొనియున్నాడు; కావున నితడు చెన్నపట్టణప్రాంతమున వర్ధిల్లినవాడైనను గావచ్చును.

శంబరధరుడను కవి కిరాతార్జునీయనాటకము రచించి శంభున కంకిత మొనర్చెను.

"అంకితంబుగ బొమ్మలాట శాసనుడు
పొంకమౌఘన కావ్యభూషణుడైన
సంబయ్య తమ్ముడు సరసుడౌనట్టి
శంబరధరుడు ప్రశంభుని పేర
నెనయంగ రచియించె నిది లోకహితము."

అని వ్రాసినాడు. బొమ్మలాట యొక గ్రామము పేరు! ఆ యూరి కరణము తమ్ముడీ శంబరధరుడు. కృష్ణదేవరాయలకును నతని పిమ్మట నచ్యుత దేవరాయలకును నాప్తుడైన బొమ్మలాట విరూపాక్షుని మనుమడో పుత్రుడో యగు కాళ డొకడు గలడు. ఇతడొక వేళ బొమ్మలాట గ్రామవాస్తవ్యుడై యుండవచ్చును; కాని యీ బొమ్మలాట యెచ్చటిదో తెలియదు. రాయలసీమ యందుండు నేమొ.

ఓబయమంత్రి గరుడాచల నాటకమును రచించి నృసింహస్వామి కంకిత మొనర్చెను. ఇతడు స్వవిషయమును—

"వన్నె కెక్కిన నందవరశాసనుండు
చిన్నమాంబాగర్భసింధు చంద్రుడు
దినకరతేజు...హియోబ
ఘనుని యోబయమంత్రి కవివరేణ్యుండు."

అని వివరించుకొనుటవలన నితడు కర్నూలు మండలమువాడనియు గృతిపతియైన దేవు డహోబల నరసింహస్వామి యనియు నిశ్చయము సేయ వచ్చును.

యక్షగాన కర్త లందఱును పౌరాణిక గాథలనె తమ నాటకములకు ఇతి వృత్తములుగ గ్రహింపలేదు. రాజుల చరిత్రలను వారి శృంగారవిలాసములను, ధర్మకార్యాదులను విజయరాఘవ, పురుషోత్తమదీక్షిత, కోనేటిదీక్షిత, వెంకటపతి సోమయాజి, శేషాచలపతి, గిరిరాజాదులు నాటకములుగ జేసిరి. వీరి విషయ మింతకుముందె వివరింపబడినది. వీరుగాక వేదాంతప్రచారము కొఱకు నాటకము లను రచించినవారు కొందఱు గలరు. వారినిగూడ బేర్కొనుట యుక్తము. వీరిలో ముఖ్యుడు పరమానందయతి లేక పరమానంద తీర్థుడను సన్యాసి. ఇతడు బహు గ్రంథకర్త. ముక్తికాంతా పరిణయమను నాటకమును విరచించెను.

"పరగసంయమిగేయు పావనధ్యేయు
పరగదత్రాత్రేయు పరమ విధేయు
తలచి కీర్తించి వందన మాచరించి
యలరుచు దగ బరమానందతీర్థ
యతి నామధేయు డాయత మోదమునను
చతురత ప్రౌఢిచే సజ్జనుల్ పొగడ
కరమొప్పగా ముక్తి కాంతావివాహ
మరుదారపద చాళి కమర జెప్పెదను."

సన్యాసి యగుటచే దన పూర్వాశ్రమవృత్తాంతమును జెప్పుకొనలేదు. ఇతని దేశకాల విద్యమానములను దెలుపుసాధనము లెవ్వియు లేకపోయినను వ్యక్తి నిరాణకు దగిన యూహయొకటి పొడముచున్నది. ఆంధ్రదేశమంతటను నేటికిని పరమానందయ్య యను యతీశ్వరుని యొక్కయు నతని శిష్యుల యొక్కయు కీర్తి ప్రజ్వరిల్లుచున్నది. ఆ పరమానందయ్యగారె ముక్తికాంతా పరిణయ రచయితయగు పరమానంద తీర్థయతి యని తోచుచున్నది. ఇది యసంభావ్యముగాదేని యిట్టి యాత్మవిద్యావేత్తయు బండిత ప్రకాండుడునైన

యతిపుంగవునకు లోకమున మూఢుడను నపవాదమేలకల్గెనో విచారింప దగి యున్నది.

చల్లా సూరయయు నీ తరగతికి జెందిన నాటకకర్తయే; ఇతడు వివేక విజయమను నాటకము జెప్పెను, ఇందు వర్ణింపబడిన కథయు ముక్తికాంతా వివాహమే. ఇత డెప్పటివాడో తెలియదు; కాని యితని నివాసస్థానము తంజావూరు మండలమని నిశ్చయముగ జెప్పవచ్చును. మన్నారుగుడి ప్రాంతము వాడైనట్లు తోచుచున్నది.

"అనుచు శ్రీరాజ మన్నారైన స్వామి
ఘనకృపావర్ధిత కవితాతిశయుడు
పొందపాకాహ్వయపురనిత్యవాసి,
వేదవేదాంగాది విద్యావిదుండు
చల్లవంశాంబుధిచంద్రుడు సూరి
తల్లజుండైన యాతత్వసంవేది
సూరయార్యున కగ్రసుతుడైనవాడు,
సూరిజనస్తుత సురుచిరాత్మకుడు
కవిసూరయాఖ్యుండు ఘనతత్వవిదుడు
వివరింపగ వివేకవిజయ నాటకము
.....
దక్షిణద్వారకా ధామునిపేర.
నాచంద్రతారార్కమై భూమి వెలయ"
అను ద్విపదలితని వంశాదికముల దెల్పుచున్నవి.

ముక్తికాంతావివాహమునే వర్ణించు 'జీవననాటకము' అను మఱియొక వేదాంతపరమైన నాటకముగలదు. కర్త యెవ్వరో యెచ్చటివాడో, యెప్పటి వాడో తెలియదు, 'అదృశ్యంబైన బ్రహ్మనాటకంబు ప్రత్యక్షముగా తెలిసేటి కొఱకై మోక్షకాంతా కల్యాణంబనియెడి నామధేయంబున వేషభాషాది యుక్తముగ నాటక కథాక్రమంబెటువలెనంటేను'అని చెప్పియుండుటచే నీ యాధ్యాత్మిక నాటకములను రచించినది కేవలము పఠనము కొరకే కాదనియు నన్ని నాటకములను బోలి ప్రదర్శనము ఇచటను ముఖ్యోద్దేశమనియు దెల్లమగుచున్నది.

నాటక రచనలనుబోలి ప్రదర్శనములును విరివిగా జరుగుచుండినవి. సరస్వతీ మహలు పు స్తక భాండాగార గ్రంథములలో నచట నచట నగరిమేళ ప్రస్తావన గానవచ్చుచున్నది. శివాజీ కృత అన్నపూర్ణా పరిణయ ప్రతి కడపట నిట్లు కలదు. 'జయనామ సంవత్సరం భాద్రపదశుద్ధ నవమి గురువారంనాడు రాజశ్రీ మధ్యస్థులవారి ఉత్తరపు ప్రకారం నగరిలో ఉండే భాగవతమేళం సబనీసు దగ్గర యీ అన్నపూర్ణాంబికాపరిణయ పు స్తకం వ్రాయించి అమృతకవి తులసీ రంగయ్యంగారు నగరివారికి వ్రాయించి యిచ్చినది. వ్రాసిన ఆకులు 49." "నాటక పాత్రలు" అను పు స్తకమున ఒక్కొక్క నాటక పాత్రలను దత్పాత్ర ధారుల నామములను వివరింపబడి యున్నది. ఉదా:

'ప్రబోధ చంద్రోదయ వేషాలు.'

'విఘ్నేశ్వరుడు రాముడు పూట్టత్తూరి వైద్ది. ప్రమథగణాలు గణపతి. గురువయ్య కృష్ణుడు. మణియం శ్రీనివాసుడు గురువుడు. కురుక్కళ రామయ్య. పరిచారకుడు కుప్పయ్య.'

దీనిబట్టి చూడగా తంజావూరి రాజులు తమ నగరిలో నాటకములను బ్రదర్శించుటకు బ్రత్యేక మేళములను గూర్చి తమ కొలువుల నుంచుకొను వారనియు నందొక్కొక్కపాత్ర వేషము ధరించుటకు ప్రత్యేక మొక వ్యక్తి నియుక్తుడై యుండెననియు దెలియవచ్చుచున్నది. ఇట్లే యితర రాజుల కొలువునను ప్రత్యేక భాగవత మేళము లుండియుండవచ్చును. రాజులేకాక గొప్ప మంత్రులు మున్నగువారు సైతము బ్రత్యేక భాగవత మేళములను పోషించు వారని తెలియ వచ్చుచున్నది. గోల్కొండ తానీషా మంత్రులైన యక్కన మాదన్నల కొలువున నొకభాగవత మేళ ముండెనని మధురమంగా పుంశ్చలీవిలాసమున జెప్పియున్నది. కూచిపూడి భాగవత మేళమును బోలి యక్కన మాదన్నలమేళము దేశాటనముజేయుచు నచటనచట నాటక ప్రదర్శనముల గావించెడిదనియు, నానెగొంది రాచనగరంలో నాటకము నాడినపుడు మేళగాండ్రలో జూపరి యైన స్త్రీ వేషధారి యువకునిగాంచి యా రాజసోదరివలచి వానితో సాంగత్యము నెఱపెననియు నందొక యైతిహ్యము గలదు. ఇట్టి మేళములు మొన్నటివరకును ప్రతి వేసంగియందును సంచారము వెడలుచు నాటకము లాడువారు. ఆంగ్లవిద్య దేశమున బ్రబలినపిమ్మట నీ నాటక ప్రదర్శనము లనాగరకత చిహ్నమను

నభిప్రాయము ప్రబలుటచేత విద్యావంతులు వాని నిరసింప గడగిరి. తత్కారణమున విద్య నేర్చినవారీ నాటకముల నాడుట మానుకొనిరి. అంతట నవి యానాదుల పాలబడి చివరకు లయమై పోయినవి.

4

ఇంతవఱకు యక్షగానోత్పత్తియు వాఙ్మయాభివృద్ధియు వివరింపబడినది. భాగవతమేళములును నాటక ప్రదర్శనములును సందర్భానుసారముగ దడవ బడినవి. ఇక యక్షగాన రచనావిధానమును గూర్చి యొక్కింత చెప్పవలసి యున్నది. ఆద్యమున యక్షగాన స్వరూప మెట్టిదో తెలియదు; ప్రాచీన యక్ష గానము లన్నియు నామరూపములు లేక నశించిపోయినవి. నేడు మనకు లభించు యక్షగాన గ్రంథములలో నెల్ల ప్రాచీనతమమైనది కందుకూరు రుద్రకవికృత సుగ్రీవవిజయము. రుద్రకవి క్రీ. శ. 16-వ శతాబ్దమున వెలసెను. కృష్ణరాయల యష్టదిగ్గజములలో నొక్కడని చెప్పుదురు; అళియరామరాజ మల్కిభరాములచే సత్కృతుడని తెల్పు నైతిహ్యములును గలవు. రచనావిధానమునుబట్టి చూడనది యారంభకచనగాదని చెప్పవలసియున్నది. పరిపూర్ణత నందకపోయినను సంప్ర దాయము చక్కగ నేర్పడినది. యక్షగానరచనగూర్చి కీర్తికాయులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిలవారిట్లు వ్రాసియున్నారు.

'యక్షగానమందలి ప్రధాన గేయరచనములు దేశిరచనలగు రగడలలో గొంత మార్పు జరిపి—త్రిపుట, జంపె, ఏక, ఆట, అనుతాళముల కనుగుణముగా గల్పింపబడినవిగా గానవచ్చును. అప్పకవి రగడ రచనములను తాళములపేర పేర్కొనెనుగాని వానికి పేరులు వేఱె తెలుపలేదు. పేర్కొన్న యీ రచనములే కాక యక్షగానములలో నింకను ననేక విధములైన దేశిరచనములు చేరినవి. ఏలలు, జోలలు, సువ్వాలలు, ఆరతులు, ధవళములు, చందమామ సుద్దులు, వెన్నెల పదములు, విరాళిపదములు, తుమ్మెదపదములు, కోవెలపదములు, చిలుకపదములు, అల్లోనేరేళ్ల సీస-కందార్ధములు, త్రిభంగులు ద్విపదలు, త్రిప దలు, చౌపదులు, షట్పదులు, మంజరులు, జక్కులరేకులు-మొదలగునవి"[16] ప్రభాకరశాస్త్రిలవారు చెప్పినట్లు పై జాబితాలోని రచనము లన్నియు

[16]సుగ్రీవ. పీఠిక. పుటలు 9-10.

యక్షగానములలో గానవచ్చునేమో పరిశీలించి చూడవలసియున్నది. ఇందలి వాస్తవావాస్తవము లెట్లున్నను సుగ్రీవవిజయమునందు మాత్ర మిం దనేకములు గానరావు. ఇందు ఉత్పలమాల 1, సీసములు 2, తేట గీతలు 4, కందము 1, కానవచ్చుచున్నవి. ఇవిగాక రగడవికార రచనములని యప్పకవి చెప్పు త్రిపుట, జంపె, కుఱచజంపె, ఆట యేక తాళములును, ఏల ధవళార్ధచంద్రికలును, ద్విపదలును వచనములును గలవు. అన్నిటికంటె బహుళముగ వాడబడినది ద్విపద. వచనములు చిన్నవి. అవి ముఖ్యముగ నాటకపాత్రలప్రవేశాదులను దెలుపుటకును, నాటక కథలోని సంధు లను వివరించుటకును వాడబడినవి. తాళములను బేర్కొన్నను రాగముల ప్రస్తావన యెందును గానరాదు. ఈ పద్ధతి ననుసరించి వ్రాయబడిన నాటకములు రెండుమూడు గలవు. కంకంటి పాపరాజు వ్రాసిన విష్ణుమాయావిలాస నాటక మొక్కటి. ఇందు సుగ్రీవవిజయమును బోలి వృత్త కంద సీస గీత ద్విపద వచ నాదులును త్రిపుట జంపె కురుచజంపె యేకాదియాటతాళములును, నేలార్ధచంద్రిక ధవళములును వాడిబడినను నందు గానరాని పెక్కుగేయరచనాదులు విష్ణుమాయా విలాసనాటకమున బొడగట్టుచున్నవి. ఇందు ముఖ్యమైనవాని నిచట బేర్కొని మచ్చున కొక్కొక గేయమును బొందుపఱచుచున్నాడను.

(1) లఘు శేఖరము

కుంచె విసరకొంచు నవ్వుకొంచు శౌరిగాంచు వేడ్క
ముంచుకొనగపారుదిండి మునివరుండు బాఱుదేర.
వనజనయను మాయ మాత్రమునకు మీరలేల మరులు
కొనకయుండ మేమె నేర్తుమనుచు ప్రమథవరులు గొలువ.
శివ విరక్తి విష్ణుమాయ జేరి చూతమనుచు నజుడు
దివిజమునులు బ్రహ్మయతులు దిక్పతులును గలిసి కొలువ.

(2) మబ్బె

జాఱుకొప్పు జూచి యొకడు జంకెనలకు భ్రమసి యొకడు
ఓరచూపు జూచియొకడు దారితీరు జూచి యొకడు

మొలకనగవు వలచి యొకడు ముద్దుమోము జూచియొకడు
తళుకు చెక్కు లరసియొకడు కులుకుగుబ్బలించి యొకడు
మారు బారి కోర్వలేక మారుమాట లాడిగి దనుజు
లూరకుండి రమరవరుల కొసగె నమృత మెల్ల నతివ
ఆ వెలంది వైఖరులకు నసురవరులు వలచు చెంత
భావజారి నీవు గన్న భ్రమసిపోదు వింతయేల?

(3) రచ్చరేకులు (రచ్చతాళము ?)

మించు మోహము నించు మది దమకించు లేమదలంచు నలుగురి
గాంచు తరిగాదంచు తమి మరలించు దల యిటు వంచుచు. 1
పేరువిను తమి జీరు సన్నపు జాఱు పయ్యెద మీఱు గుబ్బల
తీరుగను పలుమారు తన కొనగోరు మోపగ గోరుచున్. 2
రంగుమీఱుమెఱుంగు మేని తెరంగు నడల బెడంగు బొగడ దో
డం గోగిర (?) తరంగు వెతల గఱంగ తాల్మి దొఱంగుచున్, 3

(4) త్రిభస్తకము (స్తబకము?)

వింటినీ [మా?] యలొంటినీ బాలగంటీ నీవేళనో లాలా
వెన్నెలతోడ పొన్నల నీడ సన్నలగూడదో లాలా
వేడుకకైన వేడుకచాన గూడక మాననో లాలా.

ఇవి గాక అష్టకము, చూర్ణిక, మంగళము, లయగ్రాహి, వసంతతిలక, శోభన మున్నగు రచనము లిందు గలవు. మఱియు కుఱుచ జంపె, జంపె, త్రిపుట మొదలైన రగడవికారములు సుగ్రీవవిజయమువలె నిందు రాగనిర్ణీతములు గాక యున్నను, పదములు దఱచు రాగములతో జోడింపబడియున్నవి. కొన్నియెడల గేయములు నామతాళరహితములై యున్నవి. ఇందు వచ్చునవి ఆహిరిఘంటారవము, నాదనామక్రియ, నీలాంబరి, పంతువరాళి, మధ్యమావతి, రేవగుప్తి మున్నగు రాగములు. ఈయంశముల నన్నింటిని సమాలోచనజేసి చూడ సుగ్రీవ విజయముకంటె దీని రచనయందు సవీనత గాన వచ్చుచున్నదని తెల్లము కాగలదు. అక్కనామాత్య కృత కృష్ణవిలాస భీమసేన విజయము

లందును, వెంకటాద్రి విరచిత వాసంతికా పరిణయమందును, త్రిపుట, జంపె, లఘుశేఖరము మున్నగునవి గానవచ్చుచుండుటచే నవియు విష్ణుమాయా విలాసము వంటి నాటకము లైయుండునని తోచుచున్నది.

ఈ నవీనత యెట్లు కల్గినది? కాలక్రమమున స్వతస్సిద్ధమై కల్గియుండ వచ్చును. ఇందసంభవమేమియు లేదు: అన్యసంసర్గము వల్ల చేకూరియుండ వచ్చును. చారిత్రకదృష్టితో బరిశీలించిచూడ నీ నవీనత్వము దాక్షిణాత్యాంధ్రుల పొత్తువలన గల్గినట్లు వ్యక్తముకాగలదు. మొట్టమొదట యక్షగానరచనా పద్ధతి మార్పునందసాగినది తంజాపురమందు; ఈమార్పునకు గారణభూతుడు తంజా వూరి విజయ రాఘవనాయకుడు. విజయరాఘవుని పట్టాభిషేకముతో యక్షగాన చరిత్రయం దొక నూతన దశ ప్రారంభ మాయెనని పూర్వప్రకరణమున వక్కా ణించియున్నాను. అతడు కవిమాత్రుడు గాడు. సంస్కృతాంధ్రముల జక్కగ నెఱింగిన విద్వాంసుడు. ముఖ్యసంస్కృతనాటక లక్షణముల జక్కగ నవగాహము జేసికొన్నవాడు. స్వతంత్రాభిమాని. కావున యక్షగానరచనకు బూనుకొన్నప్పుడు పూర్వరచనా విధానమతనికి నచ్చలేదు: అందు కొన్ని మార్పులు గావించుట యుక్తమని తోచినది. ఈ మార్పులు జేయుటయందతనికి సంస్కృతనాటక ములు మార్గదర్శకములైనవి. ఇతని నాటకములన్నియు.

భోజకన్యా ముఖాంభోజరాజమరాళ సత్యాఘనస్తన స్తబకభృంగ
జాంబవతీ విలోచన చకోర శశాంక మిత్రవింధా తటి స్మేఘరూప
భద్రావశావళ భద్రదంతావళ వరసుదంతా మనోవనమృగేంద్ర
లక్ష్మణారూప కలాపినీపర్జన్య భానుసుతాలతా పారిజాత
షోడశస్త్రీసహస్ర చక్షుః ప్రసార హారసార మసార మోహనశరీర
విజయరాఘవ భూపాల భజనలోల కేలమోడ్చెద రాజగోపాల నీకు.

అను సీసపద్యముతో ప్రారంభమగును. ఇందు విశేషమైన మార్పేమియు లేదు. సుగ్రీవ విజయమును ఇట్లే దేవతా స్తోత్రముతో ప్రారంభమైనది. కాని యందు కవి నామములేదు. ఇందు కలదు. మఱియు సుగ్రీవవిజయమును గవీశ్వరుడే కృతిపతిని కొనియాడి షష్యంతములు జెప్పి తాను రచియించు యక్షగానమునకు గథాక్రమము వివరింపగడగినాడు ఇది ప్రబంధ పద్ధతి, యక్ష

గాన పద్ధతిగాదు. విజయరాఘవుని కిది నచ్చలేదు. కావున నతడు దేవతాస్తోత్ర మునకు దరువాత కైవారమును జొప్పించినాడు: "రాజగోపాల చరణారవింద భజనానందసాంద్ర. రఘునాథనాయక రత్నాకరావతీర్ణసంపూర్ణపూర్ణిమచంద్ర. పాండ్యతుండీకాదివైరి గజకంఠీరవకిశోర. కణావత్యంబికాకుమార. చంద్రో పేంద్ర సురేంద్రనందన కందర్పకోటి సౌందర్యధుర్య. జీర్ణకర్ణాటక సామ్రాజ్య సింహాసనస్థాపనాచార్య. సమరసమ యాచరిత సమస్త నిస్తుల తులాపురుషాది మహాదానాపదానప్రవర్తిత కీర్తిధౌరేయ. సంగరరంగగాంగేయ. ప్రతిదిన బహు సహస్ర బ్రాహ్మణాభీష్ట మృష్టాన్న దాన దీక్షాధురీణ. మానినీనూతన పంచబాణ. విశ్వవిశ్వంభరాభరణ విచక్షణ దక్షిణభుజాదండ. శాశ్వతైశ్వర్య ధౌరంధర మేరుకోదండ. దక్షిణ సింహాసన పట్టభద్ర. కలియుగ రామభద్ర. చతుర్విధ కవితావిద్వాహక సార్వభౌమ బిరుదాంగదవి రాజమానచరణాంభోజ. కవి సమాజ భోజ. జనక చరణ రాజీవ సేవావిధాయక. విజయరాఘవనాయక. పరాకు! స్వామివారు హావణించిన విప్రనారాయణచరిత్రంబను విచిత్రనాటకంబు నటనపటిమ గనుపించ వినుపించేము. విన నవధరించవయ్యా! పరాకు! స్వామీ. పరాకు."

ఇట్టికైవారమునే విజయరాఘవుని యాస్థానమునవెలసిన రంగాజీ.పురుషో త్తమ దీక్షిత. కోనేటి దీక్షితులును. మధుర చొక్కనాథనాయని యాశ్రితుడైన తిరుమల కవియు, శహాజీయాస్థానమం దుండిన నాటకక ర్తలు కొందఱుస్వీకరించి నారు. కాని, కామర్సు వెంకటాద్రి పాతక్రొత్త పద్ధతులను రెంటిని సమ్మేళనము జేసినాడు, మన్నారు దేవుడు పాతమార్గమునే అనుసరించినాడు. మరియు విజయరాఘవుడు గొన్ని నాటకముల చివరను భరత వాక్యము జేర్చెను. పూతనాహరణముకడపట, భరత వాక్య మిమ్ము గలదు.

"ఇవ్విధంబున పూతనాభంజనంబు జేసిన సనాతన దేవతా చక్రవర్తి రాజగోపాలమూర్తి, అచ్యుత విజయ రాఘవేంద్రున కాచంద్రతారార్కంబుగా విశ్వవిశ్వంభరాధిపత్య నిత్యాయురారోగ్య భాగ్యంబులు పాలించి రక్షింతుగాత."

విజయరాఘవుని మార్గమునే బహుళముగ తంజావూరి నాటక కర్తలను సరించి తమ నాటకములను భరత వాక్యముతో ముగింపగడగిరి. భరత వాక్య రచన సంస్కృత నాటక సంప్రదాయము. కైవారముగూడ నట్టిదే. కైవారము

సంస్కృత నాటకములలోని నాంది ప్రస్తావనలకు దుల్యము. విజయరాఘవుని తరువాత మహారాష్ట్రరాజు లీ రహస్యమును గుర్తించి కైవారమును విసర్జించి దాని స్థానమున నాంది ప్రస్తావనల నవలంబించిరి. శాహరాజును నతని యాస్థి తులైననాటక కర్తలు కొందఱును సూత్రధారుని ప్రవేశపెట్టిరి. శాహరాజవిర చిత పార్వతీ పరిణయ ప్రారంభమున.

'సూత్రధారి ॥వ॥ అవురా ఈ విధంబున మరిన్నే విధాన నంటేను.'

'సకలవిద్యా విలాసములచే రంజిల్లు
శాహభూపాలుని సన్నుతించి
అతని సభాసీమ నమరు ధీరుల చతు
ర్వేద వేదాంతాది విదుల బొగడి
అందు నానందించు ననవద్య సాహిత్య
వరుల మహా కవీశ్వరుల వేడి
సంగీత భరతశాస్త్ర కళాధురీణుల
నేర్పుల మది నెంచి యేర్పరించి
ఆ మహారాజు పరమేశ్వరాంకితముగ
పరగజేసిన పార్వతీ పరిణయాఖ్య
మనెడు నాటకమారాజు ననుమతమున
వేష భాషాదియుతముగా విస్తరింతు.

'వ. అన్నండు గనక, అవురా యీ విధంబున అభీష్టదేవతా వంద నంబు గావించి సభానాయకాదులను అభివర్ణించి శ్రీ శాహ మహారాజ ప్రణీతం బైన పార్వతీకల్యాణం బనియెడు నాటకంబు కథా సంవిధానంబుగా వినుపించె దము విన నవధరించరయ్యా'

అని పై యక్షగాన ప్రదర్శనమును సంస్కృత నాటకములవలె సభా సదుల కెఱుకపఱచినాడు. కొన్ని నాటకముల కడపటగూడ సూత్రధారుడు నాటక ప్రదర్శన సమాప్తిని దెలియజేయుట కలదు. శాహరాజు విఘ్నేశ్వర కల్యాణ నాటకాంతమున "సూత్రధారుని వచనము" సంస్కృతమునందిట్లున్నది.

"శ్రీమదోళసలకుల శాహమహారాజవిరచితం విఘ్నేశ్వర కల్యాణ నాటకం.

సకల విద్వజ్జనప్రీతయే శ్రీ తాగేశ సాంబశివార్పణ్యమస్తు"

శాహరాజానంతరము యక్షగాన రచనకు బూనుకొన్న కవులంతటితో దృప్తిజెందియుండలేదు. తుళజరాజు సూత్రధారునితో గూడ పారిపార్శ్వకుని రంగస్థలమునకు దెచ్చెను. శివకామసుందరీ పరిణయారంభమున నాంది ప్రస్తావనలు సంస్కృత సంప్రదాయము ననుసరించి రచింపబడినవి.

"నాంద్యంతే సూత్రధారః
'సూ॥ వసంతఋతు వర్ణన'
విలసిత కిసలయసమసుమ
ఫల పరిమళ శోభితములు భావజచాపో
జ్వలగుణ శుకపికముఖరవ
మలయానిల భాసురములు మధువాసరముల్.

వ. ఓరీ, పారిపార్శ్వక, యిటువంటి మధుమాసమందు భోసలకుల కలశాంభోధి పూర్ణచంద్రు మాళోజీరాజపురందరనందన సాహసాంక శాహమరాజ తనూజ భామామనోజ్ఞైక మహారాజ కుమార శాహమహారాజ శరభ భూపాలానుజుండగు, తుళజవసుంధరా పురందరుండు ఆదివరాహస్వామికి మహోత్సవంబు గావింపగోరి సకల దేశములయందుండి రసికవిద్వజ్జనులు వచ్చినారోయి.

సురుచిర పుణ్యశీలు లనసూయులు సర్వకళావిదుల్ దయా
పరులు కృతజ్ఞు లుత్తములు పావను లీ సభవారు మెచ్చ భా
సురతుళజక్షితీశకృత దమన శివకామసుందరీ
పరిణయరూప నాటకము బాగుగ నాడుద మీ సభాస్థలిన్"

సూత్రధార పారిపార్శ్వకుల సంభాషణ శివాజీ మహారాజ కృత అన్నపూర్ణాపరిణయ నాటకమున మటింత విశదముగ వర్ణింపబడియున్నది.

"సూ. వ. ఇటువంటి పట్టణంబునందు సకల విద్యా ప్రవీణులయిన సభ్యులు గూడియున్నారు గనుక యీ సభ కుచితంబైన అన్నపూర్ణా పరిణయం

బను, నూతన నాటకంబు నటియింపజేసి ఆత్మను కృతార్థత జెందవలెనని యిచ్ఛయిస్తున్నాను.''

పా. ఎవరయ్యా యీ దివ్య ప్రబంధ నిర్మాత ?

సూ—క. వివిధాలంకృతి గలిగియు
భువిజనులను ప్రేమబ్రోచు పుణ్యాత్మకుడై
అవిరళదాన ఘనుండై
కవినుతుడు శివాజిరాజు ఘన సద్గుణుడై.

పా—సకల కళా ప్రవీణుండైన శ్రీ శివాజీ రాజేంద్రుడా యీ గ్రంథ నిర్మాత? అయితే మన మనో రథంబు లన్నియు సఫలమగును. అతని గుణాతిశయములను వినవలెనని యిచ్ఛయిస్తున్నాను.

సూ—చెప్పెద వినుము.''

అన్నపూర్ణా పరిణయమున మఱియొక విశేషము గానవచ్చుచున్నది.అన్ని యక్షగానములవలెను నిది యేకాండమైన నాటకము గాదు. ఇందు రెండాశ్వాసములుగలవు.

'ఇతి శ్రీమత్కోసలకుల కలశాంబునిధి పూర్ణశశాంక భూమండలాఖండల శ్రీ శివాజీ మహారాజ ఛత్రపతి నృపవరవిరచిత అన్నపూర్ణా పరిణయంబను ఆంధ్ర నాటకమునందు ద్వితీయాశ్వాసము.'

అని తెనుగు సంప్రదాయానుసారము గద్య విరచింపబడినను నీయాశ్వాసముల నంకము లనియె చెప్పెడివారు.

ఉ. "7. అన్నపూర్ణాపరిణయము తంజపురమున నుండు కొంకణేశ్వర అన్నపూర్ణల పూర్వోదంతము. వారి పరిణయము అనునది యీ నాటకమున జెప్పబడును, 1_2 అంకములు.'' అని పుస్తక భాండాగారికుల వివరణ. అంక విభజనమును బ్రథమమున బ్రవేశపెట్టిన వాడు శివాజీ రాజుగాడు. అతనికి ముందుతరమువాడైన మాత్భూతన తన పారిజాతాపహరణము నైదంకములుగ విభజించియున్నాడు.

"ఇది...శ్రీ మత్సుగంధికుంతలేశ్వర కటాక్షవీక్షణ సుధాసార సంజనిత చతుర్విధకవితా నిర్వాహక శాండిల్య గోత్రపవిత్ర కవిరంగ యార్యపుత్ర విద్వజ్జన విధేయ మాతృభూత కవినామధేయ ప్రణీతంబైన పారిజాతాపహరణ నాటకమందు... సర్వంబును పంచమాంకము."

అని స్పష్టముగ జెప్పినాడు. దీని కనుగుణముగనె పుస్తక భాండాకారికులు 'పారిజాతాపహరణ నాటకము 1-5 అంకములు' అని వివరణము వ్రాసియున్నారు. విజయరాఘవనాయకుడు చూపిన దారి తంజా పురాంధ్ర యక్షగాన కర్తలు వారి ననుసరించినట్లులేదు. వారు విజయరాఘవుని కైవారముతోడనే తృప్తిజెందినట్లున్నది. ఆంధ్రదేశమందలి యక్షగానములనేకములు "కటిక" లేక 'చోపుదారి' వాని ప్రవేశముతోడనే ప్రారంభమగును. యక్షగాన ప్రదర్శనములను గాంచినవారికి 'కటికవాడు వచ్చెను.' "చోపుదారివాడు వచ్చెను," "నా పేరు డబ్బుడుబ్బు చందమామా నా పెండ్లాంపేరు ముద్దులగుమ్మ చందమామా అను ప్రారంభగీతములు స్మరణకు రాకపోవు 'కటికవా' డన్నను "చోపుదారి' యన్ననుకంచుకి. ఈకంచుకియే కైవారము సేయువాడు. ఆంధ్రదేశ యక్షగాన రచయితలు తంజావూరివారి మార్గము ననుసరింపకపోవుట కొకముఖ్యకారణము గాన్పించుచున్నది. విజయరాఘవుడు తంజావూరు నింకను పాలించుచుండగనే రాయసామ్రాజ్య మస్తంగతమైపోయినది. తరువాత యల్పకాలముననె తంజావూరాంధ్ర నాయకరాజ్యము నాశమందినది. అంతకుముందె జింజి నాయకరాజ్యము తురకలకు హస్తగతమైనది. మధురనాయక రాజ్యము మఱి కొంతకాలమువెలసినను మధురవారికి రాజకీయములందుగల యభిరుచి సారస్వతమునందు లేదు. కావున విజయరాఘవుని యస్తమయముతో నాంధ్రులకు, ముఖ్యముగ కవిగాయకాది కళారాధకులకు, ద్రావిడదేశముతో సంబంధము తెగిపోయినది. రాకపోకలు సంపూర్ణముగ నాగిపోయినవి. కావున ఆంధ్రదేశ నాటకకర్తలకు యక్షగాన రచనయందు మహారాష్ట్ర ప్రభువుల యాజమాన్యముక్రిందసంఘటిల్లినమార్పులు దెలియకపోయెను.

కైవార భరతవాక్యముల స్వీకార మొక్కటి మాత్రమేకాదు యక్షగానమున విజయరాఘవనాయకుడు దెచ్చిపెట్టిన మార్పు. త్రిపుటాది రగడరచనలను బహుళముగ విసర్జించెను. దరువును ప్రవేశపెట్టెను. ఇది కడుముఖ్యమైనది.

తరువాతి యక్షగాన రచనలలో నీ దరు వెంతటి ప్రధానస్థానము నాక్రమించెనో కనుగొంటి మేని యీ మార్పుయొక్క యాధిక్యము విశదము కాగలదు. విజయ రాఘవు డొనర్చిన మార్పులలో ముఖ్యతమమైనది సంభాషణ. సంభాషణ యనగా నాటకపాత్ర లొండొరులతో మాటలాడుకొనుట. పాటకుబదులు పాట, గీతము నకు బదులు గీతమును బాడుటయు సంభాషణ కావచ్చును. కాని సాధారణముగ సంభాషణ యన వాడుకగ జనులాడునట్లు వచనమున పాత్రలు పరస్పరము మాటాడుకొను మాటలను సంభాషణయన యొప్పును. సంభాషణలు సుగ్రీవ విజయమునందుగాని దాని పద్ధతి ననుసరించి రచింపబడిన విష్ణు మాయా విలాస నాటకమునగాని కానరావు. ముందు రచన వివరణ లేక పాత్రలు గీతముల బాడరు. ఒక యుదాహరణము.

"అని పలికి తన యెదుర నున్న సుగ్రీవునిం జూచి తార యేమను చున్నది.

"భానువంశజుడు నీపాలిటిదైవమై
వానరేశ్వరు జంపె వర్ధిల్లు మికను
ఏపాటి పౌరుషము హెచ్చెనిందుల నీకు
బాపమని మదిలోన బరికింపవైతి
నీ కోరినట్లయ్యె నీ తపం బీడేరె
గైకొనియేలు మీ కపిరాజ్యమెల్లన్."

"అని సుగ్రీవునిం దూఱి రామచంద్రుని గనుంగొని యేమనుచున్నది."

"ఆలిచెఱగొనిపోయినట్టి దశాస్యు డుండగ
నిర్మిత్తము వాలి నేటికి జంపితిని రఘువంశతిలకా"

x x x x

'అని పలుకుసమయంబున వాలి మూర్ఛం దెలిసె నప్పుడు తన సమీపం బున శోకబాష్పకలిత నేత్రిండయి తల వంచుకొనియున్న సుగ్రీవునిం జూచి యేమనుచున్నాడు.

'వగ పేల సుగ్రీవ వైరమెల్లనుదీఱె
జగమెఱుంగగ రామచంద్రునిచే నిపుడు.'

ఇది ప్రాచీన యక్షగాన పద్ధతి. పాత్రల కొండొరులతో వివరణ బితికలేని సంభాషణయే లేదు. నాటక ప్రదర్శనము జూచు ప్రేక్షకులకు అడుగడుగునకు నాటకకర్తగాని ప్రదర్శకులలో నొకడుగాని కథను వివరించవలసియుండెను. విజయరాఘవునకిదిగిట్టలేదు. ఈ ద్రావిడ ప్రాణాయామమును విసర్జించి పాత్రల నొండొరులతో ముఖాముఖి సంభాషింపజేసినాడు. విప్రనారాయణ చరిత్రలో నక్క సెల్లెండ్ర సంభాషణం జూడుడు.

పదం- మధ్యమావతి- ఆటతాళం

చెల్లె: పండెము జెల్లెగదే, ఓయక్క, పండెము జెల్లెగదే.

అక్క: వీని కందుమాటల కరగించినపుడె నీ పండెము జెల్లెనే బంగారు చెల్లె.

చెల్లె: వలపించరావంటివే, ఓయక్క, వలపించరాదంటివే

అక్క: (ఆ) వలరాజునైను వలపించ నేర్తువె, చెలియ కలియుగ రంభవుకావా నీవు.

చెల్లె: నీ చిత్తమువచ్చునా, ఓయక్క, నీ చిత్తము వచ్చునా.

అక్క: నీ చెల్వుజూచిన నిలువున కరగరె ఓ చెల్ల, భూసుర ఖేచరులైనా.

పాటలయందేకాదు, సాధారణముగ జనులాడు రీతి వచనమునను సమకూర్చినా డిట్టి సంభాషణను, చూడుడు.

దేవదేవి: ఓ పరమయోగీంద్రా, మాయక్కతనుజూడ బిలువ నంపినది. ఊరిదాక పోయి వచ్చేనయ్యా.

విప్ర: ఓవాలుగంటీ నీ జంట బాసి యొంటి నుండ నేర్తునా? నీ వెంట వచ్చేనే.

దేవదేవి: అయితే విచ్చేయవయ్యా.

ఈ సంభాషణను సంస్కృత నాటక సంప్రదాయమునను సరించి పాత్రోచితభాషయందు నడపించినాడు. రఘునాథాభ్యుదయములో సంప్రతికరణముల సంభాషణమును వినుడు.

"కస్తూరిమాడ : ఏనయ్య రంగయ్య ధర్మాసన మొదలాద లెక్కస ముఖదల్లి హేళిదెల్ల తాఱు వెలి. ఆవరవరుహిడి దలంచపరిఛానవహేళ బేడాయందు నినగె అవరవరు ప్రియహేళీద్దు. నానరియనే.

అట్టవణ రంగయ్య : నీ నేను బల్లెయయ్య అంథాద్దు ఉంటాదరె రూపిసు. యేనుబగు ళు తిద్ధియ.

చిదంబరనాథ మొదలారి : సముఖ తిలె నింగళేన్ అడచ్చి పడ్రీర్. ఎల్లాం కరాగళ్ చిత. అరియుం. సుమ్మాయిరుంగో.'

విజయరాఘవుని సహధర్మచారిణీనని చెప్పుకొన్న రంగాజమ్మ భర్తనుగమించుట సహజమే, కాని యామెభర్తను గ్రిందుపఱచినది. అతనివలె కేవల పాత్రోచిత సంభాషణతో దృప్తినందక దానితో హాస్యరసమును మేళవించినది. సంగ్రహముగ నుదహరించినను దాని రీతి తెలియగలదు.

గొల్లల చేరువకాడైన మల్లుగాడు : 'అదొంద్రా వాకిట' సంద్దడి, మిణమిణా యెంది. మరమరా యెంది, మిరమిరా యెంద్ది, వెయి వెయరా వోరి, వొరె వొరె చిన్నమల్లుగ, వొరెవొరె పాప. వొరె వొరె చిననూక వొరెవొరె పెదబొమ్మ, వొరెవొరె చినబొమ్మ యీడ కూశికాండే వాండు తవురొ అంట్టావుంట్టే నువ్వా : వొరెవొరె కూడుదినవస్తి వంట్టరా, కూరా కేమిరా ?

మఱొక గొల్లమాట : వొరె కూరాకె అల్ల బాంపనవాండు సొరకాయ గానుగ బిండిన్ని యిచ్చరా.

మొదటిగొల్ల ఆడిగేది : వొరెయే బాంపనవాండ్రా.

మఱొక గొల్లమాట : వొరె ఆ బక్క లావాటివాండు, పొట్టి పొడుగాటి వాండు, వొక కన్ను పూనం వొక కన్ను తెలియదు. చెవిటి

వాండు, కాలు కుంట్టుతా వచ్చునే నిమ్మపండువలె నల్లని బాంపండు వాండు.

సంభాషణమువలన యక్ష గానమున జడిమ తొలగి చైతన్యముగలిగి నది. వాస్తవికత యేర్పడినది, నాట్యగేయ ప్రధానమైన యక్షగానము నాటక ముగ పరిణామ మందినది. సంగీత నాట్యశాస్త్ర వేత్తలకే కాక జనసామాన్యము నకు గూడ గ్రాహ్యమగుటవలన నెల్లవారి యాదరాభిమానములకు పాత్రమై నది. ఇది విజయరాఘవుని సంస్కారములకు ఫలితముగ యక్షగానములకు గలి గినమేలు. ఇతని సంస్కారములనేకములు తంజావూరునను నాంధ్రదేశమువను నాటక రచనకు బూనుకొనిన యర్వాచీన నాటకకర్తలచే పాటింపబడినవి.

యక్షగాన రచనావిధానము విజయరాఘవుని మార్పులతో సంపూర్ణత నంది యట్లె సుస్థిరమై నిలిచిపోలేదు. అన్యసంపర్కమువలన కొత్తరీతులు జనానురాగమును బొందినవి. క్రొత్త రచనములు బయలువెడలినవి. కాని యీ మార్పుల నన్నిటిని బరిశీలించి సమగ్రమైనయక్షగాన చరిత్రను రచించు టకు సరియైనకాలమింక నాసన్నముగాలేదు. ప్రాచీన యక్షగానము లన్నియు ముద్రణభాగ్య మందక పుస్తక భాండాగారములందు క్రిమిదష్టములై కృమి క్రమముగ వశించుచున్నవి. ముద్రితములైనవి గూడ నముద్రితప్రాయములై యంతర్ధానమై పోయినవి. సినిమాయుగమున నాటకములకే యవసానదశ వచ్చినదట. యక్షగానముమాట వేఱుగ చెప్పవలయునా? కళాభిమానుల యత్నమువలన యక్షగానములన్నియు ముద్రితములై పరిశోధకుల యందు బాటుకు వచ్చినగాని వాని సంపూర్ణ చరిత్ర వ్రాయుటకు సాధ్యముకాదు.

17వ శతాబ్దినాటి ఆంధ్ర వాఙ్మయ

విశేషాలు*

కదిరీపతి క్రీ. శ. 17వ శతాబ్దము వాఁడని నిశ్చయించితిని. కవిత్వమున నితఁడు వాస్తవికుఁడు. జీవితమున స్వానుభవమున కెక్కిన విషయములను కవిత్వమున గుఱచి కావ్యరూపమునఁబ్రచురించుట ఇతనికి వచ్చిన పద్ధతి. ఇతఁడు సహస్రాక్షుఁడు. సమకాలిక జానపద జీవనమున నితనికంటఁబడని విషయము లరుదు. గోచరమైన విషయమును హృదయ కవిలీయనెక్కించి సందర్భానుసారము గ్రంథస్థము సేయక విడిచిపెట్టుట యితని మార్గముగాదు. మఱియు కవితాప్రపంచమున నూతన వీథుల నడచుట యితనికి కరము ప్రియము. కావున కావ్యరచనయందు సమకాలిక సాహిత్యపదతుల ననుసరించెను. 17వ శతాబ్దమున జనాదరమునందిన సారస్వతోద్యమచ్ఛాయలనేకములు ముకసప్తతియందు పొటగట్టుచున్నవి. కాన కదిరీపతి కళాకౌశల్యమును బరామర్శించుటకు ముందు 17వ శతాబ్దవాఙ్మయ స్థితి నించుక తెలిసికొనుట యుక్తము.

ఆంధ్రవాఙ్మయ చరిత్రమున 17వ శతాబ్దమొక మహాయుగము; కల్పనావైభవమున 16వ శతాబ్దమున కీడుకాకపోవచ్చు; కవితా విశేషమునను గావ్యరచనా బాహుళ్యమునను, వర్ణనాకౌశల్యమునను, కథా సంవిధాన చాతుర్యమునను దాని నధఃకరించినది. ఆముక్త, కళాపూర్ణల వంటి కావ్యములు కానరాకపోవచ్చు; మనువసువులకుఁ దుల్యమైనవి లేక పోలేదు. పదునాఱవ శతాబ్దమునందాంధ్ర వాఙ్మయ మేకముఖముగఁ బెరిగినది; పదునేడున బహుముఖములఁబఱిగినది. పదునాఱున నాంధ్రవాణి జన్మభూమియందే వర్ధిల్లినది; పదునేడున ద్రావిడకర్ణాటకముల నెలకొని తోడిభాషల పొత్తున సంస్కారమును బొంది నూతన గుణముల నలవఱచు కొనినది.

---

*కదిరీపతిని గురించిన వ్యాసావళిలో ఇది రెండవది.

సారస్వతపీఠములు :— రక్షసతంగడి మహాసంగ్రామ మాంధ్రదేశ చరిత్రయందేకాక వాఙ్మయ చరిత్రయందు కూడ నొక విషమఘట్టము. తత్పూర్వ మాంధ్రవాఙ్మ కచటనచట నునికిపట్లుండినను విద్యానగరము కేంద్రస్థానమై యుండెను. కవి యెచటి వాడైనను ఎవ్వరి యాశ్రయమున నభివృద్ధికి వచ్చినను రాయల మన్నన బడయఁజాలక పోయిన నతనికి సరివారిలో గణ్యత తక్కువగఁదోఁచెడిది; కావున నాంధ్రదేశము నాలుగు చెఱఁగులనుండియుఁ గవిత్వము పెప్పనేర్చిన వారందరును విద్యానగర మార్గమును బట్టెడు వారు. విద్యానగరము వినాశమైన పిమ్మట రాయల యాధిక్యము దగ్గెను; రాయపీఠ మొక తావున నిలుకడగనుండక కాలానుగుణముగ ఒక చోటనుండి మఱియొక చోటికి మారవలసి వచ్చెను; మొదట పెనుగొండ, తరువాత చంద్రగిరి, కడపట రాయవేలూరు రాయలకునికి పట్టులాయెను; తురకల యుపద్రవముల వల్ల యుద్ధము సామాన్యమాయెను; స్వార్థపరులైన నాయకుల యడావిడి యధిక మగుటచే రాయల యధికారము నిర్వక్రముగ సాగలేక దేశమున శాంతి సంపూర్ణముగ చెడెను; దీనిఁకి దోడు రాయకుటుంబములోని యంతఃకలహముల మూలమున ప్రభుత్వస్థితి దీనావస్థకు వచ్చినది. ఇకరాయ సంస్థానమున సారస్వతాదరణకును, గళాపోషణకును నవకాశమెక్కడిది ?

దేశకాలపరిస్థితు లిట్లు విషమదశకు వచ్చినను వాఙ్మయము క్షీణించలేదు; మునుపటికంటె నధికతరముగ నభివృద్ధినందినది. దీనికి ప్రధానకారణము సర్వత్ర వెల్లివిరిసిన భాషానురక్తియే. దేశాధిపతులు, పాళెగాండ్రు, ధనికులు, పర్తకులు, విద్యాధికులు మొదలగువారందఱును భాషాపోషణకుఁదలకొనిరి. వాఙ్మయాభిమానముగల విద్యాధికులు ప్రతిఫలాపేక్ష లేకయే గ్రంథరచనకును గవిపండిత పోషణకును బూనుకొనిరి. వీరి సంఖ్యయల్పము. కీర్తిలాలసత యనేకులఁబురికొల్పెను. విద్యారణ్యస్వామిచే హంపీవిరూపాక్షమున రాయపీఠము నెలకొల్పఁ బడినప్పటినుండియు భాషాపోషణము, గళాపోషణము, గళాభరక్ష ణము రాయల సహజధర్మములుగఁ బరిగణింపఁబడుచు వచ్చిన కారణమునఁ గాలక్రమమున గవిగాయక పాఠక చిత్రకార నటనటీజనసంరక్ష ణ రాజుల విర్ణీత కృత్యములయందొకటి యను నభిప్రాయము గలిగెను. విద్యాపోషణము సేయని ప్రభువు రాజపదమునకు సంపూర్ణముగ నర్హుఁడు గాఁడనియు, కవిగాయక నర్తకాది కళాభిజ్ఞులకుఁదావులేని సంస్థానము సంస్థానముగాదనియు, నోలగ

మోలగము గాదనియు నప్పటివారి తలఁపు. రాయ రాజ్యము క్షీణమైపోవు కాలమున ప్రభుత్వాపేక్షఁ గలిగి రాజపదమును బొందఁగోరిన ప్రతిపాళెగాఁడును రాయలవలె యథాశక్తి కవులనాదరించి కావ్యరచనకుఁబురికొల్పి వారిమూలమునఁ దనశౌర్యమును, వదాన్యతను లోకమున బ్రకటింపించు కొనెడివాడు. కావున పేరుగల పాళెగాండ్రెల్ల భాషాపోషకులైరి. వారి కోటలు సారస్వత నిలయము లాయెను.

విషయాసక్తి కొందటిని భాషాపోషణకుఁ బ్రేరేపించినది. అది శృంగార యుగము; భోగమప్పటి యాంధ్రులకుఁ బరమావధియైనది; స్త్రీ లౌల్యము సర్వసామాన్యము; బహుకళత్రగ్రహణమును, వేశ్యాంగనాగమనమును సిరిగలవారి లక్షణములు; కేవలాంగ భోగములతోఁ దృప్తినందియుండక ధనవంతులగు రసికవతంసులు స్త్రీల సర్వాంగములనే కాక స్త్రీ పురుషుల పరస్పర సంబంధ వర్తనలకుఁ జెందిన బయలు పెట్టరాని మర్మాంశములను గూడ నాయికా నాయకుల వ్యాజమున పలువిధముల వర్ణింపించి యానందించెడివారు. పదునేడవ శతాబ్దాంధ్రవాఙ్మయమునఁ బెను కళంకనఁదగు నీతి బాహ్యములైన పచ్చి శృంగారకావ్యముల యుత్పత్తికిఁ గారకులు వీరే. మతాభినివేశమును, భక్తియు మఱికొందటి వాఙ్మయ పోషణకును, గావ్యరచనకును గారణ భూతములు. ఏకారణముచేనైన నేమి? విద్యాభిమానము రాజకీయ స్వాతంత్ర్యముతో పాటు నశింపక తామరతంపరయై యభివృద్ధిజెందెను. విద్యానగరము నామమాత్రావశిష్టమై పోయినను నూతన విద్యాస్థానములు బలుతావుల నెలకొనెను. ముఖ్యమైనవానిని మూఁడు నాల్గింటి నిటఁ బేర్కొనుట యుక్తము.

మొదట నెన్నఁదగినది రాయలసీమలోని మప్లి వారి సంస్థానము. వీరు తెలుఁగు చోడ కుటుంబమునకుఁ జెందిన సూర్యవంశక్షత్రియులు. వీరియునికి పట్టు ఇప్పటి కడపమండలములోని సిద్ధవటము. తెనుఁగు చోడు లాంధ్ర సరస్వతికి బట్టుగొమ్మలు. పెక్కుకవులీవంశమున జనించి యుత్తమగ్రంథములను రచించిరి. కవులనాదరించి పోషించి భాషను పెంపొందించుట ఈ వంశము సహజధర్మము. మట్లివారింట నీయుగమున నలుగురు పేర్కొనఁ దగినవారు గలరు. మొదటివాఁడు మట్లి అనంతరాజు. ఇతడు గ్రంథకర్త. రెండవవాఁడితనితమ్ముఁడు కోనమరాజు; ఇతఁడు కవియే కాని గ్రంథకర్త గాఁడు.

మూఁడవవాఁడు అనంతరాజుమనుమడగు కుమారానంతరాజు; ఇతఁడు కావ్య కర్త. నాలవవాఁడు వీరివంశజుడు వెంకట్రామరాజు. ఇతఁడు కృతిపతియు. భాషాపోషకుఁడును. మట్లివారి సంస్థానమునందు కవులనేకులు వర్ధిల్లిరి. వీరి యందు నడిమింటి వెంకటాచలపతి సుప్రసిద్ధుఁడు.

అన్నిటికిని మించినది ప్రాచీన చోళసామ్రాజ్యమునకు రాజధానియైన తంజావూరు. ఇట నాంధ్రనాయక రాజ్యము క్రీ. శ. 16వ శతాబ్ది పూర్వార్ధమునం దచ్యుతదేవరాయల కాలమున స్థాపింపఁబడినది. కాని 17వ శతాబ్దారంభము వఱకును దీనికంతటి ప్రసిద్ధి కలుగలేదు. తంజాపురవైభవము రఘునాథ నాయకుని రాజ్యభిషేకముతోఁ బ్రారంభమైనదని చెప్పవచ్చును. ఇతఁడు విద్వాంసుడు. ఆంధ్ర గీర్వాణములందు రసవంతమైన కవనమల్లగల నేర్పరి; గానవిద్యావిశారదుడు; కవిపండిత కళాభిజ్ఞ పోషణయందు కృష్ణరాయలకుఁ దుల్యుడు. ఇతనిసభా భవనము శారదాదేవి సదస్సు. గోవింద దీక్షిత యజ్ఞ నారాయణ దీక్షితాది సుప్రసిద్ధ పండితవర్గమును, చేమకూర వెంకటకవి వంటి కవిశ్రేష్ఠులును నీతనియాస్థానమున మనిరి. రఘునాథుని వంటి యశస్సును బొందఁజాలక పోయినను నతని కుమారుఁడు విజయరాఘవనాయఁడు తండ్రి వలె విద్యాభిమానము జూపి కళలనాదరించి తంజాపురమును దాక్షిణాత్య హిందూనాగరకతకు రాజధానిగావించెను. ద్రావిడదేశమున నాంధ్రుల ప్రభుత్వము సమసిపోయిన పిమ్మట నటుతరువాత నా దేశమును పాలించిన మహారాష్ట్రప్రభువులు గూడ నాంధ్రభాషను పోషించి యాభాషయందు స్వయము గ్రంథములను రచించుట జూడ నీయాంధ్రనాయకరాజుల మాతృభాష సేవా విశేషము కొంతవఱకు బోధ కాగలదు.

తంజాపురమున వెల్లివిరిసిన యాంధ్రభాషాభిమానము దక్షిణమున పుదుకోటవఱకు వ్యాపించినది పుదుకోట తొండమాను ప్రభువుల కాటపట్టు. వీరు జాతిచే నాంధ్రులు గాకపోయినను భ్రమరకీట న్యాయమునఁ దంజాపురాంధ్ర నాయకులతోడి సంపర్కమువలన నాంధ్రసంస్కృతిని స్వీకరించి యాంధ్రత్వము నలవఱచుకొనిరి. తంజనగరమువలె తమరాజధానియు శారదానిలయము గావలయునని వారియుద్దేశము. ఆంధ్రవాఙ్మయమున దొండమాన రఘునాథ నాయకుని స్థానము సుస్థిరమైనది. ఇతఁడును తంజాపుర రఘునాథ విజయ

రాఘవ నాయకులవలె తెనుఁగున గవనము సెప్ప నేర్చినవాఁడు. మఱియుఁదన యాస్థానమువకు గీర్వాణాంధ్ర పండితులను. గాంధర్వవిద్వాంసులను గాయక నర్తకాది కళాకుశలారను రప్పించి వారిగాసవాసాదులకుఁ దగునేర్పాటులను గావించి రక్షించెను. ఇతనియాస్థానమున వెలసినట్టి యాంధ్రికవుల లో ముఖ్యుడు కోట వెంకనార్యుఁడు. ఈ రఘునాథ నాయకునికి కృషికిఁదార్కాణగ పుదుకోట నేటివరకును విద్వాంసులకుఁ బట్టుగొమ్మయై నిలిచియున్నది.

తరువాత దక్షిణాంధ్ర నాయక రాజ్యముల యందన్నిటిందును మధుర బహు బలిష్ఠమైనది. తంజాపుర పుదుకోటల రాజులవలె నిజకవిత్వాతిశయముచేఁ బేరువడసిన ప్రభువెవ్వఁడును మధురయందుఁ గానరాక పోయినను మాతృభాషాభిమానమునందును, కవిజన పోషణమునందును మధురనాయకులు దీసిపోయినవారుకారు; కాని వీరికి విద్యాభిమానము తంజాపుర సంపర్కము వలనఁ గలిగినది; సహజముగఁ గలిగినట్లు తోఁచదు. క్రీ. శ. 1659 మొదలు 1682 వఱకును రాజ్యమొనరించిన చొక్కనాథనాయకుని కాలముననే మధుర యందు ఆంధ్రవిద్యాభిమానము మొదట నంకురించినది. తత్పూర్వము భాషా విషయమున శ్రద్ధచూపిన నాయకప్రభువెవ్వఁడు మధురయందు లేఁడు. చొక్కనాథనాయకుని కాలమున మధుర, తంజాపురములకు విరోధముప్రబలి క్రీ. శ. 1673వ సంవత్సరమున యుద్ధముపొసఁగెను. ఈ యుద్ధమునఁ దంజాపురనాయక రాజ్యము నాశనమై మధురలోఁ గలిసిపోయెను. చొక్కనాథుడు తన సవతి తమ్ముని ముద్దళగిరిని తంజాపురమునకుఁ బాలకునిగ నియమించెను. మధురనాయకులలోఁగవులనాదరించి యాంధ్రభాషను పోషించిన ప్రభువులలో ముద్దళగిరియే మొదటి వాఁడు. ఇతనికి తంజాపురమునసే యాంధ్రసరస్వతి ప్రసన్నురాలాయెను. తంజాపుర విజయము వలన మధురనాయకులకు లభించిన లాభములలో స్థిరముగ వారికి దక్కిన దీయాంధ్రవాణి ప్రసాదమే. 17వ శతాబ్దాంధ్రభాషా చరిత్రయందెన్నఁదగిన మధురప్రభువులలో రాణి మంగమ్మయొక్కతె. ఈమె కవులనాదరించి పోషించలేదు. తుపాకుల యింటివారి ఆడబడుచైనను వారికి సహజమైన భాషాభిమాన మీమెయందు లేశ మేనియుఁ గానరాదు; కాని, చిన వెంగనకవి కపకార మొనర్చి యాతని తిట్టుకవిత్వమునకు గురియాయెను. 'మంగమ్మ దండకము', 'మధురమంగా పుంశ్చలీ విలాసము' అను రెండు గ్రథముల నితఁడామె దుశ్చరిత్రమును వర్ణించెను. ఇందు రెండ

వది వచన కావ్యము; అచటనచట ద్విపదలు గలవు. ఇంతటి పచ్చిబూతుల పుస్తకము మఱియొకటి కానరాదు; కాని యాకాలపుటాచారములను జూపుటకిది యద్దమువంటిది. వ్యవహారభాషయందు విరచితమైనను పుష్టిగలదైలి.

ఇంతవరకును రాజపోషణవలన నభివృద్ధిజెందిన సారస్వత పీఠములలో ముఖ్యమైనవానిని వివరించితిని. కేవల భాషాభిమానము వలనను, కవిత్వము మీఁది యాదరమువలనను బెంపొందిన సారస్వత పీఠ మొకటి కలదు, ఇది నెల్లూరు మండలములోనిది. మోడేగుంట యనుగ్రామము దీనికునికిపట్టు. పుష్పగిరి తిమ్మన దీనికధ్యక్షుడు. ఇతఁడు సామాన్యబ్రాహ్మణ కుటుంబమునఁ బుట్టెను. రాజుగాఁడు; భూస్వామిగాడు ధనికుఁడునుగాఁడు; అసామాన్య కవిత్వధారగలవాడు; ఉదారహృదయుడు; చక్కని కవిత్వము చెప్పి సమకాలికులయందు గణన కెక్కెను; భర్తృహరి శతకత్రయము నాంధ్రీకరించెను; సమీరకుమార విజయమను కావ్యమును నిర్మించెను. తిమ్మన్న తాను కవిత్వము చెప్పుటయేకాక కావ్యరచనా కుతూహలులైనకవులకుఁదోడ్పడి వారిచే గ్రంథములను రచింపించెను. కంకంటి కవుల కీతడు పట్టుగొమ్మ; పాపరాజ విరచితోత్తర రామాయణ విష్ణు మాయావిలాసనాటకముల యందేకాక నృసింహకవికృత విష్ణుమాయావిలాస నాటకము నందును తిమ్మకవి లేఖిని పాల్గొనినది. తేకుమళ్ల రంగశాయి తిమ్మన సహాయమును బొందియే భాగవతము పంద్రెండుస్కంధములను ద్విపదగరచియించెను. మఱియు ధరణీదేవుల శామమంత్రియు నితని తోడ్పాటును బడసియే దశావతారచరిత్రను రచియించెనను నైతిహ్యమును గలదు. కావున తిమ్మనగారి జన్మస్థానము పదునేడవ శతాబ్దమునం దాంధ్రదేశమున ముఖ్యసారస్వత పీఠములలో నొక్కటియై ప్రసిద్ధినందెను.

కవులకును, విద్వాంసులకును స్థిరనిలయములై సారస్వతపీఠము లనిపించుకొన జాలకపోయినను పెక్కుసంస్థానములు కవులకాశ్రయములై, భాషాభివృద్ధికిఁగారణభూతము లాయెను. చిక్కదేవరాయలనాడు మైసూరును, ఇమ్మడి జగదేవరాయలకాలమునఁ జెన్నపట్టణమును, తిమ్మానాయని యేలుబడిక్రింద గండికోటయు, పెదవెంకటపతిరాయల పాలన యందేలూరును, దామెర వెంకటపతి యంకభూపతుల ప్రభుత్వమునఁ బూనమల్లెయు నాంధ్రకవిపుంగవుల కావ్యనిర్మాణమునకుఁ గర్మాగారము లాయెను.

ఇట్లు దక్షిణదేశమున మూఁడు శతాబ్దములుగ నభివృద్ధిజెందుచుండిన రాయసామ్రాజ్యముచిన్నమై, యంతర్గత రాష్ట్రములు వేరుపడి స్వతంత్రసంస్థానములై మారిపోయినను, గోదావరి మొదలు కన్యకుమారి పర్యంత మాంధ్రభాషా సామ్రాజ్యమేర్పడి యాంధ్రకవులకు సంచారభూమి యాయెను. ఈ సందర్భమున నాంధ్ర 'పదకవి' క్షేత్రజ్ఞుఁడు స్మరింపఁదగిన వాఁడు. ఇతని జన్మస్థానము ఇప్పటికి గుంటూరు మండలములోని మొవ్వ యనుగ్రామము; కాని యితనినాదరించి సత్కరించిన ప్రభువులు దక్షిణదేశముననన్నియెడలను గలరు. ఉత్తరమున గోలకొండపాదుశాహ మొదలు దక్షిణమున యెట్టియాపుర సంస్థానాధీశునివఱకును నీతని పదకవితకు మెచ్చి సత్కరించని దొరలేడు. మధుర తిరుమలనాయకుఁడు, తంజాపుర రఘునాథనాయకుఁడు, విజయరాఘవ నాయకుడు తుపాకి కృష్ణప్ప మున్నగువారీతని పదకవితామృతమునుగ్రోలి యమరులైరి. దక్షిణ దేశమంతటనుదిరిగి నానారాజసంస్థానముల యందుఁ దనకవితామహత్వమును బ్రకటించి సత్కారములను బొందిన యాంధ్రకవి యితఁడొక్కడే కాఁడు. అట్టివారనేకులు గలరు. కవులనిగాని, విద్వాంసులనిగాని పేరుగాంచిన వారందఱికిని దక్షిణదేశసంచారమును నానారాజ సందర్శనమును సామాన్యమే. పదునేడవ శతాబ్దాంధ్ర వాఙ్మయ చరిత్రమునందు ముఖ్యముగ పరిగణించదగిన యంశములలో బ్రాహ్మణేతర రచయితల ప్రాబల్యమొకటి. వీరియందు పురుషులును స్త్రీలును గలరు. బ్రాహ్మణేతరుల గ్రంథరచన కిది ప్రథమ ప్రయత్నము గాదు. ఆంధ్రవాఙ్మయచరిత్ర యొక్క ప్రారంభయుగము నుండియు బ్రాహ్మణేతర కవులు కొదా చిత్కముగ గానవచ్చుచున్నను నూటికి తొంబది తొమ్మండ్రు బ్రాహ్మణులే కాని కీ.శ. 16వ శతాబ్దమున నీస్థితి మాఱఁజొచ్చినది. రాయరాజ్యం స్థిరమై దేశమున శాంతి నెలకొనుటచే జనుల యార్థికస్థితి బాగుపడి, జన సామాన్యమున నుత్తమజాతులవారికి విద్యాభ్యాసముచేయుట కవకాశము కుదిరెను. మఱియు దేశమునందు వైష్ణవమతము వ్యాపింపజేయుటకు వైష్ణవాచార్యులు వర్ణభేదములను పరిగణింపక శిష్యకోటిచే మత గ్రంథములఁ జదివించుటకు విద్యనేర్పుటచే నుత్తమ జాతులవారియందు విద్యాధికుల సంఖ్య యధికమాయెను. కావున బ్రాహ్మణేతరులును విద్యావిశారదులై సరస్వతీప్రసాదమును బొంది గంటము చేఁబూని కవిత్వము సెప్పుటకును గావ్యనిర్మాణమునకును గడగిరి. కాని పదునారవ శతాబ్దమున వీరి సంఖ్య బహుళముగాదు. ఏవురు

మాత్రము గానవచ్చుచున్నారు. కాని వీరేవురియందును నలువురు ప్రఖ్యాతులే. బ్రాహ్మణేతర రచయితలందేకాక నా యుగమున వెలసిన కవిరాజులలో నగ్ర స్థానము వహించినవాఁడు సాహితీసమరాంగణ సార్వభౌముఁడు శ్రీకృష్ణదేవ రాయఁడు. ఆంధ్రభాష మన్నంతకాలమును ఆముక్తమాల్యదకీర్తిమాయదుగదా! తరువాత నెన్నఁదగినవాఁ డళియరామరాజు మన్ననకుఁ బాత్రుఁడై రామరాజ భూషణ బిరుదాంకితుఁడైన బట్టుమూర్తి. వసుచరిత్రను జదివి తన్మాధుర్యమును గ్రోలి చొక్కియానందసాగరమున మగ్నుఁడుగాని యాంధ్ర విద్యాధికుఁడుం డఁడు గదా! పిమ్మట బేరొక్కనవలసినవాఁడు కందుకూరి రుద్రకవి. కావ్య రచనయండెట్లో యక్షగాన నిర్మాణమున్నం దట్లే దంట. ఇతని యనర్గళ కవిత్వ ధారకును, పలుకునుడికారమునకును, శిల్ప సౌందర్యమునకును మెచ్చని వారెవ్వరు? అవ్వల జెప్పదగినవాఁడు వెంకటనాథుడు పంచతంత్ర రచయిత. ఆంధ్ర పద్యకథావాఙ్మయమున నితని స్థానము కడునున్నతమైనది. చమత్కార ప్రియుడు; అల్పవిషయము నాధారపరచుకొని యంగముల నుపాంగముల గల్పించి పసందుగ గథను బెంచివ్రాయుట యందితని దండివేసినచేయి. కడపటి యతఁడు రామరాజు రంగప్పరాజు. ఇతఁడు విద్వాంసుఁడు; చక్కఁగ కవిత్వము జెప్పనేర్చినవాఁడే; కాని ఇతనికి పాండిత్యమునకంటెఁ బ్రతిభ తక్కువ; శిల్పమున నించుక మోటుతనమును, భావమున నవ్యానుకరణమును గానవచ్చు చున్నవి. వసు చరిత్రయు నాముక్తమాల్యదయు నితనికి మేలు బంతులు; కాని రామరాజ భూషణుని వాగ్ధాటియు శిల్పవైచిత్రియు, గృష్ణరాయల భావగాంభీర్య మును కల్పనా నవీనతయు నితని కవిత్వమునందరుదు. పదునాఱవ శతాబ్దపు బ్రాహ్మణేతర రచయితలలోఁ గవయిత్రి యొక్కతె కలదు. ఈమె కుమ్మరి మొల్ల. ఈమె తియ్యని కవిత్వమును రుచిజూచి తలయూచనివారెవ్వరు? నాతి కఠిన పదముల కూర్పుతో నిర్ఝరాంభః ప్రవాహమువలె నడచు నీమె పద్యముల గమనవైఖరి యెవ్వరి హృదయము నాకర్షింపదు?

పదునేడవ శతాబ్దియందు బ్రాహ్మణేతర రచయితల సంఖ్య యతిశయించెను. కృష్ణరాయ రామరాజ భూషణులతో సమానులెవ్వరును బయలు పడకపోయినను వీరి కవితాశక్తి యల్పమైనదికాదు. వీరియందు ముఖ్యమైన వారి చరిత్రను, వాఙ్మయసేవను నిచట సంగ్రహముగ చెప్పుట యుక్తము. మొదట

బేర్కొనవలసినవాడు మట్లి యనంతరాజు. ఎల్లమరాజు కుమారుడు; క్రీ.శ. 1586 మొదలు 1614 పర్యంతము విద్యానగర సామ్రాజ్యమును పాలించిన రెండవ వెంకటపతిరాయల సమకాలికుడు. ఇతడు కవిజన పోషణవల్లనేకాక కావ్యరచనమువలనను వన్నెకెక్కెను. ఇతనిచే విరచితమైనది కకుస్థవిజయమనుకావ్యమొకటి ప్రకటితమైయున్నది. ఇతని కవిత్వము నిర్దుష్టముగను, హృదయంగమముగను నుండునని వీరేశలింగం పంతులుగారభిప్రాయపడియున్నారు. కాని పదునేడవ శతాబ్దమున విరచితములైన దాక్షిణాత్యాంధ్ర కావ్యములవలె రసవంతమైనదని చెప్పుటకు వీలులేదు. మట్లియనంతరాజుకంటె కావ్యనిర్మాణమున నెక్కువ చాతుర్యము గలవాడతని సమకాలికుడు తంజావూరి రఘునాథనాయకుడు. గీర్వాణాంధ్రభాషలయందు రెంటియందును ఇతడు రసవంతమైన కవిత్వము జెప్పశక్తి గలవాడు. రఘునాథనాయకుడు రచించిన యాంధ్ర కావ్యములు రెండు లభ్యమై యున్నవి. ఇందొకటి వాల్మీకి చరిత్ర; ఇది సొంపైన కావ్యము. ఆది కవి వాల్మీకి చరిత్రమిందు మనోహరముగ వర్ణింపఁబడియున్నది. రెండవది రామాయణము; ఇది యసమగ్రము; బాలకాండమున మొదటి నాలుగాశ్వాసములు మాత్రమే దొరకినవి. కవిత్వము సలక్షణమైనది; భాష నాతికఠినము. అనర్గళమైన ధార, లలితమనోహ్యము, మనోహరమైన యలంకారములు రఘునాథనాయకుని కావ్యములయందుఁ గానవచ్చెడి సామాన్య గుణములు. దక్షిణదేశమునం ధ్రాంధ్ర వాఙ్మయముపై నభిరుచి గలుగుటకు రఘునాథనాయకుఁడే ముఖ్యకారణము. ఆంధ్రభాష కితఁ డొనర్చిన సేవ యమూల్యమైనది. రఘునాథుని యనంతర మతని పుత్రుడు విజయరాఘవుఁ డాంధ్ర కవులకును, బండితులకును బట్టుఁగొమ్మయాయెను. కవిత్వమునఁ దండ్రియంతటివాడు కాకపోయినను భాషా పోషణమునను, కవిపండితాదరణమునను తండ్రికిఁ దీసిపోవువాఁడు గాఁడు. విజయరాఘవకృతములగు ద్విపద కావ్యములును పెక్కుగానవచ్చుచున్నవి; కవిత్వ మంతటి ప్రశస్తమైనదికాదు; ఇతనికంటె రసవత్తరముగ ద్విపదలు రచింపఁగల్గిన కవులితని సమకాలికులు గలరు; వారి కవిత్వముతోఁ బోల్చి చూచిన నితనిరచన పేలవమని తోఁచును; కాని యాంధ్రయక్షగాన విస్తారమున కితఁడొనర్చిన కృషి సంస్మరణీయము. స్వయముగ యక్షగానములను వ్రాసియుఁ, దన యాశ్రితులచే వ్రాయించియు నాటక వాఙ్మయము నభివృద్ధిపఱచెను. గీత ప్రాధాన్యమై నాట్యార్థము విరచిత

మైన యక్షగానము నూతనాయవములను బొంది ప్రదర్శన యోగ్యమై నాటక ముగఁ బరిణామమందుట కారంభించినది ఇతనికాలముననే విజయరాఘవుని సమకాలికులైన ప్రభువులు పలువురు కావ్యరచనకుఁ గడఁగిరి. వీరియందు ప్రముఖులు దామెరల సోదరులు వెంకటపతియు, నంక భూపాలుఁడును. ఈ యన్నదమ్ములిరువురును వైదుష్యమున సమానులైనను కవిత్వమునం దంక భూపాలుని కంటె వెంకటపతియధికుడని చెప్పవలసియున్నది. వెంకటపతి రచియించిన కావ్యములలో బహుళాశ్వచరిత్ర దొరికినది. ఇది పదునేడవ శతాబ్దమున విరచింపఁబడిన యుత్తమ ప్రబంధములయందొక్కటి; కృష్ణకథ యను మఱియొక కావ్యమును రచించి రామభద్రుని కంకిత మొసగినట్లు బహుళాశ్వచరిత్రపీఠిక యందితఁడు జెప్పుకొనియున్నాఁడు. కాని యది ఇంకను బయలుపడలేదు. వెంకటపతి కవిత్వము "రసవంతమై సలక్షణముగానున్న" దని వీరేశలింగం పంతులుగారు చెప్పియున్నారు.1 ఇది సత్యమే. కాని కథా సంవిధానమునగాని, సూక్తివైచిత్రియందుగాని ప్రశంసించదగిన విశేషమెద్దియుఁ గానరాదు. అంక భూపాలుఁడును జక్కని కవిత్వము జెప్పఁగల్గిన వాఁడే. ఇతఁడురచించిన యుషాపరిణయ కావ్యమునందు కవితాప్రతిభకంటె పాండిత్య ప్రకర్షయే విపులముగ గానవచ్చుచున్నది. శబ్దాలంకారపూరితమైన ఏకాక్షర ద్వ్యక్షర త్ర్యక్షరపద్యయుక్తమై ఇతని యుషాకల్యాణ మాధునిక పాఠకులకు విసుగుపుట్టించుచున్నది. మట్లిరాజ కుటుంబమున నీకాలముననే మఱియొక కవి బయలువెడలెను. అనంతరాజు పౌత్రుడు కుమార అనంతరాజు తాతవలెనే కవి. ఇతని తండ్రియైన తిరువెంగళనాథరాజు స్వయము కవిత్వము చెప్పకున్నను కవిత్వమునందాదరముగలిగి కవులకుఁ దనయాస్థానము నందాశ్రయమిచ్చెను. చక్కని కవిత్వమల్లఁగలిగిన భట్టులితని శౌర్యౌదార్యములను సీసమాలికలయందును ద్విపదలయందును నుగ్గడించియున్నారు. కవితాప్రియుఁడైన తండ్రి కడుపునఁబుట్టి కవులగోష్ఠియందు పెరిగినవాఁడగుటచే మట్లికుమారానంత రాజు కవియగుట సహజమే. ఇతఁడు కుముద్వతీకల్యాణమను ప్రబంధమును రచించెను; దీని యసమగ్రప్రతి యొకటి యడయారు దివ్యజ్ఞాన సమాజపు పుస్తక భాండాగారమున నున్నది. ప్రౌఢమైన కవిత్వము. పదునేడవ శతాబ్దమున బయలువెడలిన ప్రబంధములకుఁగల సామాన్యగుణము లిందునుగానవచ్చు

---

1. ఆం. క. చరిత్రము. ద్వి. భా. పుట—292.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

చున్నవి. ఇతనికిదరువాత చెప్పవలసిన రాజకవి యాంధ్రచోళక్షత్రియుడు కట్టా హరిదాస రాజపుత్రుడు వరదరాజు.2 ఇతఁడుపెక్కు కృతులను రచించిన కవి సత్తముఁడు. పరమభాగవత చరిత్ర, పుండరీకచరిత్ర, శ్రీరంగ మాహాత్మ్యము రామాయణము ననుు నాలుగు గ్రంథము లితని విప్పుడు లభించియున్నవి. మొదటి మూడును పద్యకావ్యములు; కడపటిది ద్విపద. ఇందు శ్రీరంగ మాహాత్మ్యమొకటియే ముద్రితమైనది. ఇతనిది మనోహరమైన కవిత్వము. వాఙ్మాధుర్యమున నితనితోఁ దులదూగగలవా రీశతాబ్దమునం దనేకులు లేరు. సులభమైనశైలి, మెత్తనిమాటలు. నిరాఘాటమైన వాగ్ధాటిని గలిగిన ఇతని కవనము జదువజదువఁ జవులూరుచుండును. కట్టావరదరాజు కాలముననే మఱియొక దొడ్డబ్రాహ్మణేతర కవి వెలసెను. ఇతఁడు కువలయాశ్వ చరిత్ర రచయితయగు సవరము చిననారాయణకవి.3 ఇతడు కువలయాశ్వ చరిత్రయను రసవత్తరమైన కావ్యమును రచియించి తన పెంపుడు తండ్రియైన నారాయణ భూపాలుని కంకిత మొనర్చెను. ఇతడు మహాకవి. పదునేడవ శతాబ్దపు పింగళి సూరన; కొన్ని యంశములయం దితడు సూరనను మించినవాఁడని చెప్పవలసి యున్నది. ప్రతిభా విశేషమునను, కల్పనాసామర్థ్యమునను వీరిరువురును సమానులే యైనను చిననారాయణనుని కవిత్వములోని శిల్ప పరిపాకమును, ప్రసన్నత్వమును నిగ్గును సూరనార్యునియందు గానరావు. ఇతఁడు సంస్కృత పాండిత్యము గలవాడైనను సంస్కృతపదములను, సమాసములను గుప్పించక దాక్షిణాత్యాంధ్రకవులకు సామాన్యమైన తియ్యని తేటతెనుఁగు మాటలనుగూర్చి హృద్యమైన పద్యములతో నెల్లవారికిని సులభగ్రాహ్యముగా గ్రంథమును రచించినాఁడు. చేమవాని భావగాంభీర్యమును, జమత్కారమును నితని కతీతము లైనను, పదగుంఫనయందును వర్ణనాకౌశల్యమునను నతనికి సమానుఁడని చెప్పవలసి యున్నది. ఇతని కవిత్వవిశేషములను గూర్చి వ్రాయవలసిన దెంతయేనియు గలదు; కాని యిది యదనుగాదు. ఇతనికి తరువాత పేర్కొన వలసినవాడు రత్నాకరము గోపాలకవి. సౌగంధికప్రసవాపహరణ మను మనోహరద్విపదకావ్యమును రచించి రావిళ్లలింగ భూపాలుని కంకితముగావిం చెను. గోపాలకవికి సమకాలికుఁడు పాలవేకరి కదిరీపతి. పద్యకథావాఙ్మయ

---

2. చూ. అనుబంధము (1)

3. చూ. అనుబంధము (2)

మున నితని మించినవారు లేరు. పై చెబేర్కొనిన కవులుగాక వచన కావ్యరచయితలు కొందఱుకలరు. వీరియందు ముఖ్యుడు మైసూరిరాజ్యమున క్రీ. శ. 17వ శతాబ్దపుఉత్తరార్ధమున నాధ్యుడై వెలసిన కలివెక్షత్రియవంశజుడు వీరరాజు. ఇతడు గొప్పగ్రంథకర్త; కర్ణాటకమునను, దెనుగునను మహాభారతమును సులభశైలిని వచనమున రచియించెను; భక్తచరిత్రయను నామముతో నఱువది మువ్వురు శైవభక్తుల చరిత్ర నాంధ్రమున వ్రాసెను. ఇతనిభాష మృదుమధురము; వివనింపుగ నుండును. కలివె వీరరాజున కాంధ్రభారత రచనయందుఁ దోడ్పడిన బ్రాహ్మణేతర రచయిత మఱియొకఁడు గలఁడు. ఇతఁడు తుపాకుల అనంతభూపాలుఁడు; చంద్రగిరి కృష్ణతనూభవుఁడు. తుపాకుల కృష్ణప్ప గోల్కొండసుల్తానగు అబ్దుల్లా కుతుబుశాహ మంత్రియు, సైన్యాధ్యక్షుఁడును నగు మీర్ జుమ్లాక్రింద దళవాయియై యతనికి క్రీ. శ. 1650 ప్రాంతమునఁ గర్ణాటక సామ్రాజ్యమును స్వాధీనపఱచుకొనుటయందు సహాయపడెను కావున అనంత భూపాలుఁడు 17వ శతాబ్దపుఉత్తరార్ధమున నభ్యుదయ మందెననుటకు సంశయములేదు. మహాభారత వచన రచనయందు కలివె వీరరాజునకుఁ దోడ్పడుటయేకాక యనంత భూపాలుఁడు విష్ణుపురాణమును వచనమున వ్రాసెను. ఇతని రచనయు వీరరాజు రచననుబోలి సులభగ్రాహ్యమై పండితపామర జనుల కెల్లరకును పఠితవ్యమై యున్నది. ఇతని విష్ణుపురాణము ముద్రితమైనది. ఆంధ్రవచన వాఙ్మయ చరిత్రమున నితని స్థానము ముఖ్యమైనది. 17వ శతాబ్దమున బ్రాహ్మణేతర పురుషులవలె స్త్రీలును విద్యావతులై గ్రంథరచనకు గడఁగిరి. వీరియందిరువురిచట పేర్కొనదగిన వారు కలరు. వీరిద్దరును తంజావూరి నాయక సంస్థానమున వెలసినవారే. వీరు తమకు సమకాలికులగు నాయకులకుఁ దాము భార్యలమని చెప్పుకొనియున్నను వెల యాంధ్రని తోఁచుచున్నది. వీరిలో మొదట చెప్పఁదగినది మధురవాణి ఈమె రఘునాథ ప్రియురాలు, సంగీతమునను, సాహిత్యమునను సాధారణ ప్రజ్ఞగలిగి గణనకెక్కిన స్త్రీరత్నము. గీర్వాణమునందీమె కభిమానము మెండు. తనగ్రంథముల నన్నిటిని గీర్వాణభాషయందే వ్రాసియుండుటచే నీసందర్భమున నీమెను గూర్చి వ్రాయుట యుచితముగాదు. ఇచట ముఖ్యముగఁ బేర్కొనదగినది రంగాజమ్మ; తాను విజయరాఘవుని ఇల్లాలని చెప్పుకొనినది; పెక్కుగ్రంథములను రచియించి విజయరాఘవుని

మెప్పించి యతనిచే కనకాభిషేకము సేయించుకొనెనట. సంగ్రహరామాయణ భారత భాగవతములను, నుషాపరిణయ కావ్యమును, మన్నారుదాసవిలాస యక్ష గానమును విరచించెను. కవిత్వమంత ప్రశస్తముగాక పోయినను యక్షగాన విస్తారమున నీమెచే రచింపబడిన మన్నారుదాస విలాసము గణుతింపఁదగి యున్నది.

అనుబంధము. 1


వరదరాజ కవికాలమును గూర్చి కొంతయభిప్రాయభేదము గానవచ్చు చున్నది. ఇతనిపేరాంధ్రపండిత లోకమునకు దెలియఁబఱచిన బ్ర. శ్రీ. మాన వల్లి రామకృష్ణకవిగారు తమచే విరచింపబడిన భైరవకృత శ్రీరంగమాహాత్మ్య సంపాటకీయ పీఠికయం దీవరదరాజు అళియరామరాజు పెదతల్లికుమారుడని వ్రాసియున్నారు; కాని కే. శే. చెలికాని లచ్చారావుగారు చెప్పినట్లు వారు దాని కాధారములు చూపరైరి. అయినను కవిగారి వాక్యములనంగీకరించి వరద రాజు క్రీ. శ. 16వ శతాబ్దము కడపటివాడనియే నిశ్చయించిరి. "వరదరాజు శ్రీకవిగారు చెప్పినట్లు రామరాజు బందుగుడైనచోఁదప్పక 16వ శతాబ్దము కడ పటివాఁడగును.....పైగా నాముక్తమాల్యద పోలికలుంటచే నీతఁడు 16వ శతాబమునకడపటి భాగముననే యుండి యుండవచ్చును". (అముద్రితాంధ్ర గ్రంథసర్వస్వము. 6. పీఠికపుటలు. ii–iii) కాని ఈకాలనిర్ణయ మంగీకరించఁ దగినది కాదు. వరదరాజు క్రీ. శ. 17వ శతాబ్ద పూర్వార్ధమున నుండెనని యతని గ్రంథములయందే ప్రబలమైన సాక్ష్యము గానవచ్చుచున్నది. తన ద్విపదరామాయణ కృత్యాద్యవతారికయందు దనవంశమును వర్ణించుచు నిట్లు చెప్పియున్నాడు:

పరవధూ ద్రవ్య చాపల్య దూరుండు
హరిదాసరాజైన హరిదాసరాజు
అంగనా భూషణం బగు పోచిరాజు
శింగరి రాజన్య శేఖరు సుతను
బాళిమై కృష్ణమాంబను వరియించె
నాలేమ తోఁబుట్టువగు నోబమాంబ

నర్థి శ్రీరంగరాయలు నాల్గు పూరు
షార్థముల్ గలుగ గల్యాణమైమించె
ఆయనోవిధిసుతుఁడై రామదేవ
రాయలు మారటరాముఁడై వెలసె
హరిదాసరాజు కృష్ణాంబ యందులను
హరి సుదర్శన మూర్తియగు రామరాజు
రాజభగీరథు రవితేజు వరద
రాజును నిను దాత రాయనిఁగాంచె
రచియింపు మీవు శ్రీరామాయణంబు".

(Des. cat. Tel. Mss. in the Maharaja Sarfoji Saraswati Mahal Library. P. 20:)

ఈ ద్విపదలయందు వర్ణింపబడిన కులబాంధవ్యము నిట్లు ప్రస్తరించ వచ్చును.



ఈ బాంధవ్యము రామరాజీయ మందును సూచింపఁబడియున్నది.

"రాజకులభూషణుఁడు చిక్కరాయ భూప
శౌరివరియించె జిల్లేళ్ల నాథసింహ
రాజదేవేంద్ర పుత్రి యం భోజ నేత్రి
యైన యోబమ్మదేవి నాయతివ వలన.
ఆ వసుమతీశునకు రామదేవరాయ

లుదయ మైనను రిపురాజులొదిగి శైల
గుహల జేరిరి....."

Sources of Vij. Hist. P. 244-5.

దీనిఁజూడగా జిల్లేళ్ళవారికే పోచిరాజు వారను నామాంతరము గూడ నుండినట్లు తోఁచుచున్నది.

ఇంతవల్ల క్రీ. శ. 1614 మొదలు 1630 వఱకును విజయనగర సామ్రాజ్యమును పాలించిన రామదేవరాయల కీకట్టావరదరాజు పెదతల్లికుమారుడనియు, సమకాలికుఁడనియు స్పష్టమగుచున్నది. మఱియు విజయరాఘవ నాయకకృతమైన రఘునాథాభ్యుదయ ద్విపద కావ్యమున, క్రీ. శ. 1618లో నడచిన తోపూరు రణక్షేత్రమునకు రామదేవరాయలకు బాసటయై చనిన నాయకులలో వరదరాజు పితామహుఁడైన కట్టారంగపరాజొక్కఁడైనట్లు చెప్పియున్నది.

"ఆరామ దేవరాయలు చనుదేర
తర తరమ్ములకును దగులైన కతన
నెఱ నమ్మఁదగిన కోనేటి కొండ్రాజు—
కట్ట రంగపరాజు కస్తూరి రాజు".

(Sources of Vijayanagar History P. 262.)

క్రీ. శ. 1618లో కట్టరంగపరాజు యుద్ధము సేయగల దేహపుష్టి త్వము గలిగియుండుటచే మనుమఁడైన వరదరాజు సమకాలికుఁడును, పినతల్లి కుమారుఁడైన రామదేవరాయలవలె బాలుఁడై యుండవలయును. మఱియు నీ వరదరాజు తండ్రి క్రీ. శ. 1630 మొదలు 1642 వఱకును విజయనగర సామ్రాజ్యమును బాలించిన ముమ్మడి వెంకటరాయలకు సమకాలికుఁడని కడప మండలము జమ్మలమడుగు తాలూకాలో మాధవాపుర గ్రామములోని హనుమంతరాయఁ డాలయపు గోడదగ్గర పడియుండిన శాసన లేశమువల్ల దెలియ వచ్చుచున్నది.

"యీశ్వర సంవత్సరానను చలమర్థి గండ పట్నానను జియ్యంగారి వారి సన్నిధి వెంకటయ్యగారికి కట్టహరిదాసరాజు ధారపోసిన చేని నడిమి కత్తు

వను భీముని గుండం చేను....."— ఇందుదహరింపబడిన ఈశ్వర సంవత్సరము ముమ్మడి వెంకటదేవరాయల రాజ్యమధ్యకాలమున క్రీ.శ. 1636–37కు సరిపోవుచున్నది. దీనివలన కట్టవరదరాజు రాయలసీమవాడనియు, క్రీ.శ.17వ శతాబ్దమధ్యమున నుండెననియు నిశ్చయమగుచున్నది.

అనుబంధము 2

సవరము చిన నారాయణ నాయకుడు క్రీ. శ. 1580 వ సంవత్సర ప్రాంతమున నుండెనని కీ. శే. కందుకూరు వీరేశలింగం పంతులుగా రభిప్రాయపడియున్నారు. ఈ అభిప్రాయమునకు బ్రోదిగరెండంశములను బేర్కొనిరి. కువలయాశ్వ చరిత్ర కృత్యాద్యవ తారికయందు "కృతిపతియైన నారాయణ భూపాలుడు శ్రీ రంగరాజ వెంకటపతిరాయలకు సహాయుడయి యుండినట్లు చెప్పబడి"యున్నది. మటియు నీ నారాయణ భూపాలుని యాధిక్యతను బ్రశంసించు సందర్భమున "తన కీర్తిమట్లనంత నృపాల ముఖ్య గోత్రామరేంద్రులు కొనియాడికొనగ" అని చెప్పబడియున్నది. శ్రీ రంగరాయ వెంకటపతి రాయలు క్రీ. శ. 1570 1614వఱకు రాజ్యము సల్పియుండుటచేతను మట్లియనంత భూపాలుడును నప్పటివాడేయగుటచేతను సవరము చిన నారాయణ రాజు క్రీ. శ. "పదునాఱవ శతాబ్దాంతమున నుండినట్లు నిర్ధారణ చేయవచ్చును" అని తమ యభిప్రాయమును చరిత్రాంశముల మూలమున బలపఱచిరి. కాని వీరేశలింగంపంతులుగా రొనర్చిన కాలనిర్ణయ మంగీకరించ దగినదికాదు. కృత్యాద్యవతారికయందు "శ్రీ రంగరాజకుమార వీర వెంకట (జేశ) రాయ భుజాబల సహాయ బహు విధోపాయ ధురీణుండును" అని కృతిపతియైన నారాయణ నాయకునిగూర్చి చెప్పియున్నది. (కువ. చ. 1–17) కావున ఇతడుసాయమొనర్చినది శ్రీ రంగరాజుయొక్క కుమారుడైన వీర వెంకటరాయలనుటకెల్లము. మటియు 'గర్ణాటకాధీశ్వర దయాసాంద్రుండగు నారాయణవసుంధరా దేవేంద్రు"డనియు (1145). "వీర వెంకటరాయ భూవిభుని కరుణనెలమిఁ బాలించె నిల నారణేశ్వరుండు" అనియు (1,52)నుండుటచేత పైఁబేర్కొనబడిన వీర వెంకటరాయలు విజయనగర సామ్రాజ్యాధీశ్వరుడని విదితమగుచున్నది. విజయనగర సామ్రాజ్యమును బాలించిన రాజులలో వెంకటనామ ధారులు మువ్వురుకలరు. అచ్యుత దేవరాయల కుమారుడైన వెంకటరాయలు

మొదటివాడు: ఇతఁడు క్రీ. శ. 1542వ సంవత్సరమునం దాఱునెలలు రాజ్య మొనర్చెను. ఆరవీటి శ్రీ రంగరాజు తిరుమలరాజు కుమారుఁడైన వెంకటరాయలు రెండవవాఁడు: ఇతడు క్రీ. శ. 1585 మొదలు 1614 వఱకును ప్రజాపాలన గావించెను. అఁతియ రామరాజు కడగొట్టు కుమారుఁడైన శ్రీ రంగ రాజు పుత్రుఁడు పెద్ద వెంకట మూఁడవవాఁడు. ఇతడు క్రీ. శ. 1630లో గద్దె నెక్కి 1642 పర్యంతము పృథ్వీపాలన మొనర్చెను. వీరియందు కడపటి వాఁడైన వెద్ద వెంకట యొక్కని తండ్రిపేరే శ్రీ రంగరాజు. కావున సవరము నారాయణరాజు సాయమొనర్చిన శ్రీ రంగరాజ కుమార వెంకట(జేశ)రాయలీ పెద్ద వెంకటయే కావలయును. చరిత్రకారు లితనిని ముమ్మడి వెంకటదేవరాయ లని పేర్కొనియెదరు. ఈ యభిప్రాయమును బలపఱచగల సాక్ష్యము తంజా వూరు విజయరాఘవ కృత రఘునాథాభ్యుదయమునఁ గొంత కానవచ్చుచున్నది. విజయరాఘవ నాయకుడు రాజ్యాభిషిక్తుఁడైన పిమ్మట సవరము వెంకటపతి నోడించి తరుమగొట్టి తంజావూరు జిల్లా కుంభకోణము తాలూకాలోని పంద నల్లూరును స్వాధీనముజేసికొనియెనట (Sources of Vijayanagar History P. 258)

"వీరుడౌ సవరము వెంకట పతిని
పారదోలించి నీ పంపుల చేత
పట్టిన సీమతో పందనల్లూరు
గట్టించితివి ఘటికా మాత్రమునన."

ఈ సవరము వెంకటపతి యెవ్వడో కనుగొనుటకు దగిన సాధనము రఘునాథాభ్యుదయమునలేదు. అతని యునికి పట్టు పందనల్లూరో, లేక తత్ప్రాంత మందలి మఱియొక స్థలమో కావచ్చునని యూహించుటకు మాత్ర మవకాశము గలదు, కాని ఇతఁడు సవరము చిన నారాయణ నాయకుని యన్నయని తలచు టకు గొంత యాధార మున్నది. కువలయాశ్వ చరిత్ర యవతారిక యందొక పద్యమున (: 56)—

"అతఁడా తిమ్మమ యందు
వేంకట నృపాధ్యక్షున్ రిపుక్షేపణో

ద్ధతు రంగాధిపు దిర్మలాంబ
వలనన్ ధర్మాత్ము గోపాలు స
న్నుత కీర్తిం జిన నార వాఖ్యు
డగు వన్నున్ గస్తురీంద్రు న్నమం
చిత కీర్తి ర్రఘునాథు చిమ్మవిభు గాం
చె న్నజనాధారులన్.

అని చెప్పియున్నది. ఇందువల్ల సవరము చిన నారాయణ నాయకునకు సవతియన్న వేంకట నృపాలుడుండెనని తెల్లమగుచున్నది. ఇతడే తంజావూరి విజయరాఘవ నాయకుని పంపులచే పందనల్లూరు రణక్షేత్రమున నిర్జితుడై పోరిపోయిన సవరము వెంకటపతియని తలచెదను. అగునేని విజయ రాఘవ నాయకుడు క్రీ. శ. 1633లో రాజ్యాభిషిక్తుడై యుండుటచేత నతనిచే నోడింపబడిన సవరము వెంకటపతియు, నతని సవతి తమ్ముడైన చిన నారాయణ నాయకుడును నప్పటివారే కావలయును; కాని కృతిపతి సవరము నారాయణ భూపాలుని కీర్తిని మట్లనంత భూపాలుడుపొగడినట్లు కువలయాశ్వచరిత్ర (1 : 50) పీఠికయందు చెప్పియున్నదే. మఱి సవర నారాయణ భూపాలుడు ముమ్మడి వెంకటరాయల కాలమున నుండినట్లయిన నిది యెట్లు పొసగును? అను ప్రశ్న యొకటి వెడల వచ్చును. దీనికి సమాధానము సులభము. కువలయాశ్వ చరిత్ర పీఠికయందు పేర్కొనబడినది యెల్లమ రాజపుత్రుడగు మట్లనంతరాజుకాడు. ఇతడా యనంతరాజు మనుమడు, తిరువెంగళ నాథుని పుత్రుడును నైన మట్ల కుమారానంతరాజు. ఇతడు సుప్రసిద్ధుడై నకూరుడు, కవియని యింతకుముందే తెల్పియున్నాను.

జానుఁదెనుఁగు

"శివ కవులు జానుఁదెనుఁగును బ్రశంసించి యున్నారు" అని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిల వారు చెప్పియున్నారు.[1] కాని లెక్కఁంచిచూడఁగా నీ మాటను వాడిన వారిరువురే కానవచ్చుచున్నారు. వీరి యంమ మొదటి వాఁడు ననె్నచోడుడు. రెండవ వాడు లింగాయత కవి పాల్కురికి సోమ నాథుడు. శివ కవుల నైఖరిని ప్రభాకర శాస్త్రిల వారు ఇట్లు వివరించి యున్నారు. "వీరశైవులలోఁ గవీశ్వరులగు వారు శివుని మీదను, దద్భక్తుల మీఁదను దక్క నితరులగు భవులమీఁద నెప్పుడును గృతులఁ జెప్పెడి వారు కారు. కావున వారికి శివ కవులను పేరు గల్గెను. కర్ణాటాంధ్ర గ్రంథములలో శివ కవుల ప్రశంస కలదు. శివ కవులు భవికవులను గర్హించిరి. కవితలోఁ గూడ వారు వేరు మతము వారయిరి."[2] శివ కవుల రీతి యిట్టిదే యైనచో ననె్నచోడుని శివ కవుల కోటియందుఁజేర్చుట సమంజసముగఁ గాన్పించదు. ఏలన, శివ కవుల వలె నితడు భవి కవులను గర్హించలేదు. శివ, భవి భేద మునే ఇతఁడెఱుఁగఁడు. శివ కవులు ప్రశంసించని వాల్మీకి వ్యాసులను బ్రశం

---

1. బసవ పురాణ పీఠిక. 82.
2. అదే. పుట 81.

సించియున్నాడు.3 తెనుఁగు కవీశ్వరుల నెన్నకపోవుట కప్పటికి తెనుఁగున గ్రంథములఁ జెప్పి పేరొఁకొనుటకుఁ దగిన కవి యెవ్వఁడును లేకపోవుటయే కారణము. కావున ప్రభాకర శాస్త్రిల వారిచే నిర్ణయింపఁబడిన శివ కవి కోటిలో నితఁడు చేరఁడు. అట్లనుటచే నితఁడు శైవుఁడు గాఁడని భావించరాదు. శివుఁడే పరదైవమని యితని విశ్వాసము.4 కాని, యా కారణముచేఁ కవితా ప్రపంచమున నితఁడు మతభేదమును బరిగణించలేదు. కావున "శివ కవులు పలువు"రనుట కంటె "వాంధ్ర కవులు కొంద'ఱనుట సరియని తలఁచెదను.

నిర్వచనము

ఇక 'జానుఁదెనుఁ'గన నేమో విచారింతము. ప్రాచీను లెవ్వరును దీని యర్థమును నిర్వచించలేదు, వాఙ్మయమునందలి ప్రయోగముల మూలమున దీని యర్థమును సాధించవలసియున్నది. కాని యిట్టి ప్రయోగములెన్నియో లేవు. లభ్యమైన యాంధ్ర గ్రంథములలో మూఁడు నాలుగు మాత్రమే కానవచ్చు చున్నవి. ఇందొకటి నన్నెచోడుని కుమార సంభవము లోనిది.

సరళముగాఁగ భావములు జానుఁదెనుంగున నింపు పెంపుతోఁ
బిరి గొన వర్ణనల్ ఫణితి వేరొఁకన నర్థము లొత్త గిల్ల బం
ధురముగఁ బ్రౌఢముఁ మధు మృదుత్వ రసంబునఁగంటకింప స
క్షిరములు సూక్తి లార్యులకుఁ గర్ణ రసాయన లీలఁగ్రాలఁగాన్.
(కుమార సంభవము, 1-35)

ఇందు నన్నె చోడుఁడు దాను కావ్యమును జానుఁదెనుఁగున రచియించెద వని చెప్పెనే కాని యా జానుఁదెనుఁగు స్వభావ మిట్టిదని తెలియఁబఱచలేదు.

మఱి మూడు ప్రయోగములు పాల్కురికి సోమని గ్రంథములం దగ పడుచున్నవి.

---

3. కుమార సంభవము, 1: 17-19
4. అదే, 1-12.

ఉరు తర గద్య పద్యోక్తులకంచె సరసమై పరగిన జానుదెనుగు
చర్చించగా సర్వ సామాన్యమగుట గూర్చెద ద్విపదల గోర్కెదైవాలు

(బసవ పురాణము, పుట కి)

ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ–పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబుగామి–జానుదెనుగువిశేషము ప్రసన్నతకు.

(పండితారాధ్య చరిత్ర, దీక్ష ప్రకరణము, పుట 18.)

ఈ ద్విపదలవల్ల గద్య పద్యాది ప్రబంధ సంస్కృత భూయిష్ఠముగానిది జానుదెనుగని బోధపడుచున్నది. ఇంతేకాదు, వృషాధిప శతకమున జానుదెనుగు స్వరూప మిట్టిదని.—

బలు పొడ తోలు సీరయును బాప సరుల్ గిలుపారు కన్ను వె
న్నెలతల సేదు కుత్తుకయు నిండిన వేలుపు చేయి వల్గు పూ
సల గలపేని లెంక నని జానుదెనుంగున విన్నవించెదన్
వలపు మదిం దలిర్ప బసవా బసవా బసవా వృషాధిపా.

అను పద్యమున స్పష్టపరచి యున్నాడు. కావున పాల్కురికి సోమని వ్రాతను జూచియేకాణోలా శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు ఇట్లు వ్రాసి యున్నారు.

"Palkuirki Somanadha has dedared in the introduction to his Works that he undertook to write in what is called Janu-Telugu and Dvipada metre, becaue the Sanskritic Style adopted by the Champu Writers Could not easily be under stood by the general masses." 5

శ్రీ శ్రీ పాద లక్ష్మీపతి శాస్త్రిల వారిది యచ్చ తెనుగని స్పష్టముగ జెప్పి యున్నారు.

---

5. Vi vanadha Charitra, Eng. Intro. P. V.

"తెనుగు దేశిలో వాడుకలో నున్న తెనుగు మాటలను జానుదెనుగని వాడిరి. అదే యచ్చ తెనుగు. జానుదెనుగు కుదాహరణముగ నీయనబడిన సోమనాథుని పద్య మచ్చ తెనుగుననే రచింపబడెను గదా,"6

సోమనాథుని వాక్యములు జానుదెనుగన నచ్చ తెనుగను భ్రమను గలుగఁ జేయుచున్నను వాస్తవము విచారించగా జానుఁ దెనుఁగునకు సరియైన యర్థమది కాదని తోచుచున్నది. ఏలన, సోమనాథుని రచన లచ్చ తెనుఁగు కబ్బములుగావు. ఇతరాంధ్ర కవులను బోలె నితఁడును సంస్కృతాంధ్ర మిశ్ర భాషనే వాడియున్నాడు. తిక్కన సోమయాజి కవన మందుఁబోలె ఈతని కవన మందును సంస్కృత పదముల కంటెఁ దెనుఁగు మాటలే యధికముగఁ గాన వచ్చుచున్నవి. అంత మాత్రముననే ఇతని గ్రంథముల భాష యచ్చ తెనుఁగని చెప్పుట తగదుగదా! జానుఁదెనుఁగచ్చ తెనుఁగే యైనపక్షమున నితఁడు జానుఁ దెనుఁగున గ్రంథములను రచించితినని చెప్పినది పొల్లుమాట, దబ్బర యను కొనవలసివచ్చును. కాని సోమనాథుడు దబ్బఱలాడె ననుట విశ్వసింపఁదగిన విషయముగాదు. మఱియు "గద్య పద్యాది ప్రబంధపూరిత సంస్కృత భూయిష్ఠముగాని రచన జానుఁదెనుఁగని సోమనాథుడు నిర్వచించి చెప్పుచుండ గద్య పద్యాత్మకమును సంస్కృత భూయిష్ఠమునగు కుమార సంభవమును దాను జానుఁదెనుఁగున రచించితినని నన్నెచోడుఁడు దెల్పుచున్నాడు. దీనివల్ల వీరిరువురను "జానుఁదెనుఁగు" నొక్క విధముగ నర్థము చేసికొనక భిన్న మార్గములను దొక్కినట్లు తెల్లమగుచున్నది. ఒక్కమాట యర్థమును చేసి కొనుటయం దీయిరువురను పరస్పర విరుద్ధ మార్గములఁదొక్కుట చూడ. జానుఁదెనుఁగున కీరెండు మార్గములను సమన్వయ పఱచెడి సామాన్యార్థమేదో యుండవలయునని తోచుచున్నది. "జానుఁదెనుఁగు" సమస్త పదము. జాను + తెనుఁగు అను రెండు మాటలకలయికవల్ల నది యేర్పడుచున్నది

---

6 కుమార సంభవ విమర్శనము, పుట 167.

దీనియందలి "తెనుఁగు' భాషానామము, "జాను" శబ్ద మా భాషా స్వభావమును దెలుపుచున్నది. కావున "జాను" శబ్దార్థమును దెలిసికొనగలిగితిమేని "జానుఁ దెనుఁగు"యొక్క స్వభావము కొంతకు గొంతయేని బోధ కావచ్చును.' జాను' శబ్దము దేశ్య శబ్దమని సీతారామాచార్యులుగారభిప్రాయ పడిరి. ఇది జ్ఞాన శబ్ద భవ మనియు, 'జాణకు"ఁ దోబుట్టువనియు నేను తలచెదను. దీనికి 'అందము' ,సౌందర్యము' అని అర్థము 'జానుఁదెనుఁ' గనఁగా'సొంపైన, లేక నుడికారము గల తెనుఁ' గని యన్వయము చేసికొనవలయును. భాషా సౌందర్యమును, నుడికారమును కవులెల్ల నర్థించు గుణములే. తెఱఁగు కవులు జానుఁదెనుఁగును ప్రశంసించినట్లు కర్ణాటకులు "జాణుండిని" (జాను కన్నడము) ప్రశంసించి యున్నారు. ఒక యుదాహరణము — జన్నఁడు అనంతనాథ పురాణమునఁదన కవితను పెంపొందించెడి గుణముల నిట్లు పేర్కొని యున్నాడు.

ఎనగను కూల మక్కొగుణమన్న జాణుడి పంపనింపు పొ
న్నన బగె నాగవమన్న బహాజ్ఞతె రన్నన కాంతినాగచం
ద్రన రసభావ మగ్గళన వక్రతె నేమియ దేనె పుష్ప బా
ణన మృదు బంధమీ కవిగళ్కె జినేంద్ర పురాణ కర్తృగళ్ (1-35)

కర్ణాట "జాణుడి"యే "జానుఁదెనుఁగు"నకు మాతృకయనితలచెదను. తెనుఁగున గావ్యరచన లేనికాలమున నూతనాంధ్ర కావ్య నిర్మాణమునకు గడం గిన వన్నెచోడుడు కర్ణాట వాఙ్మయము నుండి పెక్కు విషయములనుగ్రహించి నటు 'జాణుడిని" గొని దానిని 'జానుఁదెనుఁగు'గ మార్చెననియు, నతని గ్రంథము నుండి పాల్కురికి సోముడు దీనిఁగైకొనె ననియు తలఁచెదను. ఇది యెట్లున్నను జానుఁదెను,గనఁగా 'సొంపైన తెనుఁ"గనియే అర్థము చేసికొన వలయును ఈ 'సొంపు" రూపెట్టిదని నిర్ణయించవలసి వచ్చినప్పుడు అభి ప్రాయ భేదమున కెడముగల్గినది. వన్నెచోడుఁడు గద్య పద్యాత్మకమును, సం స్కృత భూయిష్ఠమునైన తెనుఁగే సొంపైనదని తలఁచెను, పాల్కురికి

సోముడు ద్విపదరూపమును సంస్కృత భూయిష్ఠము కాని తెనుఁగే సొంపైన దని యభిప్రాయపడెను. జానుఁదెనుఁగున కర్థమున నభిప్రాయ భేదమున కెడము లేకపోయినను వస్తు స్వభావ నిర్ణయ సందర్భమున వ్యక్త్యభిరుచి భిన్నత్వము వలన నచ్చెచోడ, పాల్కురికి సోమనాథుల యందభిప్రాయ భేదము గానవచ్చుచున్నది.

Printed at T N R Press, 5-10-191, Hill Fort Road, Hyderabad-4.

ماع CI

AOVA102B101

BC

ముద్రణ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B101
పుస్తకం పేరు	వాక్య వ్యాసమంజరి
తారీఖు	31 December 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	371
పెద్ద సైజు పేజీలు	Nil
ఖాళీ పేజీలు	Sl. No. 364
లేని పేజీలు	
తయారు చేసినది	M. Raji
పేజీలు విడదీసినది	M. Raji
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు వరుసనినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good